# స్వేచ్ఛా కవిత్వం

రెండో సంపుటం (2003 - 2012)



మాదిరాజు రంగారావు

2026

రసధుని సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

# స్వేచ్ఛా కవిత్వం

**రెండో సంపుటం**

**రచనా కాలం 2003 - 2012**


**మాదిరాజు రంగారావు**


## నాన్నగారి జ్ఞాపకార్థం

మా నాన్నగారు ఆచార్య మాదిరాజు రంగారావు గారి విశిష్ట సాహిత్య సేవలకు నివాళిగా, మాదిరాజు రంగారావు గారి స్వేచ్ఛా కవిత్వం రెండో సంపుటం **(Volume II)** పునః ముద్రణ చేసి సాహితీ సహృదయులకు, శ్రేయోభిలాషులకు అందుబాటులోకి తీసుకొస్తున్నాము.

**మాదిరాజు సంతోష్ కుమార్**

**దేవులపల్లి హరిత**

**మాదిరాజు చరిత**


**రసధుని**

**సాహితీ పరిషత్తు**

శాంతినగర్, హైదరాబాద్

**SWECCHAA KAVITHVAMU**
**Volume II (2003 - 2012)**

**by**
**Prof. Madiraju Ranga Rao**

© **Dr. M. Santhosh Kumar**

Edited by Madiraju Santhosh Kumar
Devulapally Haritha
Madiraju Charitha

Frist Edition 2003
Second Edition 2026

ISBN : 978-93-5635-835-5

**Price : 1000/-**

*For Copies :*
Dr. Madiraju Santhosh Kumar
98499 79899

*Printed at :*
**Anupama Printers**
Shantinagar, Hyderabad - 28
Phone : 040-23391364
E-mail : anupamaprinters1978@gmail.com

# స్వేచ్ఛా కవిత్వం

## రెండో సంపుటం

## రచనా కాలం 2003- 2012

### విషయ సూచిక


1. అభిషేకం (31) .................................................. 2003
2. ఆగమనం (32) .................................................. 2005
3. ఎప్పటికీ కొత్తే (33)................................................ 2005
4. సృజన దర్శనం (34)............................................... 2006
5. మరో వైపు (35)................................................... 2006
6. హృదయ మేఘం (36) .............................................. 2006
7. సమకాలీనం (37)................................................. 2007
8. అభినవ యానం (38) .............................................. 2007
9. ఆత్మ బంధం (39) ................................................ 2008
10. సృజన మేఘం (40) ............................................... 2008
11. ఉగ్ర చరణం (41)................................................. 2008
12. నవారంభం (42).................................................. 2008
13. గిఫ్ట్ ప్యాకెట్ (43)................................................. 2008
14. నవదర్శనం (44).................................................. 2009
15. పునర్దర్శనం (45)................................................. 2009
16. నడిచే వెలుగు చుట్టూ (46) ........................................ 2009
17. అపూర్వ (47)...................................................... 2009
18. అజ్ఞాతం నుండి (48) .............................................. 2010
19. రోజు వస్తుంది స్వచ్ఛంగా (49) .................................... 2010
20. ఉద్యమ చరణం (50) ............................................. 2010
21. ఆల్బంలో ప్రజాస్వామ్యం (51)....................................... 2011
22. అద్దంలో ప్రజాస్వామ్యం (52)....................................... 2011
23. ప్రవాహంలో ప్రజాస్వామ్యం (53)................................... 2012

# ముందుమాట

స్వేచ్ఛా కవిత్వం మొదటి భాగం 1953 నుండి 2002 వరకూ ప్రచురితమయిన కృతుల సంకలనం. రెండో భాగం 2003 నుండి 2012 వరకూ ప్రచురితమయిన కృతుల సంకలనం. ఈ రెండు భాగాలూ కలిసి మొత్తం 53 కృతులు, స్వేచ్ఛాకవిత్వానికి స్థిర రూపాన్ని ఇచ్చేవి. ఇవి 1) వర్తమాన స్థితిగతులూ 2) సామాజిక వాస్తవికత 3) మానవీయ భావన 4) ప్రజాస్వామ్య దార్శనికతతో రూపొందాయి. ఈ రెండో భాగంలో ఏ మార్పులూ చేర్పులూ లేకుండా యథాతథంగా కృతులు ముద్రితమయినాయి.

ఈ కృతుల్లో కవిత్వ కళకు సంబంధించిన భావ రూపాలూ ప్రతీకలూ నిర్వహణంలో భాగాలుగా ఉన్నాయి. రచనలో వ్యంజకతకు గల ప్రాధాన్యాన్ని సులభంగా గుర్తించవచ్చు. తాత్త్విక స్పర్శనూ గమనించవచ్చు.

స్వేచ్ఛా కవిత్వానికి ఆధారతలంగా సమాలోచనంలో దీనికి సంబంధించిన 1) స్వరూపమూ స్వభావమూ 2) పరిమితులూ 3) ప్రయోజనమూ 4) లక్ష్యం 5) ఈనాటి అవసరం 6) దీని అనివార్యత 7) కొత్త ప్రక్రియగా ప్రవేశం 8) వేగవంతమయిన వ్యాప్తి 9) సమాజంలో స్థానం 10) సహృదయుల ఆమోదం మొదలయిన అంశాల ప్రకాశనంతో ఈ రచయిత వ్రాసిన "స్వేచ్ఛా కవిత్వం – ప్రజాస్వామ్య / మానవీయ భావన" – మేనిఫెస్టో – గ్రంథం ఇతర సమాలోచనా గ్రంథాలూ, ఈ సందర్భంలో పేర్కొనడం సమంజసం. ఇవి స్వేచ్ఛా కవిత్వానికి ప్రాతినిధ్యం వహిస్తాయి. ఈ రచన స్వేచ్ఛా కవిత్వం గురించి సిద్ధాంతపరమయిన అవగాహనకు తోడ్పడతాయి. సమాలోచనానికి ప్రాతిపదికగా ఉపయోగపడతాయి.

ఈ సందర్భంలో రెండో సంపుటం ప్రజాస్వామ్య దార్శనికత కలిగిన స్వేచ్ఛా కవిత్వ మార్గానికి చెందిన రచనా పరంపరా రూపంలో భాగంగా పేర్కొదగిందీ, ఈ ప్రక్రియను సంపన్నం చేసేదిగానూ భావించవచ్చు.

2, జనవరి 2012

హరిత, M.A (Lit)

MI- Detroit, U.S.A.

స్వేచ్ఛా కవిత్వం (2003-2012)
రెండవ భాగం - 1

# అభిషేకం

## (ఆరోహణం)

మాదిరాజు రంగారావు

2003
రసధుని సాహితీ పరిషత్తు
శాంతినగర్, హైదరాబాద్ - 500 028.

**Mrs. HARITHA, Madiraju, Devulapalli**
M.A. (Lit.)
Detroit, U.S.A.

## ఆముఖం

వర్తమాన ప్రపంచంలో ప్రాంతీయం, జాతీయం, అంతర్జాతీయం దాకా ఎక్కడ చూచినా క్రౌర్యం, హింస, ద్వేషం, అశాంతి బాగా విస్తరించాయి. ఆర్తి, బాధ, వేదన, మారణం ప్రతిధ్వనిస్తూంది. జ్వాలా సదృశంగా తపించే స్థితిని ఉపశమింపజేసే ఉద్దేశంలో ఆర్ద్రరూపమే ఈ అభిషేకం కావ్యం. దీని ఉన్నతియే ఆరోహణం.

ఏది ఎప్పుడెట్లా పరిణమించినా దాని హేతువులెన్నో! చారిత్రక సామాజిక, వైయుక్తిక మనస్తత్వపూర్వకమైనవీ! సమస్యల్ని వివేకంతో ఉదారతతో నిర్మాణదృష్టితో పరిష్కరించే ప్రయత్నం అవసరం. ఏది ఏమయినా నివారణకు హింస ఉపాయం కాదు. అట్లాగే హింసకు ప్రతిహింస ఉచితం కాదు. ద్వేషానికి విద్వేషమూ సమాధానం కాదు. ఇదో గొలుసులా సాగే సంక్లిష్టస్థితుల సన్నివేశం. దీన్ని వస్తువుగా తీసుకోడం కన్పిస్తుంది.

అగ్నినార్పేందుకు జలసేచనం అవసరం. ఈ భావనతో కోపాన్ని, ద్వేషాన్ని, హింసనూ, అశాంతినీ క్రమగతిలో ప్రేమ, కరుణ, సహనం, ఉదారతతో శాంతికి పట్టంగట్టే ఆదర్శం ఇందులో ఆవిష్కృతమయింది. ఇదో సంక్లిష్టమైన విషయం.

ఎంత కాదనుకున్నా ఈ కృతిలో జీవితంలోవలెనే తాత్త్వికస్పర్శ ఉంది. ఇది ప్రకాశమానంగానో అర్థాంతరంగానో అనుభవానికి వస్తుంది. ఇక కవిత్వ విషయంలో భౌతికతలంతోపాటు ఆపైన మానసికతలంలోను విశేష భావనిర్మితి కన్పిస్తుంది. ఈ కారణంగా అంతస్సంయోజనంలో ప్రత్యేకత అనివార్యమవుతూంది. విశిష్టమైన అభివ్యక్తి, కవిత్వంలో అంతస్సూత్రాన్ని సరికొత్త కోణంలో చూపిస్తూంది. నాన్నగారి ఇతర కృతులవలెనే, ఈ కావ్యమూ సామాజికంగా ప్రజాస్వామ్య తత్పరతతోపాటు, కవిత్వపరంగా సృజనకళలో స్వాతంత్ర్యాన్నీ, నిర్మాణశిల్పంలో స్వేచ్ఛనూ జ్ఞాపకం చేస్తుంది.

ఈ కవి దృష్టిలో కవిత్వానికి స్వేచ్ఛ ప్రాణం. ఈ కవిత్వంలో ముఖ్యంగా కవి మనోభూమి ఆధారంగా ఆదర్శపథంలో జీవనవాస్తవం ఆవిష్కృతమయింది.

29-11-2003

# సూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | ఆరోహణ మొదలు | ............... | 5 |
| 2. | ఓ పూవుకై | ............... | 5 |
| 3. | బావిలో తేలవచ్చు | ............... | 6 |
| 4. | మనిషికి మనిషితోనే | ............... | 7 |
| 5. | మారిన చరిత్రలో | ............... | 8 |
| 6. | స్మృతిశాల | ............... | 9 |
| 7. | సంక్షోభం : కల్లోలం! | ............... | 10 |
| 8. | సర్కస్‌లో పులి | ............... | 11 |
| 9. | ప్రకృతి నుండి వికృతికి | ............... | 12 |
| 10. | ప్రశ్న నుండి | ............... | 13 |
| 11. | భూమిలో బీజం వలె | ............... | 14 |
| 12. | సెప్టెంబర్, 17 | ............... | 15 |
| 13. | ఎప్పటికీ ప్రమాదమే | ............... | 17 |
| 14. | ఫస్టోబర్ | ............... | 18 |
| 15. | ప్రయాణ చరిత్రలో | ............... | 20 |
| 16. | ఆకర్షణ | ............... | 22 |
| 17. | అభిషేకం | ............... | 23 |

## 1. ఆరోహణ మొదలు

శిశు దశ బిందువుతో
ఆరోహణ మొదలు, జీవితంలో,
ధరా ప్రకృతి జగం పాతది,
నిజానుభవం లిప్తలు కొత్తవి.
పథ పథ ఘర్షణలో బల సంపద దృశ్యం
సరికొత్త దారితోనే ఆ సమయం విజయం!
మూల మనో రూప మెప్పటిదో!
దృశ్య మాన చిత్ర మిప్పటిదిప్పటిదీ!
బానిసగా పరిచయం మానవ కృతికి కళంకం
బానిసగా బ్రతకడం సమాజ గతికి విరోధం
స్వేచ్ఛను బంధిస్తే ఏ లోకం శ్వసిస్తుంది?
స్వేచ్ఛను మండిస్తే ఏ భావం వెలుగుతుంది?
కన్నీటి బిందువుకూ కోలాహల లహరికీ
కదలందీ తరలందీ మనిషిలో ఒకటే! శిల.
మనిషికీ మనిషికీ మధ్య శిలా నిశ్శబ్దం
తలుపులు మూసిన ఓ బుడుత ప్రపంచం.
మనిషి మనో భంగిమను పలికిస్తుంది జీవితం
జన సమూహచరితను బింబిస్తుంది సమాజం.

## 2. ఓ పూవుకై

నీలి నీలి మబ్బు క్రమ్మి పగలు
కిరణంకై సూర్యుని ప్రార్థించేరు
లిప్త లిప్త భయం కురిసి రాత్రి
శాంతికై చంద్రుని ఆర్థించేరు.
అయనంలో అలసిన హృదికి రాత్రి
ఒక విరామ సమయం, దొరికిన అవకాశం
మాయ క్రమ్మడానికో దారి తప్పడానికో

కాలు జారడానికో, కలలు ఊగడానికో
దేనికైనా కావచ్చు, ఎవరైనా కావచ్చు.
తమస్సు యశసును మాపే ధైర్యమెవరికుంది?
ఉషస్సు తంత్రులు మీటే ఎద గల మనిషికి తప్ప!
నాశన మారణ రణ నైపుణిలో భీభత్సం
కాళ్ళు తెగి కళ్ళు పోయి ఒళ్ళు కాలి జనం!
చల్లని నైలునదీ హృదయంపై పొగలు సెగలు!
పచ్చని తీరభూమి వదనంపై నీలి లతలు!

ఖండిత కరాలతో మాడిన వాలకంతో
బెడ్‌పయి గ్రహణంలో లేలేత బింబం!
హాస్పిటల్ ప్రాంగణంలో వాలిన కిరణం
కిటికీ అద్దాల్ని చల్లగా స్పృశిస్తూ కదిలేను వరండాలో
ఎదురుపడే మనిషిలో, వెదికేను! పూచిన ఓ పూవుకై

## 3. బావిలో తేలవచ్చు

రేపు ఒక ఆదర్శ ప్రతిజ్ఞ పూర్తి కయి
నేడు ఒక ఆయుధం పదును తేలేను.
రేపు ఒక గీతలో వాక్యోపదేశం కయి
నేడు ఒక రణ రథమాయత్త మయ్యేను.
రేపు ఒక సౌభాగ్య జీవన రుచి కయి
నేడు ఒక నిప్పుల పయి నడక సాగేను.
ఏ రోజూ నేడుతో బ్రతికే మనిషికి
ఆ రోజు కల నిజం ఎపుడవుతుందో!

ఈ నేడు ఎండిన కొమ్మలతో దాహంతో
చెట్టువలె జీవితం అలమటిస్తూంది
వసంతం స్పృశించడానికి వెనకాడుతూంది
పూవు! ఫలం! అనేవింక స్వప్నంలో! కల్పనలో!

అలజడిలో అశాంతిలో గురితప్పిన బులెట్
మేడపై కిటికీనుండి మనిషిని గాయపరచేను.

ప్రతి చర్య శాంతికై మొగలి రేకు అవదు
ప్రతి ఊహ ప్రేమతో మల్లె మొగ్గ అవదు
ఊహలో తెలీని బొగ్గు కణాలు తేలవచ్చు
చర్యలో అనుకోని నిప్పు రవ్వలు ఎగరవచ్చు.

బాగ్‌లో బాంబుతో అతిథి ఎదురుకావచ్చు
మనిషే బాంబుమయమై ఎదురై ప్రేలవచ్చు.

నేడు మనిషి నుండి జారిన మానవత
అరచేతుల్లో నుండి వదలిన పసి శిశువై
రేపు సూర్యునితో బావిలో తేలవచ్చు.

## 4. మనిషికి మనిషితోనే

అర్థం తెలీని పదంలా
నేలపై పడిన మనిషి గురించి
అక్కడ అంతలో చేరిన వాళ్ళు
తలకొక ఊహను విడుదల చేసేరు.
మరణ రహస్యం మౌన బంధంలో ఉంది
పోస్ట్‌మార్టమ్‌లో క్లూకై సమయం వేచి ఉంది.
బ్రతుక్కీ మృత్యువుకీ మధ్య దూరాన్ని
కొలుస్తూ పోయే వాహనం కాలాశ్వం నిలిచింది.
హతుడూ హంతకుడూ ఇరువురూ మనుషులే
కారణాలు వేరై, గతి రేఖలు మారేను.
ఆకలిలో కోరికలో వైరంతో అశాంతితో
దృశ్యం నుండి దృశ్యానికి ప్రాణి కోటి చలనం!
కప్పను వెంటాడే సర్పం, లేడిని వెన్నాడే పులి
ఫణితో పోరాడే పక్షి, అరిపై గురితో మనిషీ!

జేబులో నిలిచిన ఒక చేతిలో పిస్టల్‌తో
ముందుకు చాచిన మరో చేతిలో పాచికతో
రణంలో క్రీడతో పణంపై ఆశతో
స్నేహంలో హననంలో, మనిషికి మనిషితోనే పని !

## 5. మారిన చరిత్రలో

చరిత్ర ఒయాసిస్ కాదు, గభీర మహా ప్రవాహం
ఒయారాల శోభతో ఎప్పటికీ నడుస్తూ పోదు
ఎగసి పొంగి వరదలతో పాయలతో విజృంభిస్తుంది
అన్నిటికీ సిద్ధం కావడమే! మనిషి కర్తవ్యం.

ఇసుక తుఫానులో ఆర్ద్రత ఎరగని రేణువులు
బాధా కరాలే కాని, దాహాన్ని తీర్చలేవు
పరచిన ఇసుక రేణు తలంపై నీటి అలలు
కదిలితేనే అందం! సామాజిక సౌభాగ్యం!

దహనంతో ఎరుపెక్కిన వార్తలో కాశ్మీర్ పండితులూ
వదలిన విషవాయువుతో సమాధులయిన ఖుర్దులూ
రాత్రి బాంబింగ్‌తో మెలకువ దూరమైన ఇరాకీలు
అశాంతి వేదికపై మండే చరిత్రలో విషాదదృశ్యాలు!

మనిషి మనిషిని భయభయంగా చూడాలని వస్తూంది
హింస! హత్య! దాడి! సంఘర్షణ! రణం! ఒకటొకటీ
ఊహల్ని అగ్నిగుండంపై నడిపించేను
మనుషుల్ని కన్నీటి చెరువులో ముంచెత్తేను.

వరం బదులు ప్రార్థనలో ఆకాశం నుండి
చాచిన చేతుల్లో బాంబు జారిపడేను.

నలుపు తెలుపు ఎరుపు పసుపు మంటల తీగెల మధ్య
మానవత! మ్యూజియంలో పురా శిల్పంలా మిగిలింది
కాలిన మానవ కథా బీభత్స దృశ్యంతో
చిత్రార్పిత రూపంలా ఉంది ప్రభాతం!

రాత్రి అంటుకున్న అనల దృశ్యాల్ని
ఏ గుర్తు లేకుండా, ఏ కిరణ సమూహమూ
కప్పేయలేదు, మోసం చేయలేదు.

పగలు రాజుకున్న దుఃఖ కీలల్ని
ఏ గుర్తు లేకుండా, ఏ చంద్రుని వెన్నెలా
ఆర్పేయలేదు, మాయం చేయలేదు.

అనల జ్వాల నార్పేందుకు శాంతి అవసరమే
కాని, అగ్నికి రక్షణగా గోడను నిల్పేందుకు కాదు.

మనిషిలో స్వార్థం రణ సర్గమ పొందేను
చేతిలో సుమగుచ్ఛం మండి మసి అయ్యేను.

మతిలో శాంతి హంసతో
హృదిలో ప్రేమ లహరితో
మారిన చరిత్రలో మరో పర్వం ఆరంభం
మానవతా రసధుని తోనే! దిశ దిశలో.

## 6. స్మృతిశాల

మనిషిలో వివిధ వర్ణ ఆలోచనా చిత్రాలు
మనస్సాక్షి యశోరూపాన్ని హరింపజూచేను.

ఓడినా మళ్ళీ మళ్ళీ జూదం ఆడే తత్త్వంలో
ఈసారైనా గెలిచేమనే ఆశ! ప్రతిసారి తెలెత్తేను.

తెలుపు అంచులతో నలుపు నిలవ జూస్తుంది
ఎరుపు గుర్తులతో నలుపు వెలగ జూస్తుంది

మనిషిలో రూపాల్నీ చర్యల్నీ నాటకంలో
మళ్ళీ చూడాలనే! ఆరాటం, సహజం మనిషిలో.

ముసుగు జారిపోయేననో,
జేబులో నాణెం చెల్లలేదనో
తెల్లవారితే ఎట్లాగనో
భయంతో బెదరేవారూ!

మనిషి వికాసంతో సమాజ సీమలు చెరగేను
సమాజ చలన శక్తులతో మనిషి గమ్యం మారేను.

చరిత్రలో బికారిపై జీవన రుచి రావాలనే
ధరిత్రిపై ఎడారిలో జలనృత్యం మెరవాలనే
మైలురాయితో ప్రయాణం సమాప్తి కాదు
ట్రాఫిక్ సిగ్నల్‌తో లక్ష్యం నిర్దిష్టం కాదు.

చుక్కలు నిద్ర ఎరుగవు, గాలి విశ్రాంతి ఎరగదు
ప్రాణి చలనం ఆగదు, అంతరంగం అస్తమించదు.

క్షణాన్ని మరో క్షణం తరలిస్తూ పోతుంది
ఊహను మరో ఊహ నడిపిస్తూ పోతుంది.

పద పదం సరికొత్త ముఖాలతో
పుట పుట నవ దర్శన సృజనతో,
మనిషిలో చేతన! వర్తమాన వాస్తవమై
సావనీర్‌లా గతం! స్మృతిశాలా రూపం!

## 7. సంక్షోభం! కల్లోలం!

చీకటికి 'కీ' ఇచ్చి మాట్లాటతో పోట్లాటతో
వెలుగు నోరు మూయించే పాత్ర ధరించకు.

వేదికపై మృత్యువుకు నర్తన కవకాశ మిచ్చి
శాంతిని ప్రేక్షక పాత్రకు సరిపెట్టాలని కోరకు.

ఈ దేశ మాదేశ మేదేశ మయినా రవి బింబం ఒకటే!
ఏ మనిషైనా అంతరంగమొకటే! మానవతా కిరణం ఒకటే!
ఏ రథ చక్రం క్రిందనో, సత్యం నలిగిపోదు
ఏ ఇంద్ర జాల విద్యకో, సూర్యుడు మాయం కాదు.

బ్రతుకులో మనస్సు నాణెంలా పై కెగసి జారుతుంది
స్వర్గమో స్వప్నమో ఇరువైపుల వాస్తవాన్ని మరపించేను.
శ్రేణులు శ్రేణులుగా ఉచ్చైర్బాహు సమూహాలతో
మేడలు ఆకాశాన్ని తనలో కలుపుకో జూస్తాయి.

నింగిలో ఎగిరే విమానంలో ఉన్నా
జలధిలో దాటే పడవలో ఉన్నా
అవని తోనే మనిషి అనుబంధం
అవని పైనే మనిషికి అస్తిత్వం.

బ్రతుకులో మృత్యువు! అనలంపై భస్మంలా
మృత్యుంజయ చేతనతో ఆయువులో జీవితం!

సంక్షోభం కల్లోలం! సముద్రజలం లోనే కాదు
పరివర్తన కోరే చలన కలన సమాజంలోనూ!

## 8. సర్కస్‌లో పులి

సర్కస్‌లో పులి వీధిలో త్రిప్పబడుతూంది
అపుడపుడు తలక్రిందులుగా నడుస్తుంది
చేరిన జనం నిర్భయంగా సమీపించేరు
కొందరు కరచాలనంకై ముందుకు కదలేరు.

అడవిలో స్వేచ్ఛగా తిరిగే పులి!
వీధిలో ఆటలో సర్కస్‌లో బోనులో అలవాటయి
మనిషి చూపుకి ముచ్చటగా కనబడుతుంది
మనిషి ఊహకు కొత్త చిత్రం హత్తుకుంటుంది
నిప్పుకి బదులు వెన్నెలపై నడుస్తున్నట్లుంటుంది
లోపలి భయ శిల ఒక శిల్పాకృతి పొందుతుంది.

పులి గాండ్రింపు వినబడితే
అడవిలో హరిణం బంతిలా ఎగసి
చకచ్చకితంగా అదృశ్యమవుతుంది
నేలపై దూరదూరం పులి వేసే అడుగుల శబ్దానికి
పరిసరాల్లో హరిణం భయంతో దాగిపోతుంది.
అమావాస్య నిశకు భయపడని మనిషి
అడవిలో పులిని చూచి అమావాస్యముఖం పొందేను.

బోనులో సర్కస్‌లో ఆటలో పులిపట్ల
ఏ మనిషి హృదయం మృత్యుపాశాన్ని విసరదు.
హింసకూ ప్రేమకూ మధ్య వంతెన
మనిషిలో ఉదార చరితకే సాధ్యం
జేబులో పిస్టల్‌తో చేతిలో కర్‌చిఫ్‌లో బాంబుతో
రహస్యతలంపై మనిషిలో ఉండనే ఉంది! పులి!

## 9. ప్రకృతి నుండి వికృతికి

అవనినీ అవకాశాన్నీ కలిపే ఆలోచన
మనిషి పయనంతో తప్పని ఒక వంతెన!

ప్రయాణ సమయంలో వాస్తవం
గ్రీష్మంలా చురుక్కుమనిపిస్తుంది
మెరపులా చకితం చేస్తుంది
పిడుగులా బెదర గొడుతుంది
శిశిరంలా ఆశల్ని రాలుస్తుంది
వసంతంలా హేలను ప్రదర్శిస్తుంది.

అంతలో తుఫాను అందరినీ భయపెడుతుంది
ఇంతలో భూకంపం! సర్వమూ చెదరగొడుతుంది.

సూర్యుణ్ణి వెదకడం ఆరంభించి రాత్రి,
వెతగ్గా వెతగ్గా చేతి పర్సులోనుండి
జారిన నాణెంలో హాయిగా దొరికేను
నాణెంలో మెరవడం బ్రతుకు తెల్లవారడమే.

తెల్లవారిన బ్రతుకులో చేతి వ్రేళ్ళు కదిలితే
ఎగిరే సీతకోక చిలుక గుర్తుకు వస్తుంది
ఆశ విప్పిన బ్రతుకులో రెండు చేతులు చాస్తే
రెక్కలపై గరుడుడు జ్ఞాపకం వచ్చేను.
వనిలో చెట్ల కొమ్మల్లా, జలధిలో కెరటాల్లా
మనిషి మనిషి మధ్య! జన చలనం! సమాజం!

ఇపుడు ఆవకాశంవైపు చూపు నిలిపే అవకాశం లేదు
నేలపై కాళ్ళు సరిగా, నిలిస్తే చాలు నన్నట్లుంది.

శ్వాసలో గాలి! ఎక్కడైనా ఒకటే మనిషికి!
నేలలో పదునుతోనే మొక్కకు భవితవ్యం!

పయనంలో అనుభవం మనిషి మనిషికి భిన్నం
ప్రకృతి నుండి వికృతిలో పొందిన కళారూపం.

## 10. ప్రశ్న నుండి సృజనకై

పేకాటలో తురుఫ్‌లా ప్రశ్న! బయటపడేను
ఉన్నదానితో సమాధానం సరిపెట్టుకోవడమే.

ఎంతటి పగలైనా ఒకే జటిల ప్రశ్నకు
గూటిలో పక్షిలా ముడుచు కుంటుంది.
ఎంతటి రాత్రైనా ఒకే నిశిత ప్రశ్నకు
చేతిలో బాకులా! ఎందుట నిలుస్తుంది.

ఒక్కొక్క ప్రశ్న ! ఒక్కొక తలుపు తడుతుంది
ఒక్కొక్క సమాధానం ఒక్కొక తలుపు తెరుస్తుంది.

ఆరాటం అశాంతి నుండే కాదు ప్రశ్నలు
ఆలోచన నుండీ అనుభవం నుండీ దూకుతాయి
ఏకాంతంలోను సమూహంలోనూ మొలుస్తాయి
సరికొత్త మజిలీలకు సూచిక లవుతాయి

ఒక ప్రశ్న పూవులా పలకరిస్తుంది
ఒక ప్రశ్న నిప్పులా ప్రకోపిస్తుంది
ప్రశ్నలతో ఎదురై సమాధానాలతో కదలే
మౌన క్షణాలు! ఒకటొకటీ కలుస్తాయి!
కదలి పోతూ, మనిషి మనిషినీ పలకరిస్తాయి.
మాట్లాడతాయి! పోట్లాడతాయి! ఆటపట్టిస్తాయి.

ఒక గదిలో ఆలోచన నిశ్శబ్దంగా నిలిచిపోదు
గోడల్ని చీల్చి దూకి పాయలుగా ప్రవహిస్తుంది.

సుదీర్ఘమైన ప్రశ్నలా సాగుతుంది
సమాధానాల అలలతో లేస్తూ పోతుంది.
విశాల మైదానాల పార్శ్వాలకై ఎదురుచూస్తుంది
మనోజ్ఞ సృజన రూపాలకై తపిస్తుంది, చలిస్తుంది.

## 11. భూమిలో బీజంవలె

భూమిలో బీజంవలె మనిషిలో ఆలోచన
మొలకై తరువై వనమై జీవితాన్ని తీర్చేను
మనిషిలో అవని నింగి ప్రకృతి ప్రాణి జలధి
నిరంతరం జిగీషా మనీషకు ఆహ్వానం పలికేను.

వనిలో దవానలం పొందిన రుద్రాకృతితో
పూవు ప్రాణి సర్వం విషాదమయ మవుతూంది.
పీడనలో వేదనతో రగిలే అనలంతో
ప్రజల మధ్య కాలిబాట మూతబడిపోతూంది.

ఓటమితో జీవితం నిలిచిపోదు
విజయంకై పయనం ఎప్పటికీ సాగేను
నేలపై వర్ష జలం శుభ సూచన నిస్తుంది
అణువణువు శక్తితో సృజన పూర్ణ మవుతుంది.

శరీరం ప్రభవిస్తుంది నగ్నంగా
జీవితం మొదలవుతుంది శుభ్రంగా
కొత్త కొత్త దుస్తులతో కొత్త కొత్త బరువులతో
నాటకం మొదలై, దృశ్యం వెంట మరో దృశ్యం!

సూర్యుణ్ణీ చంద్రుణ్ణీ మోసే ప్రవాహమై
ఎదురుగా సమయ ముకురం మెరుస్తూంది
మెరిసే దర్పణంలో బింబించే జీవితంలో
సూర్యుణ్ణీ చంద్రుణ్ణీ దాచేసే మబ్బు వస్తూ పోతుంది
నీడలు! మనిషిని తనలో కలుపుకో చూచేను
వెలుగులు మనిషిని వేరు చేయ చూచేను.

# 12. సెప్టెంబర్ 17

## 1

కిర్మీర సంస్థానంలో రోజురోజుకీ పెరిగే నీలి మచ్చ
నేరం ఎరగని ప్రజను శిక్షకు గురిచేసింది
కఠిన శాసనాల బోనులో నిలువునా బంధించింది
ఇనుప నీతి వలలో జనం నలిగిపోయింది.

ఎక్కడ బడితే అక్కడ వెలసిన భస్మ వేదికలు
ముక్కలుగా చెదరిపడిన శాంతి వాలకం!

నేలపై నెత్తురు మరకల్లో వాలిన పూలు
అవమాన స్పర్శతో శిశిరాన్ని తలపించేను.

పిట్ట ఎగిరేందుకు భయపడుతూంది
మొగ్గ నవ్వడానికి వెనుకాడుతూంది
ధ్వంస మయిన తోట! కళ తప్పిన పేట
బీడు పడిన పొలం! పొదలతో కాలి బాట!

మధ్య మధ్య మంటలు! పందిరిగా తోచేను
దీని క్రింద జనం! అవతారం మరి వేరే చెప్పాలా?
దారిలో మనిషి నడిచిన అడుగు జాడల్ని
మాపే అడుగులతో! పులి వెంట పులి! తిరిగేను.

మనిషి ఎక్కడి నుండో ఊడిపడిన బొమ్మ కాదు
సమాజం నుండి ఎదిగిన మనోజ్ఞ వికాస రూపం

ప్రతిరోజు ఉదయ వదనంపై బొగ్గు పొరకు బదులు
శుభ్రమైన నిజ దర్పణతలం చూడాలని కోరేను!

ఎదురపడే నీలి నీలి తెరల్ని చీల్చే
సమయం కోసం! చేతు లెదురు చూచేను.
పీడనలో దారుణ వేదనతో తెలంగాణ
విమోచనకై స్వేచ్ఛకై తపించడం సహజం.

## 2

విషాద పర్వం ముగిసి మొదలైన స్వేచ్ఛాపర్వానికి
సెప్టెంబర్ 17, చరిత్రలో పరివర్తన కాల సూచి.

సైనికచర్యతో మస్తిష్కంలో పీడ కల తొలగింది
నీలి మచ్చ తొలగింది కొత్త రంగు హత్తింది
విష సర్పం హతమైంది, మట్టిలో కలిసింది
ఇనుప కిరీటం, పడిపోయింది
పురా శిథిలాల్లో ఒకటయింది
భస్మవేదికలపై సృజన స్వరం నినదించింది.

నేరం లేకుండా పడిన శిక్ష స్మృతిలో మసకబారింది
ఓటమి ఎరుగని చేతుల్లో జయ కేతనం ఎగిరింది
అంగి రసం శాంతంలో కలిసి ప్రవాహం ఏకమైంది
ఉత్సాహ జలధిలో విషాద చలనం మాయమైంది

పులి అడుగుజాడలు చెరగిపోయి
దారులు మానవతా ముద్రల్ని పొందాయి.

శ్మశానం మొగ్గవేసింది, సుందర నవ శాంతికి సిద్ధమైంది
లోహ జగం కరిగింది, నవ సాధన రూపమైంది.

ఇది నవ భారత స్వేచ్ఛా యుగానికి
స్వాతంత్ర్య సమరంలో చివరి పంక్తి
జాతి ఊపిరి తీగెకు పూచిన పూవై నిలిచింది.

భయ బంధం వీడి గాలి, మౌన ముద్ర వీడింది
చెట్టుచెట్టునూ గుట్టగుట్టనూ స్పృశిస్తూ పోతూంది.

సంకెళ్ళు వీడిన జనంలో స్వేచ్ఛ చిరంగా నిలవాలనే
ఈ సమయం అస్తమయం లేని ఉదయం కావాలనే!

సంస్థాన కిర్మీర ఫలకం తొలగి జన తెలంగాణ నిటలం
భవిష్య చిత్రానికి రంగులతో సిద్ధంగా ఉంది
చెక్కబడే శిల్పానికి హంగులతో నిలచి ఉంది.

పొగ తొలగిన చార్మినార్ చారుహాసంతో మెరసేను
విధ్వంసం తప్పిన కీర్తి తోరణం జీవ కళతో వెలిగేను.
కోటి కోటి ప్రజల శక్తి ఒకటే మానవతా రూపం
మంజీర ఘలంఘలనుండి మున్నేరు హొయలుదాక
వ్యథల నుండి శిథిలాల నుండి, వికసించిన తెలంగాణ.

## 13. ఎప్పటికీ ప్రమాదమే!

ఏ కొండ చాటు నుండో ఏ బండ మాటు నుండో
చెట్టుకి గురి పెట్టిన తుపాకి గొట్టం
దాని నీడ నేలపై బొమ్మలా! నిశ్చలంగా.

కొమ్మలు వంకర్లు తిరిగి మరో వైపు సాగాయనీ
చీమలు కదలుతున్నాయనీ, దోమలు తిరుగుతున్నాయనీ
ఆకులతో కొమ్మలతో పెరిగి పెద్దదయిన చెట్టు
వెనక నున్న మనిషి రూపం కన్పించడం లేదనీ
చెట్టుకి సూటిగా గురిపెట్టిన ఆయుధంతో
మానవ వికాస శక్తిని అపహాస్యం చేస్తూంది.

ఒకటి రెండు గాయాలతో వదిలేట్టు లేదు.
వేటలో పిట్టను కాల్చినట్లు తన పని చేయాలనే!

చెట్టుకి గురిపెట్టిన తుపాకి గొట్టంతో
పొగలతో మంటలతో ఆకృతి మార్చాలనే!

అవనిలో ఒదిగిపోయి వేళ్ళు పైకి కన్పించవు
కాబట్టి సరిపోయింది కాని, లేకపోతేనో, అవీ
ఆ తుపాకి గొట్టం చూపుకి గురి అయ్యేవే!

పూవుల్నీ ఆకుల్నీ కొమ్మల్నీ ముక్కలుగా ధ్వంసంచేసి
రక్తంతో సిక్తమై కొత్త రంగు హత్తిన
ఆ మిగిలిన బోదెపై కొత్త సృష్టి తేవాలనే!

చెట్టుకి గురిపెట్టిన తుపాకి గొట్టం!
దాని నీడ నేలపై ఉరి త్రాడును తలపిస్తూంది

ప్రేలే సమాజ హింస ఒక ఆదర్శ బిందువైతే
చెట్టుకి జీవన జగం! ఎప్పటికీ ప్రమాదమే!

## 14. ఫస్టోబర్

సమయాన్ని సవేగంగా పరుగెత్తిస్తూంది కాన్వాయ్
దగ్గరలో కళకళలాడే దివ్య ధామానికిదే దారి!

కను రెప్ప పాటులో ప్రయాణ మపాయభరమై
ప్రేలిన శబ్దంతో సూత్రం నుండి తెగి పడింది.

విస్ఫోటంలో ఎగసిన ధూళితో ఎస్కార్ట్‌లో
ముఖానికీ ముఖానికీ మధ్య తెర పడింది.

పయనించే కారు భ్రమావరణంలో దారి తొలగి
ఆ ప్రక్కనున్న బండ రాయిని ఢీకొని ఒరిగింది.
అందులో పయనించే వారి కళ్ళు చకిత స్థితిలో
ధ్వంసమైన వాహనం, గాయపడిన మనుషులూ,
మణికట్టు గడియారం ఆగలేదు. ఆడుతూనే ఉంది.

దారిలో కాలాన్ని ఛేదించి జీవితాన్ని మాయం చేసే
దారుణ క్షణం! రాయిలా నిలిచిందే! దూదిలా తొలగింది
పైకి దూకిన మారణ చక్రం గురితప్పింది
పన్నిన ఉపాయం, స్థాణ్వాకృతి పొందింది.

మనుషులు భయముద్రతో బ్రతికి బయటపడ్డారు
దూరాన పొంచిన రహస్య హస్తం
విసరిన మరణ పాశం త్రుటిలో తొలగింది.

ప్రేలిన ముందుపాతరల శబ్ద తరంగాల్ని
ఎగసిన విషమ స్వరా లందుకుంటున్నాయి.

గోడ చాటునుండో పొదల చాటు నుండో
కాలాన్ని కత్తిరించే అదృశ్య హస్తం
కటుత్వాన్నీ కర్కశత్వాన్నీ మూటకట్టి
పైకి విసరినట్లుందీ వర్తమాన వాస్తవం!

సూర్యుణ్ణి చంద్రుణ్ణి మాయంచేసే ఆలోచన
నీలి గద్దలా ఎగురుతూనే ఉంది.
చినిగిన మానవ సంస్కృతి పుటలు
గాలిలో ఎగిరిపడుతూన్న దృశ్యం!

**2**

పల్లె నుండి అరణ్యానికీ అరణ్యం నుండి నగరానికీ
అగ్నిమయ హృదయంతో సాయుధ మూర్తులు
మనిషి చిరునామా! తుడిచివేయబడుతూంది
మనిషి సంస్కృతి వికార దశను పొందుతూంది.

పగలు నేలను దున్నేవాడు దున్నిపోతున్నాడు
రాత్రివేళ మందుపాత్ర పెట్టేవాడు పెడుతున్నాడు!
హింస అశాంతి రెక్కలపై ఎగిరే భేరుండం
ఎపుడెవరి తలను ఎత్తుక పోయేదీ తెలీదు

జీవితం శిలాపంక్తి కాదు, కదలే ప్రవాహరూపం
ప్రవాహాన్ని కత్తితో కోయాలనుకోవడం విపరీతం!
జలాలకు నెత్తురు రంగు అద్దడం కొందరికి కళ!
జలాల్లో అగ్నులు రేపడం కొందరి ఉద్యమం!

చెట్టుకు నిప్పుపెట్టి కొమ్మల్నీ పూలనూ మాడ్చి
దాని నీడకై మొరపెట్టుకొనే వారూ ఉన్నారు.

చెట్టు కొమ్మలపై మొదలైన గురి ఆపైన పూలపైనే కాదు
నేలలో మూలాలపైనా ద్వేషం చిమ్ముతూంది.

కత్తితో శరీరాన్ని వెంట వెంట గాయపరుస్తూ
గాయాల చిత్రాల్ని వల్లించే వారూ ఉన్నారు.

ఇనుప ముళ్ళపై నడిపిస్తూ
అగ్ని శిఖలపై పరుగెత్తిస్తూ
సమాజానికి విలయ కిరీటం తొడగాలనే తపన!

యుగాల సంస్కృతిలో చేవ దేరిన మనిషి అస్తిత్వం
విషాద చక్రం క్రింద నలిగి గుర్తుపట్టరాకుండా ఉంది.

**3**

బీభత్సం సృష్టించే వర్తన నేరం కాదని
వాదించే తత్త్వం, మూలాల్ని పెకలిస్తూంది.
మనిషిలో విలువల్ని తారుమారు చేస్తూంది.
సమాజం నుండి జారిన వికలమైన శకలాలు
ఎరువు అద్దిన ఆలోచనతో హింసను వరించేను.

ప్రాణం అందరిదీ ఒకటే!
దీనికి ఎరుపు నలుపు తెలుపు భేదం లేదు.

మసి పట్టిన అద్దంలో ఎదురుగా తారాడే
రూపాల్ని కనిపెట్టే పని ఇంకా మిగిలే ఉంది!

జారిన విషాద క్షణాల్ని వదలి కాలం
ఎపుడో నిష్క్రమించింది, స్మృతిలో చిత్రమై.
మనోరూప విశ్లేషణ ఇంకా మిగిలే ఉంది!

కాగితంపై రాలిన కన్నీటి చుక్కలు
ఎర్రని అక్షరాలుగా మారుతున్నాయి.

అక్షరాల్ని సరిచేసి పదాలుగా తీర్చి
వాక్యంలో వెనుకనున్న అర్థంకై, అర్థాంతరంకై
సామాజిక గవేషణ! మొదలే కాలేదు!

మనిషిలో ఆర్ద్రతే కాదు ప్రవాహకత అవసరం
గుండెలో జీవంతో చివురూ పూవూ! రావాలి.

## 15. ప్రయాణ చరిత్రలో

ప్రయాణ చరిత్రలో
చేయి చాచి అందుకోబోతే
ఎప్పటికీ అందని దూరంలో
మునుముందుకు నడచే గాంధీజీ.

మోకాళ్ళ దాక ధోవతి కట్టుతో
భుజం నుండి భుజానికి ఉత్తరీయంతో

పయనిస్తూంటే చూచే నాకు
ఏమీ లేని వట్టి భిక్షువుగా కన్పించడు
ఎంతో ఉన్న మహాదాతగా మెరసేను.

ప్రయాణ చరిత్రలో
వెనక్కి తిరిగి చూస్తే దూరాన
మిలిటరీ దుస్తులతో నియంత
ముఖంలో బిగువుతో
నడకలో ద్రఢిమతో
శిలపయినో పేపర్‌పయినో కాకుండా
రూపంలో దారుణ శాసనమై కన్పించేను.

వెనక్కు తిరిగిచూస్తూ నడవడం అసహజం
కాని ఎపుడో వెనక్కి తిరిగి చూస్తే ఆ క్షణం
నడచే సాయుధ రణరూపం గుర్తుకువస్తుంది.

ముందున్న శాంతమూర్తిని అందుకో జూస్తూ
వెనకునున్న నియంతకు అందకుండా
నా పయనం రెండు తీరాల మధ్య
నీటిపై వెలుగు పడవను తలపిస్తూంది.

చూస్తే! ఇరువైపుల కుడి ఎడమ మజిలీలు
రెండూ సూర్య చంద్ర బింబాల నికేతనాలు.

ఒకటి అందని ఎత్తులో తేజంతో ప్రకాశిస్తూంది
ఉద్రేకం ఉత్సాహం నిండిన రజోరశ్మితో
రుద్రుణ్ణీ మహావీరుణ్ణీ జ్ఞప్తికి తెస్తుంది.

మరొకటి అందబోయే ఆశలో కదలుతూంది
కరుణతో ప్రేమతో ప్రసన్న వదనంతో
బుద్ధుణ్ణో క్రీస్తునో శిశువునో తలపిస్తుంది.

అరణ్యం జనపదం నగరం దశలు దశలు
అన్నీ త్రి ఇన్ వన్‌లా మనస్సులో భద్రంగా

సమయానికి మరొకరి పయనం జత అవుతుంది
ప్రయోజన సూత్రంపై మనిషికి మజిలీ ప్రాప్తిస్తుంది.

ప్రయాణ చరిత్రలో ఎప్పటికీ
ఎక్కడి కక్కడే మనుషులతో సంబంధం

ఎవరి దారిన వారు చీలిపోయే సెంటర్
ప్రయాణంలో దిశ దిశకూ ట్రాఫిక్ సిగ్నల్!

నా చుట్టూ నాలుగు దిశలు!
మళ్ళీ ఆ దిశల మధ్య నేను!

అల్మైరా సొరగులో ఉన్న చెక్‌బుక్‌తో కన్నా
చేతిలో కరెన్సీతో ప్రయాణ మర్థవంతమవుతూంది.

## 16. ఆకర్షణ

గ్రామీణం నుండి ప్రపంచీకరణం దాకా
బీద బిక్కు క్రందనలకు ప్రతిధ్వనులు!
అన్యాయాలపై గురిపెట్టిన చూపుడు వేలూ
మాటల్లో వెలిగే మతాబులూ, పూవత్తులూ.

బ్రతక నేర్చిన కళలో, ఆరితేరిన రికార్డు మోతలో
అసలు జన గళ శబ్దం, ఎక్కడో మునిగిపోయింది.
సహజ దృశ్యం కన్నా, బొమ్మల రూపానికే విలువ
మనుషుల చలనం కన్నా, బొమ్మల ఆటకే పట్టం!
హేతువు పని చేస్తే, వ్యాపారమెట్లా సాగుతుంది.

సామాజిక స్పందనలో అశ్వ గమన వేగం,
సమస్య పరిష్కృతి అందబోయే గగన సుమం
కీర్తి శాలువా అవలీలగా భుజాలపై పడుతుంది.
చేతిలో గల గల శబ్దం ఘనంగా ఆడుతుంది.

వేషం వీడిన పాత్ర గదిలోకి నిష్క్రమిస్తుంది
విప్పిన కాగితం పొట్లంలా హాయిగా అమాయకంగా,
నిశా విరామ సమయంలో క్షితిజంలా

వేదికపై రేపటి దాకా అంతా ఒ.కే.
పగిలిన అద్దం ముక్కల క్షణాలపై

పయనం సామాన్యుని బాధిస్తూనే ఉంది.
మంచులా బిగిసిన బాధ పెదవి దాటలేకపోతూంది
కనురెప్పలపై చీకటి నివ్వెరతో నిలిచింది.

ఫ్రేమ్‌లో బిగింపబడి గోడల్ని అలంకరించిన
సమస్యల సంక్షుబ్ధ రూపం, యథాతథంగా ఉంది
బయట వివిధ భంగిమల్లో ఉత్సవంగానో ఉదారంగానో
పేర్చిన నీతి రంగుల గాజు బొమ్మలు! ఒక ఆకర్షణ.

## 17. అభిషేకం

చెట్టు క్రిందనో మైదానంలో బతికే వీలుతో
ఒక దారి దొరికితే సరిపోదు, మనిషి జీవితంలో.

మనిషి అవసరాలకు అడవి, మృగాలతో వెనక్కి జరుగుతుంది
జనపదం పట్టణం నగరం ఒకదానివెంట మరొకటి.

రోజు రోజు కొక కొత్త మెట్టుతో ప్రయాణం
మెట్టు మెట్టుపై మనుషులంతా ఒకటే, కాని,
బ్రతికే మనో భూమికల్లో ఉంది, భేదం
పొందే ఆదర్శ భంగిమల్లో ఉంది, అంతరం.

స్వార్థం అలలు తుఫానుకు గురై
పరిసర సమాజాన్ని కల్లోలంలో ముంచేను
జీవితంలో స్వార్థం ఎప్పటికీ కేంద్ర బిందువేకాని,
ఇది అమ్మకానికి మార్కెట్ కావడంతో విపరీతం మొదలు!

ఊగే స్వార్థం ఊయలపై పైకెగసే అడుగులు
వేగంగా నింగి తలను స్పృశించాలనే.

క్షణ క్షణానికీ పగలు రంగు మారుతూంది
ఊహ ఊహకూ ముఖ బిందువు స్థానం వేరవుతూంది
మలుపు మలుపుకూ గమన రేఖ కోణం మారుతూంది.

ఊహకు ఎల్లలు లేవు, సృజనకు చివరల్లేవు
పాత్రకు మితం లేదు, కవిత కొక సమయం లేదు.

కరగే కలల మధ్య నిలిచిపోయే ఆదర్శంకై
జీవన సమరంలో సైరన్! హెచ్చరిక మాత్రమే
అనల సృజనకూ కాదు, విలయగతికీ కాదు
అనల విలయ శమన హృదికే! అభిషేకం!

పగిలి జారిపడే గాజు ముక్కల్లా శబ్దంతో
పిగిలి రాలిపడే మంచు ముక్కల్లా స్వరంతో
సమయం పరిదీన కథను గుండెపై మీటుతూంది
ఆగ్రహాన్ని కరుణలో ముంచి పైకి తీస్తూంది.

గురిపెట్టిన ఆయుధం వెనక దాగిన
మనిషి ముఖంలోకి తొంగి చూడాలనీ,
ఉగ్రత అంచుల్లో కళికల్ని గుర్తించాలనీ
మృత్యువునకు పర్యాయం కాకూడదనీ

ఏ భయం లేకుండా ఊపిరి అల్లుకొనీ
వికసించే ఆయువుతో దీర్ఘమై
మానవీయ రస కళతో పూర్ణమై,
ఉంది నాకు అస్తిత్వం వికసించాలనీ

సంకెళ్ళు లేని భయం లేని, మనోజగంతో
సజీవమైన అస్తిత్వం పొందిన సమాజంతో
జనపద నాగరక జీవ చిహ్నాల్ని చూడాలనీ!
ఉంది నాకు! అడవికి పర్యాయం కాకూడదనీ!

స్వేచ్ఛా కవిత్వం
రెండవ భాగం - 2

# ఆగమనం

**మాదిరాజు రంగారావు**

**2004**

రసధుని

**సాహితీ పరిషత్తు**

శాంతినగర్, హైదరాబాద్ - 500 028.

# అంకితం

చిరంజీవిని

**శ్రీమతి హరితకు**

M.A. (Lit)

(Detroit, M.I., U.S.A.)

ఆశీస్సులతో

# ఆగమనం

## సూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | కూలిన శిఖరాలు | ................ | 5 |
| 2. | జ్ఞాపికలు | ................ | 6 |
| 3. | అనుమాన దిశలు | ................ | 7 |
| 4. | ఒకే మార్గం | ................ | 8 |
| 5. | ఈ శతాబ్ది వేచి ఉంది | ................ | 9 |
| 6. | ఎక్స్‌రేకి తప్ప | ................ | 10 |
| 7. | అందనిదీ లొంగనిదీ | ................ | 11 |
| 8. | ప్రదర్శనలో | ................ | 11 |
| 9. | సంవేదన వేరు | ................ | 12 |
| 10. | అదృశ్య పాత్ర | ................ | 13 |
| 11. | అమ్మను తలపించే | ................ | 14 |
| 12. | మేఘాలు వస్తాయి | ................ | 15 |
| 13. | బోను నుండి | ................ | 17 |
| 14. | ఊరు ఎక్కడికీ పోదు | ................ | 18 |
| 15. | చిరంజీవమై | ................ | 21 |
| 16. | మానవీయ సౌందర్యం | ................ | 22 |
| 17. | అంతరంగ జగం | ................ | 24 |
| 18. | రణ యానం | ................ | 26 |
| 19. | సహయానం | ................ | 28 |
| 20. | ఆగమనం | ................ | 31 |

# ఆగమనం

## 1. కూలిన శిఖరాలు

ఇది భూకంపం చూపే ఆగ్రహం కాదు
ఇది హరికేన్ దూసిన కల్లోలం కాదు
ఇది మానవ మారణ భీభత్సం.

రెండు శిఖరాలు నవ సమాజ చిహ్నాలు
రెండు సౌధాలు విశ్వబంధు నికేతాలు
ప్రేలి కూలి ఫేన పంక్తుల్లా చెదరాయి
మతి చెదరిన మానవశక్తిని చాటేను.

ఉదయం హ్లాదమైన సమయం
సాయం విషాద సంధ్యగా మారింది.

మనిషిలో ఆటవికం లయనృత్యం చేస్తూంది
మనిషిలో పాశవికం ఘనరాగం శబ్దిస్తూంది

అగ్నితో అగ్ని ఆరదు
బాధతో బాధ మానదు

రోజు వెంట రోజు
ఆగ్నుల్ని ఆర్పేందుకూ
తాపాల్ని తొలగించేందుకూ
ఏ బుద్ధుడో! క్రీస్తో! మహాత్ముడో! ఉదయించడు.

చుట్టుముట్టిన అనల వలయం మధ్య
నిలిచిన సృజన శిఖరం నుండి కవిత
ఎగసి శాంతి వార్తతో పయనించాలనే.

ఎంత దూరమయినా నిర్భయంగా
ఏ దేశమయినా నిస్సంశయంగా.

## 2. జ్ఞాపికలు

ప్రతి దిశ ఒక మిత్రమై బంధువై
మనిషి మనిషితో స్నేహం కళయై
పద పదాన పెరిగే ఆయువుతో
ఈ శతాబ్ది కోరుతూంది మానవతాయుగం.

నిర్మాణం విధ్వంసంలో సంకల్పముద్ర
మనిషి మనోరీతుల్ని చిత్రించేను.

శిలయై శిల్పమై అలంకారమయ్యేకన్నా
రక్తమాంస మస్తిష్కంతో నడవడమే ఇష్టం!

అంతరంగానికి పాత లేదు
ఏ తరతమ భేదమూ లేదు
కిరణానికి ఇల అయినా జలమయినా
ఒకటే! ప్రసరణలో, వితరణలో!

చీకటినీ మృత్యువునూ అబద్ధం చేస్తూ
ముందుకు వెళ్ళాలనే మనసులో కోరిక!
అయితే ఈ రెండూ మనిషి వెనకాలే
వీడని బంధంతో సరిస్తాయి.

రోజు వెంట రోజులెన్నో ఒకచోట చేరి
గతమై పర్వతాన్ని తలపిస్తాయి
రోజు ముందు రోజు అలయై కదులుతూ
వర్తమానమై భవిష్యత్తును తొందరపెడతాయి.

పంచాంగాలు పాతబడి పోవచ్చు
కాలెండర్‌లు మూలబడి పోవచ్చు
ఇవి గడచిన కాలానికి సోపానాలు
ఇవి జీవన దశలకు జ్ఞాపికలు.

## 3. అనుమాన దిశలు

నీలిస్మృతులు మానవతను
సూర్యుని మబ్బుల్లా కబళిస్తున్నాయి.

అప్రతిహత శక్తిగా పేరుబడిన దేశంలో
నగరం, దొంగదెబ్బకు హతమయింది.

వెలుగుపటం హఠాత్తుగా
నీలిరేఖల చిత్రాలతో నిండింది
ఇపుడు సూర్యుణ్ణి వెదకాలిసి వస్తూంది
గగనంలో, అంతరంగంలో మరోచోట!

కాలిబాటన బుజాన బాగ్‌లో
పుస్తకాల బదుల బాంబుల అనుమానం!
పైన తడబడే కరుణమేఘం
వాలిపోయి, చెదరి పోతూంది.

కొండ క్రింద చెట్లనీడన మరోచోట
నేలపై పరచిన వస్తువులూ, వంట పాత్రలూ
ఒకటి రెండు ఆయుధాలూ, వదలబడి
భయచకిత లిప్తల్ని కదలిస్తున్నాయి.

తిరిగే పశువుతో పచ్చని చెట్లూ, గుట్టలూ
కదలే మనుషులతో ఎర్రని సంధ్యాసమయం
రెండిటికీ మధ్య ఎగిరే తెల్లని హంస.

దూరాన ఆహ్వానించే శాంతిస్తూపం!
మూలనుండి గురిపెట్టిన గన్ పాయింట్!

## 4. ఒకే మార్గం

అజ్ఞేయంతో అతీతంతో అలంకరించిన
జీవిత రథ గమనంలో
తనువు నుండి ఆత్మదాకా మార్గం!
ఒకే ఒకటి! స్వార్థం.

నక్కలకై పులులకై అడవికి పోనక్కరలేదు
ఎదురుగా ఉన్న అద్దంలో కన్పిస్తాయి,
మన వెనకనే చరిస్తూ.

నీతి న్యాయం అందరి గుండెల్లో భద్రంగా
మరొకరికి మాత్రం ఉపదేశం! ప్రవాహంగా,

పై మజిలీ దూరమయినంతమాత్రాన
క్రింది మజిలీ వద్ద ! ఆగిపోనక్కరలేదు.

సమయం కదలుతుంది చేతివేళ్ళపై,
ఇది ఎగిరే స్నేహ ప్రపంచంతో
ఇంద్ర ధనస్సుగా మారవచ్చు.

సమయం నిలుస్తుంది చేతివేళ్ళపై
ఇది శత్రు శిబిరంతో చేరి
పిడుగు పాటుగా మారవచ్చు.

స్నేహప్రపంచంలో దూకే
జలపాతం! ఎవరికీ అక్కర్లేదు
దాని అంతుపట్టదు కూడా!

శత్రుశిబిరంలో లేచే
మంటలు ! అందరికీ కావాలి!
అవి లేచే ఎత్తుపై
వాటి శిఖలపైనే దృష్టి!

## 5. ఈ శాతాబ్ది వేచి ఉంది

విసరే బాణాల్లా అరపులు కేకలు
రాలే నాణాల్లా తలపులు కోర్కెలు
గళ గళత్ గర్జనతో హక్కులకై
పిడుగుల వలె మనుషులు వీధుల్లో.

తీరని ప్రశ్నలతో బిగిసిన సమస్యలతో
అనలంకై వేచి ఉన్న మానవ సమిధలు
వాస్తవ చలనంలో అనుభవ గమనంలో
మానవతా కళ వెలిగే ఆ సమయంకై.

ఆర్తి బాధ అలజడి హింస చతురస్రంలో
వివిధ కోణ గతుల్లో విషాద చిహ్నంతో
కమలిన, చెదరిన జీవన వనిలో
ఆయువు గంధం వీచే ఆ సమయంకై.

రణపథం మూతపడీ
శాంతిపథం తెరువబడీ
జనతతి కంటి చివర
పూలమొగ్గ జారే ఆ సమయంకై.

వాలిన కనురెప్పలతో స్క్వేర్‌లో
కలలసాక్షిగా నిలిచిన గాంధీజీ విగ్రహం
మనిషి అంతరంగంలో దాగిన
నిజాన్ని కనురెప్పలెత్తి చూచే
బయటికి తీసి చూపే సమయంకై
ఈ శతాబ్ది వేచి ఉంది ఆ సమయంకై.

## 6. ఎక్స్‌రేకి తప్ప

అనుభవ జలాలపై ఆయువు నదియై సరిస్తుంది.
నదిలో నావలా మనోజగం,
ఎవరి చూపుకీ అందదు
ఎక్స్‌రేకి తప్ప!

ఎదురుగా ఉషస్సు! సాగే నిచ్చెనలా
వెనకనే నిశ వంగిన ధనుస్సులా.

నీరు బిగిసి, పైన మంచు పొర వేసిన
సరసిలో కదలే చేపల్లా
మనసులో గత స్మృతుల శకలాలు
అవి కలిసీ విడిపోయే రూపాల దృశ్యాలు.

మనసులో వర్తమానం
అలలపై తేలే హంసలా
కదలేను, ప్రియ వాస్తవమై.

బుడగలాంటి క్షణానికెంతో ఉబలాటం
కదలాలనీ అలలా ముందుకు సాగిపోవాలనీ.

కదలే కాలంతో ఊపిరి పోటీ పడుతూంది
తిరిగే భూగోళంతో జీవితమనువర్తిస్తూంది.
పయనంలో పాటతో మాటకూ ఎంతో విలువ
పారవశ్యంతో ఆలోచన కూడా ఎంతో అవసరం.

పాటతో మాటతో మనోజగం
కంటికి కన్పించని వాస్తవ నిలయం.

ఇది ఏకాంతాన్ని మరపించే ప్రదర్శనలో భాగం
ఎవరి చూపుకీ అందదు
ఎక్స్‌రేకి తప్ప.

## 7. అందనిదీ - లొంగనిదీ

గోడపై పటంలో చిత్రాన్నీ
పక్కనే శిల్పంలో భంగిమనూ
చూచే కళ్ళలో కొత్త కళ! సుమిస్తుంది
ఆర్ద్రహృదిలో కొత్త ఊహ మెరుస్తుంది.

ప్రదర్శన ! బహిరంగమే!
అంతా వాస్తవ భూమికలోనే
ఏ తెర లేదు, ఏ మాయ లేదు
ఏ మర్మం లేదు, ఏ అతీతం లేదు.

ఉంది కళ్ళలో నిలిచే
కన్నీటి తెరపై కదలే
పారదర్శక మనోదృశ్యం!

దూరం నుండి కేక
పాతవస్త్రం చీరినట్లు
దగ్గరలో అరుపు
కొత్తబూటు జారినట్లు!

మతిలో కదలే జ్వాలా ముకురంలో
మానవీయ బింబం! గ్రహణం పొంచీ!
వాస్తవ జగంలో విషమ దృశ్యప్రపంచం
ఏ ఆదర్శానికీ అందనిదీ, ఏ సిద్ధాంతానికీ లొంగనిదీ.

## 8. ప్రదర్శనలో

ప్రదర్శనలో బొమ్మలు వివిధ భంగిమల్లో
ఇవి, సదా ఎవరైనా పెద్దలో పిల్లలో
తమను చూచే చూపులకై ఎదురుచూస్తాయి.

ఆ చూపుల అల్లికలో ఒదిగిపోవాలనీ
రాగ కర స్పర్శకై ఆరాట పడతాయి
ఊహల డోలికపై ఊగాలనుకుంటాయి.

ఒక్కొక్క బొమ్మ ఒక్కొక్క వాలకంతో గాథయై
మనిషి జీవితంలో ఒక్కొక్క కోణాన్ని చూపుతాయి.

అడవిలో ఆజన్మరిపులు హరిణం హర్యక్షం
ఒకేచోట సమావేశమవుతాయి. శిల్పంలో, తపోవనిలో.

భయం నుండి ముక్తమై మనసు
కళలో ఆర్ద్రతనూ కల్పనలో ఆనందాన్నీ పొందేను
కారుణ్యం కరిగి ప్రవహిస్తుంది
కన్నీరు అలయై ఒలుకుతుంది.

మనిషిలో హిమానీ హృదయతలంపై
బొమ్మలు వరసగా స్కేటింగ్ చేసే
ఆ మృదు సమయం రావాలనే!

జీవన మహాప్రదర్శనశాలలో
విరుద్ధ ప్రకృతులు సహజీవన కళతో
చెట్టపట్టాలతో విహరించే
ఆ సమయం రావాలనే
మానవీయ వాస్తవమై
ఈ శతాబ్ది కదలాలనే.

## 9. సంవేదన వేరు

రాలే ఆకుల్నీ, పూచే పూలనీ
విషాదమో సంతోషమో లెక్కలు కట్టేందుకు
సమయం ఆగదు, పయనం నిలవదు.

చరిత్రలో పాత్రల్ని మార్చి వేషాల్ని తీర్చి
వేదికపై తెచ్చి ఆదర్శం ప్రదర్శించేదాకా
సమయం ఆగదు, పయనం నిలవదు.

ఎదురైన మనిషికి స్వాగతం పలికి
వీడ్కోలు చెప్పే సంరంభం దాకా
సమయం ఆగదు, పయనం నిలవదు.

ఎవరి స్వప్నం వారికి నిజమయ్యేదాకా
ఎవరి స్వర్గం వారికి చేతికందే దాకా
సమయం ఆగదు, పయనం నిలవదు.

పీడనలో ఘర్షణలో ఆలోచన పావురమై
విశ్వ హృదయ గగనం అంచుల్ని తాకేదాకా
సమయం ఆగదు, పయనం నిలవదు.

మాతృ కరస్పర్శతో ఎదిగే శిశువులో
సూర్య కర స్పర్శతో పెరిగే వ్యక్తిలో
సమయం ఒకటే, సంవేదన వేరు!

## 10. అదృశ్య పాత్ర

మనిషికి మనిషి తోడై ఉన్నచోట
దగ్గరలో చెట్టు ఉంటుంది,
చెట్టుపై పక్షినీ చూడొచ్చు.

మనిషి కెదురుగా చెట్టూ
చెట్టుపై పక్షులూ
ఏకాంతాన్ని వనమయం చేస్తాయి.

శబ్దం ఎదురుచూస్తుంది మరో శబ్దం కోసం
మనిషి ఎదురుచూచేను మరో మనిషికోసం
చెట్టు నెరగని మనిషి లేడు
గగన మెరగని పక్షి లేదు.

మనిషి కన్నీ కన్పిస్తాయి, వినిపిస్తాయి
అతనిలో ఒక్క మనోజగం తప్ప!
మనస్సు రాగంలోనూ విరాగంలోనూ,
ఏ క్షణమూ నగ్నం కాదు, అవర్ణం కాదు.

ఒక దిశలో తుపాను గాలి
మరోదిశ వింజామరగా
ఒకచోట భూకంపం

మరోచోట ఊయెలగా
అనుభవ జగత్తును పొందే విచిత్ర సమాజశకలం
శరీరం నిండా గాయాల్నే ప్రదర్శిస్తుంది.

ఫోటో తీసే కెమెరాకు
తీసిన ఫోటోలో స్థానం ఉండదు.
చిత్రం వేసే కుంచెకు
చిత్రంలో చోటు లభించదు.
శిల్పం చెక్కే ఉలి
శిల్పం బయటే ఉండిపోతుంది.
మనిషిని నడిపే అంతరంగం
అదృశ్యంగానే పాత్ర నిర్వహిస్తుంది.

## 11. అమ్మను తలపించే

ఎండ మండిపోతూంది,
గొడుగు లేంది బయటికి వెళ్ళాలనిపించడం లేదు.

బయటికి చూస్తే ఎండ మిరుమిట్లు గొలుపుతూంది
గొడుగు అనగానే వర్షం జ్ఞాపకం వస్తుంది.

బయట గొడుగు విప్పగానే
దగ్గరలో చెట్టు జ్ఞాపకం వస్తుంది.
పైన తలపై నీలిమబ్బు నిలిచినట్లుంది
గొడుగు క్రింద నడుస్తూంటే
అమ్మ గుర్తుకు వస్తుంది.

కొసరి కొసరి విసిరే జల్లులో
ఏటవాలు గొడుగుతో నడుస్తూంటే
తన తనువును గొడుగు చేసి
హత్తుకొనీ, వాననుండి తప్పిస్తూ
ఇంట్లోకి భద్రంగా తెచ్చే
అమ్మ దృశ్యం గుర్తుకువస్తుంది.

వానలో, ఎండలో పనికొచ్చే సాధనం,
బాధలో కష్టంలో ఆదుకునే అమ్మలా
వాన చినుకు తలపై పడనీయదు
నిప్పుటెండకు తన మాడనీయదు.

నీలినిశను తలపించే గొడుగుక్రింద
నడచే సమయం నాలో
పురాజగం నుండి మరో హృదయం
స్మృతిలో కదలేను అమ్మరూపమై.

ఎండ మండిపోతూంది
గొడుగు లేంది బయటికి వెళ్ళాలనిపించడం లేదు.
సమయ సమయం గొడుగు పాత్ర
దేనికదే! అమ్మను తలపించే రూపం ఒకటే!

## 12. మేఘాలు వస్తాయి

మేఘాలు ఒకదాని తరవాత మరొకటి
అసంఖ్యాకంగా వస్తాయి స్నేహసుందరంగా
వాటి హృదయ సందేశంతో
అవనిపై మనిషీ తరువూ ఆయుష్కాలం పొందేను.

మేఘం రసచిత్రాన్ని దింపుతుంది
విశ్వం రమణీయ కృతి అవుతుంది.

సందేశార్థం తెలిసే లోపల
మేఘం కదలిపోతుంది, చెదరిపోవచ్చు.

మనిషి కళ్ళు నీరు జారుస్తాయి
గగనం శూన్య వదనమవుతుంది.
చెట్టు విరాగ రూపాన్ని పొందుతుంది
అవని దరిద్ర గృహమవుతుంది.

నీటికోసం కళ్ళు పరుగులు తీయొచ్చు
మబ్బు బదులు మంటలు చూపుల్ని చుట్టుకోవచ్చు.
ఎత్తిన తల చిలక్కొయ్యకు వ్రేలాడొచ్చు.

మేఘానికీ మనిషికీ సంబంధం శాశ్వతమైంది.
మేఘానికీ ప్రకృతికీ అనుబంధం అక్షయమైంది.
మేఘం రాకకు ఒక సమయం ఉంది, సందర్భం ఉంది.
దానికి తగినట్లు వస్తేనే! ఉపయోగం! ఆనందం!

వానజల్లుతో ప్రియంగా రావచ్చు
వేగధారతో ప్రభుతను చూపొచ్చు
కోపాశనితో చండశాసనం నెరపొచ్చు
చిందులు త్రొక్కి నాట్యం సలపొచ్చు.

ఏ రోజూ విడవకుండా మేఘాలు రావు
ఒకరోజు మబ్బుముక్క
చేతిలో రుమాలు అయితే బాగనిపిస్తుంది
ప్రతిరోజు మబ్బు నీడ
జీవన సహచరి అయితే మేలనిపిస్తుంది
అవును! మబ్బు మనసులో కోర్కెకు కీలకం.

మేఘం నుండి హృదయ సందేశం వినిపిస్తుంది
ఎదురుచూచే మనిషిలో మనోదాహాన్ని తీరుస్తుంది.

జలధిలో  జలం దాహం తీర్చడానికి కాదు
రేపటి మేఘానికి జన్మభూమి అవుతుంది.

ఒక్కో చినుకు ఒక్కో అక్షరాన్ని తలపిస్తుంది
ఒక్కో అల ఒక్కో పదరూపాన్ని విసరుతుంది
మనిషిలో నిద్రించే మేఘం,
నిశ్శబ్దం నుండి సశబ్దమై కదలుతుంది
ప్రతిదిశ రసహృదయంతో వర్షిస్తుంది
అవును! సందేశం, స్వప్నాన్ని వాస్తవం చేస్తుంది
అవును! సంసేచనం, శబ్ద భూమికి సృజనకళ తెస్తుంది.

# 13. బోను నుండి

మనిషిలో పులి సమయంకై వేచి ఉంది
బయట పడీ! క్షణాల్ని శాసించాలనీ, కోరిక!
మనుషుల్ని గాయపరుస్తుంది, హతమారుస్తుంది
మారణచణ సాధనమవుతుంది.

బోనులోకి తరలింపబడుతుంది
గుహలో చేరి విశ్రమిస్తుంది!
మనిషిలో సంస్కార కీర్తి శిఖరాల్ని
ప్రశ్నించే సందర్భాన్ని సృష్టిస్తుంది.

స్వచ్ఛ స్ఫాటిక రూపం మానవతాచేతన
చీకటి వశమవుతుంది.
మనోజ్ఞమైన హృదయపుష్పం శీర్ణమవుతుంది
మనోనిలయం అగాధ రహస్యంగానే మిగులుతుంది.

పాలకులు శాసనక్రీడలో కాలం గడిపేరు
మేధావులు రంగుల ఊహల్లో మునిగి తేలేరు
సమాజం ఉపేక్షా చిత్రంగా నిలిచేను
ఎక్కడో ఎగసిన స్వరం నిశ్శబ్దంలోకి జారేను
ఏమీ జరగనట్లే అంతా
అమాయక గగనంలా మిగిలిపోతుంది.

మండే ఎండలో ఎండిన నేలపై
జారిన వాన చినుకులా
బికారి చాచిన చేతిలో
పడిన చిన్ని నాణెంలా
చీకటిగదిలో బెజ్జం నుండి
దూకిన రవి కిరణంలా
అంతరంగ స్పృహ ఎక్కడో మిగిలే ఉంది!
కంటికి కన్పించని కథతో
నేలలో బీజంలా, దాగి.

యుగాల సంస్కార చరిత్రతో మానవీయం
ఇంకా ఒక్కొక్కరిలో
శిశుదశలో పారాడుతూంది.
దీన్ని తీసుకోడానికి పూలచేతులు కావాలి
దీన్ని హత్తుకోడానికి గంధ హృదయం కావాలి.

దారితప్పిన మనిషికై నిరీక్షణ
మాయమయిన వివేకంకై అన్వేషణ
అడ్డుగా ఉన్న కంచెల్ని గోడల్ని తొలగించే
రోజుకోసం ఆలోచన!

సంస్కారకళతో పెరిగే మనిషిలో వెనకనే
హత్యతో నేరంతో చిహ్నితరూపం!
చట్టానికి పాఠం చెబుతుంది.
న్యాయానికి గాజు కళ్ళు అమరుస్తుంది.
నలుపు తెలుపు దుస్తుల్ని మార్చేస్తూ
దేనితోనూ పోల్చలేని విచిత్ర వేషం ధరిస్తుంది.

మనిషిలో పులి సమయంకై వేచి ఉంది
సమాజాన్ని ఆశ్చర్యశలాకల బోనులో బంధిస్తుంది.

## 14. ఊరు ఎక్కడికీ పోదు

ఊరు ఎక్కడికీ పోదు, పోలేదు
ఊరుకు రెక్కల్లేవు, కాళ్ళు లేవు
స్మృతి రెక్కలపై ఆవాసం
జీవితానికి మూలమై నిలిచేను మనిషిలో.

అనుభవ సేచనతో
ఊరు ఎదిగి చెట్టును తలపిస్తుంది
ఆలోచనా కిరణంతో
ఊరు సరికొత్త జగాన్ని చూపుతుంది
ఎప్పటికపుడు మనస్సు
కడిగిన ముత్యంలా తళతళలాడుతుంది.

సరసిలో పద్మంలా కాలంలో తేలే ఊరు
మనిషిని వీడదు; ఎక్కడికీ పోదు, పోలేదు.

కొన్ని సమయాలు
మబ్బుల్లో మరుగున పడిపోవచ్చు
కొన్ని సమయాలు
అన్వేషణలో గడచి పోవచ్చు.

తొలికిరణంతో ఊరు
పల్లకీలో పెళ్ళికూతురవుతుంది
పగలు వెలుగు ధగధగలో
సరస్సులో అరుణ పద్మమవుతుంది

రాత్రి తీగె ఆకుల్లో
ముడుచుకున్న మొగ్గవుతుంది.

పక్షుల కలవరంతో ఊరు మేల్కొంటుంది
నాగలి శబ్దంతో చలనశక్తి పొందుతుంది
మట్టితో మనిషి బంధాన్ని ప్రతిపనిలో రూపిస్తుంది.

ఇక్కడ జీవనగతిలో ధ్వని
మనిషితో ప్రకృతితతో అనుబంధాన్ని వినిపిస్తుంది
సరస్సులో మంచుగడ్డలా
నిశ్శబ్దంతో శబ్దం తేలిపోతుంది.

ప్రతి ప్రాణికీ ముఖ్యంగా మనిషికీ
సూర్యునితో చంద్రునితో మేఘంతోనే పని!

అడవుల్లో ఎడారుల్లో మైదానాల్లో నిలయాలు
మానవ సంస్కృతిలో వివిధ సోపానాలు
ఇసుక మేడల్నీ గాలిమేడల్నీ పేకమేడల్నీ దాటి
ఊరులో స్థిరసమాజ రూపాన్ని పొందాయి.

తేజంతో హ్లాదంతో రసహృదితో
సూర్యుడూ చంద్రుడూ మేఘమూ
ప్రతిదశలో జీవితాన్ని జీవవంతం చేసేను.

సూర్యునికీ చంద్రునికీ వీడని గ్రహణంతో
మానవతను చీకటి క్రమ్మేస్తుంది
కదలే మేఘం గాలిదెబ్బకు చెదరీ
ప్రతి హృదినీ శూన్యంతో నింపేస్తుంది.
రాగమూ వీరమూ జీవిత శిఖరాలై
సమాజ శక్తితో చైతన్యం విరిసేను.

ఎడారీ మైదానం అడవీ
మనిషిలో శక్తిని పరీక్షకు నిలుపుతాయి.
పరీక్షకు నిలిచిన రూపం ఊరు,
మనిషిలో మూలమై వికాస బీజమవుతూంది.

అడవి ఎడారీ మైదానం నుండి చైతన్యం
నదియై గట్టును దాటే యత్నం చేస్తూంది
వరదై గట్టును తీసేసే కల కంటూంది
పోరాటపు వరదల్లో.

కల నిజమయ్యే ఆశ పడుతూంది.
కల్లోలానికీ దారితీసే ప్రమాదమూ ఉంది.

రాగం వీరం రెండూ జీవితాన్ని శాసిస్తాయి
చరిత్ర నిర్మితిలో పాత్రను పోషిస్తాయి.

అలల్ని హద్దులో నిలిపే బాధ్యత గట్టుది
మహానది ఆయువు పెంచే పని ప్రవాహానిదే!

ప్రవాహానికి మరణం లేదు
ఊరునుండి ఊరుకు పొలిమేరలు చెరపి ప్రయాణం!
హరిత జీవిత గతితో చిరంజీవమై
సమాజానికి తెగని శ్వాస సూత్రమై.

# 15. చిరంజీవమై

రోజు వెంట మరో రోజు! మరో రోజు!
అనుభవ దృశ్యాలతో! అదృశ్యమవుతుంది.

అద్దంలో బింబంలా స్మృతిశాలలో
పురాకృతి ప్రపంచం; పునారూప సమయం!

చేతిలో పుష్పమో, కరవాలమో
చేతిలో భిక్షాపాత్రో, మనీ పర్సో
మనిషిలో మరో మనిషి! మరో మనిషి!
విశాల ధరణి పయి వికాస స్పర్శతో.

మనః పథంలో ; యాత్రా గణం!
మానవతా గంధంకై అన్వేషణ!

రోజు వెంట మరో రోజు! మరో రోజు!
అలలుగా, హృదిలో నదియై
కదలే కాలంతో,
రోజు వెంట మరో రోజు! మరో రోజు!
వెనక్కి మరలడమంటూ ఎరగవు!

ఏ క్షణమూ శూన్యం కాదు
ఏ పదమూ వ్యర్థం కాదు.

మనిషిలో మనిషి! మరో మనిషితో యాత్రలో
మునుముందుకు పోవడమే! తెలుసు.

ఒక్కోరోజు మందగిస్తుంది
కృశించిన ప్రవాహగతిలా
నడక తడబడుతుంది,
తేలిన రాళ్ళపై చలనంతో.

రోజువెంట రోజు, మరో రోజు
మనిషితో మనిషి యాత్రా పథంలో,
చిరంజీవమై, నిరంతరం గమనంతో
హరితభూమిపై, జీవన దృశ్యాలతో!
విజయకీర్తికై, జీవనరణాలతో!

## 16. మానవీయ సౌందర్యం

రోజు రోజుకీ ముఖం ఎర్రబడి పోతూంది
ఒక సమయం అరుణమై ఆగ్రహంతో సూర్యుణ్ణి
మ్రింగే కోరికలో ఉత్సాహం! మరీ మరీ!
ఇది చూచే ప్రజలకు భయం ఎందుకనా?
ముఖం ఎక్కడ మాడి పోతుందోననీ!

రోజు రోజుకీ మస్తిష్కం భ్రమిస్తూ పోతుంది
ఒక సమయం ఇసుర్రాయిలా
దీపావళి సుదర్శన చక్రంలా
తిరిగే కోరికలో ఉద్వేగం! మరీ మరీ!
ఇది చూచే ప్రజకు భయం ఎందుకనా?
ఉన్న కాస్త వివేకం ఎక్కడ నలిగిపోతుందోననీ!

రోజు రోజుకీ కళ్ళు తిరుగుతూ పోతాయి
ఒక సమయం బెలూన్‌లవలె గుండ్రంగా
తేలే కోరికలో ఉల్లాసం! మరీ మరీ!
భ్రమణంలో సోలి ఎక్కడ పడి పోయేనోననీ!

రోజు రోజుకీ బుజాలు ఎగసిపోతాయి
ఒక సమయం అలల్లా ఎగసి పై పై గగనాన్ని
తాకే కోరికలో ఉద్రేకం! మరీ మరీ!
ఇది చూచే ప్రజకు భయం ఎందుకనా?
బుజాల బాధ్యత ఎక్కడ మాయమవుతుందోననీ!

రోజు రోజుకీ చేతులు గట్టిపడుతూ పోతాయి
ఒక సమయం ఆయుధ రూపాన్ని
పొందే కోరికతో ఆవేగం! మరీ మరీ!
ఇది చూచే ప్రజకు భయం ఎందుకనా?
ఎవరిపై చకితంగా దాడి జరుగుతుందోననీ!

రోజు రోజుకీ కాళ్ళు నిలిచి నిలిచీ
ఒక సమయం చెట్టు వ్రేళ్ళులా స్థిరమై
పోయే కోరికలో అభిలాష! మరీ మరీ!
ఇది చూచే ప్రజకు భయం ఎందుకనా?
మనిషిలో గమ్యం లేకుండా పోతుందనీ!

రోజు రోజుకీ పాట గళం నుండి అలయై
ఒక సమయం సముద్రమై, కదలీ
ఊగే కోరికలో ఆరాటం! మరీ మరీ!
ఇది చూచే ప్రజకు భయం ఎందుకనా?
అల సర్పమై, ఉరియై మెడకు చుట్టుకునేననీ!

రోజు రోజుకీ సన్మానాల పరంపరలో
పగలూ రాత్రీ రంగుల శాలువాలతో
పీఠంపై కోరికలో ఉబలాటం మరీ మరీ!
ఇది చూచే ప్రజకు భయం ఎందుకనా?
శాలువాల గుట్టక్రింద రూపం అణగిపోతుందనీ!

నటనో వాస్తవమో కల్పనో మానవీయ సౌందర్యంతో
ఎంత గొప్ప కళా దృశ్యమయినా
విపరీత మనో దారిద్ర్యంలో
మానవీయ సౌభాగ్యంపై చింతన
ఇప్పటికీ, ఎప్పటికీ బాధ్యత ప్రజదే!

## 17. అంతరంగ జగం

మనోభూమిపై అయనం కనిపించని దృశ్యం
అంతరంగ జగం వేరు. మనుషులందరూ ఒకటే,
ఆకర్షక ప్రపంచంలో వాస్తవ శక్తుల మధ్య
అంతరంగం మాత్రం అందని అనుభవ విషయం.

వర్తమానం, తెరచిన తలుపులా స్వాగతమిస్తుంది
వెనుకదారి తలుపులా గతం వీడ్కోలు తెలుపుతుంది.

జీవితం భద్రపరచే అలంకార మణి కాదు.
అనుక్షణం రంగులతో ధూళితో మారే చిత్రరూపం.
ఇదో చెట్టు కాదు, శిల్పం కాదు, గుదిబండ కాదు.
గతిలో ఆసక్తిని నిలిపే మనః ప్రవర్తక ప్రపంచం.

తలపై ఆకాశం, పెరిగే సీమల్ని సూచిస్తుంది.
కాళ్ళక్రింద అవని, ఎదురయ్యే పరిమితుల్ని ప్రకటిస్తుంది
సూర్యబింబమెంత శ్రేయమయినా, నికేతనమవదు
చంద్రబింబమెంత ప్రేయమయినా, చేతులకందదు.

నిద్రలో కళ్ళు మొగ్గలవుతాయి
స్వప్నం చంద్రబింబమవుతుంది
బరువు తొలగి గాలికెగిరే చిత్రాల్లా
మనసులో పురా స్మృతుల దృశ్యాలు!

లోపలి శక్తితో అదృశ్యమాన అమృతంకై
అందని అవకాశంలోనూ కృషి మొదలవుతుంది.
అది విహగం కావచ్చు.
అది సర్పం కావచ్చు.

ఆకాశమూ, అవని
రెండు రెక్కలతో విశ్వవిహంగం
మనశ్శాఖపై వాలుతుంది
అంతరంగంలో అమృతంకై ఆలోచన చేస్తుంది.

పక్షి మనిషిలో పరిమితుల్ని సూచిస్తుంది
దీన్ని జయించే యత్నం మొదలవుతుంది,
ఎగిరే పతంగం నుండి విమానం దాకా.

పాము మనిషిలో కుటిలగతిని రూపిస్తుంది.
దీన్ని సరిచేసే యత్నం మొదలవుతుంది,
కదలే ప్రవాహం నుండి మెరుపుతీగె దాకా

తలుపు తెరిస్తే శిశువుకు
ఇంట్లో నుండి బయటపడాలనే!
చల్లబడితే మబ్బుకు
జలధినుండి పై కెగసిపోవాలనే!
క్రింద శిశువూ, పైన మబ్బూ,
మనిషిలో మరచిన హ్లాదాన్నీ ఆర్ద్రతనూ జ్ఞాపకం చేసేను.

వీధి మూల ప్రసంగంలో పురాపాత్రల ప్రవేశం
వ్యక్తుల సైజుల్లో పాత్రల కత్తిరింపులూ
దారి మధ్యలో ఎదురయ్యే జంతువుల వేషాలూ
బాహ్యజగత్తులో రెండో జీవిత పంక్తిని చూపేను.

స్వగతంలో పాత్ర మరో వేషం వేస్తుంది.
పాత్రలో మరోపాత్ర చొచ్చుకొని పోతుంది.

గతిలో మతిలో రుచిలో స్మృతిలో
స్పందించే అంతరంగ స్వరం! వినే,
ఓపిక తీరిక అభిమతి ఎక్కడుంది?

అంతరంగ జగం! అందని గగన సదృశం?
అమృత కుంభమై మనస్విని ఆకర్షిస్తుంది.
మనిషిలో వివేకం జిగీషకు వశమవుతుంది.

# 18. రణయానం

**1**

**రణయానంలో**
మనిషి ప్రాణదానం కన్నా
ప్రాణ హరణ కాండదే పైచేయి.
మనో వనిలో తిరిగే పులి
వేటకాని బలితో అంతం కాదు.

శృంఖల తొలగిన అంతరంగం
మనిషిలో స్వేచ్ఛకు పర్యాయపదం.
ఎదలో నిలిచిన కొండకు రెక్కలు వస్తాయి
గతిలో ఝరి ఊహను పరుగెత్తిస్తుంది.

మతమో రాజకీయమో మరేదో
ఉద్రేక శిఖరాలపై దూకే ఉగ్రవాదం,
మూల మూలనుండి అదృశ్య హస్తాలతో
జీవన భూమికను తలక్రిందులు చేస్తుంది.

ఇది నిజంగా ప్రత్యక్ష రణం కాదు
రహస్య శిఖి చిమ్మే మారణ కాండ!

నేలపై అశ్వంలా, నింగిలో విహగంలా
శక్తికి స్థానమైన మానవ రూపానికి
"ఆత్మాహుతి"తో ఎపు డే దిశ పట్టేదీ తెలీదు.

ఇది ఎప్పటికీ అంతం కాని పోరాటం
విరుద్ధ శక్తుల మధ్య బీభత్స ప్రయోగం,
క్షణాల్ని ఇతరేతర కోణాల్లో నడిపించేను.

పరివర్తన కోరే సమాజం, ఏ దశలోనూ
శిల్పంలా ఒకచోట నిలిచిపోదు,
ఊయెలలా ఒక విధంగానూ కదలదు.

శిథిలాల్లో తలెత్తిన పూలమొక్క
దీవెనకై పైకెత్తిన అరచేయిలా ఉంది.

బాధ, అశ్రు రూపంలో జారిపోతుంది
ప్రేమ, హ్లాద భావంతో అధిరోహిస్తుంది.

గడచిన క్రూర చరిత్ర చిహ్నాలు
ప్రదర్శనలో భద్రంగా ఉపకరిస్తాయి
వర్తమాన జీవితం కదలుతూంది
ప్రజాస్వామ్య చేతనలో భవిష్యత్తుకై.

2

అవని నింగి మబ్బు పక్షి పూవు నది
ఒకేటిమిటి, సమస్త వస్తుజాలం,
పాత్రలై, అన్నిటితో మనిషి సంభాషణ!
కల్పనలోనూ జీవితం వాస్తవ ముద్రను పొందేను.

కత్తి కొడవలి బాంబు గన్ క్షిపణి
ఆయుధాలై అన్నిటితో మనిషి చర్య!
వాస్తవంలోనూ జీవితం! కల్పన నద్దుకునేను.

ఒకవైపునుండి మానవ బాంబుతో
ఉగ్రవాద చండ ప్రవేశం!
మరోవైపునుండి బాంబింగ్‌తో
ప్రతిచర్యకు రాజ్యం సిద్ధం!
ఎవరి కారణాలు వారివై
ఎరి పరిమితులు వారికై,
ఎవరి దృష్టిపథం వారికి అందం, ప్రయోజనం.
సామాన్యుని జీవనం మాత్రం బీభత్స సముద్రం.

మానవీయాన్ని ముక్కలు చేసే ఉద్వేగం
మానవ సంపదను ధూళిలో కలిపే ఉద్రేకం.

ఆర్ద్రత కనుమరుగై బ్రతుకులో
నేలపై పచ్చదనంకై ప్లాస్టిక్ వనికై ఆలోచన!
ఘర్షణలో బయటపడిన విలువలతో

మనిషి కృషితో సమాజ యానం,
విధ్వంసం నుండి నిర్మాణానికి
అశాంతి నుండి శాంతికీ

విలయం నుండి సృజనకూ
చరిత్రలో సోపానాలు! దశలుగా.

మనిషితో మనిషి రాగబంధం
బ్రతుకులో చెరగని అనుభవ రూపం.
జీవధారలో తేలుతూ వెచ్చగా
ఊహధునిలో సాగుతూ పాటలా

దీన్ని గుర్తించే అంతరంగంకై నిరీక్షణ!
దీన్ని బయటికి తెచ్చే వివేకంకై అన్వేషణ!

## 19. సహయానం

1

అరణ్యంలో అనలం చెలరేగి విచక్షణ కోల్పోతే
తక్షణం ఆర్పే కర్తవ్యం! మనిషిది! మనిషిదే!
సమాజంలో అగ్ని ఉద్భవించకుండా
నిలిపే శక్తి మనిషికే ఉంది! త్యాగంతో.

ప్రేమలో వికసిస్తుంది పుష్పం
క్రోధంలో చెలరేగేను అనలం,
ఘర్షణలో సమాజం సహగతికై
శాంతి సహనం ఎప్పటికీ శ్రేయమే!

దీని వెనుకనున్న అదృశ్య హస్త రేఖల్లో
వాస్తవ రహస్యం తెలీడమూ అవసరం.

బాధలో బంధింపబడిన ఆలోచనల్ని
చర్యతో నిలిచిపోయిన స్పందనల్ని

శబ్దంతో అనురణించే స్వరాల్ని
పట్టుకునే సానుభూతి మతి కావాలి.

అక్షరాలు తెలిసినంత మాత్రాన
శబ్దం పరిచయమైనంత మాత్రాన
దూరం దూరం విస్తరించే అర్థంకై
మనో భూమిపై విశాల దృష్టి ముఖ్యం.

అవనికీ స్వర్గానికీ మధ్య ఘర్షణలో
రెండూ కలిసే ఆశాస్థానం ఒకటే.
అవనికీ నరకానికీ మధ్య పోరాటంలో
రెండూ కలిసే బాధా స్థానం ఒకటే.

రణయానంలో
మనసుకోరే స్వప్నం వేరు
సహయానంలో
మనిషి చేరే గమ్యం వేరు.

2

విమానం విహగాన్ని అనుకరిస్తుంది
విహగం విమానంతో పోటీపడదు
గెలుపు ఎప్పటికీ, ప్రాణిదీ, చేతనదీ
సామ్యంలో ఉన్న నిజం, పరిమిత వాస్తవమే.

నిద్రలో స్వప్నం
చంద్ర శకలం లాంటిది
ఎగిరే పక్షిలాంటిది
అందదు కాని, అందనున్నట్లు అనిపిస్తుంది.

ఎత్తునున్న కొమ్మ నుండి పూలు త్రెంచడానికి
అందని కాళ్ళూ చేతులూ వెనకడతాయి.
పూలు రాలి గాలికి ఒడిలో పడాలనే
ఎవరైనా కోసి బాగ్‌లో వేయాలనే!

దిశా బాహువుల్లో కరగిపోయే మేఘం
ఉదారపథాన రసగీతం సరిస్తుంది
జీవన యానంలో వస్తువు ఆకర్షణలో
అందానికీ ఆనందానికీ మితం లేదు.

కలలోనో ఆదర్శంలోనో స్వర్గఖండం కన్నా
మాటల మూటతో ధనం కన్నా భోగం కన్నా
నిజానుభవ రుచిలో పేద ఎదకు
చేతిలో నాణెం! పట్టెడు అన్నం! అవసరం.

శ్రమ జీవన పథంలో
వ్యాపారం బానిసను చేస్తుంది.
శ్రమ జీవన జగంలో
త్యాగం ప్రభుతను నిలుపుతుంది.

అంధకారంలోనూ వివేకం
దారిలో గోరంత దీపంలా పనిచేస్తుంది.
వెలుగులోనూ క్రోధం
ముఖాన పిడికెడు చీకటి చల్లుతుంది.

ఏమయినా, మనిషి! ఏ సమయంలోనూ
చెట్టులా ఒకచోట నిలిచి పోవాలనీ
వాగులా జలజల జారిపోవాలనీ
శిలయై అచేతనతో శిల్పంగానూ
బ్రతికే సంకల్ప ఫలకం కోరడు!

నేలపై మొదటి అడుగుతో
స్వేచ్ఛకు అవకాశం జారిపడుతుంది
మృత్యుజయం కోరే మనిషి
స్వేచ్ఛకు బహుమానంగా,
చేతిలో ఆయుధంతో మృత్యుస్థానమయ్యేను
శరీరం ఆయుధమై మృత్యురూపమయ్యేను.

సమాజ సౌభాగ్యానికీ సౌహార్దానికీ
సహయానంలో జన స్వామ్య చేతన
ఒకటే! నవయుగానికి సంకేతం!

## 20. ఆగమనం

శరీర మవనిగా మస్తిష్కం గగనంగా
మనస్సు చంద్రుడుగా అంతరంగం రవిగా
ఈ శతాబ్ది కోరుతూంది మానవతా స్పందనతో
నవయుగ మానవ విరాట్ రూపం!

ఒక బుజాన శిశువు
మరో బుజాన మూటతో
సగభాగం స్త్రీతో కాలిబాట దృశ్యం!
జీవన వ్యూహంలో మరో యానసాధనం!

బ్రతుకులో ప్రపంచం బయటికి విసరేది కాదు
బరువును దించేసే ఏ చోటూ లేదు.

స్మృతి తలుపులు తెరిస్తే ప్రత్యక్షం
ఒక తీరని బాధతో మాయని గాయం.

రెండో బండ గుండెతో
మూడో గాజు కన్నుతో
మనిషిలో ! నీడలు ! క్రీనీడలతో
బహుపాత్రల కోలాహలం!

గోడకో కొక్కానికో తగిలించే
శిల్పం కాదు, మానవతా మనోజ్ఞ రూపం!

విధ్వంసం వెనువెంట నిర్మాణంలో
మనిషి ప్రయత్నం! నాగరక చిహ్నం!

ఈ శతాబ్ది కోరుతూంది మానవతా స్పందనతో
నవయుగ సహజీవన ప్రపంచ విజయం!

స్వేచ్ఛా కవిత్వం
రెండవ భాగం - 3

# ఎప్పటికీ కొత్తే

మాదిరాజు రంగారావు

2005
రసధుని సాహితీ పరిషత్తు
శాంతినగర్, హైదరాబాద్ - 500 028

# అంకితం

విద్యా పరిశోధనా మనస్విని

చిరంజీవిని డా॥ మాదిరాజు చరిత కు

**Pittsburgh USA**

ఆశీస్సులతో

# ఎప్పటికీ కొత్తే

మనిషి గురించి మనుషుల సంబంధాల అనుబంధాల గురించి మనోరూపంతో వర్తమానంపై దృష్టితో భవిష్యత్తు దర్శనంతో వెలువడిన కృతి "ఎప్పటికీ కొత్తే" ఇది జీవితానికీ కవిత్వానికీ వర్తించే విషయం.

ఇందులో మానవీయం భావసూత్రంగా ఉంది. విశ్వహృదయం సమాజ దర్శనంగా ఉంది. భావసాంద్రత, అభివ్యక్తిలో సంక్షిప్తత, మనస్త్వ కోణంలో వస్తు పరిచయం కన్పిస్తాయి. ఈ కృతి రెండు భాగాలుగా ఉంది. 1. సునామి కవితలు – సునామీల ప్రభావంతో ఏర్పడిన బీభత్స దృశ్యాల చిత్రం; 2. మనోమ్యూజియం – మనో రూపంపై దృష్టితో సామాజికాంశాల చిత్రణం. మొత్తం మీద భావరూపాలు (Images) ప్రతీకలు (Symbols) మనస్తత్వ (Psychological) పరంగా మనో భూమిక పాత్ర వివేచనలో విశేషంగా నిలుస్తాయి. ఈ విధంగా ప్రత్యేక సంవిధానాన్ని పొందింది.

స్వేచ్ఛా కవిత్వంలో సామాజిక తాత్త్విక మనస్తత్వ పరమైన అంశాలతో సమాకలితమైన మార్గంగా సాహిత్య వివేచనకందుతుంది. ఒక విధంగా అభివ్యక్తితో ఇపుడున్న మార్గాలకు భిన్నంగా దీన్ని గమనించవచ్చు.

"మానవీయం విశ్వహృదయం అంతరంగ భూమికలో వాస్తవం

యుగ యుగం తర తరం ఏ రోజూ ఎప్పటికీ కొత్తే". ఇదీ కవిత్వానికీ అన్వయిస్తుంది. ఈ మాటలు స్థూలంగా ఈ కవిత్వ సమాలోచన కుపకరిస్తాయనే నా అభిప్రాయం. ఏదైనా కాలంపై సహృదయుల అభిమానానికీ ప్రశంసలకూ పాత్రమైందే నిలుస్తుంది. ఇది ప్రామాణికమైన వివేచనతో స్థిరపడుతుంది. ఇప్పటి వరకు వచ్చిన కృతులన్నీ సాహిత్యంలో ఈ విధంగానే నిలచాయన్నది వాస్తవం. ఇది వర్తమాన కవిత్వానికీ వర్తిస్తుంది.

**–మాదిరాజు రంగారావు**

సూచిక పుట

**I. సునామి కవితలు**

1. విలయ చిత్రం -------------- 01
2. కన్నీటి చిత్రం -------------- 03
3. రాళ్ళలా మనుషులు -------------- 04
4. తెరచిన విషాద పుటలు -------------- 05
5. దోషం లేని శిక్షల -------------- 05
6. అవనితో అనుబంధం -------------- 06

**II. మనో మ్యూజియం**

7. మ్యూజియంలో -------------- 08
8. స్మృతి బంధం -------------- 09
9. మనిషి కళ్ళు ఏమైనట్లు? -------------- 10
10. పచ్చని నిజం -------------- 11
11. అభిషేకం -------------- 13
12. మనిషికి పాట -------------- 14
13. పగలూ రాత్రీ ఒకటే -------------- 15
14. నిశ్శబ్దయానం -------------- 17
15. అరణ్యం నుండి -------------- 21
16. జిజీవిష -------------- 23
17. కలలో అవకాశం -------------- 25
18. లోపలి మనిషితోనే -------------- 26
19. ఎవరి అవసరం వారిది -------------- 27
20. ఎవరి పనిలో వారు -------------- 28
21. అస్తమయం లేని -------------- 29
22. ప్రజలో మనిషి -------------- 30
23. విశ్వహృదయం -------------- 31
24. ఎప్పటికీ కొత్తే -------------- 33
25. సృజనవాస్తవం -------------- 35

# సునామి కవిత

## 1. విలయ చిత్రం

జలధిలో భూమి కంపించింది
సునామీలు ఎగసాయి నిలువునా
నిశ్శబ్దంగా పయనించి పయనించి
రింఖలపై ఎగిరే అశ్వాల్లా తీరాన దూకాయి.
పడగలెత్తిన సర్పాల్లా తీరం దాటాయి.

నిర్దయంగా చకితంగా సముద్రం
విలయఘోష వినిపిస్తూంది.
మృత్యువు వల అయింది, ఉరి అయింది
ప్రకృతిలో మాతృమూర్తి మాయమయింది.

ఎవరినీ కేకేయడానికీ ఆఖరికి ఏడ్వడానికీ
ఎవరికీ సమయం లేదు.
మనిషి నుండి మనిషి విడి పోయి
ఊళ్ళకు ఊళ్ళు బావురు మన్నాయి.

తీరాన పడగలతో దూకిన సముద్రం
ఉదగ్ర చలన రవంతో అవనిపై
మృత్యు హస్తాలు విసరుతూంది
నాల్కలు చాచి భూమిని మ్రింగజూస్తుంది
సర్వం సహ సహనాన్ని పరీక్షకు నిలుపుతూంది.

గంభీరంగా కదలే జలధిలో
మృత్యు రహస్యం బద్ధలైంది
దూకే అలలు తాళ్ళవలె
మనిషి శక్తిని బంధిస్తున్నాయి

భీషణ తాడనంతో శబ్ద పరంపర
విలయ భూతమై మ్రోగుతూంది.
మృత్యు పటమై నీరు భూమిని కప్పేస్తూంది
మారణ కాండతో అవని సమాధి సదృశమవుతూంది
మనిషిలో శ్రమ శక్తిని పరిహసిస్తూంది
మనిషి ఉనికినే ప్రమాదంలో పడేయజూస్తూంది.

చెదరిన రూపంతో చినిగిన వాలకంతో
పచ్చని చెట్టు బికారి స్థితికి చేరింది
ఇపుడు విషాద హృదయం మొకటే
నేల నుండి నింగి దాక నిలిచి నట్లుంది.

ప్రాణుల నుండి మనుషుల నుండి ఒకటైన
నిస్సహాయ హాహాకార ధ్వనులతో
అన్ని వాయిద్యాలు ఒకేమారు
శబ్దించే అపశ్రుతుల ప్రదర్శనలా ఉంది.

పట్టపగలు సూర్యుణ్ణి చీల్చి
ముక్కలు చేసి విసరినట్లుంది
ఇది జల ఖడ్గ ప్రహారం
ఇది జల ఫిరంగి అఘాతం
ఇది జల సాయక ప్రయోగం
ఇది జల మారణ దృశ్యం.

తీరాన కూచొని కబుర్లు చెప్పుకొనే
బంధు గణం మాయమయింది
వేటాడిన చేపల్ని పంచుకొనే
స్నేహ బంధం అలల్లో దాటి పోయింది.

ఇసుకలో ఆడుకొనే పిల్లల బ్రతుకులు
కలల బ్యాగ్‌లతో అలల్లో తరలిపోయాయి
పాలనా యంత్రం నివ్వెరలో స్తంభించింది
భయంతో జనం ఎవరి దారిన వారు

తన్నిన రబ్బరు బంతుల్లా పరుగెత్తేరు.
మనుషులతో ఇళ్ళు ఆనవాళ్ళులేకుండా పోయాయి
ముళ్ళపొదలు బంధువులై కొందరిని
జల గండం నుండి బయట పడేసాయి.

ఆగ్రహంతో ఊగిపోయే
జలధి తీరాన మిగిలే దేముంది?
బీభత్సమైన జన కథా రూపం
పుటలు చినిగి రెపరెపలాడే పుస్తకంలా ఉంది.

ప్రళయ ఘోష రణిస్తూంది.
విలయ భాష వినిపిస్తూంది
హృదయం సుళ్ళు తిరుగుతూంది
మానవ శక్తిని నీటిలో ముంచేసీ.

## 2. కన్నీటి చిత్రం

జలధికి నిలకడ ఎక్కడిది?
రాళ్ళతో అలలు కబుర్లు చెబుతాయి
గిరులతో అలలు సంభాషిస్తాయి.
హ్లాద హంసలై అలరించే
అలలు చెదరిపోయి
క్రోధ హరీంద్రాలై ఎగసివచ్చే
సునామీలు తీరాన్ని గాయపరచాయి.
సముద్ర మొక సుందర స్వప్న మనుకుంటే
ప్రజల బ్రతుకులు భయచక్రంలో భ్రమిస్తూ
ఇపుడు తెలిసింది దాని భీకర వాస్తవం.
అర్ద్రతకు ఆలవాలమైన జలధి
శత్రుతకు స్థానమయింది.
అలలు ఎగిరి శీకర శస్త్రాల్ని విసరుతున్నాయి
అలలు తొలగి కన్నీటి గుర్తుల్ని మిగులుస్తున్నాయి.
తీరాన అలల అంచులో

కేరింతలాడే పిల్లల బ్రతుకు పతంగాలు
ఊగే అలలు కొమ్మల్లో చిక్కి
ఆయువు తెగి ఎగిరి పోయాయి
సునామీలు వదలిన ముద్రలో
కన్నీటి కోలాహల చిత్రం
మనిషిశక్తి పరిమితుల్ని గీసి మరీ చూపుతూంది.

## 3. రాళ్ళలా మనుషులు

నిద్రలేని రాత్రిలా వెలుగారిన జ్యోతిలా
తెగిపోయిన కోర్కెతో పూర్తికాని కామనతో
జలధిపై బ్రతికే బ్రతుకులు,
చెదరి మునిగిపోయాయి.
హెచ్చరికలేని సునామీలు
విలయంతో ఊగిపోయి
బాధనుండి శోకానికి
మనిషి పయనం ముగిసింది.
బాధలో నలిగి చెదరి పయనించడం
మనిషి జయంపై ఆశతోనే.

జలధి ఎంత ప్రకృతి సుందర మనుకున్నామో
సునామీ అంత వికృతం చేసి వదిలింది.

విషమ క్షణాలపై నిల్చి
ఏ బంధువునో మిత్రుణ్ణో పిలిస్తే
ఆకాశం బదులు పలుకుతూంది.
ఏ పలుకూ లేకుండా
పడి ఉన్న మనుషుల చుట్టూ
ఒకే విలయ ఘోష!
విలయ ఘోష మధ్యలో
రాళ్ళలా కదలిక లేని మనుషులు.

## 4. తెరచిన విషాద పుటలు

ఈ రోజు లేచిన అలలతో
జీవిత మెక్కడి దక్కడ చెదరిపోయింది.
పూల గుత్తుల చేతులతో ఎదురయ్యే సముద్రం
పదును కత్తులతో విజృంభించింది.
తీరిగ్గా పూలచెండ్ల చేతులతో ఆడేది
విపత్తులో ముంచే అలలతో ఎగసింది.

లోపల ప్రకంపనంతో జలధి
తీరాన కఠోర వర్తనంతో ఎగసి
కళ్ళముందు జీవితాన్ని
ఇసుక మేడల్లా కూల్చింది
కాళ్ళ క్రింద నేల మునిగి
అందని అఖాత మయింది.

కొన్ని క్షణాల సముద్ర కోపం
సమాజాన్ని ఇనుప చేతులతో
చిత్ర వధ చేసి నట్లుంది
చరిత్రలో విషాద పుటల్ని తెరచింది
మనిషిలో గాయాల స్మృతుల్ని నింపింది.

## 5. దోషంలేని శిక్ష

పీడనలో అశాంతి సముద్రం
ద్వేషంలో కలహా సముద్రం
చర్యకు ప్రతిచర్యతో జీవితం
నిర్విరామ సంగ్రామ సముద్రం!

ఇపుడే దోషంలేని సమూహానికి శిక్ష!
హేతువు కందని మృత్యు ముద్రతో కాలం!
మనిషి వెంట ఆయుధాలు

అడవి మృగాల్ని మేల్కొల్పాయి
సమాజాన్ని నిప్పుల్లోకి తోసాయి!
జలధిలో అలల ఆయుధ ప్రదర్శనం
కొత్తకాదు, ఉంది పెను తుపానులో
సునామి ఆయుధం మాత్రం కొత్తది!

ఏ రోజుతోనూ అధ్యాయం పూర్తి కాదు
ఎంతో కొంత మిగిలే ఉంటుంది
ఈనాడు సునామితో పేజి నిండడమే కాదు
ఒక బీభత్స మహాగ్రంథమే అయింది.

ఆర్తిలో దీనుల జీవితం
ఉదార హృదయంకై ఎదురు చూస్తుంది
మృత్యువు మాటతో కల్లోల జలధి
మానవతను జ్ఞాపకం చేస్తుంది!

## 6. అవనితో అనుబంధం

క్షణాలు కదలుతున్నాయి
ఊపిరి బిగిసిన విధంగా
భయాక్రాంత జీవితం
గాయంతో మండుతూంది.

కన్నీటి చుక్కలతో కళ్ళు
నక్షత్రాల్ని నిలుపుకున్నట్లుంది
బ్రతికి బయటపడిన ప్రాణులకై
వెదకడం! అభాగ్యమైన అనుభవం.

చిన్ని చిన్ని కోర్కెలతో
చిన్ని చిన్ని నివాసాలతో
తరాల బ్రతుకు లోకేసారి
జల సమాధులయినాయి

క్రమ్మిన జలధి జలం అదృశ్యమయింది
కల్లోల స్మృతుల్ని మాత్రం మిగిల్చింది
ఎక్కడ బడితే అక్కడ మనుషులు
కదల్లేక శిలల్లా మ్రోడుల్లా పడి ఉన్నారు.

సునామీలు వచ్చి పోయాయి
నీలి ముద్రలు మిగిల్చాయి
సముద్రం వెనక్కి తగ్గింది
గాయాలతో తీరం మిగిలింది.

అవని బుజం నుండి జారిన
నీటి పాయ కొంగు చాటున
మిగిలి ఉన్న ఊరు విలపిస్తూంది
జనం తొలగి తాను మిగిలినందుకు!

అక్కడక్కడా మిగిలిన మనుషులు
అన్నీ పోయి ఆరిన వత్తుల్లా
కొత్త వెలుగుకై ఎదురు చూస్తున్నారు
అవనితో తెగని అనుబంధంతో

జీవితం ఉండనే ఉంది!
ఎక్కడికి పోతుంది?
యానంలో తప్పని బరువుతో,

మిగిలిన విషాదం! ఒక సముద్రమై!

# మనో మ్యూజియం

## 7. అంతా తెరచిన పుస్తకమే

మ్యూజియంలో ఏ రోజూ
వస్తువు లొకటొకటీ చేరతాయి
నిశి గదిలో అద్దాల నుండి
ప్రతిఫలించే వెలుగులా
ఫాన్ గాలికి టేబిల్ పయి
ఊగే కొవ్వొత్తి ప్రకాశంలా
స్మృతి చిత్రాలు కదలుతాయి.

నిశీథి కలలో ఒంటరిగా వచ్చే
ఎవరివో?
అడుగుల తెలుపు గుర్తులు
నాలో పొద్దునే
వెలుగులో కలిసిపోతాయి.

నిశీథి కలలో ఒంటరిగా కదలే
ఎవరివో?
కంఠ స్వరాల గుర్తులు
నాలో పొద్దునే
కలకలంలో కలసిపోతాయి.

నిశీథి కలలో ఒంటరిగా కదలే
ఎవరివో?
మాస్కు ముఖాల గుర్తులు
నాలో పొద్దునే
జనంలో కలిసి పోతాయి.
ఆ అడుగుల జాడల మూలాలెక్కడ?

ఆ స్వర ముద్రల అర్థ మేమిటి?
ఆ మాస్కు వదలిన ముఖా లెక్కడ?

జీవితమొక లోతుతెలీని సముద్రంలా
నాలో కదలుతూంది
నన్ను కదిలిస్తూంది.
అడుగుల గుర్తులూ
స్వరాల గుర్తులూ
ముఖాల గుర్తులూ
సముద్రపు టలలపై తేలిపోతూ కన్పిస్తాయి.
రహస్య మేమీ లేదు
అంతా తెరచిన పుస్తకమే!
అర్థం చేసుకోవడంలో ఉంది.

## 8. స్మృతి బంధం

కాలం కదలిపోయినా
ఉన్న స్థలాన్ని వదలి వెళ్ళినా
అవి ఇచ్చిన బహుమానాలతో మ్యూజియం
మనిషి స్మృతిలో భద్రంగా ఉంటుంది.

ఈతలో అలలు వెనక్కి వెళతాయి
చలనంలో సమయం గతమవుతుంది

జలధిలో అలల పయి హేలగా
ఎంత సమయం గడచినా
మనిషి నివాసం అవని పైనే
మనసు బంధం మట్టి తోనే.

విసరిన రాయితో గాయం
స్మృతిలో మిగులుతుంది గుర్తుగా
మనసుకు పదును పెడుతుంది
ఊహకు మలుపు నిస్తుంది.

నెత్తురు సంసేచనతో
నేలను మొలకెత్తించాలనే!
రాత్రి దివిటీ శోభతో
ఉషస్సు ప్రభవించాలనే!

కల్పన అందంగానే ఉంటుంది
అద్దంలో మురిపించే ఆకాశంలా
జీవితమెప్పటికీ ప్రియాతి ప్రియమైంది
కష్టంలో నష్టంలో దుఃఖంలో పాపం లోనూ

## 9. మనిషి కళ్ళు ఏమైనట్లు?

పగలుతో చుట్టరికం ఇప్పటిదా?
రాత్రితో పరిచయ మెప్పటిదో?
ఎప్పటి కపుడు కొత్తగా ఉంటుంది.
ఎప్పటికీ తెలీని రూపమే ఎక్కువ!

రాత్రి మెరసే ఆశా నక్షత్రాలు,
ఉదయం తెగిన హారం నుండి ముత్యాల్లా
నేలపై జారి దొర్లి పోతూంటే
తిరిగి వాటిని ఏరుకోవడంలోనే
పగలంతా గడచి పోతుంది?
చేతికి దొరకీ దొరక్కా పోతాయి!

నిశీథి పైకి అధిరోహిస్తున్నట్లుంటుంది
వస్తువు అందబోతున్నట్లుంటుంది
పగలు క్రిందికి దిగుతూన్నట్లుంటుంది
వస్తువు జారిపోతున్నట్లుంటుంది.

నిర్ఝరి వెనక్కి మరలిపోవడం జరగదు
ఒక్క లక్ష్యం గురించి తప్ప!
మార్గం గురించి ఆలోచనకు సమయం లేదు!

అయినా ఆలోచన ఏకాంతంగా
బల్బులా వేచి ఉంటుంది
కొవ్వొత్తిలా ఎదురు చూస్తుంది
అర్ధరాత్రి మహలు వీడి
బయటి కడుగు వేసిన
బుద్ధుని ముఖం! చీకట్లో
ఒకే ఒక సారి మెరుస్తుంది!

ఆపైన అంతా మామూలే
స్మృతి చిత్రం గతంలో చేరుతుంది
వస్తువు మ్యూజియంలో నిలిచి పోతుంది.

కాలానికి కళ్ళులేవు, నిజమే
మనిషి కళ్ళు ఏమైనట్లు?
కాలాన్ని జయించే
ఆ మనోనేత్ర మేమైనట్లు?

## 10. పచ్చని నిజం

పచ్చని నిజంతో మనిషిలో చెట్టు
సమాజ మూలంతో పెరుగుతుంది
ఊపిరి అలలతో బ్రతుకుతుంది
పూల చేతులతో
కాలాన్ని నిమురుతుంది
ఫల హృదయంతో
జీవన రుచి చూపుతుంది.

మెలకువలో నిద్రలో కలలో
అతీత చేతనతో అంతరంగంలో
ఊహల కొమ్మలు చాస్తుంది
అనుభవాల పక్షులు వాలతాయి.

శైశవం మొదలు అన్ని దశలకూ సాక్షి
ఋతువు ఋతువులో మార్పుతో

అలంకారానికే కాదు సృజనకూ
సరికొత్త దర్శనం నిలుపుతుంది

గాయపడిన హృదికి
చల్లదనం అద్దుతుంది
తాపంతో అలసిన బ్రతుక్కి
ఆత్మీయం హత్తుతుంది.

పుస్తకంలో భద్రపరచిన నెమలి ఈకలా
రాత్రి కిటికీ నుండి జ్ఞాపకాల్ని దువ్వుతుంది
ఉదయం లేచి చూస్తే ఎదురుగా
విప్పిన శుభ పత్రికలా చెట్టు పచ్చగా.
గగనంలో ఇంద్రధనుస్సును మరిపిస్తుంది
ఇలపై రంగుల జీవితాన్ని తలపిస్తుంది.

అలజడిలో రణ సదృశంలో
ఎత్తిన ఆయుధ కోణాల్లో
దానవత మీసం దువ్వి
మానవత ఊపిరి కత్తిరింపబడీ
విధ్వంసంలో అశాంతి ఆయువు పెరిగీ
పచ్చదనం భగ్నమయ్యే సమయమూ ఉంది.

చెట్టుకి ఆప్తుడు సూర్యుడు
చెట్టుకి బంధువు చంద్రుడు
పట్టపగలు చెట్టు ఉపశమన ఛత్రం
అనుభవ రూపంతో ఆప్త మిత్రం
ప్రశ్నల్ని మరపిస్తుంది
సందేహాల్ని తొలగిస్తుంది

అణువణువున చైతన్య ప్రసరణంతో
మానవీయ స్ఫురణతో మనిషిలో చెట్టు
నిన్న నేడు పరంపరలో పచ్చని నిజం
అంతరంగంలో భవిష్యత్తు స్వర్ణ సత్యం.

## 7. అభిషేకం

గుడిలో ప్రతిమ ఉన్నంత వరకూ
లోపల దైవం నిలిచి ఉన్నట్లే
మనిషి ముఖాన గుర్తింపు చిహ్నం
మనిషి నుండి మనిషిని విభజిస్తుంది
అయితే కోరే దిశనూ సూచిస్తుంది.

ప్రతిమకూ మనిషికీ భేదం! ఎక్కడుంది?
ప్రతిమకూ దైవానికీ బంధం! ఎక్కడుంది?
ఆత్మోన్మీలనంతో అనుభవ జగంలో!
ఆరోహణలో అవరోహణలో దశలు
జీవిత గమనంలో తప్పని సోపానాలు.

గుడిలో ప్రతిమను దర్శించేందుకు
మెట్లపై అడుగులు పైకి సాగుతాయి
ప్రతిమలో దైవాన్ని దర్శించాక
మెట్లపై అడుగులు క్రిందికి దిగుతాయి.

మెట్లపై వరుసగా చిన్న చిన్న గుంపులుగా
కుంటి గుడ్డి వికల శకల భిక్షువులు
చిన్న చిన్న పిల్లలనుండి వృద్ధులదాకా
వయస్సుతో పనిలేని వృత్తితో ప్రవృత్తితో
ఇది నిరాదరణ పర్వంలో ఖండమైందీ
ఇది వితరణ సంస్కృతిలో భాగమైందీ

విసరిన స్వరాలతో దైన్యంగా
చాచిన చేతులతో హైన్యంగా
ఆ చేతుల్లో పడే నాణెం
ఆ సమయమొక అదృష్ట కణం.
తమకు తెలియకుండానే
తిరుగు బాటు చేతనకు హేతువయి

వీళ్ళను దాటాకే ప్రతిమ దగ్గరికి వెళ్ళేదీ
వీళ్లను దాటాకే తమ తమ ఇళ్ళకు చేరేదీ.

ప్రపంచం నుండి ప్రపంచంలోకి కొత్త ముద్రతో
జీవితం నుండి జీవితానికి కొత్త ముఖంతో
వాస్తవం నుండి వాస్తవానికి కొత్త జగంతో
ఆ వెనకే మెరుస్తూ స్థిరమై ఆదర్శం!

కల్పనలో గుడి
పైన దూరాన ఆశా శిఖరం!
గుడిలో ప్రతిమ
అందాలిసిన వస్తువు సంకేతం.

పుట్టుక నుండి చివరిదాకా
ప్రాణసూత్ర మొకటే, శరీరంలో
అది తెగిన మరుక్షణం అంతా చీకటే!
ధనపతి! భిక్షువు! భేదం తోనే పయనం!

బిచ్చగాండ్లు పై మెట్టుకు రారు
ఆ మెట్టు దాటితే? అన్న ప్రశ్న వ్రేలాడుతూంది
ఆకాశం ఊడి పడదు భూమి బద్దలు కాదు
వామనావతారం ఆవృత్తం కాదు, కాని
మానవీయం అభిషేకాన్ని పొందుతుంది.

## 12. మనిషికి పాట

అరణ్య హృయం నుండి
నదీనదాల నడకల ప్రక్కన
మబ్బులు నడిచిన జాడల్లో
మనిషితో మనిషి సంబంధం
సమాజమైంది, చరిత్రతో.

జనుల యాన పథాలతో
వాహన సాధన సమూహాలతో
పొందే పలు సంబంధాలతో
మనిషితో మనిషి సంబంధం
సమాజమైంది, పరంపరతో.

జన సమ్మర్ధంతో నలిగి అలసిన కాలం
ఫ్లై ఓవర్ పయి విశ్రాంతి కోరుతూంది
టెలిఫోన్ లో దీర్ఘ సంభాషణలా
రోడ్ పయి జన చలన ధార!
విశ్రాంతిలేని సమాజాన్ని తలపిస్తూంది.

మనిషి కోల్పోయిన ప్రకృతి ముఖంతో
మధ్య మధ్య పచ్చని తిన్నెలు
మనిషి అవసరానికై ఆభోగంకై
ప్రక్కనే పెద్ద పెద్ద నిర్మాణాలు.

పెదవులపై కదలే మాట
ఎపుడైనా ఎక్కడైనా వినిపిస్తుంది
హృదిలో స్పందించే పాట
ఎపుడో ఎక్కడో గాని సరించదు

మనిషికి మనిషి కొత్త కాదు
సమాజ శత్రువూ సమాజ బంధువూ
మనిషికి మాట కొత్త కాదు
మనిషికి పాట ఎప్పటికీ కొత్తే.

## 13. పగలూ రాత్రి ఒకటే

రాత్రికీ నిద్రకూ పురా రూప సంబంధం
రాత్రి అవగానే నిరీక్షణలో నిద్ర
కనురెప్పల చుట్టూ తిరుగుతుంది
కనురెప్పలు మూతపడాలనే ఉంటుంది

చుక్కలు కళ్ళు తెరచి ఉన్నాయి
సమయ సమయం శశి పహరా ఉండనే ఉంది.

అమావాస్య రాత్రి అయితే
చక్కగా నిద్ర పోవచ్చు, అనుకుంటే
ఆ కోరిన రాత్రి రానే వచ్చింది
నే కోరిన అహంకార ముద్రతో

దొంగ భయం నిద్రపోనీయలేదు
తెల్లవారింది, చూస్తే! ఎదురుగా
శిల కన్పించింది నిద్రపోతూ
తోడు బాగానే దొరికిందనుకున్నా
అందమైన శిల్పం జ్ఞాపకం వచ్చింది
ఆ వచ్చే నిద్ర కాస్తా ఎగిరిపోయింది.

దూరాన కొండ కన్పించింది ఇంకేం?
నిద్రకు అండ దొరికిందనుకున్నా, అయితే,
శిఖరం నుండి దూకే ప్రవాహం తోచింది
దాని కోలాహలంలో నిద్ర కవకాశం పోయింది.

నీలాకాశం వైపు చూస్తే
నిద్రకు మంచి అవకాశం వచ్చింది
ఎగిరే పక్షులతో, కలరవాలతో
ఆ నిద్రకాస్తా ఎగిరిపోయింది.

నిలిచిపోయిన ఆలోచనతో
కదలని మెదలని అనుభవంతో
ఎదురుగా మనిషి కన్పించే సరికి
ఇంకేముంది? నిద్ర కవకాశం వచ్చింది.

ఆఫీసుకు వేళ అయింది!
నిద్రను నిలుపుకొని బయలుదేరా
దారిలో వెళ్ళే కారు అద్దాల్లోనుండి
ఫుట్‌పాత్ పయి వీధి స్తంభం ప్రక్కన

కళ్ళుమూసీ ఒళ్ళు మరచీ
రాత్రి చలికి బిగిసిన బికారి!
ఉదారుడు పైనుండి విసరిన
చిరు ఎండ దుప్పటి క్రింద!

నా కనురెప్పలపై అప్పటిదాకా
వేచ్చి ఉన్న నిద్ర ఎగిరిపోయింది

పగలు నిద్రించే బికారి పేరు
వోటరు లిస్టులో ఉందో లేదో?
భేద మేమీ లేదు కాని
ఒకటి మాత్రం ఋజువైంది
ఎందరికో పగలూ రాత్రీ ఒకటేననీ
కఠోర వాస్తవాల్ని మరచిన “రాజ్యాంగం”
అందమైన పుటల్లో నిద్రిస్తూ ఉందనీ.

## 14. నిశ్శబ్ద యానం

సూర్యుని మొదటి కిరణాలతో
విమానం నుండి దిగిన పాదాలు
నా జన్మ భూమిని దూదిలా స్పృశిస్తాయి
సమయం స్వాగత పుష్పమై
బహు ప్రియంగా ఎదురవుతుంది
సూర్యుడు మంచు గ్లవుజులతో
పైనుండి చల్లని చేతులు చాస్తాడు.

నాకోసం ఎయిర్‌పోర్టులో
మంచులోనుండి సూర్యకిరణంలా
కళ్ళు పరచీ తమ్ముడు! ఎదురవుతాడు.

ఇపుడు నేను దిగే నగరం దేశానికే హృదయమయింది
నాకు కొత్తేమీ కాదు కాని
తన కొత్తదనం నాకు చూపాలనుకోవచ్చు

పూర్వ పూర్వ పరిచయ గంధంతో
స్నేహ భావం వికసించాలనుకోవచ్చు.
ఇపుడు గుర్తు పట్టలేకుండా ఉందని
టెలిఫోన్‌లో మా అమ్మ మాటల్లో!
అక్కడి నుండి వార్తా చిత్రమే చెప్పింది.

బయట పెద్ద పెద్ద మార్పులతో ప్రపంచంలో
ఏ మార్పూలేని ఒక ఇంట్లో లోపల గది!
జ్ఞాపకముంది. సరస్సులో నిలిచిన పడవలా.
నేను వస్తేనే కోరితేనే దాని తాళం తీసేదీ
ఆ తలుపులు తెరచేదీ లోనికి ప్రవేశించేదీ!
తాళం తీయగానే స్మృతి పద్మం విప్పారుతుంది.
తలుపు తెరవగానే అనుభవ పుస్తకం తెరుచుకుంటుంది.
ఎదురుగా కళకళలాడుతూ సజీవమై
గోడకు ఫొటో వ్రేలాడుతుంది భద్రంగా
నా చేతి సిల్కు వ్రేళ్ళు తాకి
వెనక నుండి మధుర స్వరాల్ని స్పందిస్తుంది.

ఎంత కాల మయింది?
దాదాపు దశాబ్ద మయిందనుకుంటా
మళ్ళీ అటువంటిదే వినాలనే కోరిక
అనుకోకుండా మొలకెత్తింది!

మహాకాలంలో దశాబ్దం ఒక బిందువు
ఇది నాకో సుదీర్ఘ నిశ్శబ్ద పర్వతమే.
పర్వతంలో ఎన్ని శిలలు చెక్కబడినాయో!
ఎన్ని శిల్పాలు నాతో ఒంటరిగా మాట్లాడాయో!

ఫోటోలో ఆ వ్యక్తి ముఖం
తరాల వెనకటి సజీవ స్మృతి చిహ్నం!
నా రూపానికి పూర్వ పూర్వ మూలం
నాలో అనుభూతికి స్పందన జగం

దీన్ని చూచినపుడు నాలో గతం
భయ స్వప్నం కాదనిపించింది
ప్రియ వాస్తవ మన్న సూక్తికి
చెరగని నిదర్శనంగా నిలిచింది!

దారిలో ఆగి పూలదండ తీసుకోవాలి
అది మరచి పోకూడదు
అరచేతిలో వ్రాసి గుర్తు పెట్టుకోవాలి.

తలుపులు రెండూ తెరవగానే వెనక
వీడని బంధం మనసులో
సాలీడు పటంలా ఊగింది
ఇపుడు దుమ్ము పొరతో గది
సెలవులకుముందు చాక్‌పీస్‌తో
వ్రాసిన అక్షరాల బ్లాక్ బోర్డ్‌లా
పాతబడిన తాళపత్ర గ్రంథంలా ఉంది
అక్కడున్న ఫొటో!
నాలో సరికొత్త చిత్రం రీలు వదలుతుంది.

ఇపుడు నగరం క్రాస్ వర్డ్ పజిల్‌లా
ఎదురయ్యే ఇళ్ళను గుర్తించవలసి రావచ్చు
మా అమ్మాయి చెప్పినట్లు టెలిఫోన్‌లో
కొత్త కొత్త ఫ్లై ఓవర్లు ఉపాయంగా
సూటిగా ప్రశ్నల్ని దాటించేయవచ్చు.

పరచిన బ్లాంక్ పేపర్‌లా ఉన్న మనస్సు
శబ్ద ప్రపంచాన్ని మరచి ఏకాంతాన్ని వరిస్తూంది
ఫ్లై ఓవర్లు దాటుతూంటే, కల్పనలో
వాటి క్రింద కట్టడాలు స్మృతి చిహ్నాలు!
అమ్మతో తనను కనుక్కోమని చెబుతూ
చాటునుండి తొంగి తొంగి చూస్తూ
స్థలం మారే పిల్లల్ని తలపిస్తాయి!

సరిహద్దులు చెరగిపోయిన ఆలోచనల్లోను
తలలెత్తే చిన్ని చిన్ని ప్రపంచాలెన్నో!
మనిషితో తెగని బంధాన్ని నిలుపుతాయి
సమాజచరిత్ర నేపథ్యాన్ని చూపుతాయి.

కాలంతో సంబంధం లేకుండా
ఎగసి వచ్చిన వసంతంలా
కలిసిన బంధువుల మిత్రుల ఆ పార్టీ
ఉత్సాహ కళ ఇప్పటికీ చెదరిపోలేదు
అది మళ్ళీ పొందాలనే! ఆరాటం,
ఆలోచనలో అలల్ని పరిగెత్తిస్తూంది.

తలుపులు తెరవబడి కనురెప్పల్లా
వెలుగు హత్తుకొని గుండెపై
శాశ్వత ముద్రను వేసింది
ఎప్పటికీ నాలో అపురూప మైందే!

తల్లి ఒడిలోకి పాప దూకే అనుభవంతో
నాలో వర్తమానం
భవిష్యత్తులో సంప్రదింపులు జరుపుతూంది
కల్పన ఎపుడూ వాస్తవం కావాలనే కోరుతూంది.

చాలా చాలా అవసరమైన సమయం
చూస్తుండగానే కళ్ళముందు ఎగసిపోతూంది
ప్రాణ భయాన్ని కూడా లెక్కచేయకుండా

వేగంగా ఎయిర్‌పోర్ట్‌కు చేరుతూండగానే
అందుకోవలసిన విమానం పైకి లేవనే లేచింది.
అంతలో వేగాన్ని అందుకొని అదృశ్యమయింది.
సమయ పాలనకు ఆదర్శమైన దేశం, అమెరికా
నాలో గాలిలో తేలే కలల్ని నేలపైకి దింపింది.

మనసులో నిలిచిపోయిన
భవిష్యత్తు చిత్రాల బరువుతో

వెనక్కి తిరిగిన ప్రపంచం
నిరాశ అంచున నిలిచింది.

ఇల్లు చేరిన శరీరం కుర్చీలో వాలింది
ఆన్ చేసిన టి.వి.లో భయంకర వార్తా దృశ్యం
ప్రయాణ జీవితంలో ఆ రోజు
ఆ విమానానికి చివరి దశ అయింది
ధ్వంసమై ముక్కలై శీర్ణమై
ఎగసిన మంటలతో నేల వాలింది.

పైకి లేచిన పొగ మహాభూతంలా ఉంది
తల విరబోసుకొన్న మృత్యు ముఖంలా ఆవరించింది
పిరికితనం బండతనం కలిసి
చాటు నుండి ఉగ్రవాద విలయ ఘాతం
మానవ సంస్కృతిపై పెనుగాయం నిలిపింది.

మండే గాయంపై ఐస్ ప్యాడ్‌లా
మానవతా సందేశం! ఒకటే,
నాలో కన్నీటిని మరిపించింది
నాలో అన్నిటినీ జయించింది.

## 15. అరణ్యం నుండి

అరణ్య నిలయం నుండి గుహ నుండి
ఝరణి దాటి స్వేచ్ఛా జగంలోకి
ఉగ్రవాద చరణాలు కదిలాయి
ప్రజాస్వామ్య వాస్తవంలో చారిత్రక దృశ్యం

బుద్ధు డొక క్షణం కనులెత్తి నట్లుంది
మహాత్ముని ముఖాన చిరునవ్వు ఒలికినట్లుంది
ఇదో రాజకీయ తంతుకు మితం కారాదు
ఇదో శాశ్వత శాంతికి ప్రస్తావన కావాలి.

మారణ వాదం శాంతి కీర్తి పొందాలి
ముడిచిన రెక్కలు విప్పి బడుగు బ్రతుకు సాగాలి

ఈ సమయం ఆయుధం చెట్టుకి వ్రేలాడుతూంది
పక్షులు రెక్కలతో స్పృశించి పోతున్నాయి
కొందరి వింతగా తోచవచ్చు.
కొందరికిదో ఎత్తుగా అనిపించవచ్చు.

వింత అయినా ఎత్తు అయినా
ఆయుధానికి సెలవు సమయం రావాలి
కథలూ కల్పనలూ వదలి
వాస్తవ జీవితానికి ప్రతీక కావాలి

ఈ సుందర విరామ సమయం
ఏ లోయలో జారేనో అని అనుమానం లేకపోలేదు
రెక్కలు విరిగి కూలేనని సందేహమూ లేకపోలేదు
చర్చల పర్యవసానం శూన్యమై
అరణ్య నిలయం లోకి గుహలోకి నడచి
తిరిగి పద పంక్తులు మాయమయ్యేనా?

కోపంతో ద్వేషంతో వర్తమానం
ప్రశ్నల పంజరంలో చిక్కింది
భవిష్యత్తు సమాధానం కోసం వేచి ఉంది
విషాద స్వరం వీడాలని కోరుతూంది

అనుమానం పెనుభూతం తొలగాలి
విశ్వాసం వంతెనయై నిలవాలి
ప్రవాహాన్ని దాటి గట్టుకు చేరాలి
సముద్రం గురించి తరువాత చూడొచ్చు.

తప్పించుకోవడం పారిపోవడం
ఏ లక్ష్యానికీ చేర్చవు
ఉన్న చోటునే నిలిచి పోవడం
ఏ విజయానికీ చిహ్నం కాదు

నేలకీ చెట్టుకీ మధ్య తుఫానులో ఘర్షణ
కొమ్మకీ ఆకుకీ మధ్య బంధంలో విజయం!

గన్ పేల్చి మనిషిలో
సూర్యుని ఉదయింపజేయలేం
నిచ్చెనపై చంద్రుని దింపి
శిశువుకు అందించలేం!
చెట్టు కదలదు రాయి చివుర్చదు
మనిషిలో కదలికతో ఆలోచన చివురిస్తుంది.

ఊపిరికి విశ్రాంతి లేదు
కాలాని కంత కన్నా లేదు
మనిషిలో విశ్రాంతికీ సమయం లేదు
ఉందొకటే నిష్క్రియలో జడభావం తీరిగ్గా

చరిత్రను మలుపు తిప్పింది
మనిషిలో అదుపులో పెట్టింది
పట్టిన ఆయుధం జీవితంలో
షోకేస్‌లో వస్తువు కాలేదు

ఝరిణి దాటి అరణ్య నిలయంలోకి గుహలోకి
తిరిగి పద పంక్తులు మాయ మయ్యేనా?
స్వేచ్ఛా జనంలోకి వచ్చి
మానవతా సూర్యుణ్ణి పొందేనా?
ప్రజాస్వామ్య మనుభవించేనా?

## 16. జిజీవిష

శాంతినికోరే ప్రియమైన జీవితం
నిశ్శబ్దంగానో సశబ్దంగానో
రణ వాద జలధిలో మునిగి తేలుతూంది
స్నేహాన్ని కోరే సుందరమైన మానవీయం
మండే గాయాలతో చిమ్మే వేదనతో
ఆపదల పొదల్లో గుహల్లో చరిస్తూంది

బొమ్మలు దేనితో తయారయితేనేం?
మట్టి అయినా చెక్క అయినా లోహ మయినా
రబ్బర్ అయినా ప్లాస్టిక్ అయినా చర్మ మయినా
ఆటకో అలంకారానికో దేని కయినా
మనిషిలో నవ నటనా రూపాన్నే బింబిస్తాయి.

దరిద్రమే కాదు స్వార్థమూ
మనిషి నెంత పనయినా చేయిస్తుంది
బొమ్మను చేస్తుంది సమ్మెను చేయిస్తుంది
ఆయుధం గానూ మారుస్తుంది.

అమరిన బ్రతుకులో ప్రవచనాలు
పెదవుల నుండి పూలు విసరుతాయి
అమరని బ్రతుకులో విధి పదాలు
గుండె నుండి నిప్పులు చల్లుతాయి

అంతరంగ మందని దూరంలో జరిగి పోతూంది
ఆదర్శం ఆకాశంలో అదృశ్యమయి పోతూంది.
మనిషిని మనిషి సాధనంగా మార్చే
మనిషిని మనిషి వాహనంగా తీర్చే
సందర్భం సమయం రాకూడదనే
మానవతా పథ పథంలో ఆరాటం

పశు హననంతో స్వర్గాన్ని పొందే కోరికతో
నర హననంతో రాజ్యాన్ని పొందే కోరికతో
హింసకు బీజావాపనం ఎప్పటిదో?
ఇది మనో భూమిపై అడవై పోయింది.

చేతిలో పుస్తకం బదులు
ఆయుధం అవతరిస్తూంది
చెట్టుపై పావురం బదులు
ఆయుధం చేరిపోతూంది.

మనిషిలో జీవన రుచి విస్తరించే కొద్దీ
ఆటవికానికి మార్గం సుగమం కాకూడదు
తాపానికి తాళలేక ఆదర్శాలు
ఏ.సి.లో విశ్రాంతి కలవాటు పడినాయి

మనిషిలో అంతర ప్రేరణ ఉన్నంతవరకూ
అన్వేషణ ఆగదు! జిజీవిష తరగదు.

## 17. కలలో అవకాశం

సాయంకాలం చౌరాస్తాలో
ఆటో దిగి అడుగులు కదిలాయి
'మల్లెపూలు! దండ తీసుకోండి!'
ప్రక్కనుండి కుర్రవాడు సమీపించాడు
'ఎన్ని మూరలు కావాలి' అంటూ వెంటబడ్డాడు
ఆ వ్యక్తి "వద్దు" "వద్దు" అంటూ వడిగా నడిచాడు.

కాస్త ముందుకు వెళ్ళగానే
'కనకాంబరం పూలు! దండ తీసుకోండి'
ముందు నుండి మరో కుర్రవాడు వచ్చాడు
"ఎక్కువ దొరకవు, ఇపుడు గిరాకిగా ఉన్నాయి"
ఎన్ని మూరలు ఇవ్వాలి" అంటూ కదలనీయలేదు
అతడు "వద్దు" "వద్దు" అంటూ తప్పించుకున్నాడు.

పనులేవో చూసుకొనీ తిరుగు ముఖం పట్టాడు
రోడ్డునుండి మరో వైపుకు క్రాస్ చేసాడు
ఎదురుగా బొమ్మల బండితో మనిషి!
"బొమ్మలు! కావాలా? తీసుకోండి" అనీ
వాటిని గురించి చెప్పడం మొదలు పెట్టాడు.
అతడు "వద్దు" "వద్దు" అంటూ చేయి
కదిలిస్తూ ఆటో వైపు వేగంగా కదలిపోయాడు.

ఇంతలో సేల్స్‌బాయ్ సమీపించాడు
"పుస్తకాలు! సగం రేటుకే ఎన్‌సైక్లోపిడియా! డిక్షనరీ" అంటూ
'నాలుగు టైటిల్స్ ఎవరికైనా ఎప్పటికైనా పనికి వస్తా'యంటూ
వాటి అవసరాన్నీ ప్రాముఖ్యాన్ని వివరించడం మొదలు పెట్టాడు
అతడు నడుస్తూనే "వద్దు" "వద్దు" అంటూ ఆటో చేరాడు.

ఇంతకుముందు వరకూ ఒక కార్నర్ నుండి
అందరిని మల్లే అతణ్ణి గమనిస్తూన్న సేల్స్‌బాయ్
'పూలు వద్దు బొమ్మలు వద్దు, పుస్తకాలు వద్దు' అనుకొనీ
పైకి మెల్లగా 'ఏం కావాలి సార్' అన్నాడు.

అతడు చిరాకుగా "బాంబు" అన్నాడు
అతడు 'అమ్మో!' అని ఆత్రుతగా 'ఎందుకు సార్' అన్నాడు
'ఎందుకా?' "నీకు రక్షణకోసం" అన్న జవాబులో
ఆటో కదిలిపోయింది.

అతడు ఇంటికి వెళ్ళాడు. కుర్చీలో వాలాడు
వేడిగా ఉన్న మనస్సు చల్లబడకముందే
మరో ఆలోచన వచ్చింది
"బాంబు!" "ఆత్మరక్షణ కోసం" అయింది

ముంగిట్లో పూలు అల్మేరాలో బొమ్మలు
టేబిల్‌పై పుస్తకాలు మనస్సులో తిష్ఠవేసాయి
అతనికి మిగిలిన వాస్తవం
కలలో కోర్కెల కవకాశం మాత్రమే!

## 18. లోపలి మనిషితోనే

ఎవరి ఆహ్వానమూ అవసరం లేదు
ఎవరి ఆదేశంతోనూ పని లేదు
వస్తాను! హృదిలో నవ చేతనతో

గతంలో గాయాల్ని వర్ణించే అవసరం లేదు
మూటలో కలల్ని ప్రదర్శించ నక్కరేలేదు
కన్నీటి చుక్కల్ని పరిశోధనకు పంపే అవసరం లేదు

మనిషి వేసే అడుగుల ధ్వనికి
నిశ్శబ్దం ముక్కలు ముక్కలవుతూంది
ప్రతి ముక్కలో చర్యలు శబ్దిస్తాయి.

పిలిచే అరిచే ఏడ్చే స్వరం గురించి
ఇపుడు! ఏ సందేహం తోనూ పనిలేదు
గుర్తింపుకు! ఏ ప్రయోగం తోనూ పనిలేదు.

మానవ చేతనలో అంతరంగం
నింగిలో సూర్యునిలా వెలగొచ్చు
నేలపై నిర్ఝరిలా సాగ వచ్చు.

నేలతో నింగితో అనుబంధంతో
నిలిచే చెట్టులాగనో ఎగిరే పక్షిలాగానో
ఆలోచనలో సాకారాన్ని పొందవచ్చు.

మ్రోగే ఘంటారావంలో ఆర్తితో
నిశ్శబ్దం తలుపులు తెరవబడీ
లోపలున్న మనిషిని కలవాలనీ
లోపలున్న మనిషితో మాట్లాడాలనీ

ఎవరి ఆహ్వానమూ అవసరం లేదు
ఎవరి ఆదేశంతోనూ పనిలేదు
అన్వేషణలో లోపలి మనిషితోనే పని!

## 19. ఎవరి అవసరం వారిది

చీకట్లో మెరుపు
కొవ్వొత్తి వెలుగు
బ్యాటరి వెలుగు
ఎవరి అవసరం వారిది

రెండు రెక్కల నుండి
వేయి రెక్కలు విప్పి
వాలుతుంది వెలుగు
ఎవరి అవసరం వారిది

చెట్టు నీడ
ఇల్లు నీడ
మనిషి నీడ
ఎవరి అవసరం వారిది

అలల్ని లెక్కపెడుతూ
చుక్కల్ని లెక్కపెడుతూ
మనుషుల్ని లెక్కపెడుతూ
ఎవరి అవసరం వారిది.

## 20. ఎవరి పనిలోవారు

జీవితంలో మనిషి పడే శ్రమ
ఏ పనికయినా అసంపూర్ణమే
సంపూర్ణత కోసం ఎప్పటికీ
సంరంభం జరుగుతూనే ఉంటుంది.

చుట్టూ మొన దేలిన ముళ్ళున్నాయని
గులాబి వికసించడం మానదు
కావలసిన వరాల జల్లుకై జలదం
జీవిత వృక్షంపై సిద్ధంగా ఉండదు.

అవతారాల కల్పనలో మనిషి
కొత్త అవతారాలెత్తాలనే చూచేను
ఉదయం లేచేసరికి కొత్త ముఖంతో
అసలు ముఖం మాయ మవుతుంది.

పూవు రాలితేనే మరో పూవు!
ఊహ సాగితేనే మరో ఊహ!

పూవు అయినా ఊహ అయినా మనిషిలో
పరిమళమో వెలుగో ఇస్తేనే అందం.

ప్రవాహంలో మృత్యువు జ్ఞాపకం రాదు
ఓటమి అంచుల్లోనే విజయం సాగుతుంది.

లోపల నచికేతుడు
ప్రతి పనినీ ప్రశ్నిస్తాడు!
బయట పెద్ద మనిషి
తప్పించుకోవడమే చేస్తాడు!

పందెంలో దూకిన రెండు కోళ్ళ పోటీ
అక్కడ చేరినవారి ఆనందం కోసమే!
రంగేసిన ముఖంపై నవ్వులో నిజం
ఎలాగో మాయ మవుతుందనేది నిజం!

పనిలో మునిగి పోవడం కాదు
పనిలో కరగి పోవడం అవసరం.

## 21. అస్తమయం లేని బింబం

అవనిపై శరీరం పచ్చని అడుగులతో నడుస్తుంది
మనసులో ఆలోచన వెలుగు రెక్కలతో పయనిస్తుంది
కాలంపై ఆయువు ప్రవాహ సరణంతో కదలుతుంది
చేతనతో జీవితం సమాజ గమనంలో ఎదుగుతుంది.

చెట్లూ, ప్రాణులూ చుట్టూ ఉన్నా
మానవ చలనంతోనే ప్రపంచం
మాట వెనక చర్య వెనక
ఇతిహాస సముద్రంలో అల
కదలుతుంది తరలుతుంది
మును ముందుకు కదిలిస్తుంది.

అలజడిలో ఆక్రందనలో
మానవతా విశ్వ హృదయం
సృజన జగం నాలో నీలో
అస్తమయం లేని బింబం!

## 22. ప్రజల్లో మనిషి

ఏ చెట్టో పక్షో అయి
కల్పనలో కాలయాపనం చేసే కన్నా
మనిషిగా మనడం లోనే అందం.

బాధలో వేదనలో అశాంతిలో
మనుషుల మధ్య మనిషిగానే
మనిషి కోసం బ్రతకడమే ప్రయోజనం.

ఎంతటి కఠోర వాస్తవమూ
ఎంతటి భయానక స్వప్నమూ
మనిషిని మాయం చేయలేవు

దిశల్లో దాగిన నీలి మబ్బుల్ని
గాలి బయటికి లాగి పరుగెత్తిస్తుంది
బయట పడేందుకు వెనకాడే వసంతాన్ని
వెదకి వెదకి హృదయం
పట్టుకొని హత్తుకొని తెస్తుంది

ముఖాన మాయ మయిన నవ్వును
మల్లె పూవు తిరిగి ప్రతిఫలింపజేస్తుంది
కళ్ళలో వేడెక్కిన వెలుగును
పాల వెన్నెల తాకి హ్లాదమయం చేస్తుంది

మనిషిలో బూది క్రమ్మిన ఉత్సాహాన్ని
నిప్పుకణం మళ్ళీ ఉత్తేజింప జేస్తుంది

జనం కోసమైన ఉద్యమం జనంతో
జనం మధ్యనే బ్రతుకుంది వెలుగుతుంది.

## 23. విశ్వహృదయం

బోనులో హరిణంలా
విశ్వ హృదయం మానవీయం
ఇపుడు అలంకారంగా ఉంది
ప్లోదానికి పనికి వస్తూంది.

మసక బారి ధూళి క్రమ్మిన
అమూల్య వజ్రంలా ఉంది
అపుడపుడూ నే నున్నానని మెరుస్తుంది
మేమూ ఉన్నామని మనుషులూ
ఎవరికీ పూర్తి ప్రకాశం అందలేదు
ఎపుడూ పూర్తి విలువ బయటపడలేదు.

తత్త్వం కళ విజ్ఞానం సాహిత్యం ఎన్నో
దీని కై వేయి చేతులు చాచాయి
దీని కెంతో దగ్గర దగ్గరగా కదిలాయి
ఇది చేతిలో శిశువులా జారిపోతూనే ఉంది.

ఏ విజయ శిఖరంపైనో ఏ తత్త్వ సోపానంపైనో
ఏ కళా ఖండంలోనో ఏ ముక్తి పథంలోనో
విశ్వ హృదయ రూపంకయి
మానవీయ స్పందన పయి
ఆలోచన! అన్వేషణ! ఇప్పటిదా?
సమాప్తి లేదు.  ఎప్పటికీ ఉంటుంది.

అన్వేషణలో దారి తప్పి లక్ష్యం
మరో గమ్యంతో తృప్తిపడే జీవితం
సమాజ శక్తులతో మలుపులు తిరుగుతూంది
అమానుష రీతులతో స్వరూపం కోల్పోతూంది.

చివురు వద్ద ఆగిపోతూ
ఎదగని మానవతా వృక్షం

పద పదాన నిలిచి పోతూ
సాగని మానుష ప్రవాహం.

జీవన గమనంలో లోయలు
ఆదర్శంలో క్రమ్మిన నీడలు!
వాస్తవ పథాన వహ్నులు
ధూమంతో నిండిన స్మృతులు!

సమాజ చరిత్రలో ప్రతి పంక్తి వెనక
చీకటి శక్తుల ముద్రలతో వాస్తవం
మనసులో నవ హేతువు దృష్టికి
సరికొత్త ప్రపంచం బింబిస్తుంది.

రావంతో అశాంతి నిండిన మస్తిష్కం
ధ్యానంతో అలజడి పొందిన సమాజం
విశ్వ హృదయతలం పయి
మానవీయ స్పందన పయి
అక్కడక్కడా విరామ చిహ్నాలతో
రణ పదాలు వదలిన బీభత్స దృశ్యాలు!

హృదయం మాటేలేని
స్పందనలో లయ తప్పిన
మనో రూపంతో మనిషి
ఇప్పటికీ! యంత్రం వలె

గట్టుదాటి దారి తప్పిన తరంగాల్లా
పట్టుతప్పి ఊడి పడిన నక్షత్రాల్లా
క్షణాలు! అమానుష ఖండాలు!

అహంకారాని కందమైన అలంకారాలతో
స్వార్థానికి నిపుణమైన కళాకృతులతో
భోగానికి లక్ష్యంగా విజ్ఞాన ప్రపంచంతో
మానవ సంస్కృతిలో బహుముఖ పార్శ్వాలు.

ఆ వెనుకనే ఎప్పటికీ వేచి ఉంది
విశ్వ హృదయం, మానవీయం
జీవన భూమికనుండి మనోభూమిక దాకా.

ఆశకూ ఆదర్శానికీ
అందని ఎత్తులో విశ్వహృదయం
ఎప్పటికీ అన్వేషణలోనే.

ప్రాణానికీ ఆత్మకూ
అందని స్థాయిలో మానవీయం
ఎప్పటికీ ప్రయోగంలోనే.

దేశం పేరుతో పనిలేదు
జాతి పేరుతో పని లేదు
మానవీయం విశ్వహృదయం.

అంతరంగ భూమికలో వాస్తవం
యుగ యుగం తర తరం
ఏ రోజూ ఎప్పటికీ కొత్తే.

## 24. ఎప్పటికీ కొత్తే

ఏ రోజు కారోజు జీవితం
స్ఫూర్తికి తగిన సృజన రూపం
క్షణం క్షణం ఎప్పటికీ కొత్తే.
చెట్టైనా మనిషైనా, నీడ పాతదే.

కరుణతో ప్రేమతో నడిచి వచ్చే
మానవరూపం ఎప్పటికీ కొత్తే

జన పథంలో విస్ఫోటం
ముక్కలై చెదరిన శరీరాలు
ధ్వంసమయిన వాహనాలు
సమయ పటం పయి చిమ్మి

చెదరి పడిన రక్తం నవ చిత్రమై
మనిషి వికృత పార్శ్వాన్ని చూపిస్తోంది.

మందు పాత్రను బిగించిన మనిషే!
సైకిల్ పయి ఒక మారణ సాహసం!
గుహతో వీడని బంధంతో
భయద మనోరూపం! ప్రకటిత మవుతూంది.

ప్రక్కనే వ్రేలాడే పూలదండలు
తెగి ధూళిలో కలిసాయి
దగ్గరలో పేర్చిన కుండల వరసలు
పగిలి ముక్కలయి మట్టిలో చేరాయి
బ్రతుకు తెరువు భగ్నమయింది.

పట్టపగలు సూర్యుడు ఆరిపోయాడు
దారినపోయే సామాన్యుల ప్రాణాలు
ఆకుల వలె రాలి గాలిలో కలిసాయి
నోరుతోపాటు దిశలు కళ్ళు మూసుకున్నాయి.

ఆయువుతో అందమైన జీవితాలు
మెరుపు దాడిలో ధూళిలో కలిసాయి
మరో రోజు వరకు జీవించే శక్తి ఉన్న మనిషికి
పూల కున్న ప్రాణం విలువ కూడా లేదు.

సంచిలో కదలే సర్పాలతో
జేబులో దాచిన బాంబులతో
క్రాస్‌కు వేసే మేకులై
సమాజంపై హింసోన్మత్తులు

అడవిలో ప్రకృతి బంధంతో
ప్రవాహంలో ఆర్ద్రత కన్నా
పర్వతంలో కాఠిన్య మబ్బింది.

ఎంత గొప్ప ఆలోచన అయినా
మనిషిని ముక్కలు చేసే నైశం

ప్రగతికి అవరోధమే!
క్షమకు అర్థం కాదు!

భయం హింస బీభత్సంతో
నడిచే వర్తమాన చరిత్రలో
మానవ రక్షణలో భద్రతలో
ప్రజాస్వామ్య మెప్పటికీ కొత్తే!

ఎద నుండి జారే కృపారసాన్ని పొందే
గుండెలో స్పందించే శాంతి మంత్రాన్ని వినే
ఎగిరే తెల్లని కపోతాలను చూచే
కోరిక! మనిషిలో ఎప్పటికీ కొత్తే!
హిమాంశు శుభ్ర విశ్వ హృదయం
ఎప్పటికీ కొత్తే! మనిషికి

## 25. సృజన వాస్తవం

సృజన హృదయ స్పందనతో
ప్రజాస్వామ్య చేతనతో
మానవీయ బింబం వర్తమాన రూపం
అభినవ కోణంలో అనుభవ శీలంతో
మనః ప్రపంచం ఎప్పటికీ కొత్తే

మానవ బంధాల రంగవల్లులతో
ఆశలతో ఆశయాలతో ప్రియమై
ఎవరి ప్రయాణం వారిది
నిరీక్షకు సమయం లేదు.

ఆశలో పరుగెత్తుతూ సప్తాశ్వాలు
ఆశయం ఆకాశాన్ని పరచుకొనీ
భూమిపై జీవితం! కల్పన కాదు.

మనిషిని మానవుణ్ణి చేసే
పరిణతి క్రియ ఇప్పటిదా?

ఇంకా జరుగుతూనే ఉంది
మానవతా ప్రయోగశాలలో

బలవంతమయిన సర్పం
చెలిచీమలచే సమాప్తి!
మృత్యువు వచ్చి వాలడం!
ఎపుడో క్వాచిత్కం

జీవితంలో ఒక వాక్యాన్ని విడదీసి
ఒంటరి పక్షిని జేసి
పై కెగరేసి ఆనందం పొందలేం
సమాజ భూమికను మరవలేం!

ఎండిన వనం
మేఘ గర్జనతో పులకరిస్తుంది
జలద బృందం
పవన గతులతో కదలుతుంది
ఊపిరి నుండి విజయం దాకా!
పవనం పరివర్తన చిహ్నం

ఉషస్సు శిశువు దశ నుండి
రాత్రి వృద్ధ దశ దాకా
ఒకే కాల ప్రవాహం
మాటతో పాటతో
శాపంలో దీవెనలో ఒకటిగా
అంతర్భాషణతో సరిచేస్తుంది

సంవేదన సౌందర్యంతో మనఃప్రపంచం
ప్రాణంతో శిల్పంతో నవ మానవ దర్శనం
ప్రపంచం శూన్యం కాదు
జీవితం కల్పన అవదు
సృజన చలన వాస్తవంతో
కవిత్వం ఎప్పటికీ కొత్తే.

స్వేచ్ఛా కవిత్వం
రెండవ భాగం - 4

# సృజన దర్శనం

మాదిరాజు రంగారావు

2006
రసధుని సాహితీ పరిషత్తు
శాంతినగర్, హైదరాబాద్ - 500 028

*Presented*

*to Dr. CHARITHA MAADIRAJU*

*Research Scientist*

*Sandiego, California, USA*

*with*

*affection & blessings*

# కావ్యాన్ని గురించి

"సృజన దర్శనం" కావ్యం కవి సప్తతి సందర్భంగా ఆవిష్కృతమయింది. ఇందులో వస్తువు (1) ప్రకృతి నేపథ్యం (2) సమాజ జీవితం (3) వ్యక్తి మనోరూపంతో ఏర్పడింది. మొదటి నుండి చివరి వరకూ మానవ ప్రపంచం మనస్తత్వ భూమికపై సృజన రూపాన్ని పొందింది. ఇందులో కవిత్వం స్థూల తలంపై సార్వజనీన భావజాలంతోనూ సూక్ష్మతలంపై విశేష జీవన స్థితిగతులతోనూ దృష్టికి వస్తుంది. 1) వ్యక్తి అస్తిత్వం – సమాజంలో దాని ప్రయోగం అవసరం ప్రయోజనంతో పాటు 2) సామాజిక పరిణామం – వ్యక్తిపై దాని ప్రభావం ఎదురయ్యే సమస్యలూ, గమ్యమూ విశ్లేషణ కందుతాయి. విషయం భౌతికమైన మానసికమైన అంశాల శ్లిష్టత్వాన్ని కలిగింది. ప్రజాస్వామ్యంపై కవి విశ్వాసంతో సమాజ ప్రగతి దిశ కూడా స్పష్టం.

ఇందులో అభివ్యక్తి మాత్రం భావచిత్రాల నిర్మాణంతో ప్రతీకల నిర్వహణంతో వ్యంజనావృత్తి ప్రధానంగా ఆవిష్కృత మయింది. జీవన వాస్తవికత కేంద్రంగా కళాత్మకతను కలిగింది. బాహ్యమైన విషయస్థితి కన్నా అంతరమైన భావ స్థితికే ప్రాధాన్యమివ్వడం జరిగింది. అందువల్ల ఈ కవిత్వంలో వస్తువు గురించి వర్ణనకూ, వివరణకూ భిన్నగా విశేష భావననూ దర్శనాన్ని భావింపజేస్తూంది. "అంతరంగ మొకటే, ఆకాశం ఒకటే" నన్న విశాలమైన విశ్వసమర్పకమైన దృష్టితోనూ ఆలోచన ప్రసరించింది. సమాజం గురించి చింతనతో జీవితం గురించి దర్శనంతో అనురాగ సర్గతో మానవతా కావ్యంగా స్వేచ్ఛా కవిత్వంలో సమాలోచనకు ప్రేరేపిస్తుందనే నమ్మకం. ఇది మరో విధంగా సృజనశక్తిలోని వైవిధ్యాన్ని భావింపజేస్తూంది. పైగా కవిత్వంలో ఎప్పటికీ ఇంకా ఇంకా మిగిలి ఉండే సీమల్నీ సృజనభూమినీ మనోభూమికల్నీ ప్రతిభకు అవకాశాల్నీ జ్ఞాపకం చేస్తుంది. ఈ దిశలో ఇంకా కవిత్వ సమాలోచనం జరుగవలసి ఉంది. కొత్తదనాన్ని విశ్లేషణతో వివేచనతో విమర్శనా ప్రక్రియను పరిపుష్టం చేయవలసి ఉంది.

–మాదిరాజు రంగారావు

# సూచిక


| | | పుట |
|---|---|---|
| 1. | పోస్ట్‌పోన్ అవదు | 1 |
| 2. | స్మృతి కిరణం | 2 |
| 3. | అస్తిత్వంలో భాగమై | 3 |
| 4. | ఇరు పార్శ్వాలై ఒకటై | 4 |
| 5. | ప్రశ్నకు జవాబు | 6 |
| 6. | స్వగతం | 7 |
| 7. | వికల్పంలేని వాస్తవం | 8 |
| 8. | దెబ్బతప్పిన హరిణంలా | 9 |
| 9. | ప్రవాహ జగం | 10 |
| 10. | నీడలు క్రీనీడలు | 11 |
| 11. | అహంకృతి ఆయుధమై | 13 |
| 12. | అదృశ్యముఖం | 15 |
| 13. | ఎప్పటికీ శిల్పమై | 16 |
| 14. | అంతరంగ స్వేచ్ఛలో | 17 |
| 15. | ప్రకాశికలు | 20 |
| 16. | సృజన యానం | 25 |
| 17. | అసంపూర్ణం | 30 |
| 18. | హింసతో మస్తిష్కం | 32 |
| 19. | నేలపయి అడుగుకై | 33 |
| 20. | మ్యూజియంలో వజ్రంలా | 34 |
| 21. | మారణ విన్యాసాలు | 36 |
| 22. | మళ్ళీ మళ్ళీ | 37 |
| 23. | ఆకాశం ఒకటే | 39 |
| 24. | గాయాల కయినా పరీక్షల కయినా | 41 |
| 25. | మిగిలిం దొకటే మానవతా కావ్యం | 43 |

# 1. పోస్ట్‌పోన్ అవదు

మబ్బులు వస్తాయనో వచ్చేస్తున్నాయనో
ఏ క్షణానో తనను క్రమ్మేస్తాయనో
ఊపిరాడనీయవనో కబళిస్తాయనో
సూర్యుడు మాత్రం ఏనాడూ
తన రాకను పోస్ట్‌పోన్ చేయడు
సృజన కిరణం ఆగదు.

గాలులు వీస్తాయనో వచ్చేస్తున్నాయనో
ఏ క్షణానో తనను వణికిస్తాయనో
పూలు రాలుస్తాయనో బంధం త్రుంచేస్తాయనో
చెట్టు మాత్రం ఏ సమయమూ
తన వికాసాన్ని పోస్ట్‌పోన్ చేయదు
సృజన పరిమళం దాగదు.

ఎండలు మండేననో మండిస్తాయనో
ఏ సమయమో తనను వేధిస్తాయనో
పచ్చని ముఖంపై అగ్నిరేఖ గీస్తాయనో
అవని మాత్రం ఏనాడూ
తన అవిష్కారాన్ని పోస్ట్‌పోన్ చేయదు
సృజన హృదయం ఆగదు.

దారి విషమంగా ఉందనో
ఏ క్షణానో తనను రాళ్ళు నిలిపిస్తాయనో
బిందువు బిందువునూ బాధిస్తాయనో
నది మాత్రం ఏనాడూ
తన పురోగమనాన్ని పోస్ట్‌పోన్ చేయదు
సృజన సరణం ఆగదు.

చెట్టు సంపస్మయం కాలేదనీ
ఎండిన కొమ్మల్లో బోసితనం మిగిలేఉందనీ
ఇది తన స్థాయికి తగదనీ,
కోకిల ఏ స్థితిలోనూ
తన పాత్రను పోస్ట్‌పోన్ చేయదు
సృజన చిహ్నం వదలదు.

మనిషిలో సృజన శక్తి
అస్తిత్వానికి బీజం
ఇది కవిలో నిత్య వసంతం
ఎప్పటికప్పుడు బయటపడే రహస్యం
అణగి బ్రతకదు.
ముడుచుకొనీ దాగదు.

## 2. స్మృతికిరణం

నాలో స్మృతి కిరణం
అస్తిత్వంలో భాగం.

పగలూ రాత్రీ భేదం లేకుండా
మానసశిఖర ఫలకంపై
చిత్రం తరువాత చిత్రం చూపిస్తుంది
అంతర రహస్యాన్ని అందిస్తుంది.

ద్వీపం చుట్టూ జలధి అలల్లా
మనస్సు చుట్టూ ఊహల కదలికలు
అలలపై పడవల వలె
సమాజ చరిత్ర శకలాలు!

ఎంతటి ఘన చరిత్ర ఉన్నా
తుఫాను భూకంపం ముందు
మనిషి! పగిలే మట్టిబొమ్మ!

చెట్టు ఎంత పెద్దదయినా
పక్షి గూడు రూపం ఒకటే
ఎగసేది రెండు రెక్కలపైనే
ప్రాలేది రెండు కాళ్ళపైనే

పావన నది అయినా
శాంత జలధి లయినా
పొంగిపొరలి ముంచెత్తే
ఒక సమయం రావచ్చు.

రాగంతో తలదువ్వే అలలు
కోపంతో చపేటం వేయొచ్చు.
ప్రేమతో దీవెన లిచ్చే అలలు
శాపంతో ఆయుధం కావచ్చు.

నేలపై సర్పం కదలిక గుర్తించే మనిషికి
నింగి నుండి పిడుగుపాటు తెలీక పోవచ్చు.

మహా దేశ మయినా
మహా కావ్య మయినా
శుష్కమైన సందర్భం రావచ్చు
జడమైన సంకేతం అందొచ్చు.

నాలో స్మృతి కిరణం వెన్నెల కళతో
కంటికి కన్పించని దృశ్యం చూపిస్తుంది.

# 3. అస్తిత్వంలో భాగమై

నా ముందు దర్పణం అమాయకంగా
దర్పణంలో నా ముఖం సాలోచనగా

ఏ రోజో మబ్బులు పట్టి
సూర్యుడు కనిపించక పోవచ్చు.
కానీ ఏ రోజూ దర్పణంలో
నా ముఖంలో తప్పదు! కిరణం.

నాలో కొత్త దనానికి శ్రీకారం చుడుతుంది
సమయ పటంపై కొత్త చిత్రాన్ని చూపుతుంది.

ఒక్కొక్క చిత్రం ప్రశ్నతో
ఎదురు చూస్తుంది జవాబుకై
పాత స్మృతుల్ని కదిలిస్తుంది
కొత్త అనుభూతికి దారి తీస్తుంది.

ఒక్కొక్క చిత్రంలో భఙ్గిమ
మనిషిలో మనోరూప చిహ్నం
ప్రతి చిత్రం అస్తిత్వంలో భాగమై
క్షణాల్ని కదిలిస్తుంది కదలిపోతుంది.

మంచికీ చెడుకీ చివరిమాట మనిషిదే
ప్రాణినీ జడాన్నీ తనలో కలుపుకొనీ
కాలానికి రంగు వేసి వేషం తీర్చి
తన రూపం ఇవ్వాలనే కోరిక మనిషిలో

కోరికలో కిరణం నిచ్చెన వలె నిలిచీ
మట్టి నుండి మింటికీ
మింటి నుండి మట్టికీ
మనో యానంలో ప్రేరణయై కారణమై.

# 4. ఇరు పార్శ్వాలై ఒకటై

బాల్కనీలో ఒంటరిగా కూర్చున్న నాలో
అల్లుకొనే ఏకాంత లతా నికేతనాన్ని
బయటి నుండి శబ్దం ఛేదింప జూస్తుంది

చేతి వేళ్ళ మధ్య నిల్చిన కలం నుండి
నిశ్శబ్దంగా బయటపడే అక్షర సమూహంతో
బయటి నుండి శబ్దం తలపడ చూస్తుంది.

నిశ్శబ్ద ప్రపంచానికీ శబ్ద ప్రపంచానికీ మధ్య
చిరు ఘర్షణ తప్పదన్నట్లుంది
అక్షరం అక్షతంగా గమ్యం చేరాలిసి ఉంది.

కలం చివరి మొన పట్టుకొనీ
నీడ కదులుతూంది మెల్లగా
తనలో బలహీనత గుప్తంగా దాచుకొనీ.

ఆశ్చర్యపడ నవసరం లేదు
కాని అభిలాష ఇనుమడిస్తూంది

నీడ వెనక నున్న వెలుగు గురించి
ఆవేదన చింతన అన్వేషణ ఇప్పటిదా?

నీడ నుండి బయటపడే వెలుగు
శబ్ద ప్రపంచంలోకి ప్రవేశిస్తూంది.

కాగితంపై కవిత అంతర్జగత్తుతో
ఆకాశంలో సవిత బహిర్జగత్తుతో,
రెండిటి కలయికతో అస్తిత్వం!
నాలో ఇరుపార్శ్వాలై! ఒకటై

# 5. ప్రశ్నకు జవాబు

పర్వతం కదలదు
ఎవరైనా దాని గొప్పతనాన్ని గురించి ప్రశ్నిస్తే
తపస్సులో ఉందనీ
సమాధిలో ఉందనీ
సమాధానం రావచ్చు, వస్తుంది
మనిషిలో పాదుకున్న విశ్వాసంతో.

మంచు శిల కదలదు
కరగి బిందువులై నర్తించాలనీ కోరుతుంది.
సమయంకై ఎదురు చూస్తుంది.
ఒకనాటికి తనలో కోరిక ఫలించవచ్చుననీ.

నీలి మబ్బులో వేదన
కురిసే వానతో కదలిపోవాలనీ.
ఉప్పునీటికి చెలియలికట్ట అవసరం
మంచి నీటికి ప్రవాహ పథమవసరం
ప్రశ్న వస్తుంది రావాలి, చివురులా
జవాబు రావాలి పరిమళంతో పూవులా.

మనిషితో మనిషికి హృదయ భాష సహజం
భూమితో మేఘానికి వర్ష భాష సమాజం
పొంగి వచ్చే కెరటాల్లా కాలం పుటలు
పుటపుటలో చేరేను కొత్త అనుభవాలు!
వ్యక్తిత్వానికి చలన శక్తి నిస్తూ
అస్తిత్వానికి సృజన కీర్తి నిస్తూ!

## 6. స్వగతం

పొద్దు నడిమింటి కెక్కే వేళ
చీకటి వీడని వదనంతో
నివురు లేచిన కళ్ళతో
వీధిలో తిరిగే నన్ను చూచి
ఇదో కాలక్షేపం కోసమనీ
అనుకుంటే ఏం చెప్పగలను?

పొద్దు వాలి పోయే వేళ
మాడిపోయిన వదనంతో
వాలి పోయే కనురెప్పలతో
పైకి చేతులెత్తి నమస్కరిస్తే
ఇదో స్వర్గం కోసమో? ముక్తికోసమో?
అనుకుంటే! ఏం చెప్పగలను?

చీకటి పైకి దూకే వేళ
మూసిన దిశల్ని స్పృశిస్తూ
కూలిన ఆశా శిఖరాలపై
అడుగులు తడబడుతూ కేక వేస్తే
ఇదో పిచ్చివాని పాత్ర అనీ
అనుకుంటే! ఏం చెప్పగలను?

నాలో జడలు విప్పిన అశాంతిని
ఏ ముఖాన గీసి చూపగలను?
నాలో సెగలు రేపిన వేదనను
ఏ కళ్లకు కట్టి చూపగలను?

# 7. వికల్పం లేని వాస్తవం

రాత్రి వస్తుంది, అభయ ముద్రతో
నిద్రకు వరమిస్తుంది, కాని
భయమూ నిద్ర రెండూ
ఎపుడో ఎగిరిపోయాయి!

పగలయితే ఏ చెట్టుతోనో
రాత్రి అయితే ఏ చుక్కలతోనో
కథ చెప్పుకొనీ ఊరట పొందే
నాలో, మనిషి నుండి జవాబుకై
నిరీక్షణలో సమయం గడచిపోతూంది.
కాలం చేతిలో మట్టి బొమ్మను.

బయటికి కన్పించని నిజాలతో
ఏ క్షణాన ముక్కలయ్యేదీ తెలీదు.
ఏ రోజూ ఉదయం
భ్రమలు కల్పించి వెళ్ళిపోతుంది.
ఏ రోజూ పగలు
వెర్రి వాణ్ణి చేసి కదలిపోతుంది.
ఏ రోజూ రాత్రి
చీకట్లో వదలేసి వెళ్ళిపోతుంది.
ఎదురైన మనిషిలో చీకటి ముందు
దీపమై నడవాలనే, ఆరాటమూ ఆ వేగమూ.

ఈ రోజు గడచిన రోజుకు
డిటో కాకూడదనే! కోరిక
మిగిలిందొకటే! వికల్పం లేని వాస్తవం
అనల సందేశమో! జలద సంచారమో!

## 8. దెబ్బతిన్న హరిణంలా

కళ్ళు మూత పడినట్లున్న రాత్రి
మనిషికి మనిషి కనిపించని వేళ
ఆలోచనా కాంతిలో మనోనిలయం
జీవన చిత్రాల్ని చూపుతుంది వరసగా.

చిత్రం తరువాత చిత్రం కదలి పోతుంది
రైలు గమనంలో బయటి ప్రకృతి దృశ్యాల్లా.

తన వేలు వదలి ఎక్కడికీ వెళ్ళలేని నన్ను
తన ఎదకు హత్తుకొనే ఉంటుంది భూమి,
చీకట్లో ఏమవుతాననో? భయంతో.

ఆకాశ మేమయిందో ఆలోచనకు రాదు
అతీత కల్పనకు సమయమూ లేనే లేదు.

బుజాన వేలాడే సమస్యల పంజరంతో
కాలం మెల్లగా అడుగులు వేస్తుంది.
పంజరంలో చిక్కిన మానవీయం
నావైపు చూస్తోంది
ముళ్ళమధ్య నున్న గులాబిలా

జెండాల కెరాటాల అలజడిలో రాపిడిలో
ఎటు చూచినా ఎగసే హలాహల చిహ్నాలే

రెక్క విరిగి సమత తప్పి
ఆదర్శం ఉద్దీనంలో
పట్టుకోసం ఆరాటపడుతూంది
ప్రజాస్వామ్య శాఖిపై
నా కపోలాల్ని స్పృశిస్తూ ఎదురై

నేను బ్రతికి ఉన్నందుకు
సంబరపడుతూంది, పవమానం!

హింసను గుప్పిస్తూ
ఆయుధాన్ని మరపించే మనిషి నుండి
గంతేసి తప్పించుకొనీ వడిగా,
ప్రవాహం వైపు పరుగిడుతోంది 'శాంతి',
చావు దెబ్బ తప్పిన హరిణంలా.

## 9. ప్రవాహజగం

సముద్రం ఆయువు అలల్లో వలె
నా జీవితం కవితా పంక్తుల్లో.

కాలం ఎక్కడో లేదు.
ఉచ్ఛ్వాస నిశ్వాసాల్లో ఉంది, కదులుతూ
అంతలో గతమై వర్తమానమై.

ఏ రహస్యం లేకుండా
అతీతానికి దూరంగా
హృదయాన్ని పలికిస్తూ
ఇతిహాసాల్ని సృజిస్తుంది.

శిశు దశలో చేతనతో
బిందువుగా మొదలైంది
మానవతా పూర్ణమై నిలుస్తుంది.

బిందువు నుండి
నాదం అవచ్చు, చిత్రం కావచ్చు
కవిత కావచ్చు, దైవం అవచ్చు.

వాదం నినాదం ఏదైనా కావచ్చు.
శాపం కాకపోతే సరి!

బిందువు నుండి
వలయం కావచ్చు, ప్రదక్షిణలో
దీర్ఘరేఖ కావచ్చు, ప్రయాణంలో.

ఎంత దూరం వెళ్ళామో
వెనక్కి తిరిగి చూడడమూ అవసరమే!
అపుడు కాని తెలీదు,
ఎవరెక్కడ ఆగి పోయిందీ
ఎవరెక్కడ పాతుకు పోయిందీ.
ఎవరెక్కడ చిగిర్చిందీ.

లేవలేని వాళ్ళు
ఉన్నచోటే మొలకెత్తాలనీ
సాగలేని వాళ్ళు
వెనక్కి తిరిగి పోవాలనీ.

తళతళలాడే హిమశిలా రూపం కన్నా
కదలే ప్రవాహ జగమే నా అస్తిత్వం.

## 10. నీడల క్రీనీడల అనుబంధం

ఆకృతిలో అనుబంధాన్ని వీడని
నీడను చూచి కొందరు భయపడతారు
ఆ నీడతో కొందరు ఆడుకుంటారు
జీవితంలో తప్పనివీ, నీడలు క్రీనీడలు!

నింగిలో నీలిమబ్బుల్లా
నేలపై తరుచ్ఛాయల్లా

నీడలు! క్రీనీడలు! ఎన్నో
జీవిత కళలో భాగమై.

మనిషికీ మనిషికీ భిన్న రుచుల్నిస్తాయి
నీడల్లో పెద్దది చీకటి!
చీకటి గురించి చర్చలు జరుగుతాయి.
దివ్వెల్ని వెలిగించడమే మిగులుతుంది.

శిథిలాల చీకటిలో
శ్వాసమాత్రంగా మిగిలిన చరిత్ర హృదయం
కల్పనలో – ఆలోచనలో మెరపు తీగెలా
మెరుస్తుంది, ఆకర్షిస్తుంది.

పగలు సూర్యుని తేజంతో
రాత్రి చంద్రుని కాంతితో
విశాలమైన ఆకాశం మనసులో
ఆలోచనకు ఆకృతి నిస్తుంది!

లోన ప్రాణి చలనంతో
బయట అలల పంక్తులతో
గభీరమైన సముద్రం, మనసులో
అనుభవానికి లోతునిస్తుంది!

క్రింది నీడలతో క్రీనీడలతో
ఏకాంతం నుండి సమాజంలోకి
కల్పన నుండి వాస్తవానికి
మనిషి మనిషిలో అస్తిత్వం, భిన్నం.

# 11. అహంకృతి ఆయుధమై

అహంకృతి ఆయుధమై
అంతరంగాన్ని గాయపరుస్తుంది
అహంకృతి ప్రేరణమై
రక్షణకు కవచమూ అవుతుంది.

ఆర్ద్ర మేఘం కన్నా అనల తేజం
లోతైన జ్ఞాపకాల ముద్రల్ని వదలుతుంది.

మనుషులతో ఆడుకున్న వాళ్ళనీ
మనుషుల్ని ఆడించిన వాళ్ళనీ
కాలం జ్ఞాపకం పెట్టుకుంటుంది.
సామాన్యుల సందర్భం ఆ తెరవెనకే!

నేలపై అడుగులెవరికి గుర్తుంటాయి.
మట్టిలో కలిసి కనిపించకుండా పోతాయి.
చరిత్ర పుటల్ని తెరిస్తే
వాక్యానికీ వాక్యానికీ మధ్య
అహంక్రియా ఘన కార్యాల నుండి
అగ్ని కణాలు! రాలుతూ కన్పిస్తాయి.
వాటి వెనకనే! ఉండి ఉండి
బాష్ప కణాలు! జారుతూ కన్పిస్తాయి.

క్షణం ఆగి వెనక్కి తిరిగి చూస్తే
కూలే ఆదర్శ శిఖరాల మధ్య
చెదరిన వాస్తవ శకలాలు కనిపిస్తాయి
కరగి రాలిపడే కలలూ కనిపిస్తాయి

గాలి వీస్తుంది నిరంతరం దిశదిశలో
పూల వనిపై అగ్నిశిఖలపై ఒకే విధంగా.

సూరీడు పాతవాడే ఎప్పటివాడో?
ఎప్పటికీ ఆకర్షణ మాత్రం వీడదు.
అంతరంగం పాతదీ, పుట్టినప్పటిదీ!
ఎప్పటికీ ప్రతిఫలన శక్తి వీడదు.

మనిషిలో పై కెగసే కోరికలు
తప్పవు! కాల్పనికం! కూడా అవసరం.

గాలిని చీలుస్తూ మబ్బుల్ని దూస్తూ
పై కెగరాలనే మనసులో ఆవేదన,
ఎన్ని సృజన రూపాలో దిద్దుతుంది
వాస్తవ శిఖరాలకు ఆధారతలమై!

పక్షికి రెక్కలు రెండే!
మనిషిలో రెక్కలు! ఎన్నో!
ఊహ కొకటి అయితే
ఊహ లెన్నో అన్నీ!

అహంకారం వాహనమై ఎగసి
కొత్త జగాన్ని ఆశిస్తుంది.
సృజన శక్తి పద ముద్రలతో
అంతరంగాన్ని అలంకరిస్తుంది.

# 12. అదృశ్యముఖం

విరామ సమయం ప్రబోధ కళతో
శబ్దించే సుభాషితాల ప్రకాశంలో
అదశ్య మానవతా ముఖం మనిషిలో
చిత్రార్పిత రేఖలతో ఆకర్షిస్తుంది.

చేతి వ్రేళ్ళమధ్య
వెలిగే సిగరెట్ చివరి నుసిలా
అదృశ్య మానవతా ముఖం మనిషిలో
శాంతి పర్వాన్ని తలపిస్తుంది.

అపుడే చిగిర్చి చెట్టుకొమ్మను
పూలతో పండ్లతో చూడాలనే కోరికలో
అదృశ్య మానవతా ముఖం మనిషిలో
ప్లాస్టిక్ కల్పనతో మురిపిస్తుంది.

చంద్రుని వెన్నెల స్పర్శతో
కాఠిన్యం సడలిన నిశలో
అదశ్య మానవతా ముఖం మనిషిలో
కొత్త అధ్యాయానికి దారి తీస్తుంది.

భూమి పొరల్లో నుండి చిమ్మే నీరుతో
మబ్బు హృదిలో నుండి జారే నీరుతో
అదృశ్య మానవతా ముఖం మనిషిలో
కాలానికి సరికొత్త రూపాన్ని ఇస్తుంది.

ఆకాశాన్ని బంధించిన పిడికిలి సడలి
బీజంలో నిద్రించిన పచ్చదనం మేల్కొని,
అదృశ్య మానవతా ముఖం మనిషిలో

వర్తమానంలో సిద్ధమైన భవిష్యత్తుతో
సమయానికి సరి కొత్త రూపాన్ని ఇస్తుంది
సృజనకు అతి నవ్యమైన దర్శన మిస్తుంది!

## 13. ఎప్పటికీ శిల్పమై

గుడిలోనో వీధిలోనో మ్యూజియంలోనో
నిలిపిన ప్రతిమను చూస్తే
జడంలో దాగి ఉన్న
రహస్య చేతన మెదలుతుంది!
వజ్ర సంకల్పంతో నున్న
గిరి శిఖరం పక్కనే నిలిచి నట్లుంటుంది.

మహా సంస్కృతీ నదీ తీరాన
పచ్చపచ్చని అనుభవ జగం వెలుగుతుంది.
కల్పవృక్షం నీడ లేచి
ఎదురుగా నిలిచి నట్లుంటుంది.

ఆలోచనలో దిగిపోయిన
పరలోకాన్నీ పరమ ధామాన్నీ మరిపించే
జీవితకోణంలో దిద్దిన శిల్పం
నింగికీ నేలకూ వంతెనలా ఉంది.

అరచేతుల్లోని ఎడారి రేఖల్లో నుండి
బయటపడే హరిత చేతన మెదలుతుంది.

ప్రతిమతో మాట్లాడుతూంటే
ఓపిగ్గా ఏ అడ్డూ రాకుండా బదులు పలక్కుండా
ఒకే ఒక ఆదర్శ శ్రోత దొరిక నట్లుంటుంది
అవసరం లేని ఆవేశం అదశ్యమవుతుంది.

మనిషిలో ఇంకా తెరవాలిసిన
మూసిన తలుపులు తెరచుకునే
ప్రయత్నం మొదలువుతుంది,
అనుభూతం కాని మనో దృశ్యంకై.

గడ్డ కట్టిన
యుగయుగాల ప్రవాహ తరంగాల
ప్రత్యక్షరూపం
మనోవేదికపై నిలుస్తుంది,
సృజనలోక చిహ్నామై
ఎప్పటికీ శిల్పమై

## 14. అంతరంగ స్వేచ్ఛలో

అంతరంగ స్వేచ్ఛలో చాచిన చేతుల్ని
ఆకాశం అందుకుంటుంది.
మానసిక దరిద్రాన్ని గమించే అడుగుల్ని
మహావని ఆదరిస్తుంది.

జడంలో చేతన వలె
అంతరంగ సృజనతో
శబ్దంలో విశ్వం వికసిస్తుంది
అర్థంలో అనుభవం ఫలిస్తుంది.

మనిషిలో విజయంకై
ఒంటరి బిందువు నుండి అభియానం
ఏకాంతం నుండి సమాజంలోకి
ప్రపంచం నుండి ప్రపంచానికి.

ఉదయం దెబ్బ తగిలి గాయమై
నెత్తురొలికి భయం వేస్తుంది.

మధ్యాహ్నం ప్రమాదంలో ఛిన్నమై
నెత్తురు చిలికి కోపం వస్తుంది.

సాయంత్రం హింసలో హతమై
నెత్తురు చిత్రం పగ రేపుతుంది.

భయమూ కోపమూ పగ మనసులో
అనలాన్ని వివిధ రూపాల్లో తీర్చి వదలుతాయి.

గతం ఎట్లా ఉన్నా స్మరణలో
కాంతి చిత్రం గీయబడుతుంది.
భవిష్యత్తు ఎట్లా ఉన్నా కల్పనలో
రమణీయ రూపం అవతరిస్తుంది.

బ్రతకడానికెన్నెన్నో అవసరమవుతాయి
ఏది తక్కువయినా అపరిపూర్ణమే.

మాట పాట ఆట మాత్రమే చాలదు.
మానవతా స్పృహ స్పందన క్రియతో
పలికే కవితకూ అన్నీ సరిగా అమరాలి!

మానవ వికాస పరిణామంలో
పరిణత జీవన శిఖరాలే కవిత్వం

ఒకవైపు మహా పర్వతం
మరోవైపు మహా ప్రవాహం
ముందు సూర్యుని ఉదయం
వెనక సూర్యుని అస్తమయం.

శిశువు నుండి వృద్ధు వరకూ
కాలాన్ని ఆయువుతో కొలుస్తూ
ఊపిరితో ఆయువు సాగిస్తూ
సుదీర్ఘ సమాజ చరిత్రలో
మనిషీ! వలయంలో కేంద్ర బిందువై.

బండరాళ్ళ ముక్కల మధ్య నలుగుతూ,
కొండ చరియ అంచుల్లో పడి లేస్తూ
గాలిలో ఆకలి క్షణాల్ని దొరలిస్తూ
బ్రతుకుతూన్న జీవితాలు! ఇప్పటికీ!

మానవతా సూత్రం కొసలు
దూర దూరం జరిగి పోతూ
అంతరం పెరిగిన కొద్దీ
మనిషికి బదులు ఛాయలు కనిపిస్తాయి!

పైకివెళ్ళే కొద్దీ ఛాయ అదృశ్యమవుతుంది.
స్వచ్ఛమైన అంతరంగంలో
సూర్యచంద్రుల ప్రతిఫలనం
పగలూ రాత్రీ జీవిత పార్శ్వాల్ని చూపుతుంది.

సూర్యుడు వివేకానికీ
చంద్రుడు అనుభూతికీ
ప్రతీకలై మనిషిలో అస్తిత్వం!
అంతరంగాన్ని స్పృశిస్తుంది! పలికిస్తుంది!

సూర్యుని వీపుపై కూర్చొనీ
చంద్రుని బుజాలపై నిలిచీ
పై కెగరాలనే ఉంటుంది!
వ్యక్తిలో, ఉన్న స్థితి మరచీ!

మట్టినీ మానవతనూ వదలి
గగన విహరణం చేయాలనే!
రెక్కల్లేని ఎగర లేని రూపం
మనిషిలో ఉన్నది ఏంచేస్తుంది?

చెట్టు కొమ్మపై నుండి దిక్కులు చూస్తుంది.
ఇతరుల బుజాల్ని ఆశ్రయించి బ్రతుకుతుంది.
గమ్యంతో పనిలేకుండా
భవ్యంతో పనిలేకుండా.

సూర్యుడు వివేకానికీ
చంద్రుడు అనుభూతికీ
ప్రతీకలై మనిషిలో అస్తిత్వం! నిరంతరంగా
జన్యు చరిత్ర నుండి! మనోభూమిక దాకా!

## 15. ప్రకాశికలు

(1)

సమయ ఝరిణిలో మనస్సు కదలిపోతూంది
ఆ వెనకే దినకర మణి ఈది ఈది వస్తూంది.

బిందువు బిందువులో జీవన కళతో
లహరి లహరిలో మానవ చలనం.

బిందువు బిందువులో చిరు కోరికతో
అజంతాను దిద్దుకొనే చిత్రం!

లహరి లహరిలో చిరు కోరికతో
ఎలోరాను దింపుకొనే శిల్పం!

సమయ ఝురిణిలో మనస్సు తరలి పోతూంది
చరిత్రలో ఎత్తిన మానవీయ ముఖంతో

(2)

ఒక దీపం వెలుగుతుంది మనిషిలో తెలివిగా
ఒక దీపం కునుకుతుంది మనిషిలో గుడ్డిగా

రవికీ శశికీ ఇలపై ప్రతినిధియై ఉందీ
మంచికీ మానవతకూ ప్రతీకయై ఉందీ.

నిన్నటి వెలుగుల దీపం నేటికి గతమవుతుంది
చుక్కల్లో ఒకటై స్మృతి పథాన మినుకుతుంది.

జీవన గతిలో అనల చిత్రమయిన వెలుగు
కల్పన కళలో కుసుమ గుచ్ఛ మవుతుంది.

పీడనలో తాడనలో చీకటి నీడలలో
చిరంజీవ మొకటే! అది మానవతా దీపం!

(3)

అతీత బిందువుపై కల్పనలో మనస్సు
పూలు పూచి బహు ఫల రుచి కల్పిస్తుంది.

కలలో వాస్తవ మొక వజ్రంలా మెరుస్తుంది
మంటల పయి జిగీష జలదంలా కదలుతుంది.

ఒక సమయ మలంకరోతి పూల దండయై
ఒక సమయ మథఃకరోతి ఖడ్గ ధారయై.

గగన భావనా దిశలో కదలే చింతనం
మానవీయ కోణంలో నేలకు దిగుతుంది.

విషాద హిమ శిలలో సృజన ధార పిండుతుంది.
నిశీథి చంద్రికలా హ్లాద కీర్తి పరుస్తుంది.

(4)

మానస పరిమళ భావన తెలీని మనిషి లేదు
మనిషి హృదయ ఫలకంపయి లిపి చెదరదు చెరగదు.

ఎదలో సంవేదన త్యాగాంశను వరిస్తుంది
మదిలో ఆనందం అలంక్రియను కోరుతుంది.

నాకమొ నరకమొ ఊహలకే పరిమితం
వాస్తవ జగత్తులో బ్రతుకొక అనుభవం.

శ్వాసకు పుష్పం కన్న సౌరభ వీచిక ముఖ్యం
గుండెకు అందం కన్న స్పందన శీలం ప్రాణం.

విషాద జలధిలో మనిషి నావయితే చాలదు
పయనంలో శక్తులు వికసిస్తేనే సార్థం

(5)

గిరులు దాటి ఝురులు దాటి ఎడారి సీమలు దాటి
రణం నుండి పణం నుండి ఖేదం నుండి మోదం నుండి

అమరమై అనంతమై మానవీయ మహాస్వరం
యుగ యుగాల ధారలో సరిస్తుంది స్వనిస్తుంది.

నరకబడిన చెట్టు వెనక వికాస చరిత్ర ఉంది
పచ్చదనం కయి తపించు జీవన ధరిత్రి ఉంది.

సమాజ చరిత్రలో మానవతా యుగ బింబం
దశదశలో గ్రహణం పట్టిన రవి చందం

మనిషిలో నవ యుగ ఘర్షణలో అస్తిత్వం
విజయ పథంకయి తిరిగి ఆరాటం పోరాటం.

(6)

కిరణం మెలకువ నిస్తే చీకటి కల నిస్తుంది
చలనం బ్రతుకును ఇస్తే గమనం దిశ నిస్తుంది.

కిరణంతో విహగ మెగిరి స్వేచ్ఛను నిలుపుతుంది
పవనంలో కుసుమం తన ఉనికిని తెలుపుతుంది.

సూర్యునికే నిచ్చెనతో పని లేనే లేదు
స్వాగత కరాలతో నింగి నిలిచి ఉంటుంది.

ఉదయాగమనానికి ఆహ్వానంతో పని లేదు
సహృదయ రూపానికి సకల విశ్వ మాత్మీయం.

ప్రతిభ ముందు చీకటి సోపాన మవుతుంది.
మనిషి పురోగమనంలో తప్పనిదీ నిజరూపం.

(7)

విషాద ఛాయలలో నిశీథి చంద్రుని కళ
ఎదలో మనిషికి హ్లాద జగం చూపుతుంది.

నిశీథి సమయాన నే నెటు పోగలననీ?
నిశీథియే నను వదలి ఎటకో? పోతుంది.

నిశీథి సమయంలో గాలుల తరగలపై
నాకయి ఒక వెలుగు పాట వినబడుతుంది.

గిరిఝరి జనపద కానన భూముల్ని దాటి
మనిషికి ఎదలో రాగ పథం చూపుతుంది.

విషాద సమయాన నిశీథి చంద్రుని కళ
మనిషికి మతిలో శాంత జగం నిలుపుతుంది.

(8)

ఒంటరితన మెక్కడిదీ? నాలో ఈ సమయం
లోపల సమాజ చలనం అలలై కదలుతూంటే.

నిశ్శబ్ద ప్రపంచ మెక్కడిదీ నాలో ఈ సమయం
సుదీర్ఘ చరిత్రలో రణ రణనం శబ్దిస్తూంటే.

చీలిన పథ మెక్కడిదీ నాలో ఈ సమయం
విశ్వ హృదయ సంస్కృతిలో ఒకటై స్పందిస్తూంటే.

అతీత తల మెక్కడిదీ నాలో ఈ సమయం
ముక్తమయిన పావురం విషాద కథ చెబుతూంటే.

నిరీహ నిలయ మెక్కడిదీ నాలో ఈ సమయం
నెత్తురుతో తడిసిన లత పూలను కుసుమిస్తూంటూ!

(9)

కవిత రాక కయి తలుపు తెరచి ఉంచితే
కథ బంధువులా వచ్చి నిలిచి పోయేను.

వెలుగు రాక కయి తలుపు తెరచి ఉంచితే
మనుషుల వలె నీడలు లోనికి సాగేను.

అతిథి రాక కయి తలుపు తెరచి ఉంచితే
ఇరులు చేరి లోనికి తలుపులు మూసేరు.

గాలి రాక కయి తలుపు తెరచి ఉంచితే
అగ్ని చేరి తోడుగా నిలిచి పోయేను.

మానవతా ధుని కయి చూచే హృదిలో
తుహిన శిలలు పర్వతమయి నిలిచేను!

(10)

మధ్యలో ఆగేది పాటకాదు, మాట అవుతుంది.
మధ్యలో ఆగేది ఝరిణి కాదు; సరసి అవుతుంది.

పాటలో స్వనిస్తుంది ఆత్మీయం
ఝరిణిలో సరిస్తుంది జీవితం.

పాటలో ఉత్ప్లవనం అనుభూతికి వస్తుంది
ఝరిణిలో సంప్లవనం అనుభవాని కొస్తుంది.

ఉన్న లోభిలా ఉండ గలదు ఆకాశం
లేని దాతలా ఉండలేదు భూదేవత.

మథనంలో అమృత మెపుడుబడితే అపుడు రాదు.
ఆ సమయం వస్తుం దొక వ్యక్తిత్వ పరీక్షలో.

## 16. సృజన యానం

### 1. కథలో కొత్త ప్రపంచం

సృజన భూమి పయి మాన చరిత్రతో
చలన శక్తి రూపం కవితావిష్కారం నాలో

ఉరుములతో మెరపులతో క్రమ్మిన మబ్బుల్లో
కదలే సూర్యునిలా ప్రతిభా బింబం నాలో.

మానవీయ రశ్మితో రేపటి దివం కయి
మానవతా చంద్రికతో రేపటి రాత్రి కయి
ఆశతో ప్రచరించే సృజన కళా యానం.

ప్రశాంత బీభత్స ముద్రలతో
నిర్మాణ వినాశన కథలతో
ఆనంద విషాద యోగాలతో
ఋతు కర్తను తలపిస్తుంది.

ధూళిలో ధూమంలో మంచులో
మబ్బులో నీడలో గ్రహణంలో
భాషకు దేశానికి కాలాని కతీతంగా
అంతరంగ చేతనతో
నిన్న నేడు రేపు –
సూర్యుడదే తేజం ఒకటే
కథలో కొత్త ప్రపంచం.

## 2. మనిషికో గమ్యం

పుట్టింది మొదలు అవిచ్ఛిన్నగా
మనోభూమి పయి చైతన్య స్రవంతి
తీరాల్ని అమరుస్తూ సృజన దృశ్యాలతో
కాలానికి కథా రూపాన్ని ఇస్తూంది.

దుఃఖంలో సంతోషంలో
ఓటమిలో గెలుపులో
లేజర్ పదును గమనంతో
జడ రూపం అంతరిస్తుంది.

కత్తి వేటుకీ బాంబు ప్రేలుడుకీ
శాంతి ముక్కలై చెదరిన దృశ్యం
వెనక నున్న యథార్థ కోణం
“ఎక్స్‌రే”, దృష్టికి కనిపిస్తుంది.

విభేదమూ వినాశమూ పరివర్తనం
పరిణామ క్రమంలో భాగమై
కలహం లేని ఘర్షణ లేని
సమాజం! గగన పుష్ప సదృశం.

ఎవరెవరి ప్రమేయంతోనో
ఎవరెవరి అవసరాలతో
అడుగుముందుకు వేసే చరిత్ర
కొత్త పాయల్ని చూపుతుంది.
కొత్త దారుల్ని పొందుతుంది
మనిషికో గమ్యం! మనోజగంలో.

## 3. మూతపడని హృదయం

బాల్యం జీవితానికి అవతారిక
అవతారికతో అస్తిత్వం ఆరంభం.
పరమ దరిద్రం నుండి ఎగసిన జ్వాల
అశాంతిలో ఏమయ్యేదీ తెలీదు.
తత్త్వ తృష్ణ దిశలో సాగవచ్చు
తిరుగుబాటు బాటను పట్టవచ్చు.

కుడివైపో! ఎడంవైపో!
వెనువెనుకో! మునుముందో!
నిర్మాణమొ! విధ్వంసమో! నిర్లిప్తో! ఉత్సాహమో!
ఏ దారైనా కల్పనలో స్వప్నం!
మిగిలేది ధరా ఖండ వాస్తవం.

సందేశంలో సందేహాలు వినిపించవచ్చు
పయనానికి అంతరాయం కలగవచ్చు.

సృజన యానమంటే,
ఆరిన దీపం వెనక దీపం వెలగడం కాదు.
వెలిగినా వెలక్కపోయినా ఉన్న దీపం
గుడ్డి అయినా మసక పడినా ఆరినా
ఆ దీపంతోనే! మనిషి అస్తిత్వం!
ఆ అస్తిత్వంలోనే! కథా ప్రపంచం.

ఎడారిలో మేఘ గర్జనం
చెవి కింపుగానే ఉండొచ్చు.
ఎడారిలో మెరుపుతీగె
కంటికి ప్రీతిగానే ఉండొచ్చు.

ఊహకు మెలకువ తప్ప నిద్ర లేదు
బాధకు వేదన తప్ప శాంతి లేదు.
ఏరి కోరి కట్టుకున్న ఊకలతో
ఏ ఆలోచన పై కెగరనే లేదు.

అంతరంగంలో సూర్యునికీ
మస్తిష్కంలో ప్రపంచానికీ మధ్య
చినిగిన 'ఓజోన్' పొరలా
శక్తి అందని "ఎచిలెస్" పాదంలా
మనోభూమికలో స్వార్థం
సృజన రూపాన్ని మారుస్తుంది
వికృతరూపాన్ని తొడుగుతుంది.

తాళం వేసిన గదిలో నిశ్శబ్దం
ఏ పాటను స్వనిస్తుంది
ఏ మాటను వినిపిస్తుంది
వెలుగుకై తలుపు తెరచి ఉంచితే

భిక్షువు రావచ్చు! పక్షి రావచ్చు! కానీ
కిరణంతో రావలసింది మాత్రం
మూత పడని సృజన హృదయం.

## 4. సృజన చిహ్నం

రోజొక సందర్భ ముఖంతో ఎదురవుతుంది
ఆనంద శిఖరంకై మనిషిలో అన్వేషణ
ఇప్పటిదా? ఎప్పటిదో? చరిత్ర కందనిదీ.
ప్రతి యుగ దశ దశలో కొత్త పథంలో.

ఎప్పటికీ శిఖరానికి బారెడు దూరంలో
ఆ రోజుకూ యాన సమయ మయిపోతుంది
మరో రోజు ఆకర్షణ! ఆరోహణలో
ప్రేరణ మనసును బంతిలా ఎగరేస్తుంది.

ఆనందం విపణిలో దొరికేది కాదు
మానవత మస్తిష్కంలో వ్రేలాడదు.
ఎవరి ప్రయాణం వారికి పరిమితం
ఎవరి అనుభవం వారికి ప్రియతమం.

కాలి కింద అణగిన పాముతో
విప్పిన నెమలి పురిలా జ్ఞాపకాలు
వీపు మీద చేరిన పాములతో
ఎగిరే విహంగం రెక్కల్లా జ్ఞాపకాలు.

పీడన వేదన బాధా స్వేచ్ఛా జగం
సమయ సమయ సందర్భాలకు కీలకం!

మోసే బరువు మరచి
బాధ లేని ఎదలో

ప్రచండ గ్రీష్మంలో
ఆనందంలో ఊగే
మల్లె తీగ అల్లుకున్న మామిడి చెట్టులా
మనిషిలో అస్తిత్వం! సృజన యాన చిహ్నం.

## 17. అసంపూర్ణం

వర్తమాన స్థితి చలనంలో
సమాజ బంధువు రూపం
ఇది మానుష నవ సూక్తం.

ఉపదేశాల నుండి నినాదాలతో
చండ శాసనం నుండి చర్చా వేదితో
ఆశా విజయ పథంలో పయనం.

నలగని వాడని రాలని
దూళిలో కలిసిపోని
మానవతా పుష్పంకై నిరీక్షణం
ప్రజాస్వామ్య దిశలో అన్వేషణం.

భూకంపం పెను తుఫాను సునామీల
మానవ శక్తికి మించిన
విధ్వంస కరాళ ముద్రల్ని మరచి
మృత్యువు అంచుల్లో నుండి
ఉజ్జీవన కళతో ఈ సమయం
ఆశా విజయ పథంలో పయనం.

ప్రాణంతో కాలంతో జ్ఞానంతో
భౌతిక మానస అతీతాల్ని

పొందే మనిషిలో అస్తిత్వం
సమాజ చరిత్ర గుర్తుల నిలయం.

శాంత సముద్రంపై
కదలే అలల ఆహ్వానం
అచల భూమిపై
పరచిన పచ్చని స్వాగతం.

మనిషిలో వర్తమానానికి
ప్రయాణ శక్తి నిస్తున్నాయి
స్మృతి పురాశాలలో
గతానికి తప్పదు విశ్రాంతి!
అందుకే ఈ సమయం!
గతానికి గుడ్‌బై!

ప్రాణంతో శరీరం
మృత్యువును తప్పించుకోచూస్తుంది.
కాలంతో ఆయువు
ఇంకా సాగాలనే కోరుతుంది.

జ్ఞానంతో వికాసం
పూర్ణత కయి ఎదురుచూస్తుంది.
ప్రాణంతో కాలంతో జ్ఞానంతో
మనిషిలో సంపూర్ణతకై పయనం.

జలద నయనాలతో
ఆకాశం ఆకర్షిస్తూంది.
స్నేహ పవనాలతో
ప్రకృతి ఎదురవుతూంది.

ఆశా విజయ పథంలో పయనం
ఏ యుగ దశలోనూ అసంపూర్ణమే
ఏ సందర్భంలో ప్రయాణ మనోరూపం
విషాద స్మృతికి శాంతి కవచమవుతూంది.

*(26 డిసెంబరు 2005 సునామి మెమోరియల్ సర్వీస్ సందర్భంగా)*

## 18. హింసతో మస్తిష్కం

హింసతో
క్షణాల్ని వెర్రెక్కించే సందర్భం
ఉగ్రవాద
విపరీతాల్ని ప్రతిఫలించే బీభత్సం.

ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ
మానవీయంలో హక్కు

అగ్ని క్షణాల్ని చిమ్మడానికి కాదు
మృత్యు పథాన్ని తెరవడానికి కాదు.

జన గణ సంచరణ స్థానాలు
మానవతకు సమాధులవుతున్నాయి.

సృజనాంకం లేని శుష్కమైన
జీవిత సమయం చేసేపని!
ఆఘాతం హననం విస్ఫోటం!

వివేకానికీ మూఢత్వానికీ మధ్య
రేఖలు చెదరిపోతున్నాయి
మనిషికీ పాషాణానికీ మధ్య
అంతరాలు నశిస్తున్నాయి.

విషమంలో కర్తవ్యం మరచి
ఓటు మిషతో స్వేచ్ఛ పేరుతో
అంతరంగాన్ని మోసం చేయడం
మానవతకు మసి పట్టించడమే.
ప్రజాస్వామ్యమెంత ఇష్టమయినా
ఎదుర్కొనే శక్తి లేని నీతి లేని
మస్తిష్కం, పాషాణ భోషాణమే!

## 19. నేలపయి అడుగు కై

ప్రకృతి రుచికి భిన్నమై
మానవతకు దూరమై
చుట్టూ సంక్షుబ్ధ ప్రపంచం.

పుస్తకంలో పదంలా
జలధిలో అలలా
గగనంలో నక్షత్రంలా
అనుభవ జగంలో మస్తిష్క శక్తి
అపుడపుడూ సృజన బిందువును నడిపిస్తుంది.

క్షణాల్ని మనిషిలో
సంతోషంతో రెపరెప లాడించింది
క్షణంలో ఏదో పేరుతో
భీ స్పర్శతో గజగజ లాడిస్తుంది.

చీకటికన్నా కనబడే వెలుగే
తాను భయపడాలిసి వస్తూంది.

ఎక్కడివో నెత్తురు చుక్కలు చిమ్మి
తనపై మరక లేర్పడ తాయనో?

ఎక్కడివో నిప్పు రవ్వ లెగసి సోకి
తనపై మంటలు రేపుతాయనో?

ఒకటి
హంతకమది నిందతో అభిషేకించవచ్చు
మరొకటి
కాలిన గాయాలతో అలంకరించవచ్చు.

రోజు రోజుకీ అవకాశాల వేగంతో
నిరంతరం జీవితం ఆపై పై ఎత్తులో
విమాన యానంలా సాగాలనే ఆరాటం,
ఆకాశంలా విస్తరిస్తూపోతూనే ఉంది.

ప్రకృతి గతికి దూరమై
ముక్కలు ముక్కలై మనిషిలో వివేకం
కుంచితమై ఆలోచన
వంచితమై మానవత
కంటికి కన్పించని ప్రమాదం!

విమాన యాన భాగ్యం సరేకానీ
అంతరంగంలో మాత్రం ఆశ్చర్యం గానే
నేలపయి అడుగు నిలిస్తే చాలనిపిస్తుంది.

## 20. హృదయస్పృహకు ప్రతినిధిగా

సమాజ సంబంధాల శాఖా ప్రశాఖలతో
చారిత్రక వాస్తవాల పరిణామాలతో
అవసరాల అలజడితో అవకాశాల దిశలతో
మనః ప్రవృత్తుల ప్రకారాలతో ప్రాకారాలతో
మనిషిలో ఆదర్శం, విజయ పరీక్షలో

బలం తెలివి శక్తులతో సమాజ జీవితం.

కష్టాల్ని చూచి జాలి పడే స్పందనతో
కష్టాల్ని తెచ్చే స్వార్థ చింతనతో
ఒక దాని కొకటి ఎదురుగా
మనిషిలో రెండు ప్రపంచాలు.
వాస్తవాల ప్రతిఫలనంతో
కల్పనలో నిర్మాణంతో
ప్రజ్ఞ నుండి సృజనతో
పురోగమన జీవం మనిషిలో.

మేధ ఉంది ఒకటే, అయినా
వేల వేల చాచిన చేతులతో
వేల వేల నడచే కాళ్ళతో
విస్తరించి పోవాలనే కోరిక!

ఉన్న రెండు చేతులూ
ఉన్న రెండు కాళ్ళూ
సార్థమైతే చాలనీ ఉండదు.

సంవేదన సంకల్పం స్వేచ్ఛతో
ఎన్న బడిన పరిస్థితుల కటు నిజాలతో
బానిస దశ నుండి
పీడిత స్థితి నుండి
సమాన భావనాకృతికి
మానవతా పూర్ణమై మనిషిలో ఆదర్శం
స్వానుభవంలో చిహ్నంగా మిగిలింది
ఆలోచనలో భద్రంగానే ఉంది.

అద్దంలో చంద్రునిలా శుభ్రంగా అందబోతూ
సరసిలో సూర్యునిలా రశ్మితో అందుతూ
మ్యూజియంలో వజ్రంలా అందంగా ఆకర్షిస్తూ
ప్రచారంలో వ్యాపారంలో భాగంగా
అపుడపుడూ హృదయస్పృహకు ప్రతినిధిగా.

## 21. మారణ విన్యాసాలు

ఉగ్రవాదం! దమన కాండ! బీభత్సం
రెండూ దారుణ మారణ విన్యాసాలే!
చర్యకు ప్రతి చర్యలతో సమాజంలో
దీనికి తుది వాక్యం ఎక్కడుంది? లేదు.

తెల్లని శాంతి నెత్తురు మరకలతో
సాయం సంధ్యా శకలాల్ని తలపిస్తూంది
దగ్ధ మయ్యే క్షణాల నుండి
ఇక చీకటి ఒకటే! మిగిలినట్లుంది.

చీకటి తొలగితేనే
వెలుగు రావడం కాదు.
వెలుగు రాకతోనే
చీకటి తొలగుతుంది.

నెత్తురు అలలపై తేలుతూ
అగ్ని శిఖలపై ఎగురుతూ
నీటి బిందువుకై తహతహ
మేఘం కోసం నిరీక్షణ!

చరిత్ర వెనుక నున్న రహస్యం
ఎప్పటికీ దాగే ఉంటుంది,

చరిత్రలో కనిపించని వాస్తవం
ఎప్పటికీ బయటికి రాదు.

పనిలో పులి గాండ్రుల్నీ సింహరావాల్నీ
భయంలేని పక్షుల రవం అణచేస్తుంది.

చేతిలో మారణాయుధంతో
ప్రజల వెంటబడే కన్నా
ఏ ఫ్లూట్‌నో వయొలిన్‌నో పలికిస్తే
ప్రజలే వెంటనంటి వస్తారు.

జ్ఞానాన్ని పొందిన బుద్ధుని స్వరం
లోపల శాంతి కళతో ధ్వనిస్తుంది
శోకం వదలిన అశోక హృదయం
లోపల విజయ గతిని స్పందిస్తుంది.

దూరంలో ఉంటేనే
పులి. అయినా! సింహమయినా! ఆకర్షణ! ఆశ్చర్యం!
దగ్గరగా ఉంటేనే
హరిణమయినా! హంస అయినా! ఆకర్షణ! అందం!
ఈ దూరం దగ్గర అంతరంలోనే
మానవతా స్వర తరంగ సంచారం.

## 22. మళ్ళీ మళ్ళీ

పర్వత శిఖరాలు దాటి
నదులూ దేశాలు దాటి
హంస ఎగిరి వస్తుంది.

జీవన శిఖరాలు దాటి
స్థితి గతి దూరాలు దాటి

కవిత ఎగిసి వస్తోంది.
రైఫిల్ వదలిన బులెట్ కన్నా
సాయుధ రణ విమానం కన్నా
వేగంగా యానం చేయాలనే!

కవితకు రెక్కలున్నాయో? లేదో?
తెలీదు, కాని సృజన యానంలో
హంసతో పోటీ పడుతూంది.

వర్తమానం దారి చూపుతూంది.
భవిష్యత్తు త్వర పెడుతూంది.

హృదిలో చెరొకవైపు చేరతాయి.
అదృశ్యమైన సత్యానికి నిజ రూపాలై.

ఎడారి నిశ్శబ్దం పల్లవిత మవుతూంది.
పాషాణ మౌనం నిస్వనిత మవుతూంది
కురిసే బాధల మంచులో
మనసుకు
సూర్యరశ్మి తొడుగుతూంది.

ఈ మధ్య చుట్టూ లేచిన
ఎత్తైన నిర్మాణాల మధ్య
క్షితిజాన్ని చూచి ఎంతకాలమయింది?

జన సమ్మర్దమైన వేగంలో
మనిషిలో ప్రాణానికీ
మనిషితో యంత్రానికీ
పోటీ పెరిగిపోతూంది.

హంస ఎగిరి పోవచ్చు
శాంతిని వదలీ
ఏ సరస్సులోకో!

కవిత తరలిపోవచ్చు
క్రాంతిని నిలిపీ.
ఏ మనస్సులోకో!

పర్వత శిఖరాలు దాటి
నదులూ దేశాలు దాటి
హంస ఎగిరి రావాలనే!

జీవన శిఖరాలు దాటి
స్థితి గతి దూరాలు దాటి
కవిత ఎగిసి రావాలనే!
మళ్ళీ మళ్ళీ!
మళ్ళీ మళ్ళీ.

## 23. ఆకాశం ఒకటే

ఆకాశం ఒకటే!
దిశలు చూస్తే! పది
దిశ దిశకో ప్రపంచం
మనిషి మనిషికో జగం!

కావలసిన వస్తువుకై
వెదకే సమయంలో
నా వెనకే వచ్చేసే
నీడల పైనే చింతన!

మనోవాహన గమనంలో
వెలుగు సూచికలు కళ్ళు!
సంతోష విషాదం లో
దారి చూపే సిగ్నిల్స్.

విత్తు దారి నిస్తుంది చివురుకు
చివురు దారి నిస్తుంది కొమ్మకు
కొమ్మ దారి నిస్తుంది పూలకు
మనిషిలో జీవిత మొక తరువై.

నిలవడమో విరామమో కాని
పయనానికి ముగింపులేదు.
గమ్యం చేరే ఆరాటం
అడుగుకు రెక్కల్నిస్తూంది.

కావలసిన వస్తువు లెన్నో
విపణిలో ఎదురుచూస్తూ,
జేబులో అందుతుంది గగనం
శూన్య వదనంతో దాగి!

అశ్రువు బిందువులో
ఒక సమయం సూర్యుడు
మరో వేళ చంద్రుడు
మనోభావ కళలై.

ఒక సమయం అశ్రువు
ఎదపై కొండను వాలుస్తుంది.
ఒక సమయం లోనో
చేతికి కత్తిని అందిస్తుంది.

రవినీ శశినీ తన పయి
గట్టుకు చేరుస్తుంది నది,
మనిషి మాత్రం గట్టునే
చూస్తూ సమయం గడిపేను.
శిథిలాల్లో గాయాలతో
'నిజం' నిప్పులా
మిగిలి బ్రతికి ఉన్నందుకు
కాలానికి చరిత్ర
కృతజ్ఞత చెబుతుంది.
మనిషిలో పోరాట కణంతో.
అంతరంగ మొకటే ఎప్పటికీ
ఆకాశం ఒకటే ఇప్పటికీ.

## 24. గాయాలకయినా పరీక్షలకయినా

మేఘం రావాలనే మార్పు కావాలనే
బీభత్సంతో కాదు నిర్మాణ చరణంతో.

మెదడులో ప్రియంగా భద్రపరచిన
బాణాలతో తుపాకులతో బాంబులతో
క్రూర మృగాల వేటలో సంరంభంలా
భూమికయి ధనం కయి అధికారం కయి పోరాటం.

శాసనంతో సునామి ఆగిపోదు.
ఆజ్ఞతో భూకంపం అణగిపోదు.
యుద్ధభయంతో ఉదయం ముందే రాదు.

ఉషస్సు ఏ ఆశకూ ఫల రూపం ఇవ్వదు
చూపుకు దిశ చూపుతుంది

గుండెకు ఇంధనమిస్తుంది.
ఆత్మకు సుందరత నిస్తుంది.

ఆదర్శం పొందాలనే స్వేచ్ఛ నిలవాలనే
విధ్వంసంతో కాదు మానవతా పథంతో.

శోకాని కద్దు కట్ట లేదు
ప్రవహించి శాంత జలధిలో కలవాలిసిందే.
వేదనకు సంశమనం లేదు
జ్వలించి యజ్ఞ విభవం పొందాలిసిందే.

మెదడులో ఘనంగా నిలిచిన
సంగీతం సాహిత్యం కళ విజ్ఞానం పాలనతో
పనిలో మైదానంలో ప్రజలో సంచారంతో,
జీవిక కయి శాంతికయి ఆనందం కయి అన్వేషణ.

వర్తమాన సమాజ భాషలో
స్వప్నం ఏకాంతం రెండూ
గత స్మృతిలో తాళం పడిన మాటలు!

పై మూత తీసిన బుట్టలో నుండి
పైకి తలలెత్తే పాముల్లా సమస్యలు
వీటిని ధరించే శక్తి ఎవరికుంది!
మాయం చేయడ మసంభవం.
మానవతా బింబానికి కళంకం.

గాయపడే క్షణాల మధ్య నుండి
ఎగిరిపడే మకుటాల వరస నుండి
ప్రజాస్వామ్యయానంలో షార్ట్‌కట్ లేదు.

అక్షయమైన అంతరాత్మ నుండి
పిడికెడు ప్రకాశంతో
మెరసే అస్తిత్వంతో
దేహం అదృశ్యమయ్యాక
కాలంపై నిలిచే ఆకృతికై చిహ్నాంకూ
పయనిస్తుంది! మనిషి మనోరూపం!

ఎన్ని గాయాల కయినా సిద్ధమవుతుంది.
ఎన్ని పరీక్షల కయినా ఇష్టపడుతుంది.

## 25. మిగిలిందొకటే మానవతా కావ్యం

ఇపుడేమీ జ్ఞాపకం లేదు.
అమ్నిషియా కావచ్చు! ఏమో!
ఒక ప్రపంచం నుండి మరో ప్రపంచానికి
ప్రవేశించినట్లు గుర్తు! అనుకోకుండా.

జలధి అలల చిత్ర పట పటలం నుండి
మైదానంలో క్షితిజ సౌధ శిఖరానికి
నిర్భయంగా నిరాడంబరంగా
స్వేచ్ఛగా నిరలంకారంగా.

ప్రయాణ వేగంలో
వెనక్కి వెళ్ళుతూ కన్పించే చెట్లు
వీడ్కోలు చెబుతున్నట్లుంది.

ఏటవాలు మబ్బు గొడుగుతో
నాకెదురుగా కర్మసాక్షి!
స్వాగతం చెబుతున్నట్లుంది.

నేలను వదిలింది లేదు, నేను
నిలవడానికీ నడవడానికీ అవసరం.
గగనం వదల్లేదు నన్ను
కల్పనకూ ఆదర్శానాకీ నిలయం.

సంగీతానికి అవరోధం లేదు
కవిత్వానికి నిబంధనం లేదు.

పూవును బాధిస్తే
ఫల రూపం సిద్ధించదు.
వేరును నరికేస్తే
చెట్టుకు రూపం ఉండదు.

మనిషిని మనిషి వెన్నాడేను.
మనిషికి మనిషి దారి మూసేను.
మనిషికి మనిషి దారి తెరచేను
మనిషిలో మనిషి మేల్కొనే అంతా!

మనిషికి మనిషి, మనిషితో మనిషి
మనిషిలో మనిషి గుప్తంగా
సమాజ చరిత్రతో పృథ్విపై
ఎక్కడైనా ఒకటే నన్నట్లుంది!

కరుణతో కదలి వీరంతో నడచి
అనురాగ సర్గకు చేరిన నాలో,
మిగిలిందొకటే మానవతా కావ్యం.
ఇపుడేమీ జ్ఞాపకం లేదు!

స్వేచ్ఛా కవిత్వం

రెండవ భాగం - 5

# మరో వైపు

మాదిరాజు రంగారావు

**2006**

రసధుని సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 500 028

స్వేచ్ఛా కవిత్వం

రెండవ భాగం - 5

# మరోవైపు

మాదిరాజు రంగారావు

2006

రసధుని సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 500 028



# అంకితం

ఉదార మనస్విని స్నిగ్ధ మూర్తి
చిరంజీవిని హరిత (మాదిరాజు / దేవులపల్లి) కు
M.A (Lit)
Canton (Detroit) Michigan U.S.A.
ఆశీస్సులతో



# అంకితం

ఉదార మనస్విని స్నిగ్ధ మూర్తి
చిరంజీవిని హరిత (మాదిరాజు / దేవులపల్లి) కు
M.A (Lit)
Canton (Detroit) Michigan U.S.A.
ఆశీస్సులతో

# ఆంతర్యం

స్వాతంత్ర్యానంతరం ఆధునిక స్వేచ్ఛా కవిత్వంలో భిన్నమైందీ "మరో వైపు" కావ్యం. ఇప్పుడు వస్తున్న కవిత్వంతో పాటు మరో విశిష్టమైన పార్శ్వాన్ని భావింపజేస్తుంది.

1. వస్తువులో ప్రకృతి నేపథ్యంతో జీవన స్థితి చిత్రణం కలిగింది.
2. విషయాల్లో మానవ మనస్తత్వ ప్రకాశనంతో పాటు విస్మరించరాని మానవ చరిత్రపై దృష్టి ప్రసారమూ కనిపిస్తుంది.
3. అభివ్యక్తిలో భావ సౌందర్యంలో ఆలోచన మరియు అనుభూతి సమాకలనం గోచరిస్తుంది. ఉన్నతితో పాటు సాంద్రత దృష్టికి వస్తుంది ఇంకా దీని నిర్మితిలో భావ బింబాల (Images) ప్రతీకల (Symbols) ప్రయోజన పరత్వంతో పాటు భావాత్మకత యోజిత మయింది.
4. వివిధాంశాలు సందర్భానుగుణంగా తాత్త్విక స్పర్శనూ పొందాయి.
5. కవి విశ్వసించే ప్రజాస్వామ్య భావనతో లక్ష్యం నిర్దేశితమయింది.

ఈ కావ్యంలో సృజన దృష్టి – మానవీయ భావన ప్రధానమైన స్థానాలుగా సమాలోచనానికందుతాయి. భిన్నమైన విశేష పార్శ్వాన్ని గుర్తులో ఉంచేందుకే ఈ పేరు "మరో వైపు" పెట్టబడింది. కవిత్వంలో సృజనలోకాన్ని ఎవరెంత దర్శించినా ఎప్పటికీ ఇంకా ఎంతో మిగిలే ఉంటుంది. అందువల్ల ఎప్పటికీ ప్రతిభగల కవులకు అవకాశం ఉండనే ఉంటుంది. వారి ప్రత్యేకతల్ని భాసింప చేస్తుంది.

సహృదయుల స్పందనలో మెరపు తీగెలా విశిష్టంగా అవగతికి వచ్చే విశేషం సమాలోచనంలో ఒక పద్ధతిలో విశ్లేషితమవుతుంది. అన్వేషితమవుతుంది. వివృతమవుతుంది. వివేచితమవుతుంది. ఈ పని సాహిత్య సమాలోచనంలో ఇంకా మిగిలి ఉంది. విస్తృతంగా జరగవలసి ఉంది.

**మాదిరాజు రంగారావు**

# విషయసూచిక

1. పురస్కారం ........ 1
2. గదిలో పావురం ........ 3
3. ఏ రోజూ ........ 5
4. మనో వనిలో ........ 9
5. మనిషికి మనిషిలా ........ 10
6. ఆపద చీకటిలో ........ 11
7. మూలమై ప్రేరణమై ........ 11
8. కవితలో అంతలో ........ 12
9. జలాలతో జీవితాలనూ ........ 13
10. మనసును మేఘంలా ........ 14
11. మనిషికీ మనిషికీ ........ 15
12. ఏ ఆశ్చర్యం లేదు ........ 17
13. జడంలో చేతనలా ........ 18
14. "నేను" నుండి ........ 20
15. అదృష్టం తిరగబడినట్లే ........ 22
16. గ్రీటింగ్ కార్డ్‌లా ........ 24
17. సృజన యానం ........ 26
18. ఒకొక్కక సమయం ........ 28
19. కనిపించడం లేదు ........ 30
20. ప్రజాస్వామ్య ప్రదర్శనం ........ 34
21. వార్నింగ్ ........ 37
22. ఏది అవునో? కాదో? ........ 41
23. కవితాత్మ సంసిద్ధంగా ........ 42
24. యుగ హృదయం ........ 47

# 1. పురస్కారం

జీవిత మొక పురస్కారం
అల్మైరాలో భద్రపరచేది కాదు.
టేబిల్ పయి అలంకరించేది కాదు.
అంతకన్నా కేస్‌లో దాచేందుకూ కాదు

ప్రచారానికీ కాదు
ప్రదర్శనకూ కాదు.
ఏది కాదో కన్నా ఈ సమయం
ఏది అవునో ముఖ్యం.

ముందుగా కోరని జన్మలో
కష్టాల్లో బాధల్లో తప్తమయిన శక్తితో
తేజాన్ని పొందుతుంది.
ప్రేరణ కలిగిస్తుంది.

వర్తమాన యానంలో
జీవన సంవేదనతో
వాస్తవ తలం నుండి
అదృశ్య శిఖరాల పైకి,
మతిలో నిశ్చయంతో
గతిలో సక్రియతో
దాహ ధరా స్థితిలో
మేఘ మనో రూపం నాలో
సమాజ సౌభాగ్యం నుండి
అతీత దర్శనంలోకి.

పిడుగుల వంటి ఘటనల్ని
ఖజాన సంచిలో వేసుకున్నట్లుగా
మెరపుల వంటి స్థితుల్ని
జేబులో పర్సులో దాచుకున్నట్లుగా
స్మృతిలో అర అరలో భద్రపరచుకొనీ
పరవర్తన దిశగా స్వేచ్ఛా గమనం.

రెండిటీ సంబంధం ఉంటే ఉండవచ్చు కాని
మనిషి మాత్రం తృప్తి అంచుల్లో తలూపేను!

సూర్య చంద్ర బింబాల్లా ఎగిరే
బంగారు వెండి నాణేల ఆకర్షణ
యథార్థ భూమికలో శక్తుల్ని నడిపించేను
ప్రవృత్తిలో వృత్తిని ప్రవర్తింపజేసేను

చేతిలో పుటలు తెరచిన పుస్తకంతో
ముఖంలో భావనా సుమ గుచ్ఛంతో
వృత్తికీ ప్రవృత్తికీ భేదం మాసిన యశోరూపం
ఎవరెస్ట్ శిఖరాన్ని వంచేయాలనీ తుంచేయాలనీ!

పగలూ రాత్రీ భేదం లేని సృజన యానంలో
ప్రతి జీవితమొక విభిన్నమైన పురస్కారం.

## 2. గదిలో పావురం

బయట నుండి పావురం
నిర్భయంగా కిటికీ నుండి
నేను విశ్రమించే గదిలోకి ప్రవేశిస్తుంది.

స్వర మధురంగా మధ్య మధ్య
పావురం “కువ కువ” “కలకల” ధ్వనులు

నాలో శూన్యానికి శబ్ద చిత్రాల్నిస్తాయి.
ఎప్పుడైనా కిటికీ వేసి ఉంటే
బయటి కిటికీ అద్దాన్ని ముక్కుతో గీరుతుంది
అదే పనిగా శబ్దిస్తుంది.

ఏ కారణం చేతనో
ఎంతకూ కిటికీ తెరవక పోతే
అక్కడే ఎక్కడో వాలి పోతుంది.
ఆ రాత్రి అంతా మధ్య మధ్య శబ్దిస్తుంది.

రెండిటీ సంబంధం ఉంటే ఉండవచ్చు కాని
మనిషి మాత్రం తృప్తి అంచుల్లో తలూపేను!

సూర్య చంద్ర బింబాల్లా ఎగిరే
బంగారు వెండి నాణేల ఆకర్షణ
యథార్థ భూమికలో శక్తుల్ని నడిపించేను
ప్రవృత్తిలో వృత్తిని ప్రవర్తింపజేసేను

చేతిలో పుటలు తెరచిన పుస్తకంతో
ముఖంలో భావనా సుమ గుచ్ఛంతో
వృత్తికీ ప్రవృత్తికీ భేదం మాసిన యశోరూపం
ఎవరెస్ట్ శిఖరాన్ని వంచేయాలనీ తుంచేయాలనీ!

పగలూ రాత్రీ భేదం లేని సృజన యానంలో
ప్రతి జీవితమొక విభిన్నమైన పురస్కారం.

## 2. గదిలో పావురం

బయట నుండి పావురం
నిర్భయంగా కిటికీ నుండి
నేను విశ్రమించే గదిలోకి ప్రవేశిస్తుంది.

స్వర మధురంగా మధ్య మధ్య
పావురం “కువ కువ” “కలకల” ధ్వనులు

నాలో శూన్యానికి శబ్ద చిత్రాల్నిస్తాయి.
ఎప్పుడైనా కిటికీ వేసి ఉంటే
బయటి కిటికీ అద్దాన్ని ముక్కుతో గీరుతుంది
అదే పనిగా శబ్దిస్తుంది.

ఏ కారణం చేతనో
ఎంతకూ కిటికీ తెరవక పోతే
అక్కడే ఎక్కడో వాలి పోతుంది.
ఆ రాత్రి అంతా మధ్య మధ్య శబ్దిస్తుంది.

ఎప్పుడైనా పావురం కనబడక పోవచ్చు
పోయి తిరిగి వచ్చే దారి మారవచ్చు
కాని ఎన్నటికీ మాయం కాదు
బహుకాలం బ్రతికించే సంజీవి అవుతుంది.

నిలిచిన మంటలపై నుండి వస్తుంది
అలల తలలపై ఉల్లాసంగా ఎగురుతుంది.
చెట్ల కొమ్మల సందుల్లో నుండి చేరుతుంది.

ఆయుధం కనిపిస్తే పై కెగిరి పోయి
అందని ఎత్తులో నక్షత్ర మవుతుంది
అతీతంపై దృష్టిని ప్రసరింప జేస్తుంది.

అనుకోనో అనుకోకుండానో
ఎక్కడి కక్కడ ఇరుకై పోయిన స్థలం నుండి
పై కెగసి హిమ శిఖరం ఎత్తులో సాగి
క్రిందికి దిగి ప్రవాహాల్ని దాటి
నేరుగా నా గదిలోకి వచ్చి వాలుతుంది.

ఎప్పటికీ గూడు కన్న భద్రంగా
నా గదిలో పావురం
ఒక శాంతి పురస్కారం

## 3. ఏ రోజూ

ఏరోజూ పక్షుల ఆహ్వానంతో
మెలకువలో రవి బింబం
జీవిత గమనానికి సంకేతాల్నిస్తుంది.
ఏ రోజూ సెలవంటూ లేదు

మనిషి కెదురుగా రోజు
చేతిలో ఎర్ర గులాబితో వస్తుంది.
ముఖాన క్రీం ప్లవర్‌తో వెళ్ళిపోతుంది.

స్నిగ్ధం కావడమో
దగ్ధం కావడమో
మనిషి చేతిలో ఉంది!

ఎప్పుడైనా పావురం కనబడక పోవచ్చు
పోయి తిరిగి వచ్చే దారి మారవచ్చు
కాని ఎన్నటికీ మాయం కాదు
బహుకాలం బ్రతికించే సంజీవి అవుతుంది.

నిలిచిన మంటలపై నుండి వస్తుంది
అలల తలలపై ఉల్లాసంగా ఎగురుతుంది.
చెట్ల కొమ్మల సందుల్లో నుండి చేరుతుంది.

ఆయుధం కనిపిస్తే పై కెగిరి పోయి
అందని ఎత్తులో నక్షత్ర మవుతుంది
అతీతంపై దృష్టిని ప్రసరింప జేస్తుంది.

అనుకోనో  అనుకోకుండానో
ఎక్కడి కక్కడ ఇరుకై పోయిన స్థలం నుండి
పై కెగసి హిమ శిఖరం ఎత్తులో సాగి
క్రిందికి దిగి ప్రవాహాల్ని దాటి
నేరుగా నా గదిలోకి వచ్చి వాలుతుంది.

ఎప్పటికీ గూడు కన్న భద్రంగా
నా గదిలో పావురం
ఒక శాంతి పురస్కారం

## 3. ఏ రోజూ

ఏరోజూ పక్షుల ఆహ్వానంతో
మెలకువలో రవి బింబం
జీవిత గమనానికి సంకేతాల్నిస్తుంది.
ఏ రోజూ సెలవంటూ లేదు

మనిషి కెదురుగా రోజు
చేతిలో ఎర్ర గులాబితో వస్తుంది.
ముఖాన క్రీం ఫ్లవర్‌తో వెళ్ళిపోతుంది.

స్నిగ్ధం కావడమో
దగ్ధం కావడమో
మనిషి చేతిలో ఉంది!

విప్పిన రెక్కలతో సమయం
వర్తమానాన్ని సరింపజేస్తూంది.
ఎగిరే రెక్కలతో సమయం
భవిష్యత్తును ఆలోచింపజేస్తూంది.

తృప్తికయి ఘనతకయి ఉపకృతి కయి
ఏ రోజు డైరిలో పేజి నిండుగా
మానవీయ జ్ఞాపకాల శిల్పాలు, చిత్రాలు!
సామాజిక బంధాలకు ప్రవాహ కళ నిస్తూ!

పేద అయినా బిక్షువయినా
ఖిలమయినా చ్యుతమయినా
గీత మాసినా నీతి మరచినా
సమాజ చక్రంలో అరలే!

కొత్త విజయ గాథలతో రోజు
మానవేతిహాసంలో భాగమవుతుంది
మెట్టు మెట్టునూ అధిరోహిస్తూ
ఏ రోజూ మెట్టు దిగే జాడ లేదు.

**(3)**

ఏదీ వదలదు తొలగదు
ఎన్నో గుప్తంగా సుప్తంగా ఉంటాయి.
మహా గ్రంథానికి సరిపడుతుంది
వెనుక నుండి మహాముఖం చూడాలనీ
ఎపుడో మరచింది గుర్తుకు తేవాలనీ
బయటకు రావాలనీ తహతహలాడుతుంది

చంద్రుని లాంటి అద్దంలో
నెమలి పురిలా విప్పారి ముఖం
అద్దం ప్రక్కకు తొలగి పోగానే
పరిచయం లేనట్లే ఉంటుంది.

క్షితిజం లాంటి అద్దంతో
ఇంద్ర చాపంలా విరిసి ముఖం
అద్దం ప్రక్కకు జరిగి పోగానే
పరిచయ మున్నట్లే ఉండదు

విప్పిన రెక్కలతో సమయం
వర్తమానాన్ని సరింపజేస్తూంది.
ఎగిరే రెక్కలతో సమయం
భవిష్యత్తును ఆలోచింపజేస్తూంది.

తృప్తికయి ఘనతకయి ఉపకృతి కయి
ఏ రోజు డైరిలో పేజి నిండుగా
మానవీయ జ్ఞాపకాల శిల్పాలు, చిత్రాలు!
సామాజిక బంధాలకు ప్రవాహ కళ నిస్తూ!

పేద అయినా బిక్షువయినా
ఖిలమయినా చ్యుతమయినా
గీత మాసినా నీతి మరచినా
సమాజ చక్రంలో అరలే!

కొత్త విజయ గాథలతో రోజు
మానవేతిహాసంలో భాగమవుతుంది
మెట్టు మెట్టునూ అధిరోహిస్తూ
ఏ రోజూ మెట్టు దిగే జాడ లేదు.

**(3)**

ఏదీ వదలదు తొలగదు
ఎన్నో గుప్తంగా సుప్తంగా ఉంటాయి.
మహా గ్రంథానికి సరిపడుతుంది
వెనుక నుండి మహాముఖం చూడాలనీ
ఎపుడో మరచింది గుర్తుకు తేవాలనీ
బయటకు రావాలనీ తహతహలాడుతుంది

చంద్రుని లాంటి అద్దంలో
నెమలి పురిలా విప్పారి ముఖం
అద్దం ప్రక్కకు తొలగి పోగానే
పరిచయం లేనట్లే ఉంటుంది.

క్షితిజం లాంటి అద్దంతో
ఇంద్ర చాపంలా విరిసి ముఖం
అద్దం ప్రక్కకు జరిగి పోగానే
పరిచయ మున్నట్లే ఉండదు

# 4. మనో వనిలో

మనిషి మనో వనిలో హరిణం
ఆనంద ధామాన్ని సృజిస్తుంది.
అరుదైన అనుభవ రమణీయం
లోభానికి సోపానాన్ని నిర్మిస్తుంది.

ఇది వశం కావడం సులభం కాదు
వెంటబడి పోవడం అభిమతి కవమానం
హింసతో పొందడం అస్తిత్వానికి భంగం
అలరించి ఆకర్షిస్తేనే అందమైన ప్రయోజనం!

నిశా శిఖరాలపై చంద్ర రేఖలా
పచ్చికపై పొదల మధ్య కదలుతూంటే
ప్రియమైంది ఎదకు అందుతూన్నట్లుంటుంది.

శిశువు చేతిలో అలవోకగా ఊగే
పూల గుత్తిలా ఎగురుతూంటే
తెలీని రహస్యం కంటికి కనబడినట్లుంటుంది
అనుకోని రహస్యం ఎద లోకి జారినట్లుంటుంది.

కను రెప్పల మధ్య వర్ణ చిత్రం నిండిపోతుంది
ఆలోచనలో సజీవ శిల్పం నిలిచి పోతుంది
రక్తంలో గోర్వెచ్చని ప్రాణ లహరి సరిస్తుంది
మనిషిలో అలయై సంస్కార పరిమళం వీస్తుంది.

ఒక వైపు వాస్తవం మరోవైపు కల్పనతో
అనుభవ గుణ నాణెం
ఘల్లున చెల్లుతూన్నట్లుంటుంది.
మెరపుల చూపులతో నడకలతో
మతి శిఖరాల్ని గంతులతో దాటుతూ
పూల పొదల్ని ఎదల్ని స్పృశిస్తూ పోయేను

గుప్తమైన భంగిమ లొక టొకటీ వరసగా
చేతనా సౌందర్యానికి చిహ్నంగా
మనో వనిలో ప్రత్యక్షమయ్యే హరిణం
అదృష్ట విశేషం, అనుకోని పురస్కారం.

# 4. మనో వనిలో

మనిషి మనో వనిలో హరిణం
ఆనంద ధామాన్ని సృజిస్తుంది.
అరుదైన అనుభవ రమణీయం
లోభానికి సోపానాన్ని నిర్మిస్తుంది.

ఇది వశం కావడం సులభం కాదు
వెంటబడి పోవడం అభిమతి కవమానం
హింసతో పొందడం అస్తిత్వానికి భంగం
అలరించి ఆకర్షిస్తేనే అందమైన ప్రయోజనం!

నిశా శిఖరాలపై చంద్ర రేఖలా
పచ్చికపై పొదల మధ్య కదలుతూంటే
ప్రియమైంది ఎదకు అందుతూన్నట్లుంటుంది.

శిశువు చేతిలో అలవోకగా ఊగే
పూల గుత్తిలా ఎగురుతూంటే
తెలీని రహస్యం కంటికి కనబడినట్లుంటుంది
అనుకోని రహస్యం ఎద లోకి జారినట్లుంటుంది.

కను రెప్పల మధ్య వర్ణ చిత్రం నిండిపోతుంది
ఆలోచనలో సజీవ శిల్పం నిలిచి పోతుంది
రక్తంలో గోర్వెచ్చని ప్రాణ లహరి సరిస్తుంది
మనిషిలో అలయై సంస్కార పరిమళం వీస్తుంది.

ఒక వైపు వాస్తవం మరోవైపు కల్పనతో
అనుభవ గుణ నాణెం
ఘల్లున చెల్లుతూన్నట్లుంటుంది.
మెరపుల చూపులతో నడకలతో
మతి శిఖరాల్ని గంతులతో దాటుతూ
పూల పొదల్ని ఎదల్ని స్పృశిస్తూ పోయేను

గుప్తమైన భంగిమ లొక టొకటీ వరసగా
చేతనా సౌందర్యానికి చిహ్నంగా
మనో వనిలో ప్రత్యక్షమయ్యే హరిణం
అదృష్ట విశేషం, అనుకోని పురస్కారం.

మనిషికి మనిషి ముఖం చూపుతుంది
మనిషితో మనిషి హృదయం మాట్లాడుతుంది.

చెట్టు తో జలధి తో పర్వతం తో
వెనువెంట ఆయుధంతో మనిషి మనిషిగా
బ్రతకడం లోనే ఉంది! విశేషం
చరిత్రలో అతీతమైన పురస్కారం!

## 6. ఆపద చీకటిలో

చెట్టు చెట్టుగానే ఎదగాలనే బ్రతకాలనే
బాంబులు వ్రేలాడే కొమ్మలతో కాదు.
నది నదిగా సరించాలనే జీవించాలనే
ఆయుధాలు కదలే అలలతో కాదు

రాలే బాంబులు మధ్య
దూకే ఆయుధాల మధ్య
తెగకుండా బయటపడే ఆయువు
మనిషి కో విశేష పురస్కారమే

ఘర్షణలో హింసకో అశాంతి కో
గురి అయి క్రమ్మే విషమ సమయంలో
సూర్యుని లాంటి
చంద్రుని లాంటి
స్నేహముఖంతో అనుభవం
ఆపద చీకటిలో పురస్కారమే!

## 7. మూలమై ప్రేరణమై

చిత్రం లోనో శిల్పం లోనో
మనిషిని గుర్తించడం సులభంగా ఉంది
సమాజ జీవిత కథలో
మనిషిని గుర్తించడం కష్టంగానే ఉంది.

పై నుండి క్రిందికి
క్రింది నుండి పైకి

మనిషికి మనిషి ముఖం చూపుతుంది
మనిషితో మనిషి హృదయం మాట్లాడుతుంది.

చెట్టు తో జలధి తో పర్వతం తో
వెనువెంట ఆయుధంతో మనిషి మనిషిగా
బ్రతకడం లోనే ఉంది! విశేషం
చరిత్రలో అతీతమైన పురస్కారం!

## 6. ఆపద చీకటిలో

చెట్టు చెట్టుగానే ఎదగాలనే బ్రతకాలనే
బాంబులు వ్రేలాడే కొమ్మలతో కాదు.
నది నదిగా సరించాలనే జీవించాలనే
ఆయుధాలు కదలే అలలతో కాదు

రాలే బాంబులు మధ్య
దూకే ఆయుధాల మధ్య
తెగకుండా బయటపడే ఆయువు
మనిషి కో విశేష పురస్కారమే

ఘర్షణలో హింసకో అశాంతి కో
గురి అయి క్రమ్మే విషమ సమయంలో
సూర్యుని లాంటి
చంద్రుని లాంటి
స్నేహముఖంతో అనుభవం
ఆపద చీకటిలో పురస్కారమే!

## 7. మూలమై ప్రేరణమై

చిత్రం లోనో శిల్పం లోనో
మనిషిని గుర్తించడం సులభంగా ఉంది
సమాజ జీవిత కథలో
మనిషిని గుర్తించడం కష్టంగానే ఉంది.

పై నుండి క్రిందికి
క్రింది నుండి పైకి

భూమి నుండి దూరమై ఎంత కాలం?
నేలపై అడుగు వేయని మనిషి లేడు
నేలపై మట్టి అంటని అడుగు లేదు.

నలుపు తెలుపు ఎరుపు వర్ణ భేదాలు
కళలో సౌందర్య జగత్తును బింబిస్తాయి

అందరిలో ప్రసరించే కాంతి కిరణమొకటే
అందరినీ కదిలించే మూలం రూపమొకటే

పాత ప్రపంచం కోపిస్తుంది
కొత్త ప్రపంచం ఆకర్షిస్తుంది

కళ్ళ ముందు పుష్ప గుచ్ఛంలాంటి దృశ్యం
అంతలో రక్త చిత్ర మయినా ఆశ్చర్యం లేదు

## 9. జలాలతో జీవితాలనూ

కవుల్నీ రాజుల్నీ చుక్కల్నీ రోజుల్నీ
లెక్క పెట్టడం నా వల్ల కానే కాదు

కవితలో రాజ్యంలో పయనంలో ఈ యుగంలో
స్వేచ్ఛా శిఖరాల్ని అధిరోహించడమే నా పని

గాలికి అలల్ని శాసించాలనీ
అవనికి అలల్ని అదుపు చేయాలనీ
రాజ్యానికి శాసనం చెల్లాలనీ
మనిషికి పయనం సాగాలనీ

చీకటికీ వెలుక్కీ మధ్య
గట్టుపై నుండి మనస్సు
ఏ వైపు నైనా కదలవచ్చు ఎపుడైనా!
నిరంకుశానికో స్వేచ్ఛకో
రెండిటినీ వేరు చేసే రేఖ
ఉండీ లేనట్లుగా ఉంటుంది.

స్వేచ్ఛను ప్రకాశింప జేసే చంద్రుడు
స్వేచ్ఛను ప్రేరేపించే సూర్యుడు

భూమి నుండి దూరమై ఎంత కాలం?
నేలపై అడుగు వేయని మనిషి లేడు
నేలపై మట్టి అంటని అడుగు లేదు.

నలుపు తెలుపు ఎరుపు వర్ణ భేదాలు
కళలో సౌందర్య జగత్తును బింబిస్తాయి

అందరిలో ప్రసరించే కాంతి కిరణమొకటే
అందరినీ కదిలించే మూలం రూపమొకటే

పాత ప్రపంచం కోపిస్తుంది
కొత్త ప్రపంచం ఆకర్షిస్తుంది

కళ్ళ ముందు పుష్ప గుచ్ఛంలాంటి దృశ్యం
అంతలో రక్త చిత్ర మయినా ఆశ్చర్యం లేదు

## 9. జలాలతో జీవితాలనూ

కవుల్నీ రాజుల్నీ చుక్కల్నీ రోజుల్నీ
లెక్క పెట్టడం నా వల్ల కానే కాదు

కవితలో రాజ్యంలో పయనంలో ఈ యుగంలో
స్వేచ్ఛా శిఖరాల్ని అధిరోహించడమే నా పని

గాలికి అలల్ని శాసించాలనీ
అవనికి అలల్ని అదుపు చేయాలనీ
రాజ్యానికి శాసనం చెల్లాలనీ
మనిషికి పయనం సాగాలనీ

చీకటికీ వెలుక్కీ మధ్య
గట్టుపై నుండి మనస్సు
ఏ వైపు నైనా కదలవచ్చు ఎపుడైనా!
నిరంకుశానికో స్వేచ్ఛకో
రెండిటినీ వేరు చేసే రేఖ
ఉండీ లేనట్లుగా ఉంటుంది.

స్వేచ్ఛను ప్రకాశింప జేసే చంద్రుడు
స్వేచ్ఛను ప్రేరేపించే సూర్యుడు

శాంతి మంత్రం పఠించే
ఋషుల ఆశ్రమాల చుట్టూ రణ సన్నాహమే

రక్షణ కయి శాంతి కవచం ధరించే
మహా నేతల బ్రతుకంతా రణోత్సాహమే.

పరిణామంలో విస్తృతి
ఆలోచన కవకాశాన్ని ఇస్తూంది.
పరిణతిలో శిఖరాలు
ఆనందానికి మెట్లను సమకూరుస్తాయి.

ఈ రోజు తన దయితే కానీ
రేపటిది మన దవుతుందనే!

ఆయువు పెరిగే కొద్దీ దశ దశలో
అనుభవ కవాటాలు తెరచుకొనీ
స్వేచ్ఛకు సీమలు పెరుగుతూ పోతాయి

అవనిపై గోడ ల్లేని దేశం
మనిషిలో గోడలు కట్టని సందేశం
స్వేచ్ఛకు పోటీ లేకుండా చేస్తాయి
మనసును మేఘంలా నడిపిస్తాయి.

## 11. మనిషికీ మనిషికీ

మనిషికీ మనిషికీ కోరిక
రోజులపై పై నడిచే కొద్దీ
పగలు సూర్య బింబమై వెలగాలనీ
రాత్రి చంద్ర బింబమై ఎదగాలనీ

పూర్ణాయువులో సగ భాగం గడిచేవరకు
నీలి నీడలతో బింబాలు
మెల్ల మెల్లగా కబళిత మవుతాయి
చిట్ట చివరకు శూన్య వలయం మిగులుతుంది.

మనిషికీ మనిషికీ కోరిక
రోజులపై పై పెరిగే కొద్దీ
మలుపు మలుపుకీ తిరిగే రేఖలతో

శాంతి మంత్రం పఠించే
ఋషుల ఆశ్రమాల చుట్టూ రణ సన్నాహమే

రక్షణ కయి శాంతి కవచం ధరించే
మహా నేతల బ్రతుకంతా రణోత్సాహమే.

పరిణామంలో విస్తృతి
ఆలోచన కవకాశాన్ని ఇస్తుంది.
పరిణతిలో శిఖరాలు
ఆనందానికి మెట్లను సమకూరుస్తాయి.

ఈ రోజు తన దయితే కానీ
రేపటిది మన దవుతుందనే!

ఆయువు పెరిగే కొద్దీ దశ దశలో
అనుభవ కవాటాలు తెరచుకొనీ
స్వేచ్ఛకు సీమలు పెరుగుతూ పోతాయి

అవనిపై గోడ ల్లేని దేశం
మనిషిలో గోడలు కట్టని సందేశం
స్వేచ్ఛకు పోటీ లేకుండా చేస్తాయి
మనసును మేఘంలా నడిపిస్తాయి.

## 11. మనిషికీ మనిషికీ

మనిషికీ మనిషికీ కోరిక
రోజులపై పై నడిచే కొద్దీ
పగలు సూర్య బింబమై వెలగాలనీ
రాత్రి చంద్ర బింబమై ఎదగాలనీ

పూర్ణాయువులో సగ భాగం గడిచేవరకు
నీలి నీడలతో బింబాలు
మెల్ల మెల్లగా కబళిత మవుతాయి
చిట్ట చివరకు శూన్య వలయం మిగులుతుంది.

మనిషికీ మనిషికీ కోరిక
రోజులపై పై పెరిగే కొద్దీ
మలుపు మలుపుకీ తిరిగే రేఖలతో

# 12. ఏ ఆశ్చర్యం లేదు

ఎప్పటెప్పటికీ కరగే
మృదు తత్వంతో నాలో మంచు కొండలు
యుగాలుగా నున్నవి
ఏకాంతానికి వీలుగా
ఆకాశాన వస్తూ పోయే హంసలతో

ఎప్పటికయినా సరే తీరే ఆశలో
సస్య శ్యామల వాంఛతో నాలో ఇసుక ఎడారులు
ఎగసే వేదనా రేణువులతో
"ఒయాసిస్" ఆశా హృదయంతో
మరచి పోని ఒంటెల నడకలతో

ఎప్పటికీ ప్రాణుల చలనంతో
సజీవ దృశ్యాలతో నాలో అరణ్యం
బహు పురాణ చరిత్రతో
తొలి జీవ శక్తి మూలాలతో
తరగని సంపదతో సృష్టికి ప్రతినిధిగా

ఎప్పటికీ జల ధారా ధునులతో
సంస్కార ప్రభలతో నాలో మైదానాలు
జన జీవన రుచులతో
జీగీషా మనో రూపాలతో
మనిషి ఉన్నతికీ పరిణతికీ సోపానాలై

ఆరోజు మంచుపై నడచిన
పద ముద్రలు అదృశ్యమయినా
మంచు కొండ నను వీడదు

నేను నడచిన పదముద్రలు
వనిలో కను మరుగయి పోయినా
వన భూమి నను వీడదు

గాలికి లేచిన ఇసుక రేణువులతో
పద ముద్రలు ఎగిరి పోయినా
ఇసుక ఎడారి నను వీడదు

# 12. ఏ ఆశ్చర్యం లేదు

ఎప్పటెప్పటికీ కరగే
మృదు తత్వంతో నాలో మంచు కొండలు
యుగాలుగా నున్నవి
ఏకాంతానికి వీలుగా
ఆకాశాన వస్తూ పోయే హంసలతో

ఎప్పటికయినా సరే తీరే ఆశలో
సస్య శ్యామల వాంఛతో నాలో ఇసుక ఎడారులు
ఎగసే వేదనా రేణువులతో
"ఒయాసిస్" ఆశా హృదయంతో
మరచి పోని ఒంటెల నడకలతో

ఎప్పటికీ ప్రాణుల చలనంతో
సజీవ దృశ్యాలతో నాలో అరణ్యం
బహు పురాణ చరిత్రతో
తొలి జీవ శక్తి మూలాలతో
తరగని సంపదతో సృష్టికి ప్రతినిధిగా

ఎప్పటికీ జల ధారా ధునులతో
సంస్కార ప్రభలతో నాలో మైదానాలు
జన జీవన రుచులతో
జీగీషా మనో రూపాలతో
మనిషి ఉన్నతికీ పరిణతికీ సోపానాలై

ఆరోజు మంచుపై నడచిన
పద ముద్రలు అదృశ్యమయినా
మంచు కొండ నను వీడదు

నేను నడచిన పదముద్రలు
వనిలో కను మరుగయి పోయినా
వన భూమి నను వీడదు

గాలికి లేచిన ఇసుక రేణువులతో
పద ముద్రలు ఎగిరి పోయినా
ఇసుక ఎడారి నను వీడదు

గట్టున నృత్యం చేస్తూ
అలరిస్తూ ఆగి పోతాయి

జలాల్ని దాటేందుకు మనిషిలో
ఆశ కాస్త అలజడి పడుతుంది
జలాల్లో దిగేందుకు మనిషిలో
సాహసం సతమత మవుతుంది

విశాలమైన మహా జలరాశి
అతీతానికి ఆహ్వానాన్ని ఇస్తుంది
గభీరమైన మహనీయ ముద్ర
రహస్యాల్ని అన్వేషింప జేస్తుంది

ఎదురుగా అనంతమైన సమస్య
మనిషి శేముషికి పదును పెడుతుంది.

పృథ్వీ జల రూపాలతో శరీరం
ప్రకృతి శక్తికి నికేతనమయింది.

మట్టిలో నీరుతో భౌతికం
పూవులా వికసిస్తుంది శరీరం
గగనమంత ఉత్సాహంతో
జ్వాలలా వెలుగుతుంది మనస్సు

పూవులేంది మనిషి లేదు
జ్వాల లేంది జీవితం లేదు

కలలో వాస్తవ రూపముంది
వాస్తవ జగం తోనే జీవిత సత్యం

నీడల్ని ఆడిస్తూ ధ్వనుల్ని పాడిస్తూ
కదలి పోయే మనిషిలో ఎప్పటికీ
అరణ్య మన్నా! సముద్ర మన్నా
భయం లేదు ప్రియమైన బంధువులే!

అరణ్యం నుండి సముద్రం నుండి
సమాజం లోకి సృజన యానం!

జీవిత సత్యానికి రూపమై
విశ్వాత్మకు బింబమై

గట్టున నృత్యం చేస్తూ
అలరిస్తూ ఆగి పోతాయి

జలాల్ని దాటేందుకు మనిషిలో
ఆశ కాస్త అలజడి పడుతుంది
జలాల్లో దిగేందుకు మనిషిలో
సాహసం సతమత మవుతుంది

విశాలమైన మహా జలరాశి
అతీతానికి ఆహ్వానాన్ని ఇస్తుంది
గభీరమైన మహనీయ ముద్ర
రహస్యాల్ని అన్వేషింప జేస్తుంది

ఎదురుగా అనంతమైన సమస్య
మనిషి శేముషికి పదును పెడుతుంది.

పృథ్వీ జల రూపాలతో శరీరం
ప్రకృతి శక్తికి నికేతనమయింది.

మట్టిలో నీరుతో భౌతికం
పూవులా వికసిస్తుంది శరీరం
గగనమంత ఉత్సాహంతో
జ్వాలలా వెలుగుతుంది మనస్సు

పూవులేంది మనిషి లేదు
జ్వాల లేంది జీవితం లేదు

కలలో వాస్తవ రూపముంది
వాస్తవ జగం తోనే జీవిత సత్యం

నీడల్ని ఆడిస్తూ ధ్వనుల్ని పాడిస్తూ
కదలి పోయే మనిషిలో ఎప్పటికీ
అరణ్య మన్నా! సముద్ర మన్నా
భయం లేదు ప్రియమైన బంధువులే!

అరణ్యం నుండి సముద్రం నుండి
సమాజం లోకి సృజన యానం!

జీవిత సత్యానికి రూపమై
విశ్వాత్మకు బింబమై

మధ్య నున్న హిమ యవనిక
అవతలి ప్రపంచాన్ని ఊహింప జేస్తుంది

గోడల్నీ ఊరు పొలి మేరల్నీ దేశ సీమల్నీ
ఎక్కడి కక్కడ నిర్మిస్తుంది, మాయం చేస్తుంది

మనిషి పోవచ్చు
పోవడం పరిణామ సహజం
సమాజం బ్రతుకుతుంది
బ్రతకడం అనివార్యం అవసరం

మనిషి పోయినా
ఆ వెనకే సమాజం నిలబడి ఉంటుంది
చరిత్ర విశేషాలు
కథలుగా సమాజానికి ప్రేరణ నిస్తాయి

చెట్టు క్రింద మనిషి
తీరిగ్గా అలసట తీర్చుకుంటూ
కథల్ని వినిపించేను, వినేను
అద్దంలో చూచే ముఖంలా మురిసేను

అద్దంలో ముఖం
అద్దం తొలగినా ఉంటుంది.
మనిషిలో సమాజం
మనిషి తొలగినా ఉంటుంది.
పోయిన మనిషి వెనక
రంగుల స్మృతులు! ఇంద్ర ధనుస్సులా

ఒంటరిగా ఉన్న 'నేను' బిందువు
సమూహంతో కలిసి సమాజమవుతుంది
ప్రవాహంలో భాగమవుతుంది
విశ్వాత్మను సూచిస్తుంది!

మధ్య నున్న హిమ యవనిక
అవతలి ప్రపంచాన్ని ఊహింప జేస్తుంది

గోడల్నీ ఊరు పొలి మేరల్నీ దేశ సీమల్నీ
ఎక్కడి కక్కడ నిర్మిస్తుంది, మాయం చేస్తుంది

మనిషి పోవచ్చు
పోవడం పరిణామ సహజం
సమాజం బ్రతుకుతుంది
బ్రతకడం అనివార్యం అవసరం

మనిషి పోయినా
ఆ వెనకే సమాజం నిలబడి ఉంటుంది
చరిత్ర విశేషాలు
కథలుగా సమాజానికి ప్రేరణ నిస్తాయి

చెట్టు క్రింద మనిషి
తీరిగ్గా అలసట తీర్చుకుంటూ
కథల్ని వినిపించేను, వినేను
అద్దంలో చూచే ముఖంలా మురిసేను

అద్దంలో ముఖం
అద్దం తొలగినా ఉంటుంది.
మనిషిలో సమాజం
మనిషి తొలగినా ఉంటుంది.
పోయిన మనిషి వెనక
రంగుల స్మృతులు! ఇంద్ర ధనుస్సులా

ఒంటరిగా ఉన్న 'నేను' బిందువు
సమూహంతో కలిసి సమాజమవుతుంది
ప్రవాహంలో భాగమవుతుంది
విశ్వాత్మను సూచిస్తుంది!

ఎదలో వేదనా జ్వాలతో
కదలేను జన సమూహం
పై నుండి రవి తేజం
మనిషిలో శక్తిని గుర్తు చేస్తుంది.

సముద్రంలో నావలా
హృదయమొక ఆయతన మవుతుంది
అలలపై కదలే నావకు
నీటి లోతుతో పనిలేదు.

ఈరోజు గురించి భయపడితే
రేపటి ప్రయాణం ప్రశ్నార్థకమే
రేపటి గురించి సందేహిస్తే
ఈ రోజు ప్రయాణం సందేహమే

కాల సముద్రంలో పయనించేందుకు
సాహస మొకటే సరిపోదు
దాన్ని దాటే సాధనం అవసరం
ఈదేందుకు ఈత అయిన రావాలి

జేబులో భయాన్ని నింపుకొనీ
పర్సులో ధైర్యాన్ని దాచుకొనీ
శిథిలాల మధ్య కలల్ని పోగు చేస్తూ
గాలి కథలతో సరిపోదు! ప్రయాణంలో

కాలాన్ని నడిపేది మనిషే!
జీవితం మనిషి చేతిలో శిల్పం!
మైనంలా పాత్రల్ని తీరుస్తూ మారుస్తూ
స్వర్గాన్నో నరకాన్నో దింపుతుంది మనస్సు

జాకీ చేతిలో ఉంటే సరిపోదు
ట్రంప్ కార్డు ఆడడం తెలియాలి.
ప్రత్యర్థి మస్తిష్కలలో నీ ముక్కలు బింబిస్తే
అదృష్టం తిరగబడినట్లే!

ఎదలో వేదనా జ్వాలతో
కదలేను జన సమూహం
పై నుండి రవి తేజం
మనిషిలో శక్తిని గుర్తు చేస్తుంది.

సముద్రంలో నావలా
హృదయమొక ఆయతన మవుతుంది
అలలపై కదలే నావకు
నీటి లోతుతో పనిలేదు.

ఈరోజు గురించి భయపడితే
రేపటి ప్రయాణం ప్రశ్నార్థకమే
రేపటి గురించి సందేహిస్తే
ఈ రోజు ప్రయాణం సందేహమే

కాల సముద్రంలో పయనించేందుకు
సాహస మొకటే సరిపోదు
దాన్ని దాటే సాధనం అవసరం
ఈదేందుకు ఈత అయిన రావాలి

జేబులో భయాన్ని నింపుకొనీ
పర్సులో ధైర్యాన్ని దాచుకొనీ
శిథిలాల మధ్య కలల్ని పోగు చేస్తూ
గాలి కథలతో సరిపోదు! ప్రయాణంలో

కాలాన్ని నడిపేది మనిషే!
జీవితం మనిషి చేతిలో శిల్పం!
మైనంలా పాత్రల్ని తీరుస్తూ మారుస్తూ
స్వర్గాన్నో నరకాన్నో దింపుతుంది మనస్సు

జాకీ చేతిలో ఉంటే సరిపోదు
ట్రంప్ కార్డు ఆడడం తెలియాలి.
ప్రత్యర్థి మస్తిష్కలలో నీ ముక్కలు బింబిస్తే
అదృష్టం తిరగబడినట్లే!

కిరణం మనిషిని ప్రేరేపిస్తుంది
మేల్కొన్న కలలకు కొత్త రూపాన్నిస్తుంది.
మచ్చు ఎరగని చంద్ర బింబంలా
పృథ్వి పయి జీవన యానం సాగాలనే

ఆగని పుష్ప వనీ పరిమళంలా
సమాజంలో జీవిత గమనం సాగాలనే
అవని నుండి క్షిపణిలా
ఎగసి దూసుక పోవాలనే

కోర్కెలు సహజం మనిషిలో
వాస్తవం తొలగిన కల్పనతో
సముద్ర తీరాన అలల పంక్తిలా
గట్టును దాటలేని శక్తితో

జీవిత పుస్తకంలో
రోజు పుటల్లో దాగిన రహస్యాలు
రాళ్ళ మధ్య జలాల్లా
ఇనుప తీగెలపై స్వరాల్లా
ఎపుడో బయటికి వస్తాయి
కనిపించని హేతువుతో యత్నంతో

నొసలుపై తగిలిన గాయంలో
బ్రద్దలైన సూర్యుడు; ఆ వెనకే
గుండెలో ఎగసిన అనలం నుండి
ఎగసే నీల మేఘం; వస్తుంది

బోధ కన్నా త్యాగం తెలిసిన మేఘం
ఏమీ కోరకుండానే ఎంతో ఇస్తుంది.

దీపానికి వెలగడమే కాని
అక్కడ వస్తూ పోయే వారితో పని లేదు

నీటికి సరించడమే కాని
నేలపై మట్టి కణాలతో పని లేదు

పగలూ రాత్రీ కవాటాల్ని
తెరచి ఉంచిన నికేతనంలా

కిరణం మనిషిని ప్రేరేపిస్తుంది
మేల్కొన్న కలలకు కొత్త రూపాన్నిస్తుంది.
మచ్చు ఎరగని చంద్ర బింబంలా
పృథ్వి పయి జీవన యానం సాగాలనే

ఆగని పుష్ప వనీ పరిమళంలా
సమాజంలో జీవిత గమనం సాగాలనే
అవని నుండి క్షిపణిలా
ఎగసి దూసుక పోవాలనే

కోర్కెలు సహజం మనిషిలో
వాస్తవం తొలగిన కల్పనతో
సముద్ర తీరాన అలల పంక్తిలా
గట్టును దాటలేని శక్తితో

జీవిత పుస్తకంలో
రోజు పుటల్లో దాగిన రహస్యాలు
రాళ్ళ మధ్య జలాల్లా
ఇనుప తీగెలపై స్వరాల్లా
ఎపుడో బయటికి వస్తాయి
కనిపించని హేతువుతో యత్నంతో

నొసలుపై తగిలిన గాయంలో
బ్రద్దలైన సూర్యుడు; ఆ వెనకే
గుండెలో ఎగసిన అనలం నుండి
ఎగసే నీల మేఘం; వస్తుంది

బోధ కన్నా త్యాగం తెలిసిన మేఘం
ఏమీ కోరకుండానే ఎంతో ఇస్తుంది.

దీపానికి వెలగడమే కాని
అక్కడ వస్తూ పోయే వారితో పని లేదు

నీటికి సరించడమే కాని
నేలపై మట్టి కణాలతో పని లేదు

పగలూ రాత్రీ కవాటాల్ని
తెరచి ఉంచిన నికేతనంలా

పయనం లో వెచ్చని ఆవేశం
సృజన గమనానికి ఇంధనం

గాలి మును ముందుగా కదలుతుంది
చెట్టు వెను వెనుకే ఉండి పోతుంది
ఉన్న చెట్టును మరపిస్తూ మనుషులు
సామాజిక సంవేదనతో వాస్తవ సంకలనంతో

మానవీయ ముద్రతో
ఆయువుతో ఒకటై
నాలో సృజన యానం
ఆగడం తెలీని కాలరూపం

**(2)**

గాలి దిశ మారుతుంది
ప్రవాహ రూపం మారుతుంది
ప్రాణ జీవన శక్తుల్ని
ఎలా మరచి పోగలం?

గాలి ప్రశ్నిస్తుంది?
ఎక్కడికి వెళ్ళుతున్నావనీ
ప్రవాహం ప్రశ్నిస్తుంది?
వర్తమాన గమ్యం ఏమిటనీ!

“వాకింగ్‌కూ కాదు, వేటకూ కాదు”
అని సమాధానం చెప్పాలనిపిస్తుంది

ఎవరైనా ఎక్కడి కని ప్రశ్నిస్తే
ఒకటే సమాధానం, అది మౌనం!
మౌనంలో చేతన
అద్దంలో బింబంలా! కనిపిస్తుంది.

అనుభూతి చెందే హృదయం నుండి
ఆలోచన జరిపే దాకా
మానవతా ప్రకాశంతో
ఏ దిశ అయినా ఒకటే!

పయనం లో వెచ్చని ఆవేశం
సృజన గమనానికి ఇంధనం

గాలి మును ముందుగా కదలుతుంది
చెట్టు వెను వెనుకే ఉండి పోతుంది
ఉన్న చెట్టును మరపిస్తూ మనుషులు
సామాజిక సంవేదనతో వాస్తవ సంకలనంతో

మానవీయ ముద్రతో
ఆయువుతో ఒకటై
నాలో సృజన యానం
ఆగడం తెలీని కాలరూపం

**(2)**

గాలి దిశ మారుతుంది
ప్రవాహ రూపం మారుతుంది
ప్రాణ జీవన శక్తుల్ని
ఎలా మరచి పోగలం?

గాలి ప్రశ్నిస్తుంది?
ఎక్కడికి వెళ్ళుతున్నావనీ
ప్రవాహం ప్రశ్నిస్తుంది?
వర్తమాన గమ్యం ఏమిటనీ!

"వాకింగ్‌కూ కాదు, వేటకూ కాదు"
అని సమాధానం చెప్పాలనిపిస్తుంది

ఎవరైనా ఎక్కడి కని ప్రశ్నిస్తే
ఒకటే సమాధానం, అది మౌనం!
మౌనంలో చేతన
అద్దంలో బింబంలా! కనిపిస్తుంది.

అనుభూతి చెందే హృదయం నుండి
ఆలోచన జరిపే దాకా
మానవతా ప్రకాశంతో
ఏ దిశ అయినా ఒకటే!

సమయ ఖండం ఎదురు కావచ్చు
దొంగలు పడిన ఇల్లునూ తలపించవచ్చు.

నడిచి నంత మేర పరుగెత్తి నంత మేర
భూమి తన వశం కావాలనే
మనిషి తీరని కోరిక! మరీ మరీ!

వెనుక నుండి మరొకరి ఆగమనం
పోయినంత మేర ఆక్రమణ గుణం
ఘర్షణకు సందర్భ మేదైనా కావచ్చు.
కాళ్ళ క్రింద మంటలు లేవచ్చు
మెడ పైన కత్తి ఊగొచ్చు

అలజడి హక్కును జ్ఞాపకం చేస్తుంది.
ఆటంకం బాధ్యతను గుర్తు చేస్తుంది.

రాక రాక వచ్చే శాంతి అడుగున
నిప్పు రవ్వలు మిగిలే ఉంటాయి.
చిరు ఘర్షణ పెద్దదై ఎగసి
అనల వృక్షాన్ని తలపించ వచ్చు
ఇతిహాస ఖండాన్ని రచించ వచ్చు

మంటల్ని పై కెగదోసి
సర్వం తగలబడే లోపల
నీళ్ళు చిమ్మే మంచి తనంతో
ఫోటో కయి చూచే ప్రబుద్ధులూ

వాస్తవం నదిలో అలలా కదిలి పోతుంది
ఏది మునిగేదీ, వెనక్కి తిరిగి చూడకుండా

మిగిలిన అస్థి పంజరం ఊగుతూ
తర తరాలకు తన కథ చెబుతుంది
గర్వపడే మనిషిలో పరిణతిని వెక్కిరిస్తుంది.
ప్రదర్శన శాల నలంకరిస్తుంది.
మును ముందు పరిశోధన కుపకరిస్తుంది

అమర్చిన బొమ్మల కొలువులా
మేధావుల చదరంగ ప్రపంచం

సమయ ఖండం ఎదురు కావచ్చు
దొంగలు పడిన ఇల్లునూ తలపించవచ్చు.

నడిచి నంత మేర పరుగెత్తి నంత మేర
భూమి తన వశం కావాలనే
మనిషి తీరని కోరిక! మరీ మరీ!

వెనుక నుండి మరొకరి ఆగమనం
పోయినంత మేర ఆక్రమణ గుణం
ఘర్షణకు సందర్భ మేదైనా కావచ్చు.
కాళ్ళ క్రింద మంటలు లేవచ్చు
మెడ పైన కత్తి ఊగొచ్చు

అలజడి హక్కును జ్ఞాపకం చేస్తుంది.
ఆటంకం బాధ్యతను గుర్తు చేస్తుంది.

రాక రాక వచ్చే శాంతి అడుగున
నిప్పు రవ్వలు మిగిలే ఉంటాయి.
చిరు ఘర్షణ పెద్దదై ఎగసి
అనల వృక్షాన్ని తలపించ వచ్చు
ఇతిహాస ఖండాన్ని రచించ వచ్చు

మంటల్ని పై కెగదోసి
సర్వం తగలబడే లోపల
నీళ్ళు చిమ్మే మంచి తనంతో
ఫోటో కయి చూచే ప్రబుద్ధులూ

వాస్తవం నదిలో అలలా కదిలి పోతుంది
ఏది మునిగేదీ, వెనక్కి తిరిగి చూడకుండా

మిగిలిన అస్థి పంజరం ఊగుతూ
తర తరాలకు తన కథ చెబుతుంది
గర్వపడే మనిషిలో పరిణతిని వెక్కిరిస్తుంది.
ప్రదర్శన శాల నలంకరిస్తుంది.
మును ముందు పరిశోధన కుపకరిస్తుంది

అమర్చిన బొమ్మల కొలువులా
మేధావుల చదరంగ ప్రపంచం

ముఖ్యంగా కవులు బయలు దేరండి
తోడుగా సహృదయులూ కదలండి

ప్రతి ఏడూ కొత్త సంవత్సరంతో
అంతా సరి కొత్తగా ఉంటుం దనుకోవచ్చు
కాని అదే మనిషి! అదే సమాజం
అవే మనో రూపాలు! అవే శక్తులు

అనుభవ జగంలో కొత్తను కోరడం సహజం
సృజన కళలోనూ ఆశించడం విపరీతం కాదు
బయలు దేరండి
ఆలస్య మసలే చేయొద్దు

ఎక్కడో ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కొని పోయిందో
ఏ ప్రమాదానికి గురి అయి హాస్పిటల్ చేరిందో
ఏ సమస్యలో చిక్కుకొనీ
ఏ సంక్షోభంలో దూరీ
ఏ ఆపద పాలైందో తెలీదు.
ఆలోచన కందడం లేదు.
ఎవరికీ కన్పించడం లేదట!
ఎపుడో కన్పించడం మానేసిందట!

ప్లాట్ ఫార్మ్ పైకి వెళ్ళుతూనే
చూస్తూండగానే రైలు కదలిపోయినట్లు
ఎయిర్ పోర్ట్‌లోకి అడుగేస్తూనే
కళ్ళముందే విమానం ఎగిరిపోయినుట్లు
కవిత! అందుకోబోతే అందకుండా పోతూంది
ఎందరికో ఆశాభంగమై, వెదకే ఆలోచన మానుకున్నట్లుంది

ఆ మధ్య అపుడపుడైనా కనిపించేది
ఈ మధ్య బొత్తిగా కన్పించడం లేదు

రేడియోలో టెలివిజన్ లో, పత్రిక లో
సమయ సమయం ప్రకటనలు వేయండి
ఆచూకీ తెలిపిన వారికి
కనీ వినీ ఎరగని బహుమానం ఘోషించండి.

ముఖ్యంగా కవులు బయలు దేరండి
తోడుగా సహృదయులూ కదలండి

ప్రతి ఏడూ కొత్త సంవత్సరంతో
అంతా సరి కొత్తగా ఉంటుం దనుకోవచ్చు
కాని అదే మనిషి! అదే సమాజం
అవే మనో రూపాలు! అవే శక్తులు

అనుభవ జగంలో కొత్తను కోరడం సహజం
సృజన కళలోనూ ఆశించడం విపరీతం కాదు
బయలు దేరండి
ఆలస్య మసలే చేయొద్దు

ఎక్కడో ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కొని పోయిందో
ఏ ప్రమాదానికి గురి అయి హాస్పిటల్ చేరిందో
ఏ సమస్యలో చిక్కుకొనీ
ఏ సంక్షోభంలో దూరీ
ఏ ఆపద పాలైందో తెలీదు.
ఆలోచన కందడం లేదు.
ఎవరికీ కన్పించడం లేదట!
ఎపుడో కన్పించడం మానేసిందట!

ప్లాట్ ఫార్మ్ పైకి వెళ్ళుతూనే
చూస్తూండగానే రైలు కదలిపోయినట్లు
ఎయిర్ పోర్ట్‌లోకి అడుగేస్తూనే
కళ్ళముందే విమానం ఎగిరిపోయినుట్లు
కవిత! అందుకోబోతే అందకుండా పోతూంది
ఎందరికో ఆశాభంగమై, వెదకే ఆలోచన మానుకున్నట్లుంది

ఆ మధ్య అపుడపుడైనా కనిపించేది
ఈ మధ్య బొత్తిగా కన్పించడం లేదు

రేడియోలో టెలివిజన్ లో, పత్రిక లో
సమయ సమయం ప్రకటనలు వేయండి
ఆచూకీ తెలిపిన వారికి
కనీ వినీ ఎరగని బహుమానం ఘోషించండి.

ఎండిన మ్రోడులా మారిపోయిందో?
ఇంకిన నదిలా చిక్కి పోయిందో?
జీవం ఉంటే మ్రోడైనా చిగురిస్తుంది

పెద్ద డాక్టర్ని పిలిస్తే మరీ మంచిది
విదేశాలనుండి కూడా పిలిపించవచ్చు

ఏ రోజు కారోజు
ఆ రాత్రి గడిస్తే కాని చెప్పలేమనీ
కొన్నాళ్ళైనా డాక్టర్లు అనవచ్చు
ఇలాంటి సందర్భాల్లోనే ప్రతిష్ఠ పెరిగేదీ.

భగవాన్! "కవిత బ్రతికి ఉంటే
అంతే చాల"న్నట్లుంది శ్రేయోభిలాషులకు
ఈ మంచి వార్త కై నిరీక్షణలో
కళ్ళలో తెల్లవారడమే కర్తవ్యంలా ఉంది.

కవిత కోసం అన్వేషణలో
కాలం వేగాన్ని అందుకుంటూంది
ఏక్షణలో నైనా ఫ్లాష్ న్యూస్ బ్రేక్ కావచ్చు

అయితే ఒక చిన్న రహస్యం!
ఇప్పుడే అందింది!
ఒక్కరంటే ఒక్కరికే పరిమితం సుమా!

భయానికో బాధకో ఆట పట్టించడానికో
కవి వెనకనే ఉంది, ఎవరికీ తేలేని 'నిజం'!
ఆత్మీయ బింబంలా స్వేచ్ఛగా స్వచ్ఛంగా
దర్పణంలో చూస్తే తప్ప! ఎవరికీ కన్పించదు

తెలియకనే అడుగుతున్నా
కవిత ఎక్కడికి పోతుంది?
ఎన్ని సమస్య లెదురైనా
ఎన్ని ఆపదలు వచ్చినా

తగలబడే గుడిసె నుండి లేచే
బూది రేణువుల్లో నుండీ,
గాయపడిన మానవతలో మిగిలిన
కొన ప్రాణాన్ని పట్టుకొనీ

ఎండిన మ్రోడులా మారిపోయిందో?
ఇంకిన నదిలా చిక్కి పోయిందో?
జీవం ఉంటే మ్రోడైనా చిగురిస్తుంది

పెద్ద డాక్టర్ని పిలిస్తే మరీ మంచిది
విదేశాలనుండి కూడా పిలిపించవచ్చు

ఏ రోజు కారోజు
ఆ రాత్రి గడిస్తే కాని చెప్పలేమనీ
కొన్నాళ్ళైనా డాక్టర్లు అనవచ్చు
ఇలాంటి సందర్భాల్లోనే ప్రతిష్ఠ పెరిగేదీ.

భగవాన్! "కవిత బ్రతికి ఉంటే
అంతే చాల"న్నట్లుంది శ్రేయోభిలాషులకు
ఈ మంచి వార్త కై నిరీక్షణలో
కళ్ళలో తెల్లవారడమే కర్తవ్యంలా ఉంది.

కవిత కోసం అన్వేషణలో
కాలం వేగాన్ని అందుకుంటూంది
ఏక్షణలో నైనా ఫ్లాష్ న్యూస్ బ్రేక్ కావచ్చు

అయితే ఒక చిన్న రహస్యం!
ఇప్పుడే అందింది!
ఒక్కరంటే ఒక్కరికే పరిమితం సుమా!

భయానికో బాధకో ఆట పట్టించడానికో
కవి వెనకనే ఉంది, ఎవరికీ తేలేని 'నిజం'!
ఆత్మీయ బింబంలా స్వేచ్ఛగా స్వచ్ఛంగా
దర్పణంలో చూస్తే తప్ప! ఎవరికీ కన్పించదు

తెలియకనే అడుగుతున్నా
కవిత ఎక్కడికి పోతుంది?
ఎన్ని సమస్య లెదురైనా
ఎన్ని ఆపదలు వచ్చినా

తగలబడే గుడిసె నుండి లేచే
బూది రేణువుల్లో నుండీ,
గాయపడిన మానవతలో మిగిలిన
కొన ప్రాణాన్ని పట్టుకొనీ

వీధి దీపం తమ కోసమే నన్నట్లుంది
వదలని మిత్రుల్లా ఆపైన నక్షత్రాలూ,
దీప స్తంభాలూ నక్షత్రాలూ వాళ్ళతో
ఒంటరి తనంలో పోటీ పడుతున్నాయి.

అడవి లాంటి స్థితుల్లో దారులు మారుతూ
కాళ్ళు తిరుగుతూనే ఉన్నాయి
ఉద్యాన శోభ చూచే సౌభాగ్య మెక్కడుంది?

పక్షు లెగిరే దిశ నుండి
జంతువులు కదిలే దారిని బట్టి
ఇప్పటికీ నీటి కోసం అన్వేషణ!
జీవితంలో కరువు ఉండనే ఉంది.

రాజకీయ చతుర మతులకు
ప్రజాస్వామ్య మొక చదరంగం
మానసిక కలహ చరణులకు
ప్రజాస్వామ్య మొక రణవ్యూహం

ఆలోచనలో అనలం తప్ప మరేమీ లేనట్లుంది
అనుభవంలో వేడి తప్ప మరేమీ కోరనట్లుంది
ఆడేస్తూ పాడేస్తూ మనిషిలో బొమ్మలు
ప్రజాస్వామ్య ఘన కీర్తిని చాటుతున్నాయి

మట్టీ దారు లోహ దశలు దాటి
రబ్బర్ ప్లాస్టిక్ బొమ్మలతో
ఎంత మార్పు వచ్చిందనుకున్నా
మూల మనో రీతులు మాత్రం ఎప్పటివే!

బ్రతుక్కి వ్యాపార కళతో
పెరుగుతూ పోయే శిఖరాలు
పైపై ఎత్తుతో ఆనందం కలిగించినా
భూమికి మాత్రం దూరం చేస్తున్నాయి.

మనిషితో మనిషి సంబంధం కన్నా
మెరపు తీగె నయ మనిపిస్తుంది
చీకట్లో వస్తువును చూపిస్తుంది!

వీధి దీపం తమ కోసమే నన్నట్లుంది
వదలని మిత్రుల్లా ఆపైన నక్షత్రాలూ,
దీప స్తంభాలూ నక్షత్రాలూ వాళ్ళతో
ఒంటరి తనంలో పోటీ పడుతున్నాయి.

అడవి లాంటి స్థితుల్లో దారులు మారుతూ
కాళ్ళు తిరుగుతూనే ఉన్నాయి
ఉద్యాన శోభ చూచే సౌభాగ్య మెక్కడుంది?

పక్షు లెగిరే దిశ నుండి
జంతువులు కదిలే దారిని బట్టి
ఇప్పటికీ నీటి కోసం అన్వేషణ!
జీవితంలో కరువు ఉండనే ఉంది.

రాజకీయ చతుర మతులకు
ప్రజాస్వామ్య మొక చదరంగం
మానసిక కలహ చరణులకు
ప్రజాస్వామ్య మొక రణవ్యూహం

ఆలోచనలో అనలం తప్ప మరేమీ లేనట్లుంది
అనుభవంలో వేడి తప్ప మరేమీ కోరనట్లుంది
ఆడేస్తూ పాడేస్తూ మనిషిలో బొమ్మలు
ప్రజాస్వామ్య ఘన కీర్తిని చాటుతున్నాయి

మట్టీ దారు లోహ దశలు దాటి
రబ్బర్ ప్లాస్టిక్ బొమ్మలతో
ఎంత మార్పు వచ్చిందనుకున్నా
మూల మనో రీతులు మాత్రం ఎప్పటివే!

బ్రతుక్కి వ్యాపార కళతో
పెరుగుతూ పోయే శిఖరాలు
పైపై ఎత్తుతో ఆనందం కలిగించినా
భూమికి మాత్రం దూరం చేస్తున్నాయి.

మనిషితో మనిషి సంబంధం కన్నా
మెరపు తీగె నయ మనిపిస్తుంది
చీకట్లో వస్తువును చూపిస్తుంది!

అంతా "ఒకే" అన్న మాటకు
సవరణలు చోటు చేసుకుంటాయి
ప్రజా ప్రతినిధులు మోజారిటి ఆమోదం పొందుతుంది
"శాంతి" కోసం సమయం చోటు చేసుకుంటుంది
ప్రజాస్వామ్య 'ప్రదర్శన'కు కాస్త విరామం లభిస్తుంది.

## 21. వార్నింగ్

కనీసం ఉనికిని చూపే చంద్రుడు
చీకటి కొమ్మల వెనక
ముఖం చాటు చేసుకున్నట్లుంది

ఈ సమయాన దరి దాపుల్లో
నీలి మబ్బు ఎక్కడా ఉన్నట్లు లేదు

లాఠీతో పొదల్ని శబ్దిస్తూ
కాలి బాటను కత్తిరిస్తూ
కదలే భటుల బూట్ల చప్పుడు
అసాధారణ స్థితి ననువదిస్తూంది

ప్రకృతి మౌనంగా ఉంది
అణగి మణగిన వాలకంతో

క్షణాలు ప్రవహించడం మాని
కాలం గడ్డ కట్టి నట్లుంది
ఈ చివరి నుండి ఆ చివరి వరకు
ఒకే ఫలకం వలె బిగిసి ఉంది రోజు

కారణం ఏదైనా కానీ
దీనిపై నడిస్తే ఎవరైనా
ప్రమాదానికి తలుపు తెరచినట్లే

రాత్రి వేళ సంచారంతో
భయపెట్టే మృగాలు కనిపించడం లేదు
పురాణాల్ని జ్ఞాపకం చేసే
రాక్షసుల సంచరణమూ లేదిక్కడ

అంతా "ఒకే" అన్న మాటకు
సవరణలు చోటు చేసుకుంటాయి
ప్రజా ప్రతినిధులు మోజారిటి ఆమోదం పొందుతుంది
"శాంతి" కోసం సమయం చోటు చేసుకుంటుంది
ప్రజాస్వామ్య 'ప్రదర్శన'కు కాస్త విరామం లభిస్తుంది.

## 21. వార్నింగ్

కనీసం ఉనికిని చూపే చంద్రుడు
చీకటి కొమ్మల వెనక
ముఖం చాటు చేసుకున్నట్లుంది

ఈ సమయాన దరి దాపుల్లో
నీలి మబ్బు ఎక్కడా ఉన్నట్లు లేదు

లాఠీతో పొదల్ని శబ్దిస్తూ
కాలి బాటను కత్తిరిస్తూ
కదలే భటుల బూట్ల చప్పుడు
అసాధారణ స్థితి ననువదిస్తూంది

ప్రకృతి మౌనంగా ఉంది
అణగి మణగిన వాలకంతో

క్షణాలు ప్రవహించడం మాని
కాలం గడ్డ కట్టి నట్లుంది
ఈ చివరి నుండి ఆ చివరి వరకు
ఒకే ఫలకం వలె బిగిసి ఉంది రోజు

కారణం ఏదైనా కానీ
దీనిపై నడిస్తే ఎవరైనా
ప్రమాదానికి తలుపు తెరచినట్లే

రాత్రి వేళ సంచారంతో
భయపెట్టే మృగాలు కనిపించడం లేదు
పురాణాల్ని జ్ఞాపకం చేసే
రాక్షసుల సంచరణమూ లేదిక్కడ

అనుకోని అనుమాన శిఖరం నుండి
సిద్ధ మయిన మృత్యు కథతో
మొదలైన విషాద పర్వం
పంచభూతాల్నీ ఆశ్చర్య చకితం చేస్తూంది

సూర్యుడు అడుగు వేసేందుకు భయపడేను
నేలపై వాలి పడిన మనిషి శరీరం
చిక్కు వీడని సమస్యలా ఉంది
విప్ప బోతే మరో ముడి పడుతూంది

వ్యవస్థలో బలహీనత దుర్దశకు దారితీస్తే
పొరపాటున ఎవరి తల దించబడిందో
దోషం వల్ల ఎవరి తల నేల వాలిందో
సరిదిద్దేందుకు వీల్లేకుండా ఉంది

మనిషిని ఇనుప పంజరంలో బంధిస్తూంది
వ్యక్తి స్వేచ్ఛను అపహాస్యం పట్టిస్తూంది

**(2)**

శాంతికై సామాన్యుని ప్రార్థన
మండే గుండె నుండి పెదవులపై నుండి
పక్షిలా బాణంలా క్షిపణిలా
గగనంలో దూసుక పోతూంది
చివరి కెక్కడ తేలేదీ తెలీదు
సామాన్యుడు మాత్రం ఉన్న చోటునే!

ఎవరికి వారు మరొకరు నడిచిన
దారిలో శాంతి ముద్రల్ని గుర్తుల్ని
వెనుక నుండి వచ్చే జల సేచనంతో
తుడిచి పెట్టుక పోవాలనే చూచేరు

ఎవరికి వారు మరొకరి పతంగం
మధ్యలో తెగి ఏ చెట్టు కొమ్మకో చిక్కి
ఏ విద్యుత్ స్తంభం తీగెకో తగిలి
గిల గిల లాడి చినిగి ముక్కలై
వ్రేలాడితే! అదో అపూర్వ సంతోషం!

అనుకోని అనుమాన శిఖరం నుండి
సిద్ధ మయిన మృత్యు కథతో
మొదలైన విషాద పర్వం
పంచభూతాల్నీ ఆశ్చర్య చకితం చేస్తూంది

సూర్యుడు అడుగు వేసేందుకు భయపడేను
నేలపై వాలి పడిన మనిషి శరీరం
చిక్కు వీడని సమస్యలా ఉంది
విప్ప బోతే మరో ముడి పడుతూంది

వ్యవస్థలో బలహీనత దుర్దశకు దారితీస్తే
పొరపాటున ఎవరి తల దించబడిందో
దోషం వల్ల ఎవరి తల నేల వాలిందో
సరిదిద్దేందుకు వీల్లేకుండా ఉంది

మనిషిని ఇనుప పంజరంలో బంధిస్తూంది
వ్యక్తి స్వేచ్ఛను అపహాస్యం పట్టిస్తూంది

**(2)**

శాంతికై సామాన్యుని ప్రార్థన
మండే గుండె నుండి పెదవులపై నుండి
పక్షిలా బాణంలా క్షిపణిలా
గగనంలో దూసుక పోతూంది
చివరి కెక్కడ తేలేదీ తెలీదు
సామాన్యుడు మాత్రం ఉన్న చోటునే!

ఎవరికి వారు మరొకరు నడిచిన
దారిలో శాంతి ముద్రల్ని గుర్తుల్ని
వెనుక నుండి వచ్చే జల సేచనంతో
తుడిచి పెట్టుక పోవాలనే చూచేరు

ఎవరికి వారు మరొకరి పతంగం
మధ్యలో తెగి ఏ చెట్టు కొమ్మకో చిక్కి
ఏ విద్యుత్ స్తంభం తీగెకో తగిలి
గిల గిల లాడి చినిగి ముక్కలై
వ్రేలాడితే! అదో అపూర్వ సంతోషం!

నిజం బయట పడాలనే
అంతరంగ వాదుల ఆకాంక్ష

రాత్రి చీకట్లో ఒకటైన శరీరం
ఉదయానికి భూమిపై ధూళిలో ఒకటైంది

ప్రజాస్వామ్యం మెడలో గంట మ్రోగుతూంది
హక్కుతో  బాధ్యతలున్న నాణెం మాత్రం
ఖంగున ఎగిరి పడుతూంది

దూరం నుండి సైరన్ వినిపిస్తూంది
ప్రజాస్వామ్యంలో వార్నింగ్‌లా ఉంది.

# 22. ఏది అవునో? కాదో?

నేనేది అవునో నాకు తెలుసు
నేనేది కాదో మరొకరికి తెలుసు
నేనేది అయిందీ నేనేది కానిదీ
రెండూ కలిస్తేనే! మనిషిలో విద్యుదున్మేషం!

కళ్ళు తెరిస్తే వజ్రం
కళ్ళు మూస్తే సముద్రం
సంతోషమూ భయమూ రెండూ
ఒకదాని నొకటి దాటుతూ

కాలానికి సంకెళ్ళు వేయబోయి
తన కాళ్ళకే సంకెళ్ళు పడేను
ప్రతి అడుగులో నిశా శకలం
కదలి పోతుంది నిశ్శబ్దంగా

అవనిపై నడుస్తూ నడుస్తూ పోగా
సముద్రం ఎదురు పడుతుంది
ప్రయాణ తలం మారుతుంది
ప్రయాణ సాధనమూ మారుతుంది

కాలాన్ని నడుపుతుంది మనస్సు
మనస్సును నడుపుతుంది సమాజం

నిజం బయట పడాలనే
అంతరంగ వాదుల ఆకాంక్ష

రాత్రి చీకట్లో ఒకటైన శరీరం
ఉదయానికి భూమిపై ధూళిలో ఒకటైంది

ప్రజాస్వామ్యం మెడలో గంట మ్రోగుతూంది
హక్కుతో  బాధ్యతలున్న నాణెం మాత్రం
ఖంగున ఎగిరి పడుతూంది

దూరం నుండి సైరన్ వినిపిస్తూంది
ప్రజాస్వామ్యంలో వార్నింగ్‌లా ఉంది.

## 22. ఏది అవునో? కాదో?

నేనేది అవునో నాకు తెలుసు
నేనేది కాదో మరొకరికి తెలుసు
నేనేది అయిందీ నేనేది కానిదీ
రెండూ కలిస్తేనే! మనిషిలో విద్యుదున్మేషం!

కళ్ళు తెరిస్తే వజ్రం
కళ్ళు మూస్తే సముద్రం
సంతోషమూ భయమూ రెండూ
ఒకదాని నొకటి దాటుతూ

కాలానికి సంకెళ్ళు వేయబోయి
తన కాళ్ళకే సంకెళ్ళు పడేను
ప్రతి అడుగులో నిశా శకలం
కదలి పోతుంది నిశ్శబ్దంగా

అవనిపై నడుస్తూ నడుస్తూ పోగా
సముద్రం ఎదురు పడుతుంది
ప్రయాణ తలం మారుతుంది
ప్రయాణ సాధనమూ మారుతుంది

కాలాన్ని నడుపుతుంది మనస్సు
మనస్సును నడుపుతుంది సమాజం

మనో భూమి పయి పురి విప్పిన నెమలిలా
నాలో కవితాత్మ సంసిద్ధంగా

ప్రతి ఊరు నాదే నన్నట్లుంటుంది
ప్రతి దారి నాతోడన్నట్లుంటుంది
క్షితిజం చాచిన విశాలమైన చేతుల్లో
రంగుల బొమ్మల క్రీడాంగణ ప్రపంచం

ఇంట్లో దీపం! వీధిలో దీపం!
మనిషి లో దీపం! గగనంలో దీపం!
ఆత్మ దీపం మాత్రం ఒకటే!

సంకల్పం చర్యల ప్రతిచర్యల సంకలనం జీవితం
సుదీర్ఘ జీవితాల పరిణామ భవం సమాజం

వివేకం చేతులు చాచి
అమూల్య వస్తువుల్ని అందుకో జూస్తుంది.
తనలో చేర్చుకో జూస్తుంది.

ఇవాల్టి మనో రూపం ఇవాల్టిదే
కవితాత్మ మాత్రం ఎప్పటికీ ఒకటే.

**(2)**

గ్రీష్మంలో నెఱ్ఱెలు పడ్డ భూమిలో
అడుగున మూలాల్ని సజీవంగా ఉంచే
తడిలా ఎక్కడో ప్రాణాల్ని నిలుపుకొనీ
పిడికెడు స్నేహం కోరే
దోసెడు కరుణకు చాచే
నిలవడానికి నిలయం లేని జీవితాలెన్నో!

రెప్ప పాటున క్షితిజంలో
పై కెగసిన మంటల పై నుండి
హరీంద్రం దూకుతుంది, దాటుతుంది
హరిణం దూర దూరం పరుగెత్తుతుంది
శిలా రూపం నిర్వికారంగా నిలిచి ఉంటుంది.
ఎవరికి వారు వ్యూహంలో వేషం మార్చేరు.

మనో భూమి పయి పురి విప్పిన నెమలిలా
నాలో కవితాత్మ సంసిద్ధంగా

ప్రతి ఊరు నాదే నన్నట్లుంటుంది
ప్రతి దారి నాతోడన్నట్లుంటుంది
క్షితిజం చాచిన విశాలమైన చేతుల్లో
రంగుల బొమ్మల క్రీడాంగణ ప్రపంచం

ఇంట్లో దీపం! వీధిలో దీపం!
మనిషి లో దీపం! గగనంలో దీపం!
ఆత్మ దీపం మాత్రం ఒకటే!

సంకల్పం చర్యల ప్రతిచర్యల సంకలనం జీవితం
సుదీర్ఘ జీవితాల పరిణామ భవం సమాజం

వివేకం చేతులు చాచి
అమూల్య వస్తువుల్ని అందుకో జూస్తుంది.
తనలో చేర్చుకో జూస్తుంది.

ఇవాల్టి మనో రూపం ఇవాల్టిదే
కవితాత్మ మాత్రం ఎప్పటికీ ఒకటే.

**(2)**

గ్రీష్మంలో నెఱ్రెలు పడ్డ భూమిలో
అడుగున మూలాల్ని సజీవంగా ఉంచే
తడిలా ఎక్కడో ప్రాణాల్ని నిలుపుకొనీ
పిడికెడు స్నేహం కోరే
దోసెడు కరుణకు చాచే
నిలవడానికి నిలయం లేని జీవితాలెన్నో!

రెప్ప పాటున క్షితిజంలో
పై కెగసిన మంటల పై నుండి
హరీంద్రం దూకుతుంది, దాటుతుంది
హరిణం దూర దూరం పరుగెత్తుతుంది
శిలా రూపం నిర్వికారంగా నిలిచి ఉంటుంది.
ఎవరికి వారు వ్యూహంలో వేషం మార్చేరు.

కళ్ళ ముందు ఎగిరి పోయే సౌభాగ్యాన్ని
ముంగిట్లో కల్ప తరువులా నిలపాలిసీ ఉంది.

మతిలో వివేక కాంతితో
గళంలో విశ్వాస స్వరంతో
ముఖంలో ఆయువు చేతనతో
హృదిలో ఉదార గుణ పద్మంతో

ఏ వాహన మున్నా లేకపోయినా
అయనంలో చలనం కాలి బాటనే
ఎద ఎదలో ప్రగతి అలల లయతో
పద గతిలో మానవతా ముఖంతో
ఎటు చూచినా ఎటు నడిచినా
నాలో కవితాత్మ సంసిద్ధంగా.

**(4)**

సృజనోత్సేకంతో గుండెలో సుమమై
విజయోల్లాసంతో పెదవిపై మధువై
విలయోద్వేగంతో నిటాలాగ్ని కణమై
'నిజం' బ్రతుకును అలంకరిస్తుంది.

బహు తరాల తేజో రేఖలలో ఎదిగిన
జాతి మూలాలపై దేశం నిలుస్తుంది
శిఖర పంక్తితో విశ్వంలో ఒకటవుతుంది.

ఫాలంపై రోజు కొక పుట తిరిగే చరిత్ర
సమాజ గ్రంథాన్ని నడిపింప జేస్తుంది.

రాళ్ళు విసరిన దెబ్బలతో
బాణాలు దూసిన గాయాలతో
తూటాలు దూరిన వ్రణాలతో
బాంబులు పడిన భీభత్సంతో
విషాద పర్వంలోను ఉత్సాహ శక్తి
నక్షత్రాకాశంలా దేశాన్ని వెలిగిస్తుంది
పూర్ణ చంద్ర కళలై మనుషులు
నిశా హృదయానికి దివా శోభ నిచ్చేరు.

కళ్ళ ముందు ఎగిరి పోయే సౌభాగ్యాన్ని
ముంగిట్లో కల్ప తరువులా నిలపాలిసీ ఉంది.

మతిలో వివేక కాంతితో
గళంలో విశ్వాస స్వరంతో
ముఖంలో ఆయువు చేతనతో
హృదిలో ఉదార గుణ పద్మంతో

ఏ వాహన మున్నా లేకపోయినా
అయనంలో చలనం కాలి బాటనే
ఎద ఎదలో ప్రగతి అలల లయతో
పద గతిలో మానవతా ముఖంతో
ఎటు చూచినా ఎటు నడిచినా
నాలో కవితాత్మ సంసిద్ధంగా.

**(4)**

సృజనోత్సేకంతో గుండెలో సుమమై
విజయోల్లాసంతో పెదవిపై మధువై
విలయోద్వేగంతో నిటాలాగ్ని కణమై
'నిజం' బ్రతుకును అలంకరిస్తుంది.

బహు తరాల తేజో రేఖలలో ఎదిగిన
జాతి మూలాలపై దేశం నిలుస్తుంది
శిఖర పంక్తితో విశ్వంలో ఒకటవుతుంది.

ఫాలంపై రోజు కొక పుట తిరిగే చరిత్ర
సమాజ గ్రంథాన్ని నడిపింప జేస్తుంది.

రాళ్ళు విసరిన దెబ్బలతో
బాణాలు దూసిన గాయాలతో
తూటాలు దూరిన వ్రణాలతో
బాంబులు పడిన భీభత్సంతో
విషాద పర్వంలోను ఉత్సాహ శక్తి
నక్షత్రాకాశంలా దేశాన్ని వెలిగిస్తుంది
పూర్ణ చంద్ర కళలై మనుషులు
నిశా హృదయానికి దివా శోభ నిచ్చేరు.

పరిమళ సౌందర్యంతో జడంలో చైతన్యం!
హృదిలో శాంతినీ ఆర్ద్రతనూ భద్రపరుస్తూంది.

కాలి నడకనో? బండి పైనో?
బస్‌లో రైలులో కారులోనూ
ఇప్పుడైతే విమానంలో యానం!
కవిత్వానికీ అవసరం గమనంలో సాధనం!

చెట్టుపై నిలిచిన పక్షి ఎగిరి పోతుంది
కొమ్మపై వాలిన పక్షి దృశ్యం
పెయింటింగ్ ఇంట్లో గోడకు వ్రేలాడుతూంది
వ్యక్తిలో అనుభవ రహస్యాన్ని సామాజికం చేస్తుంది

నాలో కవితాత్మ సంసిద్ధంగా
యౌవన దశలోకి పరుగెత్తిస్తుంది
ప్రగతిపై విశ్వాసాన్ని బంధిస్తుంది
ప్రేమతో జీవితాన్ని దర్శింపజేస్తుంది

మనో బింబ తేజంతో మానవీయ చలనం
ప్రజాస్వామ్య యుగ సృజనకు నవ సంకేతం

## 24. యుగ హృదయం

యుగ యుగంలో పరివర్తన కళతో
నవ నవోన్మేష విరాట్ రూపం నాలో

ఆలోచన అన్వేషణలో
దేశానికి ప్రతి రూపం
సంవేదన సంస్పందనలో
విశ్వానికి ప్రతి బింబం

సామాజిక పీడన బంధన గతి తెలీని
రాజకీయ దమన కాండ రూపం ఎరగని
నవ జగం కయి యుగ హృదయం
ఆహ్వానం పలుకుతూంది మనిషి మనిషికీ

కళ్ళలో సృజన కిరణం
విజయ మౌళిని చూపుతూంది

పరిమళ సౌందర్యంతో జడంలో చైతన్యం!
హృదిలో శాంతినీ ఆర్ద్రతనూ భద్రపరుస్తూంది.

కాలి నడకనో? బండి పైనో?
బస్‌లో రైలులో కారులోనూ
ఇప్పుడైతే విమానంలో యానం!
కవిత్వానికీ అవసరం గమనంలో సాధనం!

చెట్టుపై నిలిచిన పక్షి ఎగిరి పోతుంది
కొమ్మపై వాలిన పక్షి దృశ్యం
పెయింటింగ్ ఇంట్లో గోడకు వ్రేలాడుతూంది
వ్యక్తిలో అనుభవ రహస్యాన్ని సామాజికం చేస్తుంది

నాలో కవితాత్మ సంసిద్ధంగా
యౌవన దశలోకి పరుగెత్తిస్తుంది
ప్రగతిపై విశ్వాసాన్ని బంధిస్తుంది
ప్రేమతో జీవితాన్ని దర్శింపజేస్తుంది

మనో బింబ తేజంతో మానవీయ చలనం
ప్రజాస్వామ్య యుగ సృజనకు నవ సంకేతం

## 24. యుగ హృదయం

యుగ యుగంలో పరివర్తన కళతో
నవ నవోన్మేష విరాట్ రూపం నాలో

ఆలోచన అన్వేషణలో
దేశానికి ప్రతి రూపం
సంవేదన సంస్పందనలో
విశ్వానికి ప్రతి బింబం

సామాజిక పీడన బంధన గతి తెలీని
రాజకీయ దమన కాండ రూపం ఎరగని
నవ జగం కయి యుగ హృదయం
ఆహ్వానం పలుకుతూంది మనిషి మనిషికీ

కళ్ళలో సృజన కిరణం
విజయ మౌళిని చూపుతూంది

ఉద్రేకం విధ్వంసం కల్లోలం వినాశనం
విలయ మహాకాలానికి ఆహార్యాలై
చరిత్రలో మరోవైపు రూపం చూపేను.

జీవిత సత్యాన్వేషణలో ఎప్పటికప్పుడు
ధైర్యానికీ ఉత్సాహానికీ వాహనమై శరీరం
నిర్నిరోధ నిరాటంక స్వేచ్ఛా గమనం
సీమల్ని దాటుతూ దారుల్ని కలుపుతూ
పయనంలో యుగ హృదయ సమావిష్కారం.

జీవన గమనంలో క్షణ క్షణం
సమాజ సందర్భంగా సంబంధంగా
ఉత్సాహానికి భావ రస రాగాన్నిస్తూంది
ఆవేశానికి సమ గతి లయ నిస్తూంది

కవి దేశిక నేతలు స్వేచ్ఛలో
చిత్తం వచ్చినట్లు చేస్తున్నట్లనిపిస్తుంది
ఆ చిత్తం వెనుక నుంది దర్శనం
ప్రేరణయై నవమై హితమై

నిశాంతంలో ఆనందాన్ని
ప్రతి జీవితం కోరుతుంది
అరణ్యం నుండి ఉద్యానానికి
ప్రతి ఎద ఇష్ట పడుతుంది

సమాజ చరిత్రలో ఆకర్షక పార్శ్వాలు
ఒక చేతిలో స్వనించే వేణువు
మరో చేతిలో ధ్వానానికి శంఖం
రాగం వీరంతో రసావిష్కార మూలం.

బాధా సముద్ర– మథనంలో
దేని కయినా సిద్ధమయిన మనస్సు
ఉపశమనానికో అలంకారానికో కాని
మొదట చంద్ర బింబాన్నే కోరుతుంది

నిర్భయ స్వేచ్ఛా పరిణామ చరిత్రకు
ప్రపంచ సమాజం స్వాగతం చెబుతూంది

ఉద్రేకం విధ్వంసం కల్లోలం వినాశనం
విలయ మహాకాలానికి ఆహార్యాలై
చరిత్రలో మరోవైపు రూపం చూపేను.

జీవిత సత్యాన్వేషణలో ఎప్పటికప్పుడు
ధైర్యానికీ ఉత్సాహానికీ వాహనమై శరీరం
నిర్నిరోధ నిరాటంక స్వేచ్ఛా గమనం
సీమల్ని దాటుతూ దారుల్ని కలుపుతూ
పయనంలో యుగ హృదయ సమావిష్కారం.

జీవన గమనంలో క్షణ క్షణం
సమాజ సందర్భంగా సంబంధంగా
ఉత్సాహానికి భావ రస రాగాన్నిస్తూంది
ఆవేశానికి సమ గతి లయ నిస్తూంది

కవి దేశిక నేతలు స్వేచ్ఛలో
చిత్తం వచ్చినట్లు చేస్తున్నట్లనిపిస్తుంది
ఆ చిత్తం వెనుక నుంది దర్శనం
ప్రేరణయై నవమై హితమై

నిశాంతంలో ఆనందాన్ని
ప్రతి జీవితం కోరుతుంది
అరణ్యం నుండి ఉద్యానానికి
ప్రతి ఎద ఇష్ట పడుతుంది

సమాజ చరిత్రలో ఆకర్షక పార్శ్వాలు
ఒక చేతిలో స్వనించే వేణువు
మరో చేతిలో ధ్వానానికి శంఖం
రాగం వీరంతో రసావిష్కార మూలం.

బాధా సముద్ర– మథనంలో
దేని కయినా సిద్ధమయిన మనస్సు
ఉపశమనానికో అలంకారానికో కాని
మొదట చంద్ర బింబాన్నే కోరుతుంది

నిర్భయ స్వేచ్ఛా పరిణామ చరిత్రకు
ప్రపంచ సమాజం స్వాగతం చెబుతూంది

ఆశా బృహదాకాశాన్ని తనలో నింపుకొని
ప్రపంచ సౌధంపై రెప రెపలాడుతూంది
మానవీయ బింబంతో ప్రజాస్వామ్య పతాకం

**(5)**

విలయం ఆశీస్సు కాదు
ఇదొక దిన చర్యగా
ఏ రోజూ ప్రత్యక్షం కాకూడదు

విలయాగ్ని సమయ సమయం
అందంగా అలంకృతమై సిద్ధాంతాల్లో
తరాలకు చేర్చే బహుమాన మవుతూంది

ఉద్రేకం హింసతో ఉన్మత్త చర్యలతో
స్వార్థానికి ప్రతీకలై బహుముఖ పాత్రలు
సూర్యుణ్ణీ, చంద్రుణ్ణీ మింగాలని చూచేను.

గరుడుడు కష్టపడి తెచ్చిన అమృతాన్ని
ఇంద్రుడెత్తుక పోయే ఎత్తును భగ్నం చేసి
అందరికీ అందే సమధర్మం రావాలనే

ద్వేషం మోసం అసహనం అశాంతిలో
మహాహి విప్పే వేయి పడగలు
విశాల ఛత్రంగా ఉపయోగ పడాలనే

నరహింసకు సెలవు పలకాలనీ
విలయ నృత్యాన్ని మరపించాలనీ
అలల చేతులతో ప్రవాహం
క్షేత్రాల్ని ఆశీర్వది ంచాలనీ

మేఘాన్నీ మీటి జల రాగం సృష్టించాలనే
గగనం నుండి జలద హృదయాన్ని
నేలపై నిలిచిన మనిషి చేతిలో దించాలనే

గ్రీష్మంలో చెలగే అనల చక్రంలా
దుఃఖితుల బాధా స్వరాల స్థానంలో
వర్షంలో జల కణ ఝణ మంజీర స్వనాలతో
మానితుల హ్లాద స్వరాలు ఒకటై వినిపించాలనే

ఆశా బృహదాకాశాన్ని తనలో నింపుకొని
ప్రపంచ సౌధంపై రెప రెపలాడుతూంది
మానవీయ బింబంతో ప్రజాస్వామ్య పతాకం

**(5)**

విలయం ఆశీస్సు కాదు
ఇదొక దిన చర్యగా
ఏ రోజూ ప్రత్యక్షం కాకూడదు

విలయాగ్ని సమయ సమయం
అందంగా అలంకృతమై సిద్ధాంతాల్లో
తరాలకు చేర్చే బహుమాన మవుతూంది

ఉద్రేకం హింసతో ఉన్మత్త చర్యలతో
స్వార్థానికి ప్రతీకలై బహుముఖ పాత్రలు
సూర్యుణ్ణీ, చంద్రుణ్ణీ మింగాలని చూచేను.

గరుడుడు కష్టపడి తెచ్చిన అమృతాన్ని
ఇంద్రుడెత్తుక పోయే ఎత్తును భగ్నం చేసి
అందరికీ అందే సమధర్మం రావాలనే

ద్వేషం మోసం అసహనం అశాంతిలో
మహాహి విప్పే వేయి పడగలు
విశాల ఛత్రంగా ఉపయోగ పడాలనే

నరహింసకు సెలవు పలకాలనీ
విలయ నృత్యాన్ని మరపించాలనీ
అలల చేతులతో ప్రవాహం
క్షేత్రాల్ని ఆశీర్వది ంచాలనీ

మేఘాన్నీ మీటి జల రాగం సృష్టించాలనే
గగనం నుండి జలద హృదయాన్ని
నేలపై నిలిచిన మనిషి చేతిలో దించాలనే

గ్రీష్మంలో చెలగే అనల చక్రంలా
దుఃఖితుల బాధా స్వరాల స్థానంలో
వర్షంలో జల కణ ఝణ మంజీర స్వనాలతో
మానితుల హ్లాద స్వరాలు ఒకటై వినిపించాలనే

కరుణ గంగను సరింపజేస్తుంది
శాంతి బ్రతుకును పండింప జేస్తుంది

విజయ శిఖర మెక్కడో లేదు
సృజన హృదయ యానంలో
మానవతా సోపాన క్రమంలో
ప్రతి మనిషి బాధ్యతలో ఉంది

ప్రేమ కరుణ శాంతి ధైర్యం చతురస్రంలో
దిశ దిశను స్పృశిస్తూ భ్రమిస్తూ గడుస్తూ
ఒక స్వేచ్ఛ నుండి మరో స్వేచ్ఛలోకి
ఒక నియతి నుండి మరో నియతిలోకి
ఒక సీమ నుండి మరో సీమలోకి
ఒక ప్రపంచం నుండి మరో ప్రపంచంలోకి
ఒక జీవితం నుండి మరో జీవితంలోకి
మనిషి నుండి మనిషి అస్తిత్వంతో
ఎక్కడి కక్కడ స్వయం వ్యక్తిత్వ ప్రకాశనం

నడచే కాళ్ళ క్రింద
ధరా తలం ఉంది స్థిరమై
ప్రవహించే జీవితం వెనక
పర్వత శ్రేణి ఉంది చిరమై

సుఖమో సంతోషమో విషాదమో విపరీతమో
ఆగకుండా సాగే కాంక్షా రేఖలమధ్య
పలు రంగులలో హంగులతో మానవీయ సమాజం
సృజన విలయ పార్శ్వాలతో నాలో విరాట్ రూపం

కరుణ గంగను సరింపజేస్తుంది
శాంతి బ్రతుకును పండింప జేస్తుంది

విజయ శిఖర మెక్కడో లేదు
సృజన హృదయ యానంలో
మానవతా సోపాన క్రమంలో
ప్రతి మనిషి బాధ్యతలో ఉంది

ప్రేమ కరుణ శాంతి ధైర్యం చతురస్రంలో
దిశ దిశను స్పృశిస్తూ భ్రమిస్తూ గడుస్తూ
ఒక స్వేచ్ఛ నుండి మరో స్వేచ్ఛలోకి
ఒక నియతి నుండి మరో నియతిలోకి
ఒక సీమ నుండి మరో సీమలోకి
ఒక ప్రపంచం నుండి మరో ప్రపంచంలోకి
ఒక జీవితం నుండి మరో జీవితంలోకి
మనిషి నుండి మనిషి అస్తిత్వంతో
ఎక్కడి కక్కడ స్వయం వ్యక్తిత్వ ప్రకాశనం

నడచే కాళ్ళ క్రింద
ధరా తలం ఉంది స్థిరమై
ప్రవహించే జీవితం వెనక
పర్వత శ్రేణి ఉంది చిరమై

సుఖమో సంతోషమో విషాదమో విపరీతమో
ఆగకుండా సాగే కాంక్షా రేఖలమధ్య
పలు రంగులలో హంగులతో మానవీయ సమాజం
సృజన విలయ పార్శ్వాలతో నాలో విరాట్ రూపం

స్వేచ్ఛా కవిత్వం

రెండవ భాగం - 6

# హృదయ మేఘం

మాదిరాజు రంగారావు

**2006**

రసధుని సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 500 028

# అంకితం



ఉదార మనస్విని స్నేహ మూర్తి
చిరంజీవిని శ్రీమతి మాదిరాజు / దేవులపల్లి హరితకు
M.A (Lit)
Canton (Detroit) Michigan M.I., U.S.A.
ఆశీస్సులతో

# కావ్యహృదయం

"హృదయ మేఘం" వస్తువులో ఏక సూత్రత ఉన్న కావ్యం. మేఘాగమనంతో ప్రకృతిలో సమాజంలో జీవితాల్లో వచ్చే పరివర్తన ప్రభావాల సంస్పందన స్వరూపం. ఇందులో విషయం ప్రకృతి నేపథ్యంలో సామాజిక స్థితులతో జీవితానుభవగతులతో, మేఘం కేంద్ర స్థానంగా వివిధ సందర్భాల్ని పురస్కరించుకొని కవితాత్మ ఆవిష్కృతమయింది. భౌతిక కోణంతో పాటు మానసిక కోణమూ దృష్టికి వస్తుంది. మేఘంతో మట్టికీ మనిషికీ బ్రతుక్కీ నాగరికతకూ గల మహనీయ సంబంధమూ చోటు చేసుకుంది. వ్యక్తికీ సమాజానికీ ఎప్పటికీ జలద స్ఫూర్తి అవసరమూ భావిత మయింది. "హృదయ మేఘం" పదబంధం కావ్యంలో అర్థాంతర సమన్వయాన్ని అపేక్షిస్తుంది. హృదయమనేది జీవితానికి మూలంగానూ శక్తికి నిలయంగానూ మనోభావాలకు స్థానంగానూ మానవ స్పృహకూ స్పందనకూ కేంద్రంగానూ అంతరరూపానికి చిహ్నంగానూ ఉంది. "మేఘ" మనేది సృజనకు ప్రేరణగానూ ఆర్ద్రతకూ అనురాగానికీ హేతువుగానూ ఉదార వికాస ఉత్సాహ క్రియాపురోగమనాలకు మార్గ దర్శకంగానూ ఉంది. ఈ రెండిటి కలయిక చేత "హృదయ మేఘం" ఆయా సందర్భల్లో సామాజిక చేతనకు సాధనంగా బహు విధాలుగా వ్యంగ్య స్ఫూర్తిని పొందింది. విషయంలో ఈ అంశాలతో పాటు రూప బింబాల (Images) ప్రతీకల (Symbols) ప్రమేయంతో అభివ్యక్తిలో భావ జగత్తు నిర్మితమయింది. దీనికి ఆధారతలం వాస్తవ సాదృశ్యం (Verisimiltude) మాత్రమే. సృజన రూపం విశ్వ సమర్పకమైన మానవీయ భావనతో మానవతా స్పందనతో సార్వజనీనమయిన తాత్త్వికతను పొందింది. 1. ప్రకృతి నేపథ్యం 2. వాస్తవ తలంపై జీవితమూ సమాజమూ 3. మానవీయ భావనతో – మానవతా స్పందనం 4. సార్వ కాలిక మయిన తాత్త్వికత 5. భావ ప్రసారంలో అభివ్యక్తి శిల్పం – అనే అంశాలతో కూడిన సంవిధానం (రచనలో) స్ఫుటంగా కనిపిస్తుంది.

"హృదయ మేఘం" అంటే కావ్యంలో 1. హృదయం ఉన్న మేఘం 2. వ్యక్తి లేదా కవి హృదయంలో మేఘం 3. హృదయం అయిన మేఘం లేదా హృదయం అనే మేఘం 4. హృదయం ప్రధానం గల మేఘం కేంద్రంగా ఉన్న కావ్యం అనీ వివిధ సందర్భాల్లో అర్థ చ్ఛాయల్ని పొందింది. భౌతిక మానసిక స్థాయిల్లో మేఘ యానం హృదయ స్పర్శతో సాగింది. మేఘ రూపంలో హృదయ భావన మానవతా బంధంతో

ఆద్యంతమూ నెలకొని ఉంది. మేఘ ప్రసక్తితో ప్రకృతి ప్రమేయం అనివార్యం. ఇది కావ్యంలో కొన్ని సందర్భాల్లో నేపథ్యంగానూ సహకరించింది. ధూమం జోతిస్సు సలిలం మరుత్తుల సమాహారమైన స్వేచ్ఛా రూపం మేఘం, క్రియాత్మకంగా సమాజ ప్రయోజనోద్దిష్ట మయింది. మానవతా సందేశంతో లక్షితమయింది.

మేఘం ఇప్పటిదా? సృష్టికి మూలంలోది. పురాభావాన్ని ప్రేరేపిస్తుంది. మొక్కను మొలిపించే సృజన స్థితి నుండి విలయానికి దారి తీసే ప్రళయ స్థితి మరకూ వివిధ రూపాల్లో ప్రభావం నెరుపుతుంది. దాహార్తిని తీర్చడం నుండి మనోరాగాన్ని పెంచడం వరకూ భౌతిక మానసిక స్థాయిల్లో ఉపయోగపడుతుంది. ప్రకృతినీ సమాజాన్నీ మనోరూపాన్నీ ప్రభావితం చేసే శక్తి రూపంగా చిత్రితమయింది. కాల గమనంలో మానవ వికాస చరిత్రకూ సంస్కృతి ఉన్నతికీ దోహదం చేసింది. వ్యక్తి జీవితంలో హ్లాదాన్నీ సుందరతనూ అనురాగ బంధురతనూ ప్రసాదించింది.

మేఘా గమనంతో బీజభూతంగా ఉన్నకోరిక చిగురిస్తుంది. మొగ్గ తొడుగుతుంది. ఇది ఆశాజగత్తుకు ప్రతీకగా మలచడింది. మనిషి విషయంలో చేతిలో రైఫిల్ పిస్టల్ స్థానంలో గిటార్‌తోనో వేణువుతోనో శాంతికీ ఆనందానికీ దారి తీసే స్థితినీ సృజిస్తుంది. మేఘ గర్జనం మళ్ళీ మళ్ళీ వినాలనీ, మేఘం నుండి మెరపును మళ్ళీ చూడాలనీ కోరిక! గర్జనం హెచ్చరిస్తుంది. మెరుపు మరచింది జ్ఞాపకం చేస్తుంది. ఒకొక్కపుడు మేఘం తుపాను, ఉప్పెన పేరిట విలయచ్ఛాయల్లో మృత్యు జాలాన్ని విసరిన సందర్భాలూ లేకపోలేదు. మేఘం మార్పుకు సూచనగా ఉంది. ఇది ఏ యంత్రానికీ తంత్రానికీ కట్టువడింది కాదు. పిడుగులో క్రోధం, మెరుపులో రాగం, జలంలో కరుణ ఛాయలో స్నేహం మానవ చరిత్రను నిర్మించే అనేకాంశాలు కదలుతాయి. శిశువు నయన రామణీయకతతో విలసిస్తుంది. ఆర్తుల కన్నీటిని తడుస్తుంది. దీనుల గుండెల్ని పలకరిస్తుంది. ఏ స్వాగతాలతో ఏ సన్మానాలతో పని లేకుండా తను బాధ్యతను నిర్వర్తిస్తుంది. వర్షధారలో సామాజిక చేతన ధ్వనితం కావడం విశేషం.

సముద్రం నుండి ఆర్తిలో ఆవేదనతో ఎగసిన మేఘం ఆర్తిని తీర్చడానికీ ఆవేదనను చల్లార్చడానికీ సమాజాని కుపరించడం గొప్ప విషయం. మేఘం వచ్చేముందు బారులు బారులుగా ఎగసే పక్షుల వలె కోర్కెలు కదలడమూ సహజం! దేశాల జాతుల ఉచ్చనీచాల గుర్తులు లేకుండా సమభావంతో సహజ జీవన వాతావరణంలో స్వేచ్ఛా సమాజాన్ని భావింపజేస్తుంది. శిరస్సు ఎత్తుకొని సంకల్ప శక్తితో హృదయ స్పర్శంతో సాగే మానవ వ్యక్తిత్వానికి ప్రతీకగా నిలుస్తుంది.

కాల మనో గగనంలో నిష్క్రమణ పర్వాలతో ఆగమన సర్గలతో ఆకర్షిస్తుంది. ఇది విపణిలో దొరకే వస్తువు కాదు, హృదయానికి మాత్రం అందే ఆర్ద్ర విషయరూపం. భౌతికమైన అణువు నుండి మానసికమైన ఆలోచనా కణం వరకూ విశ్వ శాంతికి సిగ్నెల్‌గా ఎదురవుతుంది. మల్లెల్ని ముత్యాల్ని రాలుస్తూ జీవితానికి అమృతకళను సిద్ధింపజేసే మేఘం! ఎక్కడా స్వాగతమేకాని వీడ్కోలు లేని జీవితంలో ఇచ్చే సందేశం! ఒకటే! మనిషి మాటిమాటికీ మరచే చాలా అవసరమైన మానవతా రాగం. ఇదే కావ్యంలో సృజన భూమిక.

హృదయ మేఘం కృతి విశిష్టమయిన అస్తిత్వం కలిగింది. ఇది 1. ప్రకృతి 2. సమాజం 3. మనోజగం 4. మానవీయంతో సంబంధం కలిగిన భావనా రూపాల సంశ్లిష్ట కళా రూపం. లక్ష్యంతో ప్రజాసామ్య దిశ కలిగింది. హృదయం 1. శరీరంలో ప్రధానమయిన భాగం. శరీరానికంతా రక్తాన్ని ప్రసారం చేసే కేంద్రం. 2. మనో భావాలూ (Feelings) గాఢమైన మనోభావానికి చెందిన ఆవేశ రూపాలూ (Emotions) ఉద్గమించే స్థానం. 3. ధైర్యానికీ నిశ్చయానికీ ఆశకూ రూపం 4. మనస్సుకూ అభిప్రాయానికీ సూచిక 5. ప్రేమకు చిహ్నం. మేఘం 1. ప్రకృతిలో ప్రధానమయిన పరివర్తనకు కీలకమయిన సాధనం 2. వర్షాజలంతో భూమినీ జీవితాన్నీ సంపన్మయం ఆనందమయం చేసేదీ 3. గగన నిలయ మూర్తీ. ఇవి సాధారణ స్థాయిలో ఆలోచన కందే అంశాలు. వీటిలో పాటు కావ్యంలో "హృదయ మేఘం" వ్యంగ్య విలసనాన్ని పొందింది. పై స్థాయిలో మనోభావాల స్పందనంతో మనోభావాల ప్రభావంతో కరుణనూ ప్రేమనూ త్యాగాన్నీ ఉదారతనూ సమాజ గతిలో ప్రయోజన దిశలో శాంతినీ సౌభాగ్యాన్నే పురోగమనాన్నీ జీవితంలో సానుకూల (Positive) దృష్టినీ సూచిస్తుంది. మేఘం కోర్కెను మొలిపిస్తుంది. ఆలోచనను ప్రేరేపిస్తుంది. అనురాగాన్ని ప్రకాశింప జేస్తుంది. సందర్భాన్ని బట్టి అనేక సంస్థితులతో దీర్ఘ దీర్ఘ తరమయిన భావనా ప్రసారంతో అర్థాంతరాన్ని పొందుతూంది. కావ్యంలో ప్రతీయమాన స్వరూపాన్ని భాసింపజేస్తూంది. స్వేచ్ఛా కవిత్వం పొందుతున్న ఉన్నతిని గురించీ విస్తృతిని గురించీ గభీరమైన ఉదాత్తమైన స్థితి గురించి ముఖ్యంగా వైవిధ్యం గురించీ వేరే చెప్పనవసరం లేదు. దీన్ని సమాలోచనలో భాగంగా సహృదయులకు వదలుతూ, ఈ కృతి విశిష్టమైన కవిత్వాభిరుచిని సంతృప్తి పరుస్తుందనే విశ్వసిస్తూ.

**– మాదిరాజు రంగారావు**

# హృదయ మేఘం

అభినవ మేఘం నాలో
 శాంతిని కోరే జన హృదయం
పురా మూల భావంతో
 ఇప్పటిదా? ఎప్పటిదో?
మానవ సంకల్పానికి రస మనోజ్ఞ రూపం
 మహా కాల పరిణామంలో అను సృష్టికి చిహ్నం

బిందు బిందు ధారలతో
 నింగి నుండి నేలకు దిగి
ఆగని జీవన చలనంతో
 కదలే స్వేచ్ఛాధీన విగ్రహం

ప్రకృతి శక్తి అవతారం
 సృజన ప్రపంచానికి బీజం
మానుష గుణ శిల్పాలకు
 కరుణ హృదయ సంకేతం

వర్తమాన సమయ రుచితో
 ఉదార గుణ సరణితో
సృజనకు సాధన మవుతూంది
 అనుభూతికి ప్రేరణయై

బాధలో కన్నీటి బిందువు నుండి
 శ్రమ చరిత్ర సింధువు దాక
జన సమూహా విషమ దశల్లో
 విశ్వ బంధు సూత్రమవుతూంది

పవన యాన పథంలో
చకత్ చకిత ప్రకాశంతో
సమాజ పురోగమానికి
దారిని నిర్దేశిస్తూంది
నాలో అస్తిత్వానికి
విజయ ఛత్రమవుతూంది

సృష్టి మొదటి యాత్ర నుండి
మేఘునితో అనుబంధం!
సామాజిక శక్తుల్ని భిన్న స్థాయిల్లో
రస పథాన నడిపించే జీవన పుట బంధం

నా ఊరు ప్రజా హృదయం
నా పయనం సమ సమాజం
మేఘ చ్ఛాయల్లో బ్రతికే
మానవ సంస్కృతిలో పర్వం

**(2)**

నిద్రా మహా రూపంలో అవతరించింది
మొదట్లో చిరు భయం కలిగించింది
మధ్య మధ్య మాటలతో సంజ్ఞలతో
మేఘం! దగ్గరగా తీసుకుంటుంది
మేల్కొన్న శిశు మూర్తిలా మురిపిస్తుంది
వచ్చి పోయే మాయలా అన్నిటినీ మరపిస్తుంది
తల దాచుకున్న ప్రాణుల్నీ
ముఖం చాటేసిన మనుషుల్నీ
బయటికి లాగుతుంది ప్రదర్శిస్తుంది
తనలో కామనీయక హృదయంతో

మూయబడిన మనః కవాటాన్ని తెరచి
అరుదైన విశ్వ దృశ్యాన్ని చూపిస్తుంది.
బరువు బరువుగా శ్వాసకు అందుతూనే గాలి
ప్రతి ఎదకూ హ్లాద స్పర్శనిస్తుంది
మేఘం నీడలో సర్వంసహ చల్లబడి
ప్రాణి నరాల్లో చైతన్యం నృత్యం చేస్తుంది

మండేందుకు సిద్ధంగా వున్న గరిక పోచ
ఆశామృత సూత్రంతో సమాజాన్ని బంధిస్తుంది
జల జల రాలే చినుకులతో ధరా దాహం తీరి
ధారా స్వరం సముద్రంతో బంధుతను ప్రకటిస్తుంది

కోరిక ఆర్ద్రమై పుష్ప శోభను పొందుతుంది
ఒలికే బోధతో మనోదాహం అణుగుతూంది
అర్ధ రాత్రి దాకా సెగలు చిమ్మే నేల
జల తరళమై రస జీవనాన్ని ఒలుకుతూంది

దేశ దేశాల్ని జల తోరణంలో బంధిస్తూ
నదులు జలద కీర్తిని మోస్తూ ఉత్సాహం పొందుతాయి
గగన మేఘం హృదయ స్థానం చేరుతుంది
వ్యక్తి జీవితం సమాజ మహిత మవుతుంది

**(3)**

**జ**లద పంక్తు లొకటొకటీ కదలుతూంటే
నీడల సీమల్లో నడచి నంత దూరం
సమాజ జాతకం బయట పడుతుంది.
ప్రకృతి శక్తి ఉన్మీలితమవుతుంది

విరాగానికి దారి తీసే పథంలో
హృదిని విషాద స్వరంలో ముంచి
దైవం వైపు చేతులు చాచేట్లు చేసే

దరిద్ర మహా రూపాన్ని మేఘం!
సౌభాగ్య మహాశక్తిగా మారుస్తుంది
ఆశా వదనంలో జీవన కళ వస్తుంది.
శూన్య హస్తాల్లో అదృష్టం మెరుస్తుంది
చెరువులు నిండి చేతులు చాస్తాయి
రసాలోకనంలో హృదయం ప్లవిస్తుంది

కళ్ళ నుండి క్రోధంతో దూకే సింహాలతో
చేతిలో సాహసంతో కదిలే ఆయుధాలతో
విజృంభించే సమర శక్తుల సంచారానికి
జలదాగమనం! ఒక విరామ శాంతి సమయం

అగ్నులు హిమ వదనాలవుతాయి
బండలు రస సదనాలవుతాయి
జలద గర్జా ధ్వనిలో
ప్రియా హృదయ భాష శబ్దిస్తుంది
ఆశీః ప్రసారం వినిపిస్తుంది సదా
శాప వచనం అనుకోని క్వాచిత్కం

కిరీటంలో పొదిగిన రత్నాలే కాదు
అంచుల్లో అమరిన ముళ్ళూ ఉంటాయి.
ఎవరి కేవి శోభిస్తాయో! వారినే వరిస్తాయి!
రాముడో! క్రీస్తో! ఎందరో మహానుభావులు!

ఒకటి రాగంలో నిమగ్నం చేస్తుంది
ఒకటి కరుణతో పులకింపచేస్తుంది
అందీ అందనీ ఆత్మ రూపం
రస జగత్తులో అవతరిస్తుంది.

జల ధారా శ్రేణుల తంత్రీ స్పృహలో
మనిషి చేతిలో గురి పెట్టిన రైఫిల్ పిస్టల్
గిటారుగానో వేణువుగానో మారే ప్రమోదమూ! విశేషమే!
హృదిలో మేఘ స్వరం స్వనిస్తూ! సరిస్తూ!

(4)

జలధి నుండి గగనాని కెగసిన
జలదం కయి ఎదురు చూస్తాయి
చెట్టు! నేల! పర్వతం! ప్రాణీ!
అవసరా లెక్కువై! సతమత మయ్యే
మనిషి గురించి చెప్పేదేముంది?
గుండెలో దింపుకునే తీరిక ఎక్కడుంది?

ప్రకృతి విజయ రూపంగా
జీవితానికి అదృష్ట చిహ్నంగా
ప్రతి ప్రాణికి ధైర్యాన్నిస్తుంది
ప్రకృతి శక్తికి రూపాన్ని ఇస్తుంది
గర్జా ధ్వని మళ్ళీ మళ్ళీ వినాలనీ
మెరుపు రూపం మళ్ళీ మళ్ళీ చూడాలనీ
గాలి వీచే సరి కొత్త స్వరం వినాలనీ
పిల్లల్లో ఉత్సాహం! పెద్దల్లో ఆరాటం!

తాండవ వేళ శివుని జటాచ్ఛటలా
విరిసి నింగి హృదయ మావరిస్తుంది
సూర్యుణ్ణీ చంద్రుణ్ణీ చుక్కల్నీ పిల్లల్లా
తన బుజాలపై కూర్చోబెట్టు కుంటుంది.

ఆ సమయం తిష్ఠవేసిన నిరాశకు రెక్కలొచ్చి
లేచి వెళ్ళిపోతుంది! కనిపించకుండా
మార్పుకి సంకేతంగా వస్తుంది ప్రతి సారి మేఘం!

కిటికీ నుండి పైకి తొంగి చూచే ఖైదీకి
ఎట్లా కనిపించినా, కనిపించక పోయినా
ఊగే గాలితో ఝున ఝున వర్ష ధార
ఆ సమయం హృదిలో తోచేను స్నేహబంధం!

ఆవేళ తనలో మనోభూమి పయి
వచ్చే మార్పుని గుర్తించే

మనిషి ముఖంలో మెరుపును చూడాలనీ
చిరు కోరిక ఖైదీలో!
అలాగే ఉండి పోతుంది! చెక్కు చెదరకుండా
ప్రతిసారి తలెత్తుతుంది బిక్కు బిక్కుమనీ

కాలి కింద అణగి మణగి
ధూళి కమ్మి రూపం చెదరిన జీవితాలు
అణువణువూ శుభ్రమై తళ తళలాడాలనే
ఆకృతి దృశ్యంలో తృప్తిరేఖ చూడాలనే!

ఈ దేశం ఆ దేశం ఈ ప్రజ ఆ ప్రజ
జడమూ చేతనమూ భేదం లేకుండా
ఎగుళ్లనూ దిగుళ్ళనూ కలిపి సమం చేసే
ప్రభావ పూర్ణ జలాలకు నడకలు వస్తాయనే

దీర్ఘ నిద్ర వదలుతుంది నాగలి
ముందుకు కదలుతుంది సచేతనంగా
నేల పయి రేఖలుగా పంక్తులుగా
అదొక మహాభాగ్య గ్రంథం అవాలనీ

అంతా క్షేమమనీ భద్రమనీ చెప్పలేం
సహస్రాశ్వ పంక్తిలా వేగంతో దూకే వాయువు
విసరే చేతుల్లో గుడిసె లెగిరి పోతాయి
నిరాశ్రయం రావచ్చు! నిరాధారం మిగల వచ్చు.

ఎవరయినా ఎపుడయినా ఏమయినా కోరేదీ
నవ వర్షాగమనంతో అందరికీ కావలసిందీ
కఠిన ధరా తలం పయి మృదు శాద్వల రూపం
విజయ గగన మస్తిష్కంలో సహృదయ మేఘం

**(5)**

**నా**లో బింబించే మేఘం కవి హృదయంలా
గగనాన్ని భావమయం చేస్తుంది

మౌన సాధనాన్ని పలికిస్తుంది, పాడిస్తుంది
మనస్సులో ఆర్ద్ర జగం నింపుతుంది

జల బిందు సమూహ గతిలో
మనిషి కలలు గంతులేస్తాయి.
నీటి అలలు కదం తొక్కతాయి
కలలూ అలలూ కొత్త నడకలు నేరుస్తాయి

జలద సంచారంతో మనోరూపం
సమాజ బంధాన్ని పెంచుతుంది
తటిత్ రేఖతో దృష్టి కిరణం
అతీత రూపాన్ని మెరపిస్తుంది
నిరంతర క్రియాలోల సమాజంలో
వర్తమానం సవేగ వాహన మవుతుంది
చేతులూ కాళ్ళూ శ్రమిస్తూ బ్రతుకులో
శ్రమకు తగిన ఫలంపై ఆశ సహజం!
ఇది గగన కుసుమం కావడం ఆశ్చర్యం!
చర్యకు ప్రతి చర్యతో వ్యతిరేకత నిలుపుతుంది

మేఘం కనిపించడంతో
అందాకా ముడచుకున్న చేతులు
స్వాగతంతో పల్లవిస్తాయి
అందాకా నిలిచి ఉన్న కాళ్ళు
రెక్కలు వచ్చినట్లవుతాయి
మనస్సు మేఘానికి ప్రతి రూపమవుతుంది
ఏకాంతం అదృశ్యమవుతుంది
సామూహికం శక్తియుత మవుతుంది
మేఘ బంధం దృఢ మవుతుంది.
నేలతో మనిషితో మనిషిలో జగంతో

విశ్వాసం పూల తీగెలా సాగుతుంది
ఆలోచన స్నేహ సుందర మవుతుంది

సమాజం ప్రవాహ దశ పొందుతుంది
అనుభవం అరవిందంలా వికసిస్తుంది

కాలం పయి జలదం కనుమరుగయినా
ఆలోచనలో ఆర్ద్రత లుప్తం కాకూడదు.
సమాజం క్షామ క్షేత్రం అవకూడదు
కాలం పాషాణ తల మనిపించ కూడదు

అరుదుగా క్రోధంతో ఆశ్చర్యంగా
తుపాను చరణాలతో దూకుతుంది మేఘం
విలయ హస్తాలతో మృత్యు జాలం విసురుతుంది
అడవుల్ని వణికిస్తూ పర్వతాల్ని బెదిరిస్తూ
ప్రాణాల్ని క్షోభలోకి నెడుతుంది
సమాజాన్ని ఛిన్నాభిన్నం చేస్తుంది

శాంతికి శత్రువులా అశాంతికి బంధువులా
విలయ కీర్తితో విప్లవ సంకేత మవుతుంది
ఇది పరిణామంలో భాగం
తాత్కాలిక దృశ్యం మాత్రమే

**(6)**

పునరపి జననం చక్రంలో
మేఘానిది మొదటి స్థానం ప్రకృతిలో
జీవన గమనానికి దారి చూపే చిహ్నం
కాలానికి ఇంద్ర నీల యశో మకుటం

సకాలంలో మేఘం కనిపించక పోతే
మనిషి ముందు అగ్ని కిరీటం మెరుస్తుంది
మనః పతాక కదలుతుంది, వెతుక్కుంటూ
మేఘం జాడల్ని కనుగొంటూ పోతుంది
ఊళ్ళూ అరణ్యాలు కొండలు మైదానాలు దాటి
జల పద ముద్రల్ని పసి గడుతూ పయనిస్తుంది

కన్నీరు కూడా కరువైన కాలం
చివరకు శిలా స్తంభ మవుతుంది
జల దేవతా రూప శిల్పాలూ అవతరిస్తాయి
జలాల కయి ప్రయత్నం బదులుగా
మంత్రంపై విధిపై తంత్రం పై ఆలోచన మొదలవుతుంది

కరుణ బిందువు ఎరగని ఇసుక తుపాను
మధ్య మధ్య చెలరేగి అంధీభూతం చేస్తుంది
మేఘం కయి ప్రజల కళ్ళు
ఆకాశాన మెరసే చుక్కలవుతాయి.

ప్రకృతిలో భాగమయిన మేఘం రాకతో
ఆర్తి శమనమూ, జీవితాని కవసరం
ఏ నూతన యంత్రానికీ పనిచేసేది కాదు
ఏ మానవ తంత్రానికీ ప్రభవించేది కాదు

**(7)**

జలదం ఆగమనం తాపానికి నిష్క్రమణం
సమాజ రచనలో నవ విధానం ఆరంభం
పంటల కయి ఫలాల కయి ప్రకృతిలో
సృజన కృతిని మేల్కొల్పే పరమ సాధనం

ఎక్కడెక్కడో ఏకాంతంగా దాగిన ముఖాలు
బయటికి వచ్చి మబ్బుల వశ మవుతాయి.
ఎక్కడెక్కడో బీజంలో దాగిన సంపదలు
చివుళ్ళలో తల ఎత్తి ఊగుతాయి

స్వేచ్ఛకు నిలయం, జలాంతర రూపం
విడిచిన జల బిందు సమూహాలు
ఎక్కడి కక్కడ భూమి పయి నియత మవుతాయి
చెరువులో బావిలో నదిలో భూ గర్భంలో

ప్రజా హిత పరమై నిధానమై
ప్రకృతి దృశ్య మలంకరిస్తుంది

పిడుగు పాటుతో కల చెదరుతుంది
కాని మనోజగం నిలిచే ఉంటుంది
హఠాత్తుగా వాస్తవానికి నెట్టబడుతుంది

మెరుపు కాంతితో నిజం బయట పడుతుంది
కాని మనో మూలం నిలిచే ఉంటుంది
మెల్లగా వాస్తవానికి విసర బడుతుంది

పిడుగులో క్రోధంతో
మెరపులో రాగంతో
జలంలో కరుణతో
మనిషి చరిత్రను బింబిస్తుంది

కాలానికి కథా హేతువయి మేఘం
పాత్రల్ని జీవంతో నింపుతుంది
మేఘం నుండి జారే ప్రతి బిందువు
సంతోష కాంతితో పృథ్వీ వశమవుతుంది.

ప్రతి బిందువులో “నేను” భావనతో అహంకార కళ
అంకిత గుణంతో సమాజ గతమవుతుంది

అభినవ రూపంతో జలదం
సమాజ స్థిరతకు హేతు రూపం
జీవన చలనంలో బంధు హృదయం
మనిషికి ప్రస్థానంలో ప్రేమ చిహ్నం

**(8)**

జల సంపదలో పుట్టి కదలి పైకి
ఏ శత్రువూ లేని గగన పథంలో

ఎవరూ ఆపరాని త్రెంచరాని స్వేచ్ఛతో
నింగికి నీల మణి హార మవుతూంది

వనాలు దాటి పల్లెలు నగరాలు గడచి
నేలపై గిరులపై అభినవ మేఘం
సమాజ సమూహాల కపూర్వ బహుమానంగా
తనలో సంపదను పంచుతుంది అందరికీ
దేవతా పతాకగా ప్రేయోరూప మవుతుంది
మానవుల ఆయువుకు జీవన ధృతి నిస్తుంది
జన సేవా చలనంతో గర్జా స్వనం
ఆదర్శార్థానికి ఘంటా నాద మవుతుంది

నిరంతర ప్రయాణంలో ఎక్కడా
మేఘానికి విరామం లేదు
ఏగిరి తల పయినా నిలవదు
ఏ చెట్టు బుజాల పయినా ఆగదు

బ్రతుకులో శూన్యాన్ని దృశ్యమయం చేస్తుంది
అవని పయి క్షేత్రాన్ని అర్థ వంతం చేస్తుంది
అగ్ని ధామంలో పూల మొక్కల్ని మొలిపిస్తుంది
సమాధి నుండి జీవ శక్తిని మెరపిస్తుంది

సంకల్పానికి సృజన భూమికను ప్రసాదిస్తుంది
మెరపులతో నిస్వానంతో పరివర్తన ప్రకటిస్తుంది
ఆశాంతి చెరగి పోయి ధూళి అణగిపోయి
విశ్వ సమాజంలో శాంతి పద్మం వికసిస్తుంది

కృత్రిమ శిల్ప సమూహాల కెదురుగా
సజీవ జీవిత రూపాల్ని నిలుపుతుంది
భయం నుండి బాధ నుండి తాపం నుండి
ముక్త మయిన జీవితాలకు సుందరత నిస్తుంది

చేతిలో తెరచిన దిన పత్రికలా
కళ్ళకు చల్లని శుభ పత్రికలా
కాలానికి పునర్భవ రూపాన్నిస్తుంది
సమయానికి ఉత్సాహ విమాన మవుతుంది
స్వప్నానికి పచ్చని చెట్టు రూపం వస్తుంది
ఆదర్శానికి జీవిత వాస్తవం లభిస్తుంది

నాలో హృదయ మేఘం
నింగి నుండి నేలకు దిగే
జన హిత జల స్పందన చందనం

విప్పిన శిశు సయనాల్లా రమణీయమై
ఏ తపస్సు లేకుండా సహజమై
కవితా రస సేచనతో లభించే వరం

**(9)**

యుగాలుగా మెరుపులతో ఉరుములతో
జల ధారా శ్రేణులతో పయనంలో
చరిత్రను నడిపిస్తుంది సంస్కృతిని నిర్మిస్తుంది

దరిద్ర కుహరం నుండి
నిరాశా గుహ నుండి
దిశ దిశ కొక మానవీయ పార్శ్వంతో
మనిషి మనిషిలో ఒక ఉత్థానం ప్రస్థానం
సౌభాగ్య పథంలో సమ రస సమాజంలోకి.

నిస్పృహలో గీసిన ఆర్తి చిత్రాల్నీ
నిరాశలో నిండిన క్రోధ దృశ్యాల్నీ
దృష్టి నుండి తొలగించడమే కాదు
ఉత్సాహ శిఖరాల్నీ నిలుపుతుంది
ఆనంద నిలయాల్నీ ప్రతిబింబిస్తుంది

స్నేహం పంచే జలద ఛ్ఛాయల్లో రోజు
చేతిలో కొత్త రకం పుష్పమవుతుంది

మతిలో అనుభవ స్మృతి వీస్తుంది
జీవిత కథలో భాగమవుతుంది

చిత్రమేమంటే! రాక రాక వచ్చేమేఘం
గాలికి వాలే చినుకుల చేతి వేళ్ళతో
ఆర్తుల కన్నీటి చారల్ని తుడుస్తుంది
గుండెల్ని చిణ చిణ శబ్దంతో పలకరిస్తుంది
బానిస భావం నుండి స్వేచ్ఛా హృదయంతో
కష్టాల్ని గెలిచే నేర్పులో కళతో
అస్మిత పరివర్తన చక్రాలపై జీవితం
అంతరంగ ప్రేరణతో విజయానికి సిద్ధ మవుతుంది
ఉదార చరితలో జలాలు త్యాగ ధునితో
ప్రవాహ పంక్తులై తళ తళ లాడతాయి

జడ జీవన క్షేత్రాల్ని రసార్ద్రం చేస్తూ
సెలయేళ్ళు లేళ్ళ వరసలా కదలుతాయి
క్షుద్రతకూ మలినతకూ వ్యతిరిక్త ప్రభావంతో
ఉద్యమ చరణాల్లా లక్ష్యంతో వెడలుతాయి.

ఏ ఋతువు స్వరూపం ఎక్కడికీ పోదు
అన్నీ ఉంటాయి నిలిచి మనో నిలయంలో
ప్రకృతిలో ఋతువు మారే వర్తన కతీతంగా
జీవితంలో సరికొత్త దృశ్యాలను సృజిస్తూ

యుగాల తరబడి బిందువు బిందువుతో
సిద్ధించే సంపద విశ్వంభర వశమవుతుంది
అణువు అణువులో పొందే శ్రమ కళ
ఆ యుగ సమాజ పరమవుతుంది

మేఘానికి ఆయతనం ఆకాశం
మానవునికి ఆయతనం అవని
మేఘానికీ మానవునికీ యుగాల అనుబంధంతో
ఉంటుంది! అనురాగ సంస్కృతి కాలాని కతీతంగా

**(10)**

తొలకరి మేఘం రాకతో
నాగలి చే దువ్వ బడిన భూమి
అందమైన దుహితాకృతి పొందుతుంది
ఆ వెనుక! మాతృరూపం సిద్ధిస్తుంది

మనిషి కల్పనలో తిరగడం మానేను
చెట్టు కలల్ని కనడం మానేను
అదురు బెదురు తొ్రటు పాటు లేకుండా
జీవితం వాస్తవ చక్రాలపై పయనిస్తుంది

జలదం రాకతో కష్ట జీవులు
పద్మ కోశంలో మధు బిందువు కయి
తుమ్మెదల్లా భ్రమించేరు శ్రమించేరు
జీవితంలో కొత్త అర్థాల్ని చదివేరు

గాయాలు మాని పోయి ప్రకృతి
దాహార్తి తీరి పోయి అవని
వేళ్ళతో పాటు కంటకాలూ
జల సేచనతో అభినవాలవుతాయి

క్షేత్రంలో 'దిష్టి బొమ్మలా' కాక
గగనంలో మానవీయ కళతో
మేఘం "మలహార" శక్తి భరితమవుతుంది
నేలకు సృజన వదనాన్ని ఇస్తుంది

ఒంటరి తనం నుండి సమూహం లోకి
ఊహల స్థితి నుండి ఆచరణ క్రమంలోకి
కదలుతుంది హృదయ మేఘం విశాల తలంపై
నాగరక సీమల్ని భాగ్య వంతం చేస్తూ

వినీల చ్ఛాయల్లో చల్లని పవన లహరిలో
నులివెచ్చని ఊహల్ని కదలిస్తుంది
పచ్చ పచ్చని కలల్ని పరుస్తుంది
ప్రవాహ పథ మెదురవుతుంది

మేఘం వచ్చే సమయంలో ప్రముఖంగా
ముసు ముందుగా సాగే పైలట్ బృందంలా
గాలులు తరలి వస్తాయి హ్లాదమయంగా!
తోడుగా ఎగిరే పక్షుల కోలాహలంతో

రణానికో పణానికో ఋణానికో ఆపదకో
స్నేహం శాంతి ప్రేమ మాత్రం మరచీ
ముందుగా ఏ ప్రమాదం జరుగుతుందనో
మనిషికి వలె! భయంలేదు! అనుమానం లేదు!

క్షణాల్ని ఆశా పుష్పాలుగా మారుస్తూ
అనుభవ బింబాల్ని అర్థవంతం చేస్తూ
పరుగెత్తే పవన వాహనం పయి వస్తుంది
మేఘం! నిష్కామ కర్మకు ప్రతినిధియై

ఈ ప్రతినిధి నెవరూ పిలవ నక్కర లేదు
రాక కెవరి ఆహ్వానమూ అవసరం లేదు
వచ్చే ముందు స్వాగతంతో పనిలేదు
వచ్చాక సన్మాన సభ ప్రసక్తే లేదు

ఊరు మారినా మనుషులు తరిగినా పెరిగినా
చిరమైన మానవ బంధంలో మార్పులేదు
పగలూ రాత్రి భేదం లేని మేఘం
ప్రకృతిలో కాల శక్తి స్వేచ్ఛా రూపం
భూమినీ మనిషినీ లోతునీ ఎత్తునీ
ఆర్ద్ర హృదయ రూపంతో గెలుస్తుంది

క్రికెట్ మ్యాచ్‌లో
పై కెగిరిన 'సిక్సర్' బంతిలా
పయనించే సూర్యుణ్ణీ చంద్రుణ్ణీ
అవలీలగా 'కాచ్' చేస్తుంది
ఒక్కో రోజు ముగింపు క్షణాల్ని
గెలుపులో ఆనందంతోనూ అలంకరిస్తుంది

**(11)**

మండే కొలిమిలా ప్రతాపం చూపే
సూర్యుణ్ణి నిరాయధుణ్ణి చేసే
ఏకైక శాంతి సాధనం మేఘం
ప్రకృతి నుండి మనిషి పొందే వరం

ఎవరి ప్రార్థనతో అనుమతితో పనిలేదు
రావలసిన సమయంలోనే వస్తుంది
కావలసిన ఘన కార్యమే చూపిస్తుంది

నేల పయి నెత్తురు చిత్రాల్ని తొలగిస్తుంది
జలాల్లో నెత్తురు తీగెల్ని తరలిస్తుంది
ఎవరి సాదర హస్తాలకూ ఎదురు చూడదు

దవానలాన్ని ఆర్పుతూ వన్య ప్రాణుల్ని రక్షిస్తూ
నిష్కళంకంగా నిరాడంబరంగా వెళ్ళి పోతుంది
ఎవరి కృతజ్ఞతా ముఖాలకూ వేచి ఉండదు.

బొగ్గును తలపిస్తూ ఏ క్షణానో అంటుకోనున్న
కాలాన్ని శమింపజేస్తూ సాగి పోతుంది
తన పనిలో ఎవరి సన్మాన సన్నాహాలకూ ఆగిపోదు!

కంటకాలుగా మారి వైరంతో బ్రతికే
మొక్కల్నీ పొదల్నీ స్నేహ పుష్పితం చేస్తుంది
ఎవరి వ్యతిరేక క్రియా బంధాలకూ ఆగిపోదు

దయా వర్ష సేచనతో హృదయం గల మేఘం
పృథ్వి పయి సమస్త దుఃఖాన్ని పొగొట్టాలనే
బ్రతుకులో కన్నీటి మొత్తాన్ని తుడిచేయాలనే
జల రాగ స్పర్శతో శుభ్ర మనోజగం పొందాలనే
మనిషిలో ఉదాత్తమయిన ఆశ నిజం! ఊహ సహజం!

పవమాన వాహనం పయి పయనిస్తూ
ఎవరికి చేరాలో వారికి గుప్తంగా
ప్రేమ సందేశాన్ని చేరుస్తుంది, ఆత్మీయంగా
ఎవరి చూపుల పూలకూ ఎదురు చూడకుండా

కురిసే వర్ష ధారలో స్వర ధుని
అంతర్దేశ జన మహా గీతాన్ని స్వనిస్తుంది
విశ్వ మానవ హృదయ స్పందనకు
ఊపిరి నిలుపుతుంది ఆయువు పెంచుతుంది
మనిషి మనిషిలో ఏకాంతాన్ని నిర్మిస్తుంది
బ్రతుకులో సమాజ బంధాన్నీ అల్లుతుంది

ఇప్పుడే గుడి గంటలూ వినిపించవు
ఇప్పుడే ప్రవచనాలూ ఘోషించవు
వినిపించేదొకటే! మహోదార హృదయంతో
వర్షా జలధారలో! అంతర్వాహినిగా
ఒకే ఒక! విశ్వ నాదంలో సామాజిక చేతన!

**(12)**

ఎర్రటి ఎండలో నీడ నిచ్చే!
చెట్టుతో పాటు గుడిసె పయి
ద్రోహానల కంటకాలు! దిగకుండా

చెట్టుపయి పక్షులూ గుడిసెలో దీనులూ
అదిరి బెదిరి, తరలి చెదరి పోకుండా
రక్షణకై అవసరం! హృదయంలో ఆశయ మేఘం

కోర్కెల గూడు ధూమ పటలం కాకుండా
కలల చంద్ర శాల భస్మ రాశి అవకుండా
ఉండాలనే చిరు కోరిక! మనిషి మనసులో
భద్రతకై అవసరం! హృదయంలో ఆశయ మేఘం!

మనిషిలో హృదయ మేఘం! అంతరంగ గగనంలో
ఆపద సమయంలో! పరిష్కార లహరులతో
కదలుతుంది ఆత్మీయమై! చరాచరాను బంధంతో

అనల రూపాల పయిన కన్నీరు కారుస్తూ కూచోక
పచ్చని సృజనతో భవిష్య నిర్మితి కోరుతుంది

అలల పయి కదలే నావ కెత్తిన తెర చాపపై
వాలిన పక్షిలా చిరు కోరిక! మనసులో రెక్కలతో
ఎంత వర కవసరమో తెలీదు కాని నాలో
పక్షులు సంతోషంగా పయనిస్తాయి నాతో

పక్షి రెక్కల్ని కత్తిరించే సాహస మెవరికుంది?
పక్షి పయనాన్ని నిలిపే యత్నం చేసే దెవరు?

మేఘం ఏ నిబంధనకూ కట్టుబడదు
హృదయం ఏ ఆనతికీ తల ఒగ్గదు
వర్షా చిహ్నాలతో మేఘ లిపి
ప్రపంచ మంతటా ఒకటే

అనుభవ స్పృహలో హృదయ భాష
ప్రజలందరిలో ఒకటే! ఎక్కడైనా!
మేఘం రాకతో శ్రేణులుగా పక్షులు
మనిషి మనసులో బారులుగా కోర్కెలు

**(13)**

క్షణం కదలి పోతుంది
వెనక నున్న మరో క్షణానికి స్థానం ఇస్తూ

అల తరలి పోతుంది
వెనక నున్న మరో అలకు అవకాశం ఇస్తూ

పక్షి ఎగిరి పోతుంది తిరిగి వస్తుంది
దవానలంలో ఆహుతి నుండి తప్పిందీ
మిగిలిందీ, రాకపోవచ్చు వలస పోవచ్చు
మేఘం రాకతో స్వస్థానం చేరుతుంది

మనిషిలో హృదయ మేఘం చిరాశయంగా
మానవతా పతాకయై రెపరెలాడాలనే
జీవన నదిలో తరంగాల్ని దుమికించాలనే
క్షుధ నుండి క్షామం నుండి బ్రతుకుల్ని రక్షించాలనే

ఒక్కొక సమయం ఒక్కొక విధం పుష్పమై
ఆ రోజు పచ్చని క్షణాల అమరికతో
అపూర్వమైన "సుమగుచ్ఛం"గా నిదుర ముందు అందుకోవాలనే!
చిరు కోరిక మనసులో అణువుల్లో అణువై

పగలు ఎదుర్కొనే సమస్యలు ఎక్కడికీ పోవు!
రాత్రి సూట్‌కేస్‌లో భద్రంగా ఉంటాయి.
సరికొత్త వాలకంతో ఏ రోజు కారోజు
ఎదురు పడుతుంది, సంబంధ వీడని పాత్రలా

ఆర్తి నుండి ఆవేదనతో ఎగసిన మేఘం
కనదుతుంది! ఎంతో పరిచయమున్నట్లుగా
అంతరంగ గగనంలో ప్రకృతి బింబం
మనిషి హృదయంలో జీవన చిహ్నం

**(14)**

సముద్రంలో పవిత్ర స్నానం చేసి ఎగసి
రెక్కల్ని విదిలిస్తూ సాగే మహాపక్షిలా మేఘం!
పురా ప్రపంచాన్ని మెరపిస్తుంది మనసులో
దీన బంధు హృదయాసారంతో

ఆకాశం నుండి అవనికి
జల బంధాన్ని సృజిస్తుంది

నేలపై కన్నీళ్ళు తుడుస్తూ
చూపులో వెలుగు రెక్కల్ని విప్పుతుంది
ఎదురుగా అగ్నికి హంస రూపాన్నిస్తుంది

స్పందమాన సామాజిక సంబోధనతో
ముందుకు కదలే మానవీయ మహారూపంలా
ప్రకృతిలో ప్రాణిలో మనిషిలో అణువణువూ
మార్పుకు చేతన చరణాలను నడిపిస్తుంది!

మేఘం దిశల్ని అధిరోహిస్తూ పోతుంది
ప్రవాహం శ్రేణి తలం పయి దిగుతూ పోతుంది
ప్రవాహ తీరంలో విశాల ఫాల భూమి పయి
జీవితాల పుటలు తెరచు కుంటాయి

హృదయం మానవత నధిరోహిస్తూ పోతుంది
అనుభవం జీవనంలో దిగుతూ పోతుంది
ఒక్కొక్క మనో ద్వారం తెరచుకుంటుంది
ఒక్కొక్క విశేష దృశ్యం ప్రత్యక్షమవుతుంది

అవనిలో అస్థి పంజరం
చినుకులకు మొలకెత్తుతుందనీ
ఆ సమయం తనకూ వస్తుందనీ
మనిషి మనిషి నిరీక్షణం! మనసులో
పైన నడుస్తుంది మేఘం! మానసిక జగంలో
కింద కదులుతుంది ఛాయ! భౌతిక తలంపై

పిడికిలిలో నీరులా మతిలో ఊహ!
హృదయంలో మేఘం! మానవతా రూపం
మనిషి చరిత్రలో రసాత్మతకు కారణం!

మేఘాన్ని కనీసం చూడని ముఖం
ఊహ కందని నిరంకుశ చండ బింబం!
రాతి యుగంలోకి త్రోసే కఠోర చిహ్నం

**(15)**

గడచిన యుగాల్లో రాబోయే యుగాల్లో
మేఘ స్వరూపం ఒకటే! వర్షోల్లాసం ఒకటే!
భాష అదే! అర్థమదే! మారని సంబంధ మదే!

తరం మారినా సంస్కృతి వేరైనా
ఏ ఆధిపత్యమైనా, ఏ వాద చ్ఛాయలైనా
ఆంతర్యం ఒక్కటే! సమాజ పథ సమాన శ్రేయం

కష్ట జీవుల్నీ ధూళి గ్రస్తుల్నీ నేరస్థుల్నీ
ఓపిగ్గా నిలిచి జాలిగా చూస్తుంది
ఎన్ని ఏండ్ల కయినా మారని స్థితి కాశ్చర్యంగా

అడవుల్లో కొండల్లో లోయల్లో గుహల్లో
బ్రతుకు కోసం దారి తప్పిన మనిషిలో
మనిషి పట్ల భాద్యతను గుర్తు చేస్తుంది

పూల గుత్తుల్లా వేలాడే మబ్బుల నుండి
మధు ధారల సంపద పొందే హక్కు
అన్నిటిదీ! అందరికీ సమానమే!
రసాస్వాదనంలో అందరిదీ ఒకే పంక్తి

సీరోత్కషణం నుండి సస్య శ్యామలం వరకూ
మృత్స్నా గంధం నుండి పుష్ప ఫల పరిమళం వరకూ
అందరిదీ ఒకే జాతి! మానవీయ కీర్తి శిఖరమై!

ఇతిహాసంలో మరచిందీ చూడందీ
నిశ్శబ్ద వాస్తవ దృశ్యాల్ని మెరపు సూచిస్తుంది

అడపాదడపా దయచేసే ఆప్త బంధువు, మేఘం!
రాబోయే అదృష్టాన్ని ఆలోచన కందిస్తుంది.

సంవేదన మీటే సానుభూతి వలయం దాటి
బాధ్యత విరిసిన సహభావ ప్రపంచంలోకీ
వర్ష బలంతో హర్ష జలంతో
నాలో జన హిత హృదయంతో మేఘం

**(16)**

మానవీయ చేతనలో హృదయాశయ మేఘం
విహరిస్తుంది పచ్చదనాన్ని ప్రేరేపిస్తుంది
భద్రత నిచ్చే ఆకులతో గుబురులతో
పచ్చని శాఖపై వెచ్చని గూడుకూ సహకరిస్తుంది
బోధన వినిపించే నిర్వాదానికి నిరోధం లేదు
వివేకాన్ని మేల్కొల్పే మెరపులకూ అవరోధం లేదు

జలాసార ప్రసారంలో వితరణ తప్ప వ్యాపారం లేదు
జలదానికి పృథ్విపయి సమాజంలో స్థాయిలన్నీ ఒకటే
మొక్కైనా మనిషైనా గిరి అయినా నది అయినా
శత్రు మిత్ర సీమల్ని చెరపేస్తూ కదలిపోతుంది.

రణ క్రియలో చేతులూ కాళ్ళూ కోల్పోయిన
అభాగ్యుల పెదవులపై రస బిందువులు వదలుతుంది

ఆతంక చర్యలో చావు బ్రతుకుల మధ్య
కొట్టు మిట్టాడే అదృష్ట హీనుల
పెదవులకు అమృత సేచనం అందిస్తుంది

హృదయ జలద ప్రభావం లేని
స్థానం ఎప్పటికీ ఉండకూడదు! ఉంటే
అది గడ్డ కట్టిన స్వప్న గోళం కావచ్చు
అది స్పందన లేని స్వప్న కాష్ఠ ఖండం కావచ్చు

మానవ జాతి కోరుతుంది సదా
మానవతా చేతనతో విహరించే
హృదయ మేఘం నుండి శాంతి సందేశం
కాల భేదం లేకుండా తరాల అంతరం లేకుండా

**(17)**

జలదం వస్తూనే ముసు ముందుగా
పరివర్తన ప్రకటిస్తుంది పవన పత్రంతో
వేచి ఉన్న శుష్క మయిన పాత్రల్ని
రసమయ రూపాలుగా మారుస్తుంది

అనుమానాల భయాల పొరల్ని తొలగించి
ఎన్నో నాగరకతలకు దారి తీసింది
ఎవరి పురస్కారాలకూ ఆగదు, తలవంచదు
ఎవరి బహుమానాలకూ నిలవదు, చేయి చాచదు

మట్టికి చాలా దూరంగా ఉంది
పయి నుండి మట్టి పయి కరుణిస్తుంది
మట్టి నుండి సృజన ముఖం చూపిస్తుంది!
పట్టి పైన విజయ రథం నడిపిస్తుంది

మిగిలిన గత వైభవంతో అలంకరించిన
వారసత్వ ముఖాలతో మాట్లాడుతుంది
శిథిలాల పయి వేదనతో కన్నీటి చుక్కల్ని రాలుస్తుంది.
హృదయ భాషలో పూర్వ స్మృతుల్ని కురిపిస్తుంది

నేలలో దాగీ శిల క్రింద అణగీ
ఉన్న ప్రాణుల్ని బయటికి రప్పిస్తుంది
ఉల్లాసంగా గంతులేయిస్తుంది
ఉద్వేగంగా గొంతు పలికిస్తుంది

ఉత్సాహం కోకిలలా ఉపదేశిస్తుంది
ఉద్వేగం మయూరంలా నర్తిస్తుంది

దాహమూ ఆకలీ రెండూ క్రమంగా
బోనులో పడిన పులినీ సింహాన్నీ తలపిస్తాయి
మనిషి అస్తిత్వానికీ ప్రయోజనానికీ ప్రతినిధులుగా
తర తరానికీ అందించే పరంపరగా

**(18)**

మేఘాన్ని ప్రేమించే హృదయం
ఎప్పటికీ స్వేచ్ఛనే కోరుతుంది
కరుణను గంగలా ధరిస్తుంది
ప్రేమను తటిల్లేఖలా వహిస్తుంది

తన చుట్టూ గీయబడిన సీమల నుండి
ముక్తమై మనిషి స్వేచ్ఛగా ఊపిరి పీల్చేను

అప్పటి బాధ పక్షిలా ఎగిరి పోతుంది
అప్పటి దుఃఖం వాగులా తరలి పోతుంది
రేపటి భవిష్యత్తు మాట అంటారా?
అది మూసిన పిడికిట్లో ప్రకాశ రహస్యం!

జలదానికి నీ నా సమయంతో పనిలేదు
నీ నా సందర్భంతోనూ అవసరం లేదు
కను రెప్పల్లా కదలుతూ మృదువుగా
కను పాపల్లో వెలుగులా సరిస్తుంది

రూపాయి జారే శ్రమ స్థానం నుండి
కోట్లు రాలే వ్యవహార జగత్తు వరకూ
శరీర దశ నుండి మస్తిష్క శిఖరం దాకా
జలదం దారీ, హృదయం దారీ ఒకటే!

దారిలో ఎదురుగా ఎక్కడా గోడల్లేవు
కిటికీలూ తలుపులూ మాటేలేదు
త్యాగ హృదయ సంకేత నికేతనానికి
ఏ రహస్యం లేదు! అంతా బట్ట బయలే!

పోయినంత మేర స్వేచ్ఛా సమాజమే!
కురిసినంత మేర సందేశ హృదయమే!

**(19)**

భూమి పయి నడవని క్రియారూపం జలదం
నేల పయి చలనాన్ని వేగవంతం చేస్తుంది
నిర్భయంగా కదలుతుంది, ధైర్యాన్ని నిమురుతుంది
సూర్యుని బుజాలపై నీల మోహన శాలువా అవుతుంది

పగిలిన నేలతో వేచి ఉన్న క్షేత్రాలకు
చల్లని భవిష్యత్తును వాగ్దానం చేస్తుంది
ప్రకృతినీ సమాజాన్నీ అతీతాన్నీ కుటుంబంగా
ఎన్నిటినో ఎన్నిటితోనో సంబంధం నిలుపుతుంది

జీవన మరణ సమస్యల పరిష్కార పథంలో
మనిషి బ్రతుకులో ప్రయోజన విస్తృతి చూపుతుంది
కొండల గుండెల్ని సయితం పల్లవింపజేస్తూ
మండే అరణ్య స్వప్నాన్ని హరిత వాస్తవం చేస్తుంది

నిద్ర పోయే ఆకాశాన్ని మేల్కొల్పుతూ
దరిద్రంలో మాడే ధరా ఖండాన్ని వెదకి పట్టుకుంటుంది
సర్వ జగత్తును శాంతికి సమున్ముఖం చేస్తూ
మనిషిలో సృజన మతిని నిలుపుతుంది

ఆగి నట్లున్న కాలాన్ని ప్రవహింప జేస్తూ
ఉద్యమం ముందు పతాకలా కథ నడిపిస్తుంది
ఒక సమయం! రౌద్రంతో భీభత్స దృశ్యం
రాక పోదు! కొత్త సృష్టికయి తహతహలో

సముద్రం పయి నావలా ఆకాశాన కదలుతూ
గభీర మయిన జీవన తత్త్వాన్ని సూచిస్తుంది.
స్వేచ్ఛా కవిత్వానికి చాచిన రెక్కలయిన మేఘం
మనో భూమికల్ని తిప్పుతుంది రస హృదయంతో

**(20)**

గగనంలో ఎంత అందని ఎత్తులో ఉన్నా
జలద విహగ వీక్షణం నుండి
భూమి పయి ఏదీ తప్పించుకోలేదు

పోయినంత మేర సమాజంలో కన్పించేది
రక్త మాంసాస్థి మస్తిష్కాలతో మనుషులే
అనుభవ సూత్రంపై ఆలోచనా వలయంలో
తిరిగే లౌకిక మూర్తులే! దేవతలు కారు

కొండ రాళ్ళ మధ్య వీటి పాయ నేత్రోత్సవమయితే
దిక్కుల అంచుల్లో నీలి మబ్బు మానసికానందాన్నిస్తుంది

చేతనలో జలదం కన్న మనిషి మిన్న
కోర్కెల వెనక నున్న బలహీనత!
మనిషిని ప్రకృతికి వశం చేస్తుంది!

మధు కణాలకయి చరించే తుమ్మెదల్లా
జల బిందువు కయి వీక్షించే ప్రజల కళ్ళకు
స్వర్ణం అక్కర్లేదు, వజ్రంతో పనిలేదు.

సుగంధానికీ సౌభాగ్యానికీ ఆదర్శ చిహ్నమైన
పుష్పం కయి భ్రమణం! ఆత్మాన్వేషణం!
పుష్పం వికసించేదీ జల గుణ స్పర్శతోనే
చినుకు చినుకు సేచనతో
పెన్నిధి నుండో ప్రవాహం నుండో భూగర్భం నుండో!

పొలంలో పడిన విత్తు భాగ్యానికీ
మనిషిలో క్రియా శక్తి వికాసానికీ!
ఎవరు మరచినా కాలం మరవని మరవలేని వరం
జలదాగమనం! మనిషికి మరవరాని ఉత్సవ రూపం

**(21)**

నిద్ర నుండి మెలకువ రెక్కలు విప్పి
మహా విహగంలా ఎగిరి వచ్చే మేఘం
నీలో అదృశ్య శక్తిని దృశ్యమానం చేస్తుంది

ఎత్తులో హిమ శిఖరాల్ని అలంకరిస్తుంది
లోతులో గంగా హృదయాన్ని అందుకుంటుంది
ఆనల శిఖలపై జల సేచన చర్చ కుపక్రమిస్తుంది
జల ధారల మెజారిటితో విజయం పొందుతుంది

శత్రుతకు తావులేదు మిత్రతకే ప్రాధాన్యం
జన సమ్మత వర్తనతో ప్రజాస్వామ్య బంధువు

జీవిత పరిణామంలో మనః పరిణాహంతో
ఆలోచనా ప్రసారంతో అనుభవ పరిణతితో
ప్రమాణ శిఖరాలకే పట్టాభిషేకం!
హృదయ మేఘానిదే విజయరూపం!

రాలే ఆకుల పయి జాలి ఉంది
వచ్చే చివుళ్ళ పయి ప్రేమ ఉంది
పాత్రకు అనుగుణంగా జలాల ఆవిష్కారం
జలద ప్రభావంతో కాలానికి ప్రశస్తి!

అపుడపుడూ ఆగ్రహ ప్రదర్శనమూ
ఉన్నట్లుండి ఉదగ్రతను రచిస్తుంది
కల్లోల కరాళ కథకు అవతారిక అవుతుంది

గూళ్ళు ధ్వంసమయి ఊళ్ళు వినష్ట మయి
మానవ మానవేతర ప్రపంచం సర్వం
కష్టాలు పంచిన జల బీభత్స దృశ్యం!

వాన కాళ్ళు భూమి పయి ఆనితేనే
ఎంత భాగ్య మయినా చేతికందేదీ!

మనిషి శిరస్సు ఎత్తుకొని తిరిగేదీ!
            బ్రతుకు ముందుకు సాగి పోయేదీ!

**(22)**

నాలుగు దారుల్లోనో ఊరు చుట్టూనో
            తిరిగే ఉత్సవ మూర్తి కాదు మేఘం!
సమాజ దర్శనంతో మహా కవిత్వ సృష్టిలా
            పవన వాహనం పయి విశ్వయానం చేస్తుంది.

అందని ఎత్తు నుండీ క్రింద నున్న ప్రజలకు
            రస జీవన జగత్తును ప్రసాదిస్తుంది
లేంది, వడ గాలికి ఎరుపెక్కిన అగ్ని కణాల్లా
            గ్రీష్మ వీధుల్లో తిరుగుతూండే వారే

ఉగ్ర భావ గిరి శిఖరాల్ని స్పృశిస్తూ
            హృదయ వాద సందేశంతో జలదం
కరుణాకర రస ప్రసారంతో సమాజంలో
            జీవన సమస్యకు పరిష్కృతి సూచిస్తుంది

రాజకీయమో సామాజికమో తాత్త్వికమో
            ఆర్థిక పటంపై బహు వర్ణ వర్గ సమీకరణంతో
నిరంతర చలనంలో మానవ వికాస రూపం
            వీటిలో దేని నుండీ తప్పించుకోలేని వాస్తవం

పైపై బడి నిరంతరం క్రమ్మే ధూళి పొరల్లో
            కలసి పోకుండా శరీరాన్ని ఆదుకుంటుంది
భౌతిక స్థితుల్ని బాధ్యతతో శుభ్రం చేస్తుంది

గ్రీష్మంలో అస్థి పంజర మయిన ప్రకృతిని
            పుష్టివంతం చేస్తుంది, రూప శోభ నిస్తుంది
ప్రతి సికతా రేణువు జల దర్పణాన్ని పొందుతుంది

ఎక్కడ బడితే అక్కడ గ్రీష్మ విషాద చిహ్నాలే!
 రుధిర మెంత కారు చవుక అయిపోయింది?
స్క్వేర్‌లో ప్లాట్ ఫార్మ్ పయి దారిలో అడవిలో
 గుట్టల పయి ఆఖరికి మనిషి పయి చిందులతో
హత్యలో కౌంటరో ఎన్‌కౌంటరో! ప్రమాదమో!
 పోటీలో రుధిర చిత్రాలు! రణ చరణ తాండవంలో

తెంచరాని విషమ సమస్యలతో
 అట్టలు కట్టిన రుధిర సిక్త మార్గం
శుభ్రం కావాలంటే! ఎంత కాలం
 ఎంత జలద ఘన వర్షం అవసరం!

హృదయంలో దిగిన జలద సూత్రం
 విరిగిన ముక్కల్ని ఒకటి చేస్తుంది
తెగిన బంధాల్ని కలిపి వేస్తుంది
 తొలగిన ముఖాల్ని దగ్గరికి తెస్తుంది

స్వేచ్ఛలో జలదాకృతి పొందిన
 మనో గగనం! ఎండిన చెట్లను హరితం చేస్తుంది
సమాజ చరిత్రలో మొదలయ్యే అధ్యాయానికి
 సరికొత్త 'శాంతి' ముఖ శీర్షిక నిస్తుంది
తొలగిన మేఘం స్థానంలో నిరంతరం
 బాధ్యతలో ఆలోచన ప్రవాహకత పొందుతుంది
మనిషిలో బలహీనతల్ని అధిగమించి మానవీయం
 ప్రవాహాన్ని మును ముందుకు ఝంకృతిలో పరుగెత్తిస్తుంది.

**(23)**

వాస్తవానికి అనుభవ స్థాయిలో ఎందరికో
 ఆకాశాన్ని చూచి ఎంత కాలం అవుతుందో?
వ్యవహారాల్లో వ్యాపారాల్లో మునిగే మనుషులకు

గగనంలో మేఘాన్ని చూచే తీరిక ఎక్కడుంది?
 పైనున్న ప్రకృతి శక్తి గురించి ఆలోచన కవకాశ మేదీ?

ఆ మనుషులకు చుట్టూ ఉన్న మనుషులతోనే సరిపోతుంది.
అవసరానికీ ఆదర్శానికీ భూమికీ గగనానికీ మధ్య
కదలే మేఘాన్ని చూచే ఓపిక ఎక్కడుంది?

మేఘం తలపై ఊగగానే లోపలికి పరుగెత్తేరు
వర్షం ముంగిట్లో దూకే లోపల తలుపులు వేసేరు
విశ్వంలో అతీతానికి ఆదర్శ సంకేతం
ఆ దైవం తానే దిగి రావచ్చుననీ అనుకోవచ్చు
కానుకల కోసమనో! నైవేద్యం కోసమనో!
ఉత్సవ మర్యాదలతో ఊరేగడానికో!
అలకారంకోసమనో! కీర్తి మూర్తి కోసమనో!
ఇక మేఘం గురించి పట్టించుకునే దెంతమంది?
సూక్ష్మమైన అనుభూతిని ఆనందించే దెంతమంది?
హృదయ ద్వారాలను తెరచే దెంతమంది?

తరం గడచి పోతుంది, మరో తరం వస్తుంది
రాజ్యం అంతరిస్తుంది, మరో రాజ్యం ఏర్పడుతుంది
నిష్క్రమణ పర్వాలెన్నో! ఆగమన సర్గ లెన్నో!
మంచీ చెడూ మూలశాఖలతో మనో రూపం ఒకటే

ప్రయోజనానికీ ఆదర్శానికీ మధ్య మేఘరూపం ఒకటే
ఎండిన ఆకుల్లా దరిద్రంలో రాలే సమయాల్ని
లేలేత చివుళ్ళతో అలంకరింప జేస్తుంది
సుడి గాలిలా క్షుద్రంగా ఎగిరే సందర్భాల్ని
ఉదార గుణ తరంగాల పయి నడిపింపజేస్తుంది

పై నుండి మనిషి హృదయం లోకి దిగే
మేఘానికీ దాని సంవేదనా రూపానికీ
మానవతా స్పందనతోనే చరితార్థం!
మానవీయ దర్శనంతోనే ప్రయోజనం!

మానవతా సందేశంతో ఎపుడెపుడో వచ్చే మేఘం
అడవిలో ఊరులో నగరిలో వీధిలో హతాశుల్ని
జలాలపై తరలిస్తుంది! ఆదర్శ సమాజ స్వప్నానికి!
వాస్తవాన్ని అందిస్తుంది మనిషి జీవిత సత్యానికి

**(24)**

ఉదార కరాలతో వచ్చే మేఘాని కెదురుగా
ప్రతి మనసూ పరుగెత్తుతుంది శిశువులా
చేతి వ్రేళ్ళు పట్టుకోనీ నేలకు తేవాలనీ

మజిలీ మజిలీకీ దారి ప్రక్కనే
ఎఱ్ఱని రేఖలతో క్రోధం గీసిన
మృత్యు చిహ్నం ఎదురవుతుంది
గ్రీష్మ రేఖల్ని దాటుతూన్నట్లుంది

హింసకు చరమాంకం లేదు
విరామ సమయమే ఒక శాంతి రూపం!
ఋతువు ఋతువుకీ విభిన్న లక్షణం
సమయ సమయానికీ విశేష వర్తనం
మనసు మనసుకూ ఆలోచన వేరువేరు
ఉషసు ఉషసుకూ జీవన దృశ్యం వేరు వేరు

సామాజిక శక్తిని క్రియోన్ముఖం చేసే
జీవిత సత్యాన్ని ఫల భరితం చేసే
హృదయ మేఘం ఒకటే! ప్రతిమనిషిలో
మేఘ హృదయం ఒకటే గగనపథంలో

ఎపుడయినా రానీ! ఎంత సేపయినా నిలవనీ
ఏ వేళ అయినా కురవనీ! హృదయవర్తి కావాలనే

**(25)**

మేఘం వస్తుంది తప్పకుండా ఆలస్యమైనా
వేచి ఉన్న వేడి కళ్ళకు చంద్ర కళనిస్తూ
మండే అనల కణాల్ని జల దర్పణాలుగా మారుస్తూ
అణువణువులో ఆనందం చిందులు వేస్తూ

మేఘం కదులుతుంది
విశ్వాత్మతో మహనీయుని ఆలోచనలా
ప్రజల పయిన ప్రకృతి పయిన
దృక్ జలాల ప్రసారంతో

స్వదేశమనీ పరదేశమనీ లేదు
ఎక్కడ మొదలయి ఎక్కడ ముగిసేదీ
తెలియని ఉదార చరితలా తరలుతుంది.

అంత వరకు కలిసి రాని కాలం
కలసి వస్తూన్నట్లు అనిపిస్తుంది
మౌన బంధం వీడి సమయం
"మలహర" రాగ మందు కుంటుంది

వాడిన కోర్కెలు అభినవాలయి
ఒంటరి తనం అదృశ్యమవుతుంది
పగిలిన ముక్కలు సమైక్యమయి
సమాజ బంధం అనంత మవుతుంది

గుండె నిండుగా రస పాత్రలో
మాతృ మూర్తిని తలపిస్తుంది
అమాయక శిశువులా మెరపు
ఎపుడో మరచింది జ్ఞాపకం చేస్తుంది

విరిసిన మృత్యు కేశ రాజిలా పొద సూపింది
మెరపుతో నవ జీవన శక్తిని తలపిస్తుంది
ఉల్లోల కల్లోలంగా బీభత్స సౌందర్య దశలతో
విరోధాభాసతో అనుభవ వాస్తవాన్ని రూపిస్తుంది

విశాల గగన నికేతనంలో
మహా కాలం అతిథిలా ప్రవేశించింది
ఆనంద లహరుల్ని పరుగెత్తిస్తూ పోతుంది

సూర్యుడు చంద్రుడు నక్షత్రాలు దిశలు
ప్రక్కకు ఒదిగి సాదరంగా ఆహ్వానిస్తాయి
పొలాల్లో బారులు తీరిన శ్రామికుల కళ్ళు
వ్రేలాడే పూల మాలల్లా స్వాగతం చెబుతాయి

మేఘం రాకతో పుట్టలో నిలవ లేక
బయటికి వచ్చిన సర్పరాజు
పడగ విప్పి ఆడుతూ మైదానంలో
అందంగా భయాన్ని మరపిస్తాడు

కొమ్మ పయి నుండి సంతోషంతో
నేలకు దిగిన నెమలి
పురి విప్పి నర్తిస్తూ ఉత్సాహంగా
పొంగే అనుబంధాన్ని మెరపిస్తుంది

మనిషిలో జారి పోయిన రామణీయకతను
మేఘం హృదయానికి అందిస్తుంది, హత్తుతుంది!
మనిషి నుండి మనిషికి భయంలేని
మనిషితో మనిషికి క్షేమం తరగని
సరికొత్త ప్రపంచంతో వస్తుంది

పావు రాళ్ళను నిలుపుతూ ఇనుప స్తంభంల పై
పూల తీగెల్ని ప్రాకిస్తూ పూరి గుడిసెపై
కొత్త సంబంధాల్ని చూపిస్తుంది

**(26)**

మండే సూర్యునికి చల్లని మెట్లుగా ఉంది
మేఘం! క్షితిజంలో కదలుతూ
నీటి పోగుల వస్త్రమయి భూమికి దిగుతుంది
అలంకార రూపాన్ని ప్రసాదిస్తుంది
జలద నిరీక్షణలో ఉన్న హృదయం
ప్రత్యక్ష దృశ్యంలో పుష్ప గుచ్ఛ మవుతుంది

మనస్సును మృదుల పరచే హృదయమేఘం!
పాషాణ మయం నుండి తప్పించే ఆర్ద్రమూర్తి!
కదలే సన్నని తెల్లని ఉత్తరీయంతో
నీలో! నాలో! దిగుతుంది! స్వేచ్ఛాధీనమై

ముడుచుక పోవడం కాదు!
గగన విస్తరణం మేఘ లక్షణం
మేఘనిలో కామ రూప దర్శనంతో
కవితాత్మ శబ్ద ప్రవేశాన్ని పొందుతుంది

అణు వణువూ మేఘ హృదయ మావిష్కృత మవుతూంటే
అవని పయి మేఘం చేసే సంతకం మాటే ఉండదు
మహా వాద్య విశేషంగా వినిపిస్తూ కనిపిస్తూంటే
హృదయం విశ్వ రాగంతో రస సిద్ధమవుతుంది

సముద్రంలో ఉప్పు నీరు నుండి తప్తమై
ఎగసి శుభ్రమయిన జలాలతో మేఘం
కఠిన జీవితం నుండి స్నిగ్ధమై
నవ నవోన్మేష కవితను తలపిస్తుంది.

**(27)**

జలదం కనిపించగానే మనో గగనం
శిశువులా హ్లాద కళను పొందుతుంది
క్రందనలో నున్న దీన జన హృదయం
సహాయకర సాంత్వనాన్ని పొందుతుంది

ఇది విపణిలో దొరికే వస్తువు కాదు
అందరికీ చెందిందీ, త్యాగ రస సంపద

మానవ జాతి హృదిలో ప్రేమ
జలదంలా కదలుతూనే ఉంది
లేంది నాలో విశ్వ మానవ రూపం
వాడి వేడి గాయాలతో ఎపుడో ధూళి పాలయ్యేది

మానసిక దుర్భిక్షం ఏ పని నయినా చేయిస్తుంది
హత్య! ఆత్మహత్య! హింస! సామూహిక దుర్మార్గం!

ఎక్కడి కక్కడ అదృశ్యమై ఆదర్శం
బాధించే వర్తమాన సంక్షోభంలో
ఏ క్షణాన ప్రమాదంలో ప్రహారంలో
ఆయువు తెగేదీ! తెలీని దుస్సహకాలం!
నిర్భయంగా బ్రతకడమే ఒక అదృష్టం!
నిర్మలంగా బ్రతకడమే ఒక అపూర్వం

మేఘ మెంత మహనీయ మయిందయినా
అవని పయి సరించి సమాజ పరం కావలసిందే
అగ్ని తాండవం నుండి వర్షాలాస్యానికి
జన జీవన వేదిక! మారవలసిందే!

చేతిలో ఆట వస్తువు! విమానంలో
శిశువులా విహరించడం కాదు మనోయానం!
మనో యానంలోనే తెలుస్తుంది మేఘ సౌందర్యం
రస జీవనంలోనే తెలుస్తుంది పరమ ప్రయోజనం

పులి కళ్ళలో అరణ్య చ్ఛాయలతో
మనిషి కళ్ళలో సమాజ చ్ఛాయలతో
ఏకాంతానికి హద్దులు లేవు కాని
సమాజానికి హద్దులు! అన్నా! ఇన్నా? ఎన్నో!
మేఘానికి సీమల్లేవు
వర్షానికి భేదం లేదు

బోనులో పులి కళ్ళలో
మనిషి రూపం ఆడుతుంది
ఖైదులో మనిషి కళ్ళలో
పులి రూపం కదలుతుంది

స్వార్థంలో నిజ దృశ్యం!
ఎక్కడిదక్కడ విచ్చి పోయి

హృదయ మేఘం విపణిలో
వస్తువు కావడం విపరీతం!

నిరీక్షణలో అన్వేషణలో దొరికింది అమూల్యంగా
మనో మ్యూజియంలో భద్రపరచబడుతుంది
దొరకంది ఆదర్శంలోనే నిలిచి పోతుంది
అద్దంలో బింబించే అందని వస్తువులా!

**(28)**

హృదయ మేఘానికి సమాజ క్షేత్రంలో
ఎప్పటికీ తలుపులు తెరచే ఉంటాయి

మనిషిలో విశ్వాత్మకు మేఘం
మెరపులతో పూల గుత్తు లందిస్తుంది
గర్జనతో నిష్క్రియతను బద్దలు చేస్తుంది!
శ్రుతి ధారా స్వరంతో మానవతను రూపిస్తుంది

పాతను దహించి బూది చేసే బదులు
అణువణువూ పునర్భవం చేస్తుంది
కొత్తను స్మరిస్తూ కూర్చునే కన్నా
పద పదమూ యథార్థ గతి నిస్తుంది

అమాయిక క్షేత్రంలో నాగలికి ధైర్యాన్నిస్తుంది
మట్టి మనిషి కోర్కెల్ని హస్త గతం చేయాలనీ
భవిష్య సమాజానికి పతాకయై కదలుతుంది

మేఘాన్ని అనుకరించే ధూమ గణాలెన్నో
యంత్రం నుండీ విధ్వంసం నుండీ శ్మశానం నుండీ!
ప్రాణాల్ని ఉక్కిరి బిక్కిరి చేసే మృత్యు పాశాల్లా కదలుతాయి

అనుకరణలో ఆత్మ అణగిపోతుంది
అందని లోతు లోనే నిలిచిపోతుంది
పొంద లేని వజ్రంలా భూమిలో దాగిపోతుంది

శుష్క శాఖల పయి గడిపే కాలాన్ని
కిందికి దించి, అలల చరణాలపై నడిపిస్తుంది
శాంతి ముద్ర పడిన నాణెంలా చెల్లుతూ
మేఘం అదృశ్యమవుతుంది!
విశ్వ భూమి పయి తన విధిలో
విశ్వ సమాజంలో ఒకటై పోతుంది

భూమి పయి ప్రకృతిలో మనిషిలో
అసంఖ్యాక జ్ఞాపక చిహ్నాలతో
సమాజ సంస్కృతికి జీవ నాడియై
మళ్ళీ మళ్ళీ వస్తుంది! గగన మేఘం!
సంవేదన భూమికలో హృదయ మేఘం!
కోరిక పూచిన ప్రేమకు చిహ్నం

**(29)**

ఎండిన బావుల కళ్ళతో
బీటలు వారిన చెరువు గుండెతో
చుట్టూ అల్లుకునే సెగల బాధల మధ్య
మనిషి! అనల పంజరంలో తిరిగేను.

తీరని కోర్కెల నుండి జీవన సమస్యల నుండి
చిర పీడనలో ఒరపిడిలో
మానవ హక్కులకై అలజడిలో
పుట్టిన స్ఫులింగాలు ఎగసీ
దూరం నుండి పూలను భ్రమింపజేసేను
ఆశలకు అందలం చూపేను

ఇవి దారి చూపే దీపాలు కావు.
ఇవి శాంతి కోరే పక్షులూ కావు

తలుపు తీసిన ద్వారం నుండి
రెక్క తెరచిన కిటికీ నుండి

లోపలికి చొర బడతాయి
అశాంతికి పీట వేస్తాయి
పెదవుల్ని సీల్ చేస్తాయి
కళ్ళను మూసి వేస్తాయి

తీవ్రారుణ మారణ చిహ్నాలై
ఎవరి పయి ఎపుడు దూసేదీ తెలీదు
మనిషే కాదు! రైలో విమానమో మరే వాహనమో?
ఏదైనా విధ్వంసంలో హింసకు ఆయువుగా

ఈ సమయం కళ్ళకు పది వాన చినుకులు
సంతోషంతో చిందులు వేస్తే తృప్తి!
ఆ దిశలో దోసెడు జల సేచనం
నృత్యంతో ఎదురయితే చాలనిపిస్తుంది

గగనంలో క్రమ్మిన మేఘం
సూర్యుణ్ణి మ్రింగేస్తుందనీ ఒక మాట
కొంత సేపయినా సూర్యునికి
చలువ పందిరి అవుతుందనీ మరో మాట

ఏ పక్షం నిజమో? అబద్ధమో
రెండూ కల్పనలో మాటలేమో కాని
మనిషి మనిషికీ పైకి ఎగరాలనీ!
చలువ పందరిలో విశ్రాంతి పొందాలనీ!

భూమి ఆకర్షణో! నిలిపేసే బంధమో!
కారణం ఏదయితేనేం?
మనిషి మాత్రం కిందనే, నేలపై
అనల పంజరంలో తిరుగుతూ

ఇదో శిక్ష అనో, అలంకారం అనో
ఏమైనా అనుకోవచ్చు, ఎవరైనా

ఏదైనా ఒకటి మాత్రం వాస్తవం
ఇది జీవితంలో చెరగని శాసనం

ఎన్ని ఏండ్లు పయి బడినా
ఎన్ని సార్లు అనుభవం మయినా
మధ్య మధ్య అనల పంజరంలో
ఎక్కడ మనిషి అక్కడే బలహీనతలతో

ఇనుప పంజరాలతో పెద్దలు
జలద సత్యాన్ని చాటే ఉత్సాహంతో
పెద్దల వెనకే శ్రేణులుగా
కదలే రథ చక్రాల్లా శ్రమికులు
శ్రమికుల చుట్టూ ఆపై వలయాలుగా
బిక్షువులూ బానిసలూ హంతకులూ హతాశులూ

కళ్ళలో చిందే సంతోషపు చినుకులతో
దోసిట్లో జారిపడే ముత్యాల వరసలతో
అనల పంజర దృశ్యాన్ని అదృశ్యం చేసి
స్వేచ్ఛను అందించే అతీత క్రియా రూపం
హృదయ జలదం! ఎప్పటికీ అవసరమైన సాధనం

మనిషిలో జిజీవిషతో
గుండెలో జీవన ధునితో
హృదయ మేఘం కదలినంత మేర
వేరు నుండి మస్తిష్కందాకా
అణువు నుండి ఆలోచన వరకూ
అవనిపై విశ్వ శాంతి సిగ్నేచర్
ఒక్క మేఘానికే సాధ్యం
అది ఒక మనిషికే పరిమితం కాదు

**(30)**

నే నుండే నేలతో సంబంధం లేనట్లు
మట్టిని అంట కుండా ఉంది
నాది కాదన్నట్లుగా ఉంది
మేఘం! నేలదే! ఎప్పటికైనా

బ్రతికే నా గాథతో అనుబంధం లేనట్లు
మట్టికి అతీతంగా ఉంది
అంతలో భూమి పయి ప్రేమతో
మట్టిని ముత్యాలతో అభిషేకిస్తుంది

నా శిరసు పయి కిరీట చిహ్నా మయింది
నా బుజాన పయనంలో పతాక అవుతుంది
ఉద్యమ గుణ చేతనతా చలనంతో
ప్రజా స్వామ్య భావ హృదయంతో

దైన్యంలో కళ్ళలో రాజుకోనీ
బంతుల్లా ఎగిరే క్రోధానల కణికలకు
చల్లని శాంత దళాల్ని అద్దుతుంది
భద్రతకు ధైర్య సాధన మవుతుంది

పనీ లేక తిండీ లేక
ఏ ఎండిన చెట్టు కొమ్మ పయినో
ఏ గాడిద వీపు పయినో! కూర్చొనీ
కాల క్షేపం చేసే శూన్య హస్తాలకు
పని కలిపిస్తుంది! భ్రమ తొలగిస్తుంది
పగిలిన ఎద ముక్కల్ని కలుపుతుంది

ఆవరణ లేని ఆలోచనకు సార్ధ జగం చూపుతుంది
అణగిన శక్తులకు ఎగిరే రెక్కల్ని మొలిపిస్తుంది
దైవం సహితం మరచినట్లున్న నేలను
ధారా నవ యోగంతో అమృత కళ నిస్తుంది

ఉరి శిక్ష నుండి విడుదలయిన ఖైదిలా
ప్రవాహం బయట బడుతుంది స్వేచ్ఛగా
అస్థి పంజరాన్ని తలపించే చెట్టు చిగిర్చి
మోడు బారిన కల నుండి తేరుకుంటుంది
దగ్ధ మయిన కాలానికి స్నిగ్ధ హృదయ మిస్తూ
ప్రజాస్వామ్యాన్ని అర్థవంతం చేస్తుంది

అక్షరాలు కలిసీ వెను వెంటనే
శబ్దాలు చేరీ ఒకదానితో మరొకటీ
పుట పుటలో జీవిత మహా వాక్యాలకు
కొత్త అర్థాల్ని చూపిస్తుంది
పాత దారుల్ని మరపిస్తుంది
మనిషిలో ఆశకు కొత్త నడక నిస్తుంది

ఆయువు మును ముందుకే సాగుతుంది
వెనక్కి తరలి పోవడం జరగదు
మేఘం మును ముందుకే కదలుతుంది
వెనక్కి మరలి పోవడం జరగదు
మరో తరానికీ మరో దృశ్యానికీ
అవకాశంతో అదృశ్యం కావచ్చు

భౌతిక మూలం నుండి మానస శిఖరం దాకా
ఆరోహణలో స్వేచ్ఛకు సంకేతం
శబ్దంలో నిశ్శబ్దంతో కవితా హృదయంలా
యశః కాయంతో గగనతలంలో మేఘం

నే నుండే నేలతో సంబంధం లేనట్లుగా
నాది కాదన్నట్లుగా పై పైన ఉండే మేఘం
మెరపులతో వెలుగుతో వెన్నెల కళతో
నాలో నిజ శక్తికి నవోన్మేషాన్నిస్తుంది

**(31)**

మేఘం నుండి నిరాతంకంగా
రాలే ప్రతి జల కణ మొక పూర్ణ రూపం
మల్లెలకూ ముత్యాలకే కాదు
బాష్పజల కణాలకూ సంకేతమవుతూంది

ఎక్కు పెట్టిన ఆయుధం
హృదయ మేఘం ముందు
పూల దండ అవుతుంది

ఎడారి పయి దయ చూపిస్తుంది
మైదానంతో స్నేహం చేస్తుంది
ప్రవాహంతో బంధుత నెరపుతుంది

విరాగి కూడ అడుగేసేందుకు భయపడే
గహన వనంలో జల జల వర్షిస్తుంది
జడ జగత్తులో చేతనకు కేతనమవుతుంది

భూమి పయి భీభత్సం చూచి బెదరి పోదు
ఏ రాజ ప్రాసాదం పైనో నిలిచిపోదు
ఏ అధికార గణం ముందూ తారాడదు

పొలంలో పని చేసే శ్రామికుల
శరీరాలకు బతుకు గొడుగు నిస్తుంది
సమాజ చరణాలకు సమ గతి నిస్తుంది

మేఘం కదలుతుంది క్షణం ఆగకుండా
తనలో బాధ్యతను విస్మరించకుండా
వర్తమానాని కంకితమైన జీవన గతిలో
కఠోరమైన కాలాన్ని మృదుల పరుస్తూ

మండే జ్వాలకు చల్లని హృదయ స్పర్శ నిస్తూ
    కలల్ని పెకలించి వాస్తవాల్ని మొలిపిస్తూ
మేఘం కదలుతుంది గుప్త మనోరూపంతో

రాజ్యాన్ని పరిత్యజించే ముందు
    గౌతముడు వీధిలో చూచిన దృశ్యం
ఇప్పటికీ ఉంది! మానవ విషాద పర్వంలో

ఏడు రంగుల స్వార్థ శలాక పంక్తుల
    ఇంద్ర ధనువు ఆకర్షణ సమయం
అందమయిన అహంకార పంజరంలో
    చిక్కిన మనిషి! ఏమైనా కావచ్చు
చిలక కావచ్చు! మృగం కావచ్చు! ఖైదీ కావచ్చు!
    పంజరంలో ఎడారి బ్రతుకు ననుభవించవచ్చు.

బరువును మోసే కోరిక ఉండాలే కాని
    శాంతి పతాకాన్ని ఎవరు ఆపగలరు?
మేఘం కదలుతుంది, కదలిస్తుంది
    ఎక్కడా ఎదురులేని శాంతి పతాక వలె

వరదలు రానీ పిడుగులు జారనీ పయనం ఆగనీ
    అన్నిటినీ ఆనాదిగా సహింపజేసే ప్రజా బంధురూపం!
ఎక్కడయినా స్వాగత నయనాలే కాని
    ఎవరి నుండీ వీడ్కోలు చూపులు తెలియదు

బ్రతుకులో బాధల వేదనతో
    ఆలోచనా జలాలతో కదలే
హృదయ మేఘం! ఇచ్చే సందేశం ఒకటే
    మాటి మాటికీ మనిషి మరచే మానవతారాగం

**(32)**

మేఘం వస్తుంది ప్రకృతి బంధంతో
మనిషిలో ఛాయా చరణం వదలుతుంది
అదొక ధైర్య కవచ మవుతుంది మనసుకు

వార్షిక రాగంతో జల నృత్యంతో
వర్తమానం అభినవ చేతన పొందుతుంది
ప్రతిదీ లక్ష్యం చేరే సంకల్పం ప్రదర్శిస్తుంది

విత్తు నుండి ప్రాణి దాకా అన్నీ అర్హతతో
జల ధారా స్నేహాన్ని పంచుకుంటాయి
ఉప్పు జలధి నుండి జనించిన మేఘం
శుభ్ర మయిన స్వాదు జలాల నందిస్తుంది

పనికి రాని ధూళి నుండి స్రజన ముఖంతో
కదల లేని లిప్తలో చలన పదంతో
సృష్టిలో చెదరిన లయ క్రమ గతి పొందుతుంది
వ్యక్తిలో ఏకాంతం విశ్వమయ మవుతుంది

మేఘంతో భాషించని మనస్సులేదు
మేఘంతో విప్పారని ఆలోచన లేదు
ఎగిరే పక్షులు మేఘ పథం చూపుతాయి
పలికే శబ్దం మేఘ హృదయం ధ్వనిస్తుంది

పదును బాకులా దూసే ఆర్తి స్వరం
ఒక్క మారు కుసుమ దళ మవుతుంది
అమాయకంగా కనిపించే అవని వదనం
అంతలో వివేక స్ఫురణ నందుకుంటుంది

జల హ్లాదంతో పాటు పయనంలో
జల గండమూ లేక పోలేదు
ఉన్మత్త ప్రవాహ దృశ్యం! హ్లాద చిత్ర మవుతుంది

దాహం తీరి ఆశా ప్రపంచం తృప్త మవుతుంది
మేఘం వస్తుంది కదలుతుంది
జీవన బంధంతో పయనిస్తుంది!

ఇంటి ముందు! వీధిలో!
అదే! భిక్షుక గణ దృశ్యం! ఏదో రూపంలో
మనిషి మనో జగత్తులో
అదే! క్షామ చారిత్రం! ఎప్పటికపుడు

**(33)**

మనిషి అంతరంగ మిత్రం
హృదయ మేఘం రాకతో
భూమి పయి మనిషిలో
గాయాలు మాయ మవుతాయి
పారిపోయిన దరహాసం
తిరిగి వచ్చి ముఖాన వాలుతుంది

శ్రమనూ సౌభాగ్యాన్నీ వరించే
కాల ఖండాల్ని సృజిస్తూ
ఇది! నడచే ఆహ్వాన రూపం!
మనిషినీ మనిషినీ కలుపుతుంది

చుట్టూ కాల్చేసే అనల స్థితులు
మబ్బు నీడతో అలంకృతమవుతాయి
సంధ్యా సహన భావ రూపాలతో
బోనులో నిలిచిన సింహా లవుతాయి

క్రోధంతో మండే సూర్యుడు
నవ్వుతూన్న పూల గుత్తి అవుతాడు
వెన్నెల పూల చక్ర మవుతాడు
బుద్ధుని శాంత తేజస్సును తలపిస్తాడు

ఎంత దూర మయినా ఏ వేళ అయినా
స్వేచ్ఛలో ఊహనూ అనుభవాన్నీ కలుపుతూ
పక్కనే ఎగిరే రాజ హంసలతో
మేఘాన్ని వహిస్తూ పోతుంది గాలి

నుదురు పయి తళ తళ జారే నాలుగు చినుకులతో
తలపులో కదలే నేరాన్ని మాయం చేస్తుంది
తల పయి జల జల రాలే పది చినుకులతో
చేతిలో ఆయుధానికి శాంతి తొడుగుతుంది

అనుభవ శిఖరాల్ని స్పృశిస్తూ అజేయంగా
అంతిమ గమ్యాన్ని సంకేతిస్తూ విజేతగా
మనో భూమికలో అదృశ్య మవుతుంది
హృదయ మేఘం! మనిషిలో అంతరంగ మిత్రం.

స్వేచ్ఛా కవిత్వం

రెండవ భాగం - 7

# సమకాలీనం

ముక్తక కావ్యం

మాదిరాజు రంగారావు

**2007**

రసధుని సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 500 028

# అంకితం

దేశ స్వాతంత్ర్యోద్యమ యశస్వి, రచయిత

ఉదార మనస్వి

డా॥ ఎం.ఎల్. నరసింహారావు అన్నగారికి

# కవి హృదయం

స్వేచ్ఛా కవిత్వంలో వెలువడిన మరో నవ్యకృతి “సమకాలీనం”. దీనికి ముందు ఇటీవల వెలువడిన “హృదయ మేఘం” కృతికి పూర్తిగా భిన్నమయింది. ఒకే కాలంలో ఉండే వ్యక్తికీ సమాజానికీ చెందిన విషయాల ప్రాధాన్యం కలిగింది. వాస్తవ జీవిత రేఖలతో తీర్చ బడింది. గతానికీ భవిష్యత్తుకూ మధ్య సజీవమయిన అనుభవ ప్రపంచం “సమకాలీనం”. దీని ఆధార తలం వర్తమానం. దీని పరిధి మనం రోజూ చూచే మనిషి జీవితంలో అనేక శక్తుల చలనంతో పరిణమించే భౌతిక మానసిక ప్రపంచం. ఇందులో బాహ్యమైన స్థితి చిత్రణంతో పాటు మూలమైన మనో రూపమూ చిత్రితమైంది. సామాజిక శాస్త్రాల విషయ స్పర్శ కూడా ఉంది. ప్రభావోపేతమైన జీవిత స్థితులతో సమాజ సమస్యలతో పాటు వాటి గతి రీతుల వివేచనతోనూ పుష్టి వంతమయింది.

ఇందులో 50 భాగాల్లో దేనికది సంపూర్ణమైంది. అందులో ఏ విభాగాని కది ప్రత్యేకంగా దృష్టికి వస్తుంది. ముక్తక పద్ధతిలో ఉంది. ముక్తక కావ్యంగా మొత్తంమీద వ్యవహరించడం జరిగింది.

ఇక విషయానికి వస్తే భౌతికంగానూ మానసికంగానూ వివిధ స్థాయిల్లో తప్పని జీవితం – చేరవలసిన గమ్యం కోరే ఆదర్శం సూచిత మయినాయి. సమాజ గతి విశేషమూ మానవీయమైన **frame** లో మానవతా రేఖలతో తీర్చబడింది. జీవితంలో విలువలపై సమాజంలో ప్రమాణాలపై దృష్టి కేంద్రీకరింపబడింది. (1) మనిషి కోరే స్వేచ్ఛ (2) తప్పని అవసరాలూ (3) అనివార్యాలూ (4) సమస్యలూ (5) సందర్భాలూ (6) స్థితిగతులూ (7) మానవ మనస్తత్వమూ (8) స్వీయ ప్రయోజనం (9) ఉన్నతమైన విలువలూ (10) నైతికత (11) ఆదర్శం మొదలయిన భావ స్థానాల్ని స్పృశిస్తూంది. ఐకాంతికం కన్నా సామాజికం ముఖ్యమైంది. దైవం – విధి ప్రాబల్యం పై దృష్టి కన్నా మనిషీ జీవితం విలువలు ప్రమాణాలూ నైతికత ఉన్నతమైన ప్రయోజనం పై అభిలాష కనిపిస్తుంది. వైరం క్రోధం శత్రుత సంకుచితం సంహారం బదులుగా సామరస్యం రాగం క్షమ ప్రేమ ఉదారత శాంతి మనోరూపంపై ఆలోచన కనిపిస్తుంది.

ఇక అభివ్యక్తిలో శబ్ద సంక్షిప్తతకూ భావ సాంద్రతకూ అనుభవ సూక్ష్మతలకూ ప్రాధాన్యం ఇవ్వబడింది. భావనలో ప్రతీక – భావరూపం సాధారణ స్థాయిలో ప్రసన్నతకు ప్రాముఖ్యం ఇవ్వబడింది.

సమకాలీనంలో అపుడపుడూ జరిగే అనేక సంఘటనలూ పరిస్థితులూ వినీ చదివీ స్పందించి ఎప్పటికపుడు వ్రాసినవి. అంతర్జాతీయంగానూ, జాతీయంగానూ, స్థానికంగానూ వియాత్నాం, చెచెన్యా, ఇరాక్, శ్రీలంక, కాశ్మీర్‌తో పాటు ఉగ్రవాదం మొదలుగా రాజకీయ సామాజిక సందర్భాలూ కావ్యంలో విషయాగతమైన స్ఫూర్తిని పొందాయి. అక్కడక్కడ తాత్త్విక స్పర్శతో భావజగత్తు ప్రకాశ రూపాన్ని పొందింది. ఆయా అంశాలు సహృదయుల మనస్సులో స్ఫురణకు వచ్చే విధంగా ప్రతీయ మానత్వాన్ని పొందాయి. స్థూలంగా వస్తువు కేంద్ర భూమి మాత్రం మానవీయం – మానవతా భావనతో కూడిన సమాజ రూపమే. ఇందులో ప్రజాస్వామ్యంలోనూ విపరీతమైన విషమగతులూ చూపబడినాయి. అయినప్పటికీ విశాలమైన ప్రాతిపదికపై కవి ప్రజాస్వామ్య హృదయం స్పష్టం.

**మాదిరాజు రంగారావు.**

# సమకాలీనం

## ముక్తక కావ్యం 1

వర్తమాన చలనంలో భాగమయి జీవితం
చూడక తప్పని దృశ్యం సమకాలీనం
ఎక్కడ బడితే అక్కడ మానవతా సూత్రం తెగి
ఎప్పటి కపుడు అపాయ సూచికలో సమాజం.

సమయం కదలని వృక్షం కాదు
ఏదో ఒక రూపంలో శిల్పం కాదు
మానవ నైజంతో సామాజిక రూపాల్ని
నిరంతరం నడిపించే యాన సాధనం.

నదిలో నావలా ఆయువులో సమయం
పోయే కొద్దీ గగనంలా అదృష్టం
ఒడిలో నింపుకొనే ఆలోచన సహజం
అనుభవ తలం పయి ఇంద్ర ధనువు వాస్తవం.

దాహంతో నదిని చేరి స్వంతం చేసుకునే
అతి దాహం మనిషిలో అమానుషం
కాగితపు పడవలా నదిలో పాపాన్ని వదలి
శుభ్రంగా బయట పడీ ఒడ్డుకు చేరాలనే

జలాల పయి కమలం లా ఒకేచోట నిలవదు
గగనాన గాలి పటంలా ఏ ఒకరి చేతిలో ఆడదు
పంజరంలో చిలకలా ఏ పరిమితిలో ఉండదు
స్వేచ్ఛా సృజన కళా రూపం! నాలో సమకాలీనం!

## 2

ఎన్నో దిశల నుండి ఇంకా వినిపిస్తుంది
        నిరంకుశాహంకారం స్వేచ్ఛకు మరణ రవం
ఉరి కంబం వేచి ఉంది స్వాగత వదనం తో
        మృత్యు వెదురు చూస్తూంది ఉత్సవ నిశి కయి.

కత్తి నీడలో రణం బ్రతికి బట్ట కడుతూంది
        బాంబు గుండెలో మృత్యువు తిష్ఠవేసి ఏలుతూంది
కథలో కంకాళం భయద రవం స్వనిస్తూంది
        హృదయం హిమ ఘన శకల సమం అవుతూంది.

ఏ అవసరానికో ఆకర్షణకో గానీ
        వెలుగును పక్కకు పెట్టి చీకటి తొడిగే వారూ
ఎవరో గుర్తిస్తారని భయ భూతం ఆవహించి
        పూవు రాలి నంత తేలికగా ప్రాణం తీసేవారూ.

మనిషిని ప్రేమిస్తే మనసులో చంద్ర బింబం
        మనిషిని ద్వేషిస్తే మనసులో చీకటి గుహ
పూర్ణిమ కయి వెన్నెల తహ తహ లాడుతుంది
        అమావాస్య కయి చీకటి విలవిల లాడుతుంది.

చుక్కల పయి గురి పెట్టే ఆయుధం
        దారిన పోయే బ్రతుకును వాల్చేస్తూంది
సామాన్యుని నుండి మహా పురుషుని దాకా
        ఎవరి ప్రాణ భయం వారిది సమకాలీనంలో.

**3**

రాత్రి నిలిపిన బాంబు లా చీకటి
లేచే వేళకు విస్ఫోటానికి సిద్ధంగా
లేవక ముందే తొలి రవి కిరణం
డిఫ్యూజ్ చేస్తుంది ! రోజూ ! ఒక అదృష్టం !

మంటల్లో మాడే మందారం కాశ్మీర్
శిథిలాల వాలకంలో గాయాల గుజరాత్
ప్రేలే ఆయుధ పంక్తికి వణకే అఫ్ఘనిస్తాన్
అనల పంజరంలో అటూ ఇటూ ఊగే శ్రీలంక !

బుట్టలో పాములా రహస్యం బయట పడొచ్చు
బుట్టను సీల్ చేయడమో ! పామును చంపడమో
కడిగిన ముత్యంలా మట్టి అంట కుండా
మనిషిలో మహాదోషి ! బయట పడాలనే.

బిందువు సముద్ర మయి తుఫాను దూకించాలనీ
అణువు శక్తికి మూల మయి పరివర్తన తేవాలనీ
ముఖం సూర్య బిందు వయి మరో పగలు సృజించాలనీ
అడుగు జాడ పంజర మయి చరిత్రను బంధించాలనీ.

ఎద ఎదలో ఒక ఆయుధ రూపం నిలిచీ
జన బృందం సంఘర్షణ వలయమై
పిడికిలిలో సమాజ భవిత బిగించాలనీ
విలయ భావ శక్తులతో సమకాలీనం.

**4**

జాతర లో తప్పి పోయిన మనిషి
ఆకలి తో అరణ్యం లో తేలేను
కుంపటి నుండి నిప్పు కణంలా
కొండ లో కోన లో తిరిగేను.

ఎగిరే నిప్పు కణం వెలుక్కి
దిశ తలుపులు తెరచు కోవు
దోసిలి తో చల్లే నీళ్ళకు
క్షేత్రం ! విత్తేందుకు పదును తేలదు.

అనల ముఖం చూపే ఎప్పటిదో గాయంతో
పచ్చని అరణ్య హృదయ నిలయం చేరేను
జారే కన్నీటి చారను తుడవడం
శ్వాస తీసుకునేంత సులభం కాదు.

చెట్టు నీడ ! చేయి చాచి ఏ మల లోనో?
ఫాలం పయి చెమట బిందువుల్ని తుడుస్తూంది
ఒక్కమారు ఏ పండుగ కయినా
చూడాలనే కన్న తల్లి ఆవేదన! తీగెలా.

తలకు చుట్టిన రోకలి గురించీ
తలలో వెలసిన రోలు గురించీ
ఉదయం వార్తా పత్రికలో కథనం
గోడ వెనక నీలి వాస్తవంతో సమకాలీనం !

**5**

నిజ జీవిత చక్రాల క్రింద నలిగి వాస్తవం
కల్పనలో చరిత్ర నిర్మిత మవు తూంది
నాటకంలో ఆయుధం అందుకునే చేయి
జీవితంలో ఆయుధం అయితేనే విపరీతం.

ముసుగులో బాంబుగా మారి మనిషి
పచ్చని సమాజానికి నిప్పంటించీ
విధ్వంస విలయ స్పర్శతో
మానవతను ఎడారిలో ఒంటెను చేసేను.

రెండు చేతులా క్రమ్మే పొగ విసురు కుంటూ
ఎదురు పడే మిత్రుణ్ణీ పెద్ద మనిషినీ
పలకరించే సమయం ఎక్కడుంది?
పొగ నుండి బయట పడేందుకే సరిపోతూంది.

కార్నర్ లో పనికై పోటీ లో శ్రమ జీవుల ఘర్షణ
ఆ రోజు గడిస్తే నూరేండ్ల తో సమానం
గోడపై నుండి చూచే పూవు సాక్షిగా
ఆ రోజు గడవక శిశువు నమ్ముకునే తల్లీ !

చీకటికీ ఆకలికీ అనుబంధం
ఆకలికీ అనలానికీ స్నేహం
ప్రశ్నకీ మార్పుకీ బాంధవ్యం
మనిషిలో మరో మనిషి బాటలో సమకాలీనం !

## 6

రోజూ వస్తుంది పత్రిక ! తేదీ మారుతుంది
అక్షరాలు వదలే ఆయుధాలు అవే హారాలూ అవే !
ఒకరి సంకెళ్ళు త్రెంచే పనిలో
తాము సంకెళ్ళలో పని చేసేరు.

ప్రకృతిలో బీభత్సం ఎపుడో ఒక మారు
మనిషితో భీభత్సం ఎపుడు బడితే అపుడు
సమాజంలో అమానుష లెందరో కన్నా
మానవు లెందరో లెక్క పెట్టడం సులభం.

డైరి లో గుర్తు పెట్టుకో దగిన రోజు
మరో కథకు మూల మవుతూంది
ప్రకంపనం ! విస్ఫోటం ! రెండూ జడంలో చైతన్యాలే
ప్రకృతిలో మనిషిలో సృష్టి వెనకనే విలయం.

చేతికి మొగలి రేకు అందబోయి
మెడలో అనల హారం పడవచ్చు
చేతిలో వెన్న ముద్ద జారి పోతుంది
చేతిలో బంతి ఎగిరి విజయం వరిస్తుంది.

వాస్తవం జీవితాన్ని నడిపిస్తుంది
కల్పన మనస్సును అలంకరిస్తుంది
రాలే గంధపు పూత పొరలతో నాలో
మూర్తం నుండి అమూర్తానికి ! సమకాలీనం.

**7**

జీవితంలో అతిశయోక్తి సఫలం కాదు
కల్పనతో వాస్తవం మనిషిలో సమాంతరం
మాట గాలిలో కలుస్తుంది అమాయకంగా
స్మృతి పేటికలో నిలుస్తుంది అర్థయుతంగా.

వెన్నులో తీగెలా సాగి
మస్తిష్కంలో శశి కళలా విరిసి
మనిషి భాషకు దివ్యం అతీతం
మనిషిలో ఆరోహణకు సాధనం.

తెరచిన గతం కిటికీ నుండి
కన్పించినంత మేరలో దృశ్యం !
కొండలా ఎదిగిన సమాజం
గుహలో శిల్పాల్లో స్మృతులు.

కల్ప వృక్షమో కామధేనువో కల్పనలోనే తృప్తి !
ఋతువు ఋతువుకూ మారే చెట్టు ! భూమి !
భూమి పై మనిషి ! సస్యం పై ఆశతో వజ్రం కై కోరికతో
మానవ బంధంలో అనుభవ నవ గంధం పీలుస్తూ.

శుష్క ముఖంతో శూన్య హస్తంతో
క్షేత్రం విషాద పర్వమూ కావచ్చు.
సమయం సందర్భం పరిమితిలో నడిపించే
వాస్తవానికి దర్పణం ! నాలో సమకాలీనం !

## 8

నిశ్శబ్దం నడుస్తూంది నాతో శబ్దాన్ని ధరించి
వర్తమాన దృశ్యాల్ని ప్రతిబింబిస్తూ
మజిలి మజిలి కొక ప్రదర్శన శాల
ఆకర్షణతో ముసు ముందుకు నడిపిస్తుంది.

కోరిక ఉండాలే కాని తీగెకు దిశలే తుది
పరంపరలో భాగమై ప్రవాహాన్ని తలపిస్తుంది.

తరంగాల్లా పొరలి వచ్చే అనుభవాల
చలనంతో పురోగమనం తప్ప వేరే ఉండదు.
భూమి పయి స్వేచ్ఛకు గోడ కట్టవచ్చు
నీటి పయి ఆ పని ఎక్కడ నిలుస్తుంది !

విశాలమయిన హృదయంతో నది సరిస్తుంది
గభీర మయిన అనుభవంతో జలధి స్పందిస్తుంది.

అక్షర శరీరంతో ఆవిర్భవించే ఆలోచనకు
మరే రణ కవచమూ అక్కర లేదు.
ఆకాశాన్ని హ్యాట్ గా ధరించే కోరికతో
శాంతి కోసం రణం గురించి తెలియాలిసిందే.

యోగం ఉండాలే కాని కవికి
ప్రతి సమయం సందర్భం బ్రతుకులో
కవితకు కావలసిన అదృష్ట వసంతం
నవతకు బహుమానం ! సమకాలీనం.

## 9

గిరి శిఖరం నుండి జారే జలపాతంలా
నాలో సమకాలీనం ప్రవహించే జీవన కృతితో
దారిలో కదలని శిలల్ని ! వదలి పోతుంది
తనలో చేరిన పడవల్ని తరలిస్తుంది.

దారి ప్రక్క శిథిలాల్లో నిద్రించే
చరిత్రను మేల్కొల్పే సాహసం ఎవరికుంది?
అది నిజంగా మేల్కొని కదిలితే
కప్పు బడిన ముసుగులు ఉంటాయా? ఇంకా?

గాయాల మచ్చలు బయట పడతాయి
ప్రతి గాయంలో ఒక కథా శకలం
ఒక చోట చేర్చి కూర్చి కథ నిర్మిస్తే
బయట పడే వాస్తవాన్ని భరించేదెవరు ?

ఆ దారి ప్రక్కగా ఎప్పటికీ పడి ఉండే
జీవితాల్ని నడిపించే సాహసం ఎవరికుంది?
అవి నిజంగానే నడిపింప బడితే
ముడి బయట పడుతుంది ! ఉచ్చు తెలిసి పోతుంది.

వేసిన ముడిలో స్వార్థం తెలిసి పోతే ఎంత కష్టం ?
పన్నిన ఉచ్చులో మోసం బయటపడితే ఎంత నష్టం ?

మెలకువ అంటే కళ్ళు తెరవడం కాదు
ఆగని చైతన్యంతో సక్రియగా బ్రతకడం !

## 10

మనిషికీ మరో మనిషికీ మధ్య
ఊహకూ మరో ఊహకూ మధ్య
చూపుకీ మరో చూపుకీ మధ్య
చర్యకూ మరో చర్యకూ మధ్య
ఎడం ఎక్కువయితే !
అవగాహనలో అగమ్యం అందుకుంటుంది.

అణువు కూ మరో అణువు కూ మధ్య
అడుగు కీ మరో అడుగుకీ మధ్య
అక్షరానికీ మరో అక్షరానికీ మధ్య
శ్వాసకూ మరో శ్వాసకూ మధ్య
ఎడం ఎక్కువయితే !
అవకాశంలో అనర్థం దాపురిస్తుంది.

ఎప్పటి కేది ప్రస్తుతమో అది అతుకుతూ పోతే
మనిషిలో అపూర్వ వ్యక్తిత్వం వికార దృశ్యమవుతుంది
బహు రూపుల వేషానికి సరదాగా పనికొస్తుంది
జాతరలో వేడుకకి బాగా సరిపోతుంది.

లోపలి అంతరాత్మను కళ్ళు మూసి కప్పేసినా
మెడలో దండ వేసి ఉరి త్రాడు చేసినా
బొగ్గు కణికలో నిప్పు ఊది ఊది మెరపించినా
ఎవరి వద్దా ! పర్వతంలా ఆగదు సమకాలీనం !

## 11

మనిషి రక్తంతో చరిత్రను వ్రాసే సాహసం
కఠోర ఖడ్గ హింసతో మొదలవుతుంది
యుద్ధ ప్రియుల బుజాల పయి శాంతి
తడవ కొక అలంకారంతో ఊరేగింపబడుతూంది.

నిజాన్ని ప్రజల నుండి తొలగించడం
మొక్కను లాగేసేంత సులభం కాదు
బెలూన్ కు పంక్చర్ చేసినంత తేలిక కాదు
రణంలో మొదటి ఆకర్షణ ! అసత్య ప్రచారం.

మొన్న జపాన్ నిన్న వియత్నాం నేడు ఇరాక్ లో
బీభత్సకాండ ! ప్రజా స్వామ్య వేదిక నుండే !
నిజం మీద నిలబడే శక్తి ఎవరికి ఉంది ?
నేతకూ కవికీ యోధునికీ తప్ప !
తమ పాత్రను వదలి మరో వేషం లోకి వెళ్ళితే
ఏర్పడే శూన్యాన్ని నకిలీ రూపాలు నింపేస్తాయి.

జీవితంలో ప్రశ్నలు ! నక్షత్రాల్లా కనిపించవచ్చు !
జవాబులు చంద్రకళ ల్లా రావలసి ఉంది.

మనిషి మనో రూపానికి శిఖరాలెన్నో
ఒకటి రెండు క్రుంగి వంగి కన్పించవచ్చు
శిఖరానికీ శిఖరానికీ మధ్య వంతెనలా మానవీయం
నడచే సమాజ రూపాలతో సమకాలీనం.

**12**

ఏ దేశ సంస్కృతి నయినా హత మార్చడం
చెట్టును నరికినంత సులభం కాదు
ఏ జీవన సరళి నయినా మాయం చేయడం
చెరువు గట్టును తెగేసి నంత సులభం కాదు.

ఎడారిలో ఇసుక మేటల మధ్య
సన్నని నీటి పాయలా మానవత
అక్క డక్క డొక చెట్టు సృజనకు స్వాగతమిస్తూంది
కొమ్మ పై పక్షి పలుకు శాంతి సందేశమిస్తూంది.

నియంత కీర్తి ముద్రతో ఒక వ్యక్తి
చెలరేగిన మహా సముద్రమై
మానవ హక్కుల గట్టును దాటీ
మానవతా క్షేత్రాన్ని ముంచేసీ
సమాజ సౌందర్యాన్ని విలయ లీలలో
మారణ ధూమంతో అలంకరించేను.
చివరకు మిగిలింది చెచెన్యాలో
మట్టి బొమ్మల్లా మనుషులే !

ఆయుధం గెలుపుకి చివరిమాట కాదని అందరికీ తెలుసు
కాని ఏ దేశమూ ఆయుధాన్ని పరిమితం చేసుకోదు
అహంకారం చివరి శిఖరం కాదనీ అందరికీ తెలుసు
కాని దాని నిరంకుశ ముఖాన్ని ఎవరూ వదలుకోరు.

**13**

భూమికై సంపదకై మానవ హక్కులకై న్యాయంకై
చైతన్యంతో పోరాటం ! మట్టి మనిషిలో
మళ్ళీ మళ్ళీ మొదటికి వచ్చే ప్రశ్నకు
ఏ జవాబు నీయ నవసరం లేదు.

ఇనుప రూపంతో ఎగిరి
ఇనుప ముక్కుతో పొడుస్తూ
ఇనుప రెక్కలతో డీ కొడుతూ
ప్రజాస్వామ్యం పల్టీ కొడుతూంది.

రాజకీయ వైరంలో ముందుగానే
ఎవరి మరణ శాసనం వారే వ్రాసేరు
ద్వేషానికి ద్వేషం లా హింసకు హింసలా
ప్రాణానికి ప్రాణం తీయడం అనాగరకం.

కరుణ లేని పాలన ఎడారితో సమం
అస్థి పంజరం ఎడారి పాట పాడుతుంది
పోరాటంలో దారులు వేరు కావచ్చు
అందరిలో శ్వాస నిలిపే మానవతా పవనం ఒకటే.

దేనిపై గెలుపు ఎవరిది ? అనేది ఒక కోణం లోనే
మానవతా ప్రమాణాల్లో చరిత్ర ఎపుడు నడిచింది ?
ఆ రోజు విషాదంతో శూన్యంగా మిగిలిన
నీలి పుటకు సాక్షిగా ప్రజాస్వామ్య సమకాలీనం !

## 14

తలకు మించిన బరువు మోసి మోసి
    తీసుకునే విశ్రాంతి లో నిద్ర నుండి
లేవక ముందే ! నిలయ శిఖరం కూలి
    శిథిలాలు పై బడి ప్రాణం ప్రమాదంలో !

బ్రతుకులో, వాస్తవం రంగులు వహించింది
    ఆ రంగులు తొలగించే ఉద్యమంలో
మరో రంగు వచ్చి చేరేను. మనిషిలో
    ఏ రంగూ లేని వస్తువుకై అన్వేషణ ! ఏ రోజూ.

నిజం కదలడానికి వాహనాల కొరత లేదు
    దేన్ని ఎవరు ఎటు డ్రైవ్ చేసేదీ తెలీదు.
నిజం పవనం వంటిది, అంతటా వీస్తుంది
    దీనిపై కటు నియంత్రణం ! ఆయువుకు ప్రమాదం !

పచ్చని ఆకుల మధ్య క్షేమంగా ఉన్న పక్షి
    అగ్ని తీగెల మధ్య దారి కయి వెదకుతూంది
ఆలోచనలో పై పైకి ఎగిరే ఆదర్శం
    వాస్తవాన మందు పాత్ర సందేహంతో భ్రమిస్తూంది.

అటు వైపు నుండి కోలాహలం
    ఎప్పటిదో నిద్రను వదలిస్తూంది
ఇటు వైపు నుండి స్లోగన్
    మేల్కొన్న క్షణాల్ని నడిపిస్తూంది.

## 15

కండరాల బలం ధనం మస్తిష్కం శక్తి యుక్తి
ధ్వనిస్తుంది సమాజ దృశ్యంతో ఆర్కెస్ట్రా ! సమకాలీనం.
ఆశ మోసే అందలంలో బొమ్మలా మనిషి
నిన్నటి రాజరికం అవశేషాల అలంకరణతో.

ధరిత్రి పయి నిరంకుశ పద ఘట్టనకూ
సంస్కృతిలో శూన్యమయిన నీలి పుటకూ
ఆత్మలో సృజన చలన రూపానికీ
రెండిటికీ సాక్షిగా నాలో సమకాలీనం !

విత్తు భూమిలో అణగి మణగి పోతుంది
ఏ మనిషికీ బాధ లేదు, ఉండదు కూడా,
మొలక పైకి ముఖం ఎత్తుతుంది
అందుకే ! ఆశా భావంలో ఆనందం !

ఆకు రాలిపోతుంది, చెట్టు శూన్య నిలయ మవుతుంది
ఏ మనసుకూ బాధలేదు, ఉండదు కూడా
కొత్త ఆకు ! కొత్త పూవు ! అందంగా
అందుకే ! ఆశా కాంతిలో ఆనందం !

అగ్నులై దగ్ధం చేయడానికి కాదు
పిడుగులై నాశనం చేయడానికీ కాదు
ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ ! ఆలోచనా ప్రభాతంతో
జీవితం మేల్కొనేందుకూ సమాజం వికసించేందుకూ.

## 16

నాలుగు వైపుల నుండీ జలధి భయంతో
    ద్వీప నగరి నివాసం వీడాలనీ ఉండదు.
కాగితం పడవలా నీటిపై వాలుతూ
    ఒరిగి మునిగి పోవాలనీ ఉండదు.

మనిషి ఉన్న చోటుకే వచ్చి పడవ నిలవదు
    ఎంతటి వారయినా తీరానికి వెళ్ళాలిసిందే
గట్టు పైకి చేరేందుకు చాచిన చేయిని
    అందుకునే చేయికీ గుండె అవసరం.

అమృత కలశం కయి కనే కల
    సుధాకర బింబంలో వాస్తవం కావచ్చు
ఆనందం కయి వేచి ఉన్న మనిషిలో
    నిల్చిన ఆశా శ్రేణిక ఇప్పటిదా ?

మథనంలో మాత్రం శ్రమకు దూర మవుతూ
    అమృతం కయి ఆరాటం పొందే వారూ
కఠోర జలధి హోరులో జోరులో
    జల తరంగిణీ నాదం వినాలనే, కోరిక సహజం !

మయూర పింఛంలా విరిసిన సమతా భావంతో
    రాజ హంస రెక్కల పయి అనుభవ నిజ స్వేచ్ఛతో
మనిషిలో వ్యక్తిత్వ వికాసంతో పూర్ణంగా
    నడిపించే ప్రజాస్వామ్య సమకాలీనం నాలో.

## 17

చెలమ చెరువు బావి నది ఏదయినా
దాహంలో మనిషికి లేదే భేదం
ధనం బలం అధికారం రుచి భోగం
పొరలు పొరలు గా చేరిన మనిషిలో
అన్నీ ఒలిచేస్తే ఒకటొకటీ
మిగిలే దేముందిక ! అస్తిత్వంలో

అన్నిటినీ వదిలేసిన జీవిత రూపం
అద్దంలో మనో భావ శూన్యమయిన వదనం

ఎన్ని మార్లు చూచినా అద్దంలో అదే ముఖం
తడవ తడవ కొక కొత్త పేజిలా.
ఏ పేజిలో ఏ పంక్తి దేనికీ డిటో కాదు
ఎవరికి తోచిన అర్థం వారికి ప్రియం.

దేనిపైనో విశ్వాసం మనిషికి సహజం
పోటీకో గెలుపుకో భద్రతకో బతుక్కో.

చేతిలో మూడు నాలుగు బంతులతో
చూచే ఆట మురిపిస్తుంది
బ్రతుకులో మూడు నాలుగు బొమ్మలతో
ఆడే ఆట అలరిస్తుంది.

దేని కది సంపూర్ణం ప్రతిదీ
తనలో అన్నిటితో సమకాలీనం !

## 18

మనసును కప్పేసే మమతను మింగేసే
    వర్ణ వర్గ భేదాల విడంబనం ! విదారణం !
ఎప్పటివో ? మనుషుల మధ్య గోడల్లా ! ఇనుప తీగెల్లా !
    హక్కుల కయి జన చేతనలో రణ వ్యూహం !

ఎండిన నది దాహంతో
    ఇసుక నాలుక చాస్తూంది
వంగిన తల వెనకనే
    ఖడ్గం తల ఎత్తుతూంది.

దారిలో ఎదురు పడే పతాక
    మరో దృక్పథాన్ని చూపుతూంది
ఆలోచన తీగె పయి
    కొత్త సుమం తలెత్తుతూంది.

జెండా కెదురుగా మరో జెండా
    ప్రజాస్వామ్య రూపానికి చేరిన కళగా
తిరగేసిన జెండా కర్రలపై రాళ్ళు
    గాలి మైదానంలో 'హాకీ' ఆటలా.

ప్రజా స్వామ్యం నిశాస్వామ్య మవుతూంది
    చేతిలో వెలిగే టార్చ్ లైట్ తో నడుస్తూ
నక్షత్రాలకు సూర్యుని పూజలు అందించేరు.
    ఉషః కిరణం చూడని తెలీని వక్తులతో సమకాలీనం.

## 19

రాత్రి కురిసిన క్లస్టర్ బాంబులకు
చెట్ల నుండి చెదరిన గూళ్ళతో పక్షులు
మనిషి వదలిన మారణ చరిత్రకు
శిథిల పంక్తి దర్పణంలా ఉంది !

అచలం క్షణం చలించింది అభద్రంగా
మానవ రణ భాష మృత్యువుకే అర్థమవుతూంది
వినాశన పద చిహ్నాలు గుప్తంగా
శత్రు బీజాలకు నిలయాలవుతున్నాయి.
గ్రహాలు బాగా లేక పోవడం కాదు
నేతల మతులు గతులు తప్పడమే !

పరుగెత్తే పాదాలను విశాలావని
ఆదరంతో ఎదకు హత్తుకుంటూంది.
మానవతకు దగ్గరగా వస్తూనే
ఏ రోజు కా రోజు దూరమవుతూంది.

నన్ను రిసీవ్ చేసుకునేందుకు
ఏ స్టేషన్ లోనూ మృత్యువు సిద్ధంగా లేదు

ప్రతి ఘట్టాన్నీ అవలీలగా దాటుతూ
ప్రయాణం చిరంజీవత్వాన్ని పొందుతూంది.
తల్లి చేతుల్లో నుండి జారీ
ఎదిగే బిడ్డలా కదలుతూంది సమకాలీనం.

## 20

జీవన చలనంలో శరీరం
ప్రకృతితో మాట్లాడుతూంది
చేతులు మాట్లాడతాయి వస్తువుతో
పాదాలు మాట్లాడతాయి భూమితో.

క్షణాలు అక్షరాలుగా మారి
పనిలో పదాలుగా తరలి పోతున్నాయి
భౌతిక జగత్తులో శరీర కృషి
శ్రమ కావ్యాన్ని తలపిస్తూంది.

ఆగ్రహంతో ఉగ్రమయిన సమయం
అనల భాష మాట్లాడుతూంది
అనుగ్రహంతో హ్లాదమయిన సమయం
సుజల భాష మాట్లాడుతూంది.

నిరాశతో రాలి పోయే సమయం
మంచు భాష మాట్లాడుతూంది మౌనంగా
ఆశలతో అతిశయించే సమయం
పూల భాష మాట్లాడుతూంది అందంగా
ఒకదానికి మరొకటి సహభావంతో
వివిధ భంగిమల్లో అంతా చైతన్యమయం

శ్రమ జీవన చలనంలో మానవ దర్శనం
దృశ్యం నుండి దృశ్యానికి సమకాలీనం.

## 21

గతాన్ని మళ్ళీ నిర్మితిలో చూడాలనీ వినాలనీ
వర్తమానాన్ని చేతిలో నిలుపు కోవాలనీ
భవిష్యత్తును భద్రంగా రిజర్వు చేసుకోవాలనీ
మనిషిలో కోరిక ! కోట గోడలా చుట్టీ !

అందమైన ఒరలో బులిపించే కత్తి
అద్దాల షో కేస్‌లో అందమైన ప్రతిమ
వెదురు గడపై నిలిచి కదలే పతాక ।
మనిషి ఆదర్శానికి ఉపకరణం కావాలనీ ॥

ఎవరి చేతిలో ఉన్నా
    కత్తి విజయాన్నే కోరుతుంది
ఏ వస్తువు తీసుకున్నా
    కవిత యశస్సునే కోరుతుంది

భిన్నత్వంలో ఏకత్వం స్లోగన్ అయి
    అవసరానికి అందలం ఎక్కిస్తూంది
ప్రలోభానికి తలుపులు తెరుస్తూంది
    రూపంలో భావంలో గమ్యంలో చెదరిన, ప్రజాస్వామ్య రూపం.

గతంలో అగ్ని చిత్రం మరచీ వర్తమానంకై
    వర్తమానంలో కన్నీళ్ళు తుడిచీ భవిష్యత్తుకై
కాళ్ళకూ చేతులకూ పని తప్పని సమాజంలో
    మెలకువలో ఆగని చేతనతో సమకాలీనం !

## 22

ముందుకు పోతూంటే ఎదురు పడే మనుషులు
 తెరవ బోయే పుస్తకాల్లా కనిపిస్తారు
నడక తరంగాల్లా ముందుకు సాగుతూంటే
 వెనక్కి తిరిగి జాడల్ని చూచే తీరిక ఎక్కడుంది ?

విడిచిన బాణంలా సాగుతూంటే ! ముందున్న
 ట్రాఫిక్‌లో దారి అదే దొరుకుతూంది
కూడలిలో బాంబు 'అనుమాన' భయం
 తన ప్రాణానికి భయంలేని అడుగులతో కదలుతూంది.

జననంతో ఏర్పడే వ్యక్తిలో మూల రూపం
 దుస్తుల భేదంతో పరివర్తన పొందదు.
రంగులతో రేఖలతో ముద్రలతో గుర్తులతో
 మనిషిని గుర్తించే కాలం కనుమరుగవుతూంది.

ఎక్కడి కక్కడ నిండు దృశ్యంతో సమాజం
 అందులో భాగం నాలో అఖండ రూపం.

తెరచిన పుస్తకం పుటలో ప్రతి వాక్యం
 మనిషికో విధం ! మానవ సంబంధంతో
వ్యక్తిలో సమాజ శక్తిని బింబించే
 ఊహలో చర్యలో మానవ దర్శనమొకటే.

పొంగే కరుణం వెలిగే వీరం ఉబికే రాగం
 ఒలికే శాంతం అన్నీ కలిసే వేదిక ! సమకాలీనం.

**23**

మనిషిని ఉరితీసే విషమ సమయం
మానవతా వదనం వాడి,
మాయమై పరిమళ హృదయం
ఇనుప ముళ్ళ పొద మిగిలేను.

మనిషికి ఉరి వేసే విషమ సమయం
మానవతా మృదు స్వరం తెగి
మృగ కఠోర రావంతో
శబ్ద జగం ఊగేను.

మనిషికి ఉరి లాగే విషమ సమయం
మానవతా స్పందనం ఆగి
కరుణ జలం ఆవిరియై
కఠిన శిలా తలం మిగిలేను.

మనిషిని ఉరి తీసిన విషమ సమయం
కూలే మానవతా శిఖరం దృశ్యం
ఉదార ఝరి మాయమై
కళ్ళలో అశ్రు జలం స్తంభించేను.

మనిషిని ఉరి తీసిన విషమ సమయం
మండి మండి మానవతా రూపం !
మానవీయ పరీక్షలో చివరన
పుటపాకంలో బూడిద మిగిలేను !

చరిత్రలో ఖాళీ నీలి పుటకు
సాక్షీభూతంగా సంచలన సమకాలీనం !

## 24

కావలసినవి సర్దుకొనీ బాగ్‌లో శ్రద్ధగా
ఇంటి నుండి బయలుదేరి వీధికి చేరాక,
కాస్త దూరం వెళ్ళే సరికి ఏకాంతం వరించింది
ఆలోచన కాసేపు ఆకాశ యానమూ చేసింది.

వీధిలో నడుస్తూంటే రక రకాల ధ్వనులు !
వివిధ వాద్యాలు ఒకేసారి మ్రోగినట్లు !
మొదటి సారి ప్రాక్టీసు మొదలు పెట్టి నట్లుంది.
మనస్సు అంతలో మౌన గగన మయింది.

ఏకాంతం చెట్టును తలపిస్తుంది ఒంటరియై
సమాజం సముద్రాన్ని తలపిస్తుంది విశాలమై
సమూహ చలనంతో కదలి పోయే ప్రవాహంలో
ఏదో మరచి నట్లుంది; ఆలోచన కందడం లేదు.

ఇంటికి వచ్చి చూస్తే ! టేబిల్ పయి ఎదురుగా
మరచిన చేతి గడియారం ! కాల గమన చిహ్నం !
ఏకాంతాన్నీ సమాజాన్నీ కాల స్పృహతో కలిపే బంధం
జీవన యానంలో కాల విభాగానికి రూపం
ఏకాంతమూ సమాజమూ కలిస్తేనే మనిషికి అస్తిత్వం !
లేంది, నిలువునా చీలిన నాణెంలా చెల్లుబాటు కాదు.

ఆకాశ యానంలో మరచిన జీవితాన్ని గడియారంలా
జ్ఞాపకం చేయడమే కాదు! భూమికి తెస్తుంది! సమకాలీనం !

## 25

తలపై ఏముంది ? అంటే ఆకాశం !
ఇంకా ? అంటే ! చంద్రుడూ ! చుక్కలూ ! సూర్యుడూ !
ఇంకా ? ఎత్తులో గగనాన్ని దాటే సంకల్పం !
ఇంకా ? అంటే ఏముంది ? అహంకారం !

దీన్ని వదలే ఆయుధా లెన్ని విధాలో రణంలో
వివిధ దృష్టి కోణాల్లో విజయాలూ అపజయాలూ !
జీవ నదిని తలపించే మానవీయ రూపం
ముక్కలైన ఎడారి కనిపిస్తేనే ప్రమాదం.

సమస్య పరిష్కారానికి రహస్య మార్గం లేదు
అంతా బహిరంగమే; మానవతా బంధం ఒకటే !
ఏ చిత్రంలోనో ఏ శిల్పంలోనో ఆకృతి చూస్తే
మనిషికి ఆ మనిషి హృదయ మేలా తెలుస్తుంది.

జీవితాన్ని గ్రంథంలా చదవాలిసి ఉంటుంది.
చర్యను నికషానికి నిలపాలిసి ఉంటుంది.
స్పందన స్థాయిని కొలవాలిసి ఉంటుంది
మానవతా ముఖాన్ని అన్వేషించాలిసి ఉంటుంది.

కల రాలి పోవచ్చు మంచులా పూవులా
కలతో పాటు మనసు జారిపోకూడదు.
మనిషికి మనిషి కనిపించని వర్తమాన దశలో
తలలను ముంచేసే జలపాతంలా సమకాలీనం !

**26**

జీవన ప్రవాహంలో యాన పాత్రలా రోజు
తన కోరిక కన్నా జన గమ్యం ముఖ్యమై
ప్రతి రోజు ఒక వాహన రూపాన్ని ధరిస్తుంది
నెమలి పక్షి హరిణం అశ్వం గజం ఇంకా ఎన్నో !

ఏ రోజూ ప్రజను తన లోకి ఆకర్షిస్తుంది
ఎవరినీ ఒడ్డున నిలవ నీయదు.
ప్రజల కోసమే ఉన్నట్లుగా తాను
క్షణాల బుజాలపై తరలిస్తుంది.

ఈత చూపి జల రహస్యం తెలుపుతుంది
లోతుల్నీ నిధుల్నీ పరిచయం చేస్తుంది
సృజనకు ప్రేరణ రూపంగా
పయనంలో సుందర వాహనమై.

గడచిన రోజులు మొత్తంగా సమూహ శక్తిని తలపిస్తాయి
వెనక్కి చూస్తే దాటిన మెట్లు ! ప్రశ్నల వలె కనిపిస్తాయి.
రోజులు గడచేవి ఒకటొకటీ వ్యక్తి శక్తిని రూపిస్తాయి.
ముందున్న మెట్లు ఎక్కాలిసినవి నిరీక్షకుల్లా ఉంటాయి.

చుక్కల్ని కిరీటంలో మణులుగా పొదుగుతూ
దిశల్ని ఉదార చరితతో కొలుస్తూ
ఆశాబంధంతో మనిషిలో అస్తిత్వం కై
ప్రతి రోజూ ఒక వాహనమై ! నాలో సమకాలీనం !

## 27

వర్ణ చిత్రం చూచి 'ఆహా' అనుకుంటూ మరో వైపు వెళ్ళిపోతారు
మెరసిన అనుభవం మనసులో చీకటి గదిలో పడిపోతుంది.

ఎరుపు రేఖ సూటిగా కళ్ళలోకి దిగుతుంది
మనిషిని కాస్త చకితం చేస్తుంది
నలుపు రేఖ సరే సరి ! తన చరిత్రలో
పాత మచ్చల్ని జ్ఞాపకం చేస్తుంది.

తెలుపు రేఖ అమాయకంగా జవాబు దొరకని
ప్రశ్నల బోనులో నిలుపుతుంది
పచ్చని రేఖ మరచిన ఆదర్శాన్ని
నేరుగా కళ్ళముందు ఆడిస్తుంది.

అన్నీ కలిసిన రంగుల రేఖల కలనంతో
ఆకృతి ! అక్కడే కట్టి పడేసేట్టే ఉంది !

ఒకరికి వ్యాపారం గాలిలో కలుస్తుందనో
ఒకరికి అధికార శిఖరం తరిగి పోతుందనో
ఒకరికి సమయం గంగలో కలుస్తుందనో
ఏవో ఆలోచనల్లో అక్కడి నుండి తేలిపోయేరు.

తమ కళ్ళముందు తామే గోల్ అయ్యే ప్రమాదంతో
ఉన్న విలువతో తొలగి పోవడమే కర్తవ్యంగా !
హాల్‌లో గోడకు వ్రేలాడే వర్ణచిత్రం ! ఎదురుగా
అందరినీ ఆకర్షించే జనాలోల రూపం సమకాలీనం.

## 28

ఎవరికి వారు కొత్త నాటకంతో ప్రత్యక్షం
    ఏ కట్‌కూ మార్పుకూ అవకాశం లేని సమకాలీనం !

బీభత్స మినీ సముద్ర దృశ్యంతో నాటకం
    మనిషిలో గుప్తమైన పార్శ్వానికి సూచికగా
నటనలో నిప్పుల పయి ఆకుల్లా నడకలు
    పాత్రల ప్రశ్నలతో పరిణామం పరివర్తనం.

మధ్య మధ్య విరామాలలో అంతరాయాలతో
    ప్రేక్షకుల ప్రజల సావధాన సమావేశాలు
ప్రదర్శన మధ్య నిరసనలో కాలం
    ఒక బండ రాయిలా నిలుస్తుంది.

దీన్ని తొలగించే పనిలో పగిలే రాళ్ళు
    ఎగిరి వచ్చి ఒక్కొక్కరినీ గాయ పరచేను

ఎన్నికల్లో రెక్కలు తెగిన పక్షులు
    వన్నె చిన్నెల అట్ట ముక్కలతో
బుజా లెత్తి ఎగిరి సాహసంతో
    డీ కొని ఆరంభంలోనే సమాప్తి పొందేను.

ఘర్షణలో పతాక సన్నివేశం
    నాటకాన్ని మ్రింగేయనూ వచ్చు
ఇది అసంబద్ధ నాటకం అనే కన్నా !
    ప్రజాస్వామ్య పరిహాసం అంటే సరి !

## 29

ఘర్షణలో భద్రత కయి ఎదకు శాంతి కవచంతో
అణగిన మూలం నుండి స్వేచ్ఛా శాఖలతో
జంతువుల మృగాల చర్యలతో సన్నివేశం
శిక్షణ పొందిన సర్కస్ ను తలపిస్తూంది.

రోజు వారి పనిలో హత్యలు బాగమవుతున్నాయి
వృత్తిలో అంశంగా నేరం బలపడుతూంది
భయం వలలో క్షణాలు చేపల్లా ఎగిరి పడుతున్నాయి
మృత్యువు క్రీడలో బహుమతి గెలు పొందుతుంది.

అవసరానికి లేబుల్ పయి మారిన చిహ్నాలతో
చుట్టూ ప్రపంచం వ్యాపార కళను పొందుతూంది
చేతి సంచిలోనో మనీ పర్సులోనో ఇముడుతూంది.
అమ్మ బడే కొనబడే వస్తువు కాదని తెలుసు ! మనిషి !

అయినా విపణిలో ఆకర్షణ యంత్రంగా పని చేసేను !
రాజ్యం వాగ్దానాల మెట్ల పై పయనిస్తూంది
క్రింది మెట్టు ఎపుడో మట్టిలో కలిసింది
చివరి మెట్టు గగనంలో చుక్కల్లో ఉంది

ఇనుప విహగంలా ఎగిరి మనిషి
రెక్కలతో సూర్యుణ్ణి తిరోహితం చేయాలనే
ప్రశ్నల చివుళ్ళ నుండి జవాబు పుష్పాలతో
భవిష్య సమాజ కల్పనలో సమకాలీనం !

## 30

ఒకరికి పగలు ఎంతో ప్రియం
ఒకరికి రాత్రి ఎంతో ఉపయోగం.
ఉదయ సంధ్య అనుమానం నింపుతుంది
సాయం సంధ్య సందేహం దింపుతుంది.

మినుకు మినుకున చుక్కలు
చరిత్రను రికార్డు చేసే అక్షరాల్లా
సూర్యుని రాకను ఆపడం ఎవరి తరం ?
చంద్రుని రాక ఎవరికి ఇష్టం ఉండదు ?

మాట సందర్భాన్ని బట్టి అర్థవంత మవుతుంది.
హేతువు చర్యను బట్టి ఫలితాన్ని ఇస్తుంది.
ఓటమి గురించి తెలుసు కోవడంలో
విజయానికి దారి సుగమం అవుతూంది
బ్రతుకులో విజయానికి ఎన్ని బాటలో
బాటను ఎన్నుకొనే స్వేచ్ఛలో మనుషులూ !

బ్రతుకు తీగె తెగి శోకం అందుకుంటుంది
శోకం వరసలో కోపం రేగుతుంది

పక్షి నేల కూలి నిరసన నినదిస్తూంది.
నిరసన నుండి సంఘర్షణ మొదలవుతూంది.
మనిషిని ప్రేరేపించే శక్తికి కేంద్రం
గతంలా మౌనంగా ఉండలేదు సమకాలీనం.

## 31

వ్యక్తి నుండి సమాజం నుండి పొందే దేమంటే
మనిషి మనో రూపాన్ని బట్టీ అది దొరకుతుంది
శిఖరాల మధ్య నుండి పైకెగసే ఆత్మ ప్రతిభ
ప్రపంచానికి అమూల్య హృదయ మవుతుంది.

అవసరానికి జేబులో నాణెంతో
విజయం సమయానికి సిద్ధంగా ఉండదు.
సాధారణ బ్రతుక్కి కావలసింది తెలియడానికి
మేధస్సును మథనం చేయనవసరం లేదు.

ఆలోచనలో పచ్చని చెట్టు బ్రతకనీ
చేతల్లో సజీవ నదిని తరలనీ
ఆత్మలో సూర్యుణ్ణి బయట పడనీ
ముఖంలో మాత్రం చంద్రుడు వెలగనీ.

రేపు మరో అవకాశం ఉందనీ
నేటి విజయ ముఖం అదృశ్యం కాదు
ఈ రోజు సంఘర్షణ దాటితే
రేపు జయం సులభం కావడం సహజం.

చేతిలో చిల్లర డబ్బులతో బయలుదేరి
బ్యాగ్‌లో కరెన్సీ నోట్ల కట్టలతో రావాలనే
గెలుపూ ఓటమిలో ఎపుడేది పై చేయో ! తెలీని
రాజకీయ చదరంగం క్రీడలో సమకాలీనం !

## 32

మనిషిలో శక్తి పయి విశ్వాసంతో
మనిషి జీవితం గురించి ఆలోచనతో
ఉన్న యుగంలో బ్రతకడం ఒక విశేషం !
మానవతను గుర్తించే అనుభవ మొక బహుమానం.

పొరలు పొరలుగా చేరి సమయం సమయం
మంచు పర్వతమై పోతూంటే మనశ్శిఖరం
ఇది కరగడాని కెందరు సూర్యులు కావాలో ?
చరిత్రను ప్రవహింప జేయడం సులభం కాదు !

లోపల మొదలైన బిందువు అంతలో
హిమ శిల అయి నిలిచి పోకూడదు
అడుగులతో అవని పయి కదలాలిసిందే
రెక్కలతో విహగమయి ఎగరాలిసిందే !

చేతిలో ఆయుధం భయాన్ని దూరం చేస్తుంది
విప్పిన ఛత్రం భద్రతను దగ్గరకు తెస్తుంది.
తెరచిన పుస్తకం జ్ఞానానికి ద్వారం తెరుస్తుంది
కాగితం పయి కలం కొత్త జగం దింపుతుంది.

కానుకల్లో బహుమతుల్లో కప్పబడిన ముఖం
వెదికే చేతులకు మరొకరి ముఖం దొరకుతుంది
ఏదైనా మనస్సులో సర్దుకొని పోవడమే మిగిలింది
డైరిలో పేజీకి సరిపోని రోజుతో సమకాలీనం !

**33**

ఉదయం పత్రిక ముఖాన తీర్చిన పద పంక్తి
దూసే బాణం పేలే బాంబు తరహాలో ప్రత్యక్షం
ఒకరి చరిత్రను మరొకరు మంట గలపాలనే
ఆ మంటలు చూస్తూ తమ ముఖాలు వెలగాలనే

జెండా గుడ్డ చాటున ముఖంతో
బయటికి చాచిన చేతులతో
మనిషి రూపం ! నిలిచిన గడ నంటుకొనీ
ప్రజాస్వామ్యంలో కార్టూన్ స్వేచ్ఛకు రూపం !

అరాచకాన్ని పూల బుట్టలో నింపి పంచేరు
స్వర్గం గుప్పిట్లో ఉందనీ నరకం విడిచేరు.
జనం పై విసరే మాటలు ! చిల్లర డబ్బుల్లా
అందినంత దూరం అందుతాయి, మిగతావి మట్టిలో.

రోజు కూలీ పనికి బదులు
చేతికి జెండా కర్ర లందుతాయి
కర్రలకు పని కల్పించి
మంటలకు రెక్కలు తొడిగేరు.

జల దాహం బదులు భూ దాహం ప్రబలుతూంది
అంతరాత్మను పాతి పెట్టి పాదుకట్టి
కత్తుల్నీ మంటల్నీ మొలిపించాలనే !
ధన బల జన వినోదంలో సమకాలీనం !

**34**

నేను వెళ్ళే దారిలో పార్క్‌లో బెంచ్ పై కూర్చొనీ
చూపుడు వేలితో పూలను లెక్క పెడుతూంటాడు.
తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని పూర్తిగా మరచీ
చూచే వాళ్ళకి ఏ పనీ లేని వాడికి మల్లే.

నేను వచ్చే దారిలో రోడ్ ప్రక్కన అపుడపుడూ
అక్కడ పరచిన బొమ్మల్ని చేతిలోకి తీసుకొనీ
నిమిరి యథా స్థానంలో మెల్లగా పెడతాడు
అమ్మే ఆసామి గురించి పట్టించు కోకుండా.

నేను చేసే ప్రయాణాల్లో అపుడపుడూ స్టేషన్‌లో
వచ్చి పోయే ప్రయాణికుల్ని తదేకంగా చూస్తూ
రైలు వచ్చి ఆగి పోతూంటే తదేకంగా ఆనందిస్తూ
చూచే వాళ్ళకి ఆప్తుల్ని పంపడానికి వచ్చినట్లుంటుంది.

నేను పోయే దారిలో రోడ్ ప్రక్కనే నడుస్తూ నడుస్తూ
అదే సమయంలో అనుకోకుండా క్రాస్ చేస్తాడు
నేను సడన్ బ్రేక్ వేసి ఆగి కారు స్టార్ట్ చేస్తూంటే
మెరిసే గాజు ముక్క చిరు నవ్వుతో చూస్తాడు.

అతడెవరో ! ఎక్కడెక్కడో ! ఎపుడెపుడో కనిపిస్తాడు
నిరాశను వదలి ఆశకు పీఠం వేసే నాలో
పీఠం పై అపుడపుడూ ఒక బొమ్మలా కనిపిస్తాడు
ఆ బొమ్మకు జీవం పోసి నాలో బ్రతికిస్తుంది సమకాలీనం.

## 35

కొత్తగా మనిషి చిత్రం వేస్తూ ఉంటే
ఎక్కడి నుండో రేఖలు దూకుతూంటాయి
కుప్పలుగా ఆలోచనలు క్యూ లో నిల్చుంటాయి
కాన్వాస్ పై పనిలో ఉన్న నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తూ.

వాస్తవంగా ఆకృతికి రేఖ మొదలు పెట్టగానే
నలు దిశల నుండి వివిధ వర్ణాలు చేరతాయి
వర్ణ కిరణాల ఆరాటంలో క్షణాలు దొర్లి పోతాయి
ప్రతి బిందువులో ఆకాశం తొంగి చూస్తుంది.

విప్పారిన కను రెప్పలు నిలపాలనుకునే సరికి
ఆకాశమూ సముద్రమూ చెరొక వైపు నిలుస్తాయి
చేతులు గీసేందుకు మొదలు పెట్టగానే
చెట్ల శాఖలు ముందుకు సాగి ఆవరిస్తాయి.

అడుగులు తిన్నగా నిలపాలనుకునే సరికి
విశాలావని అరచేయిని చాస్తుంది
అశ్వం పరుగున వచ్చి ముందు నిలుస్తుంది
ప్రవాహం గంతు లేసి ముందు కదలుతుంది.

ముఖం వేసేందుకు బిందువు మొదలు కాగానే
సూర్యుడూ చంద్రుడూ చెరొక వైపు !
బ్రష్ ప్రక్కన పెట్టి ! ప్లాస్టిక్ బొమ్మతో సరి అనుకుంటే
ఆగని అలజడితో సృజన ప్రపంచం ! నాలో సమకాలీనం.

**36**

సహజ శక్తులతో పరిణామం చెందీ
        మనుషుల కోర్కెలతో పరిణాహం చెందీ
జననం మొదలు ప్రవాహ జీవితంలో
        క్రియా జడం ఎక్కడుంది ?
మానవ చరిత్రలో చిరంజీవ రూపంలో
        శిలా ప్రకృతి మయం ఎక్కడుంది ?

నిలిచిన ఆలోచనలో ఉంది క్రియాజడం
        కదలని గతంలో ఉంది శిలామయం
చేతన వికసించే చేతస్సుకు
        నిద్రించే క్షణం ఎక్కడుంది ?

ఈదే ప్రాణిలో మనిషిలో క్రియా శక్తి
        తేలే నావలో చలన శక్తి !
అవతలి గట్టుకు చేరే ఉపాయం !
        రెక్కలతో ఎగిరే విహగానికి సాధ్యం !

ఎందరో ప్రవాహం ప్రక్కనే నడుస్తూ పోయేరు
        ఎందరో ఒడ్డున నిలిచే ఉండిపోయేరు
భయానికీ నిరాశకూ తావులేని జీవితంలో
        ప్రవాహం ఆగదు, మనస్సు నిద్రించదు.

సమాజ చేతనతో చిరంజీవ భావనతో
        మానవ వికాస గతిలో నాలో సమకాలీనం !

**37**

గ్రీష్మంలో భూమికి పచ్చని ముఖం పై ఆశ
    శ్రమలో దేహానికి ఛాయా సమయం పై ఆశ
చీకటిలో గగనం చంద్ర బింబం కోరుతుంది
    ఇంటి ముందు ద్వారం వెలుగు దీపం కోరుతుంది.

అమావాస్య లేని పూర్ణిమ కై
    వాడి పోని రాలి పోని పూవు కై
మనసులో కోరిక ! తీరేందుకు
    టేబిల్ పయి అందమయిన ప్లాస్టిక్ పుష్పం.

వియత్నాం నేలపై నెత్తురు
    కన్నీళ్ళతో తుడవ బడింది
ఇరాక్ భూమి పయి శరీరాలు
    అగ్నికి ఆహుతి అవుతున్నాయి.

ద్వేషం ఆహారంగా మోసం సాధనంగా
    వైరం ఆహార్యంగా హింస సంవర్తనగా
కలుషితమయి జీవితం కోరుతూంది
    ఎడారిలో నీటి ఊటలా అంతరంగ రూపం !

రాజనీతిలో స్వార్థం సన్మానం పొందుతూంది
    తల పై బల్బుతో చీకటి కీర్తి శిఖరం చేరుతూంది
మనసుకు తప్పని నైతిక ఛాదనం
    చినిగి పోయి మాసి పోయి మలినమై సమకాలీనంలో.

## 38

ఒక తల తెగి కాళ్ళు కూలి పోతే
 సంఘంలో ఆదర్శం వెనక్కి నడవదు
శాంతి చిరునామాతో మానవత
 మనిషి మనిషినీ పలకరిస్తూ పోతుంది.

ఎదురుగా నిలబడి యుద్ధం చేసేదెవరు ?
 పై నుండో చాటు నుండో జనం బుజాలపై నుండో
ఆయుధ చలనంతో విజయ రథం ఎక్కాలనే !
 మరణమైతే వీర ఫలకంపై అవతరించాలనే.

కొమ్మను కొట్టేస్తే చెట్టు అంతం కాదు
 చెట్టును నరికేస్తే అరణ్యం అంతరించదు
వ్యక్తిని తొలగిస్తే ఆదర్శం అదృశ్యం కాదు
 వ్యక్తిత్వ ప్రకాశంతోనే సమాజానికి అస్తిత్వం.

ఆలోచనకు ఆలోచన ఎదురవుతూంది
 చర్యకు ప్రతి చర్య ప్రబల మవుతూంది
మానవతను కొలిచే ప్రమాణం
 ఏ సూక్తిలో శాసనంలో చట్టంలో దొరకదు.

రణ క్రియను తప్ప స్నేహం కోరని మనసుకు
 ముఖాన చిరునవ్వు పూవు శాంతికి చిహ్నం కాదు
వినిపించుకోక పోయినా గాలి చెబుతుంది చెవిలో
 దేశ దేశాలు తిరుగుతూ విశ్వ ప్రేమను జ్ఞాపకం చేస్తుంది.

## 39

ప్రాణం ఎగిరి పోతుంది క్షణంలో
దేహాన్ని భూమి పయి వదిలేసి
ఆలోచన కదలి పోతుంది అప్పటి కపుడు
బింబాన్ని మనసులో దించేస్తూ.

మనిషి మనిషి కొక న్యాయం తో
సందర్భాని కొక వ్యాఖ్యానంతో
ప్రజాస్వామ్యం బుజాలపై నీలి శాలువాతో
అమానుషానికి అగ్ర తాంబూలం లభిస్తూంది.

మెడకు ముసుగుతో బిగించే ఉరి త్రాడు
ఎదకు సూటిగా దూసే మారణాయుధం
రెండూ నేటికీ ఆటవిక భావం వీడని
క్రూర మనో మృగ చర్యల రూపాలే.

ప్రాణం తీసిన నేరానికి ప్రాణం తీయడం
సంస్కరణ చరిత్రలో చూడకూడని దృశ్యం
రాజనీతి శూన్యంతో నేతల్లో
మానవీయ ద్వారం మూతబడుతూంది.

సంస్కారం స్పందనతో మానవతా సౌందర్యం
మనిషి మనిషికీ అమృత శక్తి నందిస్తుంది
చేతులు తెగిన విధ్వంస వనంలోను
చెట్టు నుండి చెట్టుకు నెమలి ఎగురుతుంది.

**40**

తల్లి గర్భం నుండి బయటికి రాగానే
 శిశువును తనదిగా భావిస్తుంది భూమి.
పారాడే స్థితి నుండి పెరుగుతూ బంధం
 దశ దశలో శాఖలుగా విస్తరిస్తుంది.

భౌతిక రేఖలతో దిద్ద బడే రూపానికి
 సమాజ సంబంధం శక్తిని సమకూరుస్తుంది.

ఆకలితో ఆహారం కోరికలూ అవసరాలు
 సమాజ భూమికలకు హేతువులయ్యేను
భౌతికానికి సమాంతరంగా మానసికం
 మనిషిలో మరో మనిషికి శ్రీకారం చుట్టేను.

పోరాడే నడచే పరుగెత్తే అడుగులకు
 జడమూ ప్రాణీ యంత్రం అవసరమై
మనిషికి మనిషీ ఒక వాహనమై
 కథ నడచిన చరిత్ర ఉంది.

అడుగు క్రింద మనిషి అణగి కలగి
 తనపై మనిషిని కాదంటే ! బరువునూ తోసేస్తే !
ప్రమాదం ! న్యాయం కయి ఆరాటం !
 విమోచన కై పోరాటం ! పరివర్తన దిశలో

అడుగు కింది నుండి స్వేచ్ఛా శిఖరానికి పయనంలో
 జడత వదలి నిరంతరం చేతనతతో సమకాలీనం.

## 41

కొందరు మానవతను కిరీటంగా ధరిస్తారు
కొందరు మానవతను హారంగా ధరిస్తారు
కొందరు మానవతను కంకణంగా ధరిస్తారు
ఎందరికో తమలో ప్రజ్ఞకు ప్రయోజన రూపం !

కొందరు మానవతను రవి కిరణంలా వదలుతారు
కొందరు మానవతను శశి కిరణంలా వదలుతారు
కొందరు మానవతను పద్మంలా సమర్పిస్తారు
కొందరికి తమలో ప్రేమకు ప్రకాశన రూపం !

కొందరు మానవతను బ్యానర్ అక్షరాల్లో అలరిస్తారు
కొందరు మానవతను స్లోగన్ మాటల్లో నినదిస్తారు
కొందరు మానవతను మనీ పర్సులో దాచేస్తారు
ఏదైనా తమలో ఎగిరే పావురమనీ తెలుసు !

స్వంతం చేసుకోబోయేసరికి దూరంగా ఎగురుతుంది
వర్ణాలకూ వర్గాలకూ అతీతమైన పావురం
నీలో నాలో అందరిలో మనోగగనం నుండి
భూమికి దిగే అమూల్యం ! నీ కై నాకై అందరి కై.

కలహాల కోలాహల పంక్తుల్లో నుండి మానవత
శిశువు ముఖంలో భవిష్యత్తు ఆహ్వానంలా
కవి సృజనలో వర్తమాన స్వాగతం తో
వచ్చి వాలుతుంది హృదయంలో ! నిర్భయంగా.

## 42

అమృత ఫలం ముక్కున కరచుకోనీ
    అమృత కలశం కాళ్ళలో అదముకొనీ
బహు దూరం నుండి ఎగిరి పక్షి
    ప్రియమయిన బహుమానంగా వస్తుంది.

జలధిలా నిలిచిన దుఃఖం పై నుండి
    కొండలా నిలచిన నిరాశ పై నుండి
గుండెకు హత్తిన గులాబి పుష్పంతో
    కళ్ళలో ఒలికే శశి కిరణాలతో
చరణాల నుండి సుధా స్యందనంతో
    వస్తుంది బహు ప్రియంగా ముచ్చటిస్తుంది.

నిద్రలో రెక్కలు ముడుచుకొని నా వెనకే ఉంటుంది
    మెలకువతో ముందుకు వచ్చి వెలుగుతుంది.

ఏ తరువో నదియో పూవో మరేదో కావాలనీ
    కల్పనలో అనిపించడం మనిషి మతికి సహజమే.
మనిషి మనిషిగా బ్రతకడం లోనే అందం
    మనిషి మనసుతో వెలగడం లోనే సార్థం.

చేతిలో కాగితంలా రెపరెపలాడుతూ
    విప్పారిన రెక్కలతో అక్షరాల చలనంతో
బహుదూరం నుండి వస్తుంది ! బహులోకా లెగురుతూ
    పక్షి లేంది మనసు లేదు ! నాలో కవిత లేదు !

## 43

మనిషీ సమాజం – సమాజానికొక చరిత్ర
        చరిత్రలో వ్యక్తీ – వ్యక్తి కొక జీవితం
బిందువు బిందువునూ కలిపే శక్తులతో
        సమకాలీనం, తెలియని గతులతో పాత్రలు !

వ్యూహంలో సీల ఊడి ఆగే రథ చక్రం
        వాగ్దానం అణగి అంతరాత్మ సంవేదన
రహస్య ఛత్రం క్రింద నడచే అధికారం
        నెత్తురు నేలపై జారి పడే మానవత !

సర్కస్ సినిమా స్వప్నం ఏదో మూలంగా
        మనిషిలో విడుదలయ్యే జంతువులెన్నో !
విడుదలయిన వాటిని కట్టేసేదీ మనిషే !
        మనిషిలో మనో రహస్యం ఎప్పటికీ తెలియనిదే !

మనిషిలో మానవత స్వప్నం అయితే
        మనిషికి తనలో విజయంతో పని లేనట్లే !
చరిత్రలో రణ తంత్రం అనివార్యం అయితే
        మనిషికి తనలో ఉషస్సు అదృష్ట రూపమే !

రణ రాగానికి స్వరమై కదలీ
        చక్ర భ్రమణంలో దిశ కోల్పోయింది
కురిసే మంచులో సంకోచంతో
        ఉషస్సుకై ఎదురు చూస్తుంది ! సమకాలీనం.

## 44

దూసిన కత్తి చివర మొన పయి
    వ్రేలాడే పూల దండలా స్వేచ్ఛ !
ఎపుడు నేలపై జారేదీ తెలీకుండా
    ఒక వైపు ఉత్సాహంతో మరో వైపు భయంతో

స్వార్థంలో స్వేచ్ఛ, బాధ్యత లేని స్వేచ్ఛలో
    ముఖం పయి అందమైన లేబుల్‌తో !
ప్రతి వ్యక్తీ తనలో రాగాన్ని బట్టి
    సమాజ గతుల స్వరాలను మార్చాలనే !

అరిగించే గంధపు చెక్కలా
    వెలిగించే కర్పూర కళికలా
స్వేచ్ఛ ! అనుభవ చేతన యై
    నవ సృజనకు ప్రేరణ యై.

స్వేచ్ఛా యానంలో చేరని దిశ లేదు
    దిశ దిశలో నవ దృశ్యం ! విజయ గాథ విప్పుతూ
బ్రతుకుతుంది నిండుగా బ్రతికిస్తుంది
    బ్రతుకునూ ఇస్తుంది, ప్రజాస్వామ్య హృదయం.

ఈవాళ్టి అశాంతి సందర్భం బలవంతంగా
    రేపటి రణానికి తెరచిన కవాటం కారాదు
ఈవాళ్టి మానవతా హననంతో సమకాలీనం
    రేపటి శాంతి ముఖానికి ప్రమాద చిహ్నం కారాదు.

**45**

ఎక్కడో ఏ దేశానో ఎగసిన మంటలు
ఇక్కడున్న నాలో అల్లుకునేను
ఏ నేలనో దూరాన నలిగిన ప్రాణం
ఇక్కడున్న నాలో విల విలలాడేను.

ఎక్కడో దూరాన మ్రోగే ఆయుధ భాష
ఇక్కడున్న నాలో బంధువల్ని తలపించేను
మంచు తెర వెనక నున్న మరణ రహస్యం
ఇక్కడున్న నాలో సచిత్రంగా ప్రకాశించేను.

ఎక్కడో స్తంభించిన విషాదం నుండి ఆర్త స్వరం
ఇక్కడున్న నాలో క్షిపణిలా దూసేను
సమరానికి పగలు రాత్రి భేదం లేదు
మృత్యువుకు మిత్ర శత్రు పక్షం లేదు.

మానవతా మందారంలా కదలే మనిషి
ముఖంలో అగ్ని తిష్ఠ వేసినట్లుంది
నవ్వులో వెండి తీగ ధగధగలాడుతూంది
మాటలో పగిలిన గాజు ముక్క చెదరి పడుతూంది.

ఎవరి లోని ఆయుధ రూపమూ ఒకే సారి బయట పడదు
వర్తమాన పీడనలో ఎవరెట్లా మారేదీ తెలీదు
బుట్టలో భద్రంగా నిలిపిన పూలగుత్తిలా
ఎదురు వచ్చే బాంబు మృగంతో సమకాలీనం !

## 46

స్వరాజ్యం వచ్చినా ప్రజాస్వామ్యం బ్రతికినా
 మనిషి మనో జగంలో స్వేచ్ఛా కిరణంతోనే
జీవితంలో నిజం శిఖరానికి చేరే ముందు
 ఏ లోయ లోనో జారి పడే ప్రమాదం ఉంది.

ఒకరి తలపై నుండి మరొకరు ఎదగాలనే
 ఒకరి ముఖాన్ని మరొకరు కప్పేయాలనే
ఎక్కడి నుండో యముడు రా నక్కర లేదు
 ప్రక్కనున్న ప్రయాణికుడే యముడవుతూంటే !

కిరీటం తొలగిస్తే మరొకరు ధరిస్తారేమో నని
 దానితోనే నిదురించే సంశయ జీవులూ
ఎవరి నిరీక్షణలో వారు సమయం గడిపేరు
 మంచులో ఎండలో వానలో జాడలు వెదకేరు.

దూకే జింక కళ్ళ కోసం పగలు ఎదురు చూస్తుంది
 మెరసే పులి కళ్ళ కోసం రాత్రి ఎదురు చూస్తుంది
ఉదయ సాయం సంధ్యల్లో నీడలు కలుస్తాయి
 మౌన బింబ చిత్రాలుగా విడిపోతాయి.

వనిలో గుహలో జనపద నాగర జీవన వీథుల్లో
 మారణ పరిణామం ఒకటే ! స్వర చలనం వేరు !
ధూళి నుండి టవర్ లా కొత్త యుగం ! ఆర్కెస్ట్రా రూపం
 జ్ఞాపకాల గతమూ ఆశల భవిష్యత్తు మధ్య సమకాలీనం !

**47**

అంతరాత్మను అణచి పాతాళానికి త్రోసి
రాజకీయం మానవతను మాయం చేస్తూంది
ఇపుడే చక్రమూ పని చేసేట్టు లేదు
అది పని చేసే స్థితి చేయి దాటి పోయింది.

సింహం ఎంత అందంగా ఉందనుకున్నా
వన్య ప్రాణి అని ఎంత జాలి పడినా
అది ఉండే స్థానం ! అడవి లోనో ! జూ లోనో !

మనుషుల్ని సింహాలుగా మార్చి
సమాజం లోకి వదలడం ఒక రాజకీయం
మనిషిలో శక్తికి కేంద్రం మానవీయం
రాజకీయం నడిపితేనే అందం !

హితం కోరే వ్యక్తిలో కవి మాటలో
మనిషి కావలసింది ఎదురవుతుంది
మనిషి పోగొట్టు కుంది దొరకుతుంది.

ఏ ఋతువుకూ భయం లేని హృదయంలో
గులాబి పూసి ఆహ్వానిస్తుంది
జైలు కట కటాల్ని కన్నీరు మెత్త బరిస్తే
స్వేచ్ఛ జైలునే మనసు నుండి తొలగిస్తుంది.

మెలికల తీగెలతో అందమయిన ముగ్గులా
మాటల మలుపులతో కవితయై సమకాలీనం !

## 48

మొన్న కిరీటంలో నవ రత్నాలు
ఒక దానితో మరొకటి పోటీ పడ్డాయి.
నిన్న జాతుల వర్ణాల రూపాలు
ఒక దాని నొకటి రూపు మాప జూచాయి.

నేడు సంఘంలో ఆలోచనా శిఖలు
ఒక దాని నొకటి ఆర్ప జూస్తున్నాయి
శాంతి ప్రసక్తి లేని పయనంలో సమయం
ఎట్లా ఉండేదీ అనుమానం అక్కర లేదు.

వీథిలో పొగలో ఉక్కిరి బిక్కిర అయిపోయే బదులు
పొగ చిమ్మే వాహనాన్ని ఆపడమే మేలులా ఉంది
విసరిన రాయికి అద్దంలా బ్రద్దలై ముక్కలైన
మనస్సులో ప్రతి భాగం ఆయుధం అవజూస్తూంది.

సింహాసనాని కిరువైపుల సాల భంజికల్లా
మట్టి అంటని పాదాలతో దేవతలై పాలకులు !
బుజాల్ని మారుస్తూ శవాల్ని మోయడానికి సిద్ధమై
చేతులు చాచి మానవతను కాపాడలేక పోతున్నారు.

మనుషులతో యుద్ధం చేస్తూ చేస్తూనే బ్రతుకులో
అసలు మనిషిని మరచి నీడతో యుద్ధం చేస్తున్నారు
నూనె నెత్తురూ కన్నీరూ కలిసి ప్రవహించే ఇసుక నేలపై
నీటికై నినదించే మనుషుల నీడలతో సమకాలీనం !

**49**

మస్తిష్కంలో ఆదర్శ శిఖరంతో పయి ప్రజాస్వామ్య పతాక
బుజాన వ్రేలాడే 'రైఫిల్'తో పిడికిలితో బాంబు !
ఇనుప రెక్కలతో ఎగురుతూంది మనస్సు
మనిషి ఎత్తు ఎగిరీ ఇనుప ముక్కుతో పొడుస్తూంది.

మస్తిష్కానికీ శరీరానికీ మధ్య వంతెన లేనట్లుంది
ఉన్నా ఉపయోగంలో ఉన్నట్లు లేదు
ఏవో కొన్ని క్షణాల విరామం తప్ప
ఏ సమయమూ రణ చలనం ఆగేట్లు లేదు.

మృగ తృష్ణలో ఒక్కొక్కరికి ఒక్కొక వస్తువు కనిపిస్తూంది
దాహార్తిలో ఒకరికి నీరూ ! ధనార్తిలో ఒకరికి పెట్రోలూ !

ఒయాసిస్‌లో కన్నీరు నిండి నట్లుంది
ఎడారి అంతా బాధ పరచి నట్లుంది.
గొడ్డలి దెబ్బకు ఖర్జూర వృక్షం ఒరిగి పోయి
నేలపై నీడలో కలిసి పోతూంది.

విషాదం పంచబడాలనే ఉంటుంది, అందరికీ
ఆనందం స్వంతం కావాలనీ ఉంటుంది, ఎవరికయినా
అద్దం ముందు నిలుచుంటే, కళ్ళకు ఏం కనిపిస్తుంది?
కనిపించని హృదయానికి ముందున్న శరీరం తప్ప !

రవి మిహిర కీర్తిని కప్పేస్తూ రాలే
బూడిద రూపంతో ఎదురుపడుతూంది సమకాలీనం.

## 50

మానవ హక్కుల కయి పోరాటం స్వేచ్ఛా యుగంలో
జన చేతనతో పరివర్తనలో నాలో సమకాలీనం
ప్రతి వ్యక్తీ తనకు తానొక అనివార్యమైన ఆయుధమనీ
అమరత్వం కోరని త్యాగ యోధునిలా నడిచేను.

జల పటలం పయి పవనం గీసిన చిత్రాల్లా
దృశ్యం వెనకనే దృశ్యం ! నిరంతరం !
ఆవేశం హద్దు దాటిన సన్నివేశంలో
పవన పటం పయి గీసిన అగ్ని చిత్రం కదలేను.

ప్రతి వ్యక్తీ తనకు తాను అనివార్యమైన ఆయుధమనీ
అమరత్వం కోరని త్యాగ యోధునిలా నడిచేను.

దారిలో అనుకోకుండా పద్మ వ్యూహంలో
చిక్కిన సామాన్యుని పయి
మౌనం వీడిన ఆయుధం ! చకితంగా
ధ్వని చిత్రాల్ని విడుదల చేసేను.

మరునాడు ఉదయం పత్రికలో వార్తా శీర్షిక
గాయపడిన ఆ రోజుకు అంబులెన్స్‌లా ఉంది.
ప్రతి అక్షరం ఎక్కుపెట్టిన ఆయుధ శిఖరంలా
గుండెల్లో భయం నీడల్ని వదలుతూంది.

ఇంతలో మెల్లగా నిశ్శబ్దంగా వచ్చి
చేతిలో పత్రిక లాగుతూ మురిపించే పాప
'నవ్య' ముఖంలో కిరణం ఒక బహుమానం
అశాంతిని మరపించే శాంతి ఆత్మబంధువు !

స్వేచ్ఛా కవిత్వం

రెండవ భాగం - 8

# అభినవ యానం

ముక్తక కావ్యం

మాదిరాజు రంగారావు

**2007**

రసధుని సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 500 028

# అభినవ యానం - ప్రవేశిక

'అభినవ యానం' ముక్తక కావ్యం. ఇది 50 భాగాలు. ఏ భాగానికది అందులోనూ ఏ విభాగానికది స్వయం సంపూర్ణమైన అనుభవ గుణంతో కావ్యం మొత్తం మీద ఒక ప్రయాణ రూపాన్ని కొత్త కోణంలో భావింపజేస్తూంది. ఇది బాహ్యామైందీ, అంతరమైందీగానూ దృష్టికి వస్తుంది. భౌతిక మానసిక స్థాయిల్లో సాగే జీవిత రామణీయ కతనూ చింతనా గభీరతనూ కలిగింది. ఇందులో ఒక స్థాయిలో సామాజికమైన అనుభవాలూ, సంబంధాలూ సూత్రప్రాయంగా కనిపిస్తాయి.

వ్యక్తి మొదలుకొని సమాజం ఆ తరువాత ప్రపంచం వరకూ విస్తరించిన వలయాలతో, కవిత్వంలో వస్తువు వైశాల్యాన్ని పొందింది. మానవ జీవితంలో వికాస గతులూ చర్యలూ ప్రతిచర్యలూ వ్యవహార రూపాలు గోచరిస్తాయి. (1) లౌకికంలో జీవనగమనం (2) మానసికంలో మనస్తత్వపరమైన స్థితి విశేషాలూ (3) దార్శనికంలో తాత్త్విక స్పర్శ తో మూడు శ్రేణుల్లో అభినవయానం ఆవిష్కృతమయింది. కావ్యంలో కీలకమైన భావ కేంద్రం ప్రయాణ రూపం. ఎప్పటికప్పుడు అనుభవంలో, ఆలోచనలో ఆవిష్కరణలో కొత్తదనాన్ని కోరే మనోరూపం "అభినవం"గా రూపొందింది.

సమాజంలో ఈనాడు కన్పించే విధ్వంసకర రూపాల ప్రభావాన్ని చిత్రిస్తూనే, నిర్మాణపరమైన అవసరమూ సూచితమయింది. ఈ సందర్భంలో మానవ హక్కులతో పాటు బాధ్యతలూ, కర్తవ్యాలూ అనివార్యాలుగా అవగతికి వస్తాయి. (1) బాల్యంలో పెరిగిన వాతావరణం (2) జీవించే సమాజ స్వరూపం - సంబంధాలూ (3) భౌతికస్థితీ - మనో రూపం (4) చారిత్రక-రాజకీయ సామాజిక సాంస్కృతిక నేపథ్యం తో కావ్యరేఖలు తీర్చబడినాయి. భౌతికమైన సామాజిక వాస్తవికతతో పాటు కాల్పనిక మయిన కామనీయకత అనుభూతమవుతుంది. దేనికది పూర్ణతా రూపం కలిగిన ముక్తక లక్షణంతో ముక్తక కావ్యంగా లక్షితమయింది. స్వేచ్ఛాకవిత్వంలో ఈ కృతి వస్తు వైవిధ్యాన్ని ప్రదర్శిస్తుంది. భావనా విస్తృతిని భావింపజేస్తుంది. ఆవిష్కారంలో ప్రత్యేకతనూ కలిగింది. ఈ అంశాలు ప్రజా స్వామ్యంలో స్వేచ్ఛాకవిత్వంలో సృజన రూపం లోని సీమల్లేని పరిమితుల్లేని నవంనవమైన కవితాశక్తిని గురించి ఆలోచింపజేస్తాయి. హృదయ మేఘం, సమకాలీనం, అభినవయానం కృతి త్రయం ఒక కోవకు చెందినవి.

1

అణువు నుండి మహీయానికి
బిందువు బిందువుతో అనుభవ యానం
కాల్పనిక చిత్రం నుండి సమాజ దర్శనానికి
అదృశ్య శక్తులతో దృశ్యమాన పరిణామం
స్వార్థంతో ద్వేషంతో హననం విధ్వంసం మధ్య
సృజన పథంలో నిరంతర నిర్మాణ సమావిష్కారం.

అడుగులు తడబడినా వాహనం నిలిచినా
ఉల్కలు ఎదురయినా అగ్ని పర్వతం బద్దలయినా
దారిలో ప్రవాహం ఆగ్రహం ప్రకటించినా
సంకల్ప పథంలో మనిషి నిరంతర యానం
ఒక దారి నుండి మరో దారికి
ఒక ఊరు నుండి మరో ఊరుకు.

ప్రతి వికాస దశలో పరివర్తన రూపం
ఇతిహాసంలో ఆరోహణ సోపానం
ఊహలో అపాయ భయ సాహస రణాలతో
నాగరక స్థాయి లోనూ ఆటవిక చేష్టలు
మనిషి విశ్వ రూపంలో లౌకికం ఒక భాగం
అభిమతి లో ఆదర్శం విజయానికి లక్ష్యం.

చైతన్యం పై సోకిన మసి నుసి తొలగీ
భయం తొడిగిన ఇనుప కంచుకం వదలీ
అవనితో సురుచిర బంధం స్థిరమై నవ నవమై
ఆయువు ఉన్నంత వరకూ శాంతికి చిర యత్నం!
అంతరంగ ప్రేరణతో సమాజ పథ చింతనతో
అభినవ యానం నాలో ఆరోహణతో.

## 2

అభినవ యానం నాలో ఆరోహణ గతిలో
　　అక్షర పద చలనంతో మానవీయ వాస్తవం
ఈ యుగ రూపంతో బుజం బుజం కలిసీ
　　బాధల గాథలు సోపాన శ్రేణులుగా
చలనంలో ఆగని చేతన తో పయనం
　　గమ్యం లేని పథం లేదు విశాలావనిపై.

దిశ నుండి మరో దిశకు ఊగే
　　అనల శిఖల పంజర రూపం నుండి
మనిషిని ముక్తం చేసే
　　స్వేచ్ఛకు దారులు చూపే
ఉదార కరుణ మానవతా సమ భావనతో
　　ఏ రోజు తప్పదు విజయానికి పరీక్ష.

దారిలో ఒక సమయం నిరీక్షణలో
　　సజలమై సర్వం హరిత వనం కావచ్చు
అనలమై ఎదురుగా ఆటంక పటం కావచ్చు
　　ఎవరో అదిలిస్తే నడవదు కాలం
ఎవరో కదిలిస్తే తరలదు ప్రవాహం
　　మనిషినీ మనిషినీ కలుపుతుంది పరిమళం.

సుఖమూ విషాదమూ భేదం లేని చరిత్రలో
　　ధరిత్రి పయి దారిలో శాంతి సమర చిహ్నాలు
సమస్యల కంటకాలు రహించే జీవితంలో
　　గులాబి హృదయం కయి కోరిక సహజం
సమాజ పరివర్తనలో సహ జీవన సంస్కృతిలో
　　నవ యుగ చరణంలో తప్పదు కిర్మీరం.

## 3

విధ్వంసం అనివార్యమేమీ కాదు
    నిర్మాణం అందరికీ మొదటి కర్తవ్యం
చర్చలో 'మిధ్యా' బలం ఋజువు కావచ్చు
    కాని సాధారణ జీవన చరణంలో ప్రమాదం
సంధ్యలో సరిహద్దుల్ని వివేకం గుర్తిస్తుంది
    అపాయ భయాల ముడుల్ని విడదీస్తుంది.

పేదరికం అవమానం న్యూనత నిరాశలో
    ఎక్కడ మునిగి ఎక్కడ తేలేదీ తెలియదు
ఒక పెన్ కోనేంత సులభంగా
    విపణిలో గన్ దొరకడం
శవ పేటికల సంఖ్యను పెంచడమే
    లోపలి అగ్నికి, చిమ్మే అవకాశం ఇవ్వడమే.

పాలనలో బాధ్యత తప్పిన శ్రేణులతో
    కల్పనలో అమరిన రక్షణ కవచంతో
నర హింసకు నియతి లేని స్వేచ్ఛతో
    మనో మృగం అదుపు తప్పడం సహజం
మనిషిని కార్నర్ కు నెట్టేసే సందర్భం
    సమాజ సుందరతకు తీరని అభిశాపం.

అశాంతి వెనక అరణ్య మృగ సంచారం
    వాటి అడుగుల క్రింద నలిగే మానవీయం
ఆయుధ సంస్కృతిలో క్రోధం అసహనం
    జీవన యంత్రానికి చక్రాలవుతున్నాయి
మూడు పూలు ఆరు కాయలుగా విధ్వంసం
    ప్రజాస్వామ్యానికి అపాయ సూచి అవుతూంది.

# 4

ఆవేశంలో ఇరు చేతుల్లో నుండి ప్రేలే మృత్యువు
హంతకుణ్ణి తన వెంట ఈడ్చుకొని పోతూంది
రాయి తోనో ఇనుముతోనో చేసినట్లుంది హృదయం
లో నుండి ప్రభావం పిడుగులా దూకుతూంది
వ్యక్తి స్వేచ్ఛ గాయపడిన విషాదంలో
జీవించే హక్కు ఆయుధ వశమవుతూంది.

గుహ నుండో గుడిసె నుండో పేవ్‌మెంట్ నుండో
క్రుంగిన మతి మందు పాతర అవుతూంది
భాషల్ని జాతుల్ని దేశాల్నీ అలల్లా
కలిపే విశ్వ బంధం తెగి పోతూంది
వర్తమాన దృశ్యం ముక్కలు ముక్కలయి
ప్రతి ముక్కలో మాడిన ముఖం వ్రేలాడుతూంది.

మృత్యువు వేసే అడుగు ముందు నిశ్శబ్దం
శ్వాసను ఆపేయ చూస్తూంది
నిశ్శబ్దంలో నిలిచిన జడ రూపం
ఊహను నిలిపేయ చూస్తూంది
రాత్రి మల్లె పొదలో చుట్టు కున్న సర్పంలా
భయం చీకటిలో శాంతిని వహిస్తూంది.

మనిషి వెనక భయం నీడ
మృత్యువు కేరాఫ్ అడ్రస్‌లా
హంతకుని మనస్తత్వ విశ్లేషణం అవసరమే కాని
ఇపుడెదుర్కోవలసిందీ, తక్షణ కర్తవ్యం
సమాజంలో విలువల్ని ధ్వంసం చేసే
ఉన్మదిష్ణువులు విసరే ఛాలెంజ్.

# 5

విశ్వం లయ తప్పితే
      విలయ వికల మవుతుంది
మనిషి మతి తప్పితే
      ఉన్మత్త శిఖరమయ్యేను
సమాజ క్షేత్రంలో అరాజక తాండవం!
      అన్నీ తెలిసే దారిలో కత్తులు నాటేరు.

కత్తులపై అడుగులతో గాయాలయిన పాదాలు
      బాధా స్వర గళాలతో వాలే శరీరాలు
అరాజకం హింసతో తెరవబడిన వినాశన ద్వారాలు!
      ఆయుధం ఎప్పటికీ అమాయకత నటించలేదు.
నిశీథి శిఖరం పయి బింబ మెంత ప్రియమయినా
      ఎప్పటికీ అంబరాన్ని అలంకరించి ఉండలేదు!

ఎవరికీ ఎవరితో శత్రుతలో పోటీతో పనిలేదు
      మనుషులు మర బొమ్మలుగా మారే అవసరమూ లేదు
బొమ్మలు ప్రదర్శనలో బాగా రాణిస్తాయి
      పిల్లల ఆటకూ ఎంతగానో ఉపకరిస్తాయి
బ్రతుకులో పాత్రలుగా ప్రవేశిస్తేనే ప్రమాదం
      ప్రమాద సమయం ఎవరికీ ప్రమోదం కాదు.

శ్రమ బిందువు ఎరగని మనో రూపం
      అంతలో గాజు బొమ్మలా మారుతుంది
ఫలాన్ని పొందే వరకూ పడే పాట్లు
      కాలానికి చెమటలు పట్టిస్తాయి
ఎవరి నుండి ఏమి తెలిసినా తెలియక పోయినా
      జారే కన్నీటి చుక్కలో రహస్యం మాత్రం తెలుస్తుంది.

## 6

ఒక్కొక పూపు పూవును ఆస్వాదిస్తూ
ఒక్కొక ఫల ఫలాన్ని ఆరగిస్తూ
పయనించే నాలో రహస్యం వెనక రహస్యం
అనుభవాల రేకులతో మనః పద్మం
మధ్య నున్న దూరాల్ని కలుపుతుంది ఆశారూపం
జీవితాన్ని పాలించే ప్రభు శక్తి వహిస్తుంది.

భూచర జలచర ఖేచర రూపాల్ని తలపిస్తూ
దారిలో ఎదురయ్యే లోక తంత్ర శక్తులు
భౌతిక మానస తాత్త్విక వివిధ భావ శోభతో
లోపలి ఆలోచనకు ఆకృతులిస్తాయి
చెదరిన జాడలతో పాత్రల సారూప్యంతో ఇతిహాసం
వర్తమాన వేదికపై పునర్భవం పొందుతూంది.

చుట్టూ గోడల బుజాలపై జైలు
చుట్టూ చువ్వల చేతులతో పంజరం
లోపలి వారికి భద్రత అవసర మనుకున్నా
బయటి నుండి చూస్తే స్వేచ్ఛకు బంధనమే.
కాలానికి వృద్ధత లేదు, మనసుకు జడత లేదు
హక్కులు పాత బడవు, బాధ్యత అంతం కాదు.

సంజ్ఞలతో పనులు వెళ్ళ దీసుకునే వర్గాలకు
అక్షర మాలను వహించే స్థితి ఇంకా రాలేదు
చరిత్ర కొందరికి నదిలో నావ కావచ్చు
సమాజ తీరం చేరే అదృష్టం రావచ్చు
గమ్యం కయి ఆలోచన మనిషిలో తీగెలా
లోయను దాటే సంకల్పంలో "రోప్‌వే".

7

మనుషులంతా ఒకటే ఆకార ప్రకారాల్లో
లోపలి పొరల్లో ఎందరో తమ ప్రత్యేకతల్లో
దోషి వేషి ఖూని రణ ప్రియుడు కళా ప్రియుడు
అవసరాన్ని బట్టి బయటికి వస్తారు
మతిలో గోడకు వ్రేలాడే మర బొమ్మలు
'కీ' ఇస్తే చాలు! గళం నుండి నీతులూ ఉపదేశాలూ!

ఈ లోకం లోకి వచ్చేప్పుడు దేహంలో
ప్రవేశించే మొదటి చైతన్య కిరణం ఎప్పటికీ.
మంచిలోను చెడులోను మాయని వెలుగుతో
ఎవరి ఇష్టంతో పనిలేదు, ఆజ్ఞ అక్కర లేదు
స్వేచ్ఛ మనసులో కల్పన కాకూడదు
ఇది దాహంలో మృగ తృష్ణ కాకూడదు.

పై నుండి దూకుతూ వచ్చే కెరటం
తీరాన మనిషిని ఆపాలని చూస్తుంది
పయనానికి హద్దులు లేవు, పయనం ఆగదు
ఈతో పడవో విమానమో వంతెనో ఏదో !
ఉదార కిరణంలా పయనించే మనస్సుకు
ఊరు దాటితే విశ్వమంతా బంధువే !

చేతిలో తన దేశ పతాక కెదురుగా అలల్లా
మరో దేశ పతాకలు! బుజం బుజం కలుపుతూ
ఒకపుడు చేతిలో గడ తిరగ బడుతుంది
గాలి జెండా గుడ్డను ఎత్తుక పోజూస్తుంది!
కర్మ సాక్షికి కాల దోషం లేదు
అంతరాత్మను నీడ క్రమ్మే సందర్భాలెన్నో!

# 8

రాత్రి చీకటి లిపి చదవడం
ఒక్క చంద్రునికే చేత నవుతుంది
సెమ్మె తలపై వెలిగే దీపం
సూర్యుని ప్రతినిధి అనుకుంటుంది
పగలు వదలి పోయిన కథల్ని
రాత్రి ఎక్కడో భద్రంగా దాచేస్తుంది.

పై నుండి కురిసే జల బిందువు లొకటే !
మార్పు ! ఆకాశచ్ఛాయతో నేలపై మట్టితోనే
దాహం తీరడానికీ మొక్క మొలవడానికీ
జలాల్లా ! కోర్కెలతో జీవితం !
కోరిక ఎంత ప్రియమైనా! తీరంలో కట్టిన
ఇసుక మేడల్ని ఇంటికి తరలించడం కుదరదు.

తరువు వనం గిరి నది జలనిధితో ప్రకృతి
పయనంలో జీవితానికి కొత్త అర్థం చూపుతుంది
ఒకటొకటీ ! చేతనలో నిదానంగా
కొత్త రూపం దింపుతాయి, కొత్త ఊహను అల్లుతాయి
సౌందర్యం ఆనందం ప్రేమ శాంతి కోణ బిందువుల్ని
నాలుగు వైపులనుండి కలుపుతూ పోతుంది.

ఇప్పటికీ క్షుధతో అలమటించే ఎడారి జీవితాలు!
బాంబులతో ధ్వనులతో అలంకృతమవుతున్నాయి
రణ తంత్రం సూట్ కేస్‌లో సర్దబడుతూంది
అక్కడక్కడా "మానవ బాంబు" పాత్ర అవతరిస్తూంది
అపూర్వంగా ఎదిగిన మారణ కళా పయనంలో
మృత్యు ద్వారానికి నిశా ముఖాన్ని చూపుతూంది.

# 9

కొండ పిలుస్తుంది చేతులు జోడించిన శిఖరంతో
గుహలో దాగిన పురాణ గాథలు వినిపించాలనీ
మనిషిలో కళ తప్పిన అగ్నిని కణకణ లాడించాలనీ
నది పిలుస్తుంది చేతులు చాచిన అలలతో
తీరాన నడచే జీవిత కథలు చూపించాలనీ
జారి పోయే చరిత్రను మతిలో నిలపాలనీ.

పిరమిడ్‌ను తలచినా మొహంజుదారో కథ విన్నా
మనస్సరసిలో కదలే చరిత్ర బింబం !
ఊహలో భ్రమించే "నిజం" కోసం ఆరాటం
కల్పనలో కనుమరుగైన వాస్తవం కై ఆవేదన
మంచు బొమ్మలు తొలగి పోయి
నిజం కళ్ళముందు సజీవంగా మెరవాలనీ !

బయటి నుండి కిరణం ఆలస్యంగా రావచ్చు
లోపల నున్న కిరణం బయటికి అందకపోవచ్చు
రంగుల వలలో చిక్కుకున్న 'నిజం'
మనిషిని పరిశోధనకు ప్రేరేపిస్తుంది
కాలానికీ స్థలానికీ అతీతమైన 'నిజం'
మెరపులా తళుక్కున మెరసి పోయేదీకాదు !

పయనంలో ప్రవేశించే పాత్ర లనేకం
సమస్యను పరిష్కరించే యంత్రాల్లా సిద్ధమవుతాయి
ఎవరి మాట పయినా ఎవరి కాలి జాడల్లోనూ
ఎవరి హస్త సంజ్ఞలోనూ చరిత్ర అడుగువేయదు
ఏ సమయం ఎవరి నుండీ ఖాళీగా పోదు
ఏ రోజూ అమూల్యాన్ని అందుకునే పోతుంది.

# 10

పయనంలో దూరాన ఆలయం
      గుప్తమైన చేతనకు సంకేతం
గుడి గంటలు శబ్దిస్తూ ఉదాత్త స్వరంలో
      ప్రయాణికులకు ఆహ్వానం పలుకుతాయి
ఆర్త రవం స్వనిస్తుంది మంద స్వరంలో
      ఊహలో బింబిస్తుంది అనురణనంతో.

ప్రసారమాన ప్రకాశం మూర్త మయిన విధంగా
      గుడిలో ప్రతిమ నేరుగా మాట్లాడుతుంది
గొంతులో స్వరంతో గుండెలో స్పందనతో
      అణువణువున మానవీయం ఆకర్షిస్తుంది
ఎప్పటిదో మానని గాయంపై
      అమృత పుష్పం అద్దినట్లుంటుంది.

మనస్సు మొగమోటాన్ని వదలి ధైర్యాన్ని విడుదల చేస్తుంది
      క్షణం నగ్నమై మనస్సు కొత్త దుస్తులు ధరిస్తుంది
అమాయకం లేదు, మూఢత అసలే లేదు
      అందరూ ఆ కాసేపు అంతశ్చేతనలో వెలిగే వాళ్ళే.
కన్నీళ్ళలో మనస్సు చేపలా ఈదుతుంది
      తిమింగలమై జలధిలో చేరాలనే !

గతం పునాదులు తవ్వితే ! ఏం కన్పిస్తుంది?
      ఆయుధ భయం ! భయంలో భ్రమించే మనిషీ !
పయనంలో దగ్గరయిన ఆలయం దూరమైనా
      చకితంగా చేతనలో ఒక పూవు పూస్తుంది !
క్షణంలో కల్పన కరగి తరలి పోతుంది
      వాస్తవం తెలుతుంది కదలుతుంది నావయై.

# 11

ప్రతి ఊరు పొలిమేరలో నిలిపి అడుగుతుంది
ఎక్కడి నుండి ఏ ఊరు నుండి వస్తున్నారనీ
ముఖాన నవ్వు మొలక లేకపోయినా పరవాలేదు
"నిప్పు కణం రాలక పోతే చాలు" అన్నట్లుంది
ఊహలో పూల తీగె కదలకపోయినా పరవాలేదు
"వ్రేలాడే సర్పం కదలకపోతే చాలు" అన్నట్లుంది.

తీరాన్ని మ్రింగే ఆలోచనా తరంగాలతో
మనిషిలో అనవసర భయ సముద్రం !
చెట్టు క్రింద రాలిన ఆకుల్లో సర్పం కదలికల్ని
చెట్టు కొమ్మపై నెమలి కనిపెడుతూంది
తలపై వసంతాన్ని దాచిన అద్దాల పెట్టెను
గాయాల బారినుండి తప్పించడం తోనే సరిపోతూంది.

చేతిలో రెపరెప లాడే రాజకీయ పార్టి పతాకలు
సూర్యుని తేజో ముఖాన్ని కప్పేయాలనీ
క్రియతో రాశీభూతమయిన వ్యవహార తంత్రం
పర్వత శిఖరాల్ని మ్రింగేయాలనీ
రాజకీయ ప్రపంచంలో పాత్రలు
ఇతిహాసంలో మలుపుల్ని మరపించేను.

అనల కరాలతో కదలే గాలి
గంగను ఇసుక పొరల్లోకి నెట్టేస్తూంది
విపణిలో సరికొత్త నృత్య ప్రదర్శనం
ఆటవికాన్ని ఘనంగా అందల మెక్కిస్తూంది
పయనంలో ఊరు తరువాత ఊరు! అడుగుతుంది
"ఇంకా ఎక్కడికి వెళ్ళాలని ఉంద"నీ ప్రియంగా !

# 12

గళంలో స్వరంతో పెదవులపై వేణువుతో
వెన్నులో వీణతో మేధలో వయొలిన్ తో
గుండెలో లయతో నాలో శబ్ద ప్రపంచం
మానవీయ కళతో నిజ జీవన రాగాలతో
ఆకాశం శూన్యం కాదు, మస్తిష్కం శూన్యం కాదు
జీవితం శూన్యం కాదు, దేని కది సశేష పూర్ణం.

జలధిలో అలల్లా శబ్ద సమూహం
రవి నుండి కిరణాల్లా భావ ప్రసారం
అంతరాత్మ ఛాయలో సహృదయ స్పందనం
నాలో జీవిత సత్యం కాలాని కతీతమై.
అఖాతమో పర్వతమో అరణ్యమో అహంకారమో
ఆటంకం వెనకబడీ పురోగమనంతో పయనం.

వెన్నెల కాగితం తన ముఖాన
వ్రాతకయి ఆరాట పడుతుంది
పరిమళ సుమం సందేశంతో
ప్రసారానికి ఉత్సాహపడుతుంది
చుట్టూ ఎంతటి ప్రకృతి అయినా
ఆనందం సార్థంలో మనిషిని తలపిస్తుంది.

చేతిలో రవి శశి పతాకలతో కాలం
మనిషిని మూల నుండి బయటికి రప్పిస్తుంది
సమాజ చరిత్రలో జీవిత రూపంతో
మనుషులతో మనిషి మనః ప్రపంచం
పీడనలో ఘర్షణలో మనిషి నుండి
కోరే దొకటే ! కరుణతో విశ్వ హృదయం.

# 13

ఎక్కడ బడిగే అక్కడ సమాజ పథం దొరకదు
ఉన్న వాటిలో ఒకటి ఎన్నుకొని పోవాలసిందే !
ఎప్పుడు బడితే అప్పుడు అవకాశం అవతరించదు
ఉన్న వాటిలో ఒకటి తెరచుకొని పోవలసిందే !
ఇష్టం లేని చోట ఎక్కడయినా ఖైదు సమం
బయట పడే ఊహలో మెరపులా సాహసం.

తాను బాధ పడే భయ సమయం లోనూ
మరొకరికి హానితో బయట పడేందుకు సిద్ధం
తలుపులు తెరచుకొని కన్నీరు బయటికి వస్తుంది
తలుపులు మూసుకొని వేదన లోపల తిరుగుతుంది
కవిత్వం మాట్లాడుతుంది, హృదయంలో వెలుగుతో
ఆలోచన సరిస్తుంది! సమాజ శిఖరం నుండి పాయలుగా.

మనిషికి పని లేక పోవడమేమిటి?
చుట్టూ ఉన్న సమాజం పనిలోకి లాగుతుంది
దొరికే అవకాశంలో మానసికాకారం
ఏ వేషాన్ని అయినా ధరిస్తుంది, పనికై కళకై
ఎప్పటికీ ఒకే సమయ దృశ్యం లభించదు.
లిప్తలు టంకశాల నుండి వచ్చే నాణాలు కావు !

బ్లాంకెట్‌లా నిద్రను విసరివేసి బయట పడే
మెలకువలో ఆశలు పెదవులు విప్పుతాయి
పనులలో కలకలంతో సమస్యల కలవరంతో
మునుగుతూ ఈదుతూ పయనం సాగుతుంది
సింహం కనిపిస్తే హఠాత్తుగా భయం వేయొచ్చు
సింహాసనం పొందేందుకు ఏ భయమూ ఉండదు.

# 14

దీపం ఎన్ని దిశలు చూపిస్తుందో
    మనసు అన్ని ముఖాలతో మాట్లాడుతుంది
అద్దంకై ఉబలాట పడే మనిషి
    ప్రతిబింబం మనసును దాచేస్తుంది
మెలకువలో వాస్తవం సమాజాన్ని నడిపిస్తుంది
    మెలకువలో పగటి కల జీవితాన్ని మురిపిస్తుంది.

కాలాన్ని ముక్కలు చేసి ప్రతి ముక్కలో
    అద్దంలా తన ముఖం దర్శించాలనే
సంఘాన్ని శాఖలుగా చీల్చి ప్రతి శాఖకూ
    తన ఊహలో పుష్పాల్ని పొందాలనే
అస్తిత్వం కోల్పోయి మానవీయ కళ
    విపణిలో వాణిజ్య వస్తువుగా మారుతూంది.

సూర్యునికీ అద్దంలో తన ముఖం చూచుకోవాలనే
    ఎలా ఉంటుందోననీ ఆవేదన సహజం !
ప్రతిఫలనంలో తేజం ! అద్దాన్ని తళతళలాడిస్తుంది
    తళ తళలో రూపం ! కదలి చెదరిన దృశ్యంతో
కోరిక చుట్టూ శూన్యం మిగులుతుంది
    చంద్రుణ్ణి చూచే ఆరాటం మిగులుతుంది !

కను రెప్పల మధ్య పగటి కల
    ఎంత సేపు నిలిచి ఉంటుంది
రెప్పలు వాలి అందే లోపల
    చీకటి కొమ్మ పైకి చేరుతుంది
దీపం ఎన్ని దిశలు చూపిస్తుందో యానంలో
    అన్ని దిశలనుండీ కలలూ కల్పనలూ !

# 15

గమ్యం చేరే వరకూ
మలుపులతో అందంగా పోయే
ప్రవాహ జల పంక్తిలా
మనస్సులో జీవితానుభవం
రస రూపానికీ బ్రతుక్కీ మధ్య ఎడారిలా
నీటి చుక్కకూ నాల్కకూ మధ్య దాహం !

మనిషికి దాహం వేయడం సహజం
నదికి దాహం వేయడం విశేషం
దాహంతో జలధి ముందు చేతులు చాస్తే సరిపోదు
నాల్కను పలకరిస్తూ మంచినీరు గొంతు దిగాలి
సమాజ చరిత్రలో ఎడారి పంక్తిలో
బిందువు కదలడమే పయనానికి సంకేతం.

జలాశయం వద్ద చేతిలో దర్భలతో
సువర్ణ కంకణం పై ఆశను రేపే పులి
శాలువా కప్పుకొనీ భ్రుకుటి కుంకుమ రేఖతో
రోజూ దారిలో కాచుకొనే కూర్చుంటుంది
ఒక్కొకపుడు వాస్తవం బహు భయంకరంగా ఉంటుంది
వేసే అడుగును పాతాళానికి దించేస్తుంది.

నా అడ్రసు పయనంలో పవమానం చెబుతుంది
అది నాకొక విజిటింగ్ కార్డులా పని చేస్తుంది
నా కన్నా అడుగు ముందు కదలుతుంది
దిశలకూ దేశాలకూ పరిచయం చేస్తుంది
నేలపై ఝరిణిలా నా రూపం సరిస్తుంది
కవిత్వ చరణాలపై ఆదర్శానికి ! పయనం !

# 16

క్షణం జారి పోతుంది మైనస్ లా
క్షణం చేరి పోతుంది ప్లస్ లా
కూడిక నుండి భాగ హారం దాకా
విపణి పలికే ధరలపై జీవితాలు
చిన్న నాటి ఆట బొమ్మలు! అల్మైరాలో అమూల్యంగా
కాలం గడచీ, వికలమైనా ఈనాటికీ సరిపోతాయి.

ప్రయాణంలో దారి ప్రక్కన ఇరు వైపుల చెట్లు
తెరచిన పుస్తకంలో నిలిచిన ఆదర్శాల్లో
చెట్ల పై చిలకలు! ఎపుడో నేర్పిన మాటలు పలుకుతూ
అవి వింటూ ఉండగానే దృశ్యం మారిపోతుంది.
ఇది నిజాన్ని దాచేసే చతుర జాలంలా
ప్రదర్శనకు బాగా పనికి వస్తుంది.

ప్రతి ప్రశ్న వెనక దాగిన నిజం
జవాబుతో బయటికి రావాలనే
ప్రశ్నల జవాబుల సంకలనం జీవితం
ఎప్పటికీ అందబోయే ఆదర్శాల వైపే పయనం
చరిత్ర పునాదులపై సంస్కృతి స్తంభాలపై
ఎప్పటి కపుడు కాలంతో మారే ఆ పై రూపం.

స్వర్గానికి నిచ్చెన వేసే కోరికతో
మూల తలాల్ని మరచే ప్రమాదం
ప్రమాదాన్ని పసికట్టిన అంతరంగ నయనం
ప్రతి దిశ తలుపులు తెరచి చూపుతుంది
దారిలో దాగిన రహస్య నిధుల్నీ
బ్రతుకులో మిగిలిన పచ్చని భాగాల్నీ.

# 17

భౌతికం మానసికం సమాంతర రేఖల
పట్టాల పయి రైలులా జీవితం
బోగీల్లో తరగతులూ వివిధ స్థాయిల్లో
సమయం ఒకటే ! మనుషులు వేరు ! గమ్యాలు వేరు !
నాలో అభినవ యానం ! సృజన పథంలో
దారిన మొన తేలిన కంటకాల సంరంభం.

జీవితం ఆటల మైదానం కాదు
ముందుగా గుణించిన పంచాంగమూ కాదు
ఎపుడే మలుపు తిరిగేదీ తెలీని పరిణామంలో
మధ్య మధ్య క్రందనలూ రోదనలూ వేదనలూ
ఘర్షణలో హింస చరిత్రను వెనక్కి పరుగెత్తింప జేస్తూంది
నాగరక శిథిలాలపై ధూమాన్ని నర్తింపజేస్తూంది.

వనిలో హరిణాలు అప్పటికీ ఇప్పటికీ
కంటికి అందంగా తిరుగుతూన్నాయి
వాటిలో మారీచ హరిణం ఎప్పటికీ ఒకటే
హిరణ్య కవచంతో ప్రతి రూపమూ లేకపోలేదు
దీన్ని వాహనం చేసుకొని ఊరేగే వారున్నారు
దీన్ని నాయకుణ్ణి చేసి ఊరేగించే వారూ ఉన్నారు.

దీన్ని మాయం చేయ చూస్తే
నాలుగు దిశల నుండీ నాలుగు రూపాలు వస్తాయి
దీన్ని దగ్ధం చేయ చూస్తే
మంటల్లో నుండి ఎగసి పొదల్లో మాయమవుతుంది
ప్రతి ప్రబుద్ధునికీ బాగా తెలుసు
తనలో ఎపుడే జంతువు విహరించేదీ.

# 18

రణాలకు కారణం కిరీటం
ప్రభుతకు మూలం సింహాసనం
స్వార్థం పగ ద్వేషం ఘర్షణలో
శరీరాలు రణ ద్వారానికి తోరణమై
కిరీటం రాజత్వానికి ప్రతీక అయినా
సింహాసనం అణచివేతకు చిహ్నం కారాదు.

సామాన్యుని ఉబలాటం కిరీటం కై
ప్రదర్శనలో పురాణ పాత్రకే సాధ్యం
కొందరికి ఆ పాత్రను చూస్తే ఆనందం
ఎవరి కిష్టమయింది, వారికి ప్రియం
సన్మానంలో అలంకరించే జరీ పాగా
ఒక మానసిక తృప్తికి చిహ్నం !

పెను సమస్య ద్వారం వద్ద ఖడ్గం
తల కోసం ఎదురు చూస్తుంది
తలలో భావం తెలుసుకునే లోపల
తల తెగి వీరానికి జేజేలు ధ్వనిస్తాయి
కాలం క్షమిస్తుంది ఉదారంగా
సమాజం శాంతికి సిద్ధమవుతుంది.

కత్తి మెడలో పూల దండ చూడాలనీ
కన్నీటి జలాల్లో పూలు తేలాలనీ
యానంలో కోరిక సరిపోదు, అది వాస్తవం కావాలి
ఎదిగే మనసుతో అవకాశం ఫలించాలి
సూర్యుడో చంద్రుడో మస్తిష్కంలో దిగి
శరీరంలో కణ కణం వెలుగును పొందాలి.

# 19

ఆగే అవసరం లేని పయనంలో
తెరచిన వాహన గవాక్షం నుండి
ముఖాన విసరే వాన జల్లు !
గాలికి ఊగే సస్యపు మొలకల్లా
ఎగిరి ఎగిరి వర్షపు గాలి
ప్రతి చెట్టుతో రెజిలింగ్ చేస్తున్నట్లుంది.

రోడ్ ప్రక్కన తరగలతో వర్షపు నీటి సాయ
పుస్తకాలతో నడచే చిన్ని పిల్లల వరసలా,
పిడుగు పాటుతో పెళ పెళ చెట్టుకూలే శబ్దం,
శిథిల మయిన గూళ్ళతో
నేలకు ఒరిగే పక్షులు పిల్లలతో
విధి గురించి ప్రశ్న ! ఎప్పటికీ ఉన్నదే !

స్వచ్ఛంగా బయట పడిన నిజంలా
బాధ నుండి ముక్త మయిన జీవితంలా
వర్షంతో శుభ్రమయిన ప్రపంచం
రోజూ కనిపించని అర్థాన్ని మెరపిస్తుంది
దూరాన గగనంలో పలురంగుల్లో ఇంద్రచాపం
కష్టంలో నష్టంలో విశ్వ బంధు పతాకలా.

వర్ష ధారా రాగం వినాలనుకుంటే
మెరపు తీగె అందం చూడాలనుకుంటే
సుందరమైన ప్రకృతి దృశ్యాలతో పాటు
పిడుగు పాటునూ సహించక తప్పదు
అమృత బిందువు రుచి పొందాలనుకుంటే
దాన్ని తెచ్చే గరుడుని రెక్కల ధ్వని సహించక తప్పదు.

# 20

చేతిలో కలంతో పేపర్ వైపు చూస్తూ
కూర్చున్న నాకు వినిపించింది
కవిత వ్రాసే ముందు కాగితం అంది కలంతో
“శుభ్రంగా ఉన్న నాపై రాతలతో మలినం చేస్తున్నావ”నీ
కలం అంది “నాదే ముంది? నేనొక సాధనం మాత్రమే
ఒకరి చేతిలో కదిలే దాన్ని” అనీ.

చేయి అంది “నాదేముంది!
వెనుక నుండి ఎవరో చెబితే చేసేదాన్ని”
కాగితం అంది “ఇది అంతా నాకు తెలియదు
ప్రత్యక్షంగా కనిపించేది మాత్రం నీవే”
కలం అంది “ఈ రాతల విలువ నీకు తెలీదు
నీ రూపం మారుతుంది నీ విలువ పెరుగుతుంది సుమా!”

“లేకపోతే నిన్నెవరు అడుగుతారు చెప్పు !
ఒకరితో మరొకరి సంబంధంతో సమాజం
నీ కోరిక తీరే రోజూ వస్తుంది
కంప్యూటర్ యుగంలో నేను తప్పుకున్నా
నీకు మాత్రం ! నీపై రాత తప్పదు !
ఏ రాత లేని కాగితానికి విలువ ఎక్కడిది?”

“నాతో నీకో అస్తిత్వం కలుగుతుంది
ఆయా రాతలతో ఒక్కొక్క గుర్తింపు వస్తుంది”
ఇరువురి మాటలు వింటూంటే ఆ వెనుకనుండి
సమయం కోసం వేచి ఉన్న మరో పాత్ర
మధ్య మధ్య తొంగి చూస్తూ త్వర పడుతూంది
విపణి వీధి వాలకంలో సరికొత్త వేషంతో.

# 21

నా అడుగుల్ని అందుకోవాలనీ అవని
విశాల హృదయంతో వాత్సల్యాన్ని పరుస్తుంది
నాకూ అవనికీ మధ్య ఎడం
తల్లికీ బిడ్డకూ మధ్య ఉన్నంత
ఇంకా శిశువులా చేతులపై నడిపించాలనే
భూమిపై విప్పారే పూల కళ్ళు అన్నీ నా వైపే

నా మాటల్ని ఎద నింపు కోవాలనీ పవనం
ఇంకా పుట్టి నప్పటి మిత్రం లాగే మెలగుతుంది
నాకూ పవనానికీ మధ్య ఎడం
శ్వాసకూ గుండెకూ మధ్య ఉన్నంత
దూరం నుండి చేతులు చాచి స్నేహాన్ని పరుస్తుంది
ప్రయాణంలో ఎప్పటికీ కనిపెట్టుకునే ఉంటుంది.

నా గుండె లయను అందుకోవాలనీ కాలం
చైతన్య రూపంతో ఉత్సాహాన్ని నింపుతుంది
నాకూ కాలానికీ మధ్య ఎడం
సంకల్పానికీ జీవితానికీ మధ్య ఉన్నంత
సుదీర్ఘ సూత్రంపై ఆయువును నడుపుతుంది
ఎప్పటికీ నాలో అస్తిత్వాన్ని కాపాడుతూ !

భూమిపై వేసే అడుగులతో
వర్తమానం ఒక వాస్తవాను భవం
వడపోసిన కాల రూపంతో
గతం ఒక స్మృతి విశేషం.
గాలిలో తేలే ఊహా చలనంతో
భవిష్యత్తు ఒక స్వప్న ఖండం.

# 22

విగ్రహం మాట్లాడుతుంది మౌనంగా
    ఆలోచనల్ని అంకురింప జేస్తుంది
జాతి పతాక మాట్లాడుతుంది సామూహికంగా
    ఉత్సాహాన్ని సరింప జేస్తుంది
ప్రశ్నల్ని సంధించే మనుషు లెందరో ?
    జవాబు లిచ్చే మనుషులే కొందరో !

నింగిలో ఎగిరే పతంగంలా
    నీటిలో తేలే పద్మంలా
చేతనలో కోర్కెలు పోటీలో
    ఖే చరాన్నో జల చరాన్నో తలపిస్తాయి.
ధైర్యాన్ని పేనుకుంటూ పోయే యానంలో
    ఆనందం విజేత చేతిలో ఆట బంతి కాదు.

దరిద్రంలో ఆకలిలో చెలరేగే కోపం కన్నా
    సంపదలో మండే అహంకారం మరీ ప్రమాదం
పయనంలో ఉపయోగించే వాహనం
    లక్ష్యం చేరాక నిలిచి పోతుంది
గమ్యం చేరేంత వరకూ కలిసి ఉన్న వాళ్ళు
    స్టేషన్ చేరాక ఎవరి దారి వారిదే !

బోధి వృక్ష మయినా ఆకు రాలక తప్పదు
    సమయానికి మళ్ళీ కొత్తగా చివురిస్తుంది
మనిషిలో తాత్త్విక బీజాల్ని నాటుతుంది
    ప్రశ్నకు జవాబుగా ఆకృతిని బింబిస్తుంది
పచ్చని హృదయం నుండి మాట్లాడుతుంది
    శాంతికై తహ తహలాడే బోధతో.

# 23

ఈ పయనం ఎటు అంటే ? సమాజం లోకి
మానవ విజయంలో భాగంగా ప్రపంచం లోకి
కక్ష్యలో తిరిగే సెటెలెట్‌లా మనో రూపం
చేతన ఉన్నంత వరకూ పని చేసే జీవమయం
ఏ వైపు నడచినా ఎన్ని మలుపులు తిరిగినా
చివరకు చేరేది పరిణామ చరిత్ర లోకి.

జలధిలో కలిసే కన్నా నది
నేలను సమార్ద్రం చేస్తూ
మలుపులు తిరుగుతూ
చుట్టలు చుడుతూ
ప్రాణుల దాహం తీరుస్తూ
బ్రతుకుతూ పోతేనే సార్థం

గగనంలో పక్షి రెక్కల్లా
నేలపై నీడ క్రీ నీడలా
గడియారంలో రెండు ముళ్ళలా
నాలో భౌతిక మానస రేఖలు
కాలం ఎవరి చేతిలో సాధనం కాదు
పాత్రల్ని ఆడించే సూత్రమూ కాదు.

పయనంలో రైలు కిటికీ నుండి
కదలి పోతూన్న దృశ్యాలు
సరస్సులో జలాలపై నీడల్లా స్మృతులు
ప్రేయసి కళ్ళలో ప్రియభావనలా
బహుమానం ఇచ్చే ఆరాటంతో
సమయం కదలుతూంది చల్లని చేయితో నిమురుతూ.

# 24

ఆకాశం బుజాలపై నుండి సూర్యచంద్రులు
      భూమిపై జీవ యాత్రకు దారి చూపుతాయి
చుక్కలు ప్రపంచాన్ని మరచి పోనీయవు
      స్మృతులు గతాన్ని జ్ఞాపకం చేస్తూంటాయి
రోజులు రాశియై గతమై గాథయై
      వెనుక నుండి ఉత్సాహభూమిక అవతరిస్తుంది.

పగలూ రాత్రితో ప్రకృతి చక్రం
      విశ్వ శక్తిని ఆవిష్కరిస్తుంది
ఎన్నిసార్లు చదివినా ఎప్పటికపుడు
      కొత్త వ్యాఖ్యాన మవసరమయ్యే
పుస్తకంలో అక్షరాల్లా చుక్కలు !
      చేపల్లా పక్షుల్లా కదలిపోయే దృశ్యం !

రోజూ ఆడే ఆటలో
      వికెట్ కోల్పోవడమో గోల్ అవడమో తప్పదు !
యానంలో లోపలి మనిషి
      మాటతో పాటతో ఆకర్షిస్తూ
మనిషిని గురించి ఉపదేశిస్తూ
      "మానవత"పై 'షో' నడిపేను.

మనస్సుతో పనిలేని సమాజం రూపం
      భౌతిక శ్రమగతితో నడిచే యంత్రం !
ఆదర్శానికి దూర దూరం జరుగుతుంది
      సరికొత్త అంతరాల్ని నిర్మిస్తూ పోతుంది
ఏ వికాస దశలోనూ శాంతి కరుణ ప్రేమతో
      మనోభూమికలో మనిషి ! స్వయం తేజోరూపం.

## 25

గగనంలో అజేయ మౌన ముఖం
    జలధిలో ఎగసే ఆవేశ స్వరం
నదిలో జీవన రస హృదయం
    తరువు నీడ అభయ హస్తం
యానంలో పూర్వ బంధు దృశ్యాలు
    శ్రమకు హ్లాద రేఖల్ని అద్దేను.

నది ఒడ్డున వాలిన పక్షి
    దాహం తీరి ఎగిరి పోతుంది
కొమ్మపై నిలిచిన పక్షి
    గూడుపై దృష్టితో పోతూ వస్తుంది
దాహం ఆకలి ఆవాసం కై మనిషిలో
    ప్రయాస ! పోరాటంకై సిద్ధం !

కళ్ళ నుండి నీరు ఎవరికీ సంతోషం కాదు
    కన్నీటిలో పడవల్ని నడపాలనుకునే వారూ ఉన్నారు
ఊపిరిలో అగ్ని ఎవరికీ ఇష్టం కాదు
    నిశ్వాసాగ్నిలో చలి కాచుకోవాలనుకునే వారూ ఉన్నారు
జీవిత రణంలో పోటీ చర్చలతో
    జీవిత పథంలో అవసరాల తీరుతో.

కన్నీరు రప్పించే ఉపాయమూ ! సరదా !
    మనిషిని మనిషి ముంచేసే ఆలోచన !
అగ్నుల్ని సృజించే యత్నం ! ఉత్సాహం
    మనిషిని మనిషి దహించే ఉద్వేగం
సమస్య ఎప్పటిదో ! వ్యూహ రచన వేరు
    లక్ష్యం ఎప్పటిదో ! ఉపకరణ రూపం వేరు !

# 26

సాధారణ ప్రశ్నలకు సమాధానాలు దొరికితే
      సామాన్యుడు బ్రతుకులో కోరేదేముంది?
విశేష ప్రశ్నలకు ఇంద్రజాల సమాధానాలు
      నియంతలూ పాలకులూ ప్రజ్ఞాధురీణులవీ !
శాంతి కరుణ ప్రేమ కై నిరీక్షణలో
      జన సమాజ దృశ్యాలు వికాస శిఖరాలకై.

హృది నుండి ఎగిరి పోయిన శాంతి
      కల్పనలో ఆవాసం పొందుతూంది
సంఘం నుండి పారిపోయిన నీతి
      అడవిలో తల దాచుకుంటూంది
బ్రతికినంత వరకూ ఆగని క్రోధం
      పోయాక 'శాంతం పాపం'తో సరి !

సీతను హరించే రావణు నెదిరించి
      రెక్కలు తెగిన జటాయువు !
ఆదర్శం ముందు ! మనిషి తలవంచిన సమయం !
      నైతిక ప్రకాశం ప్రాణి స్థాయిని పెంచుతుంది
ఏ యుగమయినా జీవిత యానంలో
      గుణ వర్తన అదే ! గాయాలే వేరు !

వాడని ప్రేమకూ మాయని కరుణకూ
      దూరాన కొండపై సంకేతాలు
ఆత్మ ప్రకాశంతో వీడని బంధంతో
      ఆకర్షించే ఆలయ గోపుర శిఖరం !
ఏ శ్రమ లేకుండా మనిషికి బహుమానం
      ఎగిరే బెలూన్ వలె మనిషిలో ఆనందం.

# 27

పయనంలో ఎక్కడో ఒకచోట
వెన్నెల కయి చూచే సమయం వస్తుంది
చీకటి క్రమ్మిన సమయంలో
హృదయం హ్లాద బింబం కోరుతుంది
గుహలో భద్రంగా ఉండే మనిషిలోనూ
చంద్ర కిరణాన్ని చూచే కోరిక సహజం.

శబ్దాన్ని భరించేందుకు పగలు సిద్ధంగా ఉంటుంది
నిశ్శబ్దాన్ని వహించేందుకు రాత్రి ఉత్సాహపడుతుంది
లౌకిక తలంపై కోలాహలానికి భౌతికం వెనుదీయదు
ఆంతర గగనంలో నాదానికి మానసికం ఎదురుచూస్తుంది
దారిలో బయటపడిన చంద్ర బింబానికి
ఆకాశం దిగుతుంది నిగారంగా.

ఆ కొండ లేచి నడవదేమని ప్రశ్న
చిటికెన వేలు పట్టుకొని నడిచే శిశువు నుండి
నీ మొగం! కొండ ఎక్కడయినా నడుస్తుందా?
ఆ చెట్టు నడుస్తుందా? అని ఎదురు ప్రశ్న !
ప్రశ్నకు ఎదురు ప్రశ్న సమాధానం కాదు
ఒకరి అనుభవం మరొకరికి పనికిరాదు.

అన్నీ అమరి చేతి కందుతూంటే
దినకర తాపాన్ని అనుభవించే పనిలేదు
చలువ కంటి అద్దాల్లో, చలువ అద్దాల కారులో
చలువ ఊహలో అంతా వెన్నెలే !
గగనంలో వెలిగే చంద్ర బింబంతో పనిలేదు
దారిలో చెట్టు నీడతోనూ పని లేదు.

# 28

దారిలో మౌనంగా జయస్తంభం ఎప్పటిదో
సాహసానికీ త్యాగానికీ ఆదర్శానికీ చిహ్నం
మౌనం విప్పితే చరిత్ర పుటలు తిరుగుతాయి
గతంలో ఊహకు మధుర స్పృహ నిస్తాయి
చక్రంలో ఒక చుట్టూ తిరిగే కాలం
ఇప్పటికి చేరిన శిఖరాల్ని ప్రశ్నిస్తుంది

దారిలో మౌనంగా దీప స్తంభం ఎప్పటిదో
రాత్రి జరిగే ఘటనలకు సాక్షిగా ఉంది.
ఆలోచనలో చీకటికి వెలుగు కవచాన్ని అందిస్తుంది
రాత్రి నడచే మనుషులకు రక్షగా ఉంటుంది
వర్తమాన క్షణాలలో నిశ్శబ్దాన్ని మాట్లాడిస్తుంది
సూర్యుని చివరి కిరణానికి ప్రతినిధిగా నిలుస్తుంది.

దారిలో మౌనంగా ధ్వజ స్తంభం ఎప్పటిదో
ఏ వంక లేకుండా విగ్రహాని కెదురుగా
పైకి చూపు ప్రసరిస్తే ఆత్మ రూపాన్ని సూచిస్తుంది !
పైకి చూచే తీరిక కోరిక ఎవరికుంటుంది ?
శబ్ద గుణంతో శూన్యస్థానాన్ని మాట్లాడిస్తుంది
ఇప్పటికి సాధించిన పరమార్థాన్ని ప్రశ్నిస్తుంది.

ఆత్మ గంగలో మునకేసి లేచే సరికి
అలలు జరిగి దూరంగా కదలిపోతాయి
ఆహంకారం తల వంచుకుంటుంది
ఆలోచన ఆర్ద్రమై అంతరంగాన్ని స్పృశిస్తుంది
ఈ నిలిచిన స్తంభాలు జడమైనా
పయనంలో కళకళలాడే చైతన్య చిహ్నాలు.

## 29

పయనంలో ఎదురయ్యే ముఖాల్లో
ఒకదాని తరువాత ఒకటి తరలిపోయేను
అంతరంగ ప్రియ వాహనం,
ముఖంపై శుభ్రమైన నవ్వు !
దీన్ని మింగేయ జూస్తాయి ! చుట్టూ రంగులెన్నో !
ఎరుపు నలుపు పసుపు మిశ్రమ రేఖలతో

చంద్రుడు క్రిందికి దిగడం కుదరదు
అందుకే అతనికంత హ్లాద రూపం
క్రిందికి దిగితే ! నీటి చుక్కకయి
తహ తహలాడే ఇసుక కణం కన్పిస్తుంది
చంద్రుని కన్నా మనిషికి భూమితోనే బంధం
సమాజ పరిణామంలో భాగం !

ఒకరి చేయి ఒకరు అందుకొనీ అలల్లా
ఒకరి ఊహ ఒకరు హత్తుకొనీ కిరణాల్లా
బ్రతుకంతా సాగే యానంలో ఏమయినా
ఉషస్సు ప్రవేశం ఆగదు, తమస్సు రాక నిలిచిపోదు
ప్రతి పనిలో మనిషి శక్తి రక రకాల వర్ణాల్లో
వర్ణ చిత్రాలకు మూలం మనిషి మనోరూపం !

ఎంతటి వర్షాన్ని అయినా భరించే పర్వతంలా
ఎన్ని నదుల్ని అయినా వహించే సముద్రంలా
ఎన్ని బాధల్ని అయినా సహించే హృదయంతో
ప్రదర్శనలో మనిషి ! జన నయనానందంగా
పెరిగిన వామన వటువు యశశ్శిఖరాన్ని
నిచ్చెనపై అధిరోహించి జయించే కోరికతో !

# 30

ఉషస్సు చెదరదు మాయదు, మరలదు
తపస్సు పలకదు వెరవదు మరవదు
ఉషస్సు రేఖలతో తపస్సు రూపంతో
మనిషిలో వికాస పరిణత దృశ్యాలు
రథం ముందు పయనానికి అశ్వం సిద్ధంగా
రథంలో తేజో రూపం రావడమే ఆలస్యం.

గులాబికీ నిప్పుకణానికీ భేదం గుర్తిస్తేనే
ఉషస్సుకూ పగలుకూ భేదం తెలుస్తుంది
పూలన్నీ ఒకటే ! కల్పనా జగంలో
కాలమంతా ఒకటే తత్త్వ భూమికలో
దేని కదే ప్రత్యేకం ! అనుభవ గుణంతో
వాస్తవ తలంపై సృజన విశేషంతో.

ఊయెలపై ఊగే కాళ్ళకు
నేలపై మట్టితో సంబంధం ఉండదు
హృదయం నుండి వినిపించే మాటలు
మానసిక స్థాయిని బట్టి తెలుస్తాయి
తలపై పరిభ్రమించే దృష్టికి
మట్టి కణంలో మౌన కథ కనిపించదు !

గోడపై చిత్రాల్లా రంగుల ఇంద్ర ధనుస్సుతో
శరీరం పై దుస్తుల్లా కోర్కెల జీవితంతో
చేతిలో రజత పంజరంలో
స్వర్ణ హంసను సృజించుకోనీ
ప్రదర్శనకో అలంకారానికో అవుతూంది
ఆదర్శం ! విపణిలో తిరగదు.

# 31

నేలపై అడుగు ఆగదు నాల్కపై మాట నానదు
మట్టితో బంధం శిశు దశతో ఆరంభం
విత్తు చల్లి సౌభాగ్యం, బలం పొంది అధికారం
జీవిత చక్రం మట్టిపైనే తిరుగుతుంది
లోతు నుండి నీరు చేదే
బొక్కెనకు తాడులా ఆశా రూపం.

ఎంతటి నది అయినా జలధిలో కలిసిపోయి
ఉన్న అస్తిత్వం కోల్పోతుంది, జలధి గుణం పొందుతుంది
ఒక ఘటన ప్రభావం వస్తువుపై
స్వరూప వికృతికి దారి తీస్తుంది
ఒక అనుభవ ప్రభావం మనస్సుపై
కొత్త కోణాన్ని చూపిస్తుంది.

ఆలోచనలో లిప్తలు విరిసిన పూవుల్లా
చుట్టూ కోర్కెల భ్రమర గణ భ్రమణం
అద్దంలోనే కాదు మనిషి ముఖం
విరిసిన పద్మంలోనూ మెరుస్తుంది
ఆలోచనలో గగన తలంపై
ఇంకా అందంగా కనిపిస్తుంది.

అద్దంలో చూచే అసలు ముఖం కన్నా
ప్లాస్టిక్ రూపం తళ తళలాడుతుంది
రోజు చివరి సమయం పేజిలో సిద్ధమయిన
తప్పుల పట్టిక నెవరూ పట్టించుకోరు
ఎప్పటి కయినా ఇది పనికి వస్తుందనీ
అది నిజమూ కావచ్చు, తల వ్రాత మారనూ వచ్చు !

# 32

క్షితిజంతో తెల్లని షర్టునూ
        సముద్రంతో నీలి నిక్కరునూ
మేఘంతో మెడలో నెక్‌టై నూ
        చెట్టుతో చేతిలో బాగ్ నూ
తలపించే ప్రకృతి దృశ్యం ! నాలో
        బాల్యాన్ని నడిపిస్తూంది, మెత్తని కోరికపై.

ఇంటి ముందు చెట్టు పెద్ద దిక్కులా
        చేతులు చాచి ధైర్యాన్ని ఇస్తూంది
ఆకులతో పూలతో పండ్లతో రవళిస్తూ
        నేను చేయవలసింది సూచిస్తూంది
కొమ్మ నుండి ఎగిరే పక్షి శక్తి పై కోరిక
        నాలో విమాన యానంతో తృప్తి పడుతూంది.

పల్లెలో పచ్చ రంగూ తెలుపు రంగూ
        పట్నంలో పసిడి రంగూ నీలి రంగూ
నేరుగా మస్తిష్కం లోకి దిగుతాయి
        హృదయంలో చిత్ర పటాలు నింపుతాయి
మనిషిలో ఆలోచన కెంత తేజం ఉందో
        రూపంలో రంగులకూ అంత అర్థం ఉంది.

బుజాల పై సూర్యుణ్ణి నిలుపు కొనీ
        తిరగాలనే ఊహ మంచిదే
ముందుగా తపస్సుతో బుజాలు
        హిమ శిఖరాలు కావలసి ఉంది !
ఆదర్శం ఒక ఉజ్వల చేతన రూపం
        అద్దంలో చూస్తూ మురిసిపోతే సరిపోదు !

# 33

తుడిచినా తొలగని మంచులో
　　సత్యాన్ని కప్పేసే వ్యవహారం
రంగు నీళ్ళు చల్లి పికాసో చిత్రంగా
　　చిత్త భ్రమను కల్పించే సందర్భం !
మెడపై కత్తి నిలిపి పోయే ప్రాణానికి
　　"మోక్ష ద్వారం" అనుకోమనే ఆలోచన !

పక్షీంద్రుడో ఐరావతమో ఉచ్చైశ్రవమో మయూరమో
　　అన్నీ మహనీయుల వాహనాలు ! జీవశక్తి రూపాలు
ఇంద్ర ధనుసులో సప్త వర్ణాల సమావేశం
　　ప్రజా స్వామ్యంలో సహ జీవన సంకేతం
తీరాన ఇసుకపై మృత్యు ముద్రల్ని
　　సముద్రంలో అలలు క్షణంలో మాయం చేస్తాయి.

ఎక్కడి కక్కడ తెలుపు నలుపు గళ్ళతో
　　ఎత్తులపై ఎత్తులతో జీవిత చదరంగంలో
సన్యాసం త్యాగం అవదు ! నిష్క్రియ విజయం కాదు
　　మనిషి చేసే చట్టం, మనిషి చేతనే మ్రింగబడుతూంది
గాలికి ఊగుతూ పోయే అలల్లా కొత్త తరం పిల్లలు
　　కాలాన్ని మురిపిస్తూ వ్రేలు పట్టుకొని నడిపిస్తూ కదలేరు.

అద్దాల కేసులో అస్థి పంజరాన్ని
　　తీరంలో ఇసుక బొమ్మల్నీ
గంగ సముద్రంలోకి తీసుకొని వెళ్ళుతుంది
　　ఎప్పటికీ పరమ పవిత్రంగానే ఉంటుంది !
జల తరంగం ఉరిత్రాడు అయ్యే కన్నా
　　సమాజ హితం అవడంలోనే ఆనందం !

# 34

టి.వి కేబుల్ తీగల్ని స్పృశించాలనీ
చెట్ల కొమ్మలు ఊగుతూ చేతులు చాస్తాయి
మనిషిలో కోరిక వెంట మార్పు పరుగెత్తు తుంది
నిరాశా ద్వారాలు తెరచి క్రుంగి పోనవసరం లేదు
గుండెలు బాదుకొని విలపించ నవసరం లేదు
మార్పును ఉరిత్రాడుగానూ ఊహించే పని లేదు.

పొలాలు వెనక్కి జరుగుతున్నాయి
మరో విధంగా సౌభాగ్యాన్ని పొందే వేగంలో
యంత్రాలతో సౌఖ్యాన్ని కోరే
మనిషి జరగవలసీ వస్తుంది
ఏ స్థితీ ఎప్పటికీ స్థిరంగా ఉండదు
ఏ తరమూ ఉన్న చోటునే నిలిచిపోదు.

చెట్టు పై నుండి గుహలో నుండి
చెట్టు నీడకు చేరిన మనిషి
భద్రతలో రక్షణలో ఉపాయంతో
భయం లేని నిలయంకై శ్రమించేను
బహిర్యానంలో ముందు అడుగుల్ని అందుకొనీ
అంతర్యానంలో ఎవరి అడుగులు వారివే !

అనుక్షణం కదిలే అలల్ని
ఎక్కడికని ప్రశ్నిస్తే ఏమి చెబుతాయి !
అడుగు ముందుకు వేసే
గమ్యాన్ని ప్రశ్నిస్తే ప్రవాహం ఏమి చెబుతుంది ?
ఇంతవరకూ కదలి వచ్చిన చరిత్ర చెబుతుంది నిర్మొహమాటంగా !
మనిషి కోరేదేమిటో ! జీవితంలో ప్రవేశించేదేమిటో స్పష్టంగా !

# 35

వివిధ వస్తు సమీచీన ప్రకృతిలో
ఏది తక్కువ అయినా అపరిపూర్ణమే
నీరు తగ్గి ప్రవాహం సన్న బడుతుంది
ఆకురాలి చెట్టు శూన్యమవుతుంది
సమయ సమయం ! శూన్యం నుండి
ప్రతిదీ పూర్ణత వైపు పయనం.

హరిణం లేలేత చివుళ్ళు మేస్తుంది
భ్రమరం పూవులో మధువు సేవిస్తుంది
కావలసింది పొందడం ప్రాణి సహజం !
తనకే తనదే నన్న స్వార్థం ! మనిషి లోనే
ఇనుప మేకుల ఆలోచనలో
చివురు చూడకుండా మ్రోడు బ్రతుకుతుంది.

నీరు లేని నదిలో దింపుతుంది కల
ఈత రాక పోయినా ఫరవాలేదు
రోజు కలిసి రాలేదని కోపంతో
డైరిలో పుట చించేస్తే సరిపోదు
మెలకువతో కనుమరుగయిన స్వప్నం
నిద్రిస్తే మరో మారు దయచేయదు !

శిరస్సు నిలుపుకొనీ పర్వత శిఖరంలా
మొండి ధైర్యంతో పెనుబండలా
పీఠం కదిలే భయ భావంతో
ఎటు వెళ్ళినా వీపుకి కట్టుకోనీ
చూడ లేని పలకలేని వినలేని
బొమ్మలతో కాలక్షేపం సరదాకి మంచిదే !

# 36

ఉద్యాన వనంతో ఉపమించే ప్రజాస్వామ్యం
ప్రేలే అగ్ని పర్వత దృశ్యాన్ని పొందుతూంది
కత్తితో గాలిని జయించే సంరంభంతో
మాటలతో కోటలు నిర్మించే ఉత్సాహంతో
పాత చరిత్ర జాడలు వీడవు, నిజమే.

గెలుపుతో పాటు ఓటమి తళుక్కుమంటుంది
ఒకటి తరువాత మరొకటి ఫాలంపై
గాలిని శుభ్రం చేసి వదలుతుంది చెట్టు
మనిషి వ్యక్తిత్వాన్ని వడకడుతుంది ఆదర్శం.
పుట్టుకతో ప్రవేశించిన శ్వాస రూపం
చివరి దాక నిలుస్తుంది ఆత్మబంధంతో

విశ్వాసం ఆశ్వాసం ఆదర్శంతో జీవితం
విలయం అంచుల్లో నుండి సృజన క్రియతో
వివేకం విజ్ఞానం ఆనందంతో మనస్సు
వెనుక దృశ్యం నుండి ముందు చూపుదాకా
యుగాల ప్రభతో మనిషిలో చేతన !
చీకటి కత్తెర నుండి బయట పడేస్తుంది.

సాయం సంధ్యలో చిట్ట చివరి కిరణం
పశ్చాత్తాప ఛాయతో వాలి పోతుంది
రోజూ చూచే ఉదయ సంధ్యలో మొదటి కిరణం
రోజు కొక కొత్త చిత్రాన్ని గీసి చూపుతుంది
సందేహం తొలగి పోయి నిశ్చయం స్థిరమై
సమస్య నుండి పరిష్కారానికి అభినవ యానం నాలో !

# 37

ఆత్మకు ప్రతిరూపం అంతరంగం
మనసులో రెక్కలతో పయనమవుతుంది
బయటికి కనిపించదు ఆకృతి
ఎగిరే రెక్కలు మాత్రం కనిపిస్తాయి
చూస్తూంటే అనుభవం విశాల తరమవుతుంది
ఆలోచనలో కాల్పనికం ఉన్నతిని పొందుతుంది.

బయటి దృష్టికి అందని స్థితిలో అమృతంకై
ఆంతర ప్రపంచంలో ఎగసేను విహగం !
ఇపుడు క్రోధం లేదు భయం లేదు కోట లేదు
రణం లేదు పణం లేదు హింస లేదు
ఆలయ గోపురాలు కనిపించవు
మ్రోగే గుడి గంటలు వినిపించవు.

ఆనందం పొందే లక్ష్యంతో
సత్యాన్ని పొందే సాధనతో
శిఖరం నుండి శిఖరానికి పయనం
ఎక్కడా విశ్రమించే అవసరం లేదు
వెనుక నుండి భయపెట్టే నీడలు లేవు
ప్రక్క నుండి లాగే చేతులూ లేవు.

స్వచ్ఛమయిన మనో రూపంలో
మంటల్లేవు మసి లేదు, ధూళి లేదు
లోపలి నుండి నాద ప్రపంచానికి
సమయ సమయ రాగంతో విరామం లేదు.
కవితయై కళయై జీవన లయలో ఆంతరయానం
దారిలో సాధనం మారొచ్చు, దృశ్యం మారొచ్చు.

# 38

తీరంలో నాగరక ప్రదేశాలతో
వీడని అటవీ స్థానాలతో
సమాజ సంపదలో భాగమై సర్వం
నాలో ఆత్మ గంగ ! శాంతి జల సేచనతో !
ఎరుపు తెలుపు నలుపు పసుపు బూది వర్ణాల్లో
దూరం నుండి పూలను తలపించే జ్వాలల్లో మనుషులు

అడుగు వేసే ముందు మెట్టుగా ఉన్న కాలం
అడుగు తీయగానే ఆకాశ మవుతూంది
విషాద కథ వినిపించడానికి
శిథిలాలు దారిలో వేచి ఉన్నాయి
మనిషికి మనిషి నుండి అందే వెలుగు
మనిషిని మనిషి విడువలేకుండా చేస్తూంది.

దాహం ఆకలి పూర్తిగా పోయే సమాజం ఎక్కడుంది ?
ధనమో?అధికారమో? మరేదో రూపంలో తిష్ఠ వేస్తాయి
కన్నీటి బిందువుతో తుఫాను చెలరేగ జేస్తాయి
ఆవేశ క్షణాలతో అగ్ని గోళాల్ని తిప్పుతాయి
క్రోధానికి కళ్ళెం వేసి
శాంతిని నడిపించడమే కర్తవ్యంలా ఉంది.

సమూహాల కదలిక ఆందోళన
సుసంఘటిత శక్తుల పోరాటం
ఒకదాని వెంట మరొకటి పయనంలో
మానవ సౌభాగ్యం కయి న్యాయం కయి !
ఎవరి ఉపకరణం వారి చేతిలో
శక్తియై బ్రతుకుతూంది బ్రతికిస్తూంది.

# 39

సృష్టికి మూలం ఏమయి ఉంటుంది ?
అది విత్తు అనుకుంటే, వచ్చేది పైరు, చెట్టూ
ఒక బిందువు అనుకుంటే, కదిలేది ప్రవాహం, సముద్రమూ
ఏ అణువో అనుకుంటే నిలిచేది మట్టీ, పర్వతం
జీవం అనుకుంటే, ప్రాణి, మనిషీ
చైతన్య స్థాయిలో భేదాలెన్నో !

అర్థరాత్రి స్వప్నం తెగి మెలకువ వస్తుంది
లేచి బయట సూర్యునిలా తిరగాలనీ
ఎక్కడేమి జరిగేదీ చూడాలనీ చీకటిలో
సూర్యు డెక్కడ ఉందీ తెలియదు.
తేజంతో ఒక కిరణం అయితే చాలనీ !
మనిషిలో అభిలాష ! మెలకువలో ఉందనీ తెలియదు.

అడుగు వేస్తే వెచ్చని స్పర్శతో
నేల ముఖం విప్పారాలనీ
చేయి చాస్తే కోష్ణ స్పర్శతో
గాలి మంచు పొరను వీడాలనీ
చూపులో వెలుగుతో
పరిసర వలయం వికసించాలనీ.

లే లేత కిరణం దూకిన దిశ
తెరచిన పుస్తకాన్ని తలపిస్తుంది
పసి పెదవులపై మౌత్ ఆర్గన్ స్వరాల్లా
వీథిలో వాహనాల హారన్ ధ్వనులు
అద్దంలో వర్తమాన ముఖంలో ఉల్లాసం
భవిష్యత్తు నందు కొనే ఉత్సాహ యానం !

# 40

నా దేశం నా హృదయం భావనలో ఒక తేజం
భౌతిక మానస రుచిలో ఎవరిది వారికి ప్రియం
తరాల మూలాలతో యుగాల కృషి రూపం
నిజ చరిత్ర దశలతో బ్రతుక్కి వరమై,
సమాజ పరిణామంలో భూమితో అనుబంధం
సుదీర్ఘ కాలం పై నిలిచిన సంస్కృతి శిఖరం.

గిరి తట నదీ తీర జనపద నగరాలతో
దారులవే ! అంతర్వికాస రీతులవే !
మనిషి మనిషితో భేదనలో క్రియలు వేరు
చర్యకు ప్రతి చర్యల పరిణామం తప్పనిదీ.
ఋషి నుండి ప్రవక్త నేత కవి "ఎందరో మహానుభావులు"
అంతరాత్మ ఒకటే ! మీటే జనహిత రాగాలు వేరు.

ఆశల మోపులతో ఆలోచన వంగి పోయి
వాకిలి ముంగిట్లో వేలాడే చూపులతో
పొలిమేరలు దాటాలనీ, అడుగు ముందు కేయాలనీ
విశాల దిశలో యానం ఒక అవసర మయిందీ
బాధల్లో సమాజ సమూహాల చలనంతో యానం
సముద్ర మయినా నావకు అలలు అడ్డు కావు.

వాదాలకు దూరంగా వికాస విజయ రూపాల్లో
నా దేశం నా ఊరు మాయని అనుభవ చిత్రం !
మల్లె పూవులా ఉదయం ఆహ్వానం పలుకుతుంది
రజనీ సుమ గంధలా నిశి స్వాగత మిస్తుంది
దేశం చరిత్రలో ఫ్రేమ్‌కు ఒదిగే అందం
విశ్వం ధరిత్రిపై ఫ్రేమ్‌కు ఒదగని బింబం.

# 41

నాగరకత గర్వంతో పైకెత్తిన శిరస్సులా
నిల్చిన సౌధాల్ని స్పృశిస్తూ నిశ్శబ్దం,
ఆగి ఆగి తిరిగి తిరిగి పరుగెత్తు తూంది
ఎవరికీ అందకుండా శబ్దం తరుముతూంది
శబ్దం నుండి శబ్దానికి శబ్దంతో
అర్థం నుండి అర్థానికి అభియానం.

లోపలి రాక్షసుణ్ణి వదలించుకొనీ
ఇవతలికి రావలసిన తేజోరూపం
లోపల శిలల్ని ఛేదించుకొనీ
బయటికి దూకాలిసిన కరుణ జలం
మనిషిలో రావలసిన ఉన్మేషంతో
యానానికి భావ జగతి నిస్తున్నాయి.

స్మృతి చక్రాన్ని తిప్పే సమయం లేదు
వర్తమానాన్ని విస్మరించే స్థితీ లేదు
గతంలోకి వెళ్ళి వేటలో పడే వేళలో
నిజాన్ని కప్పేసే శిల్పం చెక్కే సమయంలో
మనిషి మరచింది, వీధి దీపం జ్ఞాపకం చేస్తూంది.
సమాజం కోరేదీ, ఎడారి ముఖం సూచిస్తూంది.

అందమయిన శిల్పాల వరసతో చరిత్రలో
కోల్పోయిన జీవ శక్తిని కవిత్వం పూరిస్తూంది.
శూన్యమయిన హృదయాల వరసలో సమాజంలో
రాలి పోయిన విలువల్ని ప్రకృతి తనలో చూపుతూంది.
నిప్పులు నాటే ప్రోగ్రాంను తుడిచేస్తూ చిరుజల్లులా
పిల్లలు! తెల్లని దుస్తులతో చేయి చేయి పట్టుకొనీ!

# 42

విత్తనం అవసరం, ప్రకృతిలో ముఖ్యమైంది
భూమిలో అవలీలగా దిగిపోతుంది.
శిథిలం కావచ్చు అదృశ్యం కావచ్చు,
ఏమయినా మొలక! శిశువులా నవ్వుతుంది
పరితాపానికీ సంతోషానికీ అతీతంగా మార్పు
సహజమై జీవితాన్ని శాసిస్తుంది పాలిస్తుంది

విత్తనం అవసరాన్ని ఎవరూ కాదనలేరు
పైకి నేలపై ఎదిగి వచ్చే మొక్క
శాఖల్నీ ఉపశాఖల్నీ ఉత్సాహంతో ప్రకటిస్తుంది.
బీజం నుండి ఫలం వరకూ దశలెన్నో!
ఒక్కొక్క సమయంలో ఒక్కొక్కటి రూపొందుతుంది
దేని అస్తిత్వం దానిదే! అన్నీ సంపూర్ణంలో భాగాలే!

పుష్పాన్నో! ఫలాన్నో! తలపించే శాంతి!
చెట్టు నుండి కోసి చేతిలో పెట్టేది కాదు.
ఎవరికి వారు మనో బీజం నుండి
ఎదిగిన జీవితంలో పొందాలిసిందే!
వేదనలో తప్తమై ఆలోచన బయటపడుతుంది
తపస్సులో ఫలించి దర్శనం సాక్షాత్కరిస్తుంది.

మనస్సు ఎదిగితే ఆకాశాన్ని స్పృశిస్తుంది
వివేకం బింబమై చేతి కందినట్లుంటుంది.
మౌనం కదిలితే శబ్దం ప్రవహిస్తుంది
అర్ధ జలాల్లో మనస్సు పయనిస్తున్నట్లుంటుంది
ప్రతి ఉహ మాటల రెక్కలపై
బయట పడి పయనించాలనే!

# 43

ఓ

చేతిలో బంతిలా జీవితం నిలవదు
ఒకరు కాక పోతే మరొకరి చేతిలో కదలుతుంది!
ఆటలో ఎవరు ఓడినా గెలిచినా
కాలం వెనక్కి చూడదు, ఒక్కసారి అయినా
ఏ ఉల్లాసాన్ని ఏ విలాసాన్నీ ఖాతరు చేయదు
తన పని తాను చేసుకుంటూ పోతుంది.

ప్రవాహంలో నీరు అర్ఘ్యానికో దాహానికో
దోసిట్లో నిలిచేది మాత్రం కొన్ని క్షణాలే!
ఏది తరిగినా విరిగినా ఏది పెరిగినా
కాలంలో పరివర్తన జీవితంలో సహజం!
ఎంత కాలం గడచినా చిన్న నాటి ఊరు
చివరి దాకా శ్వాస చివర వ్రేలాడుతుంది.

ఎదలో వాడని పూల గుత్తి లానే కాదు
మతిలో తొలగని ఇంద్ర ధనస్సులా నిలుస్తుంది
నగరంలో సిమెంట్ సౌధంలో నుండి
ఊళ్ళో పాత ఇంటి చిత్రం గీస్తుంది
కారు దిగని శరీరంలో కణ కణం
ఎడ్ల బండిలో హాయి కలలు కంటుంది.

సినిమా పాట రెక్కలపై విహరించే జీవితం
జొన్న చేలో గాలి పాట రికార్డు వేసేను
వాగూ వంకల గల గలలూ కిర్రు చెప్పుల ధ్వని
మిమిక్రిలో సరదాగా ఉపకరించేను
సినిమా సెట్టింగ్‌లో పనికొచ్చే ఊరు దృశ్యంతో
మనిషిని జోక్‌చేసేది మనిషే! ఇంకెవరు చేస్తారు?

ఓ

# 44

గాలిలో ప్రాణం తీగెలా సాగుతుంది
రోజు కొక ఆయువు పుష్పాన్ని రాలుస్తుంది
నాలో మనస్సు వాద్యంలా మ్రోగుతుంది
ఊహ కొక శబ్దసార సౌందర్యాన్ని ఇస్తుంది
బహు చిత్రంగా! ఉంటుంది
కానీ ఇది సహజ నిజం!

శబ్దం కాలాన్ని మోయడమే కాదు
ఆకాశం అంచుల్నే స్పృశిస్తుంది.
అర్ధం మనస్సును వెలిగించడమే కాదు
జీవితం లోతుల్నీ చూపిస్తుంది
నాలో కావ్యం! జీవ ధారలా సరిస్తుంది
ఆత్మ గంగా హృదయ రూపం!

తీరాల్లో మానవీయ దృశ్యాలు
చరిత్ర పుటల్ని సమకూరుస్తాయి
ఆత్మ గంగనెవరు సమీపిస్తారు
అందమయిన అలల్ని ఎవరు తొడుక్కుంటారు
సాహసం కావాలి ఈత నేర్వాలి
ఒడుపు చిక్కాలి, అభిలాష ఉండాలి.

ఆత్మ గంగలో ప్రవేశించేదెవరు?
అన్వేషణ! ఆనందం! నిర్మలినం కోరే వారే!
నాలో శబ్ద జగం! మానస వేదికపై
మానుష భూమికల్ని ప్రవేశ పెడుతూ
నాలో ఆత్మ గంగ! ఆంతర చైతన్యంతో
ఆలోచనా తరంగాల్ని దుమికిస్తూ తరలిస్తూ!

# 45

ఏ రోజు అయినా ఉషస్సు గురించి
పత్రికలో ప్రకటనతో పనిలేదు
రేడియోలో ప్రసారమూ అవసరం లేదు
టెలివిజన్‌లో ప్రకాశనమూ అక్కర లేదు
మేల్కొన్న ఆకాశం నుండి
మేల్కొన్న మనస్సులోకి దిగుతుంది

వర్తమాన లిప్తను శిశువులా పారాడిస్తుంది
అంతర చేతనకు ప్రతీకయై కుసుమిస్తుంది
హ్లాదం మోదం ఆనందం శాంతం
వివిధ స్థాయిల్లో ఉషస్సు రూపాలే!
రాత్రి మెడపై నిలిచిన ఖడ్గం బదులు
ఈ సమయం మెడలో పూల దండ అవుతుంది

మనిషిలో అజేయ బిందువు సాకారం పొందుతుంది
బ్రతుకులో ఉత్సాహం రేకులు విప్పారుతుంది
ఇప్పుడు బూది రాశిలో
సూర్యుణ్ణి వెదక నక్కరలేదు
ఇప్పుడు సమాధిలోనుండి
రూపం కయి ఎదురు చూచే పనిలేదు.

బూది గాలిలో ఎగిరి పోతుంది
సమాధి మట్టిలో కలిసి పోతుంది
ఎవరు చూచినా చూడక పోయినా
ఎవరు గుర్తించినా గుర్తించక పోయినా
పయనంలో జీవన సత్యం వెనక్కి మరలదు!
కఠోర క్షణాన్ని దాటుతూ ముందుకు పోతుంది.

# 46

మనిషికి ఉనికి జగతికి
చేతనలో పూర్ణత నిచ్చింది
మనిషి ఊహలో ప్రకృతి
దేవతా కళల్ని పొందింది.
మనిషి బ్రతుక్కి గగనం
భవిష్యత్తు నిధి అయింది.

ఆవాసంతో ఫల సాయంతో వసుధకు
జీవన సార్ధకత చేకూరింది
కడలిపై నావలో మనిషిలో
అన్వేషణ విజయ పథం పట్టింది.
నింగిలో విమాన యానంతో మనిషి తల
సమున్నతమై గగన శిఖరమై నిలిచింది

పూలు పండ్లు ఆకులతో శాఖిలా
చేవ గల జీవితం బరువుకు భయపడదు
గాలికి పరిమళాన్ని ఇస్తూ చూపుకి అందాన్ని ఇస్తుంది
కొమ్మ నుండి రాలిన పుష్పంలా
హృదయం నుండి పెదవులపై మాట
వెడలి బహుదూరం ఎగిరిపోతుంది

నిప్పులు చిమ్మే స్థితిలో
శాంత స్పర్శ నిస్తుంది.
కలహంలో విషమ గతిలో
స్నేహ హస్త మవుతుంది
ఆదర్శం మూర్తమై శిల్పమై ఆలోచనలో
ఎంత కాలమయినా చెదరదు పయనంలో

# 47

ఎన్ని యుగాలు గడచినా ఉషస్సు
శాశ్వత సత్యానికి ప్రతిరూపం!
హింసకు పల్లవి కాదు
అశాంతికి చరణం కాదు
రోజు పయనానికి మొదటి క్షణాల్లో
'హ్యాపీబొకే'లా అందుతుంది.

కనుపాపల్లో ప్రతిఫలిస్తూ నిష్క్రమిస్తుంది
వేదికపై పగలుకు ప్రవేశం కల్పిస్తుంది.
ఎదురు నోటికి సీలు వేసి
తమ నోటికి మైక్ అమర్చి
వదల బడే ఆవేశ శబ్ద సమూహాలు!
అనల శకల రూపాల్లా కదలుతాయి!

కాళ్ళతో చిరు భూకంపాల్ని చిమ్ముతూ
చేతులతో మినీ తుపానుల్ని విసరుతూ
త్యాగాన్నీ జన హితాన్ని మరచి
భోగం అధికారం రెక్కలు ధరించేను
తప్పులు పరంపరలో భాగమయి
జీవన శైలిలో ఒకటయి పోయేను.

భవిష్యత్తుకు ద్వారం పేరుతో
ఆకాశాన్ని కిందికి దింపి
ఎవరికి వారు ఒక స్వర్గ ఖండంతో
ఇంద్రత్వం వెలగ బెట్టాలనే
విజయాశ్వాన్ని పట్టుకోవడం కాదు
ఆరాజక మృగాన్ని వదలడమే పనిలా ఉంది.

# 48

వివిధ వర్ణ పుష్ప గుచ్ఛంలా నగరం
రకరకాల వేష భాషల కలనంతో
మనిషిలో మనుషులు! బహు కృత రూపాల్లో
నేడు జరిగే పోటీ పర్యవసానంగా
రేపు పొందే విజయంకై ఆరాటంతో!
నడచి నడచి విపణి వీధుల్లో అలసీ

హద్దు లేని విహాయసంలో విహగమై
ఎగసి తిరిగి దిగాలనీ ! స్వేచ్ఛకు పతాకయై!
కన్నీళ్ళలో అగ్ని క్రోధానికి దారి చూపుతుంది
కన్నీళ్ళలో కాంతి క్షమకు దారి తీస్తుంది
చావడానికీ చంపడానికీ కాదు జీవితం
బ్రతకడానికీ బ్రతికించడానికీ మాత్రమే

కఠోర ధ్వనికి పసి హృదయం ముఖంలో
చిరు నవ్వు చకితంగా ఎగిరి పోతుంది
ఏడుపు వరద పాయలుగా సరిస్తుంది
దిక్కుల్లో భయసీమల్ని పెంచుతుంది
దెబ్బకు నేలకు ఒరిగిన పావురం! ఎగర లేదు
కానీ! ఉన్న వాటిని కాపాడే బాధ్యత మనిషిదే!

లోపల అణగిన అగ్ని బొగ్గు అవకూడదు
రెక్కలు ముడిచింది లేచి ఉత్సాహ కళ పొందనీ!
కన్నీళ్ళు వాటి అంతట అవే! ఎండి పోకూడదు
మరొక హృదయం నుండి వేళ్ళతో తుడవబడితేనే తృప్తి
పైనుండి క్రిందికీ లోపలి నుండి బయటికీ
రాళ్ళ మధ్య ఆత్మ గంగ నడకలోనే జీవితం!

# 49

సత్యాన్ని వెలిగించే సూర్యుణ్ణీ
న్యాయాన్ని పాలించే చంద్రుణ్ణీ మీరి
మస్తిష్కం ఆ పైకి పోవాలనే
గగన తలంలో పోటీపడీ!
ఆరోహణలో ఇనుప బూట్ల క్రింద
అణగిన గుండెలో విషాద పర్వం!

నియంత నిజ రూపాన్ని బింబిస్తూంది
మనిషిలో మలిన శక్తికి పట్టం కడుతూంది
చరిత్ర ఏ నీతి సూత్రంపై నడవదు
పయనంలో ధాత్రి సమతలంతో ఎదురు కాదు

అశాంతి వదనాన్ని హ్లాదంతో అద్దుతూ
హృదయం వినిపించే వేణువు స్వరం!
సమాజంలో ఎదురయ్యే సమస్యల
తుపాను ఆవేగాన్ని అనునయిస్తూంది
దవానలం ఆవేశాన్ని దువ్వుతూంది
విలయ గతికి బ్రేక్ వేస్తూంది
తెల్లని మెరుపు వంటి ఆలోచన
మూసిన దారుల్ని తెరుస్తుంది పయనంలో

ఇప్పుడు గతించిన క్షణాలతో కన్నా
రానున్న క్షణాలతోనే పని! జీవితంలో
నెత్తురు పారాణితో భూమి
అగ్ని తిలకంతో ఆకాశం!
విషాద దృశ్యంలో సాయం సంధ్య!
వెన్నెల హస్తంకై ఎదురు చూస్తూంది

# 50

కత్తితో పూలు కోయా లనుకోవడం అవివేకం
      బాంబుతో ప్రాణుల్నీ మనుషుల్నీ
హత మార్చా లనుకోవడం మౌఢ్యం
      హిరోషిమా నాగాసకి విధ్వంసాల దృశ్యం
పునరావృతం కాకూడదనే! ప్రజల కోరిక
      మనిషిలో శాంతి ఇంకా మొగ్గగానే ఉంది

కాలం కథ నడుపుతుంది
      పయనం ఆగదు, చక్రంలా తిరగదు
విజ్ఞానం మసిబట్టి
      సహృదయత శుష్కించి
మనిషి రాతి ప్రతిమలా మారేను
      అవసరానికి పూజల్నీ అందుకునేను

తోటి మనిషి రక్షణలో మనిషి
      శరీరాన్ని అర్పించే బదులు
తోటి మనిషి తలను తీసి
      బహుమానంతో లంఘించేను.

ఎత్తు నుండి చూస్తే రాత్రి నగరం
      వెలిగే విద్యుత్ దీపాల అందంతో
మిగిలిన పగటి గుర్తుల జాడలతో
      మిక్స్ అయిన రంగుల దృశ్యం!
తెరచిన కొత్త కవిత్వం పేజిలా ఉంది
      అర్థం కావలసింది మిగిలే ఉంది!
వ్యక్తిలో కవి సందర్భం ఒక కాంతి ప్రవాహం!
      కాలం చూపే చిరునామా మునిగిపోని క

స్వేచ్ఛా కవిత్వం
రెండవ భాగం - 9

# ఆత్మ బంధం

మాదిరాజు రంగారావు

**2008**
రసధుని సాహితీ పరిషత్తు
శాంతినగర్, హైదరాబాద్ - 500 028

Presented

to my daughter

***Mrs. Haritha,*** *M.A. Lit.*

Detroit, Michigan U.S.A

with affection

# ప్రవేశిక

మానవ జీవితంలో భౌతికమయిన వాస్తవ తలం ఆధారంగా అనుభవంలో అంతర్ నిహితమయిన అంత రంగ జగత్తును ధ్వనింప జేసే కృతి "అంతరంగ ధ్వని".

## ఆత్మ బంధం

వర్తమాన కాలంలో ప్రపంచమంతా ఏదో ఒక రూపంలో హింస అశాంతి విధ్వంసంతో రణచ్ఛాయలు విషాద పరిణామాలకు దారి తీస్తున్నాయి. అమెరికా బ్రిటన్ ఇరాక్ శ్రీలంక ఇండియా అఫ్ఘనిస్తాన్ ఇట్లా చెదురు మొదురుగా వివిధ స్థలాల్లో ఏదో ఒక రూపంలో ఒక్కొక్క విధమయిన దయనీయమైన స్థితులు నెలకొన్నాయి. ఇక ప్రతి దేశంలో ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న ఇండియాలో స్థానికమయిన సమస్యలనేకం! వీటితోపాటు వ్యక్తిలో సాధారణ స్థాయి జీవితం నుండి రాజ్యపాలనా స్థాయి వరకూ అన్ని శ్రేణుల్లో స్వార్థం అసహనం అవినీతి హింస విరివిగా చోటు చేసుకున్నాయి. సమాజంలో ఉదారత సహనం నీతి శాంతి కరువైన స్థితులూ దృష్టికి వస్తాయి. ఎంతో కాలంగా ఎంతో కృషితో సముపార్జించిన సంస్కార సంపద – వికాస రూపం క్షణాల్లో మాయం కావడం దురదృష్టం. సమాజంలో మనుషుల మధ్య అనేకమైన రాజకీయ సామాజిక వైయక్తిక కారణాల వల్ల వైరం ప్రబలి దూరదూరమయ్యే ప్రమాదకరమైన స్థితుల నుండి "ఆత్మ బంధం" తిరిగి వైయక్తిక, సామాజిక, నైతిక, తాత్త్విక భావనలో కలుపుతూ పోతుంది. ఇది కొంత అలస్యంగానైనా జరుగుతుంది. ఈ విధంగా ఈ కావ్యంలో మనిషిలో మూల మనోరూపం కార్యసాధనలో అవలంబించే విలువలూ – ప్రమాణాలూ పద్ధతులూ – లక్ష్యాలూ మొదలైన అంశాలు నిర్వహణంలో వెనుక నుండి పని చేసాయి.

వివిధ దేశాలు స్వాతంత్ర్యం పొందాక ప్రజాస్వామ్యాన్ని ఉత్తమంగా పరిగణించి స్వీకరించాయి. అయితే మౌలికంగా మానసికంగా వికాసస్థాయి లేకపోవడం వల్ల స్వార్థం కేంద్రంగా దుశ్చర్యలు కారణంగా ప్రజాస్వామ్యంలోని ఉత్తమ స్వరూపం మరుగున బడిపోతూంది, ఈ దృష్టితో మొత్తం మీద ఈ కావ్యంలో 1. సామాజిక చింతన 2. మానసిక చిత్రణం 3. జీవన రీతులూ (వ్యవహారం – రణ సదృశ స్థితి – సమస్యలూ– పరిష్కార దృష్టి) 4. తాత్త్విక స్పర్శ అంశాలతో వస్తువు ప్రకాశమానమయింది.

మనిషిలో ప్రధానంగా ఉండే రణతత్త్వం వివిధ కోణాల్లో భావితమయింది. మానవ వికాస చరిత్రలో ఆయుధానికి గల స్థానం – సామాన్యుని అభివృద్ధికి ఉండవలసిన ప్రాధాన్యం – మొత్తం మీద మానవ విజయ రూపం భౌతిక మానసిక తాత్త్విక రేఖలతో ఆవిష్కృతమయింది. అవరోధాల్ని అధిగమించే సంకల్ప శక్తి వివేక గుణం సత్క్రియా రూపం ఉన్నతమైన లక్ష్యంతో “ఆత్మ బంధం” – మనిషి మనిషినీ విశ్వ భావనలో కలిపే మహత్తర శక్తి రూపంగా ప్రతిపాదితమయింది. వస్తువులో నవ్యతకూ అభివ్యక్తిలో ప్రసన్నతకూ నిలయమై స్వేచ్ఛా కవిత్వాన్ని పరిపుష్టం చేస్తూంది.

## సృజన మేఘం - జలద గతికై - ఉగ్రచరణం

స్వేచ్ఛా కవిత్వంలో “హృదయ మేఘం” కృతి వెలువడిన తరువాత, మా అమ్మాయి చిరంజీవిని హరిత ప్రేరణతో వ్రాసిందీ సృజన మేఘం. కాస్త శ్రుతి సుఖంగా ఉండాలనే కోరిక మేరల్లో అవతరించింది. నాకూ తీసుకున్న వస్తువులో పూర్ణతపై దృష్టితో అవసరమూ, ఉచితమూ అనిపించింది. ఇది సరియైన సూచన కావడం చేత ఆలస్యం లేకుండా మనస్సు లగ్నమై స్తిమితమైన స్థితిలో కృతి రూపొందింది, రచన భిన్నంగా ఉండడం సహజం. 1. హృదయ మేఘాన్నీ 2. సృజన మేఘాన్నీ కలిపే ఒక విషయ సూత్రం పయి రూపొందిన కావ్యంగానూ పరిగణితమయ్యే అవకాశం బాగా ఉంది.

ఇక మరో విధంగా దీని విస్తరణ రూపంగా 'ఉగ్రచరణం' చేర్చబడింది. కారణం, మేఘ నిరాసనం మేఘ నిరాకరణం అంటే మేఘాన్నీ కోరని లేదా అది లేని స్థితి ఉగ్రవాద భావంలో కన్పిస్తుంది. సమాజ పరంగా ఆర్ద్రత స్నేహం కరుణ ప్రేమ కొరవడిన నీల మేఘ ప్రసక్తి లేని సమయమూ ఉంది, జీవితంలో "కఠోర వాస్తవాలకు భూమికయై" అన్నవి "సృజన మేఘంలో చివరి మాటలు, "ఉగ్రచరణాన్ని అంది పుచ్చుకునేవి. ఈ మలుపు కారణంగా "స్మృతి గుహలో," "మేల్కొన్న సమాజం" చివరి కవితల్లో శైలి భిన్నంగా ఉంది.

కృతిలో సృజన మేఘానికీ ఉగ్రచరణానికీ మధ్య "జలదగతికై" చిన్న భాగం లింకులా ఉంది. జలదం కరుణతో కూడిన ఉదార మనో రూపానికి ప్రతీక. జలద పరంగా ప్రకృతితోనూ, మనోపరంగా మనుషులూ జీవించే సమాజంతోనూ అన్వయిస్తుంది. దీని జాడలులేని సందర్భాలెన్నో! సమయాలెన్నో! విపరీత పరిణామాలకూ దారి తీస్తాయి. వీటిలో ఇదొక సమాజంలో వికృత పరిణామ పర్యవసానమే ఉగ్రచరణం. దీనికి కారణాలెన్నో! విశ్లేషణ కందుతాయి. సామాజికం రాజకీయం 'మత మౌఢ్యం ఇలా!

ఇక్కడ జలదం ప్రతీకగా ఉంది. ఇది లోపించీ దీని అవసరాన్ని భావింప జేసే తపింప జేసే సందర్భంలో నిరీక్షణం సహజం. ఇది మనిషీ – సమాజం పరంగా "జలద గతికై" భాగం సంవిధానంలో లింకులా పని చేస్తూంది. నిర్వహణ శిల్పంలో భాగమయింది. ఈ విధంగా సృజన మేఘం "జల గతికై" "ఉగ్రచరణం" కావ్య పరిణామ క్రమంలో సూత్ర రూపాన్ని దృష్టికి తెస్తూంది. సూక్ష్మతలంపై సంవిధాన కళను స్మరింప జేస్తూంది. పూర్వం వెలువడిన "హృదయ మేఘం" కృతికి విస్తరణ భాగంగా నిలుస్తూంది. ఈ విధం వస్తువులో ఐక్యతా స్ఫూర్తిని తలపిస్తుంది. ఇక దిశా నిర్దేశం గురించి పూర్వం నుండి ఉదార ప్రజాస్వామ్యానికి "liberal democracy" కు సంబంధించిన దార్శనికత ప్రత్యక్షంగానో పరోక్షంగానో నా కృతుల్లో ఉన్నదే!

ఇక "ఉగ్ర చరణం"లో ఉగ్రవాదం ప్రభావ పర్యవసానాల చిత్రణం, ఉంది. మేఘ దృశ్యం లేని స్థితి. భయం హింస అభద్రత విధ్వంసంతో బీభత్సమయమైంది. ఇది ఒక నాటితో ఏవో చర్యలతో అంతమయ్యేది కాదు. ఎటువంటి పరిస్థితుల్లోనూ శాంతి అవసరమే కాకుండా అనివార్యమన్న భావం వ్యంజితమయింది.

ఈ భాగాల్ని కలిపిచూస్తే మంచిది. 1. మేఘ స్పర్శ ఉన్న వాతావరణంలో 2. మేఘ స్పర్శలేని వాతావరణంలో భౌతిక మానసిక స్థితి రూపం సమాలోచనాని కందుతుంది. ఈ భాగాలు కలిపి చూడకపోయినా దేనికది పూర్ణతకు భంజకం కాని భావ స్థానాలతో అలరిస్తుంది. ఈ కావ్య పరంపరా సమాకలనం 1. హృదయ మేఘం 2. సృజన మేఘం 4 జలద గతికై 5. ఉగ్రచరణంతో స్వేచ్ఛా కవిత్వంలో సంవిధానం, భావన, అభివ్యక్తితో, నిర్మాణ పరంగానూ అనుభూతి శీలంగా వైవిధ్యాన్నీ పరిపూర్ణతనూ చేకూర్చేదిగా భావిస్తాను.

2-1-2008 **– మాదిరాజు రంగారావు**

# ఆత్మ బంధం

1.

జననంతో అవని పైకి
వచ్చిన నవ క్షణం నుండి
సమాజ గుణ చలనంతో
ఆరంభం మానవ బంధం.
మనో బీజ భావనతో
జీవన తరు చేతనతో
పూల కయి పండ్ల కయి
వీక్షణం నిరీక్షణం! మనిషిలో.

మనిషి చరిత నడిచేందుకు
కాలంతో కాదు పని,
క్రియతో శ్రమతో మతి విభంతో.
జీవన గతి పొందేందుకు
మాటలతో కాదు పని,
చేతలతో నేయంతో ధ్యేయంతోనే.

చరా చర జగతిలో
బ్రతుక్కి అస్తిత్వం
సమాజ ప్రభావాల మధ్య
ఆత్మ ప్రకాశంతో.

ఆయువును అల్లుకొనీ ఆకర్షణతో
రోజు కదలి వాలి పోతుంది.
అనుభవం పూచి రాలి పోతుంది.
ఆలోచన వీచి తరలి పోతుంది.
వినిర్మాణ విధ్వంస కరాలతో
మనిషిలో మనుషులు! ఎందరెందరో!

2

కాంక్షా బిందువుల నుండి
గెలుపూ ఓటమి చిహ్నాలతో
జాతి దేశ మత దళ విదళన రూపాలు
లక్ష్యంలో భిన్న దృష్టి దిశలతో

ఏదో ఒక స్థాయిలో
రణ భావన లేని
రణ చర్యలు పొందని
జీవిత వలయం లేదు.
పుట్టుకతో మనసు
స్ఫటిక సదృశ మయింది
దశ దశలో
వివిధ వర్ణ దృశ్యాలను పొందుతుంది
శోకం రాగం క్రోధం వీరంతో
వరసగా ఆత్మముఖం కప్పుతుంది.

కల్పనలో జల్పనలో
బహు కృత వేషాల్లో
మనుషులు కోల్పోయే
ఆత్మ బంధం! గురించి
అపుడపుడూ ఆవేదన! సమాజంలో
దీని వెంట ఆలోచన! అన్వేషణ

3

రణ తరంగం మనిషి నుండి
మరో మనిషిపై ప్రకృతిపై ప్రాణిపై
క్రోధం శబ్దించే ఆయుధాల గర్జనం
విస్ఫోటం విరజిమ్మే బీభత్స రూపకం.

స్మృతి మెరపులు ఒకటొకటీ
సాహస శిఖరాలతో మనిషిలో
రణ పర్వంలో అశ్వం పయి
పరుగులు తీసే వీరుల దృశ్యం
రణ చరణాలపై వెళ్ళిన వీరుల
బంధువులూ మిత్రులూ అభిమానుల ఊహల్లో
విజయానికి చిహ్నంగా కొండ లెక్కుతూ
సాహస రూపంగా అడవి నదిని దాటుతూ.
వీర భావ స్పర్శకు పులకించిన శిలలు
సజీవ ప్రతిమ లయి మాట్లాడతాయి.
వైరి సీమ దాటి పయనిస్తూ సుందరంగా
పక్షులు కిందికి దిగి స్వేచ్ఛగా
సోల్జర్ చేతిలో బిస్కట్ తీసుకొనీ
ఎగురుతాయి, ఇంట్లో పిల్లల్ని తలపిస్తూ
శత్రుతకూ మిత్రతకూ అతీతమై
ప్రాణి ఇరువైపుల్ని కలిపే వంతెన.

బయట వాన చినుకుల చిణ చిణ లయకు
స్మృతి రాగం జత చేయబడుతూంది.

అనల శిఖలపై నుండి దాటుతూ
చీకటిలో దిగి మునిగి చల్లగా
పైకి లేచి కదలుతూంది, శాంతి!
సమయ సమయం బ్రతికి బట్ట కట్టినట్లయి
ఇసుక ఎడారిలో సన్నని జలపాతంలా
మంచు పటంపై వెచ్చని వెలుగు బొమ్మలా.

జలధి నుండి ఓడకు చేరుస్తూ
చీకటి నుండి వెలుక్కి తరలిస్తూ
చేయి! అపుడపుడూ! మనిషిదే!
మనిషిని వెనుక నుండి
వెన్ను తట్టి నడుపుతుంది.
వీడని ఆత్మ బంధం మనిషిలో,
నింగిలో పక్షికి సమాంతరంగా
భూమిపై శాంతికి నికేతనంగా.

4

రణ మారణ చలనంలో
సిద్ధమై మృత్యు వాహనం
వెనకో ముందో ఏదో రూపంలో
ఎప్పటికీ మనిషిని వదలని బంధం.

రణానికీ పణానికీ విపణి వీధికీ
హరిణంలా కాలం ఆయువులో
కోరికలో మెరపులతో పరుగులు తీయిస్తుంది
నడకల్లో అందంగా వేగంలో భేదంతో.

మంచు పటంపై తళ తళ కిరణాక్షరాలు
అనల భ్రాంతితో భయ చిత్రం చూపేను
ఉన్నత శిఖరాలను మాయం చేస్తూనే
వీడని పొగ మంచు చిత్ర శాలలా!

చీకటినీ ఎడారినీ కోరరు ఎవరూ
అయినా ఇరువైపుల తమ కోరికతో
చేతులు చాస్తాయి, దిశ దిశ నుండీ.
తెల్లని మది కోసం, పచ్చని హృది కోసం

వెలుగుకై ఆరాటం
          జలం కై ఆవేదన
తప్పదు ప్రతి మనిషిలో
          రణ చరణ పథంలో
బాధలో ప్రతి మనిషీ మౌనంగా
          నిశి నక్షత్రంలా మినుకు మినుకు మనేను
కవి గళం నుండి వినిపించే స్వరంలో
          అర్థంలో ఆప్తత గుప్తతతో ఉపశమం!

5

వేటలో క్రూర కర్మకు అందరూ సిద్ధమే
          ప్రాయశ్చిత్తంపై మనసు ఉండ దెవరికీ!
దారిలో విరిసిన మోదుగ పూలు స్వాగతం చెబుతాయి
          గంధానికి బదులు ముఖాన అనల కళతో.

గుండె నుండి ఆయువు లయతో
          అడుగులు జత కడతాయి
నదిలో అలల మధ్య ఈదే మనిషి తలకు
          గురి పెట్టబడిన ఆయుధం!
మధ్య మధ్య మౌనం వీడుతూంది.
          తలకు ఉన్న రివార్డుకో? అవార్డుకో?
మారణ రణ సమయం
          ఎపుడు బడితే అపుడు రాదు.
దీని కెంత రాజనీతి మంథనమో?
          దీనికెంత శక్తి యుక్తి తాండవమో?

మనిషికి మనిషితో గడపడం కన్నా
          ఏ జంతువుతోనో ఏ బొమ్మతోనో
గడపడం ఇష్టం; బహు సులభం కూడా

ఇవి తనతో భేదించవు
వాదనకూ రణానికీ దిగవు
పెట్టెలో వస్తువుల్లా పడి ఉంటాయి.
తనలో ఎదురులేని
అహంకార భద్రతకే లోటూ ఉండదు.

వినీల నీల లోహ ధ్వనులు
మనిషి మనిషి నుండీ అపుడపుడూ
ప్రతి ధ్వనినీ శ్రుతి సరిచేసుకొని
వినే పని తప్పదు! విధి తప్పదు.
గదిలో గోడల మధ్య ఒంటరిగా ఉన్నా
వనిలో చెట్లలో ఒకటై పోయినా
విషమ స్వరం మ్రోగుతూనే ఉంటుంది.
మనో గగనం శబ్దిస్తూనే ఉంటుంది.
వేటలో చిందీ
రణంలో ఎగసీ
ఏర్పడే రక్త చిత్రం
మనిషి యశో రూపానికి
పాప దోషం ఒక మరకే!
విజయ పూర్ణతలో లోపమే!

6

గగన తలం నుండి రాత్రి
రణ విధ్వంస ప్రహారం
మెరపులతో పిడుగులతో
విమాన గణ సంచరణం.

శాంతి రూపం ఇంద్ర చాపం
దగ్ధమై పలు ముక్కలై

అవనిపై పడుతూన్న దృశ్యం
నడుస్తూంది కాలం! ధూమ పథంలో.

కొండ క్రింద కదలే నది
దేశ చరిత్రకు సాక్షి
తేలి పోయే శవాలతో
విషాద వర్ణ సరణంతో
నెత్తురు జాడలతో
అలలు వణకుతున్నాయి.
సమాజ గ్రంథం పుటల్ని
దగ్ధం చేసే ప్రబుద్ధులూ
అగ్నికి స్వర్ణ కిరీటం
ధరింప జేసే ఉదారులూ
ఎగిరే బూదితో సందేశం
ప్రసరించే శాంతి ప్రియులూ.
పవిత్ర గ్రంథాల్లో
ఆయుధ రూపం దర్శిస్తూ
విశ్వ విజయ కాంక్షతో
మృత్యు సర్గ రచించేరు.

7

స్వేచ్ఛా సమాజంలో చేరిన దేశంలో
అడుగు నుండి ఎదిగే అమృతోత్సాహం
ఎవరికి వారు కోరే ఆకృతిలో
భవితవ్యం చిత్రణ జరగాలనే
అంతరంగం మరచి మనిషి
నీలి దారి వదలడం లేదు
అగ్ని శిఖల ఆవేశం
ప్రజను మంటల్లో దింపుతూంది.

దీని నార్పే జలవాహనం
వెనకనే! తప్పని సరి అవుతూంది.

మంటల శ్మశానంలో సంతాపం
సాయం సంధ్యను తరుముతూంది.
త్రవ్వే గోతుల వద్ద విషాదం
సాయం నీడల్ని మ్రింగుతూంది.

ఎక్కడో పొలంలో పని చేస్తూ
ఎక్కడో మేపుకొని పశువులతో వస్తూ
తలపై గడ్డి మోపుతో నడుస్తూ
కాలువేసి పేలిన మందు పాతరతో
కాలం స్తంభించినట్లుంది.
జీవితం ముక్కలయినట్లుంది.
మానవ శక్తిని బూది పాలు చేస్తూంది
మారణశీలానికి ఇనుప కవచ మందిస్తూంది
అస్తమించే సూర్యుడు తునాతునకలై
భూమిపై చెదరి పోయిన దృశ్యం!

8

ఆదర్శం జీవిత వాస్తవం మధ్య
ఆచరణలో విషమ ప్రజాస్వామ్యం
కుంపట్లో పూల మొక్కలు పెంచే యత్నం!
దోసిట్లో బాష్ప జలాల్లో మానవత! తేలుతూంది.

పూవు లేని ఫలం లేని చెట్టు
నీడకో కట్టెలకో పని కొస్తుంది.
జాలి లేని నీతి లేని గుణంతో నిర్వాకం
భయానికో ఆపదకో ఉపకరిస్తుంది.

చెట్టు కొమ్మ పూలను
    పూజకు ప్రసాదిస్తుంది
అలంక్రియకు అనుమతిస్తుంది
    కాలి క్రింద నలిగి శపిస్తుంది.

సమాజంలో పొరలెన్నో జీవిత విధాలన్ని
    పొర నుండి పొరకు ఆరోహణలో
పైకి చూస్తే ప్రతి శిఖరంపై ద్వేషానలం!
    క్రిందికి చూస్తే లోయలో బాష్ప జలం!
సాధారణ బడుగు జనం
    అడుగు పొరలో జీవితం!
నడిచేందుకు తప్పని దారి తప్ప
    బ్రతికేందుకు భూమి అసలే లేదు.

నీడ కోసం చేరితే
    చెట్టు కొమ్మ నరికేసినట్లు
ఉనికి కోసం కదలితే
    ఉన్న బ్రతుకు ఊడుతూంది!
మసి క్రమ్మిన కిరణాల మధ్య
    ధూళి చిమ్మే గాలుల నుండి
పడుతూ లేస్తూ పోయే జీవితాల్లో
    మండే అడవి హృదయంతో
గుప్త మృత్యు పాత్రలపై అడుగులతో
    స్థలం నుండి స్థలానికి మారుతూ
పునరావాస క్రియలో ప్రజాస్వామ్యం!
    జన జీవన ఫాలంపై అనల తిలకంలా!

9

మనో నిలయంలో సగ భాగం వదలీ
మిగిలిన జగత్తులో బయట పడేను మనిషి.
ఏకాంత బిందువులోనూ
సమాజ వలయంలోనూ
సందేహం వీడడం లేదు
ఏ సమస్య తీరడం లేదు

క్యాలెండర్ తేదీలతో పని లేదు
మనుషుల జీవన హృదితోనే పని.
వేసే ప్రశ్నకు సమాధాన గుణంతో పని!
వచ్చే సమస్యకు నిర్ణయ విధంతో పని!

సముద్రమో మహానదో చెరువో వాగో
ఎంతటి వయినా జలాలన్నీ ఒకటే!
జలాల నుండి వలలో ఇలపై చేపల్లా
క్షణాలు! అంతలో గతానికి బంధువులవుతాయి!
సముద్ర జల తీరంలో
నడిచే సంతోషం వేరు
దాహం తీరే
దోసెడు జలం తీరు వేరు.

చెరువులో నీరులా
అవనిపై పైరులా
తరువుపై ఆకులా
మనిషిలో మానవత అవసరం!
ఎండీ వాడీ రాలీ
ప్రతి అనుభవ దశలో

ఎదలో మిగిలిన రూపం
గుర్తు లెవరు మరుస్తారు.

ప్రకృతిలో మనిషిలో తప్పనివీ
బ్రతుకులో సమాజంలో వచ్చేవీ
మార్పులూ! గతాలూ! శిథిలాలూ
స్మృతులూ! గాయాలూ! వేదనలూ
వీటితోనే తెలిసేదీ
తామున్న సంగతి ప్రపంచానికి!

10

విషమ లిప్తకు సృజన కిరణం
శిల్ప సుందర రూపాన్నిస్తుంది
దీని కొక వ్యాపార ప్రాప్తి రావచ్చు
ప్రదర్శన శాలలో చోటు చేసుకోవచ్చు

వెచ్చని కన్నీటి బిందువు నుండి
అవతరించిన కళా ఖండం
ఘనీ భవించిన విషాద భావన నుండి
ఆనంద డోలికల్ని అందిస్తుంది.
పచ్చని సౌభాగ్య సౌందర్యం నుండి
ఉద్భవించిన అజంతా ఎల్లోరా
మనోభవ ప్రణయ ముద్రలతో
బ్రతుక్కి ఆత్మీయాన్ని ప్రసాదిస్తాయి.

అనుభవ బీజం నుండి
అవతరించిన పద పల్లవం
కాగితంపై కవితయై సుమిస్తుంది
పక్షియై ఎదలో వాలుతుంది.

కోప కణం నుండి ఉగ్రమై
అవతరించిన రణ పర్వం
కీలా నృత్యానికి వేదిక అవుతుంది
చరిత్రకొక ఉత్తేజాన్నిస్తుంది.
జీవ కణం నుండి
ఎదిగిన జీవిత రూపం
కాలానికి అస్తిత్వ గుణాన్ని ఇస్తూంది
ప్రపంచానికి ప్రవాహ రూపాన్ని ఇస్తుంది.

11

ఊహలపై మౌనాన్ని వివేకం
జలాలపై నావలా నిలుపుతుంది
ఈహలలో హృదయాన్ని ఆదర్శం
అలలపై హంసలా దింపుతుంది.

చేతల్లో లక్ష్యాన్ని సంకల్పం
చేతులపై శిశువులా పెంచుతుంది
ఆంతర భయం దూరమై మాయమై
ఆలోచన పొందుతూంది ఆశయ వేగం.

ఏ రవియో ఏ శశియో
మనో జగతి బింబిస్తే సరిపోదు
మానవతా తేజ మొకటి
వెలుగు చూపితేనే సార్థం.

ఆది యుగం నుండి ఆయుధం
దశదశలో పరిణామ సరణిలో
తీరని కోరికకై కదలీ తరలీ
విలయ శిఖలు చూపిందీ

మారణ చణ ఉపకరణంగానే
కాలానికి పరిచయమయిందీ.

విసరిన వలలో చిక్కిన శరీరం
విడిపించే చేయికై ఎదురు చూస్తుంది
అది మలిన మయిందీ కావచ్చు
నెత్తురు మరక పడిందీ కావచ్చు
కుసుమాలను వదలేదో?
సర్పాలను విసరేదో?
ఏదైనా కావచ్చు
తన పూర్వ చరిత్రలో.

12

నీడ నాకు ఆటంకం కాదు
పాదాలకు శృంఖల కాదు
చిన్నది అయినా పెద్దది అయినా
పొడవైంది అయినా లఘువైంది అయినా
వల పన్నదు నాపై
భయ కెరటం వదలదు.

చుట్టూ ప్రపంచంలో మగ్నమైపోయే నాకు
నీడ గురించి ఆలోచన అంతగా ఉండదు
తమకు తాము కావాలని మరీ
నీడల్ని పొందే వారూ ఉన్నారు.
తమకు తాము కోరి మరీ
నీడల్లో కలిసే వారూ ఉన్నారు.

వెనకో ముందో ఏ వస్తువు నుండో
వచ్చే నీడ! ఎపుడయినా మాయం కావచ్చు

ఎందరో నీడను ఆశ్రయిస్తారు
అవసరంలేనపుడు వదలిపోతారు.
ఏ దిక్కు తోచని సమయంలో
ఆపదలో తాపంలో నీడ అవసరం
వేడుకలో కాలక్షేపంపై
నీడను చేరడమవుతుంది
నీడను పొందిన శరీరాలు అలవాటై
నీడను వదలి పోవాలనీ ఉండదు
నీడన చేరిన శరీరాలు క్రమంగా
నీడలో కలసిపోవచ్చు; బ్రతుకులో.

13

చెట్టుకి కట్టేసిన అశ్వం పయి
అధిరోహించి గుండ్రంగా తిరుగుతూ
తాడు సాగినంత దూరం
పయనంలో ఆనందాన్ని పొందే వారూ
మ్యూజికల్ చెయిర్ ఆటలో
ఒకరి వెంట ఒకరు పరుగెత్తుతూ
గ్రహాల్ని చుట్టేసే సంతోషం పొందేవారూ
వినోదమో విజ్ఞానమో విజయమో కోరీ
చివరకు మిగిలే కుర్చీ! ఒకటీ
ఎవరికి దక్కేనో? ముందుగా తెలిపేందుకు
ఎన్ని శాస్త్ర పద్ధతులో? ఎందరు జోస్యులో?
అజ్ఞానం హద్దుల్ని తెలియ నీయదు
అమాయకం ఉత్సాహాన్ని పెంచుతుంది
తత్కాలంలో ఫల భావ నిరీక్షణంలో
అసహనం! ఆవేశం! ఆగ్రహం!
చకితంగా మధ్యలో తపస్సు భగ్నమై
సమయం సందర్భంలో జడభావం పొందుతూంది.

ఆలోచన తిరగబడీ చుట్టుకొనీ
మెడకు ఉరిత్రాడు అవుతూంది.

భూమి నుండి స్వర్గానికి కల్పన
భవిష్యత్తు భద్రతకై సుఖంకై
భౌతికం నుండి దివ్యానికి శ్రేణిక
తేజంలో మానసికానందంకై.

వేదనలో ఒక కన్నీటి చుక్క ముందు
పది ఆలయ శిఖరాలు తలవంచుతాయి
ముఖంలో ఒక తృప్తి రేఖ ముందు
కల్పతరువు పెరటి చెట్టు అవుతుంది.

14

గిరి శిఖరం జలదం రాకను స్వప్నిస్తుంది.
తరు హృదయం పూవునూ పండునూ స్వప్నిస్తుంది.

మనిషిలో ప్రేమ శాంతి కరుణ ఒక స్వప్నం
అందని ఆనందం! ఒక నిండని జీవిత వాస్తవం.
అపుడపుడూ చేరిన అనుభవ చయనంతో
మనో గృహం! తెరవబడీ స్మృతి "కీ" చే
చూచే లోపల లోపలి దృశ్యం! అంతలో
లోపలి తలుపులు కలలో మూతపడిపోతాయి.

మౌని చూచే స్వప్నం
ఒక దేవతా రూపం
జ్ఞాని కనే స్వప్నం
ఒక ఆత్మ ప్రపంచం

శాస్త్ర వేత్త స్వప్నం
ఒక విశ్వ రహస్యం
కవి పొందే స్వప్నం
ఒక సృజన హృదయం!
సరసిలో కమలంలా కవిలో భావం
శబ్దంలో వికసించీ దాగదు గంధం

గులాబిలా వివేకం
మౌనంలో అందంగా
కంటకమై మౌర్ఖ్యం
పొడుచుకొనీ నిశితంగా.
గులాబీ పూవును కోసే వేళ
ముళ్ళతో వేలికయిన గాయం
మరో  గులాబీని తలపిస్తుంది
సర్దుకొని బాధను మరచే హ్లాదంలో

చేతిలో అనుభవ పుష్పం
నిశీథి చంద్ర కళలా
స్వప్నంతో సమాన మయిన జీవన దృశ్యం
అపుడపుడూ వాస్తవంగా, ఆత్మ బంధమై.

15

ఒక పుష్పం కయి పొద్దునే
బయటి కొచ్చి చూస్తే
శూన్య ముఖంతో చెట్టు కొమ్మల
విలపనం వినిపిస్తుంది.

రవి కిరణం కయి పొద్దునే
బయటి కొచ్చి చూస్తే
అనల కణా లొకటొకటీ
వరసగా కదలుతూ కనిపిస్తాయి.

వెన్నెల కయి నిశి తీరిగ్గా
బయటి కొచ్చి చూస్తే
నీలి మబ్బు క్రమ్మి చంద్రుడు
అమావాస్య ముఖం వేసేను

పూవులా తేలి తాకే మాట
రాయిలా ఎగసి పైన బడుతూంది
ఊహకు రాని వేదికపై నిర్భయంగా
ప్రేలే పాత్రలతో రణ సన్నివేశం!

మనిషి ఫాల తలంపై రేఖ
వెన్నెలో వెలుగో మెరపో కాని
వీధిలో మనుషుల మధ్య! నుండీ
ధూమ జటలతో జ్వాలా రూపాలు!
కాగితం పై నిశ్శబ్దంగా శబ్ద సమూహాలు
జన హృదయం స్పృశించే సంకల్పంతో
దూరం నుండి సముద్ర తీరం చేరే పడవల్లా
పై నుండి భూభాగానికి చేరే విమానాల్లా.

పడవల్లో నుండీ
విమానాల్లో నుండీ

దిగి ముందుకు కదలుతున్నాయి
విశ్వ హృదయ స్పందన రూపాలు
అడుగుల ధ్వని! ఒకటై చేరుతున్నాయి
స్నేహ సుందర సమాజంలోకి.

16

దూకే జలపాతం ఝున ఝునలోనూ
జారే నిర్ఝరిణి గల గలలోనూ
సమాజ గమనంలో వేగం కరువవుతూంది
ఎగసిన చూపులతో నేలను మరచేరు.

మౌన భావ శిఖరంతో
లోపల ఊహల పుట్టలో
ఏముందో? తెలీని అమాయకం
ఇదో అలంకారం కావచ్చు
చూచే వారికి వేడుక అవచ్చు
ప్రమాదంలోనూ పడేయ వచ్చు.

జనం మధ్య వీధిలో తిరుగుతూన్నా
మృత్యు భయంతో మనస్సు ఏ గుహలోనో
ముక్తి పేరుతో ప్రశ్నకు జవాబుగా
కల్పనలో స్వర్గ మోక్ష ప్రపంచం
ఊరటగా మనిషికి ఒంటరితనం బోనులో స్థానం
చేరని ఆశల అందని ఊహల ఉచ్చులో బంధనం.

జీవన ప్రియ భావనతో
మృత్యు భయం వీడుతూంది
లోపలి గోడలు తొలగిపోయి
మనసు విశ్వమయమవుతూంది

కుటిల నీతి జటిల రీతి
మారణ రణ గుణం లేని
జన సమాన జీవన భావన
ప్రతి హృదిలో నవ రచనకు అవతారిక.

17

ఏ నీడనో నిలిచి లేదీ దేహం
చీకటి కుటిలో లేదీ హృదయం.

దేహానికి ప్రాణంతో దాహం సహజం
మరీచికను చూపడం అమానుషం.
బ్రతుక్కి ఆయువుతో ఆకలి అనివార్యం
వెన్నెల రాశిని చూపడం అన్యాయం.

మానవ హక్కును చెట్టుకు కట్టేసీ
నీడను ఆశ్రయ బహుమతిగా చూపీ
అసలు కథను అడవి దారి పట్టించేరు.
చివర కేనీడ చాటునో కాస్త చోటు దొరికేను.
నడిచే కాళ్ళను బంధించీ
చెవులకు స్వేచ్ఛా తత్త్వం వినిపించేరు.
భౌతిక కటు వ్యథలకు
మధుర పరమార్థం చూపేరు.
ఒక సమయంలో బాధ
క్షమకు అనుమతి నిస్తుంది
ఒక విషయంలో అదే!
విలయ చరణ మెత్తుతుంది.
వెలుగు బాట తప్పనీయదు
తిరుగు బాటులో వివేకం.

ఇది సాధించిన విజయాలెన్నో!

మానవ వికాస సమాజ చరిత్రలో

నాలో ప్రతి కణం

విప్పారిన ఆర్ద్ర నయనం

నాలో ప్రతి లవం

వికసించిన ప్రేమ సుమం

ఊర్పుల అలలపై తేలుతూ

మానవతా గంధంతో కదలుతూ

మనసును సుమింప జేసే రస గుణంతో

ఉదార చరితకు వేసే చరణంతో

మానవ విజయానికి ముగింపు లేదు.

జీవన సోపానాలకు మితం లేదు.

సృజన హృదికి విరామం లేదు.

మనిషి మనిషిలో ఆత్మ బంధం ఒక్కటే!

18

ఈ భూమి నెవరు వదలుతారు

ఇది మనిషి ఉనికి భౌతిక బంధం

ఈ జీవిత మొక సమాజ చిహ్నం.

ఈ వేదికపై

గడచిన ఇతిహాస ప్రపంచాలు

కాల పటం పయి సమాజ చిత్రాలవుతాయి.

ఈ వేదిక నుండి

నడచిన రణ సమూహ చరిత్ర సర్వం

మానవ ప్రవృత్తుల సంఘర్షణ రూపం.

నివాసానికీ ప్రవాసానికీ

ప్రభుతకూ సంపదకూ

ప్రకృతికీ సమాజానికీ
స్థిరతకూ పరపతికీ
ఆధారం ఆకర్షణ కేంద్రం
మంచికీ చెడుకీ సహన తలం.

విధ్వంసాలకూ విజయాలకూ సాక్షీభూతంగా
జీర్ణమయిన మాయమయిన దృశ్యాల గుర్తులు,
శబ్దంలో శిల్పంలో చిత్రంలో ఆలోచనలో నిలుస్తాయి.

సమాజం వెనక్కి నడవ దెపుడూ చలనంలో
ముందుకే సూటిగా తప్పని మలుపులతో!

19

ఆరోహణ దశ దశలో
ఎక్కడి కక్కడ చివరి మెట్టులా కోరిక
అప్పటి కది ఫలిస్తే చాలన్నట్లు ఉంటుంది.

మెలకువలో స్వప్నంలో
ఏ పనిలోనో మనస్సు
మెరపులా వెనక్కి వెళుతుంది.
పూర్వ రూపాన్ని దర్శిస్తుంది
సంకల్పం పటు తరమవుతుంది
కొమ్మ నుండి కొమ్మలా కోరిక చిగిరిస్తుంది.

తప్పని అవసరాలకు ఒక స్థలంలో ఒక సమయంలో
ప్రకృతి ప్రాణి ప్రపంచం నుండి
దేవతలు వెలుస్తారు! నిలుస్తారు
ఆత్మ చుట్టూ తిరుగుతూ ఆలోచనలో!
తర్కానికీ సాక్ష్యానికీ అతీతమయిన

అనుభవ గగనంలో తేజో రూపం.
హ్లాద బింబమై వెలుగులతో దిగి
ప్రయోజన శిఖరాలు చేరాలనే.
దీన్ని ఒకరు తమ వ్రేలి ఉంగరంలో
వజ్రంలా ధగధగ లాడాలనీ
దీన్ని ఒకరు తమ మెడలో హారంలో
మణిలా తళతళ లాడాలనీ.
కోరికలో ఏ సూర్యుడో ఏ చంద్రుడో!
రూపాంతర భావ తృప్తి పొందేరు.

తెలుపో ఎరుపో నీలమో పచ్చనో
వర్ణం నుండి వర్ణ సామరస్య వర్తనం
జీవితానికి రమ్య రుచితో
కాల భూమికి కొత్త కళతో.

20

కల్పనలో మనస్సు
అద్భుతాలకు ఆరాటపడుతుంది
జీవితంలో స్తంభన ఘర్షణ
ఒక తృప్తితో మరుగున పడతాయి.

కల్పన అద్దుతుంది
బాధల్ని పూల రెక్కలతో
అద్భుతం త్రిప్పుతుంది
ఆశల్ని కొత్త లోకంలో.

ప్రతి దేశం జాతి జీవితంలో
కల్పనలో అద్భుత ప్రపంచం
వాస్తవ దృశ్యాలకు విస్తరణగా

మనిషి శక్తికి నిదర్శన దర్శనంగా
ఎంతటి భయ సముద్ర మయినా
ఎంతటి కల్లోల సమస్య అయినా
వీరంలో ఉత్సాహంతో విజయంకై
జ్ఞానంలో వివేచనంతో వెలుగుకై
అన్నిటినీ సిద్ధం చేస్తుంది
వీడని సమాజ బంధం!
తీరం నుండి తీరానికి గభీర జలాల్లో
ఉపాయ సాధనాలే గట్టుకు చేరుస్తాయి.

21

తలపై చేయి పెట్టి నిలువునా
కిరీటం ధరింప జేసే అట్టహాసం
చేయి ఎత్తి అద్దంలో చూపుతూ
చంద్రుణ్ణి అందించే కల కలం
మనుషుల్లో తెగని పట్టుదల
మధ్యలో రాతి గోడలా నిలుస్తూంది
పదవిపై నెరవేరని కోరికలో
శ్రుతి మించిన అధికార దాహం
హింసకు జన్మభూమి అవుతూంది
అశాంతికి పెద్ద పీట వేస్తూంది.

నిజాన్ని దాచి నిర్మోహమాటంగా
ఆకర్షక వేషంతో తీర్చి నిలువునా
విపణి వీధి త్రిప్పే సన్నివేశం!
ఏ రోజూ ఎదురవుతూంది!
చదివేసిన దిన పత్రికలా రోజు నిష్క్రమించదు

మెరసే నక్షత్రంలా జీవిత గగనంలో నిలుస్తుంది
ఈనాడు తెలుగు దిన పత్రిక చదవడానికి
ఎన్ని గుండెలు కావాలి?
ఉన్నదేమో! గుండె ! ఒకటే!
అదీ ముఖ్యమైన వ్యాపకంలో మునిగీ
అందుకేనేమో! క్షేమం కోరీ పనివాడు
చేతిలో నుండి తీసుకొనిపోతాడు!
ప్రజల పేరుతో నాయకులు
సమస్యల్ని బిగించి ఉచ్చులో
సమాజంలోకి విసరుతూ పోతారు
తాము ప్రచార పర్వంలా ఊరేగుతారు.

చాటు నుండి విసరబడే రాళ్ళతో
నేటుగా దూసుకపోయే తూటాలతో
ఏ సమస్యకూ పరిష్కారం దొరకదు
ఇవి ప్రభుతకు ప్రమాద ఘంటికలు!

జెండా ఆదర్శానికి చిహ్నం
ఉద్యమం సాగేదీ దీని నీడలోనే.
ఎవరికి ప్రియమైన పతాక
వారు వహించడం చరించడం సహజం
హఠాత్తుగా జెండాలు తిరగేయబడీ
కర్రల కోలాహలం ధ్వనిస్తుంది
ఆదర్శం అడుగునబడి నలిగిపోయి
నెత్తురు మరకలతో బయట పడుతూంది.
ఇష్టం లేకపోతే పోనీ

ఏదో పేరుతోనో నెపంతోనో
తల తొలగించినా పరవాలేదు.
ముందుగా అద్దంలో తన కళ్ళలోకి చూచీ
ఆ పని జరిపితే మరీ మంచిది!
అంతరంగాన్ని చూచే కోరిక చాలా అవసరం.

అవకాశ వాదంలో ఆదర్శం ముక్కలై నిప్పు రవ్వలై
సమాజం అనల హృదయ సీమల్ని తాకుతూంది
ఒక క్షణం! ఆగి, ఆత్మావలోకనంతో
వెళ్ళే ప్రజాస్వామ్య పథం గురించి ఆలోచన మంచిది.

22

అనుక్షణం భవిష్యత్తు పరివర్తన పొందే,
వర్తమాన క్షణాలతో ఆత్మ బంధం
దేశ కాల జాతి కతీతమై,
అహంకారం నుండి వివేకానికీ
సంపదతో ఉదారతకూ
సంస్కారంలో సమగ్రతకూ,
మనిషిలో క్రియా శక్తికీ
శాంతి మూలం నిలుపుతుంది
కాంతి ఖడ్గం ప్రసాదిస్తుంది
స్నేహ సుందర సమాజానికి
విజయ హృదయం విశ్వమయమై
సృజన మేఘం చరిస్తుంది.

స్వేచ్ఛా కవిత్వం
రెండవ భాగం - 10

# సృజన మేఘం

మాదిరాజు రంగారావు

**2008**

**రసధుని సాహితీ పరిషత్తు**

శాంతినగర్, హైదరాబాద్ - 500 028

2

# సృజన మేఘం

1. మేఘ మనో రూపానికి
ఇది నా సాదర పత్రం
ధూళి ధరా భాగం పయి
ఆకలిలో దాహంలో
అంగారం తలపించే
అణువణువూ ఆరాటం
జలదం కయి ఎద ఎదలో
జీవం తెచ్చే తడి కయి.

2. ఏ జలదం అయినా
కురిసే జల మొకటే
ఏ దేశం అయినా
పొందే గుణ మొకటే.
కవచం తొడిగిన దేహం
జల కణ సుఖ మెరిగేనా?
జలదం కదలని హృదయం
సృజన భవం పొందేనా?

3. ఈ మేఘ మహా యాత్రకు
గగనం సరి పోయేనా?
మేఘం చూపే కరుణకు
భూమి తలం సరియేనా?
జన నయనానంద కరుని
చూపులతో నిలిపేసీ
తమ కథ వినిపించాలని
ప్రతి ఎదలో ఆవేగం.

4. మేఘంతో కదలుతుంది
కవి లోపలి జీవం.
మేఘంతో తరలు తుంది
కవి జీవన చరణం.
మేఘంతో పలుకుతుంది
కవి లోపలి మౌనం.
మేఘంతో ఎగురుతుంది
మానవతా పతగం.

5. తీరిక గా ఓపిక గా
చూచే కవి కనులంటే
జలదానికి బహు ప్రియం
తనలో మెరపులు మరచీ
తీరికగా ఓపికగా
చూచే కవి ఎద అంటే
జలదానికి బహు ప్రియం
తనలో తలపులు తెరచీ.

6. ప్రతి శిలలో కోరిక
తనపై మేఘం కురవాలని
కలలో ఒక కోరిక
దేవత శిల్పం కావాలని
మౌనం లో శిల్పం గా
కల్పన లో చిత్రంగా
ఏ దయినా ఏ మయినా
సృజన హృదికె తెలిసేదీ

7. పిడికిలిలో ఒక కోరిక
పావురమయి ఎగరాలని

పిడికిలో ఒక కోరిక
శిశు కళ అయి ఎదగాలని
పిడికిలిలో ఒక కోరిక
మేఘంలా నిలవాలని
కోరిక లెన్నో? అయినా
ఎప్పటికీ అవి పిడికెడు!

8. సడలిన పిడికిలి
శాంతికి సాధన మయి
కుసుమ సమం అవుతుంది
విడిచిన పిడికిలి
ఈవికి కారణమయి
మనసు బరువు పోతుంది
వదలిన పిడికిలి
ప్రేమకు తారణమయి
అభయ మేఘ మవుతుంది.

9. మహా నదిని కోరేదీ
ప్రవహిస్తూ పోవడం
ఆటలతో పాటలతో
ప్రజతో మాట్లాడడం.
మహోదధిని కోరేదీ
తరగలతో నురగలతో
తీరంలో జలద యశో
తోరణాన్ని నిలపడం!

10. మేఘం మాట్లాడు తుంది
మేలు కొన్న మనిషితో
ఎంతటి విధి నయినా
దాటు తుంది ఎత్తులో

కాలం కథ చెబుతుంది
మేలుకొన్న మనసుకూ
ఎంతటి నిధి నయినా
వదలి కదలి పోతుంది.

11. మేఘానికి బహు ఇష్టం
మానవ కథ అంటే
కాలానికి నిజ రూపం
మానవ కథ తోనే
చేతనతో బింబంగా
గగనం లో మేఘం
అల పయి సుమ యానంలా
ఊరుపు లో కాలం.

12. గత చరితకు బంధు వయి
పక్షి ఎగిరి పోతుంది
వర్త మాన మిత్ర మయి
కుసుమం వికసిస్తుంది
ఎండి పోయి నిర్ఝరి
నిన్నటి దయి పోతుంది
బ్రతుకు తుంది కోరిక!
జలదంతో ప్రాణిత మయి.

13. గోడకు చెవులుంటాయని
అంటూ ఉంటారు కాని
కండ్లూ నోరూ కాళ్ళూ
మస్తిష్కం కూడానూ
గోడల వలె
నిలిచిన మనుషుల పయి

అపుడపుడూ
మేఘం కనిపించీ
లో లోపల
మరచిన నిజ రూపం
మెరపులతో
చూపుతుంది మనిషికీ.

14. ప్రాణానికి అనలం
ఒక కళగా రాణించనీ
దేహంలో అనలం
ఒక లతలా కదలాడనీ
బూదిని చేసే ఆ
లయ సమయం రాకూడదు
మనసున జలదంతో
సృజన భూమి మేల్కోనీ.

15. మేఘుని ఆగమనంతో
అక్షరాల బోను నుండి
విడుదలతో బయట పడే
ఒకటొకటీ ఊహలలో
మనసుకు నవ వాహనమయి
మనిషిని నడిపించేను
అశ్వమొ! హరియొ ! మయూరమొ!
హరిణమొ! ఖగమొ ! మరొకటో!

16. ప్రతి రోజొక కొత్త భాష
వినిపిస్తుంది సమాజం
అది నేర్చే లోపలనే

మరో రోజు వస్తుందీ
కాల పయి వచ్చే మబ్బులతో
తొలి బీజం! మాయం అయ్యేను
కాలంతో పొందే మార్పులతో
తొలి పాత్రల! రూపం మారేను.

17. నిలవ నీడ లేని
ద్రిమ్మరి మనిషీ
అతని కొక మిత్రం
తలపై మేఘం!
ధనం బలం లేని
బికారి బ్రతుకూ
అతనితో పయనం
తలపై నిధిలా.

18. ఇరువురిదీ ఒకే
దారి స్వేచ్ఛలో
అవనిపై తాను
నింగిలో మిత్రం
ఎపుడో కనిపించేనా?
తన కోసం వచ్చేనా?
ఒక గొడుగయి ఒక నీడయి
తన మస్తిష్కంలో!

19. తన ముఖాన
చిరు నగవులతో
కనుల నుండి
జల కళికలతో
పేద ముందు

కురిసే మేఘం
కరుణకు ఒక
మృదు నవ రూపం.

20. గగన వీథుల
ఆప్త మేఘం
పగలు రాత్రులు
ఒకే పయనం
మనిషి మరచిన
ప్రేమ బిందువు
లొలుకుతూ ఒక
జ్ఞాపకంగా.

21. ధరణి తలం కణ కణమూ
మబ్బు నీడ పొందాలని
మనిషి పదం వెను వెనుకే
కృషికి మైత్రి సాగాలని
తొలకరిలో శ్వాసలో
పరిమళ పథ రచనలో
సృజన యుగం కోసమై
మరో మనిషి మనిషిలో.

22. ఒక వైపున స్వాగత వదనం
ఒక వైపున గుడ్ బై హస్తం
సమయ సమయ ద్వారం నుండీ
మారే పాత్రలతో రూపం
నిప్పుల పయి నడచే మనిషికి
రైఫిలు పయి నిలిచిన చేయికి

మృత్యువుతో ఆడే మనసుకు
　　　శ్రాంతికి అవకాశం, మేఘం!

23.　కొత్త నిజం ముఖాన చూపే
　　　దర్పణాన్ని ముక్కలు చేసే
ముక్కలలో ముఖాలు ఒకటై
　　　మనిషిని పరుగెత్తించేను.

ఎప్పటిదో  పాతది స్థానం
　　　వర్షంతో మొక్కలు కొత్తవి
జన్మించిన నాటివి కళ్ళూ
　　　చూపులతో ఊహలు కొత్తవి!

24.　పగలు కిటికీ నుండి చూస్తూ
　　　మెరపు చూపులతో
తళ తళలతో నా మనసులో
　　　జల బిందు చిత్రం.
ఒక నిశీథిని జలధి నాలో
　　　తరలి వచ్చే భావ రూపం
మృదు గభీర పదాల ధ్వనితో
　　　కదలి వచ్చే మేఘ చిత్రం.

25.　దారిలో గిరి శిలల తల పయి
　　　ఆర్ద్ర ముద్రలు వదలి పోతే
పైకి ఎగిరే ఆశ దాగీ
　　　శిలలలో ఆరాట రేఖలు
కోర్కెలో హిమ శిలా శిఖరం
　　　దూర దూరం తరలి పోయే
కోర్కెతో ఒక స్వప్న చిత్రం
　　　జల లహరి సుందర రూపమై.

26. ఎదిగి వచ్చే కోర్కె తీగెలు
అల్లుతూ ఆకాశమంతా
వే నీటి తంత్రులు మీటుతూ
వస్తుంది మేఘం! దారినే
పై నుండి దివి కదలేను
మానవ బంధు సుందరమై
వేరైన గుండెలు రెండు
కలిపే పట్టు వంతెనయై.

27. సృజన హృదయ సంకేతం
ఈ మేఘం
మనిషి మనో భూమికలో
జయ చిహ్నం
జలధి తపసు నుండీ
పై కెగసే సఫలం
మనిషిని మరవని ఒక
ప్రకృతికి సంకేతం.

28. గిరి తటి పయి కదలే
మొగిలును చూచి మృగం
పరుగులతో చకితంగా
పైకి దూక బోతుందీ
సాహసాన్ని అందుకనే
అమాయకం
మనిషికి! సర్కసులో ఒక
వేడుకగా!

29. మేఘం చూడని
ఏ మనిషి లేడు

స్వప్నం పొందని
ఏ మనసు లేదు
చినుకలతో పరిమళమయి పవనం
ఊహకు ఒక వాహనమవుతుంది
తాపంతో ఎగిరి పయికి మేఘం
కరుణంలో బాష్ప జలం జారేను.

30. ఎవ్వరి కోరికనూ
కాదన లేనిది
తనలో కోరికలో
జన హిత గమ్యం
గగనం హృదిలో మేఘం
ఛాయాలంకారంతో
ప్రియ భావనలో వసుధకు
సన్మానం జరిపేను!

31. ఆపద రేఖల దృశ్యం
తుడిచీ
ఎండిన హృదిలో అల అల
కదలీ
అందని హంసను క్రిందికి
దింపీ
మనిషికి ఒక నది బహుమతి
నిచ్చేను.

32. నీల కమల తోరణమై
జలదం
కదలుతుంది బయట పడే
స్మృతిలా

పిడుగులనూ మెరపులనూ
వదలీ
సృజన స్వరం రావాలని
ఒకరూ!

33. గగనంలో నావను తలపిస్తూ
పరచిన తెర చాప నీడతో
ఏ బదులూ పలకని మేఘంతో
ఎవరికి వారొక కథ చెప్పాలని.
కురిసే వెన్నెల వలె వచ్చే
తొలకరి సేకంతో తడిసీ
తాపంలో వేదన లోనూ
ఒక ఉపశమనం పొందేరు.

34. మొగలి రేకుల పింఛ శోభను
సృజన పర్వం మొదలు పెట్టీ
మనిషిలో నది లోన హంసను
కాన్కగా ఇచ్చేను మేఘం.
వర్షంతో సమాజ క్రియ
జడ రూపం వీడుతుంది
అర్థంలో నవ్యతతో
విశ్వాకృతి పొందుతుంది.

35. మేఘం చూడదు స్వర్గం వైపూ
గతిలో వాస్తవ దృశ్యం వైపే
బ్రతుకొక బరువూ హరువూ కన్నా
బాధ్యత కొక సార్థ పథంతోనూ.
రాయి తపసు చేస్తూ ఉంటుందీ
తన పయి సాగే జల నృత్యం కయి

తనలో కోరిక శిల్పం కన్నా
రస రూపం!తో అల కావాలనీ.

36. శ్రామిక జన ఫాల తలం పయి
కుశల బిందు కళికలు నిలిపే
ఆగని మేఘానికి ఎపుడూ
వర్తమానమే బహు ఇష్టం.
హృదయంలో పరిమళ
సౌందర్యం నింపీ
ధారుణి పయి జీవన
ధనం వదలుతుందీ!

37. మండే భానుని కిరణాలకు
చల్లని ఛాయను అందిస్తూ
హ్లాదంగా తరలే మేఘం
ఉన్మనిగా వస్తుందెపుడో!
పిల్లల నృత్యంలా
చిందులు వేస్తూ పోతూ
పెద్దల కోపంలా
తుపాను విసరేస్తుందీ!

38. ఏ పనిలో ఎక్కడ ఎట్లా ఉన్నా
జలదంతో ఒకటై కదలీ నడచీ
ఊరు చెరువు తోట పొలం నాగలినీ
ఒక్కసారి చూడాలని లో కోరిక!
పవనంతో ఆలోచన
కదలే ఛాయా శీలం
అనుభవ ఛవితో కాలం
ఆగని ఝరిణీ చరణం.

39. తపనంలో హననంలో
దృశ్యాలను చెరపీ
ప్రాణాసారంతో నవ
చేతన నింపేను
నింగి లోన ఏ సీమలు
ఎరగని చారణ మేఘం
ధారుణి పయి జల సీమల
జీవన మితి చూపేను.

40. గ్రంథంలో వాక్యం ఉన్నా
బోధనలో నీతుల కన్నా
ఆత్మీయం! ఆచరణంలో
లోకంపై కురిసే మేఘం.
కడిగేసీ పూసిన రంగులు
తొలగించీ పూనిన రూపం
లో లోపలి మానుష నైజం
తెలపడమే తన కభిరుచిరం.

41. ఘన రవ రుచితో మేఘం
వచ్చేసే ప్రతిసారీ
ఆగని జన చలనం కయి
చినుకుతుంది చిరు మెరపులు
చీకటిలో ఆలోచన
ముందుకు దుమికిస్తుందీ
వెలుతురులో అనుభూతిని
లోపల మెరపిస్తుందీ

42. ఆలయానికి గోపురం లా
జీవితానికి ప్రాణ ద్వారం

ధారగా జల సేచనంతో
అత్మ క్షాళన కయిన మేఘం!
క్షామానికి దాహం సహజంగా
అవినీతికి మలినం ఉండేదే
సామాజిక జలనిధి నుండీ
పరివర్తన చిహ్నం మేఘం!

43. స్వర గతిలో శ్రుతి సుఖమై
కురిసే మేఘం
ఏకాంతం లో సమాజ
కథ చెబుతుందీ
గల గల దూరం పారే
వాన వరదలో
ఏ శిశువో! తేలేను
వేదన దాగీ.

44. క్షణం కదలి తరలుతుంది
ఆనందంతో
దాని వెనుక దొరలుతుంది
శోక విషాదం
క్షాళన కయి ధారలతో
అడుగు కదలితే
ఏది పాప మనే ప్రశ్న
నిలిపేస్తుందీ

45. అధికారం సంపద భోగం
దాహం తో మండే దౌష్ట్యం
తుడి చేసే మానస మేఘం
ఒకటుందీ అవసర మిపుడూ

తైల వర్ణ సుందర చిత్రం
గహన మనో లోక రహస్యం
మెరుపులతో చూపే హృదయం
అవసర మొకటుందీ ఇపుడూ!

46. అనల శిఖల సమస్యలకు
ఒక పరిష్కారం
విరిసి చీకటి పుష్ప మయ
మయి కదలు మేఘం
అగ్ని గీతం బదులు
మనిషికి సుజల గీతం
నేలపై గుండెలో
కళ్ళలో ప్రసారమై.

47. తలుపు మూసిన ఇంటి లోనూ
సృజన లోకం దింపుతూ
కలలు తుడిచీ మనసు లో రస
జీవితాన్ని సృజించేను.
అనల నయనం మూత పడుతూ
కలువ నయనం విరిసి వెన్నెల
నాదమయమై సదా నాలో
లీనమయి పోతుంది జలదం!

48. సమాజ చేతనలో స్పందనతో
హృదయంలో ఒక నవ జన మేఘం
సమాజ చింతనలో సంపదతో
భువన విదిత క్రియలో ప్రియ రూపం
మేఘ మేది తీసుక పోయేదీ తెలియదు
ప్రజల హృదయ మొకటే తీసుకపోయేను?

భువిని వదలి పోతుందీ తనలో వన్నీ
మిగులుతుంది ఒకటే అది తన ఆత్మగుణం!

49. వయసుతో పని లేదు మబ్బుకు
విత్తు నుండీ తరువు దాకా
జీవ శక్తి ప్రసార రూపం
ప్రేరణై ఒక ప్రేమ భావం.
ఉత్పథంలో అంత రంగం
నిలుపుతుందీ మనసు స్థాయిని
ఊర్పు తీగెకు కుసుమ మిస్తూ
కోరుతుంది సమాజ శ్రేయం.

50. భూమిని ఉదార భూమిక చే
తనకు తాను వరించేను
మనిషిని వికాస చలనంలో
పద పదమూ గణించేను.
చిర సమూహ చేతనలో
నిలిచిన ప్రాక్ రూపానికీ
సమ సమాజ సంకేతం
నీలో నాలో మేఘం!

51. నాపై ఏ నీలి బొమ్మ జాడ లేదు
ఉందొకటే నీల జలద సంచారం!
ఇది కురిసే కవిత తో రసార్ద్రమై
శబ్ద జగం పొందుతుంది సృజన నవం.
మనిషి మనిషి మధ్యలో సమాజ చరితలో
యుగాల దూరాలు చెరగి జన స్వామ్యంలో
సృజన మేఘమై హృదయం! విశాల దిశలో
జీవన రుచి చూపుతుంది సమ రస గతితో.

– – –

# జలద గతికై

## 1. స్మృతి గుహ నుండి

స్మృతి గుహ లో నుండీ
నిజ నిలయం నుండీ
మనిషి లేచి బయటికి సంతోషంగా
జలదా గమనంతో జనం మధ్య!

జల సేచనంతో తడిసీ
స్నానంతో శుభ్రమై నడిచేను.
విరిసిన మనో భావ పరిమళంతో.

పైన కదలే మేఘాన్ని
తన బాహువుల్లోకి తీసుకొనీ
గుండెకు హత్తు కోవాలనీ
చేతులు ముందుకు చాచి, సాగేను.

ప్రవాహం ఎదురవుతుంది
ఆనందంతో ప్రవేశించేను
ఈదేను, దాటేను, ఉపాయంగా
అవతలి గట్టుకు చేరేను.

అనుభవ పారమ్యంలో
అంతా మరచినట్లే ఉంది.
మరో గుహలోకి, నిలయంలోకి
ప్రవేశం అనివార్యమా? అవసరమా?
అక్కడి కది సంతోషంగా ఉంది.
భూమి పయి పచ్చదనం! కృషికి ప్రేరణంగా
గాలిలో వెచ్చదనం! మదికి దీపనంగా.

ఒక సుందర వాస్తవం, అనితరమై
అనుభవ ముద్రతో విశేషమై
స్మృతిలో భద్రంగా, హ్లాదంగా.

మేఘం పయి అభిమానం అభిరుచితో
మరో అనుభవంపై కోరిక! సహజం
అంటుకున్న అగ్నిలా ఆలోచన!
మధ్య మధ్య అనుభవాల జ్ఞాపకాల్లో తిరుగుతూ
కాలంతో మేఘం కయి ప్రజ మధ్య నిరీక్షణం.

## 2. మేల్కొన్న సమాజం

నాగలి చే భూమి మేల్కొల్పబడుతుంది
సస్యంతో హృదయం సార్థకమవుతుంది
మేల్కొన్న మనిషి చే ఏ రోజూ
సమాజం మేల్కొల్ప బడుతుంది.

భూమి మేల్కొనే వార్తను
గాలి దిశ దిశకూ చేరుస్తుంది.
సమాజం మేల్కొనే నిజాన్ని
చలన సూత్ర గుణం చెబుతుంది.

గుడిసె ముందు
ఏ పనీ లేక తిరిగే యువ జనం తరలీ
పొలం వైపు నడుస్తారు.

గుడిసె లోపల
కాళ్ళు ముడుచుకున్న వృద్ధ గణం లేచీ
పొలం వైపు కదలుతారు.

రాళ్ళు పగల గొట్టీ
కట్టెలు కొట్టీ మోసీ ఈనాడు
అస్థిరంగా బ్రతికే చేతులు
భూమిని పిడికిట్లో తీసుకోవాలనీ
రేపు రాజ్యాధికారమూ
హస్త గతం కావాలనీ

మెలకువలో చేసే ఆలోచన
దిన మణితో ప్రకాశిస్తుంది.
జీవన భద్రతలో మనస్సు
స్వేచ్ఛాదర్శాన్ని పొందుతుంది.
ప్రకృతి దృశ్యంలో ఒకటై
మనిషి విశ్వమయం అయ్యేను.
"చైతన్యం!" "చైతన్యం!" అనీ పలు మార్లు
పిలిస్తే! అది ఏ దిశ నుండీ దూకదు
అరిస్తే! అది ఏ ఆయుధంలోను దొరకదు.
ఊహ నుండి క్రియలో మాత్రమే దిగుతుంది.

అది నీలో మనో బీజం నుండి
తరువయి శాఖలుగా బయటికి రావలసిందే!
ఆకాశ హర్మ్యాలకు సేవల పయి కన్నా
గుడ్డ లేని ఒంటికి ఒక మాసిన పేలికతో
తిండి లేక ఆకలిలో ఆకులు నూరుకొనీ
బ్రతికే మనిషి గురించి ముందు! చింతన కానీ!

నిన్న లేచిన మొక్క రేపు పచ్చదనం
పొందే నమ్మకం లేకుండా ఉంది
నిన్నటి విషాద ఘటన భయం
మరో రోజునూ వదలేట్లు లేదు.

విద్రోహం విస్ఫోటంలో
రాజకీయ కల్లోలంలో
అనర్థాల క్రమం నుండి
విధ్వంసం హింస నుండి
మనిషి మొదట! ముక్తం కావాలనీ
మేల్కొన్న భూమి సమార్ద్రం కావాలనీ.

సమాజ పథంలో జన హిత రూపం
గర్జిస్తూ వేదనలో
వర్షిస్తూ కరుణలో
ఉదార మనో మేఘం రావాలనీ
నిరీక్షణం సాఫల్యం పొందాలనీ

**3. ఎవరి పనిలో వారు**

ఎవరి పనిలో వారున్నారు
మెలకువ లోనే ఉన్నారు
నడుస్తున్నారు మాట్లాడుతున్నారు

స్వేచ్ఛా తంత్రంలో సమాజంలో
బీభత్స తరంగా లొకటొకటీ
అదను చూచి గట్టు దాటీ
దూకే ఉపాయంలో ఉన్నాయి.

పవనం మోసే ఉపదేశం
మేఘం ఇచ్చే సందేశం
మానవేతరాలకే అన్నట్లుంది!
విలయ శక్తి మనిషిలో సిద్ధంగా ఉంది

దూకేందుకు వీలుకయి చూస్తోంది
కాలం సందుల్లో పొంచీ!

తలల్ని తీసేసే పనిలో చేతులూ
పూలను తొక్కేసే నడకలో కాళ్ళూ
అపుడపుడూ పుణ్య భావ జలాల్లోకి
క్షాళన కయి నిర్మలినానికయి ప్రవేశిస్తున్నాయి.

లాభ సాటి విధుల్లో పాలకులూ
ఆర్జనలో గర్జనలో నాయకులూ
తర్జనలో భర్జనతో స్ట్రీట్ కార్నర్
తప్పని ఉత్సవాల క్రమంలో దేవతలూ

ఒత్తే బటన్‌ను బట్టి కంప్యూటర్‌లా
చట్టం తన పని తాను చేసుకొని పోతూంది.

## 4. ఎవరి పని వారిది

గడియారం ముళ్ళు తిప్పేసీ
తిరిగే కాల చక్రాన్ని వశం చేసుకొంటూ.
ఎవరి పనిలో వారు ఉన్నారు
నడిచే కాళ్ళ మధ్యలో నుండీ
చకితంగా సర్పాలు పరుగెత్తుతున్నాయి.

ఇనుప ముళ్ళ వలయంలో
భద్రతతో పెద్దలు నేతలు
ఎవరి భయంలో వారు గుప్తంగా.

కిడ్నాప్! హింస! విస్ఫోటం! హత్యలతో
సాహసమూ వీరమూ కొత్త అవతారలెత్తుతున్నాయి

ముఖాలపై తమ తమ సిగ్నేచర్‌లతో
యుగాల సంస్కృతీ రూపం నొసట
అగ్ని శిఖల చిత్రాల్ని దిద్దేరు

వేదికపై ఒకరి కొకరు కర చాలనాలు
వేదిక దిగి మాటల చేతల ఖడ్గ ప్రహారాలు
ఉరిత్రాడు పూల దండ అవచ్చు
పూల దండ ఉరి త్రాడు కావచ్చు

వర్తమానాన్ని ఉరికంబానికి సిద్ధం చేసి
తమ భవిష్యత్తు రిజర్వ్ చేసుకోవాలనీ
తమ విజయంలో సన్మానానికి
చేతిలో బాగ్‌లో పూలదండతో దిగేరు

సూర్యుడు అస్తమిస్తూ
చంద్రుడు ఇంకా ముఖం చూడని
మనస్సుపై మండే సంధ్యా దృశ్యం
నీల మేఘం! ప్రసక్తి లేని
సమయమూ ఉంది! జీవితంలో
కఠోర వాస్తవాలకు భూమియై
ఎవరి పనివారిదన్నట్లుంది

\- - -

స్వేచ్ఛా కవిత్వం
రెండవ భాగం - 11

# ఉగ్ర చరణం

మాదిరాజు రంగారావు

రసధుని సాహితీ పరిషత్తు
శాంతినగర్, హైదరాబాద్ - 500 028.
2008

# 1. ఉగ్రచరణం

ఆక్షణం రాకూడదు.
వచ్చిందేదో స్మృతి నుండి తొలగనీ
రాబోయే క్షణాల్ని
మంచు ముక్కల్లా స్తంభింప జేస్తూంది
ఎక్కడి కక్కడ జీవిత సూత్రం తెగుతూంది.

సుందర శిల్పం లాంటి హ్లాద సమయాన్ని
వికృతంగా వికలం చేస్తూంది
పయనంలో ఆహార విహార నిలయాల్లో
ఆఫీసో ఆలయమో పార్లమెంటో
మృత్యు క్రీడకు వేదిక లవుతున్నాయి.

ఆకలిలో అన్నం పెట్టే చేయి
దాహంలో నీళ్ళు ఇచ్చే చేయి
బాధలో అభయ మిచ్చే చేయి
బీభత్సానికి టైమర్ అమర్చే పనిలో
బ్రతుకులకు చివరి లిప్తలు చూపిస్తూంది.

మనిషిలో అభద్రత రావడం
మనిషిలో అవిశ్వాసం కలగడం
మనిషి నుండి అపాయం శంకించడం
సమాజ యశో రూపానికి కళంకం!
అమానుష దృశ్యానికి బిందు వవుతూంది.

ఉల్లాసం పొందేందుకు చేరితే
ఆకలి తీర్చుకునేందుకు వస్తే
కంటికి కనిపించని శత్రువు

శత్రుత ఎరగని మనుషులకు
బహుమతిగా మృత్యువు లభిస్తూంది.

2

లేజర్ చిత్రం బదులు స్క్రీన్ పయి
విషాద దృశ్యం వెలసింది జీవితంలో పార్క్‌లో

లైట్లలో ధగధగలాడే ఆహారశాలలో
అన్నపూర్ణ కుంభం బ్రద్దలయింది
బాంబు ప్రేలిన శిథిలాల్లో మానవత కుంటుతూంది.

నెత్తురుతో బలి ఇచ్చే వారూ ఉన్నారు
నెత్తురుతో బలి కోరే వారూ ఉన్నారు
నెత్తురుతో పగ తీర్చు కోనే వారూ ఉన్నారు

ఆలోచనలో ప్రవహించే నెత్తురులో తేలుతూ
గట్టు నుండి గట్టుకు చేరాలని విద్రోహుల సరదా.

ఆట కోసం పాట కోసం ఉల్లాసం కయి
చేరితే పిల్లలతో  కుర్చీ క్రింది నుండి
బాంబు ప్రేలిన శబ్దం! అనూహ్యంగా! అసాధారణంగా
చిరునవ్వులు అంతలో రోదన ధ్వనులయినాయి,
గాలి తరలిస్తూంది దూర దూరం శమింపజేస్తూ.

శరీరాన్ని తునా తునకలు చేసి
తమ పంతం నెరవేరాలనీ
కట్టడాన్ని ధ్వంసం చేసి
తమ విశ్వాసం నినదించాలనీ

పగటి కలలు కనే కళ్ళు
ఎక్కడి నుండో చూచేను రహస్యంగా

విద్రోహ చర్యలో ధూమ పంక్తికి
జన సమూహం ప్రవాహమై చెదరిపోతూంది
పొగ క్రమ్మిన ముఖాలతో వీధి దీపాలు
విషాద చ్ఛాయల్ని ప్రకటిస్తున్నాయి.
మానవ చరిత్రలో ఉగ్రవాద చరణం
ఎపుడో వచ్చి పోయే భూకంపం తుపానుకన్నా
భయ చకితంగా స్మృతి ముద్రల్ని వదలుతూంది
సన్నని కన్నీటి జల్లు విరిసి
ఎదలో ఎగసే మంటల్ని ఆర్పేనా?

ఈ దేశంలో దేశ వాసి కన్నా
మరో దేశం వాడి నుండే ఆపద! లెక్కువయినాయి
వ్యక్తులపై కాదు శత్రుత,సమూహంపై
సమస్యకు పరిష్కార పథం కన్నా
ప్రేలుడుతో క్రూర కర్మలో ఆనందం!

3

సాయం సమయంలో వీధిలో వ్రేలాడే పుష్ప మాలలు
పొగలు క్రమ్మి హాహాకార ధ్వనులకు కంపిస్తున్నాయి
మీ వాడూ మా వాడూ ఎవరి వాడూ కాదు ఉగ్రవాది
జాతి మతం సారం ఎరగని శుష్క హృదయ ఖండం
శాంతికి శైశిర వదనం ఇవ్వాలని కోరే సాహసి.

ఈ నేల అందరిదీ ఈ గాలి అందరిదీ
ఈ నీరు అందరిదీ ఈ సంపద అందరిదీ

ఎక్కడి కక్కడ ఖండ ఖండంగా భిన్న భిన్న మయింది,
మారే సామాజిక వాస్తవాల జీవిత పథాలలో
గ్రీష్మంలో విడిపోయిన అణువుల్ని వర్షం కలుపుతుంది.

రెడ్ ఎలర్టుకు నిద్ర ఎగిరి పోయింది
నీలి ఊహల రాబందులకు భయం ముసరుతూంది
చావడమూ చంపడమూ రెండూ
ఉగ్ర వాదానికి రెండు చరణాలు
వారి ఇనుప చేతుల్లో! మనుషులు నలిగే సుమాలు.

ఉగ్రవాదాన్ని తలచు కుంటే మదిలో
శిల్పం ఎరగని శిల నిలిచి నట్లుంటుంది
జల మెరగని ఎడారి పరచి నట్లుంటుంది
ముళ్ళ పొద నడుస్తున్నట్లుంటుంది
మృత్యువు పద మెత్తి నట్లుంటుంది.

ఒకరి చేతిలో పూర్వం గండ్ర గొడ్డలి
ఒకరి చేతిలో మధ్యలో కరవాలం
ఒకరి చేతి నుండి ప్రేలే బాంబు ఇపుడు,
రెండు చేతులూ జోడించిన నమస్కార గుచ్ఛం
గుండెపై గురి పెట్టిన రివాల్వరు అయిందీ!

4

పార్కులో సన్నని పూల వాసన
అంతలో కమురెక్కింది
గాలిని ఉక్కిరి బిక్కిరి చేస్తూంది.
తలపై తిరిగే గరుత్మంతునికి చిక్కకుండా
పాము బయట పడి అదృశ్యమవుతూంది

ఎవరేదో? ఎక్స్‌రే దృష్టితోనే బయటపడుతుంది.
మనిషి కోసం మనిషి ప్రాణం ఇవ్వడం ఉన్నదే
రణంలో మనిషి చేతిలో మనిషి పోవడం ఉన్నదే
వ్యక్తిపై వ్యక్తి కక్షతో ప్రాణం తీయడంఉన్నదే
సామాన్య జనంపై సమూహంగా అకారణంగా
ఉగ్ర చరణ జృంభణం, హననం మహా దారుణం.

ఒకనాడు పుష్పంలో కీటకంగా
ఒకనాడు గుచ్ఛంలో బాంబుతో
ఒకనాడు సీటు క్రింద టైమర్‌తో
ఈనాడు మనిషే ప్రేలే బాంబుగా
విద్రోహం ఉన్మాదానికి సాధనంలా ఉంది.

మధ్య లో విడిన అలలు నదిలో కలిసి ప్రవహిస్తాయి
అలలపై కత్తి విసరడం అమాయకం
ఆదర్శం ఎరగని ఉగ్రవాద గమనంలో
స్వప్నంలో ఆశకు హింస ఒక సాధనం
కనిపించే నీడల్ని శిక్షిస్తే సరిపోదు!

ఎవరి మత గ్రంథం వారికి పవిత్రం
ఎవరి జీవన సంస్కృతి వారికి అభిమానం
ఎవరి అస్తిత్వం వారికి బహు ప్రియం
పవిత్రమూ అభిమానం అస్తిత్వం ఒకటొకటీ
చరిత్రలో పోరాటం సాగించేను ఎదురు పడీ

5

ఆ క్షణం రానే రాకూడదు
జాతి మత దేశం ఏదయినా
సామాన్యుల ముఖాలపై చిరునవ్వులు త్రుంచీ

వాళ్ళ గుండెల్లో నిప్పు పూలు చిమ్మి
సాయం సంధ్యలో చిట్ట చివరి కిరణమై!

పచ్చని సమాజ శాఖలపై
కూల్చే గొడ్డలి గాట్లతో
ఎగిరే ఉల్లాస పతంగం ఆయువు తెంచేస్తూ
కళ్ళ నుండి గాజు పలకలు జారుస్తూ
వచ్చిందేదో! స్మృతి నుండి తొలగి పోనీ!

జాతి మతం దేశం పుట్టల్లో బస చేసే
ద్వేష సర్పాలకు ఆదరణ ఉండనే ఉంది
లేచి సాగి ముందుకు వాలి కదలి
పథికుల్ని కాటేయడం సామాన్యమవుతూంది
పద పదంలో భద్రత! సమస్యకు జవాబు కాపీ!

గుడి చర్చి మసీదులో ప్రార్థనలూ గంటలూ
వినిపిస్తున్నాయి దైవాన్ని మరవకుండా
శిలలా బ్రతికే మనిషిపై ప్రభావమేమి ఉంటుంది?
నదిలా బ్రతికే మనిషికి పదపదమూ ఆటంకాలే
మనిషి మనిషినీ కలిపేది ఎప్పటికీ కదలే రస రూపమే!

మనిషి మనిషికీ బంధం! చేతనతో హృదిలోనే
అకాల మృత్యువు వచ్చే దిపుడు ఎక్కువగా మనిషి నుండే!
ఆగిపోయే గుండెను
శబ్దింపజేసే యంత్రం వచ్చింది
శబ్దించే గుండెను నిలిపే
మృత్యు హస్తం! ఉగ్రరూపం వెలసింది!

6

మనిషి నుండి పిడుక్కి దీప స్తంభం కూలీ
వడగాలికి ఎండు టాకులా ప్రాణం రాలీ
మెరపులా దూకే మృత్యువుతో
ఆక్షణం రాకూడదు! ఎన్నటికీ.
ప్రవహించే జీవితం చీలి పోయి పాయలుగా
నడచే కాళ్ళకు తగులుతూంది హఠాత్తుగా
కాళ్ళకు చుట్టు కొనీ, కదలదు, కదలనీయదు
నేలపై చిందిన నెత్తురు చిత్రాల్ని
సన్నని వాన చినుకులు పక్కకు తొలగిస్తున్నాయి!

ఎవరు విన్నా వినక పోయినా పవనం వినిపిస్తుంది
చెవి చెవికీ మారణ కథలో దీన స్వరం
ఎవరు చూచినా చూడకపోయినా పవనం స్పృశిస్తుంది
ప్రతి ముఖాన్నీ మానవ హృదిలో ఆప్త స్పర్శలో
ఉగ్రవాద పద ఘట్టనలో లేచిన ధూళిని తొలగిస్తూ!

వైరస్ సోకిన కంప్యూటర్ లా జీవన స్థితి!
తాత్కాలికం కావాలనే! మనిషికి సహజం!
శరీరాన్ని తటాల్న నిప్పుపూలు అలంకరించే
ఆ సమయం రాకూడదనే! అందరి కోరిక!
ఇంటి ముందు దీప స్తంభం అనుమానానికీ గురి కావచ్చు.

తుపాకి పేలి ఎగిరి పోయిన పక్షులు
సాయంత్రానికి తిరిగి వచ్చి చెట్టుపై చేరతాయి
గ్రీష్మంలో చీలి పాయలుగా మేటలతో నది
వర్షా జలాలతో స్నేహ పూర్ణమవుతుంది.
భయం నుండి భేదం నుండి ప్రజ ముక్తం కావాలనే.

7

స్పీడు బ్రేకర్లు లేని స్వేచ్ఛలో
జరిగే ప్రమాదంలో అపాయం! ఘోరం!
సంతాప సభలో తీర్మానం ఆమోదం
సమస్యకు పరిష్కార సూచన కాదు!
బుజాలపై బాధ్యతను గోడకు తరలించేమా?

ఒక్కొక్క మనిషి మనః ప్రపంచంలో
ఒక్కొక్క సృజన విలయ పార్శ్వాలు!
అవి కదలడంలో ఉంది మనిషి వ్యక్తిత్వం
అవసరమో! విశ్వాసమో! ఆదర్శమో! ఏదయినా
సామాజిక బాధ్యతతో వ్యక్తి వికాసం ముఖ్యం!

ఒక మనిషి ముఖం మరొకరికి అతకదు
ఒక మనిషి ఊహ మరొకరికి నప్పదు
ఎవరి జీవిత వాస్తవం వారికి సుగమ పథం
అందరినీ కలిపేదీ మానవ రూపం ఒకటే
అన్నిటినీ ఛిన్నం చేసేదీ ఉగ్రవాద మొకటే.

ఆలోచనకు మంటల దుస్తులు తొడిగి
రహస్య నాటకాన్ని మెరపిస్తుంది
విలువలేని జీరోలకు వినాశనం కయి
విధ్వంసం హింసల అంకెలు చేరేను

మానవ చరిత్ర కొక కఠోర ముఖాన్ని చేరుస్తూ!
నీడలో దాగిన హంతక చర్యలతో
అడుగు క్రింద దాచిన మందు పాత్రతో
దేహానికి కట్టిన మారణ సంస్కృతి బాంబుతో

నేలపై చిందిన రక్త చిత్రం చూచి సూర్యుడు
తన ముఖాన్ని కాసేపు మబ్బుల్లో దాచేను.

8

ఉదగ్ర లోహ చరణం క్రింద నలిగి తునియలై
గుర్తు పట్ట రాని రూపంతో బీభత్స దృశ్యం!
సూర్య బింబం పగిలి క్రింద పడిన ముక్కల్లా
నెత్తురులో చెదరిన శరీర ఖండ ఖండాలు!
ఆర్త స్వరం! వినిపిస్తూంది హఠాత్తుగా
మనిషిని చీకటి గుహలోకి తోసేస్తూ
సందడి క్షణాల నుండి ఆర్తి పైకి చిమ్ముతూంది
మనుషుల మధ్య నిశ్శబ్దం శిలా సమం అవుతూంది.

నగరం హృదయంలో పూలతోట ఛిన్నా భిన్న మయింది
ఒక్క క్షణం వచ్చి పోయే ఉన్మత్త గజం ధాటికి,
కొమ్మలు విరిగిపోయాయి, పూలు చితికి పోయాయి
చెట్లు పెళ పెళ వాలి కూలి పోయాయి
వక్ర భాష్యం మతాన్ని తలక్రిందులుగా నడిపిస్తూంది.

ఉగ్రవాదం శాంతికి సమాధి శరణమిస్తూంది
రోజు బహుమానంగా శిథిలాల్ని ఇస్తూంది
సంతోష ముద్రతో గడచే రోజు
విషాద వాలకంతో వెళ్ళి పోతూంది.

రహస్యం కప్పుకొని వచ్చిన విద్రోహం
అగ్ని శిఖల పొగల చాటుగా వెళ్ళిపోతూంది.
వికృత శక్తి కాలం పయి ఏ దేశం నుండో
కాలిన ఎర్రని ఇనుప మేకుల్ని దింపుతూంది.

మండే క్రోధం వదలిన విషాద ధూమం
          సాయం సంధ్యలోకి దూకిన రాత్రిలా ఉంది.
మతాల మధ్య పూల వంతెన భగ్నమయింది
          మనుషుల వెనక విచ్చు కత్తులు నృత్యం చేస్తున్నాయి
గుర్తు పట్టరాని రూపంతో దృశ్యం!
          మనిషిలో భయానికొక ఆకారాన్నిస్తూంది!

9

కాలం జడమై కదల్లేని స్థితిలో ఉంది
          మనుషులు మూగబోయిన ప్రతిమల్లా ఉన్నారు.
చెల రేగిన వేదన వేడికి
          కన్నీరు క్షణాల్లో ఆవిరి అవుతూంది.

రాళ్ళకు రెక్కలు వస్తున్నాయి ఏదో ఒక పేరుతో
          బయటి అద్దాలు పగిలి జారి పడీ
మనిషి పనికి గల గల నవ్వులు వినిపిస్తున్నాయి
          హింస రేసులో భాగమవుతూంది
ఇది మనిషిని అపహాస్యం చేస్తున్నట్లుంది.

మనుషుల మధ్య వెలసిన రాతి గోడ
          చేతులతో కదలిస్తే కదలేనా? తొలగేనా?
సమస్య శాంతి వచనాలతో తీరేనా?
          అనుమానం ఇంద్రజాలంతో తొలగేనా?
భయ శబ్దం తప్ప
          విలయ ధ్వని తప్ప!
మరేదీ వినిపించడం లేదు.
          పోయే దారీ మూత పడింది

ఆకు రాలిన తరువులా కాలం
మంట లంటిన శాఖలతో సమయం
ఇపుడు ఎడారికి కిరణాలతో కాదు పని
పై నుండి జారే జల బిందువు లవసరం

ఒక దిశపై ఒక ఖండంపై
మేఘానికి మమకారం ఉండదు
అనుకోకుండా వచ్చిపడిన క్షామంలో
జలధారలు రావలసిందే
లేదా భూమిని చీల్చి జల ధార పైకి తేవలసిందే!

శాంతంలో సాధించ లేంది,
సమాజ శ్రేయంకై వీరంతో పొందాలిసిందే

10

తెర వెనక నాటకం వేయ బడుతూంది
వేసే వారూ వేయించే వారికే ప్రవేశం!
జన సమ్మర్దంలో ఉగ్రవాద చర్య
చాచిన రహస్య హస్తంతో మృత్యువును వదలుతూంది.
సర్పంలా కదలే విద్రోహ పదాల జాడల్ని
గాలిలో వెతికితే కన్పిస్తాయా?

నిశ్శబ్దం పగిలి! మరణ ధ్వని దూస్తూంది
పగిలిన గుండెల అంచుల్లో
శాంతి బిక్క మొగంతో నడుస్తూంది
కాటరాక్టు కంటికి మసక దృశ్యంలా
పగిలిన దీపాల వీధి ముఖం అస్పష్టంగా ఉంది
కళ్ళు ఉన్నందుకు
దృశ్యం ఎటు వంటి దయినా, చూడాలిసిందే

చెవులు ఉన్నందుకు
స్వరం ఎటువంటిదయినా వినాలిసిందే
సామాన్యుల జీవితాలపై మృత్యుపాదం
ఎట్టెదుట నిలచిన అర్ధ రాత్రాన్ని తలపిస్తూంది

అడవుల్లో పొదల్లా గడుపుతూ విద్రోహులు
నగరాల్లోకి మృగాల్లా చొరబడేరు
రక్తంతో తడిసిన అక్షరాల్లో వార్తలు
పత్రికల్లో శోక సముద్రాన్ని మోస్తున్నట్లుంది
భయంతో వణకే రూపాలతో దృశ్యాలు
టెలివిజన్‌లో తుపాను గాలుల్ని బంధించినట్లుంది.

ప్రజాస్వామ్యంలో మార్గాలన్నీ తెరవబడినాయి
హింస ఒకటే మిగిలినట్లుంది! పరిష్కృతిలో
మెడలో వేయ బోయే పూల దండలో దాచిన రివాల్వరు
మనిషిని మృత్యు శిఖరంపై విసరడానికి సిద్ధంగా ఉంది.

11

వార్తలో పడిన విద్రోహ చరణ ఘటన
మానవ మనో వికాసంపై పరిహాసంలా ఉంది.
రహస్య హస్తాలు జనం కళ్ళలో
కారం చల్లి తమ పని చేసుక పోతున్నాయి

గుర్తు పట్టలేకుండా జనంలో కలిసిపోయి చరణాలు
జనం ముఖంపై దుమ్ము లేపి మాయ మవుతూన్నాయి

అనుమాన బిందువుతో మొదలై
భయ రేఖలతో అదృశ్య రణం

ఏ ఆగ్రహానికో గురి చేస్తుంది
ఏ ప్రతీకారానికో దారి తీస్తుంది.

ఇంద్ర జాలంతో అవసరాలు నెరవేరవు
రహస్య ప్రాకారాలతో లక్ష్యం లభించదు
నీడల్ని పట్టుకొనీ వేసే శిక్ష
నేరానికి సమాధానం కాదు.

జీవితమొక సజీవ సంకల్ప రూపం
అనుభవంలో వర్తమాన భవం
వానకు తడిసి ఎండకు ఎండి
గాలికి చినిగి పోయే పోస్టర్ కాదు.
నలుగురూ చూచే ప్రదర్శనలో
నిలిపిన శిల్ప రూపం కాదు.

ఎవరి కిటికీ నుండి వారు
చూచే చూపు కొొక ప్రపంచం
కిటికీతో అనుబంధం, కిటికీ నుండి దృశ్యంతో
ప్రతి మనిషి తన ప్రపంచ వలయంలో భ్రమణం.

విద్రోహానికి విజయ వాక్యం లేదు
ఉగ్రవాదానికి ఆదర్శ జగత్తు లేదు.

స్వేచ్ఛా కవిత్వం

రెండవ భాగం - 12

# నవారంభం

మాదిరాజు రంగారావు

2008

రసధుని సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 500 028

*Presented to*

my daughter

***Dr. M. CHARITHA***

**Research Scientist**

**California, U.S.A**

**with**

**affection**

## సూచిక

I. ఈ రోజు ఆల్బంలో .......................... 09

II. దారులన్నీ తెరవబడీ ........................ 28

III. ఊరు వదలి ................................ 31

IV. తిరిగి లోపలికి ............................. 43

V. కాలం కవితయై ............................ 48

# ఆముఖం
## మనోరూపం

ప్రపంచంలో అన్నిటికీ సజీవ మయిన శక్తి కేంద్రం మనిషి. ఆలోచన వివేకం స్మృతి హేతువు విజ్ఞానం అనుభూతి గుణాలతో ఆంతరమయిన చైతన్యంతో అస్తిత్వం విశిష్టమయింది. స్వేచ్ఛా కవిత్వ విషయంలో సృజన క్రియ చేత మనోరూపాన్ని భావింపచేస్తుంది. ఆశ నిరాశ బలం లోపం ఉదాత్తత క్షుద్రత నిర్మాణం విధ్వంసం ఇట్లా సానుకూల వ్యతిరేక భావాలు సమాంతరంగా వర్తిస్తాయి. సమాజంలో సందర్భాన్ని బట్టీ వ్యక్తిలో అవసరాన్ని బట్టీ ఒకదాని నొకటి అతిక్రమించే స్థితులూ కనిపిస్తాయి. వీటితోనే మానవ జీవితం రూపొందుతుంది. జీవితంలో ఏదో సమస్య తప్పదు, మనిషి దీన్ని తన అస్తిత్వ విశేషం చేత వ్యక్తిత్వ విధానంతో పరిష్కరించే ప్రయత్నమూ జరుగుతుంది. ఆచరణలో నైతికమయిన విలువలూ ప్రవర్తనా రీతులూ అవసరాల ఒత్తిడీ స్వార్థ ప్రమేయమూ మానసిక తలంపై పరి పరి విధాలుగా పని చేస్తాయి. వీటిని గుర్తించడంతో స్వేచ్ఛా కవిత్వంలో మానసిక భూమికకు ప్రాధాన్యం కలుగుతుంది. వ్యక్తీ సమాజం, సమస్య సంఘర్షణ, పరిష్కారం ఆదర్శంతో జీవితంలో పొందే ఉద్రేకం సంవేదన ప్రతీకారం సామరస్యం – మనోమయమైన నేపథ్యంలో విలసిస్తాయి. సృజన రూపంలో ఏది ఎట్లా ఉండాలి? అన్నది కవి అంతర్విషయం! ఎవరి సూచనకూ అనుగుణంగా వర్తించదు. ఉన్న దాన్ని ఉన్న విధంగా పరిశీలనంజరపవలసి ఉంటుంది. ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని కోరే ఆలోచనవల్ల పూర్వ నిర్దిష్టమయిన కావ్యశాస్త్రానికి సంబంధించిన సిద్ధాంతాల ప్రభావానికీ దూరంగా జరుగుతుంది. స్వేచ్ఛా కవిత్వంలో రాబోయే కావ్య శాస్త్రపరంపరాక్రమంలో ప్రవేశించదగిన విషయాలూ ఉన్నాయి. సమయ సమయంలో వచ్చే సరియైన సమాలోచనం దీన్ని పూరిస్తుందనే చెప్పొచ్చు. నీరు ఒక చోట నిలిచి ఉంటే సరస్సు అవుతుంది. ముందుకు కదలి పోతూ ఉంటే ప్రవాహమవుతుంది. పరిమితం నుండి విస్తృతికీ సుదీర్ఘమైన ప్రయోజనానికీ దారి తీస్తుంది.

ఈనాటి స్వేచ్ఛా కవిత్వంలో వాస్తవ తలంపై సాధారణ జీవిత చిత్రణంతోపాటు దార్శనిక తలంపై ఉన్నతమయిన మనోరూపమూ గోచరిస్తుంది.

ఇది సృజన దృష్టితో ఈ ప్రక్రియకు వైవిధ్యంతోపాటు ఆంతర ప్రకాశానికీ హేతువవుతూంది. మనిషి భౌతికమయిన స్థితి వెనుక నుండి పని చేసే మానసిక రూపం పయి ఫోకస్ చేసిందీ, మనో రూప కవిత్వం. ఆయా సందర్భాల్ని బట్టి మనస్తత్వ కోణంలో పార్శ్వం దృష్టికి వస్తుంది. మనః ప్రకాశనమూ స్ఫూర్తికి వస్తుంది, కవిత్వ సమాలోచనంలో మనో విశ్లేషణానికి ఎక్కువ అవకాశం కలిగించే విధమూ ఇందులో గోచరిస్తుంది. రచనలో శబ్దానికి సంబంధించిన ఆకర్షణ కన్నా భావానికి సంబంధించిన బింబం అనుభవంలో నిలుస్తుంది. బాహ్యమైన చిత్రణల్ని ప్రతీకల్ని అధిగమించి ఆంతరమయిన మానవ మనో దర్శనం మెదలుతుంది.

ఈనాటి స్వేచ్ఛా కవిత్వంలో ప్రచురంగా చోటు చేసుకునే సామాజిక రాజకీయ తాత్త్విక రూపాల్లో మనోమయ రూపానికీ ప్రాధాన్యం లభించడం ఈ ప్రక్రియ కాలక్రమాన పొందే వైవిధ్యాన్ని సూచిస్తూంది.

కొన్ని సందర్భాల్లో కవుల జీవితాలకు సంబంధించిన అనూహ్యమయిన మార్పులూ గాఢమైన అనుభవాల ముద్రలూ కవిత్వ రచనలో కీలకమయిన పాత్రను నిర్వహిస్తాయి. కవుల్లో సృజన సమయాల్లో తప్ప మిగతావేళల్లో సాధారణ మనుషుల్లో వివిధ స్థాయిల్లో పని చేసే విధంగానే మనస్సు ప్రవర్తిస్తుంది. ఎవరో కొందరిలో కొన్ని సందర్భాల్లో విశేషంగా ఉండవచ్చు. పెద్ద మలుపుకు కారణమయిన స్థితుల నుండి సాధారణమయిన మానసిక స్థితుల వరకూ మనో రూపానికి చెందిన క్షేత్ర పరిధిలోనే వస్తుంది. ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ వ్యక్తిపై ప్రభావంతోపాటు కవిగా కవిత్వంలో ప్రభావమూ మనస్తత్వపరంగా హేతు దృష్టితో వివేచించవలసిన అవసరమూ ఉంది. అటు కవిత్వమూ ఇటు కవి వ్యక్తిత్వమూ రెండు స్థానాల నుండి సమన్వయ సమాలోచనం అనేకమైన విషయాల్ని తెలియజేస్తుంది. దీనితో సమాలోచనానికి మిగతా వాటితో కలిసి సమగ్రతనూ కలిగిస్తుంది. సాధారణ జీవితంలోని మనో రూపానికి చెందిన అంశాలెన్నో అందీ అందనివీ గుప్తంగా ఉన్నవీ! సామాన్య దృష్టికి దూరమయినవీ! ఎన్నో! మనోరూప కవిత్వంలో చోటు చేసుకోవడం జరుగుతుంది. వీటి పై ప్రత్యేకంగా వెలుగును ప్రసరించడం దీనిలోని ప్రత్యేకత. సాహిత్య ప్రక్రియలన్నిటిలో కవిత్వం ఆవేశ స్థాయిలో గాఢతను కలిగిందీ, అనుభూతి తలం

పయి సూక్ష్మతను పొందిందీ. సత్వరమూ ప్రభావ శీలం కలిగిందీ, ఉదాత్తపథంలో ఉన్నతమైన ఆదర్శం చేత ఆకర్షణీయమయిందీ, కావడం చేత మనోరూపం, దీనికి గాఢతనూ గభీరతకూ దోహదం చేస్తూంది.

కవిత్వ విషయంలో సృజన శక్తికీ అనుభవ క్షేత్రానికీ కవిలో పూర్వ భూమిక ఉంది. ఎలాగంటే, ఇది అభిలాష ఆసక్తి అభిరుచి ఆస్వాద గుణాలతో "ఆత్మ సంస్కార" రూపానికి సంబంధించింది. ఇవి ఒక క్రమంలో సృజనశక్తి మరియు అనుభవక్షేత్రంలో మౌలికంగా ఉండే మనోరూపానికి చలన శక్తినిస్తాయి. ముందుకు పురోగమింప జేస్తాయి. అభిలాష అంకురించి ఆసక్తి పెరుగుతుంది. ఆసక్తి శాఖలతో అభిరుచి ఉద్భవిస్తుంది, నిలుస్తుంది, అభిరుచి సాంద్రమై ఆస్వాదానికి దారి తీస్తుంది. యోగ్యతను చేకూరుస్తుంధి. ఇది ఆనందానికీ సద్వివేచనకూ ప్రయోజన దిశకూ పరిణమింపజేస్తుంది. మౌనమైన అనుభూతి ప్రవేశంలో ఆలోచనాధ్వని విస్తరిస్తుంది. కవిలో మౌలికమయిన మనో రూపానికి అంతస్తత్వంతోపాటు కుటుంబ నేపథ్యమూ పెరిగిన సమాజ వాతావరణమూ ఎంతో దోహదం చేస్తాయి. అస్తిత్వ వికాసానికీ సహాయపడతాయి. సమాజంలో వచ్చే మార్పులూ వ్యక్తిత్వంపై అనితర ప్రభావాన్ని కలిగించడమేకాక, సమగ్రతకూ అవకాశాల్ని కల్పిస్తాయి. మొత్తం మీద మనోరూప కవిత్వానికి కవిలో వ్యక్తిత్వమూ సమాజ చేతన వివిధ స్థాయిల్లో శక్తి కేంద్రాలుగా గుర్తించవచ్చు. ఉన్న స్థితుల్లోనూ మారే స్థితుల్లోనూ హేతు దృష్టికి నిలిచే సహృదయ స్పందనంతో విశిష్టమయిన వివేచనతో సాహిత్య చరిత్రలో స్థానం లభిస్తుంది.

"నవారంభం" కొత్తదయిన ఆరంభం ఇదో ప్రయత్నం, మరో మార్గంలో ఉంది. మనోరూపానికి చెందిందీ. భౌతికమైన వాస్తవ స్థితిపై మనోరూపాన్ని ఆవిష్కరిస్తుంది. ఆంతర జగత్తుపై వెలుగును ప్రసరించడం లక్ష్యంగా ఉందీ. ఆన్వేషణతో దర్శనంతో ఆదర్శాన్ని కలిగిందీ. ప్రజాస్వామ్య భావనతో ప్రయోజనయుతమయిందీ. ఈ కృతి అయిదు భాగాలుగా ఉంది. 1. ఈ రోజు ఆల్బంలో (నేటి ప్రజాస్వామ్యంలో విపరీత దృశ్యాలు) 2. దారులన్నీ తెరవబడే (మనో నిలయానికి ప్రాధాన్యంతో) 3. ఊరు వదలి (జీవికయి ఎక్కడికయినా బయలుదే మనో గుణంతో) 4. తిరిగి లోపలికి (మనోరూపానికి ప్రాధాన్యంతో) 5. కాలం

కవితయై. వీటిలో మానవ మనస్తత్వం పయి దృష్టితో సామాజిక చిత్రణం స్ఫూర్తికి వస్తుంది. “నవారంభం” ప్రగతి భావనతో ఉదార ప్రజాస్వామ్య సమ సమాజ దార్శనికతను కలిగింది. సమస్యల నుండి తప్పని విభేదాలు, ఘర్షణ, పోరాటంలో సామరస్యంతో హింస నుండి ప్రేమకూ, విధ్వంసం నుండి నిర్మాణానికీ, అశాంతి నుండి శాంతికీ సువ్యవస్థతో ఉదార ప్రజాస్వామ్యానికి పరివర్తనం కోరుతుంది. ఈ లక్ష్యం ఇందులో భౌతికమయిన స్థితిగతులూ సందర్భాలూ స్థూల మయిన రేఖల్ని కలిగి మనోరూప సమావిష్కారం ప్రధానంగా ఉంది. ప్రతిదీ మార్పుకు లోనవుతుంది. అందునా వ్యక్తీ సమాజమూ విశేషంగా. దీన్ని హేతు దృష్టితో పరిశీలించవలసి ఉంటుంధి. వివేకమూ అవసరమవుతుంది. నిరంతరం మందంగానో వేగంగానో స్థాయి భేదాలతో మార్పును పొందే సమాజంలో సన్నివేశాలు, ఇందులో “మనో రూపం” కేంద్రంగా రూపొందడం విశేషం.

సమాజంలో మానవ జీవితం (రాజకీయ సామాజిక సాంస్కృతిక న్యాయ మత కళా సాహిత్యం మొదలయిన రూపాల పరస్పరం ప్రభావాలతో) ఆర్థికమైన పునాది (Economic base) ఆధారంగా రూపొందుతుందనీ మార్క్సిజం చెబుతుంది. అయితే దీని వెనుక నుండి మానవ మనస్తత్వానికీ వ్యక్తి మనోరీతులకూ సంబంధించిన పాత్రనూ విస్మరించడానికి వీల్లేదు. దీన్ని లౌకికమయిన అనుభవంలోనూ గుర్తించవచ్చు. ఇది కీలకమయిన ఆర్థిక విషయానికి అదనంగా విశేషమైన ప్రభావాన్ని నెరపడమూ దృష్టికి వస్తుంది. ఈ దృష్టి కోణంలో ఈకృతిలో మనోరూపకవిత్వం విశ్లేషణ కందుతుంది. సమాజ జీవితాల్లో వాస్తవాన్ని గ్రహించాలనీ మనస్సులోపలికి చూడాలనీ నిజం తెలుసుకోవడం అవసరమనీ కవి కోరడం సహజం. ఇది సార్వజనీనమైన విశ్వ భావనతో ఆవిష్కారాన్ని పొందడం అవసరం. కరుణలో ఆర్ద్రత, తేజంలో ఉత్సాహం రాగంలో ఆత్మీయం, సమతలో ఉదారత పొందడమూ ఈనాటి మనిషికి ముఖ్యమన్న భావ ధార కలిగిందీ రచన. స్వేచ్ఛా కవిత్వంలో ఎప్పటికప్పుడు సృజన శక్తికి లభించే సారవంతమయిన అవకాశంతో ఫలవంతమయిన మనోరూపానికి చెందిందీ కృతి “నవారంభం”.

**– మాదిరాజు రంగారావు**

స్వేచ్ఛా కవిత్వం

# నవారంభం

## 1. ఈ రోజు ఆల్బంలో

ఈ రోజు ఆల్బంలో
హింసతో స్నేహం కయి ఆరాటంతో
చర్యకు ప్రతి చర్య పయి ఉత్సాహంతో
వివిధ వర్ణ చిత్ర దృశ్యాలు!

చింతనలో స్వార్థంతో
ఘర్షణలో కాలం పయి మాయమయ్యే
వాస్తవ నిజ రూపాలెన్నో?
మాటలో రచనలో శిల్పంలో చిత్రంలో
దిగే ముఖాలు వేరు!

అశ్రువు లొలికే నయనాల నుండి
జారే కరుణాకర చిత్రాల కయి
కెమెరాలు ఉత్సాహ పడుతున్నాయి
వార్తను ఫోటోతో కళాత్మకం చేయాలనీ.

తిరస్కారం బహిష్కారం
నిరాదరణం నిరాకరణం
పీడనమూ ఘాతుకమూ
దృశ్యంలో రోజు విషయానికి
విషాద రూపాన్ని ఇస్తున్నాయి.
నదిలో గ్రీష్మ కాలం నీరులా
సమాజంలో దయా భావం
ఇగిరి పోయే సమయాలు

అనల శిఖలతో పోటీ పడుతున్నాయి
ప్రమాద ఘంటికలు చెవిని పడుతూనే!
నిజ మనో రూపం తెలీక
భౌతిక భ్రమలో దూరం నుండి
తళతళ లాడే ఎండమావుల్ని
జల కాసారాలుగా ప్రచారం
స్వేచ్ఛలో భాగమవుతూంది..

**2**

ఈ రోజు రాజకీయ సన్నివేశం
కోరాడే పోరాడే కోలాహల సంకులం
అందునా బహు ప్రియం ప్రచార పర్వం
ఉండి ఉండి శిఖర పంక్తుల్ని స్పృశిస్తూంది
కింద ఉన్న ప్రజల్ని మరచీ
నేల విడిచి సాము చేస్తూంది
చిన్నవీ చిట్టివీ పొట్టివీ కురచవీ
అవసరాల కేర్పడే మినీ పాత్రలతో

ఓపెన్ మార్కెట్‌లో పాయింట్స్‌లా
ఒక్కసారి పైకి ఎగసీ
అంతలో కిందికి జారే
చతుర చరణ రాజనీతి పోకడలూ
భ్రమతో భ్రమణంలో తారు మారు అవుతూ
కొత్త కొత్త బ్రాండ్‌లతో షేర్లతో
పెట్టుబడులూ పరపతులూ
తిరిగే విపణి చక్రంలో
మారే అదృష్ట స్థానాలూ.
నీటి బుడగల్లా

దూది పింజల్లా
రబ్బర్ బెలూన్‌లలా
పక్షి ఈకల్లా
ఏది  ఎపుడు ఏలా గాలిలో
ఎగిరి పోయేదీ తెలీకుండా ఉంది.

మట్టి ఇనుము రాయి గాజు ప్లాస్టిక్
ఎవరికి నచ్చిన రూపంలో వారు
ప్రదర్శన శాలలో ప్రవేశించాలనీ
సమాజంలో పై అంతస్తుకు చేరాలనీ

**3**

అందరూ బ్రతికేందుకే అయినా
మనిషిని తమ పిడికిలిలో బంధించాలనీ
వసుధను తమ అడుగు జాడల్లో నిలపాలనీ
కోరిక విసరే చర్యలకు
ఒక్కొక సారి రోజు కంపిస్తుంది
జీవన రణ విలోల ధ్వనులతో.

ఎవరూ ఎవరి పయి
జాలి పడే అవసరం లేదు
స్వార్థ హస్త రేఖలలో
బందీ అయిపోకూండా
బతుకు దారి తప్పకుండా
అడవి ముఖం పట్టకుండా
ఎవరి బ్రతుకు వారిని
బతక నిస్తే చాలనిపిస్తూంది.

తగల బడే గుడిసెల నుండి
లేచే పొగల్ని చీల్చు కొనీ
అనల ముఖం అవతరించి కదలుతూంది
బాధా హృదయానికి అరుణ పథం చూపుతూంది.
అభిమానం ఆదరణం
కావాలని రావాలని
అలజడిలో ఆందోళనలో
ఆకలి దప్పికలకు ముందు
సంక్షోభం! మానసికంగా,
దేహంలో అణువణువును
ఆగ్రహ గోళంగా మారుస్తూంది.

నరక బడిన చెట్టు కొమ్మలా
కింద పడి ఉండేదుకు
ఎవరు ఇష్టపడతారు?
సహనంతో మట్టి పాలవుతారా?

బ్రతికే హక్కు కయి పోరాటం!
ఏ వ్యవస్థకు గౌరవ చిహ్నం
ఏ చరిత్రలో వికాస విజయం.

**4**

ఏదో ఒక సమయంలో ఆదర్శం
కిటికీ లా అందరికీ తెరవ బడుతూంది
తలుపులా కొందరికీ తెరవ బడుతూంది

రోజూ పెరిగిపోయే ఈహలతో
ఎన్నటికీ పూర్తి కాని అవసరాలతో

ఏ బ్రష్‌తో చిత్రంలో చూపలేనిదీ
ఏ కెమెరాతో ఫిల్మ్‌లో దించలేనిదీ
జారే మంచు కమ్మీ
సోకే నీడ కప్పీ
కనిపించని వెలుగు ముఖం! మనిషిలో

స్నేహం వైరం ఆశ నిరాశతో
హితం హింస మోదం ఖేదంతో
కదలే జీవన వ్యవహార జగత్తులో
నీడ నుండి నీడకు చేరే
జీవితాలు అసంఖ్యాకాలు!
ఒక సమయం
చెట్టు నీడ నివాస మవుతూంది.
ఒక సమయం
గోడ నీడ ఆశ్రయ మవుతూంది.
ఏదో ఒక కోణంలో అంశాన్ని ఎన్నుకొనీ
దొరికిన వాస్తవాన్ని రంగులతో దిద్దుతూ రచనలు!
పత్రికలూ! శ్రవణ దృశ్య యంత్ర ప్రభావాలూ!
వెలుగు లేని ముఖాలకు మేకప్‌తో.

తన పాత్రకు విజయోత్సవ సన్మానం
ఏ రోజూ అభినందన సుమ సేచనం!
కోరే పాత్రలో తగిన వేషంలో
గడుసుదనం అమాయకం సమాంతరంగా
వీధి వర్తకుని మూటలా
పిల్లల పుస్తకాల బాగ్‌లా
ఎవరి పీఠం వారి వెనక!

## 5

రాజకీయ గగనంలో శుక్ర తారలా
దిన పత్రికలో పతాక శీర్షికలో
చేతి బ్యాగ్‌లో వీడని భాగ్యంతో
పీఠం పై వదలని మమకారంతో
తమ కథకు మహా ఫలం పొందాలనీ
ఎవరికి వారు ప్రతి రోజూ సిద్ధంగా
అంతా రాజ్యాంగ  యంత్రంలో భాగాలే
ఎవరి స్థానాన్ని వారు మరచీ
మరొకరి స్థానంలో ప్రవేశించేరు
నమ్మలేని దృశ్యాలతో సన్నివేశం
తల క్రిందులుగా నడిపించే
ఇంద్ర జాల ప్రదర్శనం లా ఉంది.
బాధ్యతల్ని జ్ఞాపకం చేసే పెద్దలూ లేరు
చెబితే వినే వారూ అంత కన్నా లేరు.
ఒక గూటి చిలకల్లా పలుకులతో
అందరూ కలిసి ఎగిరి చరిస్తారు
జీవికలో కిందికి దిగే
ఎవరి దారి వారిదే!
ఎవరికి వారు తాము మెచ్చే
'ధర్మం' పజిల్‌తో వెళ్ళ బుచ్చేరు.
ఎవరికి వారు తాము కోరే
"న్యాయం' బొమ్మతో ఆడుకునేరు.
మనిషి అమ్మ బడే కొనబడే
విపణి వస్తువు కావడం! విచిత్రం!

## 6

రహదారుల్లో "రస్తా రోకో" నినాదం
గళ గళాని కొంక అలంకార మవుతూంది
టెలివిజన్ కెమెరా ముందు హంగామా
చలన చిత్ర కళా స్పర్శను పొందుతూంది.

రాజకీయ చదరంగంలో హింస
రోజు పుటకు అనల తిలకం దిద్దుతూంది.
స్వేచ్ఛా వాహనం పయి జయ జయ రావంతో
ప్రజాస్వామ్యం ఊరేగింపబడుతూంది.

బీభత్స తాండవానికి వేదికయై
ఈరోజు శాసన సభల్లో ప్రజాస్వామ్యం
చట్టంలో ఉరికంబానికి దగ్గర అవుతూంది
ఇది నేతల నీతిపై పరిహాసంలా ఉంది.

వివేక బలంలేని రాజనీతి
ఆయుధ ప్రవేశాన్ని ఆశ్రయిస్తూంది.
ఘర్షణ లో రణ చిత్రం!
నిశ్శబ్దంగా వెలువడుతూంది.
ఆయుధ ప్రయోగంలో రణ నీతికి
కొత్త ముఖా లేర్పడుతున్నాయి.

నిశ్శబ్ద శిఖర తలం నుండి
ప్రాణానికి గురి పెట్టే ఆయుధంతో చేతులు!
"దేనికి పనికొస్తాయి?" అంటే!
"మృత్యు పీఠం వేసేందుకు" అన్నట్లుంది.

చంపడానికి దారు లెన్నో ఈనాడు
ఎన్నుకోవడమే కష్టంగా ఉంది.
ఎప్పటి లాగే ఈ రోజు కదలుతూంది
సమస్య ముఖాన ప్రశ్నా చిహ్నంతో.

## 7

హద్దులేని స్వేచ్ఛలో తీగెలా
కదలే నీలి ఊహలు
ప్రాకే నీలి చర్యలు
విశాల సమాజ ఫాల తలంపయి
విషాద చిత్రాల్ని నింపుతున్నాయి.

చౌరస్తాలోనో స్టేషన్ లోనో వాహనంలోనూ
వదలిన బాక్స్ నుండి టైమర్
అపాయ భయ శబ్దం
దిశల్ని ఉన్మద తరంగాలపై తేలుస్తూంది.
ఆదర్శాన్ని క్షామం నుండి
ముక్తం చేసే నీతి జలదం జాడలేదు.
వెన్నెముక నంటి రైఫిల్‌తో
నడుముకు బిగించిన బెల్టు బాంబుతో
మనిషి నుండీ మనుషులకు మృత్యువు,
కంటికి కనిపించని రెక్కల పయి
ఎప్పుడు ఎక్కడ ఎగిరి వచ్చి
ప్రాణాల్ని తన్నుక పోయేదీ తెలీదు.

సమస్యను పక్కకు పెట్టీ
సమాజం నుండి దూరమై
ఏకాంతంలో అంతర్ముఖత్వం

ఈ సమయం మరీ ప్రమాదం!
సరికొత్త సందర్భానికి
సరియైన రాగ బంధంతో
స్పందనలో సమాజ శక్తుల్ని
ట్యూన్ చేయడం ఒకటే
తక్షణ కర్తవ్యంలా ఉంది.

**8**

చరిత్ర ఎపుడూ
కళ్ళు తెరచే ఉంటుంది.
చెట్టు ఇచ్చే నీడలో ఊరు వెలుపల
దాహంతో జల బిందువు కయి
వేచి ఉన్న పెదవులపై
కళ్ళు నుండి జారే బాష్ప కణాలు
అవసరానికి పనికి రాని నీతుల్ని తేల్చేస్తున్నాయి
మౌన రణంలో
నిశ్శబ్ద హింస
ఒక కార్నర్ నుండి మరో కార్నర్‌కు
నెత్తురుతో తడిసిన
మానవ హారాన్ని నిలుపుతూంది.

ఆవేశం ఆక్రందన అలజడిలో
అన్యాయం అవమానం అమానుషం తో
వీధిలో దృశ్యం!
ప్రజాస్వామ్యంలో కూడని
వికార ధోరణుల్ని ప్రదర్శిస్తూంది
పాలనలో సూచనలూ
పరిష్కార భేదాలూ
చెట్టును నరికేసే ప్రతి పాదనలూ

దానిపై వచ్చే ఆర్జనపై దృష్టి!
సమస్య మూలం వదలీ మరచీ
నిజ రూపం దాచీ మాపీ
శాఖోపశాఖలపయి ప్రశాఖలపయి
అవి తిరిగిన మెలికలపై వంపులపై
చర్చలూ! చర్యలూ! ప్రకటనలూ
ఎవరికివారు మకుటం ధరించాలనీ
ఎవరికి వారు పతకం పొందాలనీ!

## 9

ఏ దేశం అయినా
ఏ కాలం అయినా
అశాంతి సూత్రం ఒకటే
సూత్రానికి వ్రేలాడే తలలు వేరు!

తూణీరం నుండి చేతి కందిన
బాణాలతో తలల్ని ఛేదిస్తూ పోతే
హంతకునికి ముఖాలెన్నో!
మరణ గతికి దిశలెన్నో!
చూపు చూపుకీ మారే కోణాలతో
దారి తిన్నగా ఎట్లా కనిపిస్తుంది!
తగిలిన గాయాలకు కారణాలు
మనిషిని మనిషినీ బట్టీ ఛేదిస్తున్నాయి.
రణ రహితం, శాంతి చిహ్నం కాదు.
వికృత ధోరణులెన్నో అశాంతికి దారి తీస్తాయి!
ఆలోచనలో ఎత్తుకి పై ఎత్తులు
స్వార్థానికి శ్రేణిక లవుతున్నాయి.

అడుగు అడుగునా అనుమానాలతో విరామాలతో
సమయానికి గమ్యం చేరే దెట్లా?

బాధ్యతల్ని మరచిన పాలకుల ఆలోచన
బతుకుల్ని శిథిల శ్రేణుల్లో తిప్పుతూంది
బతకడానికి శిక్షణ అవసరం లేదు కాని
బతుకును హరించేందుకు అవసరమన్నట్లుంది

వాహనాల్లో నుండి నేతలు! దిగుతారు
తమ వెంట విలేకరులతో ఫోటోగ్రాఫర్లతో
ప్రచార పదం తోనే
తమ అస్తిత్వం నిలిచేదన్నట్లూ
ఇది బ్రతుక్కి తప్పనిదన్నట్లూ!

## 10

గుండెలో బరిసె లా దిగి అన్యాయం
చీకటిలో మాయమై రహస్యం
దొరకని నిజ రూపం కయి
చరిత్రలో! అన్వేషణ సాగుతూంది.
అణచే పాదం క్రింద
అధికార పదం ముందు
నిలవ లేని కాళ్ళకు సత్తువ నిచ్చే
మనో బలం అవసరం, ఈ సమయం
ఏ వీధి కార్నర్ లోనో
ఏ స్టేషన్ బెంచి క్రిందనో
జన వాహన ధ్వనుల మధ్య
పొద్దు పై పైకి ప్రాకినా లేవని బుడతకు
బతుకు తెరువు తెలీని బాల్యంలో

సమయం విలువ ఎరగని స్థితిలో
ఒక అడ్రసు కల్పిస్తే
బతుకు భయం వీడితే
మెలకువ విలువ తెలిస్తే
మనసు కోరే "నవారంభం"
అడుగు ముందుకు వేసినట్లే

బాధా శమనం ఎరగని హృదికి
సూర్యుడు ఎంత పైకి పయనిస్తేనేం?
అదొక చండ వహ్ని అయి మనసుకు
పరుగెత్తే ఆలోచన రావడం! దారుణం!

భాగ్య హీనుల హృదికి తేజం
భయద రూపం అవకూడదు.
దిక్కు తోచని కళ్ళ ముందు
దిక్కు చూపే చిన్ని గుర్తు మంచిది.

## 11

ఏ మనిషి జీవితమూ
గగనంలో ఎగిరే పక్షి వంటిది కాదు
భూమి పయి కదలని చెట్టు వంటిదీ కాదు
మనిషి తన మనసుతో
మనుషులలో మనిషిగా
బ్రతకడం ఎలాగో తెలియడం
జీవితంలో ఎప్పటికీ మిగిలే రహస్యం.

బుజాల పయి వాలో
హృదయం పయి నిలిచో

తల ఎత్తే సమయంలో
పావురంలా శాంతి కనిపించదు.

లలాట పతాక పయి శాంతి చిహ్నాం
స్వచ్ఛమయి మనోదృష్టికే కనిపిస్తుంది

ముదిగొండ అయినా
నంది గ్రామ మయినా
అశాంతి దృశ్యాలకు బంధువులు,
లోపలి నుండి పని చేసే హింసక ముఖాలకు
తొడిగిన "శాంతి" గుర్తు మాస్కులతో
రాజకీయ భూమికలే!

సమభావం సౌహార్దం సమభాగ్యం కలిసీ
చెదరని విలువలతో
సజీవ ప్రజాస్వామ్యం
హింస నుండి శాంతికి
శుభ్ర మనో రూపంతోనే సాధ్యం!

**12**

దూసే తీవ్ర చర్య మెరుపులతో
ప్రేలే విధ్వంస కాండ ధ్వనులతో
ఎగసే ఆర్త గళ ఘోషతో
వాతావరణం! భయదాకృతి పొందుతూంది.

ఇనుప చేతుల్లో నలిగి దేహం
కాలి బూటుక్రింద అణగి ప్రాణం

శిశిర దీన ముద్రలతో దృశ్యం
ఆటవిక యుగ వైరాన్ని తలపిస్తూంది.

ఏదో ఒక నెపంతో ప్రతి చోట
పరోక్ష రణ రీతుల ప్రభావమే
ఎగసే మంటల్ని ఆర్పడమే
ఉదారుల మొదటి పనిలా ఉంది
మంటల్లో చిక్కిన సామాన్యుల గురించి
ఆలోచన! సానుభూతి ప్రకటనలో!

గాలి మృత్యు సందేశాన్ని మోసుకొనీ
ప్రతి మనిషి చెవినీ వదలుతూంది
మనిషిలో జీవించే చైతన్యాన్ని
పోరాటానికి సిద్ధం చేస్తూంది.
విశాల పృథ్వి అందరిదీ
వినీల మేఘం అందరిదీ
సూర్యుడూ చంద్రుడూ అందరికీ
కిరణ రాగ ప్రసారం అందరి పయినా
మనిషిలో సమాజ చింతనలో పచ్చదనం
త్యాగ హిత మనోరూపం తోనే సాధ్యం!

**13**

చెట్టుకు తగిలే గాయాల బాధ
నీడకు ఎట్లా తెలుస్తుంది.
నీడను కోరే మనిషికీ అంతగా పట్టదు.
నరికిన కొమ్మలతో
వాడిన ఆకులతో
వనంలా అక్కడక్కడా! సమాజ భాగాలు!

పై నున్న చైతన్య శిఖరాలను
అవసరాల హిమం కప్పేస్తోంది
సమున్నత దశ చూచే అవకాశం
మనిషి కోల్పోవడం సహజం!
సమాజం నుండి మనిషి వేరు కాదు!
మనసు నుండి కాలం వేరు కాదు!

మనిషికి మనిషితో తప్పనిదయి జీవితం
పెదవుల పయి నవ్వు వచ్చి వాలుతుంది
ముఖాన నీలి నీడ పక్కకు తొలగుతుంది.
దారి నుండి మరో దారి అవసరమై
నడచి నంత మేర భూమి
పచ్చని హృదయంతో స్వాగత మీయాలనే
కాలం ఎవరినీ తన బుజాల పయి మోయదు
అందరినీ తనలో భాగం చేస్తూనే
ఎవరి వ్యక్తిత్వంలో వారిని నడిపిస్తూనే
ఎక్కడి కక్కడే వదలి వెళ్ళిపోతుంది
కాలం కదలి పోతుంది భూభ్రమణంతో
ఎప్పటికీ మనిషికి అందని ఎత్తులో
సమాజం సజీవంగా నిలుస్తుంది
చేతనతో రోజొక మార్పును పొందుతూ!

## 14

విశ్వంభర తలం పయి రోజు
శ్రమ చేతనలో కదలుతూంది
భౌతిక శక్తుల ఉత్సాహంతో
మనస్సు మౌన పాత్ర వీడుతూంది

దూర మయిన ఆకాశం దగ్గరవుతూంది
అందే ఆలోచనా సీమల్లో ఒకటై,
ఎక్కడి కక్కడ వీడి పోతూన్నట్లు ఉంటుంది
వ్యవహారంలో పని తీరిన మిత్రంలా!

తన కళ్ళ ముందు దీపంలా
ఎప్పటికీ వెలుగుతూ ఉండాలనీ
కోరే తల్లి లా అవని హృదయం
తెగని బంధంతో ఆకర్షిస్తూంది.

మట్టి నుండి వచ్చే మొక్కలా
శబ్ద శక్తి నుండి సృజన రూపం
కవితలో సంకల్ప జగత్తుతో
నవతతో మనో దర్శనంలో.

ఎవరి చేతి లోనో మలచబడీ
వివిధ భంగిమల్ని పొందడానికి
మట్టి ముద్ద కాదు! మనిషి అస్తిత్వం
ఊహలో క్రియలో దర్శనంలో!

అన్నీ ముఖ్య మయిన విషయాలే
అవసర మయినవే బయటికి వస్తాయి
ఆ రోజు అవసరానికి ఎన్నో!
మనో రూప ప్రేరణ తోనే అన్నీ!

## 15

శాంతి నుండి రణచర్యకూ
రణం నుండి శాంతి క్రియకూ

శాంతినీ రణాన్నీ రెండిటినీ
రెండు చేతుల్లో తీసుకొనీ
బంతుల్లా ఆడాలనీ
బొమ్మల్లా మార్చాలనీ
కాలక్షేపంలో గడిచే కోరిక!
రోజుకి కావలసిన విషయాన్నిస్తూంది!

దుఃఖాన్ని ఎవరూ వెదకుతూ వెళ్ళరు
అయినా ఎదురవుతుంది, పయి బడుతుంది.
బాధలో శరీరం బరు వెక్కుతుంది
జలధిలో నావలా తేలి పోవాలనిపిస్తుంది.
స్వయం భూమిక నుండి
సమాజ క్షేత్రం లోకి
ప్రవాహంలా వ్యక్తి జీవితం!
పల్లంలో కదలుతూ వేగం అందుకునీ
ఎత్తులో యత్నంతో ఎగసి పొరలుతూ
సముద్రం గురించి తెలీకుండా! సాగుతుంది.

క్రోధాన్ని అగ్నిలో ఆహుతి చేసి
శాంతిని ఊహలో సుమ వనం చేసి
కలిసీ మనిషిని పలకరించే మనిషిలో
మనోజగం! నవారంభానికి సంకేతం

నిజ చేతనలో రూపొందే పాత్రలతో
ఈ రోజు ఆల్బంలో
ప్రజాస్వామ్య మనో రూపం!
రేపటి రోజుకు
సృజన మూల మవుతూంది.

## 16

ప్రజా స్వామ్య స్వేచ్ఛలో
ఈ రోజు వెలుగు సంకెళ్ళు
బహు ఇష్టంగా అందంగా
కాళ్ళూ చేతులూ వదలి
మనసును బంధిస్తున్నాయి
అవసరానికి ఉపయోగ సుందరంగా
బ్రతుకును అలంకరిస్తున్నాయి.
మాట చిలక బొమ్మను తలపిస్తూంది
ముఖం 'బొకే' లా ఎదురవుతూంది
అధికారం అందలం భాగ్యం భోగం
మనో వలయం చుట్టూ భ్రమణంలో

వెలుగు సంకెళ్ళ ఘలం ఘలల్లో
ప్రయాణం సాగుతూంది! కదలకుండా
మధ్యలో ప్రాణ భయం!
ఆపాయ సందేహం! నివారణ చర్యలతో
నేతలకు రక్షణ గణ బృందం!
కావలసిన బడ్జెట్ అంతలో సిద్ధం!

చివరి గెలుపు అంటూ లేని పోరాటంలో
తిరిగే జీవన యంత్రం
శబ్దానికి పని కల్పిస్తూంది
నిశ్శబ్దాన్ని తరుముతూంది
మౌనానికి కొత్త అర్థాన్ని ఇస్తూంది.

నిరాశలో సమాజం
చలనం ఉన్న శిలతో సమానం

జలాలు గడ్డ కట్టి
మంచు పలకయైన సరస్సులో
చేప ఈదడమూ లేదు
పద్మం వికసించడమూ లేదు
ఆల్కెమీలో
ఎంత స్వర్ణ సుందర రూపమైనా
సజీవ స్పందనతో ఆకృతికి సమం కాదు

జీవించి ఉన్నందుకు
శరీరంపై గాయాలు!
మాననివీ! మరవనివీ
మచ్చలుగా నిలిచినవీ,
ఊరూ పేరూ జ్ఞాపకం లేదు!
'మనిషి' అనే గుర్తు మాత్రం తెలుసు!

పాతవి మరపిస్తూ
కొత్తవి ముందుకు తెస్తూ
కాలం ఆగదు
ఎవరి నుండీ ఏదీ కోరదు

ఈ రోజు ఆల్బంలో
స్వేచ్ఛకు దొరికిన అవకాశంలో
ప్రజాస్వామ్య దర్శనిలో జీవన దృశ్యం
వెలుగు సంకెళ్ళలో మనోరూప విశేషం.

## II. దారులన్నీ తెరవబడీ

### 1.

నిద్ర నుండి మెలకువతో
ప్రపంచాన్ని మోసుకొనీ
సముద్రం నుండి నది తటికీ
తటి నుండి నేల పయికి.
పుట్టుకతో ఏర్పడే
చివరి దాకా నిలిచే
మనో నిలయంపై దృష్టి
ఎపుడో! పడుతుంది.
ఏ వైపో కిటికీ తెరచి ఉండొచ్చు.
నిద్ర నుండి మేల్కొగానే
లోపలి నిలయం గురించి
ఆలోచన ఉండదు.

లేచీ అద్దంలో చూస్తే
ముఖంలో తెల్లని కాగితంలా భవిష్యత్తు
ఆలోచనలో పరచుకొనీ
శబ్ద శక్తుల్ని ఆహ్వానిస్తుంది
ఎగిరే విమానం రెక్కల్లా
విప్పారిన సంకల్పంతో
కిరణాలు అల్లిన మస్తిష్కంతో
దారులన్నీ తెరవ బడీ,
బయటి ప్రపంచం
తలుపులు తెరచుకుంటాయి.
లోపలి ప్రపంచం
తలుపులు మూత బడతాయి.

## 2

నా కోసం ఎదురు చూచే ఇంటి గేటు
చేతులు చాచి దారి చూపిస్తుంది
శిశు వదనంలా గుడ్ బై చెబుతుంది
బయటి జీవితానికి ఆరంభ దృశ్య మవుతుంది.
లోపలి మనిషి పక్కకు తప్పుకునేను
మరో మనిషి ముందుకు వచ్చి నిలిచేను.
బయటి ప్రపంచానికి ప్రతినిధిలా.
ఇంటి ప్రపంచమూ పక్కకు జరిగిపోతుంది.

ఒక గేటు నుండి నిష్క్రమణ పర్వం
మరో గేటు లోకి ప్రవేశ పర్వం
నిష్క్రమణ ప్రవేశాలతో రోజంతా!
సందేహాలు ఊగుతాయి, ఊగిస్తాయి
ప్రశ్నలు ఎదురవుతాయి ఉత్సాహంగా
జవాబుగా వ్యక్తి నుండి సమాజానికి
సన్నివేశ దృశ్యాలు మారతాయి!

క్రితం రోజు సశేషాన్ని అందుకొనీ
ఈ రోజు విశేషాన్ని పొందుతుంది
ఏ రోజూ ఆ రోజుకే మితం కాదు
వచ్చే రోజు పయి ప్రభావం ప్రసరిస్తుంది
మనిషిలో మరో మనిషి రూపం! గుప్తంగా
మనసులో మరో జీవన పార్శ్వం! కల్పనగా
బయటి ప్రపంచంలో జీవితం
శ్రమ పతాక రెప రెపలతో!

## 3

ఇపుడు తల ఎత్తి గగనాన్నీ
గగనంలో వెలిగే సూర్యుణ్ణీ
చూచే కోరిక ఉండదు, ఎవరికీ!
ఎవరైనా ఉన్నా! తీరిక అసలే ఉండదు!

మట్టి అంటని కల్పనలో ఆదర్శంలా
గాజు శిల్పంలా బ్రతకాలని కొందరు
ఏ రోజు అయినా ఒకటే వారికి
ముఖానికీ హృదయానికి భేదం లేదు.

చిరు నవ్వులో అదృష్ట సుమం కయి
ఎదురు చూచే మట్టి మనుషులూ
మట్టి ప్రమిదల్లో దూది వత్తుల్లా! వెలిగే
ప్రాణాలు ఏ గాలికి ఎపుడు ఆరేదీ తెలీదు!

తప్పని కాలి బాటలో
గాయ పడిన అడుగులతో
దారి తప్పీ, దారి దొరక్కా
భ్రమణంలో గడిపే వారూ!
మనిషికీ మనిషికీ మధ్య ప్రవాహం
సులభంగా దాట రానిదీ
అవతలి తీరంలో వ్యక్తిని
కలవాలనీ మాట్లాడాలనీ కోరిక!
దాటరాని ప్రవాహాన్ని దాటే యత్నం!

# III. ఊరు వదలి

## 1.

ఊరు వదలి నగరానికి
బ్రతికే దారి కయి
కళ్ళలో చిరు ఆశతో.
ఇది విహార యాత్ర కాదు
వినోదయానమూ కాదు

ఒంటరిగా ఉన్నా! చుట్టూ మహా ప్రజ
శూన్యాన్ని పూర్ణం చేస్తూ ఒంటరి తనంలో
కొత్త మనిషికి ధైర్యాన్ని ఇస్తూంది.

వాగుల్లా జన సమూహాలు పంక్తులుగా
వాహనాలు వరసగా రేస్‌ను తలపిస్తూ
ఆవేగం ఆవేదనతో
పొగల మధ్య పరుగులూ.
గాయాల భయంతో క్షణాలు వణకేను
కొత్త మనిషి గుండె లయ పెంచేను
అక్కడక్కడా సరదాలో ఉల్లాసం! గలగలలూ
దాని ముందో వెనకో బిక్షువు దీన స్వరం!

కట్టడాల మధ్య నుండి ఉదయ కిరణం
దిగడానికి వెనక ముందు ఆడుతూంది
మొట్ట మొదటి కిరణం!
మనిషి ముఖంపై దిగడానికి సూటిగా
ఇది పల్లె కాదు!
వడ్డించబోయే విస్తరి కోసం
ఊరు వదలి నగరానికి వస్తే మనిషి!
సమూహంలో ముఖాన! ప్రశ్నా చిహ్నం!

## 2

పరిచయం లేని చోట
గమ్యం దాకా తీసుకొచ్చి
కావలసిన ఇల్లు చూపి వెళ్ళిపోతే,
అడుగు ముందుకు వేసి
తలుపుకు వేసిన తాళం కనిపించీ
మరో ఆశ్రయం లేక
వెనక్కి వెళ్ళ లేని స్థితిలో
నగరంలో కొత్త మనిషి!

తనను ఎత్తుకొనీ పోజూచే
సుడి గాలిని అడుగు కింద అణచీ
నడిపించే అమేయ మానవశక్తితో!

ఆకాశం వైపు చూస్తే
అందని ఎత్తులో సూర్యుడు "సత్యం"లా
చూపు నిలపలేని విధంలో తేజంతో!
గాలి సందేశ స్పర్శతో కదలుతూంది
కిరణం ఉపదేశ ప్రసారంతో ప్రకాశిస్తూంది.
వెనక నుండి శిథిల దృశ్యం పిలుస్తూంది
గాయాల పాలయిన శరీర భాగాలతో
ఆహారం అధికారం సంపద భోగంలో
పోటీతో నడచే కాళ్ళ క్రింద
పగిలి ముక్కలయి చెదరిన ఆదర్శంలో
వర్తమాన దృశ్యం!
గుర్తు పట్ట లేకుండా ఉంది!
కాస్త ముందుకు నడిస్తే దూరాన
సగం తెగిన మస్తకం ఆడిస్తూ

కొన ప్రాణంతో! రెపరెపలాడే
గుడిసె రూపం! కనిపిస్తుంది!

క్రిక్కిరిసిన ఆలోచనల్లా
పైకి ఎగసే నిర్మాణాలతో
నగర ఫాల తలం! అందంగా
అందరికీ స్వాగత ద్వారంలా ఉంది.

**3**

ఒక్కో దిశలో ఒక్కొక ఆకర్షణ
ఆకర్షణలో ఆరాటపడే మనిషికి
అవసరానికి అడిగే దానికి
బదులు చెప్పేందుకు తీరికలేని మనుషులూ!
బొమ్మల్లా చూచే ముఖాలతో

ఎక్కడి కక్కడ నరికిన బాహువులతో
దారి కిరు వైపుల చెట్లు!
గాలిలో ముఖాలు చూచి
ఏదో చెప్పబోతున్నట్లు ఉంటాయి.
అక్కడ ఆగి మరీ! ఎవరు ఆలకిస్తారు
ఎవరో! తనలా వచ్చిన కొత్త ముఖం తప్ప!

అలవాటు పడిన
శబ్దానికి అర్థం దూర దూరమవుతూంది
అలవాటు లేని
అర్థంలో శబ్దం ఉక్కిరి బిక్కిరి అవుతూంది

దారిలో సూచనలు హెచ్చరికలు
చిలుక పలుకుల్లా!

గాలిలో హిత సూక్తులు! ఉపదేశాలు
రాలే ఎండుటాకుల్లా.
సాయం సంధ్య సమీపించే కొద్దీ
ఆశల తలుపులు మూత బడుతున్నాయి
మరో రోజుకై నిరీక్షణం తప్పనిసరి అవుతూంది
జలధిలోకి వెళ్ళబోయే
పడవలా పగలు! జారిపోతూంది.

## 4

రావణునికి పది ముఖాలు వరసగా
అన్నీ ఒక మారే ఒకే మాట మాట్లాడతాయి
ఇక్కడ మనిషికి పది ముఖాలు వెను వెనుకనే
ఒకటొకటీ వేరు వేరు మాటలు మాట్లాడతాయి!

తన చేతిలో ఎత్తిన కత్తితో శిల్పంలా
తన ముఖంలో వెలిగే బల్బుతో మౌనంగా
ఏ పత్రిక లోనో ఫోటో!
ఏ టెలివిజన్‌లోనో చిత్రం! పై ఉబలాటం!

క్షణ క్షణమూ పెరిగే పనిలో ఒత్తిడిలోనూ
ఆదాయం అధికారం అంతస్తులకై
ఒకరి కన్నా ముందు మరొకరు
గగనంలో ఆవాసం ఛాన్స్ పోకూడదనే!

నగరం అందరికీ చోటు ఇస్తుంది
ఏ వివక్ష లేకుండా
జాతి మతం ప్రాంతం దేశం
ఇమిడే వారు కెరటాల్లా కదలుతారు!

ఇమడనివారు స్తంభాల్లా నిలుస్తారు.
రోజు వెనక రోజు దరిద్రంలో
దూర దూరం జరుగుతున్నట్లు ఉంటుంది.
రోజుతో రోజు భాగ్యంలో
దగ్గర దగ్గరగా కదలుతూన్నట్లు ఉంటుంది.
చేతిలో బ్లాంక్ చెక్‌లా రోజు!

ఇంకేం కావాలి అంటే?
ఇది క్యాష్ కావడానికి
కావలసిన హంగు లెన్నో
ఏది తక్కువయినా
సమస్య పడగ విప్పుతుంది.

**5**

రాత్రికి అందుకోబోయే సమయం
లైట్ల వెలుగులో ధూళి పొరల్లో
మత్తులో తూగే అలలతో
మంచు క్రమ్మన సముద్రంలా ఉంది.

హారన్ సైరన్ ధ్వని పంజరంలో క్షణాలు
దారిలో ట్రాఫిక్ జామ్‌లో మనుషులు
ప్రవేశించక తప్పని మార్గంలో చిక్కి
వాహనాల్లో ఉక్కిరి బిక్కిరి అయ్యేరు.

ట్రాఫిక్ తగ్గడ మనేది ఇప్పట్లో జరిగేట్టు లేదు
రోడ్ క్రాస్ చేయాలనుకుంటూనే క్షణాలు దొర్లుతూ
అలాగే నిల్చుని ఉండి పోతూ! నిశ్శబ్దంగా
దాటే సమయంలో అపాయ భయం లేక పోలేదు

దారి తప్పే ప్రమాదం మాత్రం లేదు
సిగ్నల్ వెలుగు కన్ను సూచనలోనూ
ఎంతకూ తెగని ట్రాఫిక్ వరస చూస్తూ
ప్రక్కనే అలసీ! ఎవరో నాపై వాలిపోయేరు
నేనో స్తంభం అనుకోవచ్చు!
స్తంభానికీ మనిషికీ తేడా లేని
విశేషమైతే వస్తుంది జీవితంలో
నగరంలో నిరీక్షణలో మనసుకు
అనుకోని విరామ సమయం అవుతూంది.

## 6

తీరిక లేని తొందరలో
ఇరుకు లేని
బెరుకు లేని
ఆవేశం అలలపై
సమాజం కదలుతూంది.

స్థాయి మీరి
శ్రుతి తప్పిన
విపరీత ధ్వనులతో
నగరంలో చౌరాస్తా
ప్రజాస్వామ్య స్వేచ్ఛలో
శాసన సభా పర్వంలా ఉంది.

మాటల్లో ఆయుధం ప్రేలిన శబ్దం!
మాట్లాడే ముఖాలు హఠాత్తుగా
మౌన ప్రతిమ లవుతున్నాయి
శబ్ద ఘోష విసరే పవనం

చెవుల్ని నిశ్శబ్దంగా స్పృశిస్తూంది
సమయం శిలా సదృశ మవుతూంది
ఇది కర్ఫ్యూ ప్రభావమని తరవాత తెలిసింది.

ఫిడేల్ పయి కమాన్ లా
ఆలోచనతో మనో రూపం,
కాలానికి ప్రవాహకత నిస్తూ
శబ్దానికి జీవ కళ నిస్తూ
సమయ రాగాన్ని సృజిస్తూంది
గెలిచే హృదయానికి నిదర్శనంగా.

## 7

అరణ్యం నుండి ఊళ్ళకు మారిన జీవితాలు
తిరిగి అరణ్యాలకు పరుగెత్తేట్లుంది
నదులు జీవన దాతలనీ
కొండలు శాంతికి నిలయాలనీ

రాత్రి కురిసిన మంచు రాసులుగా
ఘనీభూతమై హిమశిఖరాల్ని తలపిస్తూంది
ఇవి కరగడానికీ
కరిగి ప్రవాహమై తరలడానికీ
ఒక పగలు సూర్య తేజం సరిపోదు
మళ్ళీ రాత్రి మంచు కురిసి
విషాద సమయం తప్పదు
నిరంతరం కిరణ ప్రసార తేజానికే సాధ్యం
కాలానికతీతమైన మనో రూపాలలో

నీలి ముసుగుతో ముఖం కప్పుకొనీ
శూన్యమయిన చిత్ర పటంలా సందర్భం
భయం ఫ్రేమ్‌లో బంధింప బడీ సామాన్యుడు
కళ్ళ ముందు బాధలో దుఃఖంలో
అనుభవంలో నేరమూ శిక్షలో
మిత్రమో! శత్రువో! బంధువో!
మానవుడో ఎవరైనా కానీ!
లోపల మరో మనిషి! మనో రూపాన్ని
ఎప్పటికీ జ్ఞాపక చేయాలిసి ఉంది.

## 8

చిన్నవీ పెద్దవీ ఆయుధాలతో
నర హింసతో ఉత్సవానికి తలపడేను
గురికి అడ్డంగా ఉన్నవనీ
పూల చెట్లకూ నాశనం తప్పడం లేదు
ఎన్ను కొన్న దృష్టికి అడ్డు అనీ
వెలిగే దీపాల్ని ఆర్పివేసేను.

వ్యక్తిని శాసిస్తూ
స్వేచ్ఛను నిలిపేసే
సాహసం! ఎక్కడ బడితే అక్కడ!
ఎప్పటికపుడు! సర్దుకపోయే పాలనారీతులూ

రాజకీయ ప్రహసనానికి
ప్రజాస్వామ్యం మౌన వేదిక అవుతూంది
రాజ్యాంగం ప్రతిమతో సమానం కాదు
ఏ మనిషీ యంత్రంలా బ్రతికే వీలు లేదు
భవిష్యత్తుపై స్వప్నాన్ని ఎవరూ శాసించలేరు

వర్తమానంలో గమనాన్ని ఎవరూ నియంత్రించలేరు
ఆదర్శంలో చేతనను ఎవరూ అంతం చేయలేరు
మనిషిలో మనోరూపాన్ని ఎప్పటికీ మరిచిపోలేరు.

## 9

గడియారంలో
అంకె నుండి మరో అంకెకు జరుగుతూ
చుట్టూ ముందుకు తిరిగే ముళ్ళలా
అస్తిత్వంలో ఒక విపణి నుండి
మరో విపణికి! వ్యాపార పథకాలు
కోణం నుండి మరో కోణానికి
మారే కొత్త దృష్టి శైలీ భేదాలు

తిరిగే చక్రాన్ని వదల్లేని సమాజం
విశ్వ స్పందనతో తన లయను కలుపుతూంది.
భౌతిక సుఖ సంపదలో పూర్ణతకయి జీవితం
విపణి సంస్కృతిలో ప్రతి దేశం ఒకటవుతూంది.
దరిద్రం నుండి విముక్తికి
పైపై మెట్లను పెంచేవిగా
భాగ్యం నుండి అదృష్టానికి
గగనాన్ని పరచి చూపేవిగా
దీనార్ డాలర్ యన్ యూరో రూపాయి
కరెన్సీలు అంకెల్ని నాట్యం చేయిస్తున్నాయి.

ఏ సమస్య తీరిందీ
ఏ విజయం పొందిందీ
జవాబుకై జీవితంలో
అనుభవ స్థాయి ప్రమాణంలా ఉంది.

## 10

ప్రపంచ పటంలో
దేశ దేశాల మధ్య సీమలు
విపణి కళలో భాగధేయానికి
స్వాగత కరాలవుతున్నాయి
విశాల శాలా విస్తరణంలో
ఎక్కడెక్కడి నుండో వాణిజ్య వ్యవస్థలు
భాగస్వామ్య రూపాలతో
భాగ్య పథంలో పోటీ పడుతున్నాయి.
పూర్వం టేబిల్ పయి ఉన్న గ్లోబ్
ఇపుడు అర చేతిలో తిరుగుతూంది.
ఆర్థిక నీతిలో తెరవబడిన
అవకాశ ద్వారాలతో
పల్లె బుజాలపై
వాణిజ్య ప్రపంచం దిగుతూంది.

ఏదీ వదలదు జీవితంలో
అన్నీ అనుభవంలో భాగాలే
భూమి తలం ఎప్పటికీ! ఒకటే
కోరే సంపదలు వేరు!
మనసు విధం ఎప్పటికీ ఒకటే
కోరికలో అభిరుచులు వేరు.

మ్యూజికల్ చెయిర్‌లో పాల్గొనే ప్రతి వ్యక్తీ
విజయ విధానంలో చుట్టూ పరుగెత్తావిసిందే!
కోరే భాగ్య దశకై
కాలాన్ని మరచి పోవలసిందే.

## 11

అలసట ఎరగని నర్తకిలా క్షితిజం
అవిరామంగా చిత్ర భంగిమల్ని ప్రదర్శిస్తుంది
ఎవరికి నచ్చినా నచ్చక హోయినా
ఏ దృశ్యమూ మారదు
ఎవరైనా చూచి తీర వలసిందే.

నిద్రకు ఒదిగే పిల్లల్లా
గగన తలం పయి నక్షత్రాలు
ఎపుడూ వంగి ఉండే ముఖాలకు
పైకి చూచే అవకాశం ఫలిస్తుంది.
చెట్టు కొమ్మకు వేసిన ఊయెలలో
భద్రంగా నిద్రించే పాపలా చంద్రుడు
నవ తరానికి ఆశా బింబంగా.

దు:ఖంలో కష్టంలో ఒంటరిలో
మనిషి హ్లోద రూపాన్ని కోరేను
మనో రూపంలో చేతనతో
మట్టి అంటని ఆదర్శాన్ని అభిలషించేను
మోసే వారు ఉండాలి కాని
ఆశ అందలం ఎక్కుతూంది.
మోసే వారికీ ఏదో పని అవసరమూ
కాలక్షేపానికో, సేవకో బ్రతుకులో
వాస్తవ సౌందర్యాన్ని పొందలేని దృష్టికి
చంద్ర బింబమయినా, గుండ్రని బల్బు అయినా ఒకటే!

## 12

పగలంతా మండి మండి సూర్యుడు
భరించలేక సముద్రంలో దూకేను
అలల పయి తేలుతూ హ్లాదంగా
నురగలలో చంద్ర బింబమై కదిలేను
ఆరని సూర్యుడు, ఉత్సాహ రూపం
వెలిగే చంద్రుడు, ఉల్లాస చిహ్నం
మనిషి మనో రూపానికి
వీడనివీ పగలూ రాత్రి.
తెరవ బడిన దారుల్లో
దిశ దిశలో లక్ష్యాలెన్నో
ఆదర్శం నిలుపుతూంది
జీవితాన్ని గమ్య పథంలో.

ఈ రోజుకీ వచ్చే రోజుకీ
క్రియలో ఆలోచనలో భేదం
సరి కొత్త గుణ రూపంతో
మార్పుకి మార్గమవుతూంది.

బ్రతుకులో మెరుగుతో
అలంకార ప్రియంగా
జ్ఞాపకంలో శిల్పమై రోజు
మనో నిలయంలో చేరుతుంది.

## IV. తిరిగి లోపలికి

### 1.

పాత వేవో దాగీ
కొత్త వేవో చేరీ
చేతిలో బాగ్‌తో తిరుగు ముఖంలో
గేటు ముందు నిలుపుతుంది కాలం
సాయం సమయానికి చల్లబడీ
చూచే చీకటి చేతులకు అందకుండా
ఇందాకా నాతో ఉన్న మనిషి
నా నుండి తొలగి పోతున్నట్లు ఉంటుంది.
అవతలి వైపు నుండి మరొకరు
నీలోకి దగ్గరగా వస్తున్నట్లు ఉంటుంది.

పైన రెండు మూడు సార్లు చుట్టు చుట్టి
ఇంటికి దగ్గరగా మైదానంలో
దిగే హెలీ కాప్టర్‌లా మనో రూపం
ఆలోచనలో మిగిలిన పనుల్ని మోసుకొనీ.

గేట్ లోపల గోడ పక్క నుండి
తీగె ముఖంలో పూల పంక్తి
నా సిగ్నేచర్ ను తలపిస్తూంది.

గేటు బయట తీరం ఒకలా
గేటు లోపల తీరల మరోలా
గేటు తెరుస్తూనే ఎదురుగా
పిల్లలు ! చంద్ర కళల్లా
రేపు సూర్య కిరణా లయ్యే
దిశా ఫాల భవిష్యత్తుతో.

## 2.

ఇల్లు ఇల్లే దేని తోనూ పోలిక లేదు
చాచిన చేతులతో ఆశ్రయ మూలాలతో
భద్రతకూ బంధాలకూ నిలయమై
హృదయానికి పచ్చదనం చూపిస్తుంది.
చెట్టు చెట్టే ఇంటి ముందు స్థిరంగా
ఉన్న చోటునే పరచిన నీడతో
పూవో పండో ప్రసాదిస్తుంది సాదరంగా
ఎప్పటికీ వీడని జ్ఞాపకాల శోభతో.

ఇంట్లోకి అడుగు వేయగానే
నాలో కొత్త శక్తి ప్రవేశిస్తుంది
పగలంతా బయట తిరిగే పక్షి
రాత్రికి గూటికి చేరుకుంటుంది
పక్షికీ మనిషికీ సామ్యం సంబంధం
జీవం నుండి జీవిక దాకా
ప్రకృతి నుండి పరమార్థందాకా.

ఇంట్లో బయటా స్థాయిల్లో మనిషిలో
ప్రకాశ మాన మనో పార్శ్వాలు వేరు
కాలం సూత్రం ఒకటే అయినా
చేరే క్షణాల పూలు వేరు,
వస్తువు ప్రయోజనం వేరు!

## 3

మనో బీజం నుండి ఆలోచనలు
దశ దిశలూ విస్తరిస్తూ
భౌతిక తలంపయి

సమాజ మూలంతో
యుగాల జీవిత చరిత్రకు
పరిణామ రూపాన్ని ఇచ్చాయి!
ఏ రోజూ శూన్య ముఖంతో వెడలదు
జీవిత చిత్రాల్ని నింపుకొనే వెళ్ళుతుంది
ఒక రోజు మరో రోజుకు ప్రేరణయై
చరిత్రలో చోటుకై ఎదురు చూస్తుంది.

రాత్రి శిల్పంలా ఏ రోజూ
ఎక్కడి దక్కడ నిలిచి పోదు
నీటి ధారలా ప్రతిరోజూ
ఏ వైపు అయినా కదలుతుంది
సమాజ చలనానికి సమాంతరంగా
మనిషి ఆలోచనతో తేలిపోతుంది
లోపలి మనిషికి
రోజుతో పనిలేదు
మనో నిలయంలో
సమాజ స్మృతి చేతన తోనే!

**4**

ఆగని కథలో అలసీ
మనిషి శరీరం
రెక్కలు వంచీ దిగే పక్షిలా
పక్క పయి వాలిపోతుంది.

కనురెప్పలు మూతలు పడతాయి
రాబోయే క్షణం వేచి ఉంటుంది
నిశ్శబ్దంగా తలుపు వద్దనో

మౌనంగా మెలకువ అంచునో
లోపలి తలుపులు చేతులు విప్పుతాయి
పైకి నిలయం శూన్యంగా కనిపిస్తుంది
లోపల ఎన్ని అపూర్వ వస్తువులో!
ఎన్ని అరలో! ఎన్ని విభాగాలో!
పూర్తిగా చూచేందుకు సమయం దొరకదు
లోపలి అభిలాషకు హద్దులు లేవు.

ఆగని కథలో బయటి విరామంలో
మనిషి జీవితంలోని
వేగాన్ని వదలీ,
పాత్రను వీడీ
నిలయంలోకి ప్రవేశించేను.
బయటి ప్రపంచం మరచేను.
సుషుప్తిలో నిలిచేను
స్వప్నంలో కదలేను
గభీర సరస్సులో జలచరంలా.

బయటి మనిషి
భూచరమయితే జీవితమంతా
లోపలి మనిషి
జలచరమో! ఖేచరమో! విరామంలో!

## 5

దేశానికీ కాలానికీ అతీతంగా
మనస్సు కలలతో ఆడుకుంటుంది
లోపలి వస్తువుల్ని అమర్చిన

మ్యూజియంను చూడాలనీ!
ఇది తీరని కలగానే మిగులుతూంది
ఆ రోజు ఆలోచనతో మెరసి జారిపోతుంది.

స్వప్నం వెంట బడీ
మధ్యలో వదలి పోతుంది
వాస్తవం వెంట బడే అవసరం లేదు
ఎప్పటికీ మనసును అంటుకునే ఉంటుంది.

జీవితంలో వదలని వాస్తవం
మనసును వదలని ప్రగాఢ మిత్రం
రోజు ముఖం పాతబడీ
గుర్తులతో రాతలతో గీతలతో నిండీ
అద్దం ముందు – సందేహిస్తుంది
ముఖాని కెదురుగా వచ్చేందుకు;
జడంలా వెనకబడి ఉంటుంది
జ్ఞాపకాల నీడలో కలసి పోతుంది
మరో రోజుకు! అవకాశం వస్తుంది!

నిద్ర నుండి మేల్కొగానే రోజు
ముందు తెలీని కొత్త అనుభవంలో
ఏ దిశలో ఏ దారినో అవలంబిస్తుంది
ఎదురుగా దారులన్నీ తెరవబడీ.

# V. కాలం కవితయై

## 1. ఇంటి ముందు

ఇంటి ముందు తూరుపు దిశ
నాటిన మామిడి చెట్టు పెరిగీ
నా గది గోడ వైపు శాఖలు సాగి
గది కిటికీ నందుకో జూస్తుంది
సూర్యుని కిరణాలకు అడ్డుగా
చలి కాలంలో మరీ చిరాకుగా

కొమ్మను కొట్టే యడమా?
నేను కూర్చునే స్థలం మారడమా?
ప్రస్తుతానికి రెండు అభిప్రాయాలూ
ఇంట్లో చర్చా వేదిక పైకి చేరాయి
అపుడపుడూ కొమ్మల్లో గూడు నుండి
చిన్ని చిన్ని ఈకలు జారి
గాలికి ఎగిరి గది కిటికీ నుండి
లోపలికి చేరి అలంకరిస్తాయి

ఏడాది ఎడాదికీ పెరుగుతూ కొమ్మలు
గది కిటికీ పైకి విస్తరిస్తూ
పైన ఉండే వాళ్ళకి హాయిగా
పొద్దెక్కే వేళల్లో చల్లదనాన్ని ఇస్తాయి.
ఆ చెట్టుకి ఎన్ని కాయలు కాస్తాయో
దగ్గరి వాళ్ళకీ దూరం వాళ్ళకీ
మును ముందు ఎన్నెన్ని కాయలు పంచాలో
రోజు రోజుకీ లెక్కలు మారతాయి.

కింద ఉన్న నాకు పొద్దునే
వెలుక్కి మొగం వాచి నట్లు ఉంటుంది
చలి కాలమయితే మరీనూ
వాన కాలంలో మరో విధంగానూ.
పైన ఉన్న వాళ్ళకు పొద్దెక్కే సరికి
వచ్చే నీడకు పరమ సంతోషంగా ఉంటుంది
గ్రీష్మంలో ఉష్ణ రసాన్ని తాగి చిత్రంగా
పచ్చని అందంతో నిలిచే చెట్టు
రాలేని నీలి మబ్బుకు ప్రతినిధిగా ఉంటుంది.

కొమ్మ కొమ్మకూ అల్లికతో
సాలీడు దారాలు సాగుతూ ఊగుతూ
జిగురుతో తెగని అనుబంధంతో
ఆలోచనల్ని ప్రతి ఫలింపజేస్తుంది.

చెట్టు కింద కూర్చుని గుర్విణి
రాబోయే శిశువు కోసం
ఎపుడో రానున్న చలి కాలానికి
ఇపుడే స్వెట్టర్ అల్లుతూంది
చెట్టు నుండి జీవితానికి
అనుబంధ ప్రసార చిత్రం
మనో రూప శాలలో
మరో కొత్త స్మృతి విశేషం చేరుతూంది.

## 2. మాటల బొమ్మలు

మాటలు బొమ్మల్లా
విన్నవీ కన్నవీ ఒకటొకటే
మనో నిలయంలో చేరతాయి

ఇదో పెద్ద బాగ్ లా తయారవుతుది
మాటకో బొమ్మ!
ఎన్ని మాటలో అన్ని!

ప్రేమించేవీ కోపించేవీ
శాసించేవీ ఎదిరించేవీ
తోడు ఉండేవీ, వీడిపోయేవీ.
అపుడపుడూ ఒక చోట కలిసి
బొమ్మల కొలువును తలపిస్తాయి
బాగ్‌లో వస్తువుల్లా ఒకటొకటీ
బయటి వచ్చేస్తాయి
జ్ఞాపకాల్ని మురిపిస్తాయి.

అన్నీ ముఖ్యమయినవే
దేని స్థాయిలో అది పని చేస్తుంది
దేన్ని ముందుకు తీయాలనీ
సందేహంలో మనస్సు ఊగుతుంది
అన్నీ "నేను" అంటే "నేను" అనీ బయటికి రావాలనే
ముందు వరసలో మొదట్లో నిలవాలనే
తమ పని అవనీ కాకపోనీ
మర్నాడు వచ్చే కొత్త వాటికి
కొంత చోటు ఉండాలి కదా?
లేక పోతే తిరుగు బాటు తప్పదు.

నాతో పాటే బాగ్ ఎప్పటికీ
వీడకుండా ఉంటుంది
దీన్ని గురించి ఏం చెప్పను?
నా జీవితంలో కలిసి పోయింది.

ఏ రోజు అవసరమయిందీ
ఆ రోజు అందులో నింపుకునేదీ
అన్నీ బయటికి వస్తే
గొప్ప ప్రదర్శనమే అవుతుంది.
కానీ అన్నీ బయటికి వచ్చే
సమయం సందర్భం ఉండాలి కదా!
సమయం సందర్భం లేకుండా తీస్తే
అన్నీ కలిసి ప్రాణం తీసేయవూ?

## 3. కిటికీ రెక్కల్ని తెరచి ఉంచితే మంచిది

హాస్పిటల్ గదిలో
బెడ్ పక్కనే కిటికీ రెక్కల్ని
తెరచి ఉంచితే మంచిది.
అనుకోని దూరం నుండీ
చాచిన ఆకాశం చేయి కనిపిస్తుంది
ఆశల్ని మోస్తూ
అవలీలగా ఎగిరే పక్షినీ చూడొచ్చు
మనిషి గుండెకు బలాన్ని ఇచ్చే
వెలుగు ముఖం కన్పించవచ్చు.

ఎప్పటిదో జ్ఞాపకం
తన ముఖం బయట పెడుతుంది.
ఎప్పటిదో కవిత్వం
నా గొంతులో సరిస్తుంది.

నీటిలో మునిగే మనిషి!
పైకి తీయబడుతూ
నదిలో తేలే వస్తువు

తీరం చేర్చ బడుతూ
ధవళ మనః పటం పయి అనుభవ చిత్రం!
ఇది లోపలి మనిషికే కన్పించే దృశ్యం!

బెడ్‌పై ఉన్న మనిషిని చూచేందుకు
చూచి పలకరించేదుకు
ఎందరో వస్తారు! కానీ
వెలుగూ మాత్రమే ఆత్మీయం అనిపిస్తుంది.

అందుకే ఆ కిటికీ రెక్కల్ని
కాస్త  బాగా తెరచి ఉంచితే మంచిది
అనుకోకుండా గదిలోకి దూకే వెలుగు
నాలోకి దిగి మనసులో తోడుగా ఉంటుంది.

## 4. ఆర్ద్రత ఎక్కడ?

ఉరి కంబానికి ఎక్కించిన
ఎండిన మనిషి గొంతును తడిపే
ఆర్ద్రత ఎక్కడుంది?
కను రెప్పలు మధ్య ఆగిన
కన్నీటి బిందువు లోనా?
భూమి పొరల్లో జలాల్లోనా?

బావిలోనా? సరసిలోనా? నదిలోనా?
నేల లోతులో నుండీ
దప్పిక తీర్చే
వితరణ హృదయం పోయి
విపణిలో దొరకే బాటిల్ లోనా?

జాలి మాటల అలల్లోనా?
నీటి చుక్క కరువై
తరాల చరిత్రను మరచి
ఊరు వదలి వెళ్ళే
జనం కళ్ళ లోతుల్లోనా?

గుండెలో సెగల్ని ఆర్పే
ఆర్ద్రత ఎక్కడుంది?
మంచుతో తడిసిన రాత్రిలోనా?
ఆగని నీలి మబ్బు నీడలోనా?
మనిషిలో మనిషితోనే
మనసు ఆర్ద్రత పొందేదీ
మనిషి హృదిలో స్నిగ్ధ భావం
విపణి రీతికి దూరమైందీ!

## 5. జీవిత చలనంలో

పొద్దునే గగనం నుండి
నేలకు దిగే వెలుగు రూపంలో
కళ్ళూ ముఖమూ చేతులూ కాళ్ళతో
మనిషి రూపం మెదలు తుంది
అలా చూస్తూ ఉంటే పొద్దెక్కి
చూపుకి తేజం అందగానే
కిరణాల బోను లో నుండి
పైకి దూక బోయే భంగిమలో
ఏ పులో సింహమో కనిపిస్తుంది
ఉగ్రమైన చేతనలో ఆకృతి యై

ఎండ తళ తళలో మిరు మిట్లు గొలిపే
దుర్ నిరీక్ష్య తేజంతో
చూపు కిందికి వాలుతుంది
సందేహం అలాగే ఉండి పోతుంది.

సాయం వేళకు చల్లబడీ
పక్షి ఎగురుతుంది ధైర్యంగా
ఎండ ప్రభావం తగ్గీ
హరిణం బయటికి వస్తుంది.
చిరు మబ్బులతో క్షితిజంలో దృశ్యం
వన్య ప్రాణులు కదలుతున్నట్లు ఉంటుంది.

చండమో హ్లాదమో అందమో ఏదయినా
అన్నీ మనో రూపంలో స్థితి బింబాలే
ఉత్తేజమో ఉత్సాహమో ఉల్లాసమో మరొకటో
సమాజ జీవిత చలనంలో భాగాలే.

## 6. దేనికది

వేళ్ళతో మైత్రి గురించి
చెట్టుకు చెప్పే అవసరం లేదు.
లేంది! చెట్టు ఉనికే భంగ మవుతుంది
ఎవరి అనుమతి తోనూ పని లేదు.
గగనంతో స్నేహం గురించి
పక్షికి చెప్పే అవసరం లేదు
లేంది! ఎగిరే అవకాశం ఎక్కడుంది?
ఎవరి అనుమతి తోనూ పని లేదు.

భూమితో బంధం గురించి
మనిషికి చెప్పే అవసరం లేదు
లేంది! బ్రతుక్కి అవకాశం ఎక్కడిది?
ఎవరి అనుమతి తో పని లేదు

చెట్టు కొమ్మ లన్ని కట్టగట్టి
ఒకటిగా ముందుకు సాగవు
దేని దిశ దానిదే
దేని రూపం దానిదే!

పక్షులన్ని గుంపుగా ఎగిరినా
దేని గూడు దానిదే
దేని జీవిక దానిదే
మనుషులంతా ఒకటే అయినా
ఎవరి మార్గం వారిదే
ఎవరి అస్మిత వారిదే

స్వేచ్ఛలోనూ తన ఇష్టంతో సాగని
జీవిత మెంతో ఉంది.
గోడ లేని హద్దులేని అడ్డులేని
దిశ కయి గగనం కయి భూమి కయి
చెట్టులో పక్షిలో మనిషిలో కోరిక సహజం.

## 7. ఇష్టం

ఈ పని నాది కాదు
అయితే ఏ పని నీది?
ఏ పనీ లేక పోవడమే
మంచి పనిలా ఉంది.

ఈ పని ఇష్టం లేదు
ఏ పని ఇష్టం మరి?
ఏ ఇష్టం లేకపోవడమే
బహు ఇష్టంలా ఉంది.

అనుకున్నదీ ఇష్టపడేదీ
ఏది దొరకుతూంది?
కోరందీ, ఇష్టపడందీ
ఎన్నెన్నో! జీవితంలో
అవసరానికి తప్పనివెన్నో
ఆర్థికం, కాస్త హార్దికం!

ఒత్తిడిలో గొంతు చీల్చుకొని శబ్దం
ఆకాశం వీపు చరుస్తుంది
అవసరం లేంది, గొంతు నుండి శబ్దం
మిన్ను మీద పడినా పెకలదు.

బయటి ముఖం కన్నా
లోపలి హృదయంలో
తనకే తెలీని మరో మనిషి
జీవిత మంతా మనో రూపంతో

గదిలో చీకట్లో బల్బు వెలుగులో
వస్తూ పోయే మనుషుల్లో,
ఇష్టం లేని వాళ్ళు!
కదలే నీడలతో సమానం.
ఇష్టం ఉన్న వాళ్ళు!
నడచే కాంతి బింబాలే!

కాలం నడక అదే ఇప్పటికీ
ఎవరి ఇష్టంతో కాలం మలుపులు తిరగదు
భూమి రూపం అదే! ఎప్పటిదో
ఎవరి ఇష్టంపై సృజన రూపం రాదు.

గుండె నుండి పాత బరువు దించుకొనీ
గుండె పై కొత్త బరువు ఎత్తుకొనీ
నిద్ర నుండి నిద్రకు మధ్య జీవితం
సమాజ చలనంలో స్పందన భాగం!

## 8. శబ్దం

శబ్దం
తలుపు తట్టినట్లు
ఆగంతకుడో? కార్యార్థియో?
మిత్రమో? బంధువో? ఏ మనిషో!
ఉత్సాహంతో తలుపు తెరచి చూస్తే
ఎవరూ బయట కనిపించ లేదు.

శబ్దం
చెళ్ళున కొరడా విసరి నట్లు
పీడించే అహంకార హస్తం అనీ
కోపంతో తలుపు తెరచి చూస్తే
ఎవరూ బయట కనిపించ లేదు.

శబ్దం
భయదంగా సింహం గర్జించినట్లు
నిరంకుశ ప్రకటన రూపం అనీ
అయిష్టంగా తలుపు తెరచి చూస్తే
ఎవరూ బయట కనిపించలేదు.

శబ్దం
ఎండిన ఆకు రాలినట్లు
వసంత శోభ రాబోతూందనీ
ఆత్రంగా కిటికీ తెరచి ఉంచితే
ఏ సూచన బయట పడలేదు.
ఎదురుగా గాలికి కదలే
ఎండిన ఆకుల గల గలలు తప్ప!

క్షణం ఊగింది సందేహంలో
మరో క్షణంలో కాగితంపై
అక్షరాలు! సుశిక్షిత పంక్తుల్లో
గుండె శబ్దం నుండి
విధ్వంస శబ్దం వరకూ
సర్వం సహించే శబ్ద చిత్రాలు
ఒకటొకటీ వరసగా కదలేను.

ఒక్క హృదయ రాగం చాలు
మనిషిని వశం చేసుకోడానికి
ఒక్క ధైర్యం దీపం చాలు
బ్రతుక్కి దారి చూపడానికి.
ఒక్క ఉత్సాహ ఖడ్గం చాలు
ముందుకు నడిపించడానికి.
ఒక్క పుష్పం చాలు! కొమ్మ చివర
మనిషి ప్రాణం! నిలవ డానికి!

ప్రతి శబ్దం సమాజ రూపంతో
మనో నిలయాన్ని
సుందర భావ చిత్ర శాలగా మారుస్తూంది.

## 9. మెలకువకూ నిదురకూ మధ్య

1.

రెక్కలు ఆడిస్తూ
ఎగిరే విహంగాల్లా శబ్దాలు
నా చుట్టూ తిరుగుతూ పోతాయి
ఒక దాని తరువాత మరొకటి చేరి
అన్నీ కలిసి నన్ను ఆవరిస్తాయి.

పనిలో ఎప్పటికో దొరికిన
తీరిక సమయంలో
కాస్త విశ్రాంతి కోరితే
చుట్టూ శబ్ద సమూహం చేరి
నిద్రను దూరంలోనే నిలిపేస్తుంది.
మెలకువ తీరం నుండి
నిద్రా తీరం వరకూ
అన్నిటినీ కప్పేసే శబ్ద ప్రపంచాన్ని
వినక తప్పదు! భరించక తప్పదు!

నిశ్శబ్దాన్ని తృప్తిగా పొందాలంటే
గాఢ నిద్రలోకి వెళ్ళాలిసిందే.
ఎక్కడో చూచిన వ్యథా చిత్రాలూ
ఎప్పుడో విన్న ఆర్త రావాలూ
కలలో ప్రవేశిస్తాయి, కన్నీరు తెప్పిస్తాయి.
కదలుతూన్న జీవిత ప్రవాహం
తీరంలో! అక్కడక్కడా ఆదర్శ స్తూపాలూ.
వెనక మందుతూన్న స్వప్న వనం
తీర భూమి మైదానాల్లో రణ క్షేత్రాలూ!

2.

అలసటలో నిద్ర
అందలాన్ని ఎక్కిస్తుంది
పనిలో మెలకువ
ప్రపంచాన్ని చూపిస్తుంది.
చుట్టూ ఎన్ని వస్తువులున్నా
మనిషి లేంది! అన్నీ వ్యర్థమే!
పై నున్న దేవతల పయి కన్నా
పచ్చని ఆకుల్లా ఆలోచనతో
సరస్సులో పద్మంలా హృదయంతో
క్రింద నున్న మనుషుల పయినే దృష్టి!
ఎక్కడో ఉన్న దేవతకు విన్నపం కన్నా
దారిలో అడిగే మనిషి ప్రశ్నకు
జవాబు చెప్పడం మరీ ఇష్టం!
అక్కడే కదలే మరో మనిషిలో
ఆర్తిని తీర్చడం నా కర్తవ్యం!

అందని ఎత్తులో ఎగిరే
పావురం లా శాంతినీ
చేతి కందుతూ ముళ్ళలో
గులాబిలా ప్రేమనూ
కోరే నాలో జ్ఞాపకాలు!
గిరి శిరస్సు నుండి జారే జలపాతంలా
భయాల్ని దాటీ
సందేహాల్ని వీడీ
సృజన మనో రూపం నాలో!

## 10. మబ్బులూ! మనుషులూ

మనుషులెన్ని విధాలో
మబ్బులన్ని! గగనంలో
దాతలా కురిసేవీ,
లోభిలా కురవనివీ.

నిరంకుశంగా శబ్దిస్తూ భయపెట్టేవీ
మౌనంగా నడుస్తూ ఆకర్షించేవీ
ఒంటరిగా సమూహాలుగా
మానవ సమాజాన్ని తలపిస్తాయి.

మబ్బులు
కొన్ని అలంకారాలుగా రాణిస్తాయి
కొన్ని అర్థవంతంగా విలసిస్తాయి
కొన్ని సాలోచనగా నిష్క్రమిస్తాయి
కొన్ని రస సేచనతో చరిస్తాయి.

చుట్టూ ఎడారి తళతళల్లో
మబ్బు కనిపించడం ఎంత సంతోషం!
కురిసే లోపల గాలి వీచి
ఏ దిశకో తరలి పోవచ్చు.

వర్షం పడాలనే మనసులో కోరిక
ఎపుడు బడితే అపుడు తీరదు
వర్షం మొదలు కాగానే
తడిసిపోయే భయంతో
ఏ పంచకో ఏ కప్పుకిందికో పరుగెత్తేరు

మబ్బును కప్పుకోవాలని చూస్తే
హృదిలో ఆర్ద్రత సిద్ధించదు.
ఉత్సవంలో అలంకారం అవచ్చు
సన్మానంలో శాలువ కావచ్చు.

మనో గగనంలో నీలి మబ్బు
జీవితంలో భాగమై నిలిచీ
సమయానికి ఛాయా దానం చేస్తుంది
మస్తిష్కానికి ఛత్ర రూపం ఇస్తుంది.

హృదిలో రాగ రసాభిషేకంతో
మనిషిని విశ్వమయం చేస్తుంది
ప్రేమతో కరుణతో మనసుకు
సృజన భూమికను ఇస్తుంది.

## 11. రావలసింది

ఎండి పోయిన
పేద బ్రతుకులో
ఒక సమయం పూచి
పచ్చని కళ ఒలికితే
ఎవరి అనుగ్రహమూ కాదు.

మండుతూన్న
పేద బ్రతుకులో
ఒక సమయం కురిసి
చల్లని కళ ఒలికితే
ఎవరి ఆదరమూ కాదు

మొన తేలిన
రాతి బ్రతుకులో
ఒక సమయం పదును తేలి
ఆయుధ గుణం పొందితే
ఎవరి రణ తంత్రమూ కాదు.

చీకటి వదలని
పేద బ్రతుకులో
ఒక సమయం వెలిగి
వివేక శోభ దీపిస్తే
ఎవరి అద్భుతమూ కాదు.
ప్రజా స్వామ్య చేతనలో
సమాజ పరివర్తన సహజం
ఇది రావలసిన రానున్న
నవారంభానికి సంకేతం.

## 12. ఉరి అంటే?

ఉరి వేయడం అంటే
మెడలో నూలు పోగు వేసేంత
సులభమూ కాదు
సంతోషమూ కాదు.

ఆ సమయ ముఖం
నీలి వర్ణంగా మారొచ్చు
ఎరుపు వర్ణంగా మారొచ్చు
తెలుపు వర్ణంగా మాత్రం కాదు.

చేసిన నేరానికి
శిక్ష ఎంత దారుణ మయిందయినా

తగిన సమాధానం మాత్రం కాదు.
ఇది మానవ సంస్కృతీ శిఖరాన్ని వాల్చేస్తుంది
ఇది తెలీని అహంకారానికి అలంకారం అవుతూంది.

నాగరక సమాజం కోరే భవిష్యత్తు
నిర్దయకూ నిరంకుశానికీ మృత్యువుకూ
రహదారి కాకూడదు.

పోయిన ప్రాణం తిరిగి రానట్లే
సమాజ ప్రవాహమూ వెనక్కి నడవదు
నడిపించే యత్నమూ పనికి రాదు
ఏ మలిన కృత్యం అయినా
ఏ తీవ్ర వాదం అయినా
మాంత్రిక దండంతో
యాంత్రిక చర్యలతో
నేర బుద్ధి అంతం కాదు.

## 13. ఏం చెబుతుంది?

తల పయి కిరీటాన్ని ప్రశ్నిస్తే
ఏం చెబుతుంది?
నిరంకుశ మస్తిష్కం గురించి!

మండే అగ్నిని అడిగితే
ఏం చెబుతుంది?
చితిలో భస్మం అయ్యే బ్రతుకు గురించి!

కదలని సర్పంసుహ నడిగితే
ఏం చెబుతుంది?

మట్టిలో కలిసిపోయే మనిషి గురించి!
మెరసే అద్దాన్ని అడిగితే
ఏం చెబుతుంది?
ముఖం వెనక ఉన్న రహస్యం గురించి

పడే నీడను అడిగితే
ఏం చెబుతుంది?
మూల మయిన వస్తువు గురించి.

ప్రతి ప్రశ్నకూ జవాబు
దొరకుతుంది శ్రమపడితే
మనిషి మనో గ్రంథంలో!
లిపి చదవడం రావాలి
అది అర్థమూ కావాలి.

## 14. మనిషికీ మనిషికీ మధ్య

మనిషికీ మనిషికీ మధ్య
కట్టల్ని త్రెంచేసీ
దేశానికీ దేశానికీ మధ్య
గోడల్ని కూల్చేసీ
వెళ్ళే కాలం ఆగని మాట నిజం!
పిడికిలిలో నీళ్ళలా జారి పోతుంది
ప్రవాహ శక్తిని బింబిస్తుంది.
వాడని చైతన్యం, మనోమయం
నిరభిమానంతో నీరు కారుస్తుంది
దురభిమానంతో వంగి పోతుంది
సదభిమానంతో రెప రెపలాడుతుంది.

రోజు ఉనికి
మరో రోజుతో అంతరించదు
రోజు లన్నీ
సమాజ చలనానికి ఆధారాలే!

సమాజ పరివర్తన శక్తికి
కిరీటం నేల పడిపోతూంది.
ప్రశ్నకు జవాబుగా మనోముఖం
హక్కులతో బాధ్యతనూ వదిస్తుంది.

ఏ మనీషి అయినా
ఏ దేశం అయినా
కోరేదీ కావలసిందీ
జన సంస్కృతి హృదయంతో
స్పందమాన సజీవ సమాజం
భౌతిక మానస స్వేచ్ఛా రూపం.

## 15. పెద్ద బహుమానం

అవసరానికి సూర్యుణ్ణి
ఏ రాత్రినో ఎవరూ
బలవంతంగా రప్పించలేదు.

బహుకాలం ఇంట్లో
చీకటిలోనే గడచింది
ఒక్కసారి మంట లెగసి
ఇల్లు భగ్గున మండింది.
పక్కవాళ్ళు దూరం వాళ్ళు
"ఎంత వెలుగు! ఎంత వెలుగు!" అనీ

ఆశ్చర్యంతో కలిసీ వేరుగానూ
అదృష్టాన్ని అంచనా వేసేరు.

ద్వేషం ఎక్కడ బడితే అక్కడ అణువణువున
ప్రేమ మాత్రం ఫ్రేమ్‌లో బిగింపబడీ గోడపై
జల బిందువు కయి తపిస్తూ
దిశల వైపు చూచే కళ్ళలో
జారే కన్నీటి బిందువు
ప్రాణానికి అందని అలలా ఉంది!
ఇక మంటల్ని ఆర్పేందుకు ఎక్కడిది?

చుట్టూ సమాజం ఉన్మత్తంగా
చూచే వాళ్ళనీ ఉన్మాదుల్ని చేస్తూంది
కళ్ళ ముందు ఎండలో ఆకాశం
దూది పింజల్లా ముక్కలై తేలి పోతూంది
భూమి పయి ఉన్న వాళ్ళకే పట్టకపోతే
ఆకాశం పయి ఉన్న వాళ్ళకేం అవసరం?

వచ్చే రోజు పయి ఆశ లేకపోతే
ఏ మంటలకో ఆహుతి అయిపోయేది శరీరం
ఆ మంటల నుండి ఈ రోజు
మిగలడమూ ఒక అదృష్టమే.
మరో రోజు వదలుతుందో? లేదో?

గడచిన రోజుల్లో నుండి
"నీవు! ఏమి పొందావు?" అంటే
"ఇప్పటి దాకా బ్రతికి ఉండడమే
పొందిన పెద్ద బహుమానం."

## 16. పరివర్తన వాస్తవమై

శిలా పూర్వ యుగం నుండీ
క్షిపణి యాన తరం దాకా
సృజన మనో నిలయంలో
జీవన చలన సూత్రం ఒకటే!

మనిషి తెలివి మొగ్గ వేసి
పరిమళ పరిణత దశలో
గగనం కొలిచే దయినా
దిశలను చుట్టే దయినా
చింతనలో ప్రశ్నలవే!
ప్రశ్న నుండి మరో ప్రశ్న!

ఎవరు నేను? ఎవరు నీవు?
ఎందుకు? ఎక్కడికీ?
ఇహ పరాల దారులలో
సమాధాన గవేషణం!

ముల్లు దిగీ! కత్తి దూసీ
పొగలు చిమ్మీ! బాంబు ప్రేలీ
సమాజ శక్తుల చలనం
జల నిధి లో కెరటాల్లా

దోపిడిలో రాపిడిలో
ఉగ్రతలో భగ్నతలో
దొరకని నిజ రూపం కయి
యత్నం! ఆలోచన! మనిషిలో!

## 17. పరివర్తన అనుభవమై

రోదసిలో గ్రహాలు పయి
యానంలో సాహసికి
చివరి అడుగు ఎక్కడనీ!

శిఖరం చేరే కృషిలో
ఆరోహణలో అడుగుకు
చివరి మెట్టు ఎక్కడనీ!

ఇసుక సమూహాల నుండి
జల కణ జాలం కోసం
దూర దూరం పోయే బ్రతుక్కి
వికాస దశ ఎక్కడనీ!

జల ధుని పరుగిడుతుంది
నిలిచే కోరిక వదలీ
ఎద ఎదను స్పృశిస్తూ పవనం
నిలుపుతూంది ప్రాణ సూత్రం

ధామం చర్చి మసీద్ స్తూపం
తమ ఎత్తులతో కప్పేసీ మనిషిని
ఆ వెనకనున్న వాస్తవ జీవితం
సీలు పడిన గ్రంథంఅవుతూంది.

కప్పబడిన వస్తువు కయి
సీలు పడిన విషయం కయి
అన్వేషణలో, సమాలోచనలో
ఇప్పటికీ దొరకని “నిజం”
నిజం బయట పడుకుండా!
ఎన్ని పొరలో! ఎన్ని తెరలో! ఎన్ని గోడలో!

## 18. కాలం కవితయై

కాలం ఎక్కడో ఆగినట్లు అనిపిస్తుంది
క్షణాల అడుగులు మందగించి నట్లుంది
అడుగుల శబ్దం వినిపించడం లేదు

ఇసుక మేట వేసీ
రాళ్ళు బయట పడీ
దారికి అడ్డంగా పడి ఉండీ
ప్రవాహం ఆగి నట్లు అనిపిస్తూంది.

మబ్బు కమ్మి సూర్యుడు కనిపించకపోవచ్చు
రాత్రివేళ ఆశలు సన్న బడిపోవచ్చు
వసుధ పయి కోరిక ఎప్పటికీ ఒకే విధం
జీవితంపై అభిరుచి ఉన్నంత వరకూ

మెలకువలో కాలం ఆగడం ఏమిటి?
నిద్ర నన్ను వదలి
ఘనారణ్యంలోకి వెళ్ళిపోయింది
అప్పటి దాకా జలపాతంలా జారే కల
కాస్త మెలకువతో మనసును వదలి
హిమ శిఖరాలకు వెళ్ళిపోయింది.

శ్వాస అలలా సాగుతూనే ఉంది
ఉత్సాహం కిఱణంలా సరిస్తూనే ఉంది
ఆలోచన తీగెలా కదలుతూనే ఉంది
ఇంకేం కావాలి? అంటే! ఏం చెప్పను.

పక్కన నిలిపిన సితార్‌లా నిశ్శబ్దం,
మీటేందుకు తంత్రుల్ని

చేతి వేళ్ళు తాకడమే!
ఆలస్యం! అన్నట్లుంది.

పెదవుల పయి
చిరు నవ్వులో దిగిన ఊహ
శబ్ద శక్తిని అందుకొనే
ప్రయత్నంలో ఉంది
టేక్ ఆఫ్‌కు సిద్ధమయ్యే విమానంలా

ఫాల తలం పయి సన్నని వెలుగు
చరణాల పయి ఒలికి పడుతూంది
శిరసు నుండి పాదాల దాకా
ప్రవహించే కాల రూపం
చిందే నురగలతో
గలగల దూకుతూ
తెల్లని కాగితంపయి
కవిత్వమయి కదలుతూంది.
లో మనిషి ఆయతంతో సృజన తలం
అస్మితతో విశ్వగంధ అవుతూంది.

ఈ సమయం మనోరూపం!
కాలానికీ కవితకూ
అభేదాన్ని పొందుతూంది

కాస్త ఆలస్యం అందల మవుతూంది
కాలం ఆగడ మనేది లేదు
కవిత్వం ఏలా ఆగిపోతుంది? నాలో
కాలానికి సజీవ రూపం కవిత్వం అయితే!

స్వేచ్ఛా కవిత్వం

**రెండవ భాగం - 13**

# గిఫ్ట్ ప్యాకెట్

మాదిరాజు రంగారావు

**2008**

రసధుని సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 500 028

ప్రవేశిక

# ప్రెజెంటేషన్

మానవ హక్కులు (Human rights) మాట ఇటీవలి కాలంలో బాగా వ్యాప్తిలోకి వచ్చింది. ఇది సువిశాల మయిన ప్రాతి పదిక పై సమాజంలో స్వేచ్ఛ సమ న్యాయం గురించి చింతననూ కార్యాచరణనూ కలిగింది. సాధారణ దృష్టికి రానివీ దృష్టి నుండి తప్పినవీ దారి తప్పినవీ దారి మళ్ళింప బడినవీ వేరుగా అపార్థానికీ అనర్థానికీ గురి అయినవీ మొదలుగా ఎన్నో! వీటిని సరి అయిన అవగాహనతో క్రమ మార్గంలో పెట్టడంతో పాటు సమస్యకు సరి అయిన పరిష్కారాన్ని సూచించడమూ దీని ఉద్దేశం. ప్రపంచంలో ప్రజాస్వామ్య వ్యవస్థను అన్వర్థం చేసేదిగానూ పరిపుష్టం చేసేది గానూ ఒక విశేషమయిన ఉపకరణంగా వ్యవస్థీ కృతమయింది. మానవ బలహీనతలతో సహజ మయినవీ సమాజంలో విపరీత ధోరణుల వల్ల పరిణమించినవీ, పాలనలో అనేక కారణాల వల్ల చోటు చేసుకునేవీ ఆయా లోపాల్ని సవరించి సూచనలతో మంచి ప్రయోజనాల్ని సాధించే దిశగా నిర్దిష్టమయింది.

ఐక్య రాజ్య సమితి (UNO) ఆర్టికల్ (1) ప్రకారం మానవ హక్కుల ప్రోత్సాహానికీ దాని పరివ్యాప్తికీ కృషి మొదలయింది. అంతర్జాతీయ తలంపై వివిధ ప్రభుత్వాల ప్రోత్సాహంతో సహకారంతో కార్య రూపాన్ని ధరించింది. జాతి మతం వర్గం కులం ప్రాంతం భాష జెండర్ వివక్ష లేని ప్రాథమిక (fundamental) స్వేచ్ఛ ప్రధానంగా ఉన్న మానవీయ భావన (concept) ఆధారంగా తన పాత్రను నిర్వహిస్తూంది. దీనికీ కొన్ని పరిమితులున్న మాట వాస్తవం. ఆ పరిమితుల్లోనే ప్రయోజనం ఉద్దిష్టమయింది. సమాజంలో ఎప్పటి నుండో పరంపరగా వస్తూన్న అణచివేత అంటరాని తనం అవమానంతో పాటు పీడనం అక్రమం అమానుషం అవినీతి హింస అశాంతి మొదలయిన విపరీత స్థితుల్ని సామాజిక రాజకీయ వైయక్తిక స్థాయిల్లో సహేతుకమైన పరిశీలనంతో వివేకవంతమయిన న్యాయం చేయడం జరుగుతుంది. అందరికీ సమానమయిన స్వేచ్ఛనూ న్యాయాన్నీ అవకాశాల్నీ జీవన దశనూ కల్పించే దిశగా

కాపాడే రీతిగా వ్యవహరిస్తుంది. ఈ వ్యవస్థ నెలకొనడానికి పూర్వం అక్కడక్కడా స్థూలంగా మౌలిక మయిన అంశాల్ని గురించి చింతన జరిగి ఉండవచ్చు. కాని ప్రస్తుత సందర్భంలో ఒక విశేషమయిన విషయంగా ప్రత్యేకమయిన విభాగానికి అర్హత కలిగిందిగా పరియోజితమయింది. కార్యశీలతనూ పొందింది. ఇదొక శాశ్వతమయిన విధి (Obligation) రూపంగానూ ప్రసక్తమయింది.

ఐక్యరాజ్య సమితి (UNO) జనరల్ అసెంబ్లీ 1948 డిసెంబరు 10వ తేదీన మానవ హక్కుల డిక్లరేషన్‌ను ఆమోదించింది. చరిత్రలో మొదటి సారి మానవ హక్కుల పరిరక్షణకు ఒక ప్రణాళిక సిద్ధం చేయబడింది. దీనికి బాధ్యతాయుత మయిన సభ్య సమాజం ఆమోదమూ లభించింది. వివిధ దేశాల్లో ప్రభుత్వాలు ఆమోదాన్ని తెలిపాయి. క్రియాచరణనూ ప్రదర్శించాయి. ఈ క్రమంలో 1950 డిసెంబరు 10వ తేదీన ప్రతి సంవత్సరమూ ఆ రోజున మానవ హక్కుల రోజు "Human rights day" గా జనరల్ అసెంబ్లీ ఆమోదించింది. ఈ పరియోజనం కాల క్రమంలో 1) ఆర్థిక సామాజిక సాంస్కృతిక మయిన హక్కులూ (1976 జనవరి 3 నుండి) 2) పౌర (Civil) మరియు రాజకీయమయిన హక్కులూ (1976 మార్చి 23 నుండి) ఇంకా స్త్రీల హక్కులూ (1952లో), స్త్రీల హక్కుల సంవత్సరంగా 1975లోనూ స్త్రీల హక్కుల దశాబ్ది 1970-85గానూ పిల్లలపై శ్రద్ధకయి అంతర్జాతీయ బాలల సంవత్సరం 1979గానూ జనరల్ ఎసెంబ్లీ ఆమోదించింది.

మానవ హక్కుల కమిషన్ ఒక వ్యవస్థగా రూపొందింది. వివక్షతకూ అత్యాచారాలనూ, అవమానాలకూ, బానిసత్వానికీ, నిరాశ్రయానికీ వ్యతిరేకంగా వీటిని నిర్మూలించే పద్ధతిలో పని చేయడం మొదలయింది. అయితే మానవ హక్కుల కమిషన్ కార్యనిర్వహణంలో ఆచరణంలో కొన్ని పరిమితుల్ని కలిగింది. కాబట్టి సర్వ శక్తిమంతంగా పని చేయడం కుదరని మాట వాస్తవం. ఏ మయినా ప్రజా వ్యవస్థను బలపరచేదిగా సమాజంలో సుస్థితికి దోహదం చేసేదిగా నిలబడింది.

ఈ కృతి 'గిఫ్ట్ ప్యాకెట్' లో మానవ హక్కులు వస్తువుగా ఉంది. దీని కేంద్రంగా భావ జగత్తు నిర్మితమయింది. దీని స్వరూపం ఉద్దేశం అవసరం ప్రభావం పరిధి మొదలుగా విషయాంశాలు ఇందులో కవితాత్మకంగా దృష్టికి వస్తాయి.

ఐక్య రాజ్య సమితి రెండో ప్రపంచ యుద్ధానంతరం నిఖిల మానవాళికి ఇచ్చిన ఉపద (gift) గా మానవ హక్కులు గౌరవాన్ని పొందాయి. ఈ కృతిలో సామాజికంగా దీని అంత స్స్వరూపాన్నీ ప్రకాశమాన స్థితుల్నీ పరిమితుల్నీ చిత్రించడం జరిగింది. వీటితోపాటు కొన్ని సందర్భాల్లో సరిగా పని చేయలేని స్థితినీ అనాసక్తమయిన ధోరణినీ గుర్తించడమూ కనిపిస్తుంది. వివిధ సంఘటనల వెనక నున్న మౌలికమయిన స్పందనం వివేచనంతో కూడిన భావ ప్రసారం దృష్టికి వస్తుంది. ఇదొక పద్ధతి. ఒక స్థాయిలో కవితాత్మకు ఉపకరించే విధంగా అభివ్యక్తిలో భావ చిత్రం (Image) ప్రతీక (Symbol) ప్రతీయమానం / వ్యంజనం (Suggestion) తో సృజన రూపం ప్రవృత్తమయింది. కొత్త వస్తువుతో ఆవిష్కారమయిన ఈ కృతి స్వేచ్ఛా కవిత్వంలో వైవిధ్యంలో కూడిన విస్తృతికి అవకాశం కల్పిస్తూంది.

*"ఏ కవిత్వమయినా*
*ఒకరి ఊహకు కట్టుబడి కొన సాగదు*
*కవిత్వం ఎప్పుడు ఏ రూపంలో వస్తుందో*
*ఎవ్వరూ ముందుగా చెప్పలేరు"*

*– శ్రీశ్రీ*

*16-2-1983 (ఒక ఇంటర్వ్యూలో)*

**– మాదిరాజు రంగారావు**

**అంకితం**

మహాకవి

**శ్రీశ్రీ**కి

స్వేచ్ఛా కవిత్వం

# గిఫ్ట్ ప్యాకెట్

❀ **1.**

నాలో సృజన ప్రపంచం
అక్షర స్పందనలో సమాజ చైతన్యం
మానవ హక్కుల కిరణమయం
విశ్వ హృదయ సంకేతం.

పొద్దు పొడిచే సమయానికి
రవి కిరణాలకు సమాంతరంగా
జీవిత వాస్తవాల వార్తా ముఖంతో
పత్రిక రేడియో టెలివిజన్ జగత్తు.

జాతి మతం భాష కులం
జెండర్ వర్ణం భేద భావ కలనంతో
శ్రేణులుగా సీమలుగా ఏర్పడిన సమాజంలో
ఎవరి దారి వారికి వదల్లేని ఇష్టం
ఎవరి ముఖం వారికి అద్దంలో బహు ప్రియం
దారులలో మానవ ముఖాలతో దృశ్యాలెన్నో!

గాయంతో దెబ్బలతో బాధలతో
వంగిన క్రుంగిన శిఖర పంక్తులు
మానవ హక్కుల స్పృహలో ఒకటొకటీ
పూల పాగాతో తలలెత్తేను.

వేటలో గాయంతో
పై కెగిరిన పక్షి
హక్కుల గోడ పయి
వాలుతూంది నిర్భయంగా
అడవిలో గురి తప్పి
పరుగెత్తిన జంతువు
హక్కుల మైదానంలో
చరిస్తుంది ధైర్యంగా.

శుష్క వచన సమాజంలో
శూన్యమయిన జీవిత రూపం
హక్కుల నది తీరంలో
చేతన హృది వికసిస్తుంది.

అడవి దారిన నడచి వచ్చే కాళ్ళకు
అడవి గురించి తెలియని దేముంది?
అడవిలో పాత బాట మూత బడీ
అడవి నుండి కొత్త బాట ఏర్పడుతూంది.

అసహనం అశాంతి అమానుషంతో
వైరం ద్వేషం ఘర్షణ హింసలో
సమ భావం సమవర్తన సమ న్యాయంకై
సంధించిన మానవ హక్కుల ప్రశ్నలు
ఇంత వరకూ అందని ఫాలతలాల్ని స్పృశించేను
ఇంత కాలం మాట లేని ముఖాల్ని మాట్లాడించేను

హక్కుల భావనలో సమాజ నవ దృశ్యం
మానవ జీవన పరివర్తన కొక సిగ్నల్!

❀ 

## 2.

కత్తుల మధ్య
ఎత్తుల మధ్య
చిక్కిన జీవిత సందర్భాన్ని
విడిపించే చేతులూ అవసరం.

మనిషి చేసే స్వార్థ నృత్యం
కళ్ళు చూచే ఘోర దృశ్యం
ఏ జంతువో మృగమో చూస్తే
చలన రహిత రూపాలవుతాయి.

మర్యాదా సమాజ పరి కల్పనలో
ఆరోహణలో కార్యాచరణం కై
మానవ హక్కుల ప్రకాశ పర్వం
వ్యక్తి మనో జగత్తులో
నీరు లేని మొక్క రాని తలం పయి
పచ్చని దృశ్యానికి ప్రేరణ నిస్తూంది.

చిన్ని కొమ్మ పయి ముల్లు చివర
నిలిచిన మంచు బిందువులా
బాధలో జారుతూ ఆగిన అశ్రుకణం
అశ్రు కణంలో కవోష్ణ కాంతి!
గుండె నుండి విద్యుదనల స్పర్శతో
నిరాశలో ఆశకు నీరాజన మిస్తూంది.

ఎప్పటి నుండో
దమన హనన పరాభవాలతో
అణగిన జీవన చేతన

మానవ హక్కుల హస్తాల్ని
అందుకొనీ పైకి లేస్తూంది!

సామాజిక చింతనలో
కరుణ మమత ఆర్ద్రతతో
వికసించిన బాధ్యతలో
సేవా పరిమళ హృదితో
నిశ్శబ్ద రణాభియానంలో
శాంతికి ఉపకరణంతో
ప్రాభాత కాంతి సన్నాహం!
బడుగు పేద బ్రతుకులో
మానవ హక్కులకై సంవేదన!

## ❀ 3.

మానవ హక్కుల విశాలావరణం
పౌర సహజ రక్షణ కవచం
అప కృతి చర్యల్నీ
ప్రతీకార రీతుల్నీ
పాలనా ప్రతికృతినీ
ప్రశ్నించే ప్రజాస్వామ్య సాధనం!

కిరణ్మయ మస్తిష్కంలో
తరాల వెలుగు గుర్తులతో
హిరణ్మయ అస్తిత్వంలో
యుగాల అనల పరీక్షతో
వరాలకూ దయకూ జాలికీ దూరంగా
రావలసిన హక్కుల్ని కోరడం సహజం.

సీమలతో దేశం
గోడలతో గృహం
ఊహలతో మనస్సు
హక్కులతో జీవితం!

పేరు ఊరు ముఖం తోనే
మనిషి మనిషిని గుర్తించేదీ
వ్యక్తి ఉనికి వీటితోనే
లోపల మరోమూర్తి విశ్వ భావనతో.

విశ్వ సభ్య సమాజ సరసిలో
ప్రభవించిన మానవతా పద్మం
రెక్కల్ని త్రుంచే యత్నం అమానుషం
సుందరతను కాపాడడం నాగరకం
ఈ విశాల సమాజ వేదిక
మానవ శక్తిని విశ్వమయం చేస్తుంది.

విభేదాల సీమల్ని దాటిస్తూ
నిరంకుశ రీతులపై హస్త క్షేపంతో
సమాజ చలనానికీ సమగతి నిస్తుంది.

సమాజ చేతనతో జీవితం
జీవిత చలనంతో చరిత్ర
నాలో సృజన ప్రపంచం
అక్షయ నవ మానవ రూపం.

## ❀ 4.

మంచు పాగా చుట్టు కొనీ
పూల శాలువ కప్పుకొనీ

ఉన్న సమయం హఠాత్తుగా!
మెరసే అనల కిరీటం వహించీ
కదలే ధూమ వస్త్రం ధరించీ
విషాద ముద్రతో ఎదురవుతుంది
చండమయి భయదమయి ఎదురుగా
ప్రాణ హరణ క్షణాలతో
ఏ ఎన్ కౌంటర్ సంధ్యగానో
ఏ ఉగ్ర తపన చర్య గానో.

మనిషి హక్కును మంట గలిపీ
ఇనుప హస్తం తెరచి చాచీ
బలహీనుల్ని అసమ్మతుల్నీ
వీధి ముఖం పట్టిస్తుంది!
ఏ మిషతోనో!
ఏ రుషతోనో!

శిల్పాలు తయారు చేయబడతాయి
చిత్రాలు రంగులలో సిద్ధమవుతాయి
మనుషులు! తయారు చేయబడరు
బ్రతుకులు సిద్ధం చేయబడవు.

మనిషిలో అస్మిత చిట్ట చివరి దాకా
మార్పులతో చేర్పులతో జీవన రేఖల్లో
ఆలోచన! అన్వేషణ! మిగిలే ఉంటాయి
సౌభాగ్యం! ఆనందంకై! సంవేదంతో
తెరచిన విశ్వ గవాక్షం నుండి
మానవ హక్కుల కిరణ ముఖం
స్వాగతం పలుకుతుంది! మనిషి మనిషికీ
దారి చూపుతుంది పద పదానికీ.

## ❀ 5.

బుద్ధుని కళ్ళలో కరుణతో
సూర్యుని కిరణంలో వివేకంతో
మరో పాత్ర కదలుతుంది రాగంతో
మానవ హక్కుల ప్రశ్నా దీపమై.

చేసిన నేరానికి ప్రాణం తీసే నీతి
ఒకరికి తన విధి నిర్వహణం కావచ్చు
ఒకరికి ఖేదమో మోదమో ప్రతీకారమో కావచ్చు.

మరణ శిక్ష నేరస్థుని తొలగిస్తుంది
కాని అ నేర గుణం మాసి పోదు
ఆ నేర స్థితిని మార్చలేదు.

ఎప్పటిదో మానవతా మధు స్వరం
ప్రతి ఉదార చరితలో స్వనిస్తుంది

కఠిన శుష్క శిలా తలాల నుండి
క్రిందికి దిగుతూ సరిస్తుంధి నేలపై

ఎడారి ఇసుక బాహువుల మధ్య
నీటిపాయ! దాహంలో అమూల్యమై
గోడకు వేలాడే పాత చిత్ర పటంలా
ప్రతి మనసులో జల దృశ్యం భద్రంగా

ఆకురాలే చెట్టులా
శాఖా ప్రశాఖలుగా
రస స్పర్శ కయి! చూస్తుంది జీవితం
మానవ హక్కుల సందర్భంలో మరీ!
ఏ బదులూ ఉపకృతినీ కోరని

దీన బంధు రక్షణ హస్తం!
మానవ హక్కుల రూపం
మదిలో నిర్మాణ కళకు చిహ్నం.

## ❀ 6.

ముఖాని కొక కొత్త దృశ్యంతో
నిజాని కొక కొత్త రూపంతో
మానవ హక్కులతో పరిచయం
మానవీయ ప్రకాశాన్ని చూపుతుంది.

గమ్యం చేరాలిసిన ఆశయం పయి
వాగ్దానం దుస్స్వప్నంగా మారితే
అస్తిత్వం జడ భరిత మవుతుంది.
జీవితంలో మృగ తృష్ణలు తప్పవు.

జల బిందువు కయి చాచిన దోసిలిలో
ఏ మేఘం నుండో పిడుగు జారవచ్చు
ఎపుడో పిడుగు పడే భయంతో
అప్పటి పిపాస పోస్ట్‌పోన్ అవదు.

మంచులా బిగిసిన ఆలోచనలో
ప్రవాహకత తెచ్చే ఉత్సాహం
మూసిన భవిష్యత్తు తలుపులు తెలుస్తుంది
మనో రూపం విశ్వ భూమి అవుతుంది.

సంకుచితంలో సృజన వికసించదు
బంధనలో ఆంక్షలలో దాస్యంలో
ఆక్రోశం ఆర్తి నినాద పంక్తులు
స్వార్థ కవాటాల్ని బద్దలు చేస్తాయి.

కర్తవ్యానికి చలన దిశను చూపుతాయి
మానవ హక్కులకు పదును పెడతాయి
సమాజంలో రావలసిన సుస్వరతకు
వ్యక్తిలో కావలసిన చేతనలో బాధ్యతకు
మౌనం ఒకటయినా మనిషి మనిషిలో
ఊహ వేరు, మాట వేరు, జీవన గుణం వేరు.

వేరు వేరు రంగుల్లో
అందమయిన సమాజ చిత్రం
కళలో నైపుణితో
విశ్వ కిరణ రేఖలతో సాధ్యం.

## 7.

అస్మితలో మానవ హక్కు
చెరగని మాయని కిరణం
నిర్మలంగా నిరాటంకంగా నిర్విరోధంగా
సమాజానికి అవసరం దీని ప్రసారం!

దూరం నుండి చూచి సంతోషంతో
వెనక్కి మరలే వినోద దృశ్యం కాదు!
అనుభవంలో కలిసి పోయి ఒకటై
సహజ బంధుత నిలుపుతుంది మనిషిలో.

ఇంద్ర ధనుసు రెక్కలతో
ఆలోచన విప్పారుతుంధి
పయనంలో శృంఖలాలు త్రెంచి
అశ్వంలా పరుగెత్తిస్తుంది.

క్షామంలో ఉదార జలదం వలె
బ్రతుకు చెక్కను మొలిపిస్తుంది
మానవతా మధువును వర్షిస్తూ
మనిషికి అమృత శిఖరం చూపిస్తుంది.

విపణిలో  తిరిగీ
వెలుగులో నడిచీ
నిలయం చేరే వేళలో
నిర్భయ వాతావరణం బదులు
గుండెపై అగ్ని దృశ్యం దిగొచ్చు
ఇది తలపై జల సేచనతో ఆరదు.

❀ **8.**

భూమి ఎప్పటికీ ప్రియాతి ప్రియం
నీరు దొరికినా దొరక్క పోయినా
పంట పండినా పండక పోయిన
బ్రతుకులో శాశ్వత గుణ బంధంతో

మనిషి ఎప్పటికీ అమూల్య శిల్పమే
ఏమి తెలిసినా
ఏమి తెలియక పోయినా
ఏ దారిన నడచినా
ఏ రీతిన బ్రతికినా
బ్రతికే చిర హక్కుతో
సమాజ సంపదలో భాగం!

మానవ హక్కుల సందర్భంలో ప్రశ్నకు
అనుభవ జగత్తులో జవాబు

చెట్టు నుండి పూవులా దొరకదు
అగ్ని కణంలా ఎగిరి పడొచ్చు
పదును కత్తిలా నడచి రావచ్చు
ఎదుర్కొనే దృష్టిలో బాధ్యత మనిషిదే!

లోపలి అగ్ని కణంపై
బూదిని ఊదేస్తే సరిపోదు
అభిలాషకు ప్రేరణగా
ఆరని జ్వాలాకృతి అవసరం!

పై కెత్తిన చేతుల్ని దించి
గుండెపై నిలిపి ధైర్య మిస్తుంది
అర్జునుడులా నిలిచే కోరిక ఉన్నా
మధ్యలో శ్రీ కృష్ణ పాత్ర ఆవహిస్తుంది!

❀ **9.**

బోధి తరువు
వ్యక్తి నుండి సమాజానికి ప్రతిరూపం
వ్యక్తిలో వివేక భావానికి చిహ్నం

స్వేచ్ఛా సంకల్పంతో బయలు దేరి
అనుభవ కాంతిలో అన్వేషణతో
మానవతా పూర్ణమయిన
బుద్ధుని గుణ యశో రూపం
కరుణ మమత సమతతో
జ్ఞాన హేతు త్యాగంతో
చేతనలో మానవ హక్కుల
మూల మనో రూపాన్ని తలపిస్తుంది.

చెట్టు నుండి కోరేదీ
పూలూ కాయలూ పండ్లూ
మనిషి నుండి కోరేదీ
ప్రేమ శాంతి త్యాగం.

చెట్ల ముసుగులో నిలిచిన
మనుషులూ! ఆయుధాలతో
అడవి హృదయ రూపానికి
అగ్ని ముఖం తొడిగేరు

చేతి వేళ్ళు పదును బాకులయి
తెరచిన కళ్ళు ముళ్ళ పొదలుగా
అడవిలో యంత్ర మూర్తులు! గిరులపై
దారి తప్పే ప్రజాస్వామ్య చిహ్నాలు
మానవ హక్కుల యశస్సుకు పరీక్షగా.

## ❀ 10.

చేతికి తగని పనిలో
విసరే రాళ్ళకు
ఆదర్శం ముక్కలయి
సహనం ఎడారి దారి పడుతూంది
శాంతి అడవి ముఖం పడుతూంది.

పెద్ద పులి చర్మం కప్పుకొనీ
అడవిలో కదలే మనుషులు
సమస్యల ప్రశ్నల తూణీరంతో
విలయ శక్తిని అనువదిస్తూ రికార్డులా

బిగించిన ఆదర్శం తీగెలపై
రణ రాగం మ్రోగిస్తూ
ఏ సాహస కృత్యం తోనూ
ఏ భీకర దృశ్యంతోనూ
ఎక్కు పెట్టిన ఆయుధమై!
ఎప్పటికీ! జీవితం నిలవదు!

గుండెలో వేదనతో నలిగీ
కదలీ కదలని అడుగులతో
పరిష్కారం మిగిలీ! సమస్యలు!
మానవ హక్కులకు వ్రేలాడుతూ!

❀ **11.**

నాలో సృజన ప్రపంచం
మానవ హక్కుల కిరణ రూపం

దీర్ఘ నిశా కరవాలాన్ని
ఎత్తిన తల 'పయి నుండి తొలగిస్తుంది.

మెడపై నిలిపిన బాకు తీసి
ప్రాణ వల్లిని పెంచుతుంది

గుండె పై నిప్పుల కుంపటిని
జల సేచనతో మొలకెత్తిస్తుంది

కూల్చే చేతులకూ
ప్రేల్చే ఊహలకూ
నిర్మాణ కీర్తి నిస్తుంది

ముళ్ళు నాటే చేతి వ్రేళ్ళకు
పూల మొక్కల్ని అందిస్తుంది

మట్టి ముఖంలో
మొలిచిన మెలకువతో
ఊరు చివర మూల మూలల నడచే
అస్థి పంజరంలో సజీవ నృత్యంతో
పునర్జీవ శక్తి చిహ్నమవుతూంది.

ధరణి పయి నడచే దారి కడ్డంగా
పురోగతిలో సంకుచిత రూపాలు!
మంచులా గడ్డ కట్టిన సందర్భంలో
మంజీర ధ్వనుల్ని ఒలికిస్తుంది
సితార్ ధ్వనుల్ని సరింపజేస్తుంది
అదృష్టాన్ని దృష్టం చేస్తూ
కొత్త అధ్యాయం మొదలవుతుంది.

❀ **12.**

ముందున్న అద్దంలో  తన వెనకనే
అంటుకొనీ కదలే మృగం నీడ చూచి
అద్దాన్ని పగుల గొట్టీ
ఒక ముక్కలో తన ముఖం చూచీ
ఆ మృగమే నయ మనిపిస్తూంది.

అద్దంలో తన వెనకనే
మృగం నీడ తొలగే దాకా
ప్రయత్నం వెంట ప్రయత్నం!
హింస కయినా సిద్ధం! తనలో

హంతకుడెవరు? అన్న
ప్రశ్నకు వెంటనే జవాబు కయి

రూపానికి వెనక నున్న
నీడల్లో వెదకేరు టార్చ్‌లైట్‌తో

సమాజ శరీరంలో జీవ కణాలు
పరాయివయి పోతున్నాయనీ!
పరాయి మనో రూపంతో బ్రతికే
తమ బ్రతుకులు విస్మరించేరు.

రోగాన్ని నయం చేయాలిసిన డాక్టరు
'మరణం' ప్రిస్క్రిప్షన్ దయ చేసేను.

రైలు నడిస్తేనే గమ్యం చేరేది
ఏ స్టేషన్‌లోనో మధ్యలో నిలిచి పోయి
రైలు పెట్టెలో నడిస్తే
కాల క్షేపం అవుతుంది
కాని గమ్యం చేర్చదు
రైలును నడిపించడమే! తక్షణ కర్తవ్యం!

❀ **13.**

ఓటమి ఎప్పటిదో
తరాలుగా ఇంతవరకూ
ఎరగని గెలుపు అంచుల్లో
భ్రమించే నిశ్రీకులు బాధితులు.

కదలే కాల చక్రం ముందు
అగ్ని గుండం ఎదురు కావచ్చు
ఎదురుగా వెలుగు దండ అదృశ్యమయి
కాళ్ళకు కనిపించని సంకెల పడవచ్చు.

ఏదో ఒక వర్ణం ప్రతీకగా
ఆకాశం! సూర్యుడు! చంద్రుడూ
చెట్టు! నది! నక్షత్రం! చీకటి
నీలం! ఎరువు! తెలుపు!
పచ్చన! తెల్లన! నల్లన! భావనలో
అన్ని వర్ణాలూ కలిసిన మనిషిలో
ఏ ప్రతీకకూ అందని రూపం!
మానవ హక్కుల కవకాశమిస్తూంధి
కొత్త దృష్టి అవసరమవుతుంది.
మానవ హక్కులు
ప్రశ్నల్లో పుడతాయి.
జవాబుల్లో జీవిస్తాయి.
ఎప్పటికీ కొత్తగా!
ఎన్నటికీ పాతబడవు.
ఏ దేశంలోనూ, ఏకాలంలోనూ
మనిషి ఉన్నంత వరకూ సమాజంలో
బాధలో వ్యథలో న్యాయానికి అభయమై
ఉపశమనం తృప్తీ ఆదరణంతో

భయం లేని స్వేచ్ఛా రూపానికి
హక్కులతో! మనిషి మనిషికో చరిత్ర!
అన్నిటికీ ఒకటే విశ్వ లిపి!
హృదయానికి కనిపించేదీ, వినిపించేదీ
వివేకానికి తెలిసేదీ! నిలిచేదీ!

❀ **14.**

ఆకలి ఎంత పని అయినా చేయిస్తుంది
మూసిన తలుపుల్ని బద్దలు కొట్టిస్తుంది
అడ్డు ఉన్న గోడల్ని కూల్చి వేయిస్తుంది
ఆయుధాన్ని అగ్ని పీఠంపై నిలుపుతుంది.

దరిద్రం ఏమయినా చేయిస్తుంది
బిక్షువుగా మారుస్తుంది
భక్తునిగా తీరుస్తుంది
విద్రోహిగా బయట పెడుతుంది
దొంగ ముద్ర పడ జేస్తుంది
మృత్యు కిరీటాన్ని అలంకరిస్తుంది.

ఆత్మ హత్యతో
మరణ శాసనం వేసుకొనీ
మృత్యు పీఠం అధిష్ఠించే
మనిషిలో సహజమయిన
విజయ మూర్తికి పరీక్ష పెడుతుంది!

నిరాధార సమూహాలకు
ఆహారం ఆశ్రయం పరియోజన
మానవ హక్కులలో భాగం
నాగరక ప్రభుత్వాల బాధ్యత!

అమృతం ఎవరికి అందుతూంది
సుఖమూ సంపద ఉన్న వారికే
చావు బ్రతుకలో ఉన్న వారికీ లేదు
మహా దరిద్రులకూ అసలే లేదు.

నిరాకరణ బహిష్కరణ నిషేధాలతో
అరణ్యమో పర్వతమో అఖాతమో
ఆటంకంలో అవరోధంలో అపాయంలో
మనిషిలో ఆశా జీవం నిలుపుతుంది!
సమాజ శ్రేణుల మధ్య
కలిపే వంతెనయై వాహనమై
జీవన యానాన్ని నిలుపుతుంది
మానవ హక్కుల కిరణ రూపం!

## ❀ 15.

నవ సమాజ కథలో
వ్యథలు సరి కొత్తవీ
వాద పథాలలో
వివాద దిశలలో.
తెగిన వీణ తీగెల్ని సరిచేయాలనీ
తప్పిన ప్రయాణికుల విమానాన్ని దారికి తేవాలనీ.

చట్టా లెన్ని చేసినా
ఆజ్ఞలెన్ని విధించినా
మానవ హక్కుల రక్షణలో
మానవతా మూర్తి ప్రవేశం మాత్రం
తెరచిన హృదయ ద్వారం నుండే!

సమాజం నది ఒడ్డున
నడిచే వారికీ వసించే వారికీ
కదలే అలలు స్వయంగా
కథలో వ్యథల్ని వినిపిస్తాయి

దూరం నుండి మాట్లాడతాయి
దగ్గర నుండి వినిపిస్తాయి
ఎవరు వినని, వినకపోనీ
తీయగానో చేదుగానో అనుభవంలో
చెవులకు చేరవేస్తాయి సూటిగా

సమాజ గమనానికి విజయ శక్తి నిస్తూ
మానవ హృదయానికి తెగని బంధమిస్తూ
నాలో సృజన ప్రపంచం!
మానవ హక్కుల కిరణ మయం.

## ❀ 16.

నాలో సృజన ప్రపంచం
మానవ హక్కుల కిరణ ప్రకాశం
ఎడారి అనుకునే చోట
పూల మొక్క ఎదుగుతూంది
కాలి క్రింద కదలే భూమి!
స్థిరపడి! నిలవ జేస్తూంది.

అనుకోకుండా దూకే తుపాను
తల వంచి నిష్క్రమిస్తూంది
తుపాను విజయానికి చిహ్నం కాదు
అవని కంపనలో సృష్టి స్థితికి అవకాశం లేదు.

కన్నీటి బిందువు చివర
రవి కిరణం ఊగుతూంది
వెనక నుండి కదలే చీకటి జాడ
హిమాంశు స్పర్శకై ఎదురు చూస్తూంది.

మానవ హక్కుల పర్వం
సమాజ చరిత్రలో ప్రవేశమయి
పోయిన అమూల్య వస్తువు
తిరిగి చేతి కందినట్లుంది.

జీవన ధన రాసుల పయి
అడుగులు వేస్తూ పోయే
మనిషిలో ఆశా కేతనాన్ని గుర్తిస్తుంది
మానవతను జ్ఞాపకం చేస్తుంది!
మానవ హక్కుల తలుపులు
తెరచిన మహా ద్వారం నుండి
ఎక్కడికి? అంటే!
మనిషికి తన రూపం తెలిసే
ప్రభాత ప్రకాశంలోకి!

## ❀ 17.

తల పయి కిరీటాలు తొలగీ
మెట్లపయి నుండి క్రిందికి దొర్లి పోయినా
సింహాసనాల పయి నుండి రాజ వంశాలు
కోట గోడల శిథిలాల్లో చితికి పోయినా
మనసును వదలని నియంత రూపంతో
బాధ్యత మరచిన ప్రజాస్వామ్యంలో
మానవ హక్కుల ప్రమేయం ఆనివార్యం
మనిషికి కావలసిన రక్షణకూ అవసరం!

హింసతో చెలరేగిన భయ సముద్రం
పరిష్కార తీరాన్ని దూరం చేస్తుంది

ఆకలి అవిద్య అజ్ఞానం అక్రమం
ఆకారాల శిఖరాల మధ్య స్వప్నిస్తూ
కదలని పర్వత రాజు
తనపై కాలి బాటకు మురిసి పోయేను
ఆపై నాలుగు చెట్లకు ఎగసేను!

తలుపుల్లేని గోడల్లేని కప్పు క్రింద
శిశిర జీర్ణ సమాజ రూపాలు
రాత్రి చలికి వణకుతాయి సరే,
పగలు భయానికీ వణకుతాయి
సముద్రం నుండి తరలే
నీటి మూటలు! ఎడారిలో పడీ
ఎవరికీ అందకుండా
నేల పాలవుతున్నాయి
అడవి పాలవుతున్నాయి.

నిర్భయంగా నిరాయుధంగా నిటారుగా
కదలాలిసిన జీవితాలు, క్రుంగీ
కల్పనలో జారిన ఆదర్శంలో
అల్మైరాలో ఏకాంతాన్ని అలంకరిస్తూ
మ్యూజియంలో పురా వస్తువు లవుతున్నాయి.

❀ **18.**

వంచితుల దుఃఖితుల తప్తుల హృదయాల్ని
కరుణ రసంలో ముంచి తీసి
అభయ ముద్రతో అనురాగ కళలుగా
మార్చే యత్నంలో మానవ హక్కుల చలనం.

సుందర సమ సమాజ ప్రజాస్వామ్యానికి
అంతో ఇంతో తమ వంతు నిర్మితితో
తాజ్‌మహల్‌ను సైతం మానసికంగా
సమాజ దృష్టి నుండి తొలగిస్తుంది.

అసహనం అవమానం వివక్ష విభేదాలు
ఏ దశలో ఏ స్థాయిలో ఏ అధికారంలోనో
వివిధ వివాదాల ప్రవాదాల మధ్య
మనిషి కీర్తి శిఖరాల్ని నిలుపుతూంది.

కక్షలో ప్రహారాలకూ బాటలో ప్రమాదాలకూ
భగ్న మయిన జీవిత సౌందర్యం
దగ్ధ మయిన మానవ సౌభాగ్యం
విరిసిన మంచుకు చల్లబడీ
మానవ హక్కుల స్పృహతో
స్ఫుటమై శుభ్రమై కొత్త రూపం పొందుతూంది.

కదలని మనిషి దృష్టి కంతా సమమే
నడచే అడుగులకు భూమిపై విషమ తలం

దారిద్ర్యంలో సహనం నశించి
బాధలో బాణంలా దూసీ
ఆవేశంలో అగ్ని శిఖమై
మనసుకు తప్పని కళ్ళెం జారీ
లోపలి నుండి బయటకు వెళ్ళిన మనస్సు
వైరంలో స్పర్థలో హింసలో తేలుతూంది
బయటి నుండి లోపలికి వచ్చే మనస్సు
ప్రేమలో కరుణలో శాంతిలో నిలవాలనీ!

ఇంటి ముందు పూల తీగె చుట్టూ
ఎగిరే సీతాకోక చిలకలు
ఝుంకారంతో భ్రమించే తుమ్మెదలు
వీధిలో ఆయుధ ధ్వనికి మాయమవుతున్నాయి.

వికల మయి శకలా లయిన సందర్భం
మానవ హక్కుల్ని కోరుతూంది, మన్నిస్తూంది
మనిషిలో సుందరతా పూర్ణత కయి!
నల్లని మృత్యు పంక్తి స్థానంలో
పచ్చని స్వర్ణ పంక్తి! సూచనతో
మానవ హక్కుల కిరణ చలనం!

## ❀ 19.

నిజాన్ని గుర్తించే వివేకంతో
నిజంపయి నీతితో స్తూపంలా నిలిచి ఉన్న మనిషి!
అగ్ని శిఖల మస్తకంపై వినీల మేఘం!
మానవ హక్కుల గౌరవమయ రూపం

ఉపచేతనలో మాయని కోరికతో నడుస్తూ
క్షితిజంలో ఎగిరే విహగం పయినా
ఏ చెట్టు కొమ్మ పైనో
ఏ స్తంభం తీగె పైనో
వాలిన పక్షిపయినా
గురి పెట్టే ఆయుధం
సమస్యను రక్త చిత్రం చేస్తూంది

ప్రమాదం పేరుతో బయట రక్షక గణం
లోపల విరామ సమయంలో

రక్షణ పేరుతో పక్కలో ఆయుధం
భద్రత పేరుతో తలగడ క్రింద బాంబు!

మృత్యువుకు బంధువై! భయ భావం
వ్యక్తి శక్తికి గ్రహణం పట్టిస్తుంది .
తనలో బొమ్మలతో ప్రతి వ్యక్తీ
సమాజ శాలను ఆవహించాలనే
తనలో వస్తూ పోయే ఋతువులతో
కాల చక్ర గమనాన్ని శాసించాలనే!

❀ **20.**

ఆర్ద్రతతో చలనంతో
దప్పిక తీరే జలాలపై అలలా
అందంతో గంధంతో
పుప్పొడితో సృజన భావ పుష్పంలా
మనిషి అవసరాలతో
మానవ హక్కుల రూపం
సమాజ సంస్కృతిలో భాగమై!
వ్యక్తిలో వికాసానికి అక్షత ప్రేరణమై.

సంకల్పంలో నిజం
మహా తరువై ఎదిగీ కాలంపై
ఫలానికి బీజ రూపం ఇస్తుంది

ఆలోచనలో నిజం
నీల మేఘమై కదలీ గగనంలో!
సమయానికి అలల రూపం ఇస్తుంది!

ఏ దిక్కూలేని
ఏమీ చేయలేని
సమయంలో మానవ హక్కుల పాత్ర
పైబడే పులిని బోనులో నిలుపుతూంది
అపహరించే చేతుల్ని వెనక్కి నెట్టేస్తూంది

నిశ్శబ్దాన్ని శబ్ద శిల్పంగా
మౌనాన్ని వర్ణ చిత్రంగా
నిజానికి అవకాశాన్ని తెరుస్తూంది
అదృశ్యానికి దృశ్య రూపాన్నిస్తూంది
మనసుకు అమృత గీతాన్ని వినిపిస్తూంది.

❀ **21.**

నాలో సృజన ప్రపంచం
మానవ హక్కుల విభాతం
హేతువుతో ఆలోచన
ఆలోచనతో హేతువు
జీవిత చలనంలో సమతకు
నవ్య దృశ్య రూపాన్ని ఇస్తూంది.

కల్పనతో పని లేని సందర్భం!
మానవతాకాశంపై
నెత్తు రోడే గాయంలా!
సూర్యునితో పాటు! బీభత్స సన్నివేశం!

నిజం మాట్లాడుతుంది అర్థవంతంగా
మనిషిలో సహస్ర కిరణాలతో
ప్రతి కిరణం ఒక్కొక్క హేతువై
ప్రతి హేతువు ఒక్కొక్క అనుభవంతో.

ఆలోచన సాగుతుంది చర్చా వేదికపై
స్వానుభవం కదలుతుంది చర్చల కతీతమై

ఎగరేసిన పతంగి
ఏ గాలికో ఎగిరి పోవచ్చు
ఏ చెట్టు కొమ్మకో చిక్కుకోవచ్చు
ఏ విద్యుత్తంత్రికో తగలవచ్చు
అందరికీ విషయం తెలిసిందే
అయినా ఎగరేయడం ఆగదు!

ఆకాశం వైపు కదలే చూపుకి
అవని పయి వస్తువు కనిపించదు.
అయినా అడుగులు ఆగవు
భూమి పయి స్థిర విశ్వాంతో
దారం కదలుతుంది వేళ్ళ మధ్య
చేతులతో సరి చేసే ఉడ్డీనంలో
దారాన్ని లాగుతూ ఒడుపుగా వదలుతూ
పైన కదలుతూ ఎగరేసే మనిషీ
ఎవరి దారి వారిదే! అయినా
పతంగికీ మనిషికీ మధ్య దారంలా
నిలుస్తుంది! మానవ హక్కుల బంధం.

## ❀ 22.

అపుడప్పుడూ మానవ హక్కుల రూపం
ముఖాన్ని చాటేయడం ఉంది
తెర వెనక్కి జారి పోవడమూ ఉంది
జీవితంలో నాటకీయం అనివార్యమై

కొమ్ములు మొలిచీ కలాలు కోరాడతాయి
ముఖాన నీలి ముసుగు! నిశను తలపిస్తుంది

"స్వేచ్ఛ" లేబుల్‌తో అమ్మే వస్తువు సిద్ధం
భయం నింపిన అక్షరాల కాప్సెల్‌తో
రాజకీయ వ్యాపార స్వతంత్రంతో
పరోక్ష రణానికి రంగం సిద్ధమవుతుంది.

న్యాయ నిలయం గుహాయతన మవుతుంది
పాలన రెక్క విరిగిన పక్షిని తలపిస్తుంది
మీడియా నేతి వాసన మీసాల్ని మీటుతుంది
ప్రజాస్వామ్యం అగ్ని రథం పయి
కొన్ని మైళ్ళ దూరం ఊరేగింపబడుతుంది.

ఈ సంకెళ్ళు! ఎవరో వేసేవీ కావు
తమకు తాము ధరించే అలంకారాలు!

ఎవరో తగిలించే భ్రమలో భ్రమణం!
దాగుడు మూత ఆటలో పిల్లల్లా!

గెలుపు కోసం కాస్త తెరచిన కళ్ళు
ఓటమికి దగ్గరలో పోటీకి స్వస్తి!

మౌన శిఖరం పయి మానవ హక్కులు
అందని ఎత్తులో ఇంద్ర చాపంలా
చూచి ఆనందించాలిసిందే నన్నట్లుంటుంది
తప్పని అమానుషం అవమానం ఆక్రందనం!

మానవ హక్కులు ముఖం చాటేసీనా
తెర వెనక్కి జారి పోవడం విచిత్రమే!

ఎవరూ సాహసించని వ్యూహంలో
ఎప్పటికీ బయట పడని రహస్యంతో
ఉన్న సమాజానికి ప్రతిబింబం! ఘటనలో
ఒక పరిష్కృతికై అన్వేషణం అవసరం

లేని దాతవ్యానికి ముందుకొచ్చే హృదయంతో
మానవ హక్కుల కిరణాలు
ఒక్కొక మారు గగన కుసుమాలవుతాయి.

## ❀ 23.

మానవ హక్కుల కిరణ స్పృహ
మాటల్ని అలంకరించేందుకు కాదు.
తూటాల్ని సంధించేందుకూ కాదు.
మనిషి కొక సింహాసన సాధనకూ కాదు.

కన్నీటిలో పూల పడవను వదలుతుంది.
పోవాలిసిన దిశలో తీరం చేరుస్తుంది.
అడ్డంకులు దాటే వాహనమయి సమయానికి
వ్యక్తిలో భవిష్య పథాన్ని మెరిపిస్తుంది.

వ్యక్తుల సంబంధంతో సమాజ రూపానికి
సమాజ పరివర్తనలో వ్యక్తుల స్థాయినీ,
నిజంతో వాస్తవంగా ఏకమయిన
భావ శిఖల మధ్య ప్రసార రూపం.

అస్థి పంజరాన్ని మాట్లాడిస్తుంది
వాటిచే సజీవ స్వరాన్ని వినిపిస్తుంది.
నెత్తురుతో కండతో మస్తిష్కం హృదయంతో

ప్రాణ శక్తికొక విజయ రూపాన్నిస్తుంది
ఒంటరి తనంలో వ్యక్తి
ఫ్లవర్ పాట్‌లో మొక్కలా.
సమాజ ప్రపంచంలో మనిషి
వనంలో పెరిగే తరువులా.

ఆకాశంలో వెలిగే సూర్యుడొకడే
భూమి పయి కిరణ ప్రకాశంతో ఎందరో

వ్యక్తి నుండి పెరిగే మానవ సంబంధాలు
సమాజ సౌధానికి జీవిత సోపానాలు.

## ❀ 24.

చేతిలో హలం
చాలుగా నేల దున్నడానికే కాని
ఎడా పెడా క్షేత్రాన్ని చీల్చడానికి కాదు.

చేతిలో కలం
మనిషిలో వెలుగు నింపడానికే కాని
ఎదురు పడీ మనసుల్ని పేల్చడానికి కాదు.

కలంలో సిరా
కాగితం పయి అక్షరాల్ని రాయడానికే కాని
ఒకరి ముఖం పయి చల్లడానికి కాదు.
ఇదొక చిత్ర రూపమనీ
స్వేచ్ఛలో భాగం అనుకుంటే! విపరీతం!

కలం మొన చివర
అక్షరాల్ని అందంగా తీర్చడానికే కాని

ఒకరిని పొడవడానికి కాదు
ఇదొక ప్రజా తంత్ర మనీ
స్వేచ్ఛలో నీతి అనుకుంటే! ప్రమాదం

కలం కనే కలలు
వర్తమాన కృషితో భవిష్య నిర్మాణం కయి
ఇది మరచీ రాజకీయ వ్యాపారంతో
మంటల్లో ఉదయం చూపాలనీ
స్వేచ్ఛకు ఆదర్శం అనుకుంటే! విచిత్రం.

ఇసుప పెట్టెలో భద్రంగా
ఎవరి కంటికీ కనబడకుండా
ఎవరికీ తెలియకుండా ఒక చోట
మానవ హక్కుల రూపం! నిజమే.

గాజు పెట్టెలో అందంగా
అందరికీ కనబడే విధంగా
ఎవరికీ అందకుండా, ఒకచోట
మానవ హక్కుల రూపం! నిజమే

జీవితంలో ఎపుడో దొరికే
సంధ్యా కాశమైన అవకాశంలో
స్వేచ్ఛా విశాల మైదానంలో
వదల బడీ తిరిగీ, సందేహంతో
చుట్టూ పరుగెత్తీ, సంవేదనతో

అలసటలో నిటలం పయి
చెమట బిందువులో మెరసే
తృప్తి మణి!తో జీవితం
పత్రికలో ఒక మూలన కార్టూన్‌లా!

❀ 25.

విప్పారిన హృదయ నయన దృష్టికి
మానవ హక్కుల కిరణ ముఖం కొత్తగా
జీవిత గమనంలో వెదకే దారి చూపుతూ
అమానుషం నుండి మానుషాన్ని విడదీస్తుంది.

గిరి మస్తకం పయి నభోమణిలా
మనిషిలోనూ చేతి కందని స్వేచ్ఛారూపం
అవసరానికి దారి చూపాలిసింది!
అపుడపుడూ క్లిష్ట సమయం! లో
మంచు క్రమ్మి
మబ్బు ముసరీ
విరామం లేని చక్రంలా
మానవ హక్కుల భ్రమణం!

ఉదార భూమికలో స్థిర సంకల్పంతో
ఉద్యమ గమ్యానికి శ్రేయోసూచనతో
మానుష కర్తవ్యానికి చిహ్నంగా
ఎదిగే మనిషిలో మనిషి ఎత్తు చూపే
ప్రజాస్వామ్య విజయ సోపానమవుతుంది.

చిటికెలపై ఏర్పడే నిలయం కాదు
మాటలతో కట్టే వంతెన కాదు

పొంచిన అనల జ్వాలల మధ్య
వాడని మానవ హక్కుల రూపం
అంతర్జాతీయ సమితి నుండి
మానవాళికి చిర బహుమానం

కవికి శబ్దంతో పని
తనలో అనుభవ తేజంతో
అందమయిన గిఫ్ట్ ప్యాకెట్‌లా
సిద్ధమవుతుంది సృజన రూపం.

అది విప్పితేనే తెలిసేది
అందులో ఏ విలువైన రహస్యం ఉందో
మౌన ప్రదర్శనమో ఇంద్ర జాలమో!
సమాజ చరిత్రలో విస్మరించిన పాత్రో!
మానవ బింబమో! సమాజ హృదయమో!
అన్నీ కలిసీ కవిత్వ కళతో
వాస్తవ జీవిత కృతియై
మానవ హక్కుల దృశ్యం
చేతిలో గిఫ్ట్ ప్యాకెట్!

✤ ✤ ✤

స్వేచ్ఛా కవిత్వం

**రెండవ భాగం - 14**

# నవ దర్శనం

## (పంజరంలో స్వేచ్ఛ)

**మాదిరాజు రంగారావు**

**2009**

రసధుని సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 500 028

ఆత్మ ప్రకాశంతో
మానవీయాన్ని జ్ఞాపకం చేసే
మహారచయిత
కవిసమ్రాట్

**శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారికి**

**అంకితం**

సన్మిత్రులూ సాహిత్య విదులూ

శ్రీ ఇటికాల నీలకంఠ రావు గారి

సత్సంకల్పంతో

ఖమ్మం మెట్టు పట్టణం (1958)లో ఏర్పాటయిన

**విశ్వనాథ వారి రామాయణ కల్పవృక్షం** పై

రెండు రోజుల సమాలోచనం సందర్భంగా

ముగింపు సభలో

శ్రీ విశ్వనాథ వారి స్పందనం

*మా యింటన్ పది నాళ్ళు బిడ్డ వలె నున్నాడాంధ్ర సాహిత్య రే*
*ఖా యోగ్యుం డగు మాదిరాజ మణి రంగారావు బాలుండు తా*
*నా యీ రామ కథోత్సవమ్ములను సంధానమ్ము గావించి నా*
*డోయీ! సాధు కృతజ్ఞతా గుణమ వీ వున్నావు లోకంబులో*

**- విశ్వనాథ**

ప్రవేశిక

# నవ దర్శనం

## (పంజరంలో స్వేచ్ఛ)

మానవ సమాజంలో స్వేచ్ఛారూపానికి గల ప్రాధాన్యాన్ని గురించీ దాని స్థితీ ప్రభావం గురించీ ప్రసక్తమైంది. వ్యక్తిలో స్వేచ్ఛ అనేక రూపాలుగా ఆలోచన కందుతుంది. మానవ జీవితంలో సమాజ చలనంలో అనుకూల వ్యతిరేక స్థితులూ ఆయా సందర్భాల్ని బట్టి దృష్టికి వస్తాయి. ఇందులో వైయక్తికం మరియు సామాజికం పార్శ్వాలు ఒక దానిపై మరొకటి ప్రభావాల్ని కలిగి ఉండడం చూడవచ్చు. స్థూలంగా వినడానికీ ఆలోచనకూ బాగానే ఉంటుంది. కాని స్వేచ్ఛా రూపాన్ని వ్యక్తి జీవితానికీ సమాజ చరిత్రకూ అన్వయించేప్పుడు సూక్ష్మంగా చూస్తే ఎంతో సంక్లిష్టంగానూ సమాస్యాత్మకంగానూ గోచరిస్తుంది. ఈ సందర్భంలో భౌతిక మానసిక తలాలపయి సామాజిక రాజకీయ స్థితుల ప్రసక్తి అనివార్యమవుతూంది. కవిత్వపరంగా చూస్తే వీటి వివరణం కన్నా అంతర్భూతమైన జీవవంతమైన అంశాలపై వెలుగు ప్రసరించడం అవసరం. ఇందులో కవితాత్మకమయిందీ అంశం.

భావ స్థితిలో ఆదర్శ రూపాన్ని కలిగిన స్వేచ్ఛా భావన, వాస్తవంగా అనేక కారణాలవల్ల ఎన్నో పరిమితుల్ని పొందుతూంది. ఆటంకాల్ని ఎదుర్కొంటూంది. ఎన్నో వలయాల్లోకి ప్రవేశించే అవసరం కలుగుతూంది. ఈ స్థితులు క్రమంగా స్వార్థంచేతనో అప్పటి అవసరం వల్లనో ప్రయోజనం ఆశించో మరో కారణంచేతనో పంజరంలోకో ఏ బోను లోకో దారి తీస్తాయి. ఈ విషయంలో వైయక్తికమైన సామాజికమైన విశ్లేషణం అవసరమవుతూంది. కావ్యంలో భౌతిక మానసిక స్థాయిల్లో వీటికి సంబంధించిన అనేకాంశాలు వాస్తవ తలం ఆధారంగా చిత్రించడం జరిగింది. శుభ్రమయిన స్వేచ్ఛా రూపం వివిధ సందర్భాల్లో ప్రయోగంలో ప్రయోజనంలో ప్రమాణాలు తగ్గినపుడూ విలువల్ని మరచినపుడూ మానసిక స్థాయి లోపించినపుడు వ్యతిరేక స్థితులేర్పడతాయి. ఇలాంటివి నిత్యజీవితంలో అనేకం విశ్లేషణకందుతాయి.

స్థూలంగా జననం నుండి సమాప్తి వరకూ మనిషి నిర్వహించే పాత్రల వివిధ పార్శ్వాలు ప్రసక్తమయినాయి. ఏ ఒక్కరి జీవితమూ మరొకరి జీవితంతో పోల్చడం

కుదరదు. ఎవరి జీవితం వారిదే. సమాజమూ అంతే, ఎప్పటికపుడు స్థితిగతులు మారడం జరుగుతుంది. అందువల్ల స్వేచ్ఛ అనేది భావ సూత్రంలో ఒకటిగా కనిపించినా అనుభవంలో వేరు వేరు రూపాల్ని స్థితుల్నీ ప్రయోజనాల్నీ పొందడం జరుగుతుంది. దీన్ని వైయక్తింగానూ సామాజికంగానూ స్థిరపరచడం కుదరదు. "పంజరంలో స్వేచ్ఛ" మనిషిలో స్వతంత్రమయిన స్వేచ్ఛా రూపాన్ని నియంత్రించే అడ్డుకునే బంధించే వాతావరణంతో సమాహితమయింది. ప్రధానంగా డబ్బు అధికారం భోగం కీర్తి పట్ల మేరలు మీరిన అభిలాష ఆశ మరొకటీ మరొకటీ జీవితంలో Negative role వల్ల పంజరంలాంటి బోనులాంటి జైలులాంటి స్థితి ఏర్పడుతుంది. అయితే వీటి Positive role ఆరోగ్యకరమయిన సౌభాగ్యవంతమయిన స్వేచ్ఛా వాతావరణానికి దోహదం చేస్తుంది. దీనికి మనోభూమికలో స్వతంత్రమయిన సమాజ హితకరమయిన త్యాగపూర్ణమయిన పురోగమన శీలమయిన నైతికమైన వ్యక్తిత్వం ఒక ప్రమాణంలో అవసరమవుతూంది. జీవితంలో ఎన్నుకొన్న ఉన్నతమయిన శక్తి అవసరం. దీనిలో నైతికత లోపించినప్పుడు మానసికంగా బలహీనమయిన గతిలో విపరీతమయిన స్థితులు ఉత్పన్నమవుతాయి. అసాధారణమైన ఘటనలూ చోటుచేసుకుంటాయి. నేడు విరివిగా జరుగుతున్నదీ ఇదే. బయటిదీ లోపలిదీ స్వేచ్ఛతోపాటు మానవ హక్కులూ బాధ్యతలూ ఇందులో ప్రసక్తమైనాయి. వీటి ప్రాముఖ్యమూ గుర్తించడం జరిగింది. మొత్తం మీద వ్యక్తి వికాసమూ సామాజిక సౌభాగ్యమూ లక్ష్యంగా భావ సూత్రంతో 'నవదర్శనం' సార్థకమవుతూంది.

ఇక వస్తువు ఎన్నికలో, దానికి సంబంధించిన విషయ సంకలనంలో అనుభవంలోని వాస్తవజీవితానికి సంబంధించిన స్థితిగతులు కన్పిస్తాయి. వీటికి సంబంధించిన ఆలోచనా జగత్తు అభివ్యక్తిలో 1) భావరూపం (Image) 2) ప్రతీక (Symbol) 3) వ్యంగ్య (Suggestion) మర్యాద కలిగిందీ కావ్యం. ఈనాడు వస్తూన్న ఆధునిక కవిత్వంలో భిన్నమయిన స్వరంతో 1) వస్తువూ విషయ సమాకలనం 2) నిర్వహణమూ దర్శనంలో ప్రత్యేకత విశ్లేషణ కందుతుంది. సాహిత్య చరిత్రలో ఈ కావ్యం స్థానం 1) ఆయా అంశాలు పొందే స్థాయిని బట్టీ 2) సృజన నవ్యతను బట్టీ ఉంటుందనడంలో సందేహం లేదు. ఈ సూత్రం ఇంచుమించు అన్నిటికీ వర్తిస్తుంది.

– మాదిరాజు రంగారావు

స్వేచ్ఛా కవిత్వం

# నవ దర్శనం

## (పంజరంలో స్వేచ్ఛ)

### I. 1 పంజర వలయంలో

జననానికి వెను వెనుక
మనిషి పురా భూమికతో
జననంలో
జన్య జీవ చలనంతో
జననంతో
పరిసరాల ప్రభావంతో
పొరలలో అరలలో వరసగా
భౌతిక జీవన నిర్మితితో
అతీత శిఖరం నాలో
నవ దర్శన సృజన భవం.

ఈ విశాల భావ సమాజం
విరాట్ చేతనలో భాగం
ప్రాణి తతికి ప్రకృతి
ఆకలి దాహం తీరుస్తుంది.

నడిచే చరణ యుగానికి
కాలి బాట మితం లేదు
అనుభవ స్థితిలో స్వేచ్ఛకు
హద్దు లేదు గడువు లేదు.

మానవ వికాసమంతా జరిగింది
స్వేచ్ఛలోనే దశలుదశలుగా
స్వేచ్ఛ నడిపిస్తుంది ముందుకు నడిచే
కాళ్ళకు అంతర్జ్ఞానాన్ని ప్రసాదిస్తూ.

సామాజిక రాజకీయ నైతిక వలయాలు
వలయంలో అంతర్వలయాలతో
ఒకదాని నుండి మరో దానిలోకి
ప్రవేశం! స్వేచ్ఛా పరిమితితో!

మనిషి కెన్ని విధాలో అవసరాలు
బంధనలో స్వేచ్ఛారూపం ఒకటొకటీ
స్వార్థంలో ఒత్తిడిలో ఓటమిలో
పంజరమో! బోనో! మరొకటో!

## I. 2

ఆకాశం వైపు దృష్టి నిలిపితే
ఏకాంతం అలము కొంటుంది.
అవని పయి దృష్టి సారిస్తే
విశాల సమాజం ఆవహిస్తుంది.

ఒంటరిగా లేను నేను
చుట్టూ జన మహా సర్వస్వం
గిరి శిఖర తలం నుండి జలపాతం
కిందికి జారే వరకే ఒంటరితనం

తరలే ధరణి పయి ఇరువైపుల
తీరాల్ల సమాజ సంస్కృతీ దృశ్యాలు
పైరు పంట ఊరు నాడు ప్రజతో
ఒంటరి తన మెక్కడుంది? బ్రతుకులో

క్రాస్ వర్డ్ పజిల్ ఖాళీల్లో అక్షరాల్లా
నాలో కదలేను క్షణాలు
ఆశయాల పూర్తి కోసం!
ఎప్పటికీ మిగిలే ఖాళీలతో!

భూమి పయి చూపుతో నడక
ఎంత దూరమయినా సాగుతుంది
నింగిలో చూపుతో అది
అంతలో నిలిచి పోతుంది.

నడుస్తూ ఉన్నంత సేపు కాలం
నా వెనకనే నడుస్తూ ఉంటుంది
ఆగిన సమయంలో అది
తన వెంట లాక్కొని పోతుంది.

ఆలోచనలో
నీలి నీడల పంజరం
వదలితేనే
ఒంటరితనం మాయమవుతుంది.

## I. 3

ఒక దేశం పొందే స్వాతంత్ర్యం
జన గణ స్వేచ్ఛా జయ చిహ్నం!

చరిత్ర ఒక మహా సముద్రం
ఎగసే సంఘటనల అలలను
ఆపే శక్తి ఎవరి కుంది?
తీరాన వీచే పవమాన దృశ్యం
సమాజంలో పరివర్తన సంకేతం.

చరిత్రకు చివరి పేజి అంటూలేదు
మొదటి పేజీలు దొరకనే దొరకవు
చినిగి పోయి గాలి కెగిరి పోయినవీ
శత్రువు చర్యల్లో ఛిన్నభిన్నమయినవీ
మంటల్లో బూది పొరలుగా తరలినవీ

పోగా మిగిలినవీ సినీవాలిలా
కథ లోనో కల్పనలోనో దర్శనమిస్తాయి.

వాస్తవ మేదో తెలియని మనసుకు
కల్పన ఒక తృప్తి నిస్తుంది
ఎదురుగా దేశం జాతి
కీర్తి శిఖరం నిలుపుతుంది.

ప్రతి సమయం జీవితాన రణ తలం కాదు
మానవతా స్పందనం ఒక లాంఛనం కాదు
మానవ హక్కు వెనక సామాజిక బాధ్యత
స్వేచ్ఛా శక్తికి సామాజిక పూర్ణత నిస్తుంది.

అస్మితలో గౌరవ శిఖరం
మనిషి వదలుకోని రూపం
ఇది పొందే అవకాశానికి
ఏ గుర్తు కార్డు అవసరం లేదు.

**I. 4**

జన రక్షణ రూపం కోట
నర హింసకు కవచం కాదు
క్రోధంతో ఎగసే మనిషిని
బాష్ప కణం నిలిపేస్తుంది.

కదలే ఒక ఆయుధ గతిలో
శత్రువు ఒక దొరికిన స్వప్నం
వంతెనయై మనిషి అహంకృతి
జిగీషలో తప్పదు యానం.

వంతెన దాటే సమయం
అపాయకర రూపం దృశ్యం
ఇరువైపుల ఘర్షణ హననం
రణ మారణ నీతికి భాష్యం.

గమనంలో రణ శకటానికి
ధైర్యం ఒక ఇరుసవుతూంది
దేహం పయి తగిలిన గాయం
మునుముందుకు ప్రేరణ నిస్తూంది.

సంఘట్టనలో కూలిన వంతెన
బదులొక కొత్తది ఆరంభం
కరుణ జలంతోనో
శాంతి సూక్తినో.

వంతెన పయి మారణ చరణంతో
నిలిచిన వీర భావ జీవిత దృశ్యం
రణ పంజర చరిత్ర శకలం!
స్వేచ్ఛలో సృజన భూమి కోరుతూంది.

**I. 5**

ఎప్పటి నుండో మానవ చరిత్రలో
భుక్తి కో భాగ్యాని కో
విజయానికో విజ్ఞానానికో
అరణ్యాలు పర్వతాలు నదులూ జలధులు
దాటీ, దేశాలు మారే మనిషిలో
విశ్వ భావన ఆంతరంగా సూత్రమై

కోర్కెల కొమ్మలుకు పూలు
ఎవరి ఇష్టం పైన పూయవు
అలలు ముందుకే, వెనక్కి వెళ్ళవు
స్వేచ్ఛ ఎప్పుడూ పురోగమన రూపమే

మునిగినా తేలినా జలధిలో
అందరికీ సమ తలమే!
వెలుగు నదిలా స్వేచ్ఛ
జీవ సహజం! సృజనలో!

ప్రయోజన దిశా చక్రంలో
స్థానం నుండి స్థానానికి
సమయం నుండి సమయానికి
ఆలోచన నుండి ఆలోచనకు
కదలే మనిషి ముందు దశ దశలో
అడ్డూ ఆటంకం బంధనం! ఎన్నో!

కళ్ళలో భయంతో
కాళ్ళలో సంకోచంతో
పయనించే సందర్భంలో
పంజరాలు బోనులు ఎన్నో!

పీడనలో నిరంకుశంలో
సమాజ వికాసం ఆగిన మాట నిజం
స్వార్థంలో సంకుచితంలో
వ్యక్తి పరిణతి నిలిచిన మాట వాస్తవం.

## I. 6

కిందికి వాలిన ముఖం ఎత్తి
నడచే మనిషిలో అడుగడుగునా
స్వేచ్ఛకు అవకాశం పురి విప్పుతుంది
ఆచరణంలో బాధ్యత బరువెక్కుతుంది.

విజ్ఞాన వికాస దశలోను
పగలూ నిశకూ భేదం ఎరగని
శూన్యాకృతి నిలయాల్లో
వెలుగు వర్ణ చిత్రం మాత్రం
ఆశాపటం పయి అదృశ్యంగానే ఉంది
ఇంద్రజాల దీపం వెలుగుతుంది ఒంటరిగా.

అడవుల్లో కొండల్లో బీడు బ్రతుకులూ
జనపద నగరాల్లో మోడు వాలకం

ఆకలి ఆవేశంలో
నిరసన అవమానంలో
హృది అణగిన అనల ధానిక నుండి
లేచిన ధూమం ఎగసీ
లోకసాక్షి నిటల తటాన్ని వినీలం చేస్తూంది.

దేహానికి తగిలిన ప్రతి గాయం
స్మృతిలో పూచిన మందారం కాదు
కళ్ళ ముందు అగ్ని కణమవుతూంది
జీవన పథ కఠోర దృశ్యంలో
జ్వాలా ముఖ చిహ్నంగా మిగలవచ్చు.

ప్రజాస్వామ్య ప్రక్రియలో సర్కస్ క్రీడ
ఏ సమాజ విజయానికీ దారి తీయదు.

ప్రకృతి చిత్రం వెనక్కి తగ్గీ
సమాజ దృశ్యం ముందుకు వచ్చే
ఆరోహణ గమనంలో
చివరి మెట్టు ప్రశ్నలేదు!

అడుగున బడీ మస్తకాలు
అవని పయి ముఖాలు
దిశలు చూస్తూ ఎప్పటి నుండో
మానవ హక్కులకై శ్రేణులుగా
స్వేచ్ఛా ప్రియ హృదయంతో
ప్రజాస్వామ్య పథంలో!

**I. 7**

ఎదురుగా వాస్తవ జీవితం
ప్రతిఫలించే స్వేచ్ఛాదర్శం పయి
రాళ్ళు విసరి ముక్కలు చేసీ

రంగులు చల్లీ వికృతం చేసీ
దుమ్ము చిమ్మి మలిన పరచీ
ఘన కార్యంగా భావించే చేతులూ.

చెదరిన ముక్కల్ని ఏరి
ఇష్టమయిన విధంలో
అమర్చిన ప్రదర్శనం 'నిజం'
అనల స్పర్శకు కరిగే లాక్షా రూపం.

దారి తప్పిన అడుగుల్ని గుర్తించడంలో
సమయం మించి పోతూంది
పయనం వృథా అయి, వెనక్కి మరలీ
లక్ష్యం మళ్ళీ మొదటికి వస్తూంది.

ఒక దృశ్యం బదులు మరొకటి
ఒక అనుభవం బదులు మరొకటి
ఒక లక్ష్యం బదులు మరొకటి
ఎదలో ఎదిగే చెట్టును తలక్రిందులు చేస్తూంది.

చేతిలో జెండా రెప రెపలతో సరిపోదు
స్వేచ్ఛా పథంలో చెదరని ఆదర్శం ముఖ్యం.
మనిషిలో మనసును మాయం చేసే
ఊహలెన్నో? తల మాత్రం ఒకటే.
మనిషిలో మనసును స్వచ్ఛంగా నిలిపే
తలలెన్నో! ఊహ మాత్రం ఒకటే!

అస్తమించే సూర్యుని కోసం
ఎవరూ దుఃఖిస్తూ గడపరు
రాబోయే సూర్యుని పయి
హృదయంతో గడిపేరు.

చల్లని ఆకాశాన్ని
తన బాహువుల్లోకి తీసుకొనీ
శాంతిని  పొందాలనుకునే
కల్లోల సముద్ర హృదయంపై
విశాలమయిన గొడుగులా
మస్పృణమైన ఛాయా రూపం!

అసలు కన్నా ప్రతిబింబం
పరమ ప్రీతికరం కళలో!

శుభ్రమయిన స్వచ్ఛమయిన
స్వేచ్ఛా ప్రతిఫలన సమాజం
ప్రజాస్వామ్య హృదయంతో
మేల్కొన్న ప్రజతో సాధ్యం!

**I. 8**

కూడికతో వచ్చీ లోకంలోకి
కూడిక లోనే గడపాలనీ
తీసి వేత ఎప్పటి కయినా
జీవిత గమనంలో తప్పనిదీ.

ప్రశ్నకు సమాధానం ఎక్కడో ఉండదు
ప్రశ్న వెనకే ఉంటుంది! పొరలో
తిప్పి చూడలేకనో పొర తీయలేకనో
దృష్టి! అదృష్టాన్ని నిందిస్తుంది.

భూమి పైకి వచ్చే ప్రతి మనిషీ
ఒక పిడికిలి దుఃఖంతో
ఒక పిడికిలి సహనంతో
రెండూ చెరొకవైపు మనసు త్రాసులో

వైరం స్నేహం చెరొక వైపు నుండి
బుజాల పయి వాలి చూస్తాయి.

గమ్యాన్ని శాసిస్తూనో ఉపదేశిస్తూనో
వీటిని సహించకతప్పదు శకునాల్లా!

అపుడపుడూ గాలిలా స్వేచ్ఛ
పిలుపునో అరపునో అలజడినో
మోసుకొచ్చి ముంగిట్లో అవలీలగా
రూపాల్ని వదలి వెళ్ళిపోతుంది.

ఒకటొకటీ తలుపులు తెరచుకొనీ
నెమ్మదిగా లోనికి ప్రవేశిస్తాయి

అసలు వాటి రాకపై
ప్రశ్నా చిహ్నం మనిషిలో
ఆలోచన మొదలవుతుంది
ఆన్వేషణ! ఎప్పటికీ సాగుతూనే ఉంటుంది.

స్వేచ్ఛా రూపాలతో
ఎన్ని పంజరాలో!
అన్ని ప్రశ్నలూ సమాధానాలూ!
వస్తూ పోతూనే ఉంటాయి.

## II. 1 నిశా పంజరంలో

ఎప్పటిదో పంజరం ఇప్పటిదా?
ఇందులో ఎపుడ ప్రవేశించిందో స్వేచ్ఛా రూపం
ఎవరి చేతనో ఊపబడుతూ
ఊయెలగా జీవితమంతా
మాటలతో చేష్టలతో కాలక్షేపంగా
తనకూ భౌతిక సుఖదంగా.

ముక్తమయిన స్వేచ్ఛా రూపం
ఎక్కడ కనిపిస్తుంది? మనోజ్ఞంగా
మనిషికి తన జీవితంలో
అద్దంలో బొమ్మలా ఎదురవుతుంది.

ఇసుక పయి అక్షరాల్లా
రాజకీయ నినాదంలా
ప్రదర్శనశాలలో వస్తువులా
ప్రతి మనిషిలో స్వేచ్ఛారూపం

అపుడపుడూ విడువబడీ
కొన్ని క్షణాలు! బయటికి వస్తుంది.

ఎక్కడ చిక్కుకొని పోతుందనో
ఎప్పుడు దారి తప్పిపోతుందనో
భయంతోనో సందేహంతోనో
ఏ పంజరమో చేర్చబడుతుంది
ఏ బోనులోకో! ప్రవేశిస్తుంది!

మనీ పర్సు ముఖం విప్పితే
తొంగి చూచేనా?
బంగారు నాణెం తళతళకు

ముందుకు వచ్చేనా?
బ్లాంక్ చెక్ కనిపిస్తే
చేతులు చాచేనా?
క్రెడిట్ కార్డు అందిస్తే!
అడుగు ముందుకు వేసేనా?

ఏ స్కీం లోనో
ఏ ప్లాన్ లోనో
బహుమతి గెలిచేందుకో
అవార్డు పొందేందుకో
జీవితంలో స్వేచ్ఛా రూపం
ఎప్పటికీ పంజరంలో? నివాసమేనా?

భౌతిక సుఖ పీఠం పయి
వేడుకకో విజయానికో
దృశ్యంలో ప్రత్యక్షంగా
అపుడపుడూ పరోక్షంగా.

## II. 2

భావనలో స్వేచ్ఛా రూపం
అందని ఎత్తు నుండి
కిందికి దిగేనా?
చేతికి అందేనా?

పంజరంలో
తప్పని ఇరుకు నుండి తొలగి
జీవితంలో
విశాల వేదిక పయి చేరేనా?

శిశువు ముఖంలోనో
మల్లె పూవులోనో

రవి కిరణంలోనో
జలధి  లహరిలోనో
కల్పనలో తృప్తి పడాలిసిందేనా?
వాస్తవమై అనుభవ హృది నిలిచేనా?

ఎంతటి విశాల స్వేచ్ఛలోను
గగన రూపం దిగదు క్రిందికి
అవని హృదయం లోతు విప్పదు
జలధిలో వస్తు చయం బయట పడదు

మానవతా స్పందనలో దొరికే
సృజన హృదయ చేతనలో కదలే
స్వేచ్ఛా నిజ రూపం
సృష్టి సరణి భిన్నం కాదు!

మనిషి మనిషిని గుర్తించే దృష్టిలో
మనిషిలో మనిషిని చూచే కాంతిలో
మనిషిని ముందుకు నడిపించే నీతిలో
పురోగమన చిహ్నం! స్వేచ్ఛా రూపం.

**II. 3**

పంజరం నుండి ముక్తమై
స్వేచ్ఛా రూపం! అపుడపుడూ
ఎటు వెళ్ళేను,
ఎన్ని పంజరాలో?
ఎన్ని బోనులో?
చుట్టూ పొంచీ!
ఈ విశాల సమాజంలో

విశ్వ హృదయ స్పందనలో
జన రాగం సమభావం రెక్కలుగా

విజయాకాశం చేరేనా?
గమనంలో ఆరోహణలో
నవ దర్శన కృతి పొందేనా?
సహృదయ శాఖలపై తిరిగేనా?

ఏ మయినా ఏ స్థితిలోనూ
శిల్ప భంగిమ రాకూడదు.
ఒక బంధం నుండి మోచనం
మరో బంధానికి తెరచిన ద్వారం కాకూడదు

ఆవృతంలో ఆవాసం కొందరికి
బహుఇష్టం! అవసరానికి లాభం!

జీవన దశ పెరిగే కొద్దీ
మారుతుంది పంజర వలయం
నిర్మితిలో ఆకర్షణ చేరుతుంది
పీఠానికి విలువ పెరుగుతుంది
పదవికి రంగూ హంగూ వస్తుంది.

అతికించిన రెక్కలతో మనస్సు
నలువైపుల ఎగురుతుంది పంజరంలో
దొరికింది విశ్వంగా తలచీ మురిసీ
చిలుక మాట వెడలుతుంది పాటగా.

## II. 4

ఈ మూల నుండి ఆ మూలకు
ఈ చివర నుండి ఆ చివరకు
రంగుల కలలు అల్లిన పటంలో
తిరుగుతుంది స్వేచ్ఛా రూపం.

కల్పనకు మితం లేదు
భ్రాంతికి రూపం లేదు
వాస్తవం తొలగి పోదు
స్వేచ్ఛకు ఘనీభూత రూపం లేదు

శలాకల సందుల్లో నుండి
దృశ్య పంక్తికి అలవాటు పడింది
తళతళలో తనలో తాను పరవశిస్తూ
తన రూపాన్ని నిమిరి చూచుకుంటుంది.

స్థానానికి చలనం లేకుండా
అందంగా పంజరంలో స్థిరంగా
అలంకార సుందరంగా అస్మితలో
స్వేచ్ఛా బంధన రూపంలో జీవితం!

శ్రమ ఎరగని బ్రతుకులో
అవసరాల కన్నీ అందుతూ
నోటికి ఆహారంతో పాటు
చేతికి పుష్పం! గళానికి గంధం

ఏ పనిమీదో అటు వస్తూ పోయే
జనం ముఖాలతో పలకరింతలతో
ఆరోజు గడుస్తుంది
బహు సులభ సుందరంగా

మోహన రాగంలో
మనుషుల పరిచయంతో
రోజొక నూలుపోగు
మెడలో పడి బిగిస్తుంది!

బ్రతికి నంత కాలం భౌతికమై
భోగ పథంలో జీవితం
ఏ రోజూ దైనిక చర్యలో భాగమై
ఇంద్ర ధనుసును తలపించే పంజరంలో
ఇంకా కావలసిందేమనీ అనుకునేను
స్వేచ్ఛను మరచిన హృదయం!

పంజర మొక ప్రపంచమై
స్థిరమై రమణీయ సన్నివేశం
మృగ్యమై బయటికి వచ్చే అవకాశం
టేబిల్ పయి గాజు బొమ్మలా ఆలోచన
స్వేచ్ఛను కొత్త అర్థంలో బంధిస్తుంది.

## II. 5

ఏ సామాజిక విధి గతి లోనో
ఆరంగేంట్రం చేసిన ఒక స్థితిలో
పొందిన స్వర్ణ పంజరంలో బ్రతికే
సుఖ మర్యాదను వదలడ మెంత కష్టం?

తనలో ఒక దివ్వె వెలుగుతో
విశ్వానుభవం చూపాలనీ
తనలో ఒక బిందు కళలో
జలధి దృశ్యం కదలాలనీ
అదృష్ట సూత్రానికి వ్రేలాడే జీవితం
ఎప్పటికీ యశోబింబమై నిలవాలనీ
పంజరంలో ఇదో స్వేచ్ఛా రూపం!
చిత్రమైందీ, లౌకిక గతి వశమైందీ!

పంజరం పరిధి దాటి కదిలితేనే
మనిషి పయి సమాజ దృష్టి నిలిపితేనే
వెలగని అభాగ్య దృశ్యం కనిపించేదీ
వంచితులూ! శోషితులూ! పీడితులూ!

తీరాన అలల స్పర్శ ఎరగని శిలలూ
ముఖాన చివురు జాడ లేని మోడులూ
ఇవి చూడక పోవడ మొక పై స్థాయిగా
విచిత్ర మనో రూపంతో! గాజు మనుషులూ

పంజర వలయంలో జీవితం
పరిమితిలో ఊగే డోలిక!

## II. 6

కలలో తేలే కండ్లకు
చంద్రుడెలా కనిపిస్తాడు
వీధి స్తంభం దీపానికి
నగర మెలా కనిపిస్తుంది.

కారాగారంలో మనసుకు
స్వేచ్ఛా విహగ మెలా కనిపిస్తుంది
స్వేచ్ఛగా సాగే మనసును చేర్చాలనీ
దారిలో పంజరా లెన్నో బోనులెన్నో

చెట్టు కింద జోస్యంలో
తలుపు తెరవబడీ
బయటి కొస్తూ లోపలి కెళుతూ
చిలకలతో పంజరాలు!

బోనులో సర్కస్ మృగాలూ
అవచేతనలో అపాయ రూపాలూ
బంధనలో, మానవ జీవిత భాగాలై

ఇంటి ముందు గుమ్మంలో
బయట చెట్టు కొమ్మకూ
చిలకలతో వేలాడే పంజరాలు
ఏ గాలికో కదిలేవీ
ఏ చేతులో కదిలించేవీ, ఊగేవీ
మనిషి ముఖం కయి ఎదురు చూచేవీ
బంధనలో స్వేచ్ఛా రూపాలు అనేకాలు!
అలంకార ప్రియ రూపాలూ!
పలుకు నుండి పాటదాకా
వినోదకర బహు రీతుల్లో!

పంజరాల ముందూ బోనుల చుట్టూ
ఫోటోగ్రాఫర్లు, పత్రికా రచయితలు
తిరిగే కాలం చక్రం అరల్లా
స్వేచ్ఛా రూపాలపై గురి పెట్టిన కలంతో
అమర్చిన కెమెరా ఫోకస్‌తో.

## II. 7

సమాజ శాఖలకు వ్రేలాడే పంజరాలు
లోపల కదలే స్వేచ్ఛా రూపాలతో
దారిలో అసంఖ్యాకాలు!
ఒకటి తరువాత మరొకటి
దేశం కాలం సంస్కృతి భేదాలతో
ఆదర్శం సిద్ధాంతం వాద విధాలతో.

ఎవరి ప్రశ్నలు వారి కున్నాయి
ఎవరి జవాబులు వారికి ముఖ్యం
మరొకరి ప్రశ్న వినే సమయం లేదు
మరొకరి జవాబు వినే అవసరమూ లేదు.

ఒక్కొక్క పంజరంలో
స్వేచ్ఛా రూపం ఒక్కొక్క విధం
దగ్గరలో అక్కడక్కడా
పావురాళ్ళు కూర్చొనీ కనిపిస్తాయి.

చిన్నవో! పెద్దవో! రక్షణ లో బంధన లో
పంజరాల ప్రపంచం లేంది
జీవితంలో వాస్తవంగా
మనోరూపానికి పాత్ర దృశ్యం ఎక్కడుంది?

క్షణాలు వెనక్కి నడవ్వు
ముందుకు నడుస్తాయి నడిపిస్తాయి
భవిష్యత్తుతో కరచాలనం చేసే
ఉత్సాహ గుణంతో, ప్రాణికి ప్రేరణనిస్తూ
ఆరోహణ గతిలో మనిషిలో మనీషతో
స్వార్థ మోసం మోహం ఆకర్షణతో
కిందికి దిగడం అంటే
పంజరంలోకి ప్రవేశించడమే!

నవ దర్శన శిఖర తలం పయి
స్వేచ్ఛా చరణానికి "బ్రేక్" పడడమే

## II. 8

గగన పంజరం నుండి
దిగిన మొదటి రవి కిరణంతో
కసుమించే సృజన సమయం
స్వేచ్ఛకు ఉగాది హృదయం

పరిసరాలు ఎప్పటివే
మనిషి రూపం ఎప్పటిదే
విరిసిన సంకల్ప బలంతో
స్వేచ్ఛా ప్రపంచం కొత్తది.

నిశీథి పంజరంలో
చంద్ర బింబంలా స్వేచ్ఛా రూపం
మనసుకు హ్లాదాన్ని ప్రసాదిస్తుంది
ఆ సమయం రవి కిరణాల్ని మరపిస్తుంది.

ఏ రాత్రి లిప్త
మృత్యువుకు చిహ్నాం కాదు
నిశాలతకు
ఆశా రూపమూ సుమిస్తుంది.

తెల్లవారే సరికి భయ శిబిరం
మరో చోటికి మారుతుంది.
సూర్యునితో పాటే ధైర్య శిబిరం
ఏర్పడుతుంది స్వేచ్ఛా తేజంతో.

స్వేచ్ఛకు ఆటంకంగా
జీవన గతి రోధంగా
అసహనం ఆకలితో, దాహం కోపంతో
దుఃఖం దారిద్ర్యంలో చేతన
మనిషి నుండి మరో మనిషి బయటికి వచ్చేను
సంఘర్షణ పరివర్తన చరణాలతో.

పగలంతా తిరిగి తిరిగి
సాయం సంధ్య ఎరుపు గాయంతో
సమాజ స్వేచ్ఛా రూపం!
నిశా విశాల పంజరం లోకి!

## III. 1 వదలని పంజరంలో

దిశ దిశ నుండీ పిలుపు
ఏ దిశకు వెళ్ళాలనీ
మనిషి మనిషి నుండి చూపు
ఏ మనిషి వైపు చూడాలనీ
అన్నిటికీ కేంద్ర స్థానంగా
పంజర వలయంలో స్వేచ్ఛా రూపం.

ఎవరెవరో పలకరిస్తారు
బదులు కోసం ఎదురు చూస్తారు
వచ్చే ప్రతి స్పందనపై తృప్తితో
నిష్క్రమిస్తారు, సంతోషంగా

కిరీటంలో పొదిగిన వజ్రంలా
పంజరంలో స్వేచ్ఛారూపం కొంత కాలం
అది సూర్య బింబం అనుకుంటే సరా?
కల్పనలో వాంఛా స్వప్నం అవుతుంది.

పంజరం, నుండి బోనులోకి ప్రవేశం
కనిపించని సంకెలతో బానిస విధం
నింకుశ చర్యలో రూపానికి చిహ్నం
సమాజంలో దీన హీన స్థితి సంకేతం

ఆకు పచ్చని ఆలోచనతో
గులాబి పూవు ఆశతో
వనాన్ని బంధించినట్లుంది
పంజరంలో స్వేచ్ఛా రూపం.

దీనితో మనిషి కోల్పోయిందేమిటో
సమాజ చరిత్ర చెబుతుంది.

వైరం స్నేహం స్వార్థం త్యాగం
జీవితంలో ఇచ్చే అర్థాలు వేరై
నిజం కాస్తా కప్పేయబడుతూంది
స్వేచ్ఛా రూపం పంజరం చేరుతూంది.

**III. 2**

స్వేచ్ఛా పవనానికి
అల కదలుతుంది
శిల కదలదు

అల ఎరగని బిందువు
ఎగిరి పోతుంది
ఇగిరి పోతుంది

స్వేచ్ఛా సంకల్పంతో
కదలుతుంది సజీవ సమాజం

ఇది మానవ ప్రతిమల ప్రదర్శనం కాదు
జలధిలో పడవల సమూహం కాదు

పంజరానికీ బోనుకీ
అందని బృహదాకృతితో
పురోగమన నైజంతో
స్వేచ్ఛను ఆహ్వానించే
స్పందమాన హృదయంతో
అందుకొన్న వేగంతో
తుపాను చర్యను తలపిస్తుంది
స్వేచ్ఛకు పరివర్తన గతి నిస్తుంది

ప్రతి స్వేచ్ఛా నవ భావన
విశ్వాత్మలో భాగం

మానవ చిర సంస్కృతికి
ప్రాణ శక్తి రూపం!

## III. 3

స్వరంలో శబ్ద శక్తితో
దృష్టిలో కిరణ ప్రసారంతో
మనస్సు శశి కళతో
అంతరంగం రవి బింబంతో
మనిషి మనిషే! పోలిక లేదు.
అన్నిటినీ సంకేతించే సంపుటి

మనీషతో మానవ తేజం
హృదయంలో మానుష రాగం
కలిసిన పరిణామ చరిత్ర రూపం
స్వేచ్ఛా లోకానికి సృజన మూలం

పంజరం తలుపు తెరిస్తే
స్వేచ్ఛా శక్తుల హృదయం
వసంత ద్వార మవుతుంది.

అపాయాల్నీ ఆటంకాల్ని దాటి
సూర్యుణ్ణీ చంద్రుణ్ణీ వంచేసి
శిఖర మస్తకంగా మనిషిలో స్వేచ్ఛ!

పంజరంలో ప్రవేశం
ఓటమికి మొదటి దశ
పంజరం నుండి మోచనం
గెలుపుకి మొదటిదశ

## III. 4

వర్తమాన కోణంలో మారిన రూపానికి
ఎప్పటివో ఊహలు పాతవి

తమకు నచ్చిన సైజులో తొడిగీ
అక్షరాల వీధుల్లో త్రిప్పితే
మార్పు ఆగేనా?
తీర్పు చెల్లేనా?
కాలం నిలిచేనా?
సమాజ కథ మారేనా?

నిన్న చెప్పులు ఎరగని కాళ్ళు
నేడు బూట్లు తొడిగి నడుస్తూంటే
అవనిని అవమానించినట్లా?
అవసరానికి పనికి వచ్చినట్లా?
జీవన స్థాయి పెరిగినట్లా?

మనిషి కొక వాదం
వాదాని కొక దృష్టి
భిన్న దృష్టి కోణాలతో
సమాజ సమావిష్కారం.

చెట్టులా పుట్టలా జీవితం
ఎక్కడి దక్కడ నిలిచిపోదు
ఎదురుగా మ్రోడు తాను
శాశ్వత జీవ రూప మనుకొనీ!
చివరు లేదు, పూవు లేదు, పండు లేదు,
శూన్యాకారంలో భవిష్యత్తు కల్పనలో

అపుడపుడూ ఎవరో
ఉత్సవ సమయంలో ఉత్సాహంగా
అతికించిన రంగు కాగితాల పూలు తప్ప!

అటు వెళుతూ వెళుతూ కాసేపు ఆగే పక్షి తప్ప!
తనలో సృజన శక్తి లేంది
స్వేచ్ఛకు వికాస దశ ఎక్కడిది?

## III. 5

యంత్రానికి స్వేచ్ఛ! భ్రమణ పరిమితుల్లో
మనిషిలో స్వేచ్ఛ! విశాల మనో గగనంలో

అసంతృప్తిలో తృప్తిని పెంచుతూ
అపజయంలో జయాన్ని పైకి తీస్తూ
తరం నుండి తరానికి మారుతుంది
స్వేచ్ఛా రూపం! మార్పుకు చిహ్నం

పంజరం తలుపు తెరచే సరికి
కల్పన తొలగి పోతుంది
వాస్తవం ఎదుట కదలుతుంది

ప్రాణానికి భద్రత తొలగీ
నైతిక ధైర్యం వరిస్తుంది.

గోడలు అదృశ్యమవుతాయి
గోడల మధ్య నీడలూ అంతరిస్తాయి
చకితంగా మనో వేది నుండి
వదలిన బెలూన్‌ల వలె కోర్కెలు!

జీవితంలో రహస్య వ్యూహ రచన
బయట పడేది! పంజరం బయటనే
ఒకరిపై పన్నిన వ్యూహం వలలో
ఒక ప్రాణం మరొకరికి తృణ సమం
పొద మాటున పులి కదలే రహస్యం
హరిణం కనిపిస్తే గాని బయట పడదు.

లేత చివురు అందుకోబోయే హరిణం
పొద చాటున పులి కదలే
మర్మర ధ్వని విని
చకిచ్చకితంగా పరుగు తీస్తుంది!
ఎవరి స్వేచ్ఛా నైపుణిలో వారు
ఎవరి జాగరూకతలో వారు

బవులింగ్‌లో
చేతి వేళ్ళ పట్టు నుండి
విడుదలయిన బంతి ప్రభావం
ఇరువురిపై! ఇరువైపుల నుండీ
అవుట్ చేసేందుకు ఒకరికీ
సిక్సర్ పొందేందుకు ఒకరికీ.

## III. 6

విశ్వానికి దిశలు పది
బ్రతుక్కి దిశ లెన్నో
చూపు కొక దిశ మనిషిలో
చూపు లెన్నో దిశలన్నీ

ఆలోచనా దిశను బట్టి
గురి పెట్టిన ఆయుధం
కోణాని కొక లక్ష్యం
మనిషి మనిషి కొక ప్రయోజనం

ఒక దిశ నుండి
విసరే అనల కణాల ప్రశ్నలకు
మరో దిశ నుండి
దూకే అగ్ని శిఖలు జవాబులుగా

సంపదలో సంస్కృతిలో
అహంకార ప్రకటనం ఆయుధం
బల సమూహ ప్రదర్శనలో
అనలమయం రణ చరిత్ర

వీరునికీ కవికీ నదికీ
ఒంటరి తన మసలే లేదు

వర్తమానాన్ని పరుగెత్తిస్తూ
వెనక ఉన్న సమాజంతో వీరుడు

భవిష్యత్తును దగ్గరికి తెస్తూ
ముందు ఉన్న సమాజంలో కవి!

వర్తమానాన్ని భవిష్యత్తులోకి
పరివర్తనలో గమనంతో నది!

వీరునిలో కవిలో నదిలో
ఒక్కొక్క స్వేచ్ఛా ప్రపంచం
స్థితికీ కాలానికీ దేశానికీ
అతీతమైన విశ్వ గుణంతో.

రణంలోకి వెళ్ళే దారి గురించే పథకం కాని
తిరిగి వచ్చే దారి గురించి ఆలోచన ఉండదు.

శిథిల పంక్తి కనిపించినా
విధ్వంసం ఎదురుపడినా
విస్ఫోటం భయపెట్టినా
రణ చరణం ఆగదు!

పంజరాన్ని మరపిస్తూ
ఇచ్ఛా శక్తితోపాటు

క్రియా శక్తితో
స్వేచ్ఛా రూపం! మనిషిలో!

**III. 7**

ఆయుధంలా కదలే పవనానికి
ఆకురాలుతూంది, ఒక్కొక్కటీ!
చెట్టు మూలానికి క్షతి లేదు
బలం లేని కొమ్మ ఒరిగి పడుతూంది

ఏ చెట్టూ విగ్రహ రూపం కాదు
ఏ మనిషీ చెట్టు లాగే బ్రతకడు!

ఆయుధంతో మొదలవుతుంది బీభత్సం
తెలిసో తెలియకో ఏం జరిగినా
క్షమా గుణం అన్నిటినీ సహిస్తుంది!
లేంది! ప్రతీకార జ్వాలలతో నిరంతరం
అగ్ని గుండంలా ఉండేది సమాజం!

సందేహానికీ భయానికీ ఆపదకూ
గ్రహాల్ని సంప్రదించడం తప్పనిదై
అదొక శాస్త్రమయి నెత్తిన కూర్చుంటుంది
మనస్సు పంజరంలో చేరుతుంది.

అడుగు నుండి మస్తిష్కం దాకా
ఉత్సాహ లహరితో చలనంలో
వసుధను తన వశంచేసుకోవాలనీ
జన చరిత్రను ముందుకు నడిపించాలనీ

ఊహ నుండి చర్య దాకా
మనిషిలో అందని స్వేచ్ఛారూపం
ఎపుడో! కిందికి దిగి హఠాత్తుగా
పంజరంలో చేరడం విచిత్రం!

## III. 8

వాస్తవ తలం పయి క్షణాలు
అనల శిఖలయి కదలినా
దారి మధ్యలో మంచులా కరగి
ప్రవాహ మయి తరలినా
వ్రేలాడే పంజరానికి బాధలేదు
పంజరంలో స్వేచ్ఛా రూపానికి పట్టదు.

పంజరంలో పక్షికి
వేళకు  ఆహారం దొరకుతుంది

మధ్యలో ఎవరో చిరు తిండి అందిస్తారు
సుఖకరంగా గడచే ఆ జీవితంలో
పంజరం నుండి మోచనానికి
ఇష్టపడని జీవులూ! ఎందరో!

విశాలాకాశంలో దారి తప్పుతామనో
గగనంలో దూరమై కను మరుగవుతా మనో
సూర్యుని తేజానికి మాడి మండిపోతామనో
మంచులో మాయమై ఏ దిశపోయేమనో
భయం బోనులో పడీ
భద్రతకై పంజరాన్ని వరించేరు

లోపల తిరుగుతూ వలయంలో
తళతళలాడే పట్టు లిప్తలపై అడుగులతో
ముచ్చటగా కమ్ముల్ని లెక్కపెడుతూ
మాటలకూ సందడికీ అలవాటు పడీ
ఇంతకూ స్వేచ్ఛా రూపం!
పంజరం నుండి బయటికి వస్తుందా?

ఒకవేళ వస్తే
ఆవచ్చింది తలచుకొనీ
మళ్ళీ  పంజరంలో వలయంలోకి
వెళ్ళకుండా ఉండేనా?

మనిషి భూమిని మరచినా
భూమి మనిషిని మరవదు
మొదట తన చేతులపయి నడిపించింది
చివర తన హృదయంలో ఇంత చోటు ఇస్తుంది.

## III. 9

లోపలి వేదన తాపానికి
శబ్దం మంచు ముక్కలా కరుగుతూంది
లోపలి బాధల తాకిడికి
శబ్దం శిల్ప భంగిమ వహిస్తూంది

లోపలి మాట
అంతరంగ స్పర్శతో వెడలుతూంది

మౌన శిఖరం నుండి శబ్ద ప్రపంచం
నయాగరాను తలపిస్తూంది
నిస్వానం ఝుంకారం నినాదం విస్ఫోటం
కలిసిన ప్రకటన నవ శక్తితో

సూర్యుడు అంతరించే భయంలేదు
అటు సముద్రంలో మునిగీ
ఇటు పర్వత శిఖరం పయి తేలేను
స్వేచ్ఛా గమన శక్తికి చిహ్నమై

నయన జలంలో జారిన ఆశ
నయన కాంతిలో పైన తేలుతూంది

అగ్నులన్నిటిలో
వేదనదే పై చేయి
రసానుభవాలన్నిటిలో
ఆనందంతోపాటు కరుణదీ
జననం నుండి చివరి దాకా
మనిషిని మనీషిగా విజేతగా
నిలిపే శక్తి భావ ప్రకటన కలనం
బంధన కతీతమై స్వేచ్ఛా రూపం!

దుఃఖంలో సంతోషంలో ఒకటిగా
వెనక నున్న మనో బింబం
పంజరంలో పడనీ చేతికి చిక్కనీ
స్వేచ్ఛా స్పందన గుణ చైతన్యం!

# IV. 1 పంజరం నుండి పంజరంలో

జీవన రణంలో విరామం
సుందరమయిన కల్పనకు దారితీస్తుంది
రిఫ్రిజిరేటర్ నుండి బయటికి తీసిన
ఐస్‌లా ఆలోచన! ఆర్ద్రమవుతూంది
అక్షరాల ప్రవాహ గతితో
జల శక్తిని పొందుతూంది
రసమయ హ్లాదంతో
పచ్చని సృజన ఫాలం చూపుతూంది.

రోజూ ఒక మారు
నిద్రపోయే లోపల ఎపుడయినా
ఆఖరికి కలలోనో
బాల్యంలో సుందరతను చూడాలనీ
బాల్య జగం పొందాలనీ
పచ్చని శాంత హృది చేరాలనీ

తెరచిన పుస్తకంలా ఆకాశం
యూనిఫార్మ డ్రెస్‌లో బడికి వెళ్ళే
పిల్లల్లా మబ్బులు
జ్ఞాపకాల బెలూన్‌లు
విరామాన్ని సార్థకం చేస్తూ

బాల్యంలో స్మృతుల అలల కర చాలనం
లోపల కదలే వేదనకు శామనం

జీవన రణ క్షేత్రంలో
పొందలేని స్నేహ రస స్పర్శతో
కల్పన నుండి వాస్తవానికి చేరుస్తూ

## IV. 2

ఈ రణ క్రియలో నిజం
ఎడారిలో మంచి నీరు చెలమలా
వెదకుతూ పోవలసిందే,

ఈ పథ గతిలో నీతి
దూరాన మిలమిలలాడే మరీచికలా ఉంది

హంతకుడు తప్పించుకొని పోయేను
ముందు కొచ్చిన సాక్షి! అనుమానంలో పడేను
రణ సమాప్తికి ముందే!
విజయ రేఖ ఫిక్స్ అయిపోతూంది.

నిర్ణాయక సమయానికి ముందే
ఉత్సవాని కన్ని ఏర్పాట్లూ! జరిగేను

రేపటి భద్రత కయి
ఈ రోజు యంత్రంలా మారుతూంది
ఆయుధ తంత్రమై మనిషి
ఎవరిపై ఎపుడు ప్రేలేదీ తెలీదు

కష్టమూ బాధ రెక్కలపై
ఎగిరే మనో విహగం
వైరం స్నేహం స్వార్థం త్యాగంతో
జీవితాన్ని నాల్గు దిశలు తిప్పుతూంది

ఏ మజిలీ లోనో
ఏ స్టేషన్ లోనో
లగేజి వదలడం కుదరదు
ఏదో విధంగా వెంట రావలసిందే
పుట్టుకతో వచ్చినవీ

ఆ తరువాత చేరినవీ
బరువనీ వదలబడవు, వదలవు!
మనిషికి  అస్తిత్వంలో భాగమై పోతాయి!

**IV. 3**

స్వేచ్ఛగా ఏ రాయి అడ్డు లేకుండా
బావిలో నీరు ఊరితే సరిపోదు
ఆ నీరు పైకి తోడేందుకు
తాడూ బొక్కెన అవసరం

దారిలో దాహం చంపేస్తుందనీ
బావి చుట్టూ తిరిగితే నీరు లభించదు

తాడూ బొక్కెన లేకుండా
తాగేందుకు చాచిన దోసిలిలో
బావిలో నుండి నీరు
పైకి ఎగసి పడుతుందా?

నింగిలో మబ్బు తేలి
నీరు ఇలకు జార్చేనా?
దాహం తీరేనా?
అమృత స్పర్శ అలరేనా?
చెంపల్ని తాకే వాన చినుకు
పెదవులపై జారి దాహం తీరేనా?
జీవన రణ చలనంలో
విషమ ఘట్ట సమయంలో
ప్రజ్ఞా గుణ సాధనాలతో
శూన్యానికి పూర్ణత సాధ్యం

**IV. 4**

ఆకాశాన్ని తన వీపు పయి
ఎగరేసుక పోవాలనీ పక్షి

విశ్వంభరను తన చేతులలో
ఆడిస్తూ సాగాలనీ మనిషి!
ఇరువురి ఆశలూ అందనివే
అందని దూరం లోనే ఎప్పటికీ

ఊహలో కదలే సర్పం
మనిషి చర్యలో బింబిస్తుంది

మనసులో పురి విప్పిన నెమలి
మనిషి మూర్తిలో ప్రతిఫలిస్తుంది
ఒకటి ఒక రూపానికి వ్యతిరేకంగా
మరొకటి! ప్రతిచర్యా రూపంగా

అంతర తేజంతో తపిస్తూ ప్రతిరోజూ!
శుభ్రమయిన రూపంతో మనస్సు
అమృత కలశమయి అవతరిస్తుంది

దీని కోసం చాచిన చేతులెన్నో
నిరీక్షణలో గడిపే ముఖాలెన్నో
అనుభవ దశ ఎరగని బ్రతుకులతో

గిరి శిఖరంపై ఎగిరే విమానంలా
లోపల ఊహకూ
ఎగిరే పక్షిపై గురిపెట్టిన ఆయుధంలా
బయట చర్యకూ
మనిషిలో స్వేచ్ఛ! అనంతంగా అనియతంగా

## IV. 5

కోరి వసించే పంజరం నుండి
స్వేచ్ఛా రూపాన్ని బయట పడేసే
విషాద ఘటన!

ఒకరోజు ఉదయ సమయం
హఠాత్తుగా! అస్తమయం ఎదురవుతుంది

అడుగు క్రింద భూమి కంపిస్తున్నట్లు
భూమి పయి శరీరం తేలుతున్నట్లు
కదలే కాళ్ళు హఠాత్తుగా ఆగిపోతున్నట్లు
చూపుల్లో దిశలు ఊగిపోతూన్నట్లు
రాలే ఆకుల్లా ఆలోచనలతో
శరీరం చిరు తరువును తలపిస్తూంది

కను రెప్పలు వాలబోయే స్థితిలో
దూరం నుండి సన్నని చీకటి ఎదురై
చేయి కలిపి నడవ జూస్తూంది!
మనిషిని తనలో కలుపుకో జూస్తుంది

మనసు హిమ శిలయై నిశ్చేష్టంగా
వేదనలో కరగి బాష్పకణం జారుతూంది
పొంగి పొరలబోయే ఆర్తిని
లోపల ఉన్న మరో మనిషి
తన చేతుల్ని చుట్టి చుట్టూ
అడ్డు కట్టగా నిలిపేను

కాలం ఆగి ఆగి మెల్లగా నడుస్తూంది
కాలికి దెబ్బ తగిలిన అశ్వంలా
అడుగులు నిలిచి నిలిచి పోతున్నాయి
పెట్రోలు అయిపోయిన కారులా
నడక ఆగిపోతూంది

వ్యథాఘాతానికి గజగజలాడే చెట్టులా
బాధా ప్రహారానికి ముక్కలయ్యే ప్రతిమలా

సమయం ఆశ్చర్యంగా
విపరీత దృశ్యాన్ని పొందుతూంది

లోపల ఉన్న మరో మనిషి శక్తి
వాలే మనశ్శిఖరాన్ని నిలుపుతూంది
నయన దృష్టి కతీతమయిన
శక్తి రూపం మనిషిలో
లోపల సూర్య కిరణం
తెరచిన ద్వారంలా
ధైర్య శక్తి ప్రవేశానికి
వెలుగు దారి చూపుతూంది

పరిచితులూ అపరిచితులూ బంధువులూ మిత్రులూ
మినీ సమాజ దృశ్యం! గుండెకు బలాన్ని ఇస్తూంది

తప్పని జన సమూహ బంధంతో
సమాజానికీ విషాదవార్త బాధామయమే

తెగని మనో గుణ సూత్రంతో
వ్యక్తికీ సమాచారం వృథా భరమే!

ఈ సమయంలో దూకిన అస్తమయం
హృదయాన్ని శిశువుగా మారుస్తూంది
గుండె పగిలి ముక్కలై
గగనంలో చుక్కలయి తేలేనా?
ఊహ మండి బొగ్గై చెదరి
నింగిలో మబ్బులయి తరలేనా?

ఏ ఆదర్శంలోనో ఒదిగి
ఆలోచన ఆర్ద్రశిఖరాల్ని పొందుతూంది

ఏ మానవ బంధంతోనో ముడివడీ
అనుభవం అగ్ని ముఖాన్ని వహిస్తూంది

విధి విహిత జీవిత దృశ్యం
విషాదమయ మయిందీ

స్వేచ్ఛా సమాజంలో
విశ్వ బంధుమయ మయింది

ఈ శోక తప్త లిప్తల్లో
ఏ బంధువో, మిత్రమో ఆఖరికి అపరిచితుడో
ఏ కవి అయినా నాయకుడయినా త్యాగి అయినా
జీవిత చరిత్రలో అతని పాత్ర
మృత్యు యశో రూపానికి
అలంకార మవుతూంది
ఈ ఉదయ విషాద సమయం
స్మృతి శాలలో ఒక చిత్రమయిపోతూంది

## IV. 6.1

పంజర మెరగని ఒక స్వేచ్ఛా రూపం
ఉంది మనిషిలో మనో మయం,
తెల్లని కాగితంలా శుభ్రమయి
చదరంగపు  గడుల కతీతంగా

బంధన మెరగని ఒక స్వేచ్ఛా హృదయం
ఉంది, సృజన కిరణ వాస్తవమై మనిషిలో
రెప రెప లాడే కొత్త దనంతో
ఆలోచనకూ అనుభూతికీ ప్రేరణయై

ఎగిరే పక్షుల బారుల లానో
కదలే సైనిక పంక్తుల వలెనో

అక్షరాలు పద సమూహ శ్రేణులతో
సమాజ దశల కొక రికార్డుగా

పయనించే రైలులా వాక్యంతో
ఎగిరే విమానమొక పెరాగ్రాఫ్‌తో
అనుభూతుల్ని మాట్లాడిస్తుంది
ఆలోచనలకు దారి చూపిస్తుంది
చరిత్ర మౌనాన్ని వదలిస్తుంది
మానవాళి కంకితమయి బ్రతుకుతుంది

ఏ గీత పడని కాలానికి
ఒక స్వచ్ఛ మయిన హృదయానికి
ప్రతినిధియై కళ్ళముందు తెల్లని కాగితం
స్వేచ్ఛా రూపాన్ని వరిస్తుంది

అక్షరాల్ని లెక్క పెడుతూ
పంక్తుల్ని పేరుస్తూ ఇటుకల వరసలా
చేసె హంగామా కాలక్షేపం
సృజన స్వేచ్ఛకు భంజకం

అక్షరాల్ని గాట్లతో గాయాలతో
తెల్లని కాగితంపై వదలడం
స్వేచ్ఛా రూపాన్ని బలవంతంగా
పంజరం లోకి నెట్టడమే!

## IV. 6.2

పంజరం మాటే లేని స్వేచ్ఛా రూపం
స్వచ్ఛమయిన తెల్లని కాగితం పయి
ఒక పదం నుండి మరో పదానికి
కుసుమ విహగంలా ఎగురుతుంది

ఒక పంక్తి నుండి మరో పంక్తికి
విద్యుదశ్వంలా దుముకుతుంది

కాగితం పయి అక్షరాలు
చరిత్రకు సాక్షీ భూతంగా
పంజరం గురించి తెలీని కాగితం
స్వేచ్ఛా సాధనానికి ప్రతీకగా

రచనా క్రియలో ప్రవాహమై
అర్థ ఫలంలో లహరులతో
వ్రాతలలో దృశ్యాలతో జీవితమై
దిగుతుంది ఒక స్వేచ్ఛా జగం

రక్తంలో పడవలా పయనిస్తుంది
గుండెలో సూర్యునిలా వెలుగుతుంది

వేసే అడుగుల్నీ చాచిన చేతుల్నీ
హృదయ స్పందననూ మేథా ప్రజ్ఞనూ
విజ్ఞాన వికాసాన్నీ వివేక ప్రకాశాన్నీ
గతిలో లయలో కలుపుతుంది

అణువణువూ ఆపాద మస్తకం
సమాజ శక్తి బింబంతో
స్వేచ్ఛా రూపం తెల్లని కాగితంపై
విశ్వ హృదయ దర్శనంతో!

## IV. 6.3

పంజరం ఎరగని స్వేచ్ఛాజగం
అమాయక శిశు ముఖంతో
అందరినీ మురిపింప జేస్తుంది
పరిణత వాలకంతో
ఎందరినో వికసింప జేస్తుంది.

న్యాయమూర్తి నిర్ణయంలా
మూతపడిన కళ్ళను తెరపిస్తుంది
పెద్ద మనిషి తరహాలో
అందరికీ ఆత్మీయాన్ని ప్రసాదిస్తుంది.

బాధల్ని వెనక్కి నెట్టి
ఆశలకు పూలు పూయిస్తుంది
వాస్తవ శక్తులు చిమ్మే
అగ్ని శకలాల్ని గుర్తిస్తుంది
కల్పనా దృశ్యం చూపే
అలల ఆర్ద్రతను స్పృశిస్తుంది

ప్రవాహంలో మునిగీ కొట్టుమిట్టాడే
సమస్యల్ని గట్టుకు ఆహ్వానిస్తుంది
అనుకోని మలుపులు తిరిగే
సమాజాన్ని హేతువుపై నడిపిస్తుంది
అరణ్యంలో చిక్కిన పథికులకు
సరి కొత్త దారి చూపిస్తుంది

జీవిత రణంలో స్వేచ్ఛా రూపం
మిగులుతుంది శాంతి పథ చిహ్నంగా

స్వేచ్ఛ కొండలా నిలిచి పోదు
నదిలా ప్రవహిస్తుంది, దాయితూ
పొదలూ రాళ్ళూ దిబ్బలూ కొండలూ
తెల్లని కాగితంపై అక్షర పంక్తిలా.

## IV. 6.4

సమాజావసరాలకు చారిత్రక పాత్రతో
మనిషి నుండి మనిషికి స్వేచ్ఛా సంపద నందిస్తుంది

ఒక వైపు నుండి
మనిషిలో ఎగసిన మంటలకు
లేచిన పొగతో మసి బట్టిన
యశో రూపానికి పడే మచ్చతో
శిశువు బుగ్గ పయి కాటుక చుక్కలా
నింగిలో శశాంక బింబం!
ప్రయాణ వాహనం క్రింద
ప్రయాణికుడు పడీ నలిగి పోవడం
మహాదారుణం!

కలం పాళి చివరి మొనతో
తెల్లని కాగితం భ్రష్టం కావడం
ఆయుధం చివరి పాయెంట్ నుండి
పచ్చని స్వేచ్ఛ భగ్నం కావడం
మహా ప్రమాదం!

## IV. 7.1

రేపటి ఆకలి తీరే పనిలో
ఈరోజు నాగలి నిమగ్న మవుతుంది

ఆకలి వేస్తే మనిషికి
పొలంలోకి నడిపిస్తే
దాహం వేస్తే మనిషికి
నిర్ఝరిణి తటికి కదలిస్తే
సమస్య తీరేనా?
చతురత అనిపించేనా?

సమస్య ఎదురయితే
తలపై దింపి చరిత్రను
నలువైపుల నుండీ సూక్తులు

ప్రకటిస్తే నినదిస్తే సరిపోయేనా?

జీవన రణ చిత్రం మారేనా?
స్వేచ్ఛాదర్శం మెరసేనా?

గమ్యంలో నడకకు
మొదలు ఉంది చివర ఉంది
మొదలూ చివర లేనిది
ఒక స్వార్థ చరణ పంక్తికే

రవి కిరణానికి పూవు నవ్వుతుంది
రవి తాపానికి ఇసుక మండుతుంది
ఇవి రెండూ ప్రకృతిలో పార్శ్వాలు
రాగంగా కోపంగా మనిషి మనసులో

## IV. 7.2

కత్తుల్ని నూరే చలి
నిప్పుల్ని చిమ్మే ఎండ
కవిలో వీరునిలో ఒకటవుతాయి
నిశిత జ్వలన భావనగా

చెరువు చుట్టూ మేడలు
కరువు చుట్టూ ముఖాలు
మేడ పయి ముఖాలు వెన్నెలలో
మేడలో ముఖాలు ట్యూబ్‌లైట్‌లో

గాంధిజీ విగ్రహం ముందు
నిరసనలూ నిరశనలూ
శాసన సభ సీటు నుండి
ప్రహసనాలూ, ప్రఘాతాలూ

ధూమమూ మేఘమూ
ఒకటిగా కనిపిస్తాయి
ఒకటి శపిస్తుంది
మరొకటి దీవిస్తుంది

శిశువు ముఖంలో
భవిష్యత్తు కుసుమిస్తుంది
వృద్ధు ముఖంలో
గతం పరిమళిస్తుంది

సముద్ర యానంలో
మంచి నీరు పాత్రలా
జీవితంలో కవిత్వం
మనిషి మనసుకు అవసరం

కవిత్వంలో దారి తప్పిన మనసు
తిరిగి తిరిగి చిట్ట చివరకు
వచనంలో తేలుతుంది
ఇబ్బంది లేని మైదానంలో
తనకు పనికి రానిది వదలేసే
స్వేచ్ఛకు సంకేతంగా.

## IV. 8

ఒక స్మృతిలో స్వేచ్ఛా రూపం
బింబిస్తుంది సమాజ హృదయం
నిష్పందనలో శిల్పంగా దేవతగా
ఆకర్షణలో శక్తితో లహరియై
తెలియకుండా మాట్లాడకుండా చేస్తుంది
మనిషిని మౌన వాద్యంగా మారుస్తుంది.

ఒక స్మృతిలో స్వేచ్ఛా రూపం
చిత్రిస్తుంది సమాజ హృదయం
మహాబోధి తరువయి పరచుకొనీ
దిశల్ని దగ్గరగా తీసే చేతులతో
హత్తుకొనీ మాట్లాడకుండా చేస్తుంది
మౌన పంజరానికి చేరుస్తుంది

ఒక స్మృతిలో స్వేచ్ఛా రూపం
సూచిస్తుంది సమాజ హృదయం
మీనార్ అయి నిలిచి నిలువునా
గగన తలం వైపు మస్తకంతో
దూరమయి మాట్లాడకుండా చేస్తుంది
మౌన శిఖరం పయి నిలుపుతుంది

ఒక స్మృతిలో స్వేచ్ఛా రూపం
శబ్దిస్తుంది సమాజ హృదయం
బహు పురాతన గ్రంథమై ఎదురయి
పుటల్లో రహస్యాల్ని దాచుకునీ
అమాయకంగా మాట్లాడకుండా చేస్తుంది
మౌన సరోజలం పయి కదిలిస్తుంది

ఒక స్మృతిలో స్వేచ్ఛా రూపం
తన హృదయం తెలిసేందుకు
ఒక చేతిలో పుష్పంతో
స్వాగతమిస్తుంది
ఒక చేతిలో దీపంతో
రాత్రి దారి చూపుతుంది.

ఎదురుగా దారిలో కనిపించే
శిల్పం తరువూ మీనార్ గ్రంథం

మాట్లాడాలనీ ఎప్పటిదో కోరిక
ఎందరికో జీవితంలో! తీరనిదై
అందరికీ అన్ని వైపుల నుండీ
ఎవరికీ అందని అంతర్జగత్తుతో

ఎవరికి వారు! తమ వైపే చూచేననీ
తమ హృదయంలో హృదయమనీ
పట్టరాని విశ్వాసంతో
అది అంతా ఇంతానా? ఆకాశమంత!

ఆకాశ మంత అండ క్రింద
హత్య చేసిన వాడూ
హత్య చేయబడే వాడూ
సాక్షియైన సామాన్యుడూ
న్యాయానికి అధిపతీ, ఆచార్యుడూ
స్వేచ్ఛా బిందువుల నుండి
నాలుగు రేఖలతో కలిసీ
జీవిత చిత్రం రూపొందేను
ఎవరి రహస్యం వారిది!

స్మృతిలో భద్రంగా
ఒక స్మృతిలో స్వేచ్ఛా రూపం
వసంతం సిగ్నేచర్‌తో అవతరిస్తుంది

ఒక స్మృతిలో స్వేచ్ఛారూపం
హత్యానేరంతో ఎదురవుతుంది.

## IV. 9

పర్వతాల ప్రభుత పంజరం నుండి
శిలల నిరంకుశ శిఖరాల్ని దాటి
స్వేచ్ఛా రూపం మహా నది అయి.

ప్రశ్నించే మనిషికి జవాబుగా
పైరు పంట పచ్చదనం మధ్య నిలుపుతుంది.
మధ్య మధ్య శిలా శ్రేణుల శృంఖలాల్ని
వదలించుకొనీ ముందుకు సాగుతుంది.
ఇపుడు జల సంగీతం వినిపించదు
జన సమూహ నినాదాలు ధ్వనిస్తాయి.

వర్తమాన తలం పయి అలల్లా
కదలే మనుషుల మహా దృశ్యం
మారే సమాజ నవ రూపాలతో.

ప్రశ్నలు మారతాయి
జవాబులు వేరవుతాయి.
ఎప్పటికీ మారనిదీ
మనిషి మనో రూపం! ఒకటే.

మార్పుకు మరో పేరు చరిత్ర
చరిత్రకు ప్రతి రూపం మహానది.
ఉత్సాహానికి మారు పేరు రవి కిరణం
ఉదయం సమాజ స్వేచ్ఛకు ఆకృతి నిస్తుంది.

వీపు పయి పుస్తకాల బాగ్ తో
అడుగులు వేసే స్కూలు పిల్లలూ
బుజాన నిలిపిన పని ముట్లతో
అడుగుల వేగంతో శ్రామికులూ

మహా నదిని చూస్తూ ఉంటే
మనిషికి దాహం వేయదు.

కవిత కదలుతుంది సరిస్తుంది
లోపల సమాంతరంగా.

మృత్యు భయం లేని జీవ నదిని
చండ మయిన గ్రీష్మంలో
మృత్యువు తేలిగ్గా సమీపిస్తుంది.

గాలికి పైరు జాలు లా
ఒక పక్కకు వాలి కదలే
అలల అమృత స్పర్శకు
పరవశ మయి తేలి పోతుంది.

మహా తపానికి నీరు తగ్గి
బయట పడిన ఇసుక తిన్నెలు
ఆర్ద్ర హృదయంతో
వృద్ధ బంధువుల్లా
వాత్సల్యం ఒలుకుతాయి
అనురాగం అందిస్తాయి.

మహా నదికి చెరొక వైపు
తేజంతో సూర్యుడూ
హ్లాదంతో చంద్రుడూ!
చెంపల్ని నిమురుతూ గాలి!
మధ్య విరాట్ రూపంతో మనిషీ!

శూన్యం వదలి శూన్యం లోకి
పూర్ణ మయి బింబ మయి
అలల పయి మనో రూపం!
స్వేచ్ఛగా స్వేచ్ఛలో స్వేచ్ఛకై

రాత్రి నది పయి బ్రిడ్జి పైన
పరుగెత్తే రైలు లో నుండి
స్వేచ్ఛా జలాల పయి దీపాల వెలుగులు
పంజరం నుండి పంజరానికి ఆశా రూపాల్లా

స్వేచ్ఛా కవిత్వం

రెండవ భాగం - 15

# పునర్దర్శనం

మాదిరాజు రంగారావు

**2009**

రసధుని సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 500 028

*Presented to*

my daughter

***Mrs. Haritha Devulapalli***

M.A. (Lit.)

Michigan U.S.A.

**on her Birthday 2-1-2009**

**with**

**blessings & best wishes**

## సూచిక

I. జలాల మధ్య ఆదర్శం........................ 07

II. వర్తమాన ప్రజాస్వామ్యంలో................. 14

III. అహం నుండి ఆయుధం.................. 20

అక్షర స్వేచ్ఛ................................ 25

IV. జ్ఞాపకం మెరపులో......................... 28

V. వాస్తవ దృశ్యాలు ............................ 34

VI. గాయంతో కాలం.......................... 45

# ఆలోకనం

పునర్దర్శనం కృతిలో వర్తమాన కాలంలో మనిషి 'అస్తిత' (existence) ప్రధానంగా చిత్రిత మయింది. అందువల్ల వర్తమాన సమాజంలో మనిషి ఉనికిలో నిజ స్థితినీ వాస్తవ రూపాన్నీ భావింప జేస్తుంది. తెలుగులో అస్తిత్వం (existence) అన్న మాట ఆధునిక యుగంలో ప్రాముఖ్యాన్ని పొందిన అస్తిత్వ వాద (existentialism) విస్తృతినీ విశిష్టతనూ పొందింది.

ఈ కృతిలో వర్తమాన సమాజ చిత్రం నిఖిల మానవ భూమికపై భావితమయింది. వ్యక్తిలో మనో రూపంతో ఆవిష్కృతమయింది. లౌకిక జీవితంలో మనిషి ఉనికి భౌతిక మానసిక స్థాయిల్లో వివిధ పార్శ్వాలూ 'అస్తిత'లో కనిపిస్తాయి. ప్రకృతి నేపథ్యంలో యథార్థ జీవిత స్థితులూ ప్రజాస్వామ్య భావనా లక్ష్యంతో కనిపించే స్థితి పునర్దర్శనంగా భావితమయింది. భౌతిక తలం పయి వర్తమాన సమాజంలో రోజూ విన్నవీ చూచినవీ చదివినవీ చింతనలో మెదలినవీ ఆయా సందర్భాల్ని పురస్కరించుకొని సన్నివేశ నిర్మితుల్ని పొందాయి. ఈ సందర్భంలో స్వేచ్ఛ పేరుతో ఆచరణలో పొందుతూన్న విపరీత స్థితులూ వికార ధోరణులూ దృష్టికి వస్తాయి. జీవితంలో భాగ్యంలో సంపద చేత ఉల్లాసం భోగం ప్రధానంగా ఉన్న hedonistic వైఖరీ, పతనమయ్యే నైతిక మయిన విలువలతో decadent ధోరణీ ప్రబలుతూన్న వాతావరణమూ సూచితమయింది. ఈ అంశం ఇందులో కవితాత్మకంగా ధ్వనితమయింది.

సమాజం అంతా ఎల్లవేళలా బాగా ఉండకపోవచ్చు. ఆలా ఉండే వీలూ లేదు. కాని నిరంతరం అసలే బాగా లేక పోవడమూ కనీస స్థాయిని అందుకోలేక పోవడం చింతనీయం. మితి మీరిన ఉద్ధృతీ ఉపేక్షణీయం కాదు. వ్యక్తి స్థాయిలో సమాజ స్థాయిలో ప్రజాస్వామ్యంలో పనిచేసే వివిధ భాగాల్లో ఆలోచనలో ప్రవర్తనలో ఆదర్శంలో కొన్ని ప్రమాణాల్ని పాటించవలసిన అవసరాన్ని భావింపజేస్తుంది. సమాజంలో వాతావరణం సబ్‌హ్యూమన్ స్థాయికి దిగజాదరడమూ బాగా గమనించవలసిన విషయం.

పునర్దర్శనంలో వస్తుగతమయిన అస్తిత మనిషి ఉనికికి సంబంధించిన విషయం విశాలమైన క్షేత్ర పరిధి కలిగింది. దిశలో "ఉపదిశలెన్నో", – మనిషి తేజాన్ని

భ్రమింగాలనుకునే "రహస్యచ్ఛాయలెన్నో! అయితే అంతరంగం వెలుగు వైపు పయనింప జేస్తుంది.

అస్తితలో (1) positive ఆశాభావ / సృజన / నిర్మాణ / కోణంలో వ్యక్తి – సమాజం పరస్పర సంబంధంతో ఉత్తమ స్థితిని కోరడం సహజం.

అస్తితలో (2) negative నిరాశా భావ / నిరాకరణ / విధ్వంస / రూపాలతో ప్రస్తుతం ఉన్న స్థితినీ భావింపజేస్తోంది. ఈనాటి సమాజంలో వ్యక్తీ – సమాజం స్థాన బిందువుల నుండి ప్రజాస్వామ్య భావన లక్షిత మయింది. ఏది మంచిది ఏది చెడు అన్నది సూక్ష్మ స్థాయిలో చాలా క్లిష్టమయింది. చాలా వరకు ఈ భేదాన్ని వివేకం గుర్తిస్తుంది. వివేచనకు అందుతుంది. అంతరంగానికి తెలుస్తుంది. ఇది దృష్టికోణాన్ని బట్టీ నేపథ్యాన్ని బట్టీ ప్రస్తుత స్థితిని బట్టీ ఏర్పడేదయినప్పటికీ పరిస్థితులు విషమించకుండా చూచే శక్తి మనిషిలో ఉందనే విశ్వాసం, సమాజంలో గుణాత్మకమయిన మార్పుకు దోహదం చేస్తుంది.

**వస్తు పరంగా సమాలోచనానికందే అంశాలు**

1. వర్తమాన పరిస్థితులూ సమాజం తీరు తెన్నులూ
2. వాస్తవానుభవంలో జీవిత చిత్రణం, అన్వేషణంలో దర్శనంతో కూడిందీ.
3. భౌతికమయిన పునాది (ఆధారం) నుండి మానసికాన్నీ, మానవీయ భావాన్నీ కలిగిందీ. ఉన్నత వ్యక్తిత్వాన్నీ ఉత్తమ సమాజాన్నీ కోరేదీ.
4. లౌకిక జీవనంలో మానవ సంబంధాలతో ప్రజాస్వామ్య దార్శనికత కలిగిందీ. రచన 1) కథన భాషణ పద్ధతుల్లో 2) సన్నివేశ నిర్మితుల్లో ఏ ఖండానికది ఒక పూర్ణ రూపంగా మొత్తం మీద విశాల ప్రాతి పదికపయి సమన్వయ రూపాన్ని పొందింది. స్వేచ్ఛా కవిత్వంలో "పునర్దర్శనం" (అస్తిత) సమకాలీన చింతనతో మానవీయ భావనతో జీవితంలో వాస్తవ రేఖలతో ప్రజాస్వామ్యదర్శనంతో కూడింది. ప్రక్రియా విస్తృతికీ పేర్కోదగిన అస్తిత్వానికీ దోహదం చేస్తోంది. 'అస్తిత'లో మానవ జీవిత రూప చిత్రణం – దీని ప్రత్యేకత. కవిత్వ విషయంలో ఒక్కొక్కరి స్పందనం ఒక్కొక్క విధంగా ఉంటుంది. అభిలాషలో అనుభవంలో అవగాహనలో వివేచనలో భిన్న కోణాలూ స్థాయి భేదాలూ ఉంటాయి. ఒక పొర నుండి ఒక్కొక రూపం అనేక కారణాల వల్ల ఆసక్తిని పెంపొందిస్తుంది. సృజన విశిష్టత కూడా ఇదే.

**– మాదిరాజు రంగారావు**

# I. జలాల మధ్య ఆదర్శం

### మనిషి మనిషిలో

I.1. మనిషి మనిషిలో అస్మిత
భిన్న మనో మూలాలతో
వివిధ భావ ప్రభావాలతో
బహు విధాల సమీకరణాలతో

ఇష్టం లేంది జరిగితే కలవరం
అనుకుంది జరక్కపోతే పలవరం

అవసరం ప్రవాహంలో మునక వేయిస్తూంది
ఈద గలిగింది తీర భూమి చేరుతుంది
బయటికి రాలేంది జలాల్ని నిందిస్తుంది
శ్రమతో ఉపాయంతో బయటికి రాక తప్పదు

పుట్టుక నుండీ మనిషిలో జీవ నది
కనిపించే తీరాలతో కనిపించని లోతులతో
జీవితమంతా చేతనకు రూపమై సరిస్తూ,
క్షామం దూరం అయ్యే పనిలో
ఆలోచనల్ని హరితమయం చేస్తూంది
పగలూ రాత్రి భేదం లేదు
ఎక్కువ తక్కువ భావం లేదు
తీరాన్ని చేరడ మొక పని అయితే
జలాల లోకి ప్రవేశించడం మరో పని
లౌకిక జీవనంలో సమయం దొరకడ మొకటీ
నదీ జలాల్ని చేరే సంకల్పం మరొకటీ.

## నిరంతరం

I.2. ఆకాశం పాతది ఎప్పటిదో?
ఈ విశ్వం పాతది ఇప్పటిదా?
శరీరం అదే! పుట్టినప్పటిదీ
జీవ సార ప్రసారంతో రక్తంలా
వర్తమాన సమాజంలో నిరంతరం
పాతది పోతుంది
చరిత్రలో చేరుతుంది
స్మృతిలో మిగులుతుంది
కొత్తది వస్తుంది
అనుభవాల లహరులపై

బ్రతక డాని కవసరమయింది
ప్రకృతి నుండి దొరకుతుంది
మనిషి చూడ లేని నిజాన్ని
అంతరంగ రశ్మి చూపుతుంది

ఇంట్లో బయట ఒంటరిగా సమూహంగా
మనిషిలో మరో మనిషి సమాంతరంగా
చూపులో మాటలో ఆలోచన వర్తనలో
సృజన యాన చేతనలో మానవీయ రూపం!

## ఎక్స్‌రే దృష్టి

I.3. మార్నింగ్ వాక్‌లో
చరిత్ర కారుని చూపు పడుతుంది
ఒక దిశలో ఒక కోణంలో

వీధి చివర గుడిసె నుండి
ఆరోజు బరువు మూటతో

జీవన మరీచి పయి తేలుతూ
ఎదురు పడే బడుగు దృశ్యంపై

ఎదురు పడే మౌన రూపం
అనుకోని ప్రశ్నల్ని సంధిస్తుంది

సమాజ వికాస భూమికల్లో
ఎంత గొప్ప గానో చెప్పుకునే నాగరకతలో
ఇంకా అడవి దాటని జీవితాల్లో
తెరవని తలుపులు గురించీ
బాణాల్లానో మినీ మిసైల్స్ లానో
తాకేట్లు అనిపించీ నిశ్శబ్దంగా
తాక కుండానే వెళ్ళిపోతాయి

సమాజ హారం నుండి ఎపుడో
తెగి పడిన అమూల్య మణి
దుమ్ములో అణగి మణగి ఉంది
గుర్తించేందుకూ బయటికి తీసేందుకూ
పట్ట పగలు టార్చ్‌లైట్ ముఖ్యమవుతూంది
లోపల దాగిన నిజం తెలిసేందుకూ
"ఎక్స్‌రే" దృష్టి అవసర మవుతూంది.

## సరికొత్తగా

**I.4.** ఎటువైపు? ఎక్కడికి?
కాళ్ళు వెళుతున్నాయి అంటే
అవకాశం సూచిస్తుంది
అవసరాలు నడిపిస్తాయి

గమ్యంలో మారే దిశలో
కనిపించే దృశ్యం వేరవుతుంది

ఏ కల్పనకూ అవకావం లేదు
ఏ రహస్య ప్రకారమూ లేదు

తెలిసిన వ్యక్తి నుండి తెలియని వ్యక్తికీ
తెలిసిన చోటు నుండి తెలియని చోటుకూ
శిఖరం నుండి శిఖరానికి పథ పథంలో
సమాజ చలనంలో మారుతుంది భూమిక!

రోజు కొసలు రెండూ కలిసి
కాలం మెడలో హారమవుతుంది
క్షణాల పూలతో దండ తృప్తి నిస్తుంది
స్వర్ణ హార మయితే సంపదలో భాగం!

రోజు చివరి పంక్తి క్రింద
సిగ్నేచర్ తప్పదు ప్రతిరోజూ
నమూనా మాత్రం! ఎప్పటిదో
రోజు రోజుకొక పుట! సరికొత్త విషయంతో.

### మొదటి కిరణ స్పర్శతో

**I.5.** తెల్ల వారుతూనే
లోపలున్న శాంత రూపం
మంచు బొమ్మలా కరగి పోతుంది

కిరణం ప్రేరణయై ఉత్సాహ లహరికి
లిప్తల వేగంతో జీవితాన్ని పరుగెత్తిస్తుంది

ఈ రోజు నిన్నయై మొన్నయై గతమై
చరిత్ర చక్రాల్లో ఒకటయి పోతుంది
విరామం ఎరగని కాలానికి సంకేతం
గడియారం రెండు చేతుల్నీ అందిస్తుంది

స్వార్థంలో మలిన మనో రూపం
పోటీ అందాన్ని వికార పరుస్తుంది
పోటీ లేని జీవితం లేదు
ఇది సమాజ చలనంలో భాగం

అసలు రూపాన్ని మ్రింగాలనుకునే
నీడలూ క్రీ నీడలూ పొంచీ
నీరు పోసిన మల్లె తీగ పాదులో
కప్పల కయి చేరి రాత్రి! ఆహారించీ
చల్లగా మత్తుగా చుట్టు కొన్న సర్పం
మొదటి కిరణ స్పర్శతో మాయమవుతుంది.

### విగ్రహ తేజం

**I.6.** ఉదయ సమయం
ట్యాంక్ బండ్‌పై నడుస్తూ ఉంటే
జలాశయం పయి చూపుతో
మనస్సు ప్రవాహ తలంపై తేలుతుంది.

సాయం సమయం
క్రాస్ రోడ్ దాటుతూ పోతూంటే
గళ్ళలో పావులా జన వాహనాల మధ్య
మనస్సు ఊరి బయట కాలి బాట నడుస్తుంది.

అడవిలో అవతరించిన ఊరు పెరిగి
ఊళ్ళు కలిసి విశాలమై నగరమై
అడవిని కాస్త కాస్త మ్రింగుతూ పోతూ
మనిషిలో అడవి చోటు చేసుకుంటూంది

జలాశయం మధ్యలో వేదికపై విగ్రహం
కదలే చిరు అలలతో ఆకర్షణ రూపం

ఏ కర స్పర్శకూ వీలు లేదు
జన సంగతి కవకావం లేదు
కల్పన పొందిన శిల్ప వాస్తవం
మెట్లపై కెగసి జారే కెరటంలా
ఆలోచన! ఒక దాని వెంట మరొకటి!

ట్రాఫిక్ కోలాహలం లోనూ
పదును మొనతో ఆర్త స్వరం
ఎక్కడి నుండో పరుగెత్తుక వచ్చి
అభయ హస్తాన్ని స్పృశిస్తుంది
అడుగుల పయి నుండి జారి
నీటిలో కలసి పోతుంది

జలాశయం చుట్టూ భోగ సంపద పథంలో
చుక్కల్ని మాయం చేసే దీపాలెన్ని ఉన్నా
దారిన వెళ్ళే మనిషి ముఖంలో చీకటి
ముడుచు కొనీ అట్లాగే ఉంది, ఎప్పటిదో

దీన్ని తొలగించే ప్రకాశంపై ఆశ
ఎక్కడి నుండో
విగ్రహం చుట్టూ తిరుగుతూనే ఉంది
ఎప్పటీ నుండో

శరీరం కాళ్ళ పయి నడుస్తున్నా
మనస్సు హెలికాప్టర్‌లో తిరుగుతుంది
జలాశయంలో విగ్రహం కనిపిస్తుంది
ఏ వినోదంలోనో చేతిలో బైనాక్యులర్!

ఉదయమో సాయంత్రమో
సంతోషమో విషాదమో

ఓటమికీ గెలుపుకీ
విధ్వంసానికీ నిర్మాణానికీ
అలల మధ్య స్థిరంగా
సాక్షీభూతంగా! విగ్రహం!

కరుణ ప్రేమ శాంత ముఖాలతో
జడం నుండి చేతన రూపంతో
జలదంలా! బుద్ధుని రూపం
చూస్తూ పోయే దృష్టికి వేలాడుతుంది

నీటిలో నుండి తేలే పద్మంలా
స్వాగతం పలుకుతుంది
అనుభవంలో లేచే శిల్పంలా
వీడ్కోలు చెబుతుంది!

# II. వర్తమాన ప్రజాస్వామ్యంలో

### పచ్చని దృశ్యానికై

**II.1.** ప్రజాస్వామ్య పథంలో ఆదర్శం వెనకనే
స్వంత కోర్కెల ఎజెండా సిద్ధంగా
రథం వీడి మధ్యలో అశ్వాలు పరుగిడుతాయి
భ్రమణం ఆగి చక్రాలు నిలిచి పోతాయి

వెనక నుండి మృత్యుపాశం విసరి
అడుగు జాడ లేర్పడకుండా
అదృశ్యమవుతాయి! చేతులు!

రంగుల జీవిత పటం స్థానంలో
నీలి పొగల బొమ్మలు వరసగా భయదంగా
వీధిలో ప్రాణుల్ని ఉక్కిరి బిక్కిరి చేసే
పై కెగసీ ప్రకాశాన్ని నిరోధించాలనీ

కళ్ళ ముందు మంటలలో శరీరాలు
ఎర్రని ఇనుప రేకుల్ని తలపిస్తున్నాయి
ఇంద్ర ధనుస్సు దగ్ధ మయి
ముక్కలుగా నేలపై రాలినట్లుంది
శాంతి పావురం అపుడపుడూ
సమీప జలాల్లో రెక్కలు తడుపుకొనీ
నీటి శీకరాల్ని విదల్చి పోతూంది
అంతలో నగరం బూది వస్త్రం ధరించినట్లుంది.

బయట పని మీద వెళ్ళిన వ్యక్తి
ఆరని బొగ్గుల పయి నడచి రావలసి వస్తూంది
ఇంట్లో ఎదురు చూచే కళ్ళలో
ఆశల వత్తులు! వెలుగుతూ ఒకటొకటీ!

మానవ వికాస కథకు గుడ్‌బై చెబుతూ
ప్రేలే వరస బాంబుల మృత్యుహేలతో
అశాంతి! సుడి గాలిలా ఎగసి
జీవితాల్ని దూర దూరం విసరుతూంది

పెద్ద దిక్కు పోయి దిక్కు తోచని స్థితిలో
క్రమ్మిన పొగల మధ్య దారి దొరక్క
కాలం పలక పయి అక్షరాలు దిద్దే చేతులు
కన్నీరు తుడుచుకోవడంలో నిమగ్నమయినాయి

పగలు గ్రహంణంలా కర్ఫ్యూ
రాత్రి దారి తప్పి వచ్చినట్లుంది

ఎవరికి వారు తమ తమ ఆలోచనా పటాల్ని
ఆదర్శాలు బొమ్మలతో కొలువు తీర్చేరు
క్రూర కర్మతో విజయానికి
నిర్మించే మెట్లపై సమయం నడుస్తూంది

భయం పేరుతో అపుడపుడూ
“బూచి” భయం మాటలతో
శాంతి పేరుతో మాటి మాటికీ
బూది “రక్ష” మాటలతో
‘నిజం’ ఎగసి బంతిలా దూరమవుతూంది
సందేహం క్రింద బ్రతుకు నలుగుతూంది
భయంలో అడుగులు వెనక్కి పడుతున్నాయి
మస్తిష్కం చిమ్మే జ్వాలల్ని
హృదయ జలద మొకటే ఆర్ప గలదు!
విషమ భావతలంపై అఖాతాల్ని
మానవతా ప్రవాహ మొకటే నింపగలదు

ఎక్కడో మిగిలి ఉన్న సృజన బీజం
మనిషిలో పచ్చని దృశ్యాని కెదురు చూస్తూంది.

## ఆశయ హృదయం

**II.2.** రాత్రి కత్తి అంచు చివర
నిలిచిన నెత్తురు బిందువులో
సూర్యుని బింబం చూడాలనీ
సమాజం వెలుగును పొందాలనీ

వేడి వేడి ఆలోచనతో
పదు నెక్కిన ఆందోళన!
ఆవేశం అగ్నిని ఉద్యమింప జేస్తుంది
ఆ సమయం అయస్కాంతంలా ఆకర్షిస్తుంది

కొలిమిలో కాల్చే ఇనుప కడ్డీ
ఏ పని ముట్టుకో అయితే మంచిదే
ఏ తలపైనో మోదే ఆయుధ మయితే
ప్రమాదం! క్షమకూ అర్థం కాదు.

కత్తి మొన పయి
భద్రతలో రక్షణలో శాంతి ముఖం
జీవ కళ తప్పడం! అపాయకరం!
నిరాశలో ఎడారి
నడచే కొద్దీ దీర్ఘమై పరచుకొనీ
వెంట నున్న బాగ్‌ను
సందేహ వస్తువులతో నింపుతుంది

లోకంలోకి వచ్చినందుకు సార్థంగా
తనలో ఎడారి ఎదురు కాకూడదనీ
పచ్చదనంతో తృప్తీ ఆనందం
సందేశంతో సమాజం స్పందించాలనీ

శాంతికి సంకేతంగా హంసలకు బదులు
ఎదురుగా బలి ఆహారం కయి
గద్దలు ఎగిరి వచ్చి వాలుతున్నాయి

మబ్బు టవల్ చాటున
కర్మ సాక్షి! ముఖం!

తప్పు చేసిన ముఖంలో
ఎదిగే ముళ్ళ పొద స్థానంలో
విరిసే పూల గుత్తి చూడాలనీ
మానవ శ్రేయో హృదిలో సహజం!

మనిషి మాట మనుషులతోనే
మనిషి బ్రతుకు మనుషులతోనే
మార్పుల ఊర్పులతో జీవితం
సమాజ శక్తుల సమీకరణం!

మౌన ఫలకం పయి చెక్కిన అక్షరాలు
విషాదంలో వీడ్కోలు చిహ్నం బదులు
ప్రమోదంలో స్వాగత రూపం అవాలనీ
అస్మితలో! ఆశయ హృదయం సహజం.

## సముద్రం నుండి సముద్రానికి

**II.3.** అడుగు ముందుకు వేసి కదలీ
గట్టు హద్దున ఆగిపోతూ
ఊగే అలతో సముద్రం!
బోనులా భీకర మృగాలతో

స్వేచ్ఛలో విజృంభించి అపాయకరంగా
చెలియలికట్ట పై నుండి ఎగసి
దూకి తరలే కోరికతో ఒక్కొక కెరటం
ఉపద్రవ భయ స్పర్శతో సమాజం

అపాయ శంక లేని రక్షణ కవచం కయి
ప్రమాద భీతి లేని భద్రత వలయం కయి
కొత్త యోజనలో మానవ యత్నం!

మానవ జీవిత సాధన కనివార్యం
కనిపించని శత్రు గణం నుండి
పొంచి ఉన్న ప్రాణ భయానికి
తన బాగ్‌లో ఆయుధం దాచీ
మరొకరిది చెక్ చేయాలని డిమాండ్!

స్వేచ్ఛలో గట్టు దాటి
స్వేచ్ఛగా కదలాలనీ!

ఆరాటం వాస్తవమై
బోను నుండి మృగంలా
బయట పడే కెరటం!
ఉన్మదిష్ణు వవుతూంది!

మానవత మాయమై శిథిలాల్లో
అన్వేషణ మొదలవుతుంది!
శాంతికై సముద్రమంత చర్చ!
మనిషిని సముద్రంలోకి దింపుతుంది.

## ప్రశ్నారూపాలై

**II.4.** ప్రజాస్వామ్య సౌధానికి మూల స్తంభాలు
నిర్మాణ ఘన రూపాన్ని వహించే స్థితిలో లేవు
స్వేచ్ఛగా తప్పుకునే ఇచ్ఛ కనిపించదు
క్షేమంగా ప్రజలు బ్రతికే వీలూ లేదు

ఉద్యమంలో ఎన్నికలలో
నిరసనలో ప్రతిఘటనలో
ముందు నిలిచేది మాత్రం! సామాన్యులే!

స్వార్థం విజృంభించి
సంకుచితం వాడి తేలి
అసుర కిరీటంలో మణుల్లా
ఎగసే నిప్పుకణాలు! మెరసేను!
శిశిరంలో శూన్యానికి దారి తీసే
విధ్వంసం! ఎవరికీ ఇష్టం ఉండదు

విశ్వమయం అయిన మనిషిని
భయం! అణువులోకి కుదిస్తూంది
మనిషో వాహనమో ప్రేలి
అంతవరకూ తెలీని మృత్యు రహస్యం
విలయ దృశ్యాన్ని ప్రదర్శిస్తూంది

హాలా హల సదృశమయిన  విషమ ధూమాన్ని
ఎవరు భరించగలరు! ఆకాశం తప్ప!
గుండె పై నిప్పుల కుంపటి తొలగి
పూల తీగె సాగుతుందనీ ఆశ!
ఇది గగన కుసుమం కారాదనీ
ఒక విశ్వాసం! ప్రజాస్వామ్యంలో!

కన్నీటి బిందువు ఎరగని
వేదనా స్వరం పలకని
ప్రాణ ధాతువు కనిపించని
జీవ నాడి వినిపించని
మూల స్తంభాలు! చుట్టూ శిల్పాలతో
ప్రజాస్వామ్య సౌధం గురించి
ప్రశ్నా రూపాలై! జన భయ హేతువులై!

# III. అహం నుండి ఆయుధం

### అహం ప్రేరణ

**III.1.** మనిషిలో 'అహం'
వ్యక్తి ప్రకాశానికి ప్రేరణం
అనల క్రియ పొందితే ప్రమాదం
కిరణ ప్రభ పొందితే ప్రమోదం

కణ కణంలో అహం
ఆత్మ బంధు స్పర్శతో
సృజన కీర్తి పొందుతూంది

అణువణువులో అహం
భౌతిక గుణ బంధంతో
విలయ స్ఫూర్తి పొందుతూంది
మనిషిలో అహం
జీవన ఝరికి
ఉత్సాహ మూలం!
ఆయుధంతో విక్రమింప జేస్తుంది
ఆకాశంతో పోటీ పడజేస్తుంది.

### విరామ నిలయం

**III.2.** ఆయుధం చుట్టూ చరిత్ర
భయ సోపానాలపై నడిపిస్తూ
చండ మయిన స్థితుల్లో మనిషికి
లక్ష్యం ఒకటే విజయం!
వెనకో ముందో, గురితో
మనిషితో ఆయుధం! కదలింది
అడవుల్ని దాటి జన పదాల్ని జయించి

దేశాల్ని మారుస్తూ, రాజ్యాల్ని నిర్మిస్తూ
యుగం నుండి యుగానికి పయనించింది
చితికిన బ్రతుకుల్ని వదలీ మరచీ

ప్రపంచాన్ని విభజిస్తూ ఎక్కడి కక్కడ
సమస్యల్ని వదలేస్తూ శిథిలాల్లో
ఒక చోట సమస్యకు జవాబు అయింది
ఒక చోట సమస్యకు కారణ మయింది

కొందరిలో విషాదాన్ని మిగిల్చింది
కొందరిలో ప్రమోదాన్ని వెలిగించింది
ఒకే  సమయంలో ఇరు పక్షాల్లో
అమావాస్య పూర్ణిమ కలిసి నట్లు
ఆయుధ వశమై చరిత్ర!
ఆయుధ రక్షణలో సమాజం

విరామ నిలయంలా శాంతి
చుట్టూ ఆయుధ రక్షణతో.

**రణ విరామంలో**

**III.3.** రణ విరామంలో రాత్రి
గాలిలో కుసుమ గంధం
ప్రశాంత వలయంలోకి ప్రవేశపెడుతూంది

విరామంలో పక్కకు పెట్టిన
ఆయుధాలపైనా  శిరస్త్రాణాలపైనా
మరణం లేని శాంతి
దూరం వెళ్ళింది వచ్చి వాలుతుంది

మూసిన పిడికిలి లా భూమి
వేసిన తలుపులతో ఆకాశం

నిశీథి భయ భావంతో సమయం
శిశు సమ రూపంతో హృదయం!

ఇపుడు రణ దృష్టి మారింది
అర్థరాత్రి కూడా బాంబులు పడతాయి!
రణ గతికి విరామం లేకుండా ఉంది
మనిషిలో శాంతిని సమీపించకుండా చేస్తూంది

శాంతి దొరికిన మస్తిష్కంలో
నీలి మబ్బు హృదయం దిగుతూంది
రణ వ్యూహం పోస్ట్‌పోన్ అయి
ఆయుధంపై శాంతి స్వప్నం వాలుతూంది

చీకటిలో కనిపించని మనిషిని
వెదకడం సులభం కాదు
అడుగు వేయ బోతే ఎదురుగా
అనుమానం పెనుభూతం మెదలుతుంది

కళ్ళు మూసినా తెరచినా ఒకటే
అన్నట్లుగా నిశ్చల నీరవ లోకం
కళ్ళ ముందు రణ దృశ్యం తొలగి
కళ్ళ లోకి శాంత చిత్రం దిగుతూంది

చెట్ల నుండి నిర్దాక్షిణ్యంగా
పండ్లనూ పూలనూ ఆకుల్నీ
బాణంతోనో బులెట్ తోనో రాల్చే
స్వప్నం ఆగిపోతూంది!
స్నేహంతో సౌందర్యంతో ఆనందంతో కాలం
ప్రత్యక్షం కావాలని! సామాన్యుని కోరిక!

## సామాన్యుని మరచీ

**III.4.** రాత్రి అనుకోని రవి కిరణం
దూకినట్లు రణ విజయంపై కోరిక!
ఒకటి తరువాత మరొకటి
బ్రతికి నంత వరకూ నిరంతరం

వసుధ పయి ప్రతి అడుగుతో
తన వశమయి పోవాలనీ
అహంకారం తల ఎత్తుతుంది
ఆలోచన ఆయుధ మవుతుంది

అనుకోని అహంకార విస్ఫోటంలో
విసరే నిప్పు విసన కర్రలా
సమాజాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తుంది

ఆయుధానికి ఒరిగే శరీరాలు
నేలపై రాలే ఎండు టాకుల్లా
అలంకారానికో అలవాటునో
ఒక్కొక్కరిలో ఒక్కొక ఆయుధంపై మోజు
ప్రభుతలో స్థాయికి చిహ్నంగా!
ప్రాణ రక్షణకో భద్రతకో నియతంగా
వ్యక్తిలో ప్రాణాన్ని గొంతులో నిలుపుతుంది

భూమి నుండి దివికి నిచ్చెన వేసినా
మస్తక శిఖరంతో సమానంగా ఆయుధం
మనిషికి తోడుగా రక్షణగా చరిత్రలో
శత్రుతను విస్తరించి శాఖలుగా దిశల్లో
రణ ఫలాన్ని కానుకగా సమాజానికిస్తుంది

అశోకుని అహంకారంలో
కదలిన కత్తి అంచు నుండి
జారిన నెత్తురు చుక్కలు
కన్నీటి చుక్కలుగా మారి
కరుణతో చరిత్రను శుభ్ర పరచాయి
ప్రేమతో సమాజాన్ని వికసింపజేసాయి

కొత్తగా పరోక్ష రణంలో
పాతిన మందు పాతర ప్రేలి
విసరిన బాంబు గుండె పగిలి
నూరు కత్తులు దూసిన కసిని
ఒక సారి చూపిస్తుంది
నూరు బుల్లెట్లు వదలిన పగను
ఒకే మారు తలపిస్తుంది
సంవేదనతో పగలు రాత్రిగా మారుతూంది

బ్రతుకులో చిమ్మే చీకటి ఒకటే
మనో వేదనలో సుడి గుండం ఒకటే
సందేశంతో రాత్రి పగలుగా మారదు

ఒక సమయం ఆయుధం
హక్కును ప్రేరేపించింది
కావలసిన బాధ్యత వెనకబడింది

ఒక సమయం ఆదర్శం
రణ సమ గతిలో కదలీ
శాంతి చరణాల్ని నడిపించింది
సామాన్యుని కోరికల్ని తుడిచేసింది.

## అక్షర స్వేచ్ఛ

**III.5.** ప్రజాస్వామ్య స్వేచ్ఛలో అక్షరం
వార్తా ప్రపంచంలో
క్షీర నీర న్యాయంలో
హంస పాత్రను వదలి
ఎత్తులతో పావుగా మారుతూంది
రాజకీయ విపణి సరణి గళ్ళలో

విసరే రాయిని తలపిస్తూంది
గురి పెట్టిన ఆయుధ మవుతూంది
క్షరం కాని అక్షరం
మండుతూంది, మండిస్తూంది

గద్దలా ఎగిరి వచ్చి
కాళ్ళతో అదిమి పట్టి
ముక్కుతో పొడవాలనీ
గోళ్ళతో గీరాలనీ
సమాజ మస్తకం పయి
కూచొని శాసించాలనీ
రాత్రి కనే కలలకు ఉదయం
అనల పథం చూపాలనీ

కాగితంపై అక్షరాల్లో వార్తా ప్రపంచం
విశేష హిత మహితమై
విశాల జన రుచిరమై
నిజానికి హేతు చరణ రూపమైందీ

నిష్క్రియతను కదిలిస్తూ చేతనతో
సమాజాన్ని నడిపించే సాధనం

విశ్వ సంస్కృతికి ప్రకాశ రూపం
మానవ వికాస శక్తికి వేదిక
అపుడపుడూ దారి తప్పుతూంది
స్వేచ్ఛను అగ్నిలో దింపుతూంది

అడవి బాటలో
బాణంలా ముళ్ళను తొలగించిందే
వేటలో ప్రాణాలను తీస్తూంది.

## అక్షరాల సంకెళ్ళు

III.6. అక్షరానికి సంకెళ్ళు తొడిగే
ప్రమాదకరమైన ప్రశ్న వెనకే
అక్షరాల్ని సంకెళ్ళుగా మార్చే
విషాదకరమైన ప్రశ్న కూడా
స్వేచ్ఛలో ఏ హక్కూ
గట్టు లేని జలధి కాదు.

పక్షులు వాలే చెట్టు క్రింద
అర్ధరాత్రి మంటలు సృజించి
సమయానికి ఫైర్ ఇంజర్ రాలేదనీ
అక్షర లోలకాల ఫిర్యాదులు
పొద్దునే కలుషిత వాతావరణంలో
ధూమాగ్నికి తోడయిన ఆలోచనలు

అగ్ని కణాల అక్షరాలతో
రాత్రి క్షణాల గళ్ళు జ్వలించినా
మిగిలిన గళ్ళలో పచ్చదనం మిగిలీ
రోజు నిష్క్రమిస్తుంది సజీవంగా

ఆయుధమై అక్షరం సమాజంలో
శాంతికి అవకాశం కల్పించిందే
అగ్నికీ రహదారులు చూపిస్తుంది

బాధ్యతలో రూపొందే అక్షర చరిత్ర
సమాజ పథం చూపుతుంది జీవన రుచితో

అక్షరాల విలువ ప్రభావం
ప్రజాస్వామ్య హృదికి తెలుసు
ఉదార చరితకు తన విధిలో
సమన్యాయం సమధర్మంతో అస్మిత.

# IV. జ్ఞాపకం మెరపులో

## పునర్భవం

IV.1. జ్ఞాపకం మెరసీ
తలుపు తెరవబడీ
స్మృతిలో గతం హ్లాదంగా
ఒక దాని వెంట మరో దృశ్యం
దర్పణంలో ప్రతి బింబాల్లా
పూర్వపు అనుభవాల పునర్భవం

తీరానికి కదలి వచ్చే అలల వరసలా
విశేష సందర్భంలో శిక్షాకాలం మధ్యలో
జైలు నుండి విడుద లయిన ఖైదీల్లా
జలతలంపై ఎగిరే పక్షుల్లా
ఇంటికి రాగానే చుట్టుకునే చిన్న పిల్లల్లా
యూనిఫార్మ్‌లో నడిచే స్కూలు పిల్లల్లా
తిరిగే చక్రం అరలపై బొమ్మల్లా
మీటిన సితార్ తీగెలపై స్వరాల్లా
అనుభవ విశేషాల పరంపర!

ముందు తలుపు మూతబడీ
వెనక తలుపు తెరవబడీ
ఆలోచనా కిరణంతో కనిపించే స్మృతులు
నదిలో నావల్లా మౌనంగా కనుమరగవుతాయి

స్మతి కొక సమయం లేదు
సందర్భం అవసరం లేదు
అతిథిలా హఠాత్తుగా వస్తుంది
మిత్రంలా తీరికగా వెళుతుంది
మౌన చిత్రాన్ని ఆవిష్కరిస్తుంది.

అక్షరంతో పని లేదు
మాటలతో పని లేదు
ఆహ్వానంతో పని లేదు
నిరీక్షణంతో పని లేదు
దగ్గరలో ఉన్నట్లే ఉండీ సీతాకోక చిలక
చేతి వ్రేళ్ళకుండా ఎగురుతూన్నట్లుంటుంది
నక్షత్రం జారి చేతికందనున్నట్లుంటుంది
దాహంలో జలదం తలపై కదలుతూన్నట్లుంటుంది
గుండెలో పచ్చని తోరణం వ్రేలాడుతుంది
అస్తమయంలో విషాదాన్ని రాలుస్తుంది.
అనుభూతి సమార్ద్రమై
సాన పయి తీసే గంధపు చెక్కలా
ఊహను పరిమళ మయం చేస్తుంది.

## స్మృతి పథం

**IV.2.** సినీవాలి లా కన్పించింది
కళ లన్నిటితో పూర్ణ బింబం అవాలనీ
కోరికకు చివర లేదు
కల్పనకు మితం లేదు
స్మృతులకు నియతి లేదు
అనుభవానికి గట్టు లేదు

వాస్తవమూ కల్పన
ఒకదాని నుండి మరొకటి
మనో నిలయానికి శ్రేణులుగా
శ్రేణుల్లో స్మృతి ప్రపంచ విభాగాలు

నిఘంటువులో
అవసరానికి దృష్టి పడే పదంలా
స్మృతి సంపుటిలో అనుభవం

దీనితో మరొకటీ! అనుకోనో అనుకోకుండానో
స్నేహంలో బంధుతలో పరిచయస్థాయిల్లో

ఎవరి మనోలోకం పూర్తిగా తెలియదు
చంద్ర బింబంలా
దూరం నుండి చూచి ఆనందించాలిసిందే
సూర్య బింబంలా
అద్దంలో చూచి తృప్తి పడాలిసిందే!

తలుపులు  వేయబడుతూ తీయబడుతూ
దృశ్యం నుండి దృశ్యానికి స్మృతి బింబాలు
నిజానికి దగ్గరగానూ కల్పనలో
కల్పనకు దూరంగానూ వాస్తవంలో.
మనిషీ మనిషికీ మధ్య విభేదం
సర్ప పంక్తి అయితేనే భయం!
అది స్మృతిలో
పుష్పమాలగా మారుతుంది

దేశానికీ దేశానికీ మధ్య వైరం
అనల సూత్రమయితేనే ప్రమాదం
అది స్మృతిలో
మంచు తెరగా మారుతుంది.

**ఏకాంతం**

**IV.3.** చేతి వేళ్ళతో తిప్పబడీ
బల్లయి గుండ్రంగా భ్రమించే
పేపర్ వెయిట్‌లా ఏకాంతం

తోడుగా ఇంట్లో
గోడకు గడియారం
ఒకవైపు ఫ్రేమ్‌లో చిత్రం
మరో వైపు కాలెండర్!
పైన తిరిగే ఫ్యాన్.

బయట దీప స్తంభం
దాని పక్కనే సౌధ శిఖరం
నాలుగు దారుల మధ్య ఒక విగ్రహం
ఒకటొకటీ ఏకాంతలో తోడ్పడతాయి
ఆలోచనలో వస్తువు నిస్తాయి
నిర్మాణానికి సహాయపడతాయి

ఏకాంతంలో ఉన్న మనిషిలో మరో మనిషి
ఉన్న చోటు నుండి మరో చోటికి ప్రేరేపించేను
స్వార్థమో హితమో ప్రమోదమో ప్రలోభమో
అసలు మనిషి కన్న ముందుగా దారి తీసేను.

అంకె ప్రక్కన జీరో చేరి
జీరో వెనకన అంకె చేరి
విలువ పెరిగినట్లు! మరో మనిషి
ఎవరి లెక్కలు వారివే! వ్యవహారంలో.

ఆవులింత అతిథిగా వస్తుంది
కళ్ళ ముందు చిటికెలపై ఎగిరీ
అలసటలో విశ్రాంతికి సూచనగానో
నిదురకు ప్రవేశ ద్వారంగానో

తీరం చేరే నావ సైరన్‌లా వినిపిస్తుంది
లాంగ్ జంప్‌తో లోపలికి దూకుతుంది

స్వప్న జగత్తు తప్ప మరేదీ అవసరం లేని
ఒంటరి తనానికి అంకిత మవుతుంది

ఏకాంతంలో ఆదర్శం! స్వచ్ఛంగా
అందని హిమ నగంలా అద్భుతంగా

శిఖరం నుండి శబ్దఝరి
సమాజ చలనంలో మెలకువలా

కలవరమూ పలవరమూ చేతనకు చిహ్నాం కాదు
మనస్సు ఉన్నట్లుండి ఏకాంతాన్ని వరిస్తుంది
మెలకవలో కావలసిందీ ప్రియమైందీ వదలి
నిద్రా జగత్తులోకి నిరంతరాయంగా నిష్క్రమిస్తుంది

నిశ్శబ్ద శిఖరంపై ఏకాంతం!
టేబిల్‌పై పేపర్ వెయిట్‌లా మౌనంగా.

## నవమై స్మృతిలో

**IV.4.** సమాజ స్మృతి పొరలో నుండి
నాలో అక్షర రూపం
వర్తమాన జీవన సందర్భంలో
నిశ్శబ్ద సరసి నుండి పద్మంలా
పొద మాటు నుండి బయటపడే మృగంలా
చెట్టు పైన గురితో వేటరిలా
పారా చూట్ నుండి దిగే వ్యక్తిలా
మౌన దర్పణంలో దృశ్యంలా

పగలు వెలుగులో కంటికి కనిపించని
రాత్రి చీకటి పటం పయి తళతళలతో
గగనంలో మెరసే నక్షత్రా లెన్నో
మనిషిలో అనుభవాల స్మృతు లన్ని!

అవని పయి మనిషి విజయ తేజానికి
నింగిలో సూర్యుడు అపుడపుడూ
మబ్బులో ముఖం చాటు చేసుకొనీ
ఛాయా ప్రియ రూపంతో కదలిపోయేను

జన సమూహాల మధ్య
మనిషి పేల్చే వరస బాంబుల
బీభత్స కాండలో ఎగసే
అగ్నిమయ దారుణ దృశ్యాల్ని చూచి
సూర్యుడు తల వంచుకొని వెళిపోయేను.

జ్ఞాపకాల జాడల్లో
మృత్యువు దూరంగా
దీపం లా నడచే నాలో
అస్తిత! నవ నవమై స్మృతిలో
కదనంలో కదలే అశ్వాల్లా
నిటలంపై మెరసే పంక్తులతో.

# V. వాస్తవ దృశ్యాలు

### మిగిలే కోరిక

**V.1.** చెదరిన చిరు గడ్డి మోపుతో
తల పయి చెదరిన జుట్టుతో
నీరు లేని లోతు బావి కళ్ళతో
నిశ్శబ్ద గుహా మస్తిష్కంతో
ఎండిన నీటి పాయ ఆశతో
ముక్క లయిన అద్దం హృదితో
ఘన చరిత్ర శిథిలాల మధ్య
వర్తమాన శకలం యువ చిత్రం
ఒడ్డున దూకే అలల వడికి సాగని నావలా
మూసిన అవకాశాల నుండి
తప్పని జీవిత గమనంలో
కాలాన్ని ఖండ ఖండంగా ఎక్కడి కక్కడ
అవసరాలకు తగిన వాహనంగా
మలచడంలో ఉంది మనిషి శక్తి రూపం

ఎంతటి నిరాశలోనూ నడకలో
చివరి మజిలీ అశాంతి శిఖరం కాదు
ఎంతటి విపత్తులోనూ బ్రతుకులో
ఆత్మ హత్య చివరి శమనం కాదు.

### మంచు బొమ్మ

**V.2.** విరామ సమయంలో ఆఫీసులో
కుర్చీలు బల్లలు భరింపరాని నిశ్శబ్దంలో
తమ తమ స్థానాల్లో శూన్యాన్ని నింపే
మనుషుల కయి విలువల కయి నిరీక్షిస్తాయి.

జీవితమంతా విశ్రాంతి కళతో ఒకరు
వేషం చెదరకుండా
దుస్తులు నలగకుండా
మెడలో దండను సర్దుకుంటూ
మరొకటేదీ ఒంట పట్టదనీ
అది తమ పాత్రకు సరి పడదనీ
పీఠం పయి స్నాప్ కయి సిద్ధంగా.

జేబు నుండి తీసే దస్తీ మడతలో
అద్దంలో ముఖం చూచుకొనీ మధ్యలో
మరో మడతతో పౌడర్ అద్దుకునే
ఏ మానో ఏశిలో చెక్కిన శిల్పంలా
ఏ రోజూ డిటోగా! పత్రికలో టివిలో
వేదికపై భంగిమ ఎప్పటిదో! నమూనా
మొగ మొత్తే మాటల పర్వం అదే!

సూర్యుని తేజాన్ని చూడలేని
చంద్రుని హ్లాదాన్ని ఓర్వలేని
కళ్ళకు! నీలి అద్దాలు తొడిగీ
లోపలి నుండి పక్షి రెక్కల్లా
రెండు రెప్పలూ పరచుకొనీ
అందింది ఎగరేసుక పోయే
భోగైక లిప్సతో మనోరూపం

అలంకరించిన వేదికపై
ఫోటో కాపీలా! ఏ రోజూ ఒకే విధం!
షెల్ఫ్‌లో అమర్చిన బొమ్మలా
ఆకర్షక భంగిమలో! యంత్రమై!

ఇంట్లో గోడకు అమర్చిన
నవ్వు ముఖం గాంధీజీ ఫోటో వెనక ముందు బాటిల్
దాని కెదురుగా గోడకు నిలిపిన
ప్రశ్నాముఖం మార్చ్ను ఫోటో వెనక డ్రగ్ ప్యాకెట్
ఒకటొకటీ బయటికి తీసి మెల్లగా
టేబిల్‌పై నిలిపిన తన ఫోటోకు
నైవేద్యంగానో "చీర్ యూ" అనో
రంగుల ప్రపంచంలోకి నిష్క్రమణం!

ఆరోజు పడిన పూల దండ
మరునాటికి కసవులో చిమ్మబడీ
ఆనాడు కప్పిన శాలువా
మరో నాటికి క్లాత్ స్టోర్‌లో చేరీ
రబ్బరు స్టాంపు వంటి ముద్రతో
ప్లాస్టిక్ పూల చెండు ముఖంతో
వెనకనే నడుముకు బిగించిన పీఠంతో
అస్తితలో మంచు బొమ్మ ఆకర్షణ.

### లోపల బయట

**V.3.** మనిషిలో అవకాశం! ఎగిరే విహగంలా
అనుకోని సందర్భంలో రెక్కలపై
చూడని గగనాన్ని చూపాలనీ.

మనిషిలో అవకాశం ఎదిగే మొక్కలా
అనుకోని సందర్భంలో నీడతో నిలిచీ
పూలతో పండ్లతో హ్లాదమయం చేయాలనీ

మనిషిలో అవకాశం తీరాన నావలా
అనుకోని సందర్భంలో భద్రంగా
గభీర ప్రవాహాన్ని దాటించాలనీ.

నాలుగు వైపుల నుండీ నాలుగు
పక్షీ తరువూ నావ మనిషీ
చుట్టూ కదలే జన సమూహ దృశ్యం!
నిద్రను వదలిస్తూ కలల్ని తరిమేస్తూ
మెలకువలోకి దింపుతుంది! జన చేతన
వాస్తవ శిఖరాల్ని చూపిస్తూ నడిపిస్తూ
అందని ప్రపంచాన్ని అందిస్తూ! కదలుతుంది.

**చినుకు స్పర్శ**

**V.4.** బయట చినుకులు సనసన్నగా
గేటు దాటి రాత్రి చీకటిలో
టార్చ్ లయిట్‌తో పాటు గొడుగూ!
గొడుగు లేకపోతే
దారిలో వాన పెద్ద దయితే
ఏ చెట్టో ఏ నిలయమో ఆశ్రయమవుతుంది.

అది సమాధుల స్థానమనో
అది శ్మశాన నిలయమనో
దూర దూరం కదలీ,
గాలి వీచి వాన పెద్దదై దారిలో
సమాధి పయి పూలు రాల్చే
శ్మశానంలో నీడ నిచ్చే
చెట్టు ఇపుడు గొడుగు అవుతుంది

పగలు ఎండకు తపనలో
రాలే చినుకుల్లో తడవాలనీ
తల తడిసీ దుస్తులు తడిసీ
దేహం ఆభిసేచనకు సిద్ధమవుతుంది.

ఆలయం చర్చి మసీదు నివేశనం
మహా సౌధం పూరి గుడిసె ఆశ్రమం
అణువణువూ చినుకులు! లయలో సమంగా
కల్పనకూ వాస్తవానికీ రెండిటినీ కలుపుతూ

తొలకరి చినుకుల భాష
గ్రీష్మ తప్త భూమికి అర్థమవుతుంది
మహావర్ష ధారల భాష
క్షామ పీడిత భూమికి అర్థమవుతుంది
చెలరేగిన తుపాను భాష
శిథిలాలకు గురియైన బ్రతుక్కి తెలుస్తుంది.

తప్త భూమికీ మనిషి హృదికీ
ఆర్ద్ర భావ సందేశంతో
అస్తితకు సృజన కీర్తి నిస్తుంది
బయట పడే సన సన్నని చినుకుల వర్షం.

## కోరికలో నిశ్శబ్దం

**V.5.** చెట్టు ఫలా కృతితో
పర్వతం ధైర్య రూపంతో
జల పాతం ఆర్ద్ర గతితో
ప్రకృతిలో ప్రతి వస్తువు
మనిషిలో దేనికి ప్రతీక అయినా
మనిషి మనిషే! అన్నిటిలో
చేతనలో మనో విభవంతో

నడచే అడుగుల క్రింద పచ్చదనం
వెనక నడచిన ఎడారిని మరపిస్తుంది

శబ్ద సరణి ఝరిణీ గమనం
నిరీహాలో నిశ్శబ్దాన్ని మరపిస్తుంది.
దారిలో ఏ సుడిగాలికో ఏ మార్పుకో
ఎగిరీ దేని పయినో దిగిన శరీరం
కాలికి మట్టి అంటకుండా
పైన ఎంత ప్రియ మయినా
ఎంత కాలం నిలుస్తుంది నేలకు దిగకుండా

పైన ఉత్తరీయంతో బయలుదేరి
ఫుల్ సూట్‌తో అవతరించాలనీ
శూన్య హస్తాలతో పైకి ఎగిరి
పూర్ణ కుంభంతో క్రిందికి దిగాలనీ

కోరికలో నిశ్శబ్దం
స్వర చిత్రంగా మారాలనీ
స్మృతిలో ఆల్బం కావాలనీ
ప్రకృతి దృశ్యాన్ని మరపిస్తుంది
జీవిత వాస్తవాన్ని నిలుపుతుంది.

## ఇష్టం లేని రణం

V.6. బయట మెట్ల పయి కూర్చొనీ తీరికగా
హంటర్ శుభ్రం చేసే రైఫిల్ పయి
వాలుతుంది! సీతా కోక చిలుక!
కిరణాల పయి ఎగిరి వచ్చి నిర్భయంగా!

దాన్ని పట్టుకునేందుకు చేయి చాస్తే
అందకుండా ఎగిరి పోతుంది! అందంగా
దాన్ని అవసరంగా అందుకునే తొందరలో
చేతి నుండి జారి పడే రైఫిల్ శబ్దంతో

దగ్గరలో కిటికి లో కూర్చున్న
గువ్వ ఎగిరి పోతుంది! రివ్వున! హఠాత్తుగా.

ప్రక్క నున్న మనిషి మాత్రం అక్కడే
నిలిచి చూచేను నిశ్శబ్దంగా
అంతలో ఆలోచన అనుకోకుండా
ఎవరి పయినో చిత్రంగా
గురి పెట్టే ఆయుధ మవుతుంది

మనసు ఉన్నందుకు మనిషిలో
రణంలో కోరికతో పని లేదు
రణ సన్నాహంతో పని లేదు
సందర్భం రణంలోకి దింపుతుంది
మనిషిని ఆయుధంగా మారుస్తుంది.

రణ మంటే ఇష్టం ఉండదు అయినా
జాతి మతం దేశం స్వార్థంలో
రణ భేరీ సన్నాదం
రణ శక్తుల సన్నాహం
అభిమాన శిఖరాలపై నడిపిస్తుంది
ఆలోచన రణ క్రియలో భాగమవుతుంది.

### చెట్టుతో మనిషీ

**V.7.** దారిలో ప్రక్కనున్న చెట్ల నుండి
రాలిన ఎండు టాకుల పయి
అడుగులు వేసేందుకు మహా భయం
ఏ పామో క్రింద ఉండవచ్చుననీ.

ఆకుల్లో మెరుపులా గల గల కదలికతో
కాళ్ళు గజ గజ వణకీ

అపాయ శంకతో ఊగి
నడచే దేహంలో చలనం ఆగవచ్చు
అడుగులు వెనక్కి మరలనూ వచ్చు
ప్రియమయింది మాత్రమే ఎదురు పడదు
ఇష్టం లేంది దారి నుండి తప్పుకోదు
దారిలో అనుకోని భయ సన్నివేశం
మనిషిలో శక్తిని పరీక్షకు నిలుపుతూంది

పండ్లతో ఆహారానికో నైవేద్యానికో
పూలతో అలంకారానికో ఆరాధనకో
చెట్టు మనిషి జీవనంలో భాగమవుతుంది
ప్రకృతిలో సహజమయిన బంధంతో

కట్టె చెక్కల కోసం
కళ్ళ ఎదుట నరకబడీ కూల్చబడే
బొగ్గు ముక్కల కయి కాల్చబడీ రంగుమారీ
మనిషి కోరే అవసరాలకు
సహజ రూపం వికృత మవుతూంది.

రైలు కిటికీ నుండి ప్రయాణంలో
కాలి బాట చెట్టు క్రింద నీడలో
చేతిలో గురి పెట్టిన రైఫిల్‌తో
ప్రాక్టిస్ చేస్తూ మనిషి! సుదూరంగా

ప్రకృతి హృదిలో భద్రంగా
తన రక్షణకు కవచంగా
జన పదాలకు దూరంగా అడవిలో
పూర్వరూపాన్ని వీడని భూమికతో.

## మనిషిలో చెట్టూ

V.8. ఆవరణంలో మొలిచిన మొక్క
ఇంతింతై అంతంత అవుతుంది
నాతో పాటు పెరిగి పెద్ద దవుతుంది

నేను ఎక్కడి కయినా వెళ్ళగలను
నడవడం మొదలు పెట్టీ అవసరాలకు
ఇల్లూ ఊరూ వదలడం ఉన్నదే
నాతోపాటు ఎందరో తమ పనుల్లో

చెట్టు మాత్రం అక్కడే సంతోషంగా
పూలనూ పండ్లనూ నీడనూ అందిస్తూ
మనిషి వాటిని పొందేందుకే అన్నట్లుంది!
తనలో మరచే ఉపకృతినీ జ్ఞాపకం చేస్తూ

నాలో ఎపుడో చిన్న తనంలో
ప్రవేశించిన చెట్టు రూపం
నాతో పాటు ఎదుగుతూనే ఉంది!
నాలో భద్రంగా, ధైర్యాన్ని నిలుపుతూ

ఏది మరచినా జీవితంలో
ఇది మాత్రం మరపున బడదు.
నిరాశలో అశాంతిలో ఓటమిలో
ఆశ్వాసాన్ని ఇస్తుంది పచ్చదనంతో

చెట్టుకు కదలే ఆలోచన రానే రాదు
అది కదలడం మొదలు పెడితే!
కదలదు! కదిలితే ప్రమాదమే
కాని ఆ భయం అవసరం లేదు జీవితంలో

కదలే మనిషిలో!
కదలని పచ్చని చెట్టు!
ఆలోచనలో శాంతి మయం!
అస్తితలో సృజన భావ చిహ్నం.

## వర్తమాన హృదయం

V.9. కల్పనా స్వేచ్ఛలో
'కవి సమయం' పేరుతో
విశేష సందర్భంలో
వసంత స్పర్శతో
శుభ కామన హృదయంతో
అల్మెరా నుండి టెలిఫోన్ డైరక్టరీ తీసి

ఆకు నయి చెట్టుతో మాట్లాడాలనీ
నంబఙ్ కలిపా, ఉత్సాహంగా,
గాలిలో ఆయుధం పేలిన శబ్దం వినిపించింది
రాంగ నంబర్ ఏమో?
అనుమానంగానే ఉంది.

పూవు నయి తీగెతో మాట్లాడాలనీ
నంబర్ కలిపా, ఉల్లాసంగా
దూరాన బాంబు పేలిన శబ్దం వినిపించింది
రాంగ్ నంబర్ కావచ్చు
సందేహంగానే ఉంది.

లహరి నయి జలధిలో మాట్లాడాలనీ
నంబర్ కలిపా, ఉద్వేగంతో
జన నినాద కోలాహలంలో
ఫైర్ ఇంజన్ గణ గణ శబ్దం వినిపించింది

రాంగ్ నంబర్ కావచ్చు
సంశయంగానే ఉంది

నాలుగో సారి యత్నించా
వెన్నెలనై చంద్రునితో మాట్లాడాలనీ
నంబర్ కలిపా, సాలోచనగా
కర్ఫ్యూ నిశ్శబ్దంలో, శబ్దం వినిపించింది.
రాంగ్ నంబర్ అవచ్చు!

మరో మార్గంపై చింతనతో
కుర్చీలో కూర్చున్నా తీరికగా
అంతలో తెలిఫోన్  బజింగ్ ధ్వని
పై స్థాయిలో గణ గణమనీ
ఇపుడు చేసిన వాటిలో
ఏదో ఒక నంబర్ అయి ఉంటుందనీ
హ్యాండ్ సెట్ అందుకున్నా ఆత్రంగా

"మీరు చెల్లించవలసిన బిల్లు
– రూపాయలు – తేదీలోగా
దయచేసి చెల్లించవలసినది" సూచనతో
ఒక అరలో దృశ్యాలు
మరో అరలోకి వెళ్ళిపోయాయి

అర చేతులతో వర్తమానం కళ్ళు మూస్తే
అనుభవంలో వాస్తవం వెనక్కి మరలదు
పరివర్తన చలనంలో స్పందమాన
సృజన హృదయం! అసలే ఆగదు.

# VI. గాయంతో కాలం

## తెలియనిదీ

**VI.1.** మనిషి మనిషి కొొక కథ
ఇదొొక వ్యక్తికి మితం కాదు.
మనిషి నుండి మనిషికీ
బ్రతుకు నుండి బ్రతుక్కీ
మనుషుల్ని అల్లుకొనీ
కదలుతుంది, మనిషిలో
కథ ఒక వ్యక్తి నుండి మొదలు కాదు
అది ఒక వ్యక్తితోను ముగిసిపోదు
రక్తారుణ గాయంతో సూర్యుడు
పగటి కథను చంద్రునికి చెప్పాలనీ
అనుకునే సరికి! సమయం దాటిపోతుంది

రాత్రి కథ వేరు, రహస్యచ్ఛాయలతో
కంటికి కనబడకుండానూ చీకటిలో
వెన్నెల చే కప్పబడీ పైకి నవ్వుతూనో!
బాధకూ ఆర్తికీ కాల భేదం లేదు.

పేషెంట్లను చూస్తూ నడచే
రాత్రి డ్యూటిలో డాక్టర్ లా
చుక్కల మధ్య చంద్రుడు!
తెల్లని ఆప్రాన్ వేసుకొనీ!

తన కథ అట్లా ఉంచి
ఒకరి కథ వినడానికైనా
మరొొకరి కథ చెప్పడానికయినా
తీరిక ఎక్కడుంది? ఇష్టమయినా

ఎప్పటికీ గుప్తంగానూ సుప్తంగానూ
ఉండే రాత్రి కథలో
తెలిసేది ఎంతనా? తెలియనిదెంతో!
చరిత్రలో కనుమరుగై పోతుంది
కాలపై విస్మృతమై పోతుంది.

## మెలకువ అంచుల్లో

VI.3. మెలకువ అంచున స్వప్నం
కల్పనకూ ఆదర్శానికీ నిలయం

స్వప్నంలో జీవితం
మబ్బు బుజాల పయి తరలుతుంది
మెలకువలో సమాజం
మనిషి చేతుల పయి కదలుతుంది
బాలెన్స్ నిలిచేంత వరకూ
విజయ దిశలో మనిషి రూపం!

ఎక్కడ ఆగిపోతే అక్కడ
ఆలోచన శిలా ఫలక మవుతుంది
ఎక్కడ నిలిచి పోతే అక్కడ
ఆదర్శం శిలా స్తంభమవుతుంది

నడకలో మస్తిష్కానికి క్షితిజం
హృదయం విప్పి స్వాగత మిస్తుంది
కళ్ళ ముందు మారే దృశ్యం
కొత్త ప్రపంచాన్ని చూపిస్తుంది

ఎపుడో ఆగి పోయి నడక
తిరిగే చక్రం అర (ఆకు)పై

రంగు వేసిన బొమ్మలా గడపడం
సర్కస్‌లో వినోదానికి పనికి వస్తుంది.

అదొక భాగ్యంగా మురిసే వారూ!
సైజుకు మించిన డ్రెస్‌లో మునిగీ
మెలకువ అంచున స్వప్నంలో
ఘన విమాన యానంకై! ఎదురు చూస్తూ

### రాళ్ళ మధ్య శిల్పమై

**VI.3.** లోన నల్లని రాళ్ళ మధ్య
బ్రతుకుంతా చెక్కబడే శిల్పంలా
శిల్పశాలలో గడుపుతూ ఒకరు
ఆ రోజుకు కీర్తి మెట్లు లెక్కపెడుతూ

శిలామయ మయిన జీవితం
శిల్పమై పరిసరాల నలంకరించాలనీ

ఏది అయినా
ఏది కాకపోయినా
మనుషుల మధ్య మనిషిగా
నడక తోనే వాస్తవంగా
అస్మితకు రసమయ రూపం!

సన్మానాల అవార్డుల గ్రాఫ్‌లో
తన ఎత్తును చూచుకుంటూ అద్దంలో
కరెన్సి నోట్లను రెప రెప లాడించే
కౌంటింగ్ మిషన్‌లా సమయం నిలవాలనీ
కండెకు చుట్టబడే దారం లానో

వలయంలో తిరిగే గానుగలానో
మనిషి ముందు ఒకే దారి! చుట్టీ
మొదలైన చోటికే తిరిగి రావడం మళ్ళీ మళ్ళీ

నడచే మనిషి ముందు దారుల నేకం
దాటే వంతనపై మాత్రం ఒకటే!

నడచే దారిలో కొత్త దనం ఆగదు
పలికే కవితలో మాట అర్థం దాగదు

ఏ దారి అయినా, ఏ లక్ష్యమయినా
మనుషుల మధ్య మనుషులతో మనిషికి
నడకతోనే! అస్తితకు వర్తమాన విశ్వరూపం.

**మమకారం - అవసరం**

**VI.4.** పుట్టిన ఊరుపయి మమకారంతో
అక్కడే ఉట్టికి వ్రేలాడుతూండదు జీవితం

పోషణ స్థితి రక్షణ భావం
ఊరును దాటిస్తుంది
విశ్వమయం చేస్తుంది

శిల్పంలో చెక్కిన భంగిమ
ఎంత సుందర సంపద అయినా
ఏదో ఒక సందర్భానికే సరిపడుతుంది.

జిజీవిషలో ఉత్సాహ శక్తి
ఎంత దూరమయినా నడిపిస్తుంది

మమకారం వెనుక నిలబడుతుంది
అప్పటి అవసరం ముందుకొస్తుంది.

నడకలో శిఖరాలు తలలు వంచుతాయి
ప్రవాహం మనిషికి నడకలు నేర్పుతుంది
ఆలోచనల్ని తూచే రాళ్ళు లేవు
అనుభూతుల్ని కొలిచే మీటర్ లేదు

ఆలోచన కోరికకు మార్గం చూపిస్తుంది
లోపలి విశ్వాసం లక్ష్యాన్ని నిలుపుతుంది

ఎడారిలో ఒంటెపై పయనంలో
దాహంలో ఎక్కడో చూపు నిలుస్తుంది

బయట పడే రస హృదయంలా
నీటి చెలమ అమూల్యమై
భూమికి జారిన చంద్ర శకలంలా
మనస్సు శిశు సమ మవుతుంది

దాహంతో సమీపించే మనిషిలో
తని నిజ రూపాన్ని పైకి తీస్తుంది

వ్రాత లేని నొసలుతో బయలుదేరి
వ్రాత మెరసే పంక్తులతో రావాలనీ
శూన్య కరాలతో బయలుదేరి
అదృష్ట రేఖలతో తిరిగి రావాలనీ

కోరికలో కిరణం సీమల్ని దాటిస్తుంది
దేశాల్ని చేరుస్తుంది, మూలాల్లో భద్రంగా.

### తెలియని నిజం

**VI.5.** తుపాను అంటే ఏమిటో తెలుసు
వానలూ వరదలూ బీభత్సం

గ్రీష్మం అంటే బాగా తెలుసు
మంటలూ క్షామమూ ఆకలీ!

భూకంపం అంటే ఏమిటో తెలుసు
శిథిలాలూ శకలాలూ విధ్వంసం!

జ్వాలాముఖి అంటే ఎంతో తెలుసు
విస్ఫోటం! కదలే అగ్ని ప్రవాహం!

మనిషి మాత్రం ఎన్నటికీ
ఎవరికీ తెలియని రహస్యపేటి!

తుపాను గ్రీష్మం భూకంపం జ్వాలాముఖి
మనిషిలో సుప్తమై రణంలో మేల్కొంటాయి

రణ తంత్రంలో సాగే
రథ గమనం ముందు అవని
రాజ పథంలా ఉండదు

మనిషి శక్తికి పరీక్షా సమయంలో
ప్రమాద ఘంటిక! ఎపుడు మ్రోగేదీ తెలియదు

అన్నిటికీ సిద్ధం కావడమే కర్తవ్యం
కాల మహా పరిణామంలో అస్తితకు
చిర జీవం ఇచ్చేదీ
నవ భావం తెచ్చేదీ.

## జీవ శక్తితో

**VI.6.** మట్టి నుండి తరువుగా మారే బీజం
శరీరంలో సంకల్ప బిందువుకు ప్రేరణం

అనుకోని పిడుగు పాటుకు భస్మం కావచ్చు
అనుకోని తుపాను గతికి శీర్ణం కావచ్చు
ఏదో ఒక భయం చేత ఆటంకం చేత
విత్తు ముఖం చూపడం మానదు
చెట్టు పైకి ఎదగడం ఆగదు
దేని సమయ సందర్భం దానిదే.

చెట్టు నీడలా మానవత
పచ్చదనంలా నైతికత
ఫల సంపదతో ఉదారత
మనోమూల మయం జీవితం!

ప్రియంగా ఎవరు చూచినా చూడకపోయినా
మేఘం తరలి రావడం మానదు
దప్పికతో ఎవరు చేరినా చేరకపోయినా
ప్రవాహం కదలి పోవడం ఆగదు

బాధ్యత అక్కర లేదు
హక్కులు కావాలనడం
గోడలతో పని లేదు
తలుపులు కావాలనడం!

ప్రజాస్వామ్యంలో ప్రజలు
మౌన శిల్ప శ్రేణులు కాదు
కర్తవ్యంలో క్రియకు రూపాలు

ప్రదర్శనలో వస్తువులు కాదు
దశ దశలో పరీక్షలతో
విజయం పై మానవ దృష్టి
దహ్యామాన స్థితుల్లో నుండి
పునర్జీవ శక్తితో అస్తిత!

## సంకల్పం ముందు

VI.7. పోయే దారి ఎంత జలమయ మయినా
శరీరం మును ముందుకు సాగి పోవలసిందే!
ఏదో విధంగా ఆటంకం దాటి
అవతలి అంచుకు చేరాలిసిందే

అపాయం అంచునే భయ లిప్తలు
దండలో సూది దిగే పూవుల్లా
బాధా స్పర్శ నుండి బయట పడీ
రాబోయే అవకాశం పయి దృష్టితో

జలాలలో ప్రవేశంతో బిందువు బిందువూ కౌగిలిస్తుంది
దాటే శక్తికి ఉత్సాహ లహరి తోడవుతుంది
ఎక్కడో మొదలై పట్టు నిలుపుకొనీ
ముందుకు సాగడం అవసరం ప్రవాహంలో
అవని పయి అడుగుతో
భద్రత పరచబడీ విశాలమై అవకాశం
పరిచితులూ, అపరిచితులూ మిత్రులూ సమాజం

గమ్యం చేరే సంకల్పం ముందు
భూమి జలం ఆకాశం ఒకటే
మనిషి శక్తి ముందు తల వంచుతూ
ఏ క్షణమూ! తప్పని ప్రకృతి దృశ్యం
అస్మితలో వీడని నేపథ్యంతో.

## ఆగని అవసరాలు

**VI.8.** పచ్చని పంట మధ్య కూర్చుంటే
మనిషిలో ఆకలి తీరదు
పంట ఇంటికి వచ్చే వరకూ
ఆగ మంటే ఆకలి ఆగదు

ఆకలిలో జ్ఞాపకం వస్తుంది
కదలే పచ్చని పైరు
కోపంలో ప్రతిబింబిస్తుంది
ఎగసే ఎర్రని జ్వాల
బాధలో కదలుతుంది
శిఖరం చుట్టిన మంచుపొగ

స్పర్థలో దౌడు తీస్తుంది
రణంలో ఆగని అశ్వం

జీవితంలో ప్రతి అనుభవం
ప్రకృతిలో ప్రాణితో ముద్రితమై
ఆలోచనా శాల నలంకరిస్తుంది
విశ్వంతో ఒకటిగ చేస్తూ, అస్తిత!

## అవతలి వైపు

**VI.9.** ఎడారిలో దాహానికి
జల బిందువు అవసరం
గాలి మెచ్చే మబ్బు కన్నా

గ్రీష్మంలో ఆకలికీ
అన్నం కబళం ముఖ్యం
చూపు మెచ్చే పైరు కన్నా

ఒకరోజు పైకి ఎదుగుతూ
ఒకరోజు క్రిందికి దిగుతూ
ఆకాశాన్నీ పాతాళాన్నీ స్పృశిస్తోంది
రేస్‌లో అశ్వ గతులతో
సాహసాల మార్కుతో! షేర్ మార్కెట్

ఎంతటి చతురత లోనూ జీవితం
గడియారంలో లోలకం కాదు!
ఏ నియమ పంక్తిపైనో నడవదు
ఏ నియత వర్తులంలోనూ తిరగదు

మండే ఎండలో పచ్చని చెట్టుకు
గొడుగు పట్టి నిలపడం అసంభవం!

అవనిలో నిలువ నీటి ఆర్ద్రతతో
బయట నుండి జలసేచనలో తడితో
ఆకులలో ఆశలు రెపరెపలాడతాయి
జీవించే శక్తికి ఆపద తప్పుతుంది

ఎండలకూ వానలకూ తట్టుకొనీ
పండిన పంటను చూడగానే
కళ్ళ ముందు ఇంద్ర ధనుస్సు అవతరిస్తుంది

వానలకూ ఎండలకూ తాళలేక
ఎండిన పంటను చూడగానే
గుండెలో మృత్యు సర్పం పడగ చాస్తుంది

జీవించే ఇచ్ఛతో
పిడికిలిలో శక్తితో

దూకే మృగాలతో పోరాడిన వీరుడు
అపాయ నిర్ఝరి దాటిన సాహసి
ఆశ్చర్య రహస్యాల్ని ఛేదించే అన్వేషి
స్వయం హత్యకు పూనుకోవడం
నాణెం అవతలివైపు తెలీక పోవడం.

### మారే సమీకరణాలు

**VI.10.** మనిషి చూపు ఒకటే
దిశలు వేరు, మనుషులు వేరు
చూచే కోణాలు వేరు
ఉన్న మనో రూపాలు వేరు

ఒక దిశలో సూర్యుని ఉదయం
ఒక దిశలో అస్తమయ ముఖం
ఒక దిశ నుండి వడ గాలి
ఒక దిశ నుండి వాన జల్లు
ఉప దిశలెన్నో
ప్రభావ రూపాలతో

అన్ని దిశలకూ
కేంద్ర బిందువు వర్తమానం
బిందువు నుండి దిశలకూ
దిశల నుండి బిందువుకూ
రేఖలతో సచిత్ర జీవితం
చూపు చూపుకీ భిన్న భిన్నం

ఆరంభం ఎవరికీ జ్ఞాపకం ఉండదు
ఎవరో చెబితే గాని తెలియదు

సమాప్తి ఎవరికీ తెలియని రహస్యం
బయటి దృష్టికి దూరమైన అనివార్యం

కదలే ఆకులా కోర్కెతో
మండే జ్వాలలా స్పర్ధతో
విసరే జల్లులా కరుణతో
విరిసే పూవులా ప్రేమతో
సరికొత్త సమీకరణాలతో
అనుక్షణం మారే మనోజగం
తనకే తెలియని అద్భుత రూపం.

## తీరని సమస్య

**VI.11.** అద్దంలో అనల బింబంలా
దారిలో ఉగ్రవాద దృశ్యం!
అనుకోకుండా ఎదురవుతుంది
క్రింద పడీ ముక్క లయిన
శిశువు చేతిలో గాజు బొమ్మలా
వేటకాని బాణానికో తూటాకో
గాయపడి కుప్పకూలిన హరిణంలా

అద్దాన్ని పగుల గొడితే ముక్కలు చేస్తే
దూరాన ఉన్న రూపం నశించేనా?

తన కలను వదలి
మరొకరి కలలో ప్రవేశించాలనీ
ఒకరి ముఖాన వారి సిగ్నేచర్ చెరపి
తన సిగ్నేచర్ నిలపాలనీ
వాస్తవాన్ని మాయం చేసే చర్య
జనహిత లక్ష్యం నుండి తప్పిస్తూంది

అద్దంలో వివిధ కోణాల్లో
అన్ని వైపుల నుండీ ఒకటొకటీ
మానవ వికాస బింబాన్ని గ్రహణంలా
మ్రింగ జూచే నీడలు! కీనీడలు!
మానవతను మాయం చేస్తూ
అస్తితను మలినం చేస్తూ.

### వెలుగు చరణం

**VI.12.** ఎవరి ఆహ్వానం పయి ఇక్కడికి రాలేదు
ఇక్కడ ఉండేందు కెవరి అనుమతితో పని లేదు

ఏ వైపు స్వాగత తోరణమూ దారి చూపలేదు
ఏ సన్మాన పత్రమూ నిజ రూపం మార్చలేదు

ఈ విశాల పృథ్వి నా నివాస మెప్పటికీ
ఈ సమాజ బంధంతో అస్తిత్వం చిరమై

ఆశయాల గమ్యంతో వెలుగు చరణం
మరచిన దారిని చూపే జ్ఞాపక రూపం

తూరుపు పడమరలో
ముందూ వెనకాలా
తప్పని సంధ్యా రూపం! సందేహం

భౌతిక లౌకిక జీవన పథంలో
మరణ భయం ప్రశ్నలేదు
పునరుదయం మాటలేదు

నిర్మల సమాజ రూపంలో
అంతరంగ కిరణంతో
ఒకే ఒక! పునర్దర్శనం తప్ప
అస్తితలో జన హృదయం తప్ప.

స్వేచ్ఛా కవిత్వం

రెండవ భాగం - 16

# నడిచే వెలుగు చుట్టూ


మాదిరాజు రంగారావు



**2009**

రసధుని సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 500 028

*Presented*

to

my first daughter

***HARITHA*** , M.A. (Lit)

MI, USA

*with blessings*

## సూచిక


I. వెలుగు నుండి.................................. 09

II. ఉన్మత్త కందుకం................................ 14

III. కావలసిందీ రావలసిందీ...................... 19

IV. వెలుగు వైపు .................................... 24

V. నడిచే మనిషిలో ................................ 27

VI. అగ్నీ గుప్తంగా.................................. 31

# పీఠిక

# నడిచే వెలుగు చుట్టూ

ఈ కృతిలో వస్తువు సామాజికం. వర్తమాన వాస్తవ రూపాన్ని కలిగింది. సన్నివేశ స్థితి చలనంలో భావరూపాల్ని పొందింది. నడిచే వెలుగు చుట్టూ (Around the walking light) ఉండేవి. వస్తూపోయే నీడలూ చీకటీ వెన్నెల అగ్నీ మంచూ! సామాజికంగా మానవ జీవితంలో ఎదురయ్యే కష్టాలూ దుఃఖాలూ ఆటంకాలూ బాధలూ అశాంతి స్థితులే. ఇవి ఎంతో కొంత తప్పనివి. వీటిని ధైర్యంతో అదిగమిస్తూ ముందుకు పోవడం ఆయువున్న కాలంలో మనిషి చేసేదీ, చేయవలసిందీ. ఈ రచనలో "వెలుగు" మనిషిలో చైతన్యానికి ప్రతీక. ఇది వివిధ సందర్భాల్లో ఆదర్శం, అంతరంగం నిజం మానవత నైతికత మానవ హక్కులూ పౌరహక్కులూ వివేకం మొదలుగా వ్యక్త రూపాన్ని పొందింది. జీవితానుభవంలో అనేక కారణాల వల్ల వెలుగును క్రమ్మేసే అడ్డుకునే నిరోధించే భగ్నం చేసే మాయం చేసే ఉగ్రవాదం మొదలుకొని అనేకమైన ప్రయతాల్ని గమనించవచ్చు. సమస్యల పరిష్కారానికి అందోళన హింస అశాంతి ఈనాటి సమాజంలో కన్పిస్తాయి. అయితే ప్రజాస్వామ్య చేతనలో సహనం స్నేహం శాంతితో ఎక్కువగా సాధించవచ్చుననే కవి అభిప్రాయం. దీనికి పాలకులలో చిత్త శుద్ధి పారదర్శకత నిబద్ధత నైతికత అవసరం. ఏమయినా మనిషిలో ఆదర్శ రూపం అంత మవదు. అంతరంగం మాసిపోదు. మానవత మాయం కాదు. నిజం నిష్క్రమించదు. ఆలాగే హక్కులూ, ఇవి పాతబడవు. ఎప్పటికీ సమాజంలో అవసరం కలిగే ఉంటాయి. వీటి పని అయిపోవడమంటూ ఉండదు. ఈ విషయ క్షేత్రం చాలా విస్తృతమయింది. సమాజంలో భిన్న వర్గాలూ, వివిధ రూపాలూ స్వార్థం ఆధిక్యభావన బల ప్రయోగం పీడనం ప్రతీకారం హింస ఉన్నంత వరకూ మానవ హక్కుల ప్రమేయం తప్పనిసరిగా ఉంటుంది. ఈ స్థితి చాలా సంక్లిష్టమయింది. ఎందుకంటే హంతకుడూ హతుడూ మనిషే. ఉన్నవాడూ లేని వాడు మనిషే. పీడితుడూ పీడకుడూ మనిషే. శత్రువు మిత్రుడూ ఇలా అందరూ మనుషులే. అందువల్ల ఈ కావ్యంలో మనిషిలో వెలుగుతో ఇది నడిచే సరి అయిన స్థితిలో దిశతో ఉత్తమ

లక్ష్యంతో ఎంతో సాధించవచ్చుననే భావన కనిపిస్తుంది. సమాజంలోనూ ఈ దిశలో ప్రేమ శాంతి మనిషిపై విశ్వాసం సౌభాగ్యం సౌహార్దం సమన్యాయం స్వేచ్ఛ శాంతి లక్ష్యంగా నిరంతరం ఎంతో జరగవలసి ఉంది.

భౌతికంగానూ మానసికంగానూ దశలు దశలుగా పరిణామంలో వికాసరూపాన్ని పొందిన మనిషిలో ఆలోచన అనుభవం అన్వేషణం వివేకం ఫలితమే ఈనాటి ప్రజాస్వామ్యం. అందునా ఉదార ప్రజాస్వామ్యం (liberal democracy) మానవీయమైన విలువలతో ఉత్తమమైందిగా పరిగణింపబడింది. ఇది ప్రజల అవసరాల్ని తీర్చేదిగా సమాజ హితకరంగా వ్యక్తి స్వేచ్ఛా ప్రదంగా ప్రాముఖ్యాన్ని పొందింది. ప్రజలకు మేలు జరిగే దిశలో  సమాజ వికాస దృష్టితో పని చేయడం అనేది, పాలకుల చిత్తశుద్ధి పైన ఆధారపడి ఉంది. ప్రజల భాగస్వామ్యంతో ప్రజల్ని ఆదుకునేదిగా సమాజ వికాస దృష్టితో పని చేయడం అనేది, పాలకుల చిత్తశుద్ధిపైన ప్రజలు బాధ్యతను గుర్తించడం పైన నైతిక మైన విలువల్ని కనీస స్థాయిలో పాటించడం పైన ఆధారపడి ఉంది. ప్రతి వ్యక్తీ తన స్థాయిలో విధి నిర్వహణంలో ఎంతో బాధ్యతతో మానవీయ భావనతో చైతన్య శీలంగా ప్రవర్తించవలసి ఉంది.

స్వాతంత్ర్యానంతరం సమాజంలో మతం ప్రాంతం కులం లింగ భేద వివక్షల నుండి ముక్తం చేసే విధంగా "ప్రజాస్వామ్య" లక్ష్యంతో భారత రాజ్యాంగం నిర్మితమయింది. ఆ తరువాత దీనికి "సామ్యవాదం" చేర్చబడింది. ప్రజల్లో ప్రజాస్వామ్య చేతనతో మార్పులూ సమస్యలూ ఉత్పన్నం కావడం సహజం. వీటిని ఎదుర్కొనే పరిష్కరించే విధమూ, సమాజాభివృద్ధికై ప్రణాళిక పాలకుల్లో పారదర్శకత (transparency) జవాబుదారి తనం (Accountability) 2) ప్రజల్లోనూ విధి నిర్వహణంలో బాధ్యతాయుతతమైన ప్రవర్తనమూ నైతికత అవసరం.

1950 డిసెంబర్ 10 నుండి ప్రతి సంవత్సరం ఆ రోజున మానవ హక్కుల దినంగా పరిగణించడం జరిగింది. 1948 డిసెంబర్ 10వ తేదీన ఐక్యరాజ్యసమితిలో మానవ హక్కుల తీర్మానం ఆమోదింపబడింది. ప్రపంచంలో దాదాపు అన్ని దేశాలు దీన్ని ఆమోదించాయి. తమ వంతు కృషీ మొదలు పెట్టాయి. దీనికి తోడుగా భారత

రాజ్యాంగంలో పౌర హక్కులూ నిర్దిష్టమైనాయి. మానవ హక్కులూ పౌర హక్కులూ రెండూ ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్ఠం చేసివిగా తోడ్పడినాయి. ఇవి ముఖ్యంగా సమాజంలో వచ్చే మార్పులు స్థిర పడడానికి బాగా ఉపకరించాయి. తెలుగులో వర్తమాన కవిత్వంపై ముఖ్యంగా స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటి నుండి స్వేచ్ఛా వాతావరణం ఎంతో ప్రభావాన్ని నెరపింది. కవుల భావనలో దృష్టిలో లక్ష్యంలో స్పష్టంగా కనిపిస్తుంది ఇది కవిత్వంలో వైవిధ్యాన్నీ చేకూర్చింది.

ఇదీ ఈ కావ్యానికి నేపథ్యం. కావ్యంలో భావ ప్రసారాన్ని అర్థం చేసుకోడానికి బాగా సహాయ పడుతుంది. "నడిచే వెలుగు చుట్టూ" ఉన్న అనేకమైన వికార రూపాల ప్రభావం ఇందులో కవితాకృతిని పొందింది. నీడలు చీకటి మంచు అగ్ని మొదలైనవి అనుకూలంగాలేని పరిస్థితులకు ప్రతీకలుగా మలచబడినాయి "నడిచే వెలుగు" మనిషిలో చైతన్యశీలమైన మనోరూపాన్ని బింబిస్తూంది. 1) ఆధునిక యుగ ప్రభావంతో ఐక్యమైందీ 2) వర్తమాన సమాజ స్థితులలో తీర్చబడిందీ, 3) మానవీయ భావనతో పరిపుష్టమయిందీ ఈ కావ్యం ప్రజాస్వామ్య భావనతో స్వేచ్ఛా రూపంగా ప్రకాశిస్తూంది. ఈ విధంగా స్వేచ్ఛా కవిత్వంలో ప్రత్యేకతను పొందుతూంది.

స్వేచ్ఛా కవిత్వం ఆధునిక జీవన భూమికతో వర్తమాన సమాజ ప్రభావంతో పరిణత రూపాన్ని పొందుతూన్న ప్రక్రియ. ఎన్నుకొనే విషయం, ఆలోచనా మార్గం, అనుభవ స్థితులూ, అభివ్యక్తి విధం స్పందన స్థానాలూ వాస్తవికత కలిగినవీ, హేతువుకు నిలిచేవీ. కవి కవిని బట్టీ వేరు వేరుగా ఉన్నవీ. ప్రజాస్వామ్య ప్రేరణతో సామాజిక స్వేచ్ఛతో కవి వ్యక్తిత్వాన్ని తలపిస్తాయి.

కవిత్వం గురించి అభిలాష అభిరుచి నిమగ్నత సంస్కార స్థాయి పరిణత దశ మరియు దిశా లక్ష్యంతో కవి అంతర్ వ్యక్తిత్వం ప్రధానమయిన పాత్రను నిర్వహిస్తూంది. సృజన క్రియలో ఇది కృతి విశిష్టతకూ కారణ మవుతూంది. సమాలోచనంలో ప్రతి స్పందనలో భిన్న భిన్న మయిన దృష్టి భేదాలకూ దారి తీస్తూంది. పాఠకుల్లోనూ ఈ విషయంలో మానసికమైన భావైక్యతలో నిబద్ధతలో

సంవిలీనతలో వైవిధ్యము గోచరిస్తుంది. వీటిలోనూ పలు భేదాలూ. ఒకరి అభిప్రాయంలో గొప్ప రచన అయిందీ కవిని గురించి అంచనా స్థాయి మీరిందీ, మరొకరి అభిప్రాయంలో తగ్గుతూంది. అన్నీ సజన ప్రపంచంలో భాగాలే. దేని పాత్ర దానిదే. ఆలాగే పాఠకులూ. అన్నిటికీ ఒక్కొక్క విధంగా సాహిత్య చరిత్రలో స్థానం ఉంది. అన్నీ కలిసిన రూపమే కవిత్వ లోకానికి పూర్ణతను సిద్ధింప జేస్తూంది.

ఈనాటి స్వేచ్ఛా కవిత్వం ఆధునిక మయిన అవసరాల్ని బట్టీ ప్రయోజనాల్ని బట్టీ అవతరించింది. ఎన్నో వాదాలతో అభిప్రాయాలతో ఆదర్శాలతో ఉంది. పద్యానికి సమాంతరంగా ప్రవహిస్తూంది. ఒక వైపు పద్యం కళాత్మక మయిన పరిణతిని పొందింది. తెలుగు ప్రజల సాంస్కృతిక జీవితంలో భాగమయిందీ. మరో వైపు స్వేచ్ఛా కవిత్వం కళాత్మక మయిన వికాసంలో ఉందీ. సామాజిక చలనంతో ఐక్యమయిందీ. జీవనగతిలో భాగమయిందీ. పద్యాన్ని గౌరవిస్తూనే సమాజం, స్వేచ్ఛా కవిత్వాన్ని ఆదరిస్తూంది. ఇదొక విశాల మయిన అనుభవ సుందర మయిన సృజన లోకం స్థితి, స్వతంత్రమయిన కవి ఉన్నతికి నిదర్శనంగా ఉంది.

ప్రస్తుతం ప్రజాస్వామ్య భావనతో ఆధునిక యుగ స్పందనంతో మానవీయ చింతనతో స్వేచ్ఛా కవిత్వం యశోవంతమయిందీ. ఎప్పటి కప్పుడు నవం నవరూపానికి ప్రాతినిధ్యం వహిస్తూంది.

ఉగాది

27-03-2009

**– మాదిరాజు రంగారావు**

అధ్యక్షులు

సాహితీ పరిషత్తు

# I. వెలుగు నుండి

## I.1. సందేహ సమయం

వెలుగు మనిషి బుజం నుండి ఎత్తులో
దేశానికి ఒక పతాక అభిమాన ఘనంగా
జాతి జనుల ఊపిరిలో రెప రెపలా
ప్రాణం కన్న మిన్నయై, యశో భావ జగంతో.

రాజ్యం అంటే
బుజాన ఆయుధ ముఖ రూపం కాదు.

వెనక ఉన్న దృశ్యంలో ఉరికంబంతో
మారణ వేదిక కాదు
మనుషుల రూపాలలో శిల్ప శాల కాదు
చలనంలో రోబోట్ ప్రదర్శనం కాదు.

సామాన్యుల బాధకు స్పందన కరువై
లో నుండి నడిపే స్వార్థ భావ మూర్తికి
పైన కిరీటాన్నీ కింద ఆసనాన్నీ
నిలిపే సవరించే పనిలో జన జీవితాలు.

ప్రాణ హరణ కళలో మసి చేతులతో
ఒకటి రెండు నెత్తురు మరకలతో
వర్తమాన లహరులపై తేలే చిత్రాలు!
వికార భావ ప్రజాస్వామ్య మతులకు ప్రతినిధులు.

స్వేచ్ఛను వికలం చేసే సునిశిత కరాలతో
హక్కును మాయం చేసే ఇంద్రజాల నీతితో
నడిచే రవి రథాన్ని అడ్డుకునే
మందేహులు! కారు మబ్బులు! సంధ్యా సమయంలో

ఇవి చెదరి మాయ మయ్యే పనిలో
వేగ వాయు గతిలో ఝుంఝూ దృశ్యం!
ఏమీ ఎరగని అలలూ చెట్లూ!
అమాయక ప్రాణి కోటి! వణకేను.

## I.2. అగ్ని పథంలో

మనిషిలో ఆలోచన అగ్ని పథంలో
పచ్చని తలపై విలయ చరణ నృత్యం.

రేపు కొత్త మొక్కలు వచ్చేస్తాయనీ
ఎల్లుండి పరిమళాల పూలు పూస్తాయనీ
పండ్ల కయి నిరీక్షణం అవసరం లేదనీ
సులభంగా అందరి అరచేతుల్లో రాలతాయనీ
దిక్కుల్ని ఊగించే మాటలు! ఒకటొకటీ
మనసుల్ని భ్రమింపజేసే మరీచి శకలాలు.

హింసకు ప్రతిహింస నాగరకం కాదు
సమస్యకు పరిష్కారం ప్రతీకారం కాదు
మార్పుకోసం ఆయుధాన్ని వహించడం
ఆకలిలో ఎడారి అంచున భ్రమించడం

గురి పెట్టిన ఆయుధంతో రాజ్యం నడవదు
అసహనంలో మూసిన తలుపులు తెరవబడవు

చిత్రం ఏమంటే?
అందరూ మనుషులే వివిధ పాత్రల్లో
హతులూ హంతకులూ, పీడితులూ పీడకులూ

మౌనం అగ్ని పర్వతంలా
నిశ్శబ్దం రణ కవచంలా

ఉన్న విపది సమయంలో జీవితం
బిక్షా పాత్రను వహించలేదు

చీకటి పీఠం పయి నుండి చూస్తే
చూపుకి గగనంలో చుక్కలు తప్ప
భూమి పయి మనుషులు కన్పించరు

స్వేచ్ఛా పథాన ఆదర్శం చుట్టూ
ఆటంకాలు అడ్డు తెరలు అసంఖ్యాకాలు
రశ్మి భావన కెదురుగా కదలే
మందేహలూ కారు మబ్బులే కాదు
వెన్నెల నిటలంపైనా
చీకటి బాకు గాయాలు!

అవని పయి నడచే వెలుగు చుట్టూ
నీడలు! చీకటి! ఒకటొకటీ దగ్గరగానో దూరంగానో

## I.3. వెనక ముందూ

నడచే వెలుగు వెనక సంధ్యా క్షణాలు
ఖాళీ సీసాల్లా కిందికి దొర్లి పోతున్నాయి

స్వేచ్ఛా మైదానంలో ఎవరికి వారు తమకు
తోచిన ఆటలో ఉన్నారు! జట్లుగా ఒంటరిగా

దాస్యానికీ జూదానికీ అందని జీవితం
ఆగకుండా బంతిలా పరుగెత్తాలనీ
ఎవరికి వారు తాము గోల్ చేయాలనీ

మనిషి మాట అదే! అర్థం మారుతుంది
నడక అదే! పథమూ గమ్యమూ మారుతుంది

పగలంతా వెలిగిన సూర్య బింబం
అలసిన మనసుకు కాస్త ఊరటగా
తన ఉజ్వల ప్రకాశాన్ని ఆ రోజు
చంద్రునిలో చుక్కల్లో నిలిపి పోతూంది.

చల్లారే తాప శిఖలపై నుండి శాంతి
నీలి మబ్బులా కదలి పోతూంది
ఉరుముల్నీ మెరపుల్నీ దాచుకొనీ
రాబోయే విరామాని ప్రి వ్యూలా ఉంది.

సూర్యునివో చంద్రునివో వెలుగు చేతుల్ని
అందుకొనీ సాగాలనే మనిషి మనసులో

వీపు పయి పూవు రేకులా తాకి వెలుగు
వెనక ఉన్న బరువును మబ్బులా తేల్చేను
ఎదపై వెన్నెల చేయి బహు ప్రియంగా
మలుపు తిరిగే నీటి పాయను తలపించేను

పగలు కథ నడిపిన మనసుకు
రాత్రి తీరిగ్గా వినాలనే అభిలాష
విలువల పరిమళంతో కదలే సమయం
నిశ అయినా పగలయినా ఒకటే నన్నట్లుంది.

ముంజేతికి పడిన గొలుసుతో
క్రుధ క్రమ్మిన వ్యధతో నేర నిలయంలో
కరెంటు ఆగిన బల్బుల్లా ముఖాలు!

చాచిన దోసిలిలో గాలి మాత్రం నిండుతూంది
వంగిన చూపుల్ని చీకటి చుట్టేస్తూంది.

కంచెలో ముళ్ళ మధ్య పూవులా
సర్పం మెలి దిరిగిన కొమ్మకు పండులా
భయం వీడని ఆశతో కోరికలో జీవితం!
ఆదర్శం నుండి వాస్తవానికి దిగే వేళ
ఒక్కొక గాయం ఒక్కొక కథ తలపిస్తుంది.

ఎప్పటికో వదలబడీ బయటి వెలుగులో
పూల మొక్కలతో గడపాలనుకుంటే
దారిలో ముళ్ళకంచె పై నుండి
చేయి చాచి అందుకొనే లోపల
రేకులు తునిగి జారిపోతాయి!
అందే పూవు వీడి పడిపోతుంది.

తెరచిన పాత పుస్తకంలో పేజీల మధ్య
దొరికిన ఎప్పటిదో కరెన్సి నోటులా
శిథిలాల మధ్య బయట పడిన శిల్పంలా
మబ్బు నుండి చంద్ర రశ్మిలా అనుభవాలు

ఆశలో ఎత్తుగా చాచిన చేతులతో
నడిచే వెలుగు చుట్టూ చీకటి! అగ్ని!
ఎప్పటికీ పూర్తిగా! అందని దిశలు!
మనిషిలో పద పదం ఆకర్షణతో!

# II. ఉన్మత్త కందుకం

## II.1. అదృశ్యం కాకపోతే చాలు

ఉండి ఉండి విపరీత కృత్యం
ఉన్మత్త కందుక మవు తూంది
జన సమూహ స్థానాల్లో ఉగ్రవాద క్రీడ!
దీని కొక స్థలం లేదు; సమయం లేదు

పొద వెనక నుండి ఆయుధం
మృత్యువును ఉసి గొల్పుతూంది
క్రీడాచరణులపై చీకటి చిమ్ముతూంది
ప్రాణాల్ని పైకి తన్నేయ చూస్తూంది.

కొండలో గుహలో సొరంగంలో వాసం
ఆయుధ మిత్రంతో గడుస్తూంది జీవితం

అసహనం ఆవేశం రెక్కలతో అహంకృతి
చూపే ఈ ప్లవనం
దేని కోసం! ఏ గమ్యం చేరేందుకు?
ఆయుధం తెలీని అమాయకులపై
పిడుగులా వచ్చి పడుతూంది ప్రమాదం
గాలిలో సరిస్తూంది విషాద స్వరం
చీకటి లోయ నుండి పారే సర్పంలా!

ఎడారిలో నీటి పాయలా కరుణ!
గగన పుష్పంలా మానవత!
కనిపించని హంసలా శాంతి
ఆయుధాని కెదురుగా సమాజం

తోటలో బావి నీరు తోడుతూంటే
బొక్కెనకు చిక్కి ఆయుధం బయట పడుతూంది

చెట్ల ఆకుల్లో ఉన్న పండు పై గురితో
పైన ఎగిరే పక్షి రెక్కలపై గురితో
ఎత్తిన ఆయుధం! ప్రాణ హరణ క్రియలో
రణ చరిత్రకు కొత్త మలుపు తెస్తూంది

ఆతంక శిఖల నుండి బయట పడీ
విధ్వంసం గుర్తులతో! ఎక్కడయినా
మనిషి బ్రతకే అవకాశం అవసరం
అజ్ఞాతం లోనో ప్రవాసం లోనో.

ఏ ఎదురు కాల్పుల్లోనో ఇరుక్కొని
ప్రాణం గాలిలో అదృశ్యం కాక పోతే చాలు!

## II.2. స్వేచ్ఛా తంత్రం

స్వేచ్ఛ పేరుతో పులి బోను నుండి విడుదలై
బ్రతుక్కీ భయానికీ భేదం లేకుండా పోతూంది

జాతుల దేశాల సంస్కృతులు వేరయినా
మానవ చరిత్రలో సభ్య పంక్తి స్థాయి ఒకటే.

స్నేహంతో చూపులో ఏ పూవో వెలుగో బదులు
వసంతాన్ని మండించే రసాయ ద్రవ సేచనం
నిప్పు కణం విసరి యువ జీవితంపై
ప్రేమకు మంటల పందిరి దించేరు.

పంకజం నుండి పరిమళం కోరే బదులు
పంకం తీసి ముఖాన చల్లే పరిపాటి
ర్యాగింగ్ పేరుతో ఎపుడో మొదలయింది!

నవ వికార సంస్కృతికి ప్రవేశికగా కదలే
అరాజక దృశ్యాల అంతానికి ఆరంభం లేదా?
అన్న ప్రశ్న! అగ్ని శిఖలా వెంటాడుతూంది
పెద్దలు జవాబు దాటేయడం మామూలే!

ఆగ్రహం! ఆవేదన అశాంతి ఘర్షణలో
మధ్య మధ్య ప్లాస్టిక్ వసంతం తేవాలనీ
ప్రజాస్వామ్య తంత్రంలో భాగమవుతూంది
స్వేచ్ఛకు చిత్రమయిన మాస్కులు తొడుగుతూ

శాంతి శరీరం పయి నిలువునా
మేకులు దించ బడుతున్నాయి
కన్నీటితో తడిసిన నేల దాటితే
నెత్తురు మరకల సీమ ఎదురవుతూంది

ఆంక్షల వెనక నుండి అనుమానాల చాటు నుండి
బాధల చిత్రాలతో ప్రతీకార రూపాలు!

ఆక్రోశం ఆకాశాన్ని చీలుస్తూంది
ఆగ్రహం స్తంభాలకు చెమటలు పట్టిస్తూంది

దూసే ఆందోళన స్వరం వెనక
పొందే సముద్ర మంత ఆలజడి
ఉరికే ఆవేశం అడుగుల వెనక
దూకే జలపాత మంత సాహసం

సంఘర్షణ భూమిని వణకిస్తూంది
సంవేదన క్షితిజాన్ని మండిస్తూంది
సంధ్యామయ సమాజం నిప్పంటినట్లుంది
విరామ చిహ్నాలతో! మారణ దృశ్య రచన!

ప్రజాస్వామ్య విషమ భావ తంత్రం
రోజు కొక జోక్‌గా మారుతూంది
నడిచే వెలుగు చుట్టూ వ్యూహ రచన
కదిలే నీడదో! చీకటితో! అగ్నిదో!

## II.3. అందమైన అవరోధాలు

వెలుగు నుండి చీకటిలోకి
అడుగు దూరాన రణం
చీకటి నుండి వెలుగులోకి
అడుగు దూరాన శాంతి
అపుడపుడూ హద్దులు చెరగిపోతాయి
జీవితంలో పుష్ప శాఖలు భగ్నమవుతాయి

పగిలిన నిలువ టద్దం ముక్కల్ని జోడించి
తెలివిగా తన ప్రతిబింబం నిలపాలనీ
చినిగిన గాలి పటం పీలికల్ని అతికించి
ఆశలో తన ఆలోచన ఎగరాలనీ

మాటలు గాలి మాటల్లా
విప్పకుండానే ఎగిరిపోయేను
చంద్రుణ్ణి పర్సులో వేసుకొనీ
చుక్కల్ని జేబులో నింపుకొనీ
బ్రతుకును అదృష్టంలో గడపాలనుకుంటే,

అర్ధరాత్రి ఎపుడో పర్సుపోయి
జేబు కత్తిరింపబడి ఉంటుంది.

ఆదర్శానికి ఆచరణకూ మధ్య
కల్పనకూ వాస్తవానికీ మధ్య
కదలే మీగడ మంచు తెరలూ
నిలిచే పల్చని వెండి వెన్నెలా

కన్పించే ముఖం కన్నా అద్దం
శుభ్రంగా స్ఫుటంగా ఉండాలనీ
అంతలో ఎదురుగా శిశువు నవ్వులా వెలుగు
అద్దంలో పూర్తిగా బింబించలేని దృశ్యం
నడచే వెలుగు చుట్టూ అందంగా
తెరలుగా మంచు, నిలువునా వెన్నెల!

# III. కావలసిందీ రావలసిందీ

## III.1. చెరొక వైపు

ఊరూ ఇల్లూ జ్ఞాపకం ఉంటాయి
అంతరంగం మరుగున బడుతుంది
లోన అరణ్యం పెరిగిపోతూంటుంది
ఇది 'జూ'గా మారే అవకాశమూ ఉంది.

సర్కస్ నేతల చేతుల్లో ఇదొక
వినోదానికో వ్యాపారానికో ఉపయోగపడవచ్చు

రాత్రి చీకటిని పోగొట్టే వెలుగుతో
అడవిని ఊరుగా తోటగా మార్చే తెలివితో
సమాజ హితం కోరే మనిషిలో అంతరంగం
చీకటిగా అడవిగా మారడం ఒక విపరీతం

ఆపదలో సీతకు లా
భూమి ఎద తలుపులు తెరవదు
అవసరానికి శకుంతలకులా
గగనం తన గళం విప్పదు!

విరోధ చరణాలతో వికార చర్యలతో మనుషుల
ఆలోచనకూ అగ్నికీ భేదం లేకుండా పోతూంది

మెడకు  పూల రేకుల చేతులు చుట్టిన
శిశువును గుండెకు హత్తుకొనీ
మంటల సందుల్లో మండి పరుగెత్తిన తల్లి
శిశిర ముఖంతో డేరాలో తలదాచుకొనీ

అన్నం పొయి వెలగించేందుకు
అగ్గి పెట్టె కోసం! తడుముతూంది చీకట్లో
ఇంకా ఇక్కడ ఎందుకు ఉంది? అంటే
జవాబు! గాజు పెట్టెలో వజ్రంలా ప్రతిఫలిస్తూంది.

తెలియని భాషలో చేతికందిన గ్రంథంలా
సరికొత్త ముఖాల సమూహాల సమాజం!
జరిగిన సంఘటనలో పాత్రల నిజంపై
మళ్ళీ మళ్ళీ పోస్ట్ మార్టమ్‌కు జరుగుతూంది

ఆకాశ గళం పయి నెత్తురు గంధం పూయాలనీ
జలనిధి అర చేతుల్లో నెత్తురు చిత్రం వేయాలనీ
చంద్రుని చెక్కిలిపై నీలి మచ్చను చెరపేసీ
అగ్ని శిఖను నిలపాలనీ మనిషిలో సాహసం!

వార్తా పత్రిక పుటలతో తయారయిన
సైజుకు మించిన డ్రెస్‌లో రోజు!
పరుగెత్తుతూంది! ఎవరికీ అందకుండా
వెనక నుండి గురి పెట్టిన ఆయుధం!

వెలుగుకు కోపం తెలియదు, రాగం తెలుసు
అగ్నికి హాసం తెలియదు. హితం తెలుసు

నడిచే వెలుగు చుట్టూ!
చీకటీ అగ్నీ ఒక వైపు
నీడలూ మంచూ ఒక వైపు!

## III.2. నిశ్శబ్దంలో మౌనంలో

భూమి మాట్లాడదు నిశ్శబ్దంగా ఉంటుంది
పెదవి విప్పితే! కంపనం! ప్రకంపనం!
గగనం మాట్లాడదు మౌనంగా ఉంటుంది
పెదవి విప్పితే ఉరుములు! పిడుగులు
నీలి మబ్బు దృశ్యంతో అంతటా కోలాహలం
పాము మైదానంలో పడగ ఆడిస్తుంది
నెమలి కొమ్మ దిగీ పురి విప్పుతుంది
పిల్లలు బయటికి వచ్చి గంతు లేస్తారు.

ప్రజలు చూపు క్రింది నుండి పైకి
పై నుండి క్రిందికి నిరీక్షణలో
రావలసిన దాని కోసం! ఆలస్యంతో!

వీలు కాకపోవచ్చు, పథకం మారవచ్చు
పోస్ట్‌పోన్ చేయవచ్చు, కాన్సిలూ కావచ్చు
నీలి మబ్బు కనిపించడం ఒక ఎత్తూ
తాప హరంగా జల సేచన ఒక ఎత్తూ

ఆలోచనకూ నిజానుభవానికీ
మధ్య అంతరం ఎప్పటికీ
కలానికీ కాగితంపై అక్షరానికీ ఉన్నంత

రాత్రి వీధి దీపం వెలుగులో
పుస్తకంలో అక్షరాలపై తేలే

కళ్ళలో వర్తమాన వాస్తవానికీ
పొంచి ఉన్న భవిష్యత్తు కల్పనకూ
మధ్య అంతరం! పేదరికంలో! ఎప్పటికీ
ప్రజాస్వామ్య ఉపకృతితో సమసే భేదం

రావలసిన ప్రాణ ధార
క్రిందికి వచ్చి తీరుతుంది.

ఒకరి ఆహ్వానం పయి వచ్చి
ఒకరి కోరిక పయి వెళ్ళే మనిషి
బ్రతుకులో! పూల గుత్తి కావచ్చు
ఆయుధం గానూ మారి పోవచ్చు

నడిచే వెలుగు మనిషి చుట్టూ
చట్టం శాసనం సూక్తులు బోధలు
అందని గగన కుసుమాల్లా హక్కులు
గిరి సమూహ పంక్తుల్లా సమాజం!

ఎక్కడో! శిఖరం నుండి ప్రవాహంలా మానవత
అడవుల్ని దాటి క్షార జలధిలోకి దూకేను

గాలిలో కలిసి పోయే ఆర్తి
తిరిగి వినిపిస్తుంది కవి స్వరంలో

అజ్ఞాతంగా ఉన్న రహస్యం
బయట పడిపోతుంది కవి చూపులో

జడమయమై పోయిన హృదయం
మళ్ళీ స్పందిస్తుంది కవి సృజనతో.

## III.3. కాలం వెంట

ఎవరో నడిపిస్తే నడిచే మనిషిలో
లో వెలుగు సిగ్గుతో తలవంచుకుంటుంది

భిన్న భావాల అభిప్రాయాల ఘర్షణ
చలనంలో విపరీతానికి దారి తీస్తుంది
వాద వివాదాల్లో చిక్కుకున్న సమస్య
ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లే!

ముఖాలు ఒకటే, ఎక్కడ చూచినా
ముఖాల్లో బొమ్మలు వేరు.
ఇవి లేంది జీవితం లేదు.

ఆకలిలో అన్నం కయి
అవసరానికి  నాణెం కయి
సత మత మయ్యే జీవితంలో
ఆదర్శాల తలుపులు మూతబడతాయి.

కాలం ముందుకు సాగిపోతూనే ఉంటుంది
తనతో వచ్చే మనిషి ఆగిపోయి
కలలో నిలిచినా శిలయైనా
అక్కడే వదలి వెళ్ళి పోతుంది
తన బుజాల పయి ఎవరినీ మోసుకొని వెళ్ళదు
తనతో వచ్చే ఎవరి నైన కాదనదు.

# IV. వెలుగు వైపు

## IV.1. తెరవాలిసిన తలుపులు

ఎంత కాలం నుండో
గడ్డ కట్టిన చీకటి శిఖరంపై
నిలయం! తలుపుకు తాళం పడీ.

తాళం చెవి ఎక్కడుందీ! ఒక సమస్య!
ఎవరికీ సరిగా తెలిసినట్లు లేదు.

లోపల బతుకులు శూన్య వాలకాలతో
వలయంలో కదలుతూ తిరుగుతూ
ఉన్న అడుగు జాడలలో అడుగులతో
మూసిన తలుపు రెక్కలపై చూపులతో

తలుపులు తెరిస్తేనే బయటి నుండి
వెలుగో! మనిషో! వచ్చేదీ! చూచేదీ!

ఎపుడో వేయబడీ మరచి పోబడీ
తాళం తీసేందుకు తలుపులు తెరచేందుకు
పిలుపులు! హెచ్చరికలు! మానవ హక్కులకై
ఆందోళన! ప్రజాస్వామ్య నవ చేతనలో
ఒక మారు తెరచింది మూత పడదు
ధైర్యంగా బ్రతికే మహదవకాశంతో

ప్రతి వ్యథలో ఏదో దిశలో ఎప్పటికీ
మూసిన తలుపులు తెరచే చేతులు!

చీకటి తరిగీ కరిగీ తొలగిపోయే
చేతనలో ఆపరాని చరిత్ర చలనం
స్పందనతో వెలుగు వైపు సమాజం!

## IV.2. నిర్ణయం

మనిషికి చేయి ఉంది! దేనికి?
మొక్క నాటడానికా! వేటు వేయడానికా?
పూవు తెంచడానికా? బాంబు విసరడానికా?
ఏదయినా! నిర్ణయం మనిషి మనసుదే!

మనిషిని పలకరించే మాటల కన్నా
వాహనాల ధ్వని సమూహమే ఏలుతూంది

ఎంత దూరం నడిచిందీ తెలిసేందుకు
అపుడపుడూ వెనక్కి చూడక తప్పదు.

ఎండిన కొమ్మకు పూలదండ సవరించి
సమన్యాయం పేరుతో వసంతమని అరిస్తే
చివురు నవ్వదు సరి కదా!
నిప్పు రవ్వగా మారనూవచ్చు!

నదిలో దోసిలి నీళ్ళలో బింబించే
దిన మణి! చేతి కందినట్లు కాదు

జలాలలోకి దిగేందుకు భయం వేస్తే
సమాజ ఝరిలో ఈదే సాహస మెక్కడిది?
త్యాగంలో జిగీషలో సృజనలో
ఉదారునికీ వీరునికీ కవికీ తప్పు!

## IV.3. తొలి స్వరం

శత్రువు చలనంలో కదలుతుంది గ్రీష్మ చరణం
శిశువు ముఖంలో తూగుతుంది తొలకరి మేఘం
ప్రేమ హృదయంలో సుమిస్తుంది వసంత రూపం
దరిద్ర వాలకంలో తిష్ఠ వేస్తుంది శిశిర దృశ్యం

ఉన్న రుతువు వచ్చే రుతువుకు దారి ఇస్తుంది
ఉన్న తరం మరో తరానికి వీలు కల్పిస్తుంది
ఉన్న అల మరో అలకు చోటు ఇస్తుంది
ఉన్న ఊహ మరో ఊహకు వెలుగు నిస్తుంది

అవతలి మనిషి నుండి బవులింగ్‌తో
ఇవతలి మనిషి నుండి బ్యాటింగ్‌తో
సక్రియలో బంతిలా సాగే జీవిత సమయం!
చూచే మహా జనం ఉత్సాహ లహరులవుతారు.

దాహంలో మబ్బు నుండి నీటి బిందువు
సముద్రాన్ని అవలీలగా ఓడిస్తుంది
వేదనలో కళ్ళ నుండి బాష్ప బిందువు
సముద్రాన్ని చిటికెలో జయిస్తుంది

తాపంలో ఆర్ద్ర స్వరం వినేందుకు
వయొలెనో సితారో అందుకోవాలనీ!
కాని చేతి వేళ్ళ కెంత సాధన కావాలి?
లేంది! తీగెలు వణకిపోతాయి
పిల్లల అరుపుల్లా వినిపిస్తాయి!
ఉన్మద ప్రేలాపనల్లా శబ్దిస్తాయి
చెలరేగిన అల్లరినీ తలపిస్తాయి
శిశువు తొలి ఏడుపు స్వరమూ వినిపిస్తుంది.

# V. నడిచే మనిషిలో

## V.1. సమయ సమయం

పేదరికం దాడిలో మనిషిని చూస్తే
కనిపించే ఎండిన చెట్టు జ్ఞాపకం వస్తుంది
బాగానే ఉంది! అదే నయంలా ఉంది
జలదం పయి అశకు! అవకాశంతో!

చెట్టు క్రింద నీడ లేదు ప్రాణి లేదు
చెట్టు పైన పక్షి లేదు గూడు లేదు

దారిన పోయే జంతువు ఆత్రంగా
వస్తుంది శరీరం బోదెకు రాస్తుంది
కొమ్మలతో కోరాడీ వెళ్ళి పోతుంది
ఉపశమనంలో సంతోష ముఖంతో

దారిన పోయే మనిషి సమీపిస్తాడు
చేతిలో గొడ్డలితో ఎగాదిగా చూస్తాడు
సమయం రాలేదనో! తీరిగ్గా రావాలనో
ఆలోచనలో మెల్లగా కదలిపోతాడు.

గాలి వీస్తుంది యథాతథంగా
ఏ భేద భావం లేకుండా
వెలుగు పడుతుంది యథాతథంగా
ఏ దృష్టి భేదం లేకుండా

జలదం వస్తుంది ఉదార హృదయంతో
స్వార్థం ఎరగని స్వేచ్ఛా పథంలో

మనిషిలో భేదాలు! విరోధాలు! నిరోధాలు
ఆశల్ని తెంపుతూ, అడుగుల్ని నిలుపుతూ

చెట్టుకీ మనిషికీ బంధం ఇప్పటిదా?
పేదరికం దాడిలో మనిషిని చూస్తే
ఇప్పుడు జ్ఞాపకం వచ్చేది చెట్టు కాదు
ఎదురుగా కదలి పోయే మనిషి మాత్రమే

హతుడూ హంతుకుడూ ఇరువురూ మనుషులే
నడచే వెలుగు చుట్టూ! మనుషులు! తెరలుగా!
నీడలు! చీకటి! మంచూ! అగ్ని! ఒకటొకటీ
ఒకదానిపై ఒకటి సమయ సమయం పొంచీ
ఒకదాని నొకటి మ్రింగాలనీ మీరాలనీ.

## V.2. జీవిత వాస్తవం

శిలను చూస్తే ఒకరికి అనిపిస్తుంది
ఎంత బుద్ధిగా ఉందీ, కదలకుండా, అనీ

మును ముందుకు దూకే అలకు
అది జడ జీవితం అనిపిస్తుంది

అలను చూస్తే ఒకరికి అనిపిస్తుంది
ఎంత ఉల్లాసంగా కదలి పోతుందీ, అని

కదలని శిలకు మాత్రం అది
స్థిరత లేని బ్రతుకనిపిస్తుంది

పర్వతం అంది నదితో
ఎండలో వానలో చలిలో మౌనంగా

దృఢ మయిన శిఖరాలతో
"నేను నీకు మూలమూ! ఆశ్రయమూ"

నది అంది పర్వతంతో
భూమిని సస్యమయం చేసే
"సమాజ చింతనలో ధారలుగా
విడిపోతూన్నా మన బంధం తెగనిదీ"
పర్వతం అంది నదితో
"నేను కదలడం మొదలు పెడితే
సమస్తం అణగి శిథిల రూపం పొందుతుంది"

నది అంది పర్వతంతో
"నను బంధించే స్థితిలోనూ
ముందుకు పోయే ఉత్సాహం ఆగదు,
నాకై ఎదురు చూచే వారెందరో".

గిరి నది రెండూ మనిషిలో
జడమూ చైతన్యం కలిసిన ఆకృతి
సుందరమై హితకరమై! దేని అస్తిత దానిదే!
నడచే వెలుక్కి జీవిత వాస్తవాన్ని తెలుపుతూ.

## V.3. అనుకోని నిజం

కదలే ఊహల్ని అక్షరాల్లో
వజ్రాల్లా పొదగాలని అనుకుంటే
నిశీథి గగనంలో నక్షత్రాలవుతాయి

కలిగే బాధల్ని అక్షరాల్లో
కెంపుల్లా నిలపాలని చూస్తే
ఉదయం క్షితిజంలో అరుణ కళ లవుతాయి!

దూకే  కష్టాల్ని అక్షరాల్లో
నీలాల్లా బంధించాలని చూస్తే
వెనకనే ఛాయా రూపాల్ని పొందుతాయి
పొందే ఆనందాన్ని అక్షరాల్లో
ప్రియంగా చూడాలని అనుకుంటే
ఎగసి పైకి చంద్ర బింబమవుతుంది

“ఇదేమిటి? చిత్రంగా ఉంది
ప్రతిదీ! ఇలా అయిపోతుందేమిటి?”
అని అనుకుంటూ ఉంటే, చకితంగా
అంతరంగ స్వరం వినిపించింది మెల్లగా

నీవు అనుకునేవి! ఎక్కడి వక్కడే ఉన్నాయి
చుక్కలూ! అరుణ కళలూ! ఛాయ! చంద్రుడూ!

నీవు పొందింది భ్రమ! నిజంగా
అవి అక్షరాల ప్రతిఫలన రూపాలు!

నేనో చిన్న పిల్ల వాడిననో?
కాకపోతే వృద్ధ మహాశయుడననో?
అక్షరం ఎంత పని చేసింది
భ్రమ కలిగించింది! ఉత్సాహంగా
నన్నొక ఆట పట్టించింది! అందంగా

లేడిలా దూకుతూ అనుకోని దాట్లతో
కవితయై వెలసింది అక్షర రూపంలో.

# VI. వెలుగు కోసం

## VI.1. ఎవరికి విరోధి?

ఈ ఉగాది ఎవరికి విరోధి?
ఆటంకానికీ ఆతంకానికీ అమానుషానికీ తప్ప!
ఇది జీవిత కాలంలో ఒక ఏడాదికి శీర్షిక
పోయిన కాలానికి ప్రతి రూపం కానే కాదు

నాలుక ఒకటే రుచులు వేరు
వాటి స్థాన బిందువులు వేరు
మనసు ఒకటే స్థితులు వేరు
మనిషిలో కనిపించని మూలాలెన్నో!

పచ్చని శరీరంతో కోకిల స్వరంతో
వేప చెట్టూ మామిడి చెట్టూ మనిషిలో
గుప్తంగా నవారంభానికి రేఖలుగా

ఈ రోజు వెలుగు! జన హృదయంతో
ఇంద్ర చాపంలా విరిసి మిత్రమవుతుంది
ఏ రోజూ పరీక్షలో నిరీక్షలో ఉండే ముఖాలు
ఈ రోజు విరామ రూపాలతో ఎదురవుతాయి

ఆయుధం మాటలేని బాంబుల ప్రసక్తి లేని
ఆహ్వాన లిప్తలతో, స్వాగత క్షణాలతో
అణువణువూ కలిసి పూల గుత్తి అవుతూంది
పరిమళ పవనం అందరినీ పలకరిస్తూ పోతుంది

పంజరంలో చిలక ఒకసారి బయటికి వస్తుంది
పెట్టెలో దాచిన మణి ఈ రోజు ప్రదర్శనలో నిలుస్తుంది

గోడకు ఫోటో నుండి నిజ రూపం దిగుతుంది
గ్రహాలు నక్షత్రాలు! అరచేతుల్లో తిరుగుతాయి

ఊరు నుండి ఊరుకు నగరం నుండి నగరానికి
దేశం నుండి దేశానికి మేలైన బ్రతుకులకై

ఎక్కడున్నా ఈ రోజు ఉదయ కిరణంతో
వేప పూవూ! మామిడి ముక్కలూ! పులుపు తీపి కటు
రుచి రూపం! రసనపై నర్తిస్తుంది! అనుభవబింబమై
స్వల్ప సమయమయినా చిర మూర్తియై! కవితయై

కాగితం పయి మౌనంగా కదలే అక్షరాలు
లోన మానవ సంగీతాన్ని ముద్రించేను

చేతుల కలయికలే కాదు హారంలా
చూపుల కలయికలే కాదు తోరణంలా
హృదయ స్పందనలో సమ లయ నందుకొనీ
దారిలో ముఖాలపై చూపులు పరచీ
నమ్మకం లేని కాలం ప్రియంగా కదలుతూంది
అలజడిలో తేలే సమాజం శాంతి తీరం చేరుతూంది

నడచే వెలుగు చుట్టూ చీకటీ! అగ్నీ!
దూర దూరం కదలుతాయి! తప్పుకొనీ
ఈ ఏడాదికి శీర్షిక! ఈ ఉగాది! ఎవరికి విరోధి?
ఆటంకానికీ 'ఆతంకానికీ అమానుషానికీ మాత్రమే

నడిచే వెలుగు చుట్టూ
దూరం నుండీ దగ్గరి నుండీ
అడ్డుకునే చీకటికీ? కాల్చే అగ్నికీ! కాకపోతే
మరి ఎవరికి విరోధి? ఈ విరోధి!

## VI.2. సమాజ మూలంపై

వ్యక్తి ఎత్తు ఎంతటి దయినా
అస్తిత సమాజ మూలం పయినే
పూర్ణతను కబళించదు సమాజం
తన ప్రకాశంలో భాగం చేస్తుంది.

విన గలిగీ చూడగలిగీ సమాజం
గిరి శిఖరంలా ఉండలేదు మౌనంగా

మాట ధ్వనిస్తుంది సరికొత్త అర్థంలో
చూపు సూచిస్తుంది నడకలో అవసర దిశ

కాలంతో సమాజ చలనంతో సాగే
జీవన చరణ పంక్తి ఆగదు తొలగదు.

గుప్పిట లోనో పిడికిలి లోనో
ప్రశ్నకు జవాబు దాగి ఉండదు

రాత్రి వెలిగే వీధి దీపం
ఘటనకు సాక్షిగా నిలవలేదు
తెలియని రహస్యం విప్పలేదు

చేతనలో స్వేచ్ఛ విలువ తెలిసేది
లో వెలుగు నడిస్తేనే మనిషిలో
బయట బ్రతుకు చరిస్తేనే సరిస్తేనే
త్రవ్వితేనే, భూమి నుండి జలమో! ఖనిజమో
మీటి తేనే, మనసు నుండి రాగమో! భావమో!

## VI.3. అగ్నీ గుప్తంగా

గగనంలో కదలే మేఘంలో
జలధిలో తరలే అలల్లో
దేహంలో! కాష్ఠంలో! అణువణువూ
అగ్ని! ఆలోచనలో క్రియలో గుప్తంగా
సృజన హృదయం ముందుకు నడిపిస్తుంది
విలయ పవనం బ్రతుకును నిలిపేస్తుంది

మనిషిలో ఒక్కొక స్థాయిలో పైపైన
అస్తమయం ఎరగని సూర్యుడూ
కృష్ణ పక్షం ఎరగని చంద్రుడూ!
కాలాన్ని జయించే అమృతోత్సాహంతో

భవిష్యత్తు భాగ్యంకై సామాజిక చలనంతో
గ్రీష్మంలో జ్వాలలా ఆవేశం
మేఘం నుండి పిడుగులా ఆవేశం
అవసరమై జీవితాన్ని మార్చే సంరంభం!
సూర్యుణ్ణి నెత్తురులో ముంచేసేయాలనీ
చంద్రుణ్ణి మంటల ఊయలపై ఊపాలనీ.

గుండెలో లేత చివురుతో
నడకలో పదును కత్తితో
మాటలో జన హిత కళతో
ఎక్కడో మహాభిలాష
పరివర్తన రాగంతో
నడిచే మనిషి చుట్టూ! జీవితంలో
నీడలు! చీకటి! మంచూ! అగ్నీ!

స్వేచ్ఛా కవిత్వం

రెండవ భాగం - 17

# అపూర్వ

మాదిరాజు రంగారావు

**2009**

**రసధుని సాహితీ పరిషత్తు**

శాంతినగర్, హైదరాబాద్ - 500 028

*Presented*

to

my daughter

***Mrs. Haritha Devulapalli***

M.A. (Lit.)

M.I. U.S.A.

with blessings

# అపూర్వ

## సూచిక

1. పరివర్తన తేజం........................................................04
2. వనిలో పుష్పంకై........................................................05
3. పరిమితిలో మనిషి ....................................................07
4. అందరూ స్వేచ్ఛగా ....................................................08
5. చలనంలో ఆకర్షణ ....................................................09
6. రేఖపై చివరలలో .......................................................11
7. మనిషి గుర్తులతోనే ....................................................12
8. నిర్ణయం మనిషిదే ......................................................13
9. స్మృతి సంకేతంతో .....................................................14
10. రంగుల ప్రపంచంలో ..................................................15
11. ప్రకాశ రూపం ........................................................16
12. మూడో కన్ను చూచేదీ ................................................18
13. అనుభవంలో నిజం ..................................................20
14. ఎవరు చెప్పినట్లూ కాదు ............................................21
15. మాయని సృజన చిహ్నం ............................................22
16. లోపల నదితోనే జీవితం ...........................................23
17. అనల హస్తాలపై ఆదర్శం ...........................................27
18. కాశ్మీర్ గులాబి చుట్టూ ...............................................30
19. అగ్ని శిఖతో శ్రీలంక ..................................................32
20. మరలకలతో మెల్‌బోర్న్...............................................35
21. అమ్మ ....................................................................40

# అపూర్వ

## 1. పరివర్తన తేజం

వర్తమానం నా రూపం
నా రూపం సృజన ప్రపంచం
ఇంద్ర ధనుసు లేదు ఎదుట
మానవ పద పంక్తి తప్ప.
పరివర్తనలో బీజం
కొత్త ముఖం ఎత్తుతూంది.
నాలో ఆలోచన
పచ్చదనం పరుస్తూంది.
సమాజ నవ సంకల్పం
గమ్యం నిర్దేశిస్తూంది.
కాలం కదలుతూంది.

మనిషి విలువ మరవ బడీ
అడవిలో బడుగు కుటిక
అమ్మ కొంగు చివర
ముడి వేసిన రూపాయి నాణెంలా
మనిషి విలువ వెనక బడీ
ఊరు చివర పేద గుడిసె
అమ్మ కొంగు చివర
ముడి వేసిన రూపాయి నోటులా
బ్రతుకు బరువు నడకలో ఈ సమయం
చింతనలో చోటు లేదు దేవతలకు
యోచనలో తావు లేదు స్వర్గానికి
సమాజ నవ దర్శన నేపథ్యం లో

కాలం పరుగెత్తు తూంది

ఊళ్ళూ నగరాలూ దేశాలూ ఖండాలూ
దాటి, ఇంటర్నెట్ నిలయాలు చేరి
సామాన్యుని కోరిక నీడకు కూడా
అందని దూరంలో
ప్రపంచ ఖజాన వరకూ

కాలం పరుగెత్తుతూంది అశ్వంలా.

నాలో నిలకడగా నిలువుగా
నిలిచిన అనల రేఖ ముందు
ధన బల హిమ మకుటం వంగుతూంది.

కుటిక ముంగిట్లో
గుడిసె ముంగిట్లో
బాష్ప బిందు ముఖ దృశ్యం
వెనక నుండి జన తేజం
రాత్రి వేళ సూర్యునిలా.

ఆశయ నవ కరాలపై
మనిషి విలువ నెత్తుతూంది
అనల శిఖకు కొత్త చరిత నిస్తూంది
సమాజ ఫల సంపద లో
సమ న్యాయం వాస్తవమై

వర్తమానం నా రూపం
పరివర్తన సృజన ప్రపంచం.

## 2. వనిలో పుష్పం కై

వర్తమానం నా రూపం
నా రూపం సృజన ప్రపంచం

ప్రతి ఒకరి ఊహలో ఆదర్శ సమాజం
అనుభవ జగత్తులో పరివర్తన రూపం

పెను గాలికి పిడికిలి బంధించీ
ఆకాశం ఛత్రంగా మస్తిష్కం పై
పయనంలో విజ్ఞాన శిఖర పంక్తులు
అదృష్ట రూపాన్ని దృశ్య మానం చేసేను

నలు వైపుల విస్తరణంలో
గమ్యానికి దారులు పెరిగీ
ఇష్టంలో గుప్తంగా
స్వార్థంలో ఆప్తంగా
ఎక్కడి కక్కడ ముక్కలు ముక్కలుగా
దారులు మూయ బడీ సమాజం

ప్రతి మనిషిలో తన కోరిక సాగాలనీ
ప్రతి ముక్కలో తన రూపం చూడాలనీ

కాళ్ళూ చేతులూ సంకెల లెరుగక పోయినా
ఎపుడో ఒకపుడు మనసుకూ పడవచ్చు

జీవన ప్రపంచాన్ని గూటికి చేర్చే
సంకెల వదలడం సులభం కాదెవరికీ!

వనిలో పుష్పం కయి అడుగు వేస్తే
తనకో పుష్పం అందనూ వచ్చు
వేలికో కాలికో ముల్లు గుచ్చు కోవచ్చు
ఏ పుష్పంకై రాని వారూ లేకపోలేదు
వనికి హాని చేయక పోవడమే కాదు
వని రక్షణలోనూ బాధ్యత ఉంది
ఏ ఒక్కరి కోసం కాదు వనం
ప్రాణు లందరికీ ఆధారం.
వర్తమానం నా రూపం
పరివర్తన సృజన ప్రపంచం.

## 3. పరిమితిలో మనిషి

వర్తమానం నా రూపం
నా రూపం సృజన ప్రపంచం

సృజన సుందర పూర్ణ శిశువుకు
తొలకరి చినుకుల హృదయంతో
స్వాగత మిస్తుంది సమాజం,
వీలు కాదనదు, చోటు లేదనదు.
ఒక స్థితిలో తుపాను రావచ్చు
సమస్యకు దారులు తెరుస్తూ
బీభత్స దృశ్య పరంపరతో
విషాదానికి తలుపులు తెరుస్తూ

భూకంప రావచ్చు ఎపుడయినా
ప్రమాదకర దీర్ఘ కరాలతో
మనిషిలో శక్తి పరిమితి చూపిస్తూ

సమయంతో సందర్భంతో
విలయానికి పని లేదు
విలయంలో ఉండే వేగం
నిర్మాణంలో కనిపించదు.

కాలం వేసే బరువుల్ని మోస్తూ
నిర్భయంగా నిజ చరణాలపై సాగే
మనిషి ముందు కఠిన వాస్తవాలు
ఆరోహణలో నిలిపే సోపానాలై!

పిడుగు పడితే తెలుస్తుంది
శ్మశాన మెంత సమీపమో
మనిషి కనిపించక పోతే తెలుస్తుంది

ఆ శూన్య మెంత నింపరానిదో!
మృత్యు భయం అపుడపుడూ
ఎన్ని గొప్ప పనులో చేయిస్తుంది.

రణ సదృశ సమయంలో లిప్తలు
మనిషిని పరీక్షకు నిలుపుతాయి.

ద్వేష  కంటకం మొన
తేలినంత సూటిగా బలంగా
స్నేహ సుమం రేకులు నిలబడవు
ప్రేమ ఫలం సులభంగా దొరకదు.

మనిషిలో మనిషిపై ఆగని జిగీష
మనసులో జగతిపై తీరని నినీష
వర్తమానం నా రూపం
పరివర్తన సృజన ప్రపంచం.

## 4. అందరూ స్వేచ్ఛగా

వర్తమానం నా రూపం
నా రూపం సృజన ప్రపంచం

కొండల్లా పడి ఉన్న బ్రతుకులు
భయం లేని చలనంతో
అరణి నుండి అగ్నిలా
జలం నుండి ఊర్జలా
స్వేచ్ఛలో హక్కులకై నినాదం!

నిరశన నిరసన ఘర్షణతో
మూసిన దారులు తెరచే పనిలో
కాలానికి వేగం హెచ్చేను

కోరికపై కరుణ జలం
ఎప్పుడు బడితే అపుడు
ఒలకదు! జారదు! కురవదు!
వీరుని చరణాలలో వేగం
ఎప్పటికీ ఒకే విధంగా నిలవదు!
తాను నిలిచిన చోట
విశాలమైన ఆకాశాన్ని చూచేందుకు
ఎవరికీ ఇబ్బంది కాకూడదు

తాను బ్రతికే చోట
స్వచ్ఛమయిన గాలిని పొందేందుకు
ఎవరికీ కష్టం ఉండకూడదు

తాను నడిచే చోట
ఇష్టమయిన దారిన పోయేందుకు
ఎవరికీ ఆటంకం ఉండకూడదు

స్వేచ్ఛకు అవరోధం తొలగిస్తూ
అవకాశం చూపుతుంది! ప్రజాస్వామ్యం
వర్తమానం నా రూపం
పరివర్తన సృజన ప్రపంచం.

## 5. చలనంలో ఆకర్షణ

వర్తమానం నా రూపం
నా రూపం సృజన ప్రపంచం

లేడి కళ్ళలో వెలుగుతో బయటికి వెళ్ళి
పులి కళ్ళలో మెరుపుతో తిరిగి వచ్చేరు

ఇంటి ముందు నిలిచిన బిక్షువులో
బుద్ధుని ధర్మ మూర్తి కనిపించేనా?

పేదరికాన్ని కొలవడానికీ
ఆకలిపై అధ్యయనానికీ
డబ్బుకో డిగ్రీకో అవార్డుకో
విలేఖరులు ప్రసారకులు శోధకులు!

ఎన్నుకొన్న స్వప్నం లా భద్రంగా
పెట్టు బడికి వస్తువు గా పేదరికం
యథా స్థితిని కాపాడే ప్రచారకులూ
తమ ఉనికి కయి ఎగిరే మిణుగురులూ

సమస్య నుండి సమస్య చిక్కు ముళ్ళతో
లెక్కల క్రీడలో గడిపే వారూ
గట్టు పయి చేరి జోస్యం చెప్పేవారూ
దాటే యత్నంలో మునక వేసే వారూ

నాణెం ఇరు వైపుల వలె
పగలు రాత్రి తో రోజు వెంట రోజు
ఎవరికి తగిన మూల్యంలో వారికి
దయ చేస్తూ పోతుంది నిశ్శబ్దంగా

ఎప్పుడో జారిపోయిన అభిజ్ఞానం
ఎక్కడో ఎవరికి దొరికినా చివరకు
అది ఎవరిదో వారిని చేరడం అదృష్టం
అది కనిపించడం సమస్యకు పరిష్కారం

వేగంగా అందంగా తిరుగుతుంది
నేల పయి ఒడుపుగా విసరిన బొంగరం
విసరిన చేయి ఎవరి దయినా కానీ
నైపుణితో తిరిగే దృశ్యంలో ఆకర్షణ!

చలనం లేంది సమాజం లేదు
ఆకర్షణ లేంది కవిత్వం కాదు.

వర్తమానం నా రూపం
నా రూపం సృజన ప్రపంచం.

## 6. రేఖపై చివరలలో

వర్తమానం నా రూపం
నా రూపం సృజన ప్రపంచం

మృత్యువు రాక గురించి ప్రశ్న లేదు
అది ఎప్పటికీ వెనకనే వేచి ఉంటుంది

శిశువును ఊపే ఊయెల కోసం
చెట్టు కొమ్మకు కట్టిన తాడు
ఎవరి ఉరికో! పనికి రావచ్చు

ముఖాన గాయంతో చంద్రుడు
ఎదలో గాయంతో మనిషీ

పరివర్తనలో ఎదురు చూచే సమయం
కష్టంలో ఊరటగా కనిపించే పవనం

బయట పడిన మాటలో
అసలు ఉన్న అర్థం ఒకటీ
ఒకరు విన్న అర్థం ఒకటీ
ఇంకొకరికి చేరే అర్థం ఒకటీ

ప్రశ్నల్ని ప్రశ్నిస్తూ నిశ్శబ్దం! చుట్టూ
నిశ్శబ్దంలో శబ్దం కోసం మనిషీ!

వర్తమానంలో క్షణాలు
ఒక వైపు వృద్ధుల్లా ఆగి పోయేను
ఒక వైపు పిల్లలా ఎగిరి వచ్చేను

వర్తమాన ఫాలతలంపై రేఖపై
ఒక చివర వీడ్కోలు
ఒక చివర స్వాగతం
వర్తమానం నా రూపం
నా రూపం సృజన ప్రపంచం

## 7. మనిషి గుర్తులతోనే

వర్తమానం నా రూపం
నా రూపం సృజన ప్రపంచం

కవిత అతిథిలా ప్రవేశిస్తుంది
దీన్ని తృప్తి పరచడం ఎవరికి సాధ్యం?

ఆదర్శం గంగలా దిగుతుంది
అక్షరాల్ని శుభ్రం చేసి తీరం చేరుస్తుంది

కవిలో శిశు సమ హృదయం
తన మాటే పలుకుతుంది
తన పాటే పాడుతుంది
తన ఆటే ఆడుతుంది

ప్రపంచం అంతా తనదే అన్నట్లుగా
ప్రభాతం ఒకటే తనలో ఉన్నట్లుగా

వస్తువుల పాత్రలతో ఆడుకుంటుంది
క్షణాల్ని ఒక ఆట పట్టిస్తుంది
అవి దొర్లుతూ పోతూంటే మాటలు వినిపిస్తాయి
తానూ వాటికి బదులు పలకడం జరుగుతుంది

కదులుతూ వేగంగా పరుగులతో
ఒకదాని నొకటి తాకుతూ తప్పుకుంటూ

క్షణాలలో ఉల్లాస తరంగాల అడుగున
పాత్రలు! కదలుతాయి మెల్లగా నిశ్శబ్దంగా

శబ్దం తన స్థానం నుండి కదలదు
అర్థం దూర దూరం పయనిస్తుంది

శిల్పం ఎంత గొప్పదయినా
ఏ దేశం ఏ కాలంలో దయినా
కవితకు అసలు రూపం
స్పందనలో మనిషి గుర్తులతోనే

వర్తమానం నా రూపం
నా రూపం సృజన ప్రపంచం.

## 8. నిర్ణయం మనిషిదే

వర్తమానం నా రూపం
నా రూపం సృజన ప్రపంచం

ఒక కిరణం స్పృశించి పూవు రేకులా
తన ముఖానికి అందం రావాలనీ
కానీ అదొక బ్లేడ్ అంచులా కోసి
మనసును గాయంతో అలంకరించవచ్చు

మండే ఆకలి ఆరేందుకు
పాముల్ని ఆడించే మనిషికి
ఏ అపాయ భయమూ లేదు.

ఎగసే ఆకలి తీరేందుకు
గొడ్డలితో సిద్ధమయ్యే మనిషికి
చెట్టు అస్తిత్వం! దాని నీడ పట్టవు!

పూవు బ్లేడు పాము గొడ్డలీ!
ఒక్కొక్క కోణంలో ఒక్కొక్కటీ
మనిషి మనో రూపాలను బింబించేను
వాస్తవ జీవితంలో పాత్రలుగా నిలచేను!

ఏ కోణంలో చూచినా మనిషి
ఈ విశాల ప్రపంచంలో
కోరని వస్తువు లేనే లేదు
బ్రతుకులో పనికి రాని దేదీ లేదు.

తనకు అవసరం ఏదో
ఆ నిర్ణయం మాత్రం అతనిదే.

వర్తమానం నా రూపం
నా రూపం సృజన ప్రపంచం

## 9. స్మృతి సంకేతంతో

వర్తమానం నా రూపం
నా రూపం సృజన ప్రపంచం

అలల్లా తరలే అనుభవాల పయి
కదలే పడవలా సమాజ రూపం
కోరే గమ్యానికి చేరుస్తూ

మబ్బులా కదలే స్థితి చలనంలో
కురిసే జలంలా సమాజ హృదయం
అందరి దాహార్తిని తీరుస్తూ

చీకటిలా నిలిచిన ఆలోచనలో
చంద్ర బింబంలా సమాజ ముఖం
మనసుకు హ్లాదకర దృశ్యాన్ని ఇస్తూ

నిశీథిలా తరలే పరిస్థితుల్లో
సూర్య బింబలా సమాజ తేజం
మనిషికి విశాల ప్రపంచాన్ని చూపిస్తూ

ఆకాశం దిశలు ఆహ్వానిస్తాయి
కానీ అనుబంధం అవని తోనే
చుక్కలు రమ్మనీ సైగలు చేస్తాయి
కానీ అనుభావం మనుషులతోనే
మబ్బులు తమతో రమ్మని పిలుస్తాయి
కానీ అనుగమనం సమాజం తోనే.

పవనం వాహనమై ఎదుట సిద్ధంగా
కానీ పయనం! అడుగు తీసి అడుగులో
కదలే ఊపిరిలో అల పైనే
జీవన స్మృతి సంకేతం తోనే

వర్తమానం నా రూపం
నా రూపం సృజన ప్రపంచం.

## 10. రంగుల ప్రపంచంలో

వర్తమానం నా రూపం
నా రూపం సృజన ప్రపంచం

దీపం ఎన్ని రంగుల లోనో
ఎర్రనిదీ తెల్లనిదీ పచ్చనిదీ
ముచ్చటగా మూడు! ఒకే చోట.

కణ కణ లాడే ఎరుపు దీపం
చీకటిని హెచ్చరిస్తుంది
అపాయ భయాన్ని సూచిస్తుంది

కోప శిఖను మండిస్తుంది
మంటలపై నడిపిస్తుంది కూడా
గుండెలో మెలకువను నిలుపుతుంది!

పాల నురుగులా తెలుపు దీపం
ఏకాంతాన్ని నిర్మిస్తుంది
శాంతిని సుమింప జేస్తుంది
స్వప్న భూమికి తరలిస్తుంది

పైరు జాలులా పచ్చ దీపం
ఆశను పెంచుతూనే ఉంటుంది
ఉనికికి ఒక భద్రతను ఇస్తుంది
ఒక భోగ భూమిని తలపిస్తుంది

పలు కోణాల్లో రంగుల
ప్రసార జీవిత రూపం
ప్రదర్శనలో చిత్ర పటమై అలంకరిస్తుంది
అవార్డు పొందే మాట అట్లా ఉంచి
చూచే మనిషిని రంగుల ప్రపంచంలో
దింపుతుంది! దారిని మళ్ళిస్తుంది

వర్తమానం నా రూపం
నా రూపం సృజన ప్రపంచం.

## 11. ప్రకాశ రూపం

వర్తమానం నా రూపం
నా రూపం సృజన ప్రపంచం

నేడు ప్రత్యేకంగా కనిపించిన వ్యక్తి
రేపు సమూహంలో కలిసి పోయేను

నిన్న పరిచయ మయిన మనిషి
వీడి పోయి మళ్ళీ కనిపించేననే!

అద్దంలో నా ప్రతి రూపంలో
నను వదలిన వాళ్ళ గుర్తుల్లో
ఒకటయినా కనబడుతుంది.

గుర్తులు కలుపుతాయి మనిషితో మనిషిని
గుర్తులు వేరు చేస్తాయి, మనిషి నుండి మనిషిని

తనను తాను కాపాడుకోవడంతో
జీవిత మంతా గడచి పోతుంది
ఉన్న హద్దులు చెరగి పోతూ
కొత్త హద్దులు ఏర్పడతాయి

ఆకాశాన్ని అల్లు కుంటూ పోవాలనీ
ఆకాశాన్ని చుట్టు ముట్టి రావాలనీ.

నిద్రలో కలలు కదలి పోయే చెట్లలా
మెలకువలో కలలు తరలి పోయే మబ్బుల్లా

నిద్రలో కలలు మనుషు లందరికీ!
మెలకువలో కలలు కవులకు మాత్రమే!

ప్రతి మనిషి మనిషిదీ ఒక అస్తిత్వం
అస్తిత్వంతో నిర్వచనం వేరవుతుంది

పదాలు బయట పడతాయి
వివిధ వర్ణాల్లో కలిసే చిత్ర శాల గా
వాస్తవిక భూమికతో సృజన ప్రపంచం
మీటుతుంది; హృదయ తంత్రుల్ని!

రవి కిరణంలా
స్నేహాన్నో వైరాన్నో పెంచే రాగంతో,
శశి కిరణంలా
కరుణనో శాంతినో పెంచే రాగంతో,
మనిషి కొక అస్మిత లో
రహస్య ప్రకాశ రూపం!

పులి అయినా సింహ మయినా
మృగ మయినా పక్షి అయినా
అరణ్యానికి అందమైనవి
సమాజానికి చిహ్నమైనవి.

ఏవి అయినా ఏ గురికో దారుణంగా
హతం కావడం ఏ సమాజమూ ఇష్టపడదు!

మనిషిని ప్రశ్నించే గుణం మనిషిలో
స్వేచ్ఛా స్పందనతో సమాజాన్ని నడిపిస్తుంది.

వర్తమానం నా రూపం
నా రూపం సృజన ప్రపంచం.

## 12. మూడో కన్ను చూచేదీ

వర్తమానం నా రూపం
నా రూపం సృజన ప్రపంచం

మానవ కథలో నైజం
ఈ కవితకు అంతస్తత్వం

వర్తమాన స్థితిలో నిజం
చేతి వేళ్ళకు చిక్కని పాదరసంలా
జారుతుంది, వంతులుగా విడిపోతుంది.

ఎక్కడెక్కడి నుండో పొడ చూపుతుంది
ఏవో గుర్తులతో పసి కట్టాలిసిందే!

ఏ నిర్వచనంలో స్పష్టం కాదు
అస్తమయం ఎరగని కిరణం
నిజం! నా ఆలోచనకు ప్రాణం!
మనోంతర ప్రకాశ రూపం!

చూపులో తళ తళ మెరుస్తూ
ముఖాన చిరు నవ్వు మొలిపిస్తుంది
ఊహలో నిశ్శబ్దంగా కదలుతూ
ముఖాన మౌన గగనం దింపుతుంది

హ్లాదంగా ఉండవచ్చు
భయదంగా ఉండవచ్చు
అతిథిలా ఇంటికి దయ చేయవచ్చు
శత్రువులా బయటికి నిష్క్రమించవచ్చు

నిజం నిర్మోహ మాటంగా
ఆయుధం వెనక నుండీ కనిపిస్తుంది
దరిద్రం ముందు నుండే కనిపిస్తుంది

మారణ తంత్రంలో మునుగుతుంది
శాంతి రెక్కలపై ఎగురుతుంది

ఖజాన శాలువాలా అలంకరించదు
దేహంపై దుస్తుల్లా ఉపకరించదు
ఎవరి తలపై కిరీటాన్నీ కాపాడదు
డబ్బుతో కొనడానికీ దొరకదు.

రేకులతో విప్పారిన పద్మం అందంతో
మెరుపులతో నిలిపేసే రత్నం విలువతో

పోలిక తలపించదు, కానీ
నిజంగానే "నిజం", మనిషిని తలపిస్తుంది.

అందరికీ తెలిసిందీ
నిజం నిప్పులాంటిదనీ
మూడో కన్ను మాత్రం చూడగలిగిందీ.

## 13. అనుభవంలో నిజం

నిజం! బీజ రూపంలో
సహనంతో నేల పొరలో
ఆర్ద్ర స్పర్శతో శిశువులా
సరిక్రొత్త రూపంతో వస్తుంది
చిట్టి చివురు చేతు లెత్తీ,
మూలం పట్టుకొనీ గట్టిగా.

ఆకులతో  పండ్లతో పెరిగీ
కొమ్మలు! ఊయలను ఆహ్వానిస్తాయి
మౌనంగా పక్షుల్ని స్వాగతిస్తాయి!
మనిషికి పూర్వ పూర్వ పూర్వ రూపాల్ని జ్ఞాపకం చేస్తాయి

జీవితంలో ఎన్ని మలుపులో
నిజం లోనూ అన్ని తీరులూ
అందరికీ తెలిసిందే
నిజం నిలకడగా బయట పడుతుందనీ

శిలకు శిల్పం గానే కాక
మనిషి గానూ మారాలనీ
తన కల! నిజం కావాలనీ

జలధికి జలాలు ఆవిరి అయి
మేఘమై కదలి పోవాలనీ
తన కల! నిజం కావాలనీ,

మేఘానికి జలాలు క్రిందికి దిగి
భూమిని హత్తుకొనీ ప్రవాహమై
పచ్చని కల! నిజం కావాలనీ,

వెలుగుకు! జగత్తుపై ప్రభుత నెరపాలనీ
కవిలో! భావ లహరి కవితయై శబ్దించాలనీ

నిజానికి దూరం గానో దగ్గర గానో
కల్పనలో సంకల్పం! కళ్ళ ఎదుట మరో రూపంలో
అనుభవంలో 'నిజం' దేవుని కన్నా
మనిషికే బాగా తెలుస్తుంది.

## 14. ఎవరు చెప్పినట్లూ కాదు

విత్తు నుండి తరువులా
శిలలో శిల్ప సంపదలా
మబ్బు నుండి జల ధార లా
వెలుగు వెంట మెలకువ లా
నిజం! సూచిస్తుంది హృదిలో ఆదర్శం
కవిత! నిలుపుతుంది ప్రజలో సందేశం

స్వప్నానికీ కల్పనకూ అందకుండా
ముళ్ళపై మంటలపై కదలే
ఆలోచనకు పై పైనే! చరిస్తుంది
నిజానికి ఆధారం వాస్తవం

హత్యకూ అపహరణకూ అపకృతికీ
వీధి దీపం సాక్ష్యం కాలేదు
అవరోధానికీ నిరోధానికీ నిజం తొలగదు.

పులి చర్మం  దుస్తులతో
కళ్ళలో భయాన్ని విరజిమ్మదు

మాయా మృగ వేగంతో
ఎవరిపై ఆకర్షణ విసరదు

రక్తంతో గీసిన చిత్రంలో ఒక మూల
పైన పావురం బొమ్మను నిలిపితే
సమస్యకు పరిష్కారం కాదు
మస్తిష్కానికి ఒక పని లభించవచ్చు.
కాలం గాయాలతో ఎవరి ముందూ నిలవదు!
నిజాన్ని ప్రేమిస్తూ నిలిపితేనే
వర్తమాన వదనం సుందరంగా కనిపిస్తుంది
భవిష్యత్తు మాత్రం ఎవరు చెప్పినట్లూ అవతరించదు.

వర్తమానం నా రూపం
పరివర్తన సృజన ప్రపంచం!

## 15. మాయని సృజన చిహ్నం

ఎవరూ పలకంది తాను పలకాలనీ
ఎవరూ వ్రాయంది తాను వ్రాయాలనీ
కానీ ప్రతి తరంలో కవి కవికీ
పలికేదీ వ్రాసేదీ, ఎంతో మిగిలే ఉంటుంది.

మనిషి మనిషే! మరొకటీ మరొకటీ కాదు
పోలికలో వస్తువు! అసలు కెసరు పెట్టరాదు

ఒక తలలో ఎన్ని తలలో! వరసగా
చేర్చాలనీ కూర్చాలనీ! ఆలోచన మనిషిలో

దుస్తులు మారి నంత మాత్రాన
మనిషి మనో రూపం మారదు
సమయం మారి నంత మాత్రాన
మనసు లక్ష్యంలో దిశ మారదు

సూర్యుడు చంద్రుడూ చుక్కలూ అవే
చెట్లూ గిరులూ! నదులూ! అవే
పేచీ ఎక్కడుంది? అంటే
ఎదిగే మనిషిలో జంతు వనం పెరగడం

నాలో కోపం లేదు నిరాశ లేదు
సర్వంసహ సృజన భూమి! నా మనస్సు
శిల అయినా నది అయినా వన మయినా
మంచు కురిసినా! నిప్పు ఎగిరినా
ముల్లు దిగినా ! పూవు తాకినా
మనిషిలో మాయదు! ఏ సృజన చిహ్నం!

వర్తమానం నా రూపం
నా రూపం పరివర్తన ప్రపంచం

## 16. లోపల నదితోనే జీవితం

వర్తమానం నా రూపం
నా రూపం పరివర్తన ప్రపంచం
విశాల సర్వంసహా! సృజన భూమిపై
నాలో! మహానది! రసమయాకృతి!

చాచే నది చేయి అందుకో బోయే ఊరు
ఊరు బుజం పయి చేయి వేయ బోయే నది

నదిపై వంతెన!
వంతెన పై నడచే మనిషీ!
చాలీ చాలని గుడ్డతో శరీరం
నెత్తిన కట్టెల మోపుతో దృశ్యం!
పత్రికలో ప్రచురణకో
ప్రదర్శనలో పొగడ్తకో

డబ్బులు పోగు చేయడానికో
ఫోటోలో! మరీ బాగుంది!

వంతెనపై నడచే మనిషికి!
దాని చరిత్రతో పని లేదు
నదిని గురించీ తెలియదు!
ఇంటికి వెళ్ళే తొందరలో!
ఎదురు చూచే పిల్లల గురించీ,
ఇంటి నుండి వచ్చే సమయంలో
ఆ రోజు దొరకే కట్టెల గురించీ.

నది కొక వైపు జనావాసం
ఇంకొక వైపు పచ్చని వనం
నది లో దూరం నుండి అలలు
ఆప్యాయంగా గల గల ధ్వనిస్తూ పోతాయి

వంతెన పై వెళ్ళే అవసరం అందరికీ ఉండదు
ఏ పని లేకుండా ఆ వంతెనపై ఎవరూ తిరగరు
ఎపుడో విహారానికో వినోదానికో ఎవరైనా వస్తే
నదిపై నుండి వచ్చే గాలిలో
భద్రంగా పూర్వజుల స్వరం స్వనిస్తుంది!

నదిని చూస్తే! మనసులో చిత్రం ఏర్పడుతుంది
చేతి వేళ్ళు కదలుతాయి గాలిలో రేఖలుగా!

అలల నోళ్ళతో నది
ఎపుడూ మాట్లాడుతూనే ఉంటుంది
కదలి పోయే అలలు!
జీవితంలో ఏమేమో జ్ఞాపకం చేస్తాయి

నది దగ్గరలో జీవితం భద్రంగా
ఊరు లో నివాసం రక్షితంగా

దారి తప్పని జీవితాన్ని తలపిస్తూ
తలపై ఆకాశం సర్వస్వం అనిపిస్తూ

భవిష్యత్తు గురించి చింత లేదు
వర్తమానంపై అభిలాష తప్ప!

2

దూరం నుండి దగ్గరకు చేరి
చేతులూ కాళ్ళూ కడుక్కునీ నీళ్ళలో
అంటిన పాపం పోయిందనీ
ముఖం కడుక్కునీ నీళ్ళతో
అంతలో ముఖాన దీపం వెలిగేననీ
స్నానం చేసి పశ్చాత్తాపంతో
మనసు శుభ్రమై తళతళ లాడేననీ

బాధలో కన్నీరుతో
రణంలో నెత్తురుతో
నదిలో ప్రవేశించి స్వచ్ఛతతో
పునర్నవ భావం పొందేరు!

నిరంతర శ్రమ జీవన రూపమైన
నదికి విశ్రాంతి అనేది లేదు.
పగలు తలెత్తి చూడలేని
పై నున్న సూర్యుణ్ణి
నదిలో చూడడం ఎంత ప్రియం!

రాత్రి నదిలో తేలే చంద్రుణ్ణి
చేతులతో స్పృశించడం ఎంత సంతోషం!
అందని వస్తువు! అందినట్లు ఉంటుంది!
ఎరగని అనుభవం! తెలిసి నట్లు ఉంటుంది.

ప్రక్కన నున్న నగరా లెన్ని మారినా
కళ్ళ ముందు సమాజ మెంత మారినా
నది ఎప్పటికీ! సాగే అలలతో అదే!
మనిషి జీవన రహస్యం! జ్ఞాపకం చేస్తూ

ఎంతటి విషమ విషాదంలోనూ
ఆగని ఉత్సాహ శక్తిని ప్రసరిస్తూ

3

దూరం నుండి చూస్తే నదిలో అలలు
జైలు నుండి విడుదలయిన ఖైదీల్లా
బోను నుండి బయట పడిన జంతువుల్లా
క్షితిజంలో శ్రేణులుగా సాగే పక్షుల్లా
నాలో ఏకాంతాన్ని మరపిస్తాయి
సమాజ శక్తిని ప్రవేశ పెడతాయి.

నాలో మనోజగంతో ఒకటై
నాకూ వాటికీ మధ్య భేదం చెరగిపోతుంది

ఎందరు విడిపోయినా
ఏది వీడి పోయినా
ఎవరు నిరాకరించినా
ఎవరు తలుపులు మూసినా
ఎప్పటికీ చేతులు చాచి అలలు
సమాజ హృదయంతో ఆహ్వానిస్తాయి.

నిరాదరణ నిరాకరణ లో ఆశ్రయమై
సంవేదన సంక్లిష్టం లో ఉపశమనమై
లోపలి నుండి శబ్దం లేంది కవిత లేదు
లోపల నది లేంది జీవితం లేదు

అలలు వెనక్కి చూడవు
భవిష్యత్తు వెన్నంటే వస్తుంది

వర్తమానం నా రూపం
నా రూపం సృజన ప్రపంచం

## 17. అనల హస్తాలతో ఆదర్శం

వర్తమానం నా రూపం
నా రూపం సృజన ప్రపంచం

బ్రతుకు బరువు కష్టంగా దుఃఖ కరంగా
దరిద్రం దుస్సహంగా దుర్గమంగా
సమాజంలో ఒకరు ఆయుధాన్ని వహించేరు
అరణ్య హృదయాన్ని ఆశ్రయించేరు
ఇల్లూ తల్లీ తండ్రీ ఆలూ పరివారం ఊరూ
బయట చెట్టూ చెరువూ అనుబంధం వదలి
ఎక్కడో బ్రతుకుతూ ఉండొచ్చుననే అందరికీ!
గడవ రాని బ్రతుకు ఎంత కయినా తెగిస్తుంది.

ఒకరి స్థానం మరొకరి హృదిలో
మారేందుకు మనిషి! ఒక వస్తువు కాదు

ముఖం పయి పడిన గంట్లు
అడవిలో చేదు అనుభవం గుర్తులతో
శరీరంలో చేతన క్షణాల్లో జడమై
అతడు ఊళ్ళోకి ప్రవేశించేదీ తెలియదు.

అనుమానం పెనుభూతం!
ఒకసారికి రెండు మూడు సార్లు
పోస్ట్ మార్టమ్ చేయిస్తూంది
సమాధి నుండీ బయటికి రప్పిస్తూంది

చివర కేమి జరిగినా
ఎవరి వాదం వారిది
ఎవరి నమ్మకం వారిది
ఎవరి నిర్ణయం వారిది

భయానికో భయపెట్టడానికో కాని
ప్రేలిన ఆయుధాల నుండి బులెట్‌లు
ఆకుల్నీ పూవుల్నీ ఫలాల్నీ ఛిన్నం చేసేను
మనిషితో పాటు అరణ్యమూ గాయపడేను
సంఘటన స్థలంలో ఆనవాళ్ళూ ఊహలూ
కలిసి భయానికి చిత్ర రూపం ఇచ్చేను

నేల కూలిన ఒకరి అస్తమయం
మరొకరి విజయం అయ్యేనా?

పక్షుల్లో ఒకటీ మిగలకుండా
చెట్ల పై నుండి ఎగిరి పోయినా
ప్రకృతి ఒక్కసారిగా వణకినా
మనిషి మాత్రం! చూస్తూ దృశ్యం
స్తంభంలా నిలిచీ
రాయిలా కూర్చొనీ!

వార్తను ప్రతి చెవికీ చేరుస్తూంది గాలి
నిలిచిన ఆలోచనల్ని తరలిస్తూంది.

నక్సల్ బరి అయినా నల్లమల అయినా
పేరు ఏదయినా స్థలం ఏదయినా లాల్‌గఢ్ అయినా
మార్పుకు అరణ్యం రహస్య నిలయమవుతూంది

ఊరు నుండి అరణ్యానికీ
అరణ్యం నుండి ఊరుకూ

ప్రవేశించిన జడరూపంలో ముఖం,
వెలిగే వత్తి పెనుగాలికి మధ్యలో
ఆరిపోయిన దీపం ప్రమిదలా ఉంది
వెలుగు పక్షి ఎపుడో ఎగిరి పోయింది.
ఎవరి కను రెప్పలూ వాలి లేవు
ఎవరి చేతులూ కట్టు కొనీ లేవు
"వెలుగు పక్షి ఎపుడో ఎగిరి పోయింది

"ఎవరి క్షేమం కోసం
ఎవరి శుభం కోసం
చేతిలో పూలగుత్తి?" అన్న ప్రశ్న
ఎగసే నిప్పు కణంలా మిగిలే ఉంది!

శరీరం ఎగసే మంటల్లో అదృశ్యమై
మిగిలిన ఎముకలు పరిశోధనకూ
నిలిచిన బూది భూమిపై పొరకూ.

స్వేచ్ఛగా  తేలిగ్గా వచ్చే గాలి
మోయ రాని బరువుతో కదలుతూంది
సముద్రం పై నుండీ, ఎడారి పయి నుండీ
మైదానం పై నుండీ, కొండలలో నుండీ
పరి పరి విధాలుగా వివిధ పరిస్థితుల్లో
ఒక్కొక సమాజ వాస్తవాన్ని ధ్వనిస్తూంది

కరుణ జలం కలిసి మట్టితో
అనుభవ తప్తమై ఏర్పడిన భాండం
ఏ విసరిన రాయి వేటుకో
ముక్కలయి, అవసరాన్ని జ్ఞాపకం చేస్తూంది

దారిద్ర్యం మొలక లెత్తుతూనే ఉంది,
బ్రతుకు భయం వెన్నాడుతూనే ఉంది.

## 18. కాశ్మీర్ గులాబి చుట్టూ

వర్తమానం నా రూపం
నా రూపం సృజన ప్రపంచం

ఆయుధాల నీడలో ఏల బడే రాజ్యాలు
భయం అంచుల్లో గడిపే జీవితాలు
అధికారం కయి పరుగులో క్షిపణి వేగం
సంపద పయి ఆశలో నక్షత్ర రాశి చలనం

పూలతో పండ్లతో పచ్చదనం
కోరే సుందర భూమి; కాశ్మీర్
బాంబుల ఆయుధాల మారణ ధ్వనులూ
ముక్కలయ్యే సామాన్యుల జీవిత వాద్యాలూ.

మంచు సరస్సుల సమాజంలో
అపుడపుడూ బద్దలయ్యే
అగ్ని పర్వత శిఖల స్థితులు
ప్రజల బ్రతుకును అస్థిర పరచేను
రాత్రి నీడల్ని ప్రవేశ పెట్టేను
అగ్ని సూత్రంతో శాంతిని బంధించేను

మండే లిప్తలు అనల దాహంతో
పొగల రెక్కలపై ఎగిరి
ఎవరి తలపై బుజంపై
వాలేదీ తెలీకుండా ఉంది.

దీనికి తోడు, ఇనుప బూట్లతో
నడచే రాజ్యం! అపుడపుడూ
కర్ఫ్యూలో బిగిసిన జీవన ధారతో
రాత్రి గుహల్లో నివాసాన్ని తలపిస్తుంది

పక్షులు చెదరీ! ఎక్క డెక్కడికో
ప్రవాసం నుండి ప్రవాసానికి మారేను

మనుషులు బెదరీ! తమ నేలను వీడలేక
ముఖాలపై కొత్త లేబుళ్ళతో తిరిగేరు

కాశ్మీర్ శాలువాను అలంకరించే బుజాలు
నీలి పొగలతో చుట్ట బడుతున్నాయి

ఎవరి కోసం దేని కోసం
ఈ రణ సదృశ స్థితి అంటే
మనిషిలో అహంకారం చిమ్మే
అగ్ని శిఖల తృప్తి కోసమనే

రథ చక్రం క్రిందనో
ఆయుధ బల ధాటికో
నలిగిన చితికిన మనిషి స్వరం
ఇప్పటికీ గాలిలో వినిపిస్తూనే ఉంది

ఏ పక్షానికి చెందిందయినా
ఆయుధం చేసే పని ఒకటే
బ్రతుకుల్ని అగ్ని చిత్రాలతో నింపడం
మనుషుల్ని రుధిర సరస్సులో ముంచేయడం!

మనిషికి మనిషి! కనిపించని స్థితిలో
ఒక చేతిలో రణ తంత్రం చక్రంతో
ఒక చేతిలో రాగ బంధు వేణువుతో
అపుడపుడూ మనసులో మెరసేను, మానుషం
మతిలో సృజన బీజం
మిగిలి ఉంటుందనే ఆశ!

మస్తిష్కంలో రస గంగ
పచ్చదనం నిలపాలనే కోరిక!

వర్తమానం నా రూపం
నా రూపం సృజన ప్రపంచం

## 19. అగ్ని శిఖతో శ్రీలంక

వర్తమానం నా రూపం
నా రూపం సృజన ప్రపంచం

వాదానికి దన్నుగా ఆయుధం
విజయానికి సాధనమై బ్రతుకులో
సమాజ క్షేత్రం కన్నా ఉద్యమానికి
అరణ్య నిలయం కీలక మవుతూంది

ఉగ్ర వాద సూత్ర పంక్తిలో
మారణ చలనంలో పులులు!
చీకటి శాలలో ఆయుధంపై నమ్మకంతో
బంకర్ల నుండి నక్షత్రాల్లా తల లెత్తేను

ముళ్ళ కంచె వద్ద ఆగిన గాలి
ముందు కదలే యత్నం చేసే లోపల
ప్రేలే ఆయుధమో మందు పాతరో
సర్వం! జటిలం చేస్తూంది విధ్వంసంతో.

దగ్ధమయిన శాంతి నిలయ శిథిలాల్లో
నిజాన్ని గుర్తించే కోరిక లేదెవరికీ!

ఇరు పక్షాల మతుల నుండి
జంతువో మృగమో బయట పడీ
ఘోరంగా తలపడేను రెండూ.

ఒకసారి పట్టు దొరికి నిలుస్తాయి
ఒకసారి పట్టు జారి తొలగుతాయి

ప్రజల బ్రతుకు మాత్రం చిందర వందరగా
ఆడుకునే శిశువు చేతుల్లో ఆట వస్తువుల్లా

2

దూసిన రెండు కత్తుల మధ్య సమాజం
రెండు అగ్ని శిఖల మధ్య వనం లా

పూవు కోసం చాచిన చేయి నరక బడేను
మరో చేయి పచ్చని వనాన్ని తగలబెట్టేను
పూవు పేరుతో వినాశనన మెంతో
మనిషిలో ప్రబలే కంటక ప్రవృత్తికి చిహ్నం

సమాజ మహా నదీ తీర భూముల్లో
ఒక వైపున సస్య శ్యామల దేశం
ఒక వైపున మారణ రణ భయ ఖండం

పగలు కదలుతూంది రణ శకటం లా
రాత్రి మారు మ్రోగుతూంది! ఆయుధ గర్జలతో
నిలయానికి పగలూ రాత్రి భేదం లేదు
ద్వేషానికి మంచి చెడు వివేకం ఉండదు.

కాలం యోధుని చేతిలో అశ్వం లా కాక!
ఇక్కడ! కుటిల పన్నగం లా కదలుతూంది

సమయం మండే అగ్ని శిఖల చేతుల్లో నుండి
ఎర్రని ఇనుప చక్రంలా బయటపడి భ్రమిస్తూంది

అడవిలో ఎదురు పడిన సింహం ముందు
భయంతో పరుగెత్తే ప్రాణుల్లా! జీవన లిప్తలు!

మట్టి తో కట్టిన కోటలూ
జన శ్రేణులతో నిలిపిన గోడలూ
ఒకటొకటీ కూలి పోయి చెదరిపోయి
బాధా విషాద దృశ్యం! బయట పడుతూంది

భూమిని ముంచేసే ఆవేశంతో
సముద్రంలో కెరటాల్లా దూకే సైనికులు
సముద్రంలో కలిసే నదిలో అలలు
దుఃఖాశ్రువుల్ని మోసుకొచ్చి ఒడ్డున జారిపోయేను!

నెత్తిన మూటలతో కాంది శీకులు
తమకే తెలియని గమ్యానికి కదలుతూ

కళ్ళలో ఆశల అలల పయి
చీకటి పడవలో రహస్యంగా
బాధా మయ తీరాన్ని దాటాలనీ

చెట్ల పయి నెమళ్ళూ చిలుకలూ లేవు
'కెళించెరి" సుందరత భగ్నమై
శవాల కయి ఎదురు చూచే గద్దలు చేరాయి

కాలం ఇపుడు ఉల్లాసాన్ని ఇచ్చే
నెమళ్ళ విలాస నృత్యం బదులు
భయంతో మృత్యు హాసం మెరపించే
మహా సర్ప కరాళ తాండవం చేస్తూంది

సింహం తిరిగి తన నిలయానికి వెళ్ళే
హరిణం పచ్చిక బయళ్ళపై తిరిగే
నవ జీవన సంకేతంకై, నిరీక్షణం

భయం లేని స్వేచ్ఛలో మనిషిలో
విరిసిన పూవు నుండి ప్రసరించే గంధంకై
ఇపుడు మరో మనిషిలో ప్రతీక్ష! సహజం

వర్తమానం నా రూపం
నా రూపం సృజన ప్రపంచం

## 20. మరకలతో మెల్‌బోర్న్

వర్తమానం నా రూపం
నా రూపం సృజన ప్రపంచం

మస్తిష్కం గాయ పరచి స్క్రూడ్రైవర్‌తో
మెదడును కోమా లోకి పంపించీ
యాసిడ్ బాంబు విసరి శరీరం మండించీ
లిప్తల సుమ హారానికి నిప్పంటించేను.

ప్రాణం తీసే విపరీత సాహసంతో
మానవ సంస్కృతిని లోయ లోకి తోసేరు

ప్రాణం నిలిపేందు కెవరు ముందుకు వచ్చేరు
ఆకుల్ని రాల్చి మళ్ళీ
చెట్టు కెవడు చేర్చగలరు?

కొందరి మెదడు అనారోగ్యంతో
స్వరం తప్పిన, లయ తప్పిన
సమయ వాద్య విశేషంలా
విషమ ధ్వని వినిపిస్తూంది.

ఏ విద్యకో విజ్ఞానానికో వస్తే
స్వప్న చిత్రం చెదరి పోతూంది
జీవిత సూత్రం తెగి పోతూంది

జాతి ద్వేషం తో అభద్ర భావం
ప్రమాద ఘంటికల్ని మ్రోగిస్తూంది
సభ్య సమాజాన్ని దిగ్భ్రమలో ముంచుతూంది

కన్నీరు నిండిన నయనాల్లో
కదలే బాధల పడవలు
కళ్ళలో చీకట్లతో మసలే
నేర గాళ్ళకు కనిపించేనా?

విలువయిన జీవితం అంతలో
తెగిన పతంగమై వాలి పోతూంది
భవిష్యత్తు నిర్దాక్షిణ్యంగా
భయ కూపం లోకి తోసివేయ బడుతూంది

ఒక దేశంలో నేరస్థుని ఆలోచన
జడమై రాయియై
మరో దేశం నుండి వచ్చిన
తలపై పడుతూంది

అసూయతో ప్రాణం తీయడం సులభమైతే
మనసులో పావురం లేనట్లే
ఎక్కడికో ఎగిరి పోయినట్లే
మరో చోటి కెళ్ళి భయంతో
రెక్కలు ముడుచుకొన్నట్లుంది

2

ఎవరో కొందరి దుశ్చర్యలతో
అనుకోని గ్రహణం అమాయకుల్ని మింగేస్తూంది

ఎవరికి వారు కొత్త కలతో
కొత్త మేడ కట్టు కోవచ్చు
ఎవరికి వారు కొత్త పథంలో
మరో గమ్యం ఎన్ను కోవచ్చు
విధ్వంసం నెరపే హక్కు లేదెవరికీ

దేశంలో సాధారణ న్యాయం అమలు
ఆ రాజ్యానికి కనీస ధర్మం!

దండలో పూలకు నిప్పంటించిన
చేతుల్ని వదలి!
కనిపించని గాలి వైపు చూపడం
కాల క్షేపానికి పనికొస్తుంది.

సరదాకో పరదాగానో
విషమ స్థితి మరవడానికో
రాజనీతి చతురతకో వీలవుతూంది

తన కాలికి ముల్లు గుచ్చు కుందనీ
ముందున్న వ్యక్తి వీపు పొడవడం
నేలపై తన కాళ్ళు తడబడుతున్నాయనీ
ఎదురైన వ్యక్తిని ఢీకొని కూల్చడం
చెట్టుపై పిడుగు పాటులా
విధ్వంసానికి దిగే చేష్టలు
ఆ జాతి సమాజానికేమి జవాబు చెబుతాయి
ఆ దేశ పురోగమనంలో ఏ మజిలీకి గుర్తు!

చీకటి కుటిలో దాగిన రహస్య వార్తను
కదలే గాలి అవలీలగా
అందరి చెవినీ వేస్తూంది.

సుదూర వాసం సులభం కాదు! కాని
అది ప్రమాదాన్ని నెత్తిన విసర రాదు.

మనిషికి మనిషే పరిచయ పత్రం
మనసుకు మనసే ప్రవేశ ద్వారం
సుందర తర స్నేహాని కయినా

ప్రమాద కర వరాని కయినా
వెనక నుండి మృత్యువు నాల్కలు సాచే
ఘోర సమయ సందర్భాలకు
ఆకాశం! భూమి! సూర్యుడు కన్నా
మనిషికి మనిషీ! మనసుకు మనసూ సాక్షి!

3

పరిచయ పత్రం దగ్ధం చేయబడీ
ప్రవేశ ద్వారం మూసి వేయబడీ
ఒక్క వేటుతో జీవితంలో వసంతాన్ని శిశిరంగా
మార్చే చేతులు గుర్తింప బడేనా?
సరి అయిన న్యాయం జరిగేనా?
జాతి మతం దేశం పేరుతో విపరీతాలు
మనిషిని ఆటవికానికి సులభంగా నెట్టేసేను

విషాదాన్ని ప్రేమించే మనసుకు
చీకటిలో నివాసమే ఇష్టం

నీడల వల విసరే చేతులకు
వలలో ప్రాణుల విలవిల సంతోషం

మనిషికి జీవించే కోరిక బహు సహజం
ఎక్కడో ప్రాణం విలవిల లాడాలని ఉండదు

గాయాలకు పూల రేకులు అద్దవచ్చు
విషాద స్మృతిని తుడిచేది ఏదీ లేదు

క్షమాపణలతో పోయేదీ కాదు
ముందుగా ఉదార చరిత అవసరం

క్రింది నుండి అనల శిఖల్ని పెంచుతూ
పై నుండి మేఘం వర్షించాలనడం భ్రమ!

చీకటి లోనూ పూవు పూస్తుంది సహజంగా
చుట్టూ పరిమళం అందిస్తుంది అందరికీ

4

ఎంతటి కష్టంలోనూ బ్రతికించే
స్వచ్ఛమయిన గాలిలో అవకాశంపై
సృజన మనః ప్రపంచానికి ఆశ పోదు
విషమ క్రియా కలాపం పయి నిరసన ఆగదు

మానవతా సూత్రం పయి
కదలే స్నేహ లహరి
విశ్వ మానవ సమాజానికి
ఉత్తమ ప్రయాణ సాధనం

ఎండ లోనూ నీడ లోనూ పగలు పగలే
నల్ల గానూ తెల్ల గానూ రాత్రి రాత్రే
మనసుకు పగలూ రాత్రీ భేదం లేదు

పగలును ప్రేమతో జయించాలనీ
రాత్రిని క్షమతో గెలవాలనీ
చెడు నుండి మంచికి యాత్ర సాగవలసిందే

మెరపులతో మెల్‌బోర్న్
మరకలతో హెల్‌బోర్న్ అవుతూంది
అది ఒక వెల్‌బోర్న్‌గా నిలవాలంటే
మనిషి సాధించిన విలువలపై
దుష్ప్రభావ రూపాలకు నిష్క్రమణం పలకాలి
ఏ సంకెల విధిస్తే సరిపోతుందో?
ఏ మానసిక చికిత్స అవసరమో?

రెండు చివరల నుండి సాగే
మంటల మధ్య సుమ లతలా
ద్వేషంతో అసహనంతో ఆలోచన!

చివరకు మంటలో దహింపబడవచ్చు
ఇది ఏ వర్తనకీ స్ఫూర్తికాదు
ఇది ఏ సంస్కృతికీ కీర్తి కాదు

వర్తమానం నా రూపం
నా రూపం సృజన ప్రపంచం

## 21. అమ్మ

నిప్పు రవ్వల్ని గుండెలో
మూట కట్టి మూల పడేసి
ఎప్పటికీ చల్లగా ఎదురుగా
వీడని తరగని చంద్ర బింబం
అమ్మ!

గ్రీష్మ తపన తలం పయి
పయోద హృదయ స్పర్శతో
స్మృతిలో సృజన దృశ్యం
నిలిపే శక్తి రూపం!
అమ్మ!

కరుణనూ ప్రేమనూ
ఏ వేళయినా మనసున కందించే
మానవ నిజ భాగ్య రూపం!

మాటలో ఆటలో పాటలో
ఓర్పుతో తన పిల్లల కోసం
తీర్పులో తన పిల్లల వైపే

అమ్మ ముందు
వ్యక్తి శక్తి పెరుగుతుంది
దైవం తల వంచుతుంది
మానుషం అభిషిక్త మవుతుంది

అక్షరాల మాలలో మొదటిది
'అ' కారం ప్రియమే కాదు, అవసరమూ
ఆకాశం ఆవరించే అనుభవ రమ్యతతో
అమ్మలో అకారం పూర్ణ బింబమవుతుంది

అమ్మ కను రెప్పల మధ్య
క్షితిజం మేల్కొని ఉంటుంది.

అమ్మ హృదయ విశ్వంలో
అవని క్షామ ముఖం ఎరగదు

వికసించిన సుమ భావం
జారే మధుమయ రాగం
అనుభవ రుచిలో అపూర్వం
మానవ నిజ భాగ్య రూపం.

ఆర్తిలో మనసును
లోపలి కమల వని లో తిప్పుతుంది
క్షణంలో మెరపులా
చంద్ర కళను చూపిస్తూ, ఆనందంగా!

స్వేచ్ఛా కవిత్వం

రెండవ భాగం - 18

# అజ్ఞాతం నుండి

## ముక్తక కావ్యం

మాదిరాజు రంగారావు

**2010**

రసధుని సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 500 028

# అంకితం

## మహా కవి

## శ్రీశ్రీ కి

**1910-2010**

**శత జయంతి సందర్భంగా**

# అజ్ఞాతం నుండి
## ముక్తక కావ్యం

'అజ్ఞాతం నుండి' ముక్తక కావ్యం. ఇందులో ఏ ఖండాని కది స్వతంత్రంగా ఉంది. అందులోనూ ఏ భాగానికదీ విభాగానికదీ విడి విడిగానూ భావ పూర్ణతను కలిగింది. అందువల్ల ముక్తక కావ్యంగా పేర్కోబడింది. మొత్తం మీద సమాజ భావనతో ప్రకృతి నేపథ్యంగా మానవ జీవితం వస్తువుగా ఉంది. 'అజ్ఞాత' మనేది ఈ కృతిలో గుప్త చేతనను సూచిస్తుంది. రూపం ఆకృతి దృశ్యం అనేవి ఆయా సందర్భాల్లో విషయ విస్తృతిని బట్టి కనిపిస్తాయి. ఇక రచనా విధంలో సుప్త స్థితి నుండి మెలకువ స్థితికి పరివర్తనం చెందే చేతనతో భావ ప్రసారం ఆవిష్కృత మయింది. సామాజికత వర్తమాన వాస్తవ జీవిత చిత్రణంలో దృష్టికి వస్తుంది.

భౌతిక మానసిక స్థాయిల్లో జీవన చిత్రణం భావ రూపాలతో ప్రతీకలతో కవిత్వ కళను పొందింది. రచన తరంగ ప్రవాహ సదృశంగా సాగింది.

స్వేచ్ఛా కవిత్వంలో సామాజిక దార్శనికత ప్రజాస్వామ్య దిశా నిర్దేశంతో నిబద్ధ మయింది. భౌతిక భావ వాద సమన్వయాన్ని కోరుతుంది. ప్రగతి శీలం కలిగిందీ.

నా మొదటి పుస్తకం "కిర్మీరం" కవితా సంకలనం 1958లో "ఉషాగమాన్ని గుర్తించి స్వాగతమిచ్చే వైతాళికుడు" అన్న చలం మాటతో మహా కవి శ్రీశ్రీకి అంకితం మీయడం జరిగింది. "అజ్ఞాతం నుండి" (2010) దాదాపు చివరిది. శ్రీశ్రీ శతజయంతి (1910-2010) సంవత్సరం చివరలో అంకితమిచ్చే సందర్భం రావడం ఆనందాన్ని కలిగించే విషయం.

– మాదిరాజు రంగారావు

①

అజ్ఞాతం నుండి రూపం బయటికి వస్తుంది
స్మృతి లహరుల పయి సృజన భూమి చేరుతుంది.
ఎద ఎదను స్పృశిస్తూ విశ్వతలం పయి
అస్తమయం లేని ప్రజాస్వామ్య బింబం.

జల ధారా గతిలో విద్యున్నవ చేతనలా
మంచు పొరల నుండి ముందుకు నడిపిస్తుంది.

మనిషి ముందు చూపు ఎదుట
కాలం తల వంచుతుంది.

కొత్త తరం ఎత్తిన అర చేయిలా
పగలు సూర్య బింబం, రాత్రి చంద్ర బింబం
ప్రతి జాతికి ఒక ఇతిహాస పరంపర
ఇరు వైపులలో మార్పుల దారులతో

అద్దంలో అందే దూరంలో గగనంలా
పని లో ఆకర్షణ యంత్రం లా ఆదర్శం

ఆహారం కయి రెక్కల పయి ఎగిరే పక్షికి
గగనంలో ఎత్తులతో పని లేదు
దృశ్యం చూచే కోరిక లో సాగే చూపుకు
చీకటి హద్దులతో పని లేదు

దేశం నుండి మరో దేశానికి
జీరాడే కోర్కెల అంచులతో
జరుగు బాటుకో మెరుగు బాటకో
తరలుతుంది జీవన పద యుగళం

②

అజ్ఞాతం నుండి రూపం -

మంచు ముక్కలా స్థితి ఒకటొకటీ
తాపంతో కరగీ వేదనలో కదలీ
కలిసి సరించే ప్రవాహ సమాజం.

స్థితికీ స్థితికీ మధ్య శూన్యం
శూన్యంలో బిందువులా నిశ్శబ్దం
అద్దంలో బింబంలా మౌనంగా.

శబ్దం కోరుతుంది జలదంలా
బీడు మనసులో అనుభవం
సస్యమయం కావాలనీ
ఫల వంతం పొందాలనీ

మోడు బ్రతుకులో కణ కణం
ఆర్తి వీడి శ్రమ ఫలం చేరాలనీ

అక్షరాల జీవ కణాలతో
నిర్మితమయి ప్రాణితమయి
స్పందనలో తరగని విలువలతో
వర్తనలో మానవ సంస్కృతితో

భావ సహజ బంధంతో శబ్దంతో శబ్దం
మనిషి మనిషితో మిత్రంలా బంధువులా
స్వరంలో మేల్కొనీ మాటలో నడుస్తుంది
పేపర్ పయి స్క్రీన్ పయి స్వప్నిస్తుంది.

మైదానంలో ఆడే బంతిని తలపిస్తుంది
అర్థంలో దిశ దిశనూ ఆడిస్తుంది.

❋

## ③

అజ్ఞాతం నుండి రూపం –

తాళం చెవిలా తలుపు తెరచి
మనోమయ నిలయం చూపిస్తుంది

ఒక్కొక గదిలో భద్రంగా
ఎప్పటివో కథలూ వస్తువులూ
అవసరానికి ఆయుధ శాలగా
అవకాశం పొందిన భాగాలూ.

గూడులో పక్షి లా భద్రత కోసం
వనంలో మృగం లా జీవిక కోసం
సమస్య లల్లే చతురత తో
సమస్య తీర్చే మెలకువతో

అడుగడుగున అనుమానంతో ఆగేను మనిషి
తనలో దాగిన కోరికతో ఆపేదీ మనిషే

అర్థం లేని మాట లేదు
ఊహ చేయని మనసు లేదు
తుపాను ఎరగని జలధి లేదు
మార్పు జరగని ప్రకృతి లేదు

కంటి చూపు వెలుగులో
మంటలు వెలుగులు కావు
పక్క నున్న విగ్రహం
మనిషికి తోడు కాదు.

④

అజ్ఞాతం నుండి ఆకృతి –

మేల్కొన్న మనిషి భావ జగత్తు లో
లే లేత కిరణ రాగం బదులుగా
జ్వాలారుణ ముఖ పంక్తులు వరసగా
వర్గ కలహ కారణ నవ నేపథ్యంలో

గ్రీష్మ శౌర్య మెంత చెరగినా
రాయి తనం భస్మ మవదు
పుష్కల మేఘ మెంత కురిసినా
రాతి కొండ మెత్త బడదు.

అద్దంలో శైలాకృతి సుకుమారంగా
వెన్నెలలో వెన్న ముద్దల వలె శిలలు
బింబంలో మనో రూపం పయి కొస్తుంది
అసలు వాస్తవం వెనక ఉండి పోతుంది.

నిజం కయి ముఖాల పరిశోధనతో పని లేదు
సూర్యుని కయి ఎవరూ వెదక నక్కర లేదు

వెలుగు ఎవరి సొత్తు కాదు
మేల్కొన్న మనిషిదీ, సమస్త విశ్వానిదీ

శిఖరం పయి శిలా సంధి నుండి అంకురం
మబ్బు కయి మరో తోడు కయి ఎదురు చూచేను

కదలని కరగని మానవ హృదయంలో
సమాజ పరివర్తన అవసరాన్ని నాటుతుంది

❀

## ⑤

అజ్ఞాతం నుండి ఆకృతి –

మట్టి కలలు కంటుంది నిశ్శబ్దంగా
తృణం నుండి మహా తరువు దాకా
మనిషి కలలు కనేను ఆదర్శంలో
ధరణి నుండి దివికి నిచ్చెన పయి.

కవిలో కల సృజనలో సరిస్తుంది
నిమితాకృతి పొందుతుంది కవితలో

జీవన నవ నిర్మాణ శాలలో పనిలో
విశ్రాంతికి సమయ మెక్కడుంది మనసుకు.

శిల్పంలో ఎన్ని సార్లు మెరుగులు దిద్దినా
మరో చూపు కేవో చేర్పులు మిగిలే ఉంటాయి.

కాలానికి వెలుగై మెలకువతో శ్రమించినా
మరో తరాని కింకా మార్పులు మిగిలే ఉంటాయి.

గాలి దారంతో మేఘ పతంగం లా
ఆశా సూత్రం పై నడిచే జీవితం
అభిమతితో శిల్ప శాల లోకి చేరుతుంది.
ఏదో ఒక శిల్పం లో విలీన మవుతుంది
తానను కొనని ప్రపంచం లోకి దిగుతుంది
అది ఎప్పటికీ తనదే అన్నట్లుగా ఉంటుంది.

బొమ్మల వరసలో చేరిపోయి మనిషి
తానొక బొమ్మగా మారడ మొక విశేషం!

## ⑥

### అజ్ఞాతం నుండి రూపం

కాలం పొది నుండి బాణం లా
మనసు ధనుసు చేరుతుంది.

చంద్రుని ఉపరి తలం పయి అన్వేషణలో
వదలిన సెటలైట్ లా చిత్రం అందిస్తుంది
పగటి కలకు ఆటంకా లెన్నో?
రాత్రి కలకు అవకాశా లెన్నో?

మిగిలి పోయి చేయాలిసిన పను లెన్నో
ఆగని శ్వాసకు వేలాడుతూ ఏ రోజూ

నిన్న గురించి మాట సులభం కాదు
నేడు గురించి మాట సాధ్యం కాదు
రేపు గురించి మాటకు వీలు లేదు
నిన్న నేడు రేపు కలయికతో జీవితం.

కాలానికి కరుణ లేదనీ ఒక అభియోగం
మనిషి మాత్రం కరుణ కెంతో దూరంగా

వర్గ కలహ సమీకరణ సమాజంలో
అందరినీ కలుపుతుంది మానవతా సమీచీనం.

అద్దంలో బింబంలా అనుభవ సమయం
నేలపై దొర్లే బంతిలా పరుగిడుతూంది.

అద్దంలో ఏ దోషమూ కంటికి కనిపించదు
పూలతో అమరిన అందంతో కనిపిస్తుంది.

❀

## 7

అజ్ఞాతం నుండి ఆకృతి –

వదనంలో నవ మానవ బింబంతో
కదలికలో యుగ చేతన చిహ్నంతో
పయనంలో వర్తమాన మార్గంతో
గమ్యంలో ప్రజా స్వామ్య భావనతో
ఇనుప కవచం తొలగిస్తుంది
వెలుగు లోకం చూపిస్తుంది.

జీవన రణ సందర్భంలో
వ్యూహంలో శాంతి రచనతో
వెనుక నున్న భూమిక తెలిసీ
ముందు ఉన్న హద్దులు చెరగీ

జలధి నుండి నీలి మబ్బు ముక్కలా
మట్టి గడ్డ నుండి సస్య పంక్తిలా
మాటలో అక్షర పద ముద్రలతో
ఊహలో పరిమళ భర సంస్కృతిలో
మేల్కొన్న మనసుతో ఒకటయి
చూడంది చూపిస్తుంది, వినంది వినిపిస్తుంది

శబ్దంలో బంధించిన అర్థం
పాయలుగా సరిస్తుంది అనుభవ తలంపై

చీకటి రాజ్యానికి అస్తమయంతో పని లేదు
మనిషి నుండి చిమ్మే నీలి చిత్రం చాలు!

## ⑧

అజ్ఞాతం నుండి దృశ్యం -

చేతు లెన్ని అడ్డు నిలిపినా
మును ముందుకు సాగే కెరటంలా
చెట్టు కొమ్మ లెన్ని చాచి పరచినా
గూడు నుండి ఎగిరే విహగం లా
వనులు గిరులు ఆటంకా లెన్ని ఉన్నా
ఆగని స్వేచ్ఛా హక్కుల కయి వీథులలో
వంచితులూ పీడితులూ జన సందోహం.

పరుగిడే వాహనాల నుండి అక్కడక్కడా
జారి పడిన సంచుల వలె గుడిసెలు
సంచులలో నుండి బయట పడే నాణాల్లా
గుడిసెలలో నుండి చాలీ చాలని బ్రతుకులు

వాస్తవ భూమికలో నిజ గమ్యం వికృతమయి
పరిహాస భాజన మవుతూంది ప్రజాస్వామ్యం

ఆకాశం ఉన్న చోటు నుండి దిగదు
పర్వతం ఉన్న చోటు నుండి కదలదు
ఇవి మనిషికి ఆదర్శం అవకూడదు.

కల్పనలో ఆశలతో కదిలేను మనిషి
పరివర్తనలో వాస్తవ చిత్రం గుర్తించకుండా
స్వర్గానికి తలుపు తెరచి ఉంటుందనుకున్నా
అందాకా పయనం సాగితేనే! ఏ దయినా

❀

## ⑨

అజ్ఞాతం నుండి ఆకృతి -

కను రెప్పల మధ్య నింగి నిలుపుకొనీ
కను చూపులలో వసుధ నల్లుకొనీ
మేఘ పథం వైపు చూచే మనిషికి
ఎదగ వలసిన ఎత్తు ఎంతో కనిపిస్తుంది

ధరణి పయి అడుగులు పడుతూ పోయే కొద్దీ
పోవలసిన దారు లెన్నో ఎదురవుతాయి.

సమాజ చింతనతో కాలంలో అక్షర యానం
కపోత పంక్తి లానో సైనిక శ్రేణిలానో

శిల పయి శిల్పం కయి కొండలలో నుండి
వినిపించే ధ్వనులను మరపిస్తూ విస్ఫోటం
వీధి లోనో జన నిలయం లోనో చకితంగా
ముక్కలు ముక్కలుగా భయ తరంగ దృశ్యం.

తెలుపు నలుపు పసుపు ఎరుపు రంగుల్లో
రెప రెప లాడుతూ ఆదర్శ పతాక లెన్నో
విజయానికి తమ తమ సాధన గతు లేవయినా
విన వలసిన శబ్ద మిపుడు హృదయ స్పందన మొకటే

అడుగు జాడలు కలిసి పోయి దారిలో
ఎవరెవరివో గుర్తించ లేని విధంగా
ఎవరికి తోచిన అర్థం వారు ప్రకటించేరు
ఎవరికి నచ్చిన దిశలో వారు పయనించేరు

## ⑩

అజ్ఞాతం నుండి రూపం –

అడవి నుండి బోను లోకి
బోను నుండి అడవి లోకి
వన చర స్వేచ్ఛా వలయం నుండి
శిక్షణ లో సర్కస్ శాలా బంధంలోకి

ఉన్న చోటు చాలని మనిషి
కొత్త చోటు లోకి జారేను
కొత్త బ్రతుకూ కొత్త మనుషులూ
కొత్త దారులూ తెరవ బడీ

ఒక వైపు నుండి ఆమోద సూచన
ఒక వైపు నుండి నిరసన సంకేతం

తెలిసిన చోట మనిషిని
ముక్కలు చేసి చూస్తుంది పరిచయం
తెలియని చోట మనిషిని
ముక్కలు కలిపి చూస్తుంది అవసరం

దేశ భేదం రాకుండా వర్గ కలహం లేకుండా
సహజ మయిన భావ దృష్టి భేదం లోనూ
జారే వేడి బాష్ప బిందువు
మల్లె మొగ్గగా రాలాలనీ కోరిక!

కళ్ళ ముందు క్యాలెండర్‌లో చిత్రం
వనిలో పచ్చిక పై తిరిగే హరిణంపై
చూపు పడని సింహం! దూరంలో శిలపై.

## ⑪

అజ్ఞాతం నుండి ఆకృతి –

మంచు చాటు నుండి కిరణం లా
ప్రశ్న వెనక నుండి జవాబు లా
ఆలోచనా స్ఫటికంలో అనుభవ కిర్మీరం
వ్యక్తిలో అస్తిత్వ ప్రకాశ రూపం

ముఖానికి రంగుల చిత్ర పటం తొడిగీ
తల పయి పలికే చిలక బొమ్మ నిలిపీ
రహస్య పేటికలో మనసు భద్ర పరచీ
పీఠం పై మనిషి నిజం బయటికి రప్పిస్తుంది.

మంటల మధ్య జగా లో నడచే మనిషికి
తప్పని హిమ కవచం అందిస్తుంది
చుట్టూ తాపానికి మంచు కరగి జారుతుంది
ప్రాణానికి రక్షణ తోనూ
ప్రకృతికి అందం గానూ

తెలుపు నలుపు రంగులలో మనిషి అవసరాలూ
కాలానికి తెలియదు లోపలున్న ప్రపంచం
కదలికతో జీవితం! ఇంకెన్ని రంగులలోనో
మేల్కొన్న మనసుకు! కాలం ఒక వాహనం.

వెలుగు అవసరం గురించి మాట్లాడే మనిషి
చీకటినే వరించేను, తెలిసో తెలియకో!
చీకటి చాటునో! చీకటి కప్పుకొనో
ఇవి తొలగేందుకు వినిపించే ఉపదేశాలెన్నో!

❀

## ⑫

అజ్ఞాతం నుండి దృశ్యం –

పై కొమ్మ నున్న పూవు చేతి కంద లేదనీ
సులభంగా కత్తి వేటు వేసే దెవరో! ఉన్మాది.

చంద్ర దీప ముఖంతో
నిశ! వెదకుతూ పోతుంది
చుక్కల్ని మరపించే
మనుషుల కయి అవని పయి!

తెలుపు పసుపు ఎరుపు రంగులు మారుతూ
పగలు నిష్క్రమిస్తుంది, నీలి రంగు చిమ్ముతూ

వెలుగు పైకి ఎదిగి వస్తూ ఉంటే
నీడ! కిందికి దిగి పోతుంది
వెలుగు జారి ఒదిగి పోతూ ఉంటే
నీడ! పెరిగి! పామో! తాడో అవుతుంది

సూర్యునికీ తప్పు లేదు నిశా శిక్ష
చంద్రునికీ తప్పు లేదు పగలు శిక్ష
శిక్ష నుండి తప్పుకునే తెలివి మనిషిలో
చేయని తప్పుకు శిక్ష కూడా విధిస్తుంది.

చీకటి నుండి చీకటి కెవరూ కోరరు
చీకటిలో దీపంతో కదిలే పనిలో
తానొక వెలుగై నడవాలని మనిషిలో
తీరని కోరిక కల్పనలో, ఫ్రిజ్‌లో ఐస్క్రీం లా

## ⑬

అజ్ఞాతం నుండి రూపం –

గాలికి కర్టెన్ పక్కకు తొలగీ
ఒక వైపు కిటికీ నుండి ప్రకృతి దృశ్యం

ఎదురుగా అద్దిన పూల వనంలా పగలు
అది తనకే అర్పితమయి నట్లుగా

వెలుగు కై కర్టెన్ పక్కకు జరపబడీ
ఒక వైపు కిటికీ నుండి సమాజ దృశ్యం!

పూర్వమున్న మహా వనం, మైదానమై
నేడు మహా సౌధ సమూహాల శ్రేణులు

చెట్టుతో ముఖ్యంగా మనిషి అవసరా లెన్నో
చెట్టు బ్రతుకంతా తన కోసమే అన్నట్లుగా
తనను కోరింది వెంటనే ఇస్తుంది
మనిషి మరచింది జ్ఞాపకం చేస్తుంది

పెట్టెలో నుండి తీసే అమూల్య వస్తువుల్లా
ఎప్పుడేది అవసరమో ఇస్తుంది! సందేశంతో

ఆకుల్లో కదలిక తేవాలని గాలీ
గాలిని అదుపులో పెట్టాలని కొమ్మలూ
ఊహల్లో కదలిక రావాలని మార్పూ
మార్పును అదుపులో పెట్టాలని ఒకరూ

స్వార్థంలో బరువుగా కదలీ కదలని కాలం
అవసరానికి ప్రవాహమై పరుగులు తీస్తుంది.

## ⑭

అజ్ఞాతం నుండి దృశ్యం -

ఇంట్లో దీపం వెలిగించగానే రాత్రి
గోడ పయి నీడ భయంతో
దీపం లేందే బాగని పించవచ్చు
మరొకరికి తానొక భయదాకృతి కానూ వచ్చు

గదిలో వెలుగులో టేబిల్ పయి పూల గుత్తి
చిరు నవ్వుతో ఎత్తిన శిశువు ముఖంలా ఆకర్షిస్తుంది

కనిపించని దారిలో కంటి ముందు వెలుగు
సూది మొనంతయినా మినీ రవి కిందే లెక్క

బయటి రవి శశితో పని లేకుండా
మనిషిలో ఇరు వైపుల ప్రకాశం!
సమాజ చింతనతో వ్యక్తి వికాసంతో
రవినీ శశినీ మరపించే హృదయ బింబం

నీడలో  పామూ కొమ్మపై నెమలీ
కష్టంలో సుఖంలో ప్రియ జీవిత రూపంలో

అందంలో స్వచ్ఛతతో వర్తనలో పావిత్ర్యంతో
మేల్కొన్న మనసులో స్వర్గం మాట లేదు!

ఏకాంత పీఠం పయి మనిషిలో మౌన రూపం
లోతును చూపిస్తుంది శిఖరం పయి నిలుపుతుంది

వీధి దీపం వెలుగులో రాత్రి
ప్రూనింగ్ చేసిన పూల తోటలా

ఆలోచనలో ఆత్మ రాగం వినిపిస్తుంది
అనుభవంలో విశ్వ భావన ప్రసరిస్తుంది.

## ⑮

అజ్ఞాతం నుండి ఆకృతి –

కిటికీ నుండి చూస్తే చంద్రుడు
ఇంట్లోకి ప్రవేశించ బోయే బంధువు లా
బయటి వెళ్ళి చూస్తే శాంతి దూతగా
దేశ దేశాలూ ఎగిరే పావురం లా!

నింగికీ నేలకూ నడుమ సమయం
తగ్గే వాహన యానంలో వేగంతో
ఉదయానికీ అస్తమయానికీ మధ్య
కాలాన్ని మరపించే జీవన దృశ్యంతో

చంద్ర మండలం పయి దొరికే జలాలతో
మానవ శక్తికి అంజలి సమర్పించి
ఆవాస విహారాలకు ఉపరి తలంపై
బుకింగ్‌కు చేరువలో వైజ్ఞానిక విజయం.

విమానంతో సమానంగా సందేశంతో
దేశ దేశాలూ విహరించాలని పక్షికీ
సెటలైట్ తో సమంగా మనో విశ్వంలో
రహస్యాలు ఛేదించాలని మనిషిలో మనీషికీ

చుట్టూ చేరిన మనుషుల మధ్య
బయట కుర్చీలో కూర్చొని చూస్తే
పర్సు నుండి జారిన నాణాల్లా చుక్కలు
టార్చ్‌లైట్ ఫోకస్‌లో వెదకే చంద్రుడు!

❀

## ⑯

అజ్ఞాతం నుండి ఆకృతి –

ఆకు చివర ఆగి ఆగి జారే జల బిందువులా
శైశవ దశలో పెదవుల పయి ఆడే మాటలా
పిల్లల అరచేతి లో కరగే మంచు ముక్కలా
మెలకువ తో స్వప్న శకల జ్ఞాపకంగా

శూన్య ముఖంలో ఉషస్సు గీసే చిత్రంతో
నీటి వాలులో కదలే నావను తలపిస్తూ
శిశువు బర్త్‌డే గిఫ్ట్ బాక్స్ నుండి చాక్లెట్‌లా
కష్టంలో పదును తేలిన ఆయుధ ధైర్యంతో

స్వేచ్ఛా సంకల్పంలో పద పదం కలిసి ఒకటై
సమాజ బింబమై కదలుతుంది! దృశ్యం

గాలిలో ఈదే భావ రూప సమూహాల్ని
కిందికి దింపుతుంది, నేలపై నడిపిస్తుంది

భూమి ఎంత ప్రియ మయినా
బిగించిన పిడికిలిలో బంధించిన
మట్టి నుండి సృజన ముఖం కనిపించేనా?

గాలీ వెలుగూ నీరూ అవకాశంలో
మూలం నుండి శిఖరం వరకూ
జీవ ప్రసార రూపం తోనే సృజనోత్సవం!

మట్టి వీడని శ్రమ శరీరాన్ని ఎవరు స్పృశిస్తారు
చల్లని గాలీ! వెచ్చని వెలుగూ!! జలం తప్ప
ఇవి తలపించే మనిషి మనో మూర్తి తప్ప!

## 17

అజ్ఞాతం నుండి దృశ్యం –

తొలకరి సమయంలో దున్నే నాగలి వెనక
నీలి మబ్బు కదలుతూన్న ఆలోచన కృషికునిలో

చినుకు పడే సమయం దాటి పోతూంటే
రాలే కన్నీటి చుక్క ఎవరిని ఓదారుస్తుంది?

ఖైదీ శిల పయి కూర్చొని ఒంటరిగా
కారాగారావరణంలో విరామంలో
కళ్ళలో మబ్బు తునక తో లేచేను
మెరుపుతో పరివారం కళ్ళ ముందు దిగేను

దోషి జీవితంలో మనో రూపం
ప్రవాహంలో రవి బింబంలా
ఏది జరుగుతుందో? ఏది జరగదో? కానీ
కల్పనలో అన్నీ సంభవమయి తోచేను

దారం లేని పతంగం ఎగర లేదు
ఆశ లేని జీవితం కదల లేదు
ప్రవాహానికీ ఎపుడో ఎక్కడో అంతరాయ మనివార్యం?
ఒక దోషానికి జీవన హననం దారుణం!

చాచిన అర చేతిలో వాన చినుకులు!
జారి పోయే వాటి కన్నా
రాల నున్న వాన కయి నిరీక్షణం!
రాబోయే కాలంపై విశ్వాసంతో

## 18

అజ్ఞాతం నుండి దృశ్యం –

అడవి నుండి పల్లెకూ పల్లె నుండి నగరానికీ
ఏ దారీ సరళ రేఖలో ముందుకు తీసుక వెళ్ళదు

హేతువుకందీ అందని ఆటంకంలో
క్షణాలు శిలల వలె ఆగినట్లయి
అంతలో అలల వలె కదలుతాయి.

రవి కిరణం ఆలోచనకు తలుపులు తెరుస్తుంది
గగనం వెన్నెలలో శాంతి బింబం చూపిస్తుంది
చీలికలో దారు లెన్ని ఎదురు పడినా
పయనంలో పోవలసిన దారి ఒకటే

బిందువు నుండి దిశకు కోణాలెన్నో
మనిషికి గమ్యం చేరే మార్గాలన్నీ
నిదుర నుండి మేల్కొన గానే సరిపోదు
ఆ పై చేసే పని గురించి ప్రశ్న లెన్నో!

నిరుద్యోగి ముందు ప్రవేశ ద్వారాలు రెండు!
ఒకటి సమాజ హృదయం లోకీ
ఒకటి సముద్రం అలల లోకీ

బయట గేటు స్వాగతం చెబుతుంది
లోపల గోడ పయి నీడ వీడ్కోలు చెబుతుంది

భిక్షువుకు తెలుసు చేతిలో డబ్బు విలువ!
ఎడారికి తెలుసు దప్పిలో నీటి విలువ!
అనాథకు తెలుసు లేమిలో ముళ్ళ బాట
ఇష్టంలో మలుపులతో జీవిత గమనం సాగదు

## (19)

అజ్ఞాతం నుండి రూపం –

పేజీలు చినిగిన పుస్తకం వాలకంతో
మాసిన దుస్తులతో బొగ్గుతో గీసిన బొమ్మలా
జీవిక కయి నీడ నుండి నీడకు!
చీకటి ప్రవేశిస్తుంది! గుహలోకి నెడుతుంది.

స్టేషన్‌లో విజిల్ కయి చూచే రైలులో నిలిచీ
దారిలో పడి పోయిన పర్సులా అవకాశం జారీ

మోయ లేని బరువు బ్రతుకుతో
నీరు లేని బావి లాంటి స్థితిలో
హింసకు భూమిక ఏర్పడ వచ్చు
ఆత్మ హననానికి దారి తీయ వచ్చు

పగలు సెన్సార్ చేయబడిన విపరీతం
రాత్రి కలలో స్వేచ్ఛగా అవతరిస్తుంది
నీతికీ నియమానికీ గుడ్ బై చెబుతుంది
స్వప్న ప్రదర్శనం లో ధరించని పాత్ర లేదు

ప్రతి ఇంట్లో దీపం వెలిగే కోరిక అందరిలో
అసలు ఇల్లు అనేది ఉంటేగా!
దీపం వెలిగించేందుకు

ఒకరు అమ్మకానికి సిద్ధంగా ఉన్నపుడు
ఒకరు కోనేందుకూ సుముఖంగా ఉంటారు

గుహలో బొమ్మ లా ఉన్నంత వరకూ
బయట! చీకటి అడుగులదే రాజ్యం!

## 20

అజ్ఞాతం నుండి దృశ్యం –

వచ్చే రైలుకు స్వాగతం చెబుతూ
వెళ్ళే రైలుకు వీడ్కోలు చెబుతూ
స్టేషన్ లా అచలంగా! కవితలో శబ్దం

కదలి పోయే అర్థాల పెట్టెలో ప్రయాణికులు
దిగుతూ ఎక్కుతూ ఎవరి స్థానంలో వారు
ఉన్న వారూ లేని వారూ! తిరిగే భిక్షువులూ
వివిధ స్థాయిల్లో! గమ్యం చేరే ఉత్సాహంతో

కిటికీ నుండి దూర దూరం ప్రకృతి దృశ్యం
రైలు పెట్టెలో మనుషులతో సంగ్రహ సమాజం

రాత్రి వస్తుంది వినీల భయదంగా
వెనకబడి పోతుంది ప్రయాణంలో నీడలా

రైలులో నుండి గిరి శిఖరం పయి దృష్టి
కిందికి దిగగానే భూమిని అల్లుక పోతుంది
ఎండలో దాహం అనల రాగం వినిపిస్తుంది
నీడలో పరితృప్తి శాంత భావం నింపుతుంది

ఒక సమయం నిరంతరం కురిసే వర్షం
శ్రమ జీవికి దొరకని విరామాన్ని
విశేష బహుమతిగా ఇస్తుంది! ప్రియంగా

ఆలోచనలో మనో జగం కాలాని కతీతంగా
వర్తమాన వాహనం పయి భవిష్యత్తు మొదటి అంచులో

## 21

అజ్ఞాతం నుండి ఆకృతి –

లోతు జలాల పయి కదలే నావ లా
బరువయిన అవకాశాన్ని తేలికగా నడిపిస్తుంది

ఇసుక నేల పయి గులాబి పూవులా
బ్రతుకులో ఆశకు ప్రాణం నిలుపుతుంది
చీకటిలో నిప్పు కణంలా ఎగసి
బొగ్గులో నిదురను పోగొడుతుంది.

విషాద గుహలో చేరిన మనసుకు
బయటికి తీసే అభయ హస్త మవుతుంది.

కష్ట జీవి నుదుటి పయి ఎండను
చల్లని మబ్బు నీడ లా అద్దుతుంది.

సెగల మధ్య చిక్కిన మనసుకు
రక్షా శమన కవచ మందిస్తుంది.

ఎదురు పడే క్రమ్మిన పొగల నుండి
బయటికి వెలుగు దారి చూపిస్తుంది

లహరి లహరి కలిసి అడవులు కొండలు దాటి
తీరాల్ని ఆర్ద్రం చేస్తూ పోయే ప్రవాహం లా
మనిషి మనిషినీ కలుపుతూ సమాజ శక్తితో
దేశాల మధ్య కల్పిత సీమలు చెరవేస్తుంది.

ఎన్ని సార్లు
ఎన్ని పూల దండ లలంకరించినా
గుచ్చుకొన్న
ముల్లొకటే! బాగా జ్ఞాపక ముంటుంది.

## 22

అజ్ఞాతం నుండి దృశ్యం –

పుట్టుకతో మనిషికి భూమి తలం అవసరం
పారాడీ నడచీ ఆపై బ్రతికేందుకు

వీరంలో విజయంతో త్యాగంలో శాంతంతో
రాగంలో తృప్తితో మానవ సంస్కృతి చిహ్నం.

ఉల్లోల జలధి పయి కల్లోలంగా వీచే
తుపాను అడుగుల కింద ప్రకృతి నలిగి పోతుంది.

మనిషి నుండి ఉగ్రవాద విస్ఫోటం ముందు
పెను తుపాను శిరసు వంచి వెళ్ళిపోతుంది.

ఎవరి పని వారు చేస్తూ పోవడమే!
వెలగడమో! కాల్చడమో! కూల్చడమో! పేల్చడమో

ఎంతటి మనిషి నయినా అనుమానం
బోనులో నిలుపుతుంది, ప్రశ్నకు గురి చేస్తుంది
తెలియని ఆపద అంచుల్లో నడిపిస్తుంది
మనిషిలో ఆయుధాన్ని సంసిద్ధం చేస్తుంది

ఇతరుల పయి గెలుపుకో
తన రక్షణ కోసమో
ఆలోచనతో పాటు ఆయుధం
పదును తేలడ మొకటే మిగిలీ

మనిషికీ మనిషికీ మధ్య ఘర్షణ
జాతికీ జాతికీ మధ్య వైరం
పునర్భవం పొందుతుంది సమయ సమయం
పరిష్కార పూర్ణతలో లోపం తో ఎప్పటికీ.

## ㉓

అజ్ఞాతం నుండి దృశ్యం –

దివా నిశా వర్ణ భావ భేద కళలతో కాలం
ఉచ్చ నీచ కల్పిత బహు శ్రేణులతో సమాజం

ఒంటరిగా ఉన్నా సమూహంలో కదలుతూ ఉన్నా
లోపల మంచి పాత్రలూ చెడు పాత్రలూ
ఆగమనం నిష్క్రమణం జరుగుతూనే ఉంటుంది

నిరాశలో నీలంగా కోపంలో కెంపుగా
మోదంలో వజ్రంగా కోరికలో పచ్చగా
బ్రతుకు రత్న హారంగా మనిషి మనిషిలో
విపణిలో విలువలతో భాగ్య దశకు చేరాలనీ

మందార  గుచ్ఛం లాంటి పగలు
కత్తి పోట్లకు గురి అవుతుంది
మల్లె చెండు లాంటి వెన్నెల రాత్రి
అనల దృశ్యానికి బలి అవుతుంది

వేగంలో నిర్ఝరికి తీరం దాటాలనీ
ఒడ్డును కోస్తుంది! చెట్లను కూలుస్తుంది

చకితంగా పిడుగు పాటుతో గుడిసె
దగ్ధ మవుతుంది ఏ నేరం ఎరగకుండా

సమాజం నిశ్శబ్దంగా ఉండేందుకు
వ్యక్తి తాను మౌనంగా ఉంటేగా
సమాజానికీ మనిషికీ తప్పని సంబంధం
జీవితాన్ని కదిలించే శబ్ద ప్రపంచం తోనే!

## 24

అజ్ఞాతం నుండి రూపం –

పచ్చని మొలక పయి నీలి మబ్బు ప్రేమ లా
నీలి మబ్బు కయి జలనిధి లో వేదనలా
ప్రేమలో కరుణలో జన హిత హృదయంతో
పద పదం సమాజ చలనంలో భాగమై

మనిషి పయి సమస్యల బరువు వదలకుండా
రోజు నిష్క్రమించదు అంత తేలికగా, సులభంగా

దరిద్రంలో బావురు మనే ముఖాలతో
నీరు లేని చెరువుల్లా పేదల బ్రతుకులు

తల ఎత్తిన పంట పయి ఆశల పక్షులు
ఒడిసెల రాయి తగిలి పడి పోతూ ఉంటాయి

ఉన్నట్లుగా నేల పయి నెత్తురు చిత్రం
శాసనలో పాలనలో శాంతికో కీర్తికో

ధర్మ కర్తలకు బదులుగా
భాగ్య హర్తలు అధికారంలో
సమస్యకు పూర్తి కాని జవాబులతో
గత చరిత్ర శిథిలాలకు వారసులు !

ప్రవహించే కాలం గడ్డ కట్టి
ఒకరికి సోపాన పంక్తి అవుతుంది
ఒకరికి అధికార పీఠ మవుతుంది
ఇది కరగే దాక వేడి వాడి క్రియతోనే!

## 25

అజ్ఞాతం నుండి దృశ్యం –

మజిలీ మజిలీ కొొక నిద్రాణ నిశా ఖండం
పొద్దు పొడిచే దాకా నిలిచిన శిలా ఫలకంలా

కలలోనో కల్పన లోనో ఆశల మెరపులతో
ఫలకం పయి తెల్లని గీతల బొమ్మలు!

దిశలో మిణుగురు లేదారిని చూపగలవు?
ఎగసే ధూమం ఏ జలాల నీయ గలదు?

మెలకువలో వెచ్చని వెలుగులతో
కరగుతుంది తొలగుతుంది, నిశా ఫలకం!

ఉన్న వెలుగు చాలు బ్రతుకు గడచేందు కనుకుంటే
రహస్యం తెలిసేందుకు బయటి వెలుగు చాలదు

దారికి అడ్డంగా  గంతు లేసే
చిత్ర వర్ణ రత్న కాంతి మయ మాయా మృగం
ఏ కోరిక తీర్చ గలదు?
ఏ శాంతిని ఈయ గలదు?

అపుడపుడూ దారిలో వెలుగులు! నీడలు
తెలుపు నలుపు రంగుల్లో ఆకర్షిస్తూ
తోకలపై సాగి ఊగే సర్పాల్లా
ఎవరి పయనమూ ఆగదు!
ఏ భయ భావంలోనూ

సరికొత్త అనుభవంతో దృశ్యంలో భేదం!
కళ్ళ ముందు సమాజ మదే!
సరికొత్త వ్యూహ రచనలో!

## 26

అజ్ఞాతం నుండి రూపం –

అద్దంలో ముఖ బింబం ఎంతో ప్రియంగా
అద్దానికి తెలియదు మదిలో రహస్యం
అది తెలియక పోవడమే మంచిది
ప్రశ్నలు తూణీరం లోనే నిద్రిస్తాయి.

తెరచిన గ్రంథంలో మనసులో లోపొరలలో
పుట పుటలో అక్షర లోకం కొత్తగా
ఒక చూపులో తెలిస్తే కావలసిందేముంది?
ఒక రోజుతో ముగిస్తే ఇక మిగిలేదేముంది?

లోపలి నుండి ఒకరూ
బయటి నుండి ఒకరూ
తమ తమ వైపుకు లాగేరు, అవసరాలలో

ఇరువైపుల నుండీ పిడికిలిలో బహుమానం
దీనికి మురిసే మతి గతి లోనే జీవిత మంతా.

ఏ పిడికిలిలో ఏముందో తెలియదు కానీ
బయటికి చెప్ప లేని రహస్యం ఉందని తెలుసు

అక్షర యానంలో శబ్దం పై అభిమానం
జీవన యానంలో అర్థం పై అభిలాష

చేతిలో గల గల లాడే డబ్బుల్లా
మనిషి ముందు క్షణాలు ఆడవు

ఎవరి ఆజ్ఞ పయి కాలం నడవదని తెలిసీ
ప్రతి వ్యక్తీ తన పిడికిలిలో కాలాన్ని నిలపాలనే

## 27

అజ్ఞాతం నుండి దృశ్యం –

నాటిన శబ్దం మతిలో మొలకెత్తుతుంది
మొలకలో సృజన శక్తి బ్రతుకును అలరిస్తుంది

ఏ చెట్టూ నిటారుగా స్తంభంలా పెరగదు
ఎక్కడో చిన్న వంపు అందం పెంచుతుంది
ఏ నది సూటిగా సరళ రేఖలో సరించదు
ఎక్కడో చిన్న మలుపుతో దిశ మారుతుంది

ఏ చిలకో ఏ నెమలో అవసరాని కే మనిషో
చేరీ ప్రకృతి సన్నివేశం సార్థక మవుతుంది

ఇంతలో విసరిన చూపుల నీలి వలతో
ఏ హంతకుడో! ఏ పీడకుడో! చేరనూ వచ్చు

గురి పెట్టిన ఆయుధాన్ని దించడం
అది పై కెత్తి నంత సులభం కాదు

స్మృతిలో మనిషి గుర్తులు మాసీ
హృదిలో మనిషి రూపం చెదరీ
దారి తప్పుతుంది వ్యూహం మారుతుంది
మారణ గుణ పరిణామం రుచి చూపిస్తుంది

సమాజ జీవితంలో స్వేచ్ఛాచరణంలో
మజిలీ మజిలీ కొక ప్రమాద గ్రహణం!
విధ్వంస వినిర్మాణ శక్తులు సమాంతరంగా
రైలు పట్టాల్లా ఒక దాని నొకటి మీరాలనీ!

## 28

అజ్ఞాతం నుండి దృశ్యం –

జలధిలా నిరంతరం కదలుతూ సమాజం
అర్థ మవని లోతులో తెలియని హృదయంతో

తుపానులా వీచే అలజడిలో నినదిస్తుంది
సునామిలా ఎగసే అశాంతిలో ఘోషిస్తుంది

బాధను మరవాలని నిద్రను ఆహ్వానిస్తే
వెనక నుండి తెలియకుండా కలలో దూకుతుంది

వాలిన రెప్పల మధ్య జగత్తును బంధిస్తే
మనసులో అమాయకంగా తొంగి తొంగి చూస్తుంది

జలధిలో అలకు గర్వం
తన స్వేచ్ఛను ఆపే వారెవరూ లేరనీ
తీరాన్ని దాటాలనీ గమనంలో ఉత్సాహం
అవనిపై కదలాలనీ విజయంలో ఆరాటం

మోద ఖేద తీరాలతో ప్రవాహమయి
సందేహం సందేశం మధ్య జీవితం,
ఒక వైపు నుండి మరో వైపుకు
తప్పని యాన పాత్ర లా కాలం!

వేదిక పయి పాడుతూ ఆడుతూ డ్రెస్‌లో అస్థి పంజరం
తీరం నుండి తీరానికి అవలీలగా దూకుతూ దూకిస్తూ
దిశ నుండి దిశకు మనసు ఎగురుతూ ఎగరేస్తూ

ఎత్తిన చేతుల తో కదలిక తో వేదిక చుట్టూ
గాలికి ఊగే అలలతో జలధిలా జన సందోహం!

## 29

అజ్ఞాతం నుండి దృశ్యం –

జలధి పయినో ఝరిణి పయినో
కదలే నావలా జీవిత మొక సమయం
పరిమిత వలయంలో ఒదిగి ఒదిగి పోతుంది
నేల వదలి అలల మెట్లపై నడుస్తుంది.

కల కల నవ్వుల్ని చెరగుతూ
గల గల పలుకుల్ని విసరుతూ
అలలపై చంద్ర బింబం శిశువులా
స్మృతిలో పూర్వపు దశ పారాడుతుంది

తీరం చేరే సరికి భూమి పయి ఆకర్షణ
విశాల క్షేత్రంలోకి సమాజ చలనంతో
అది తన నిలయమై ప్రధాన భూమికయై

కాలానికి బ్రేక్ పడి నట్లుంటుంది.
వాహనం మారాలిసి వస్తుంది.
స్థానం మారే స్వేచ్ఛా పవనానికి తొందర
సమాజ శ్రేణుల్లో కబుర్లు వినిపించాలనీ

ఉన్న గాలి చాలు! ఇప్పటికి
ప్రాణం నిలిచేందుకు! అనుకుంటే
బ్రతుకు బరువు మోసేందుకు
ఒక ప్రాణం సరి పోయేట్టు లేదు

మబ్బు నుండి మెరపు తళతళగా
పుట్ట నుండి పాము చకచకగా
రెండూ మనసులో బింబాలయి దూరేను
ఆప్త మిత్రంగానో తత్కాల శత్రువు గానో.

## 30

అజ్ఞాతం నుండి దృశ్యం –

రోజు మొదలవుతుంది తెరచిన దారులతో
రోజు వీడి పోతుంది సశేష విజయంతో

ఏ రోజూ అవతలి గట్టుకు చేరక తప్పదు
ఆ తీరం దాటాలిసిందే, అవతలి తీరం చేరాలిసిందే

వెనక నుండి నీటిలో ఈదుతూ పులి!
ఆకలితో ఆహారం కయి అవతలి గట్టుకు! అలవాటయి!

మృత్యువు  హెచ్చరికతో ప్రాణిలో ఆలోచన
ఎప్పటి కపుడు ఆపదలో అపాయాల్ని మెరపిస్తుంది

దేహం పయి గాయం మానాలనీ
కీర్తిని నిలిపే చిహ్నం బ్రతకాలనీ
నరక మెంత యమ యాతనో వినడమే
అచటికి వెళ్ళి వచ్చి చెప్పే వారెవరు?

బయటి నుండి ఊపిరి పోస్తూ గాలి
లో లోపల జీవితాన్ని నిలుపుతూ చేతన
పరస్పరం సహకారం సహయోగంతో రెండూ
మనిషికి కావలసిన అస్తిత్వం చేకూర్చేను

ప్రశ్నలకు సమాధానాల పత్రంలా జీవితం
దొరికిన జవాబులతో రోజు తరల వలసిందే
ఎన్నో ప్రశ్నల లిస్టు మాత్రం మిగులుతుంది
వచ్చే తరాలకు! సంపదగానో ప్రేరణగానో

## 31

అజ్ఞాతం నుండి దృశ్యం -

బోను నుండి విడుద లయిన సర్కస్‌లో జంతువులు
స్నేహ సుందరంగా ఒకటొకటీ అడుగులు వేస్తాయి
తమను పోషించే ఆడించే మాస్టర్ పక్కనే
అక్కడ చేరిన ప్రేక్షకుల్ని పరిచయంగా చూస్తాయి

బోను చూచి పూర్వం దూరంగా జరిగి పోయేవి
అనుకోని విధంగా బోను లోకి రాకతో మరో జీవితం

తన ఆజ్ఞను పాటిస్తూ అలవాటయి
చెప్పినట్లు చేయడం మనిషికి ఇష్టం

మనిషి ముందు నుండీ! తెలిసిన మనిషే!
తన ముఖం దాచి! ముఖం దాట వేసేను

సర్కస్‌లో జంతువు మనిషి ముఖం లోకి చూస్తుంది
మనిషిలో ధైర్యాన్ని నిలిపే చూపులు ప్రసరిస్తుంది
క్రూర కర్మ వదలీ వినోదాన్ని పంచుతుంది
భయపడే మనస్సుపై అభయ ముద్ర వేస్తుంది

కారణ మేదయినా విచిత్ర సన్నివేశంలో
కంటక మయ మేధ కన్నా మస్తిష్కంలో
మారిన గుణంలో వన్య ప్రాణిదే పై చేయిలా ఉంది
మనిషి మనశ్శిఖరానికి వెలుగు పాగా చుడుతూంది

జీవిక కయి ఎన్నుకునే మనిషి ఆలోచనకు
పసిడి జరీ అంచులా ఉందీ సందర్భం

❀

## 32

అజ్ఞాతం నుండి దృశ్యం -

పేల్చ బడిన మహా సౌధ శకలాల రాసులలో
ధూళిలో కలిసిన నిజాల అన్వేషణలో
విషాద స్వరం వినిపిస్తుంది ఇప్పటికీ
వికార భంగిమలో మనిషి బొమ్మ ఎప్పటికీ

పై పై ఎత్తులతో పావుల కదలిక మొదలయి
కదలికతో ఒక సమస్య! కదలక పోతే ఒకటీ

గళ్ళలో  తెలుపు నలుపు రంగులు మారే స్థితిలో
ఆటలో మంచి చెడుకు హద్దు లెక్కడున్నాయి

అవసరానికి అంతరాత్మను పగటి వేళ
ఎక్కడో తాకట్టు పెట్టో, ఎవరికో అమ్మేసో
రాత్రి వేళ అపహరించి తేవడమూ
ఆ మరునాడూ అదే! పని అలవాటుగా

బయట సూర్యుడెంత వెలుగుతూ ఉన్నా
ఎదలో చిరు దీపం వెలుగు అవసరం!

గిరి శిఖరం నుండి జలపాతం దిగినా
దగ్గరలో ఏ నూయో చెరువో చెలమో తప్పదు

మసి అంటించే బొగ్గు శక్తి ఎంతటిదో!
నిప్పు కణం తాకితేనే తెలిసేదీ!

ప్రజాస్వామ్య పథంలో స్నేహ సహన గమనం వదలి
వైర రాజనీతిలో మానవ హననం క్షంతవ్యం కాదు

## 33

అజ్ఞాతం నుండి రూపం –

అనల కణాన్ని ఎదకు హత్తు కోవాలనీ
దీని కెంత హిమానీ హృదయ మవసరం

ముందు తాను వేదనతో కరగీ తరలీ
కరుణ నయన బిందువులు  రాల్చాలిసి ఉంటుంది

నూయిలో లోతులా మనిషిలో భయం
లోప లున్న జలం కయి చేద అవసరం
ప్రతీ నూయి లో జల మెప్పటికీ ఒక లా ఉండదు
ప్రతీ భయ స్థితిలో ప్రమాదం పొంచి ఉండదు

చుట్టూ వనమూ నదులూ కొండలతో ప్రకృతి
మనిషి మనిషికీ మౌనంగా సందేశాన్ని ఇస్తుంది

మెడలో పూల దండ పడినట్లే ఒకరికి
చేతికి ఆయుధమూ అందుతుంది ఒకరికి

వీరుని దేహం పయి గాయం చిహ్నంగా మిగులుతుంది
ఆదర్శంలో పూవై మనసు నలంకరిస్తుంది
త్యాగం ఆదర్శానికి చలన శక్తి నిస్తుంది
కర్తవ్యం గమ్యానికి దిశ నిర్దేశిస్తుంది

ఒరలో ఒక సమయం కత్తి అవసరం కావచ్చు
ఎవరెవరినో గాయ పరుస్తూ పోవడం అమానుషం

ఆయుధ మొక క్రీడామయ వస్తువు కాదు
మౌన ప్రాకారంతో నిశ్శబ్దంగా నిలుస్తుంది
అవసరానికి మోహరించి శబ్ద ప్రపంచం దింపుతుంది
రణ చిత్రం వదలుతుంది! మారణ చరిత్రలో!

## 34

అజ్ఞాతం నుండి రూపం –

సమాజంలో బయట మండుతూన్న జ్వాలను
శాంత పరచి కుసుమ నికుంజం చేయాలనీ

హక్కుల సాధనలో కలహ ప్రియ రాగంలో
శ్రుతి సహ శబ్దంతో సహ భావం తేవాలనీ

కలగి నలగి ముక్కలయిన ఆశయాల జీవితాన్ని
విశ్వ బంధు జీవన నవ శాలగా మార్చాలనీ

ఇంటి ముందు ఇరు వైపుల నిలిపిన పాత్రలలో
అనల శిఖల బదులు, పరిమళ పుష్పం పూయాలనీ

పిలుపు కన్న అరుపు కన్న ప్రార్థన కన్నా సదా
స్థలం నుండి స్థలానికి అక్షత హృదయంతో
నలుపు నుండి తెలుపుకు తెలుపు నుండి ఎరుపుకు
భయం నుండి ముక్తమయి జడం నుండి ప్రగతికీ

భూమి ఎంత ఉన్నా గుడిసె కింత చోటు లేదు
మనుషు లెందరున్నా అభయ ముఖం ఎక్కడుంది?

రణ పథంలో అడుగుకు
చివరి విజయ పంక్తి లేదు
జన హితంలో ప్రగతికి
చిట్ట చివరి మెట్టు లేదు

రాజనీతి శాసన పాలన గుణ కలనంలో
సౌభ్రాత్రం సమభావం సమన్వయంతో సమాజం
ప్రజాస్వామ్య పరంపరా విధం లోనే సాధ్యం
దోసిలి వితరణతో ఏ బ్రతుకు పంట పండుతుంది.

## 35

అజ్ఞాతం నుండి దృశ్యం –

హక్కుల రక్షణలో వంచితులూ బాధితులూ
మేఘం రాక కయి గ్రీష్మ వనీ హృదయంతో

సమాజ కథలో వదల బడిన ఖాళీలు
శ్రమ కేతన మెరగని ఆశారుణ ముఖాలు

ఘనీభూత మయిన హిమ జల కణ సమాజాన్ని
కరగించే కదలించే కవోష్ణ నిశిత గళ ధ్వనులు!

రాజ్యం శాసన భాష మాట్లాడుతుంది
ఆయుధం అనల భాష మాట్లాడుతుంది
సమస్యల జ్వలనంలో హృదయ భాష అవసరం

ఒకరి కయి వేచి చూచే అవసరం లేకుండా
వేదిక పయి నాయకుని బహు పాత్రాభినయం!
కర్మాగారం నుండి విడుదలయిన వస్తువులా
వ్యాపార సరణిలో జీవిత మొక లోలక స్థితిలో

రోజు కొక విపణి సూచి చంచల గతిలో
మనిషి వెనక మనిషి సందేహ పదంతో

పగలు మాట మరచి ప్రజకు దూరంగా
చుక్కల మధ్య శశాంకునిలా అందని ప్రజాస్వామ్యం!

విగ్రహాల కెదురుగా గంటలు మ్రోగేను
శాంతి వచనాల మధ్య జ్వాలా రథం కదిలేను

ఆయుధ శబ్దం వినిపించని దేశ మెక్కడుంది?
వీర గాథ లల్లు కొనని జాతి ఎక్కడుంది?

గోపుర మస్తకం దాటి దీన గళ స్వరాలు
ఇప్పటికీ నదిస్తూ వినిపిస్తూనే ఉన్నాయి.

## 36

అజ్ఞాతం నుండి ఆకృతి –

ఇక్కడ చేరే వారెందరో మనుషులు ఒకరొకరూ
అందరి ముఖాలూ పరిచయమే ఒక్కొక విధంగా.

పరిచయం లేని ముఖం ఒకటే ఉంది
అద్దంలో చూస్తే కన్పించే ముఖం, తనదే!

మనసు చుట్టూ క్షణాలు పరిభ్రమించేను
మ్యూజికల్ చెయిర్ చుట్టూ పిల్లల్లా
ఎప్పుడెవరు వాలేదీ తెలియదు కుర్చీలో
విజిల్‌తో పూవులా చిలకలా చంద్ర కళలా

విజిల్ లేకుండా రాలవచ్చు! అనల కణంలా
అంతలో మ్రోగవచ్చు ప్రేలవచ్చు హెచ్చరిక లేకుండా

ఒక పనిలో విలీనంలో
మృత్యు పదం వినపించదు
దగ్గరి కొచ్చేసీ చూస్తూ చూస్తూ
మృత్యువు! వచ్చిన పని మరుస్తుంది

గడియారం ముళ్ళు కదలుతూ పోతాయి
అంకె నుండి అంకెకు అవిరామంగా
ఒక బిందువు నుండి మరో బిందువుకు
రేఖలతో చిత్రాలొక టొకటీ వరసగా

ఎదురుగా దారులు స్వాగత ముఖాలతో
అడుగు పడేది మాత్రం! ఒకే దారిలో
మరో దారి అయితే బాగుండేది అనీ విమర్శ
ఎన్నుకున్న దారిలో అనుభవమయమై కృతి!

## 37

అజ్ఞాతం నుండి దృశ్యం –

అక్షర మెపుడూ గెలుపులో నిలుపుతుంది
మెలకువలో సజీవ రూపాన్ని ప్రసాదిస్తుంది

లిప్తలు వెనక్కి మరలవు
అడుగులు వెనక్కి వేయవు

మనిషి వదలి పోయే గుర్తులు
సమాజ దర్శినిలో నిలిచేను

గర్భం నుండి శరీరం బయట పడుతుంది
మేధలో తన దయిన ప్రయోగ శాలతో

జీవితంలో అనుభవంలో జయాపజయాలు
ఉపకృతికి మరో వైపున అపకృతి రూపంతో

గోడలు లేని ప్రపంచంతో వచ్చి
గోడలున్న నిలయంలో బ్రతికేను

లోపలి సుప్త చేతన మేల్కొంటుంది
బయటి తంత్రాన్ని గుప్తంగా నడిపిస్తుంది

శిథిలాలలో నవ నిర్మాణోత్సాహంతో
శ్మశానంలో పచ్చని భావనతో
సమాధి పయి రమ్య సౌధ కల్పనతో
ఖేదంలో బాష్ప బిందువు లొకటొకటీ
మోదంలో ఆమోదంతో పూలుగా మారాలనీ

ఈ విశాల పృథ్వీపయి
మృత్యు ముద్ర లేని అణువు ఎక్కడుంది?
ఆర్త రవం వినిపించని గాలి ఎక్కడుంది?

## 38

అజ్ఞాతం నుండి రూపం –

తనకు మాత్రం కనిపించే వినిపించే
వ్యక్తి భావ వలయంలో అనుభూతిలో
ఇతరులకూ కనిపించే వినిపించే
సమాజ భావ క్షేత్రంలో వాస్తవంతో
మనసు మూలం నుండి జీవితం
అనుభవ శాఖలతో దిశలు విస్తరించేను

మట్టి పై రంగు మట్టి బొమ్మలా
మట్టిలో కలిసే భావం ఎట్లా ఉన్నా
ప్రతి దశలో ఉత్సవ కళతో
సుందర జీవన దృశ్యం కనిపించేను

అసాధ్యంలా సముద్రం ఎదురు పడుతుంది
తరించే నావ ఆలోచనలో కదలుతుంది
అసంభవంలా ఆకాశం పైన పరచుకొనీ
దూసే విమానం అన్వేషణలో ఎగురుతుంది

చీకటి విసరే మృత్యు భయంలో
దీపం మనిషిలో శక్తిని వెలిగిస్తుంది

మానవేతర శక్తుల పయి ప్రాబల్యం తో
ప్రకృతి పై విజయంతో దశ దశలో
మృత్యువు అదృశ్యమవుతూ అమృత పథంలో
మట్టికి భిన్నమయిన దర్శనం మనిషిలో!

## 39

అజ్ఞాతం నుండి దృశ్యం -

మనిషి వెనక సమాజం గతంతో
మనిషి చుట్టు సమూహం ప్రస్తుతం.
లోపల జన ప్రపంచం
ఒంటరితన మెక్కడుంది మనిషిలో.

కాళ్ళు వెనక్కి నడవ్వు
కళ్ళు వెనక్కి చూడవు.
ఏ దిశలో గమనం?
ఏ లక్ష్యం కోసం?

ఎట్లా బ్రతకాలనే కన్నా
దేనికి బ్రతకాలనే ప్రశ్న!
యుగాలుగా ప్రశ్న లవే అలలుగా
ఒడ్డుకు చేర్చేదేదో! ఎపుడో! తెలియదు.

పరిచయ భూమికలో సమాజం
ఎన్నిటినో చూపిస్తుంది, వినిపిస్తుంది.
కంటి నీరు తుడిచే వేలు
కళ్ళలో పొడిచే పనిలో ఉంది.

గులాబి పుష్పం కయి చేయి చాచి
ముళ్ళ భయం నాటి, వెనక్కు మరలించేనా?

నీలి మబ్బు కనిపించే సంతోషంలో
పిడుగు భయం దూకి, లోనికి నడిపించేనా?

సమస్యల దాడిలో అసహనంలో
తానొక తరువో గిరియో కావాలనీ,
కల్పనలో మాత్రం అందంగా ఉంటుంది.
జీవన చలనంలో గగన కుసుమ సమం.

## 40

అజ్ఞాతం నుండి దృశ్యం –

మట్టి పయి అడుగులతో జాడలతో
మట్టి అంటని మస్తిష్కంలో మేధతో
మట్టి నుండి సృజన లా మానవత
సుందర సీమ దాటి పావన దిశ దాకా

మనిషిలో ఉన్నత శిలా స్తంభం పై
పావురం వాలుతుంది అందంగా
నిఘంటువు ఎరగని శబ్దం పలుకుతుంది
స్థలం వీడి పోతుంది పచ్చదనం వైపుకు.

మనిషిలో పూర్తి శక్తి తెలియని మనో రూపం
ఆరోహణ లెరగని గమన వేగంతో
తృష్ణలో కొండ చుట్టూ తిరుగుతుంది
ఆర్తిలో ఎడారి కలలో దిగుతుంది.

నీరు గాలి వెలుగు వలె సమాజంలో
మానవ హక్కు లెవరి స్వంతమూ కావు.

చీకటిలో ముఖాలన్ని ఒకే తీరుగా
వెలుగులో తెలుస్తుంది ఎవరి ముఖమేదో!
ఏ దిశ నుండి రేఖ లేదిశకు చేరినా
ప్రజాస్వామ్య భావనలో హృదయ బిందు వొకటే!

శాంతి కరుణ ప్రేమ సహనం ఎన్నో!
తిరిగే క్రీడా చక్రం పై బొమ్మల్లా
మనిషిలో వాహనంపై వినోదమో ఆర్జన కో
హరిణ సింహ హయ మయూర రూపాలు!

బుజాల పయి ఏముందని దించేయడానికి
ఇంత వరకు మరొకరి బుజాలపైనే పయనం!

స్కూలు వరకూ పిల్లల వెనక డాలీ! పరుగెత్తుతుంది
విశ్వాసంతో వెళ్ళి కృతజ్ఞతతో తిరిగి వస్తుంది.

## 41

అజ్ఞాతం నుండి దృశ్యం –

సమాజ గగనంలో మేల్కొనే ప్రగతి సూర్యుడు
సామాన్యుల జీవితాల్ని కాల్చేందుకు కాదు

విరుద్ధ దిశలలో సమ భావ కరాలతో
ప్రజాస్వామ్య ప్రకాశం పరివర్తన సంకేతం

ప్రతి నిమిషం మనిషిలో హిమ భావం కరగుతుంది
బిందువు లయి జారుతూ జీవితమంతా సరిస్తుంది
నిరోధాల్ని అధిగమిస్తూ ఉత్సాహంతో
విరోధాల్ని చల్ల బరుస్తూ ఆర్ద్రాకృతితో

తన దాహం తీరే మాత్రం గానే
నీరుండదు ప్రవాహంలో
తన బ్రతుకు నిలిచే మాత్రం గానే
గాలి కదలదు పరిసరాల్లో

కొండ సిగలో జలధార
మల్లె చెండు వరసల్లా తిరుగుతూ ఉండదు
భూమి పైకి దిగుతుంది, కదలుతుంది
మట్టి గుండెను పులకరింప జేస్తుంది

చుట్టూ అజ్ఞాత మహా సముద్రం కదలుతూ
మనో భూమి పయి సమాజ దృశ్యం మారుతూ

నిర్విరామ పవనంలో
అణువణువూ పయనం సూచిస్తుంది

సర్వం సహా హృదయంలో
కణ కణమూ బ్రతుకు బరువు మోస్తుంది

మేల్కొన్న మనిషిలో గుప్త చేతన
సమాజాన్ని నడిపించే సాధన మవుతూంది

## (42)

అజ్ఞాతం నుండి ఆకృతి –

జీవిత కాలంలో తా నేమయినా కానీ
కృతిలో కవి బింబం! కాలాని కతీతమయి
సమాజ వర్తనలో సృజన విభాతంలో
చీకట్ల ప్రసక్తి లేదు, మానసిక ప్రకాశంలో

తాపంలో వేదనలో
హిమ తుషార భావనతో
చలనంలో అన్వర్థంతో
గమనంలో స్థిర లక్ష్యంతో
దారులెన్ని ఉన్నా మార్గం మాత్రం కవి అభిమతమే

ఏది కదిలేదో అది కదలుతుంది
పర్వతం కదలదు, కదలే ప్రసక్తి లేదు
ఏది నడిచేదో అది నడుస్తుంది
చెట్టు నడవదు, నడచే ప్రశ్న లేదు

నది విశ్రాంతి ఎరగదు
గాలి విరామం కోరదు

ఆలోచన ఎంత చేసినా
ఆవేదన ఎంత పెరిగినా
చివరి మాట వివేకానిదే
పేకాటలో తురుఫ్ కార్డ్‌లా

మనిషి మాట వినిపించని సమయంలో
పూవూ ఫలమూ కనిపించని తరుణంలో
శూన్య స్థితి నింపే అనుభవం ఎక్కడుంది?

మనిషి మాట వినిపిస్తూ
పూవు ఫలం కనిపిస్తూ
శూన్య స్థితి నింపే అనుభవ రుచి హృదిలో
కాలాని కతీతమైన కవి బింబం కృతిలో

❀

స్వేచ్ఛా కవిత్వం

రెండవ భాగం - 19

# రోజు వస్తుంది స్వచ్ఛంగా

**మాదిరాజు రంగారావు**

**2010**

**రసధుని సాహితీ పరిషత్తు**

శాంతినగర్, హైదరాబాద్ - 500 028

*Presented to*

my daughter

***Mrs. Haritha Devulapalli***

M.A. (Lit.)

Michigan U.S.A.

**with affection and blessings**

# సూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | అనల బీజమవకూడదనే | ................ | 7 |
| 2. | తొలగని ఆశతో | ................ | 8 |
| 3. | రోజు వెనక రోజు | ................ | 9 |
| 4. | ఆయుధమూ పావురమూ | ................ | 11 |
| 5. | శాంతి శీర్షికతో | ................ | 12 |
| 6. | ఉద్యమ సాధ్యం | ................ | 13 |
| 7. | ధూళి చే రోజు | ................ | 14 |
| 8. | మస్తిష్కంలో తంత్రులపై | ................ | 16 |
| 9. | వెలుగు దారి చూపుతుంది | ................ | 17 |
| 10. | ఓటమిని మలచుకొనీ మెట్టుగా | ................ | 18 |
| 11. | మట్టి అంటక పోవడంతో | ................ | 18 |
| 12. | చీకటి పొంచీ | ................ | 19 |
| 13. | స్మృతిలో ప్రవాహం | ................ | 21 |
| 14. | మారిన తేదీతో | ................ | 22 |
| 15. | విపణిలో మనిషి | ................ | 23 |
| 16. | తానొక బొమ్మగా | ................ | 24 |
| 17. | ఎప్పటికీ అవసరం | ................ | 25 |
| 18. | సామాజిక అవసరం | ................ | 26 |
| 19. | చివురు కోసం ఎదురు చూస్తూ | ................ | 27 |
| 20. | మనిషితో మనిషి సమాజంలో | ................ | 28 |
| 21. | రోజు బ్రతుకులో భాగమై | ................ | 29 |
| 22. | బాధ్యత అందరిదీ | ................ | 30 |
| 23. | వైస్ వెర్సా | ................ | 31 |
| 24. | రోజు వస్తుంది / పోతుంది | ................ | 33 |
| 25. | స్వేచ్ఛగా స్వచ్ఛంగా | ................ | 34 |

# రోజు వస్తుంది స్వచ్ఛంగా

## 1. అనల బీజ మవకూడదనే

ఈ విశాల పృథ్విపయి
సృజన భావ ప్రపంచం
నవ సమాజ దశదశలో
అభినవ పద రోహణం

దేశ మొక ఉదార చరితయై
ప్రతి ఎద కొక అభయ కవచమై
ధవళాశయ శిఖరాలకు చేరువగా
చేరాలని ఆవేగం మనిషి మనిషిలో

వర్తమాన గమనం విషమతలం పయి
అవరోధం అవశీర్ణత పరిశుష్కతతో
సమయం సమయ మొక సమస్య
ఘర్షణ రణ మనివారణ మయి,
మనిషి విజయ ఫాలం పయి
కుసుమ దళం వాడేను
కరుణ జలద నయనాల్లో
అనల కణం మెరసేను.

ఇంటి ముందు చెట్టు పచ్చగా
దారిలో విరామ నిలయమయి
పురా రూప వనీ బంధంతో
సమాజ రూపానికి చిర చిహ్నమై

చెట్టు పైకి పాకే సర్పం
ఆకులలో పక్షి గూడు
కొమ్మ నుండి కొమ్మకు వానరం

పూవు ఫలం నీడ మరో అవసరంతో
సంపద పయి ఆశ బ్రతుకులో
మనిషి నుండి మహా మనీషి దాకా

ఏ రోజూ కొమ్మ పయి
నిప్పు పూలు కదల కూడదనే
ఏ క్షణమూ రేపటికి
అనల బీజ మవకూడదనే

## 2. తొలగని ఆశతో

యుగాలు తిరిగి చూచినా
చరిత్ర పుటలు తిరిగినా
మనిషి నుండి మరో మనిషి
సృజన దహన చర్యలతో
చినుకులో పూలు చిమ్ముతూనో
పిడుగులో నిప్పు రాలుతూనో

విజయుడు కావాలనే కోరిక మంచిదే
రణ రంగ ప్రవేశాని కర్హత అవసరం

దార్శనికం ఆవేశం ఆతంకం పేరుతో
వాదమో వివాదమో నినాదమో కానీ
ఘర్షణలో మానవతా కుసుమం నలిగేను
చరిత్రలో మనిషిని వెనకకు నడిపించేను.

మెలకువలో వెలుతురులో నడిచే చీకటి
మానుష బంధాలను తెంచేస్తూంది.

సుడిగాలి అణగిందో లేదో
పెను మంటలు చార్జి తీసుకునేను

ఆర్ద్ర కణం ఎరగని పొగల నుండి
ఏ జలదం హృదయం స్పందించేను.

గాలిచే మెల్లగా పేనబడీ
ప్రాణ సూత్రం మిగులుతూంది.

స్వార్థం హింసకు తలుపులు తెరుస్తూంది
వెనక నుండి ఆర్త రవం తరుముతూంది
సామాన్యుని వెన్నులో వణుకును పుట్టిస్తూ

నాయకుల ఆహ్వానం పయి
విధ్వంసం అతిథిలా విచ్చేస్తూంది
అక్కడే తిష్ఠ వేయ చూస్తూంది.

గుహలో సర్పంలా ముడుచుకొనీ
స్వప్న దృశ్య మవుతూంది, ప్రజాస్వామ్యం

స్వచ్ఛంగా మొదలయిన రోజు
మాసీ మాడీ చెదరీ నిష్క్రమిస్తూంది
మరునాటికి స్వచ్ఛంగా
మనిషిపై తొలగని ఆశతో

## 3. రోజు వెనుక రోజు

సమాజ చేతనలో
మేల్కొన్న మనిషిలో
పలకని అణువు లేదు
వెలగని కణం లేదు

వర్తమాన స్వేచ్ఛలో ప్రజాస్వామ్య మింకా
జనతా హృదయ వశం కావలసే ఉంది
నవ జీవన హేతువు కావలసే ఉంది.

మనసు తీగెకు పూవులా క్షణం
అల్ల బడిన క్షణాలతో జీవితం

కల్పనలో బులిపించే ఆదర్శం
ఇంకా మాటల కోటలోనే ఉంది.

నిన్న ఉన్న వ్యక్తి నేడు
ఉండవచ్చు లేకపోవచ్చు
వ్యక్తి ఉపద సమాజాని కంతో ఇంతో
ఎప్పటికీ పరంపరా ప్రవాహంలో భాగం

గడియారంలో తిరిగే రెక్కల వలె
ఒకరి నొకరు కలిసీ విడిపోయే మనుషులు
ఎప్పటిదో బ్రతుకు భయం నుండి
ఇంకా ముక్త మవని జీవితాలు!

తెర పయి బొమ్మల్లా కదలుతూ
ఆట వస్తువులు నయమనిపించేను.

జీవన వ్యవహారంలో
ఎత్తుకు పై ఎత్తులతో
ఒక అంకె లాభం పైకి ఎత్తుతుంది
ఒక అంకె నష్టం క్రింద దింపుతుంది

ఖాళీ పాత్రలా చాచిన అరచేయిలో
ఏ కోరిక ఫలం అవతరిస్తుంది?
గగన హృదయం జారేనా?
గాలి కెరటం కదలేనా?

చుక్కలు రాల లేదనీ
సూర్యుని రూపు లేదనీ
చంద్రుడు దూక లేదనీ
మాట లెన్నో! నిందలెన్నో!

మనిషి జాడ పయి సందేహం
మనసు ఉనికి పయి అనుమానం!

మనసు మలిన మయినా
ఊహ జ్వలిత మయినా
ఆ రోజు ధూళి తొలగే
ఆనాడు బూజు ఎగిరే
మరో రోజు వస్తుంది స్వచ్ఛంగా.

## 4. ఆయుధమూ పావురమూ

పేదరికం మోసం దౌర్జన్యం పయి
ఉద్యమ ప్రేరణతో సామాజిక పవనం
మంచు గడ్డ లాంటి ముఖాల పయి
అనల శిఖలు ఊదుతూంది.

సమాన న్యాయం కయి చూచే
సమాజ వర్గ మొక టొకటీ
చందన ఖండంలా అనల స్పర్శతో
త్యాగ పరిమళం విసరుతూంది.

ఆగని గడియారం లా వర్తమానం
యువతను భవితవైపు నడిపిస్తూంది

ఎరుపెక్కిన ఉద్యమ మొక సమయం
అనల శిఖల మధ్య కమిలి
లక్ష్యం మసి బారుతూంది
అకాల సాయం సంధ్యను పొందుతూంది

ఎవరి దార్శనికం వారికి నిజం
మరొకరికి కనిపించని ప్రపంచం

అపుడపుడూ కాస్త తెరవబడీ
తల ఎత్తిన ఆయుధం కనిపించవచ్చు
కనిపించని పావురం పైకి ఎగరవచ్చు
ఆయుధమూ పావురమూ మధ్య మనిషి

## 5. శాంతి శీర్షికతో

రాజ్యాలూ శాసనాలు అధికారం ఆజ్ఞలు
గీసిన గీతలలో జీవితాలు తిరిగేను

బాధలో వేదన
వాదనకు దారి తీస్తూంది.
విభేదంలో ఆలోచన
చర్యకు పురి కొల్పుతూంది
పొంతన కుదరని వర్తన
ఘర్షణ దిశ చూపుతూంది.

లక్ష్యం చేరే తొందరలో
అలజడితో ఉద్యమ రూపం
మనిషిని మంటల మధ్య నిలుపుతూంది

మనిషిలో కుసుమ గుచ్ఛం
పొగలు క్రమ్మి మరుగున బడిపోతూంది.

చిత్ర మేమంటే!
కాళ్ళు ఉద్రేకంలో గాలిలో తేలేను
ఆ సమయం అనల కణాలు
బొమ్మల్లా గాలిలో ఎగిరేను

ఉదయం వార్తా పత్రికలో
అక్షరాల అలల పయి కంకాళాలు
బ్రతికి ఉన్న మనుషుల్ని హెచ్చరించేను.

ఎద పయి నీలి నీడ కప్పుకొనీ
చుట్టూ కలకలం మధ్య రోజు
గడస్తూంది, "శాంతి" శీర్షికతో

## 6. ఉద్యమ సాధ్యం

ఉద్యమంలో నిరసన దీక్షా ముద్ర
మానస రణ భావనా యానంలో
ప్రహారంలా విడుదల కావచ్చు
నీహారంలా తేలి పోవచ్చు.

అభినందనతో ఆరంభమయి రోజు
అభిశంసనతో సమాప్తి పొందవచ్చు

అభిశంసనతో చుట్టబడీ రోజు
అభినందనతో అలంకృతం కావచ్చు.

చీకటికి గాయం బాధ తెలియదు
గాయ పరచడ మొకటే తెలుసు
గమ్యం కయి చలనంతో మనస్సు
సాహస కవచం ధరిస్తుంది

తప్త హృదిలో అనలం
చర్యకు ప్రేరణ నిస్తుంది

రాత్రి ఒడిలో నిద్రించే నిప్పు కణం
పొద్దునే కిరణంగా మారాలనీ

మంటల కంటకాల పయి నుండి పవనం
చందన పరిమళ వనం చేరాలనీ

దోసిలి నుండి నదిని వదలాలనీ
మాటల్లో కెరటాలు గట్టు చేరాలనీ

ప్రవహించే వర్తమానం
సీసాలో బంధింపబడదు

పై నుండి కిందికీ
కింది నుండి పైకీ
తిరిగే ఉత్సాహ చక్రం పయి
బొమ్మలాట ప్రదర్శనంలా సందర్భం

గోడ పయి పోస్టర్ చిత్రంలా
ప్రియమయిన లక్ష్యం ! ఎదురు పడదు

మేల్కొన్న మనో రూపానికి
విరామంతో పని లేదు
ఆచరణ శీల తత్త్వానికి
అదృష్ట బిందువుతో పనిలేదు

వీధులెన్ని తిరిగినా
తనలో కోరిక ఫలం
భిక్షా పాత్రలో లభించదు
ఉద్యమ విజయంతోనే సాధ్యం!

## 7. ధూళి చే రోజు....

సౌధ శిఖర పంక్తులతో నగరం అందరికీ
దారుల చేతులు చాచి స్వాగత మిస్తుంది.
చుక్కలలో ఒకటవ జూచే మనిషి
ఎత్తులతో ఎగసీ పైపైన నడవాలనీ

అర్థరాత్రి నగరంలో దీపాలు
వేచి ఉన్న చుక్కలతో మాట్లాడేను
సమాజంలో నేటి మనిషిని గురించీ
మనిషిలో మాయమయ్యే వెలుగు గురించీ

జీవన ఘన వాస్తవం నగరం
మనిషిలో స్వప్న శకల చిహ్నం

ప్రతి సౌధం వద్ద ఆగుతూ
శిఖరాలను స్పృశిస్తూ గాలి! మెల్లగా

ఒక సమయం వెలుగు వెనక నీడ
ఒక సమయం వెలుగు ముందు నీడ
నీడ లేక వెలుగు లేదు
రాత్రియే ! ఒక పెద్ద నీడ!

ఎండ నుండి నీడను కోరే
మనిషి వెంట నీడ తప్పదు
సమాజ చలనంలో వాస్తవ జీవితం
ఎప్పటికీ తెరవ బడని విలువయిన ఖజాన
అందులో ఏముందీ ఎవరికీ తెలియదు
లేనిది తలచుకొనీ మురిసేరు మనుషులు
ప్రకృతి రూప మెప్పటికీ బహిరంగమే
మనిషిలో మానసికం బహు రహస్యం
పూర్వపు సమాజ వనంలో
నిరంకుశ సింహం బదులు
వర్తమాన సమాజ శాలలో
ప్రజా స్వామ్య మనోహర హరిణం
కాలానికి స్వార్థంతో పని లేదు
స్వేచ్ఛా సమ హితకరమెప్పటికీ
ప్రతి రోజు శుభ్రంగా మనిషిని
నిశా నది నుండి తీసి వదలుతుంది
తప్పని బ్రతుకు తెరవు మైదానంలో
ధూళిచే మలినమై రోజు గడచిపోతుంది.

## 8. మస్తిష్కంలో తంత్రులపై

మస్తిష్కంలో మతి తంత్రుల పయి
భావ గతులతో మూర్ఛన లొకటొకటీ

నిశా శిథిల పంక్తి దాటి ఆలోచన
కొత్త సీమలు చేరాలని ఆరోహణలో

మెత్తని సర్పం చుట్టుకొనీ ఎగసి
క్రింది నుండి పైకి మెల్లగా కదలేను

తెలుపు నుండి ఎరుపుకూ
ఎరుపు నుండి నలుపుకూ
తప్పని సంధ్యా సన్నివేశం
సందేహం నిలుపుతూంది, మలుపులో

తుంగ తరంగ జలధిలా సమాజం
భయ దృశ్యం లోనూ సుందర భావనతో

భ్రమణంలో భూమికి లేదు విరామం
చలనంలో ఊహకు లేదు విశ్రమం

ముందుకు సాగే వేగానికి
బ్రేక్ వేస్తుంది ప్రకృతి

ప్రకృతిలో ప్రతిదీ సూటిగా
బ్రతుకులో సందేశాన్నిస్తుంది

విరామ సమయంతో పని లేకుండా
తెర వెనక నుండి మరో పాత్రలు!

తెర ముందు నుండి ప్రేక్షక గణం!

వేదికపై అపహాస్య రూపకం
అప్రకటిత ప్రజాస్వామ్య వినోదం

## 9. వెలుగు దారి చూపుతుంది

రాయి మనిషి వైపు చూస్తుంది
చేతిలో ఉలి ఉన్నదీ లేనిదీ

మనిషి మనిషి వైపు చూచేను
మనసులో ఏముందో అనీ
పూల దండో! పదును చాకో!
తంత్రీ నాదమో! భేరీ రావమో!

ఇనుప గోళ్ళతో ఎగిరే విహగం
వాలిన చోటల్లా ఒక గాయం
పీడాకర బాధమయ నిరంకుశం
హృదిలో విసరుతుంది! సంధ్యాశకలం

అనల ప్రవాహంలో ఈదుతూ
ఒడ్డుకు చేరీ సాయం సమయం
వాలే నీడ సహాయంతో రోజు
అడుగులు వేస్తూ పోతుంది మెల్లగా

స్వప్నంలో రవి బింబం కన్నా
మెలకువలో రాత్రి! తోడుగా
వెలుగు రెక్కలు విప్పిన బల్బు నయం
ఆశను అలంకరిస్తుంది!
తెల్లని గులాబి పూవులా.

సూర్యునిదో చంద్రునిదో
కిరణ స్పర్శకు సమంగా
చీకటిలో దీపంలా కవిత
వెలుగు దారి చూపుతుంది.

## 10. ఓటమిని మలచుకొనీ మెట్లుగా

సంచార శీలం నుండి స్థిర వాసం
సేకరణం నుండి వస్తువు ఉత్పాదనం
స్వీయ బలం ధనం సమయ నైపుణితో
భౌగోళిక ప్రాదేశిక బహురీతులతో
నైసర్గ విభేదాల కలనంతో
స్నేహ రణ వికాస పురోగమనం!

చుట్టూ సమాజం పెట్టని కోటలా
భద్రతకూ రక్షణకూ నిలయమై
వ్యక్తికి తన బాధ్యతను గుర్తుకు తెస్తూ
బ్రతుక్కి సాధనలో నవ లక్ష్యం సూచిస్తూ

తలపయి హద్దులు లేవు నింగిలో
ఇల పయి హద్దులు చెప్పలేనన్ని

ఎప్పటికీ ఘర్షణ భరించలేదు సమాజం
ఎప్పటికీ కలహం సహించలేదు జీవితం

ఎద తలుపులు తెరచుకొనీ
శాంతికి దారులు దొరకేను

అడుగు కింద మెట్లుగా
మలచు కొనీ ఓటమిని
మనిషి చరిత్రలో దశ దశలో
మరో విజయానికి అభియానం

## 11. మట్టి అంటక పోవడంతో

నింగి మొదలు చివర చూడక పోయినా
పక్షి ఎగురు తుంది నిర్భయంగా

జలది లోతు తనకు తెలియక పోయినా
చేప బ్రతుకుతుంది ఉల్లాసంగా

బ్రతుకు సాగే కొద్దీ తన గమనంలో
గతం వెనక్కి జరుగుతూ పోతుంది

మనిషిలో పలు శక్తులతో ప్రభుత
నేలమా నింగినీ ఆక్రమించే కోరికతో
గడియారం పయి చేతులతో
కావలసిన విధంగా అనుకూలంగా
ముళ్ళను కదలించాలనీ మనిషిలో
చకితంగా ఆలోచనకు ఆకారం
ఆయుధం మొనలా తేలేను

భయంతో కుంచించుకొనీ
అనుమానంతో బంధింపబడీ
మనసు తిరుగుతుందీ! కోరిక చుట్టూ
బటన్ నొక్కితే రోబోట్

మానుషాన్ని జ్ఞాపకం చేస్తుంది
స్వాగత వచనంతో పలకరిస్తుంది
చేతులు చాచి ముందుకు నడుస్తుంది

మనిషి చేసిన బొమ్మ అయినా
మట్టి కణం అంటక పోవడంతో!
మనిషి కన్న నయ మనిపిస్తూ

## 12. చీకటి పొంచీ

సరిపడ వెలుగు లేని సమయంలో
సంధ్యా ద్వారం వద్ద చీకటి పొంచీ

గాయంతో వాలిపోతూ పక్కకు
నేలకు దిగిపోయే పక్షిలా!
సాయం సధ్య!

శ్రమ జీవనం
పాటలా సాగదు
ఆటలా గడవదు

పాటలూ ఆటలూ
విరామ సంకేతాలో! ఉత్తేజ రూపాలో!
శాంతి కోరే మనసుకూ
బాధా తప్త హృదికీ అవసరం

వరస తప్పిన అంకెల్లా
దారం తెగి జారి పడే
చిందర వందరగా క్షణాలు
చెరరేగిన ఉద్యమ గతిలో.
వెన్నెల వచ్చినా రాక పోయినా
రాత్రి వేళ వెన్నెలపై ప్రేమ సహజం

వీధి దీపం వెలగక పోవడం
దీప స్తంభం దోషం కాదు
దారిన పోయే మనిషిదీ కాదు
బాధ్యత మరచిన సాటి మనిషిదీ!

మనసుకు మిత్రమయిన చంద్రునిలో
మచ్చ ఉన్న రూపం గురించి
ఎవరి ఊహ వారిది అయినా
చంద్ర బింబం చూడని రాత్రి కూడా ఉంది.

పగటి బింబం ఎరగని
చీకటి బ్రతుకూ ఉంది

సరిపడ వెలుగు ఉన్న సమయంలోనూ
జీవిత ద్వారం వెనక చీకటి! పొంచీ!

# 13. స్మృతిలో ప్రవాహం

ఎవరి ఇష్టమూ శాసనం ముద్రలతో
సృజన  కళా రూపం అవతరించదు

చేతి కందీ అందని
పాద రసం గుళికల్లా
పద పదం విడిపోతూ కలుస్తూ
భావనలో, అక్షర శక్తిమయం కవిత!
కొత్తగా నడిపే కారు
స్టీరింగ్ పయి తడబాటులా
అనుభవంలో కొత్త కవిత!
క్రమంగా "జీర్ణమంగే సుభాషిత" మవుతుంది

విహగంలా ఎగిరి పైకి
ప్రాకారాటంకాలు దాటి
మనసు సంచరిస్తుంది
దృశ్యం నుండి దృశ్యానికి

భావనలో పచ్చదనంతో
సుమిస్తుంది సృజన చేతన!
కన్నులలో కరుణ జలంలో
కవి హృదయం ప్లవిస్తుంది
శ్రమ జీవన చేతనతో
మానవతా వాస్తవ పవనం
సుమ పరిమళ భావనతో
విశ్వ బంధు సంకేతం
కడలిలో అలల మధ్య రవి బింబంలా
కవితలో మాటలలో కవి రూపం!
జల బిందువులా క్షరమై అక్షరం
భావ ప్రవాహం మిగులుతుంది స్మృతిలో

# 14. మారిన తేదీలో

జీవితం ముందుగా వ్రాసిన గ్రంథం కాదు
పుటలు తెరచి కాలం గడపేందుకు

ఏ రోజున వర్తమాన ప్రవాహం
మరునాటికి హిమ సమూహ పంక్తిలో

జ్ఞాపకాల రశ్మిలో హిమ శిలలు
తళతళగా స్రవిస్తాయి ! అనుభవమయమై
చుట్టూ ఉన్న సమాజం తనదే
ఒకటొకటీ కాదనుకుంటూ పోతే
ఏదీ తనది కాకుండా పోతుంది!
అస్తితకు చేకూరదు పరిపూర్ణత
సమాజ విజయంలో భాగం కాదు
భౌతిక మానసికాలకు సమాజమే మూలం

ఏ రోజూ సరికొత్తగా వస్తుంది
గడచిన రోజుల అనుభవ బంధంతో

పొద్దు పొడిచి నప్పటి నుండీ
రాత్రి ముగిసిపోయే దాకా
చేరిన ధూళి ఎగిరి పోతుంది
పట్టిన బూజు తొలగిపోతుంది

నిన్న బరువుగా ముగిసీ
నేడు తేలికగా మొదలవుతుంది.

రోజు వస్తుంది
మారిన తేదీతో శుచిగా
విశాల మయిన వెలుగు దర్పణంలో
అగాధ మయిన సమాజ లహరులతో

# 15. విపణిలో మనిషి

నిర్వచనానికి ఉదాహరణలా
జీవితం సాగదు
సమాజం నడవదు

ఒక సందర్భంలో పరివర్తన ప్రయోగం
ఎటు దారి తీసేదీ తెలియదు
ఎటు మలుపు తిరిగేదీ తెలియదు
ఏ జీవితమూ మును ముందుగా
పంచాంగంలా ప్రపంచితం కాదు
పవన వాహనం పయి మేఘాల్లా
మనో విమాన యానంలో బ్రతుకులు
ఏ వైపు సంచరించినా,
భూమి పయి దృశా ధార తోనే!

సమాజ చింతనలో
దిశలు ఒదిగి, పోవాలనీ!

దారిద్ర్యం అజ్ఞానం ఇరువైపుల నుండీ
సమాజ బింబాన్ని వదలని గ్రహణాల్లా

నిరంకుశ తాపంలో
బీటలు వారిన బ్రతుకులో
ఆశలు! జారేను లోయలో
ఊహలు! పేపర్ పడవ లయ్యేను.

దూకే పులి సాహసంతో
ఎగిరే హరిణం ఒడుపుతో
సాగే విహగం చూపుతో
సమాజంలో విజయ భావ రూపం
విపణిలో వస్తువు కావడం
మనిషి విలువకు రమారమి సమాధియే

## 16. తానొక బొమ్మగా

పురి విప్పిన కోర్కెలతో
గాలికి ఆకులా శరీరం కదలుతూ

కల్లోల సమాజ తీరంలో
ఉల్లోల విలాస రీతులతో
అద్దాల నిలయంలో జీవితం!
స్వేచ్ఛకు అందమయిన ప్రతిబింబం!
ఊయెలపై ఊగుతుంది మనసు
ఊహలలో హరిణం పరుగుల తీస్తుంది.

నడచే నేలను కాదనీ
వాస్తవ దృశ్యం మరచీ
దోసిలి నీళ్ళలో చంద్రుని
వెన్నెల అందం పొందాలనీ!
దుస్తులు నలగ కుండా
అమరిన తల చెదరకుండా
అద్దిన రంగు ముఖం మాయకుండా
చెమట చుక్క జారకుండా

గాలి వాటు బ్రతుకుతో
లోకం మరచిన 'పబ్' లో
స్వేచ్ఛలో కృత్రిమ రూపం!
ఊహలో వికృత బింబం!
బొమ్మలు ఆడిస్తూ ప్రేక్షకుల్లో
తానొక బొమ్మగా మారేను!

# 17. ఎప్పటికీ అవసరం

చివురు ముఖం కోసం
ఎదురు చూచే మోడు బ్రతుకు పయి
సఫల మయ్యే ఆలోచన అవసరం
అయితే ఏ చెట్టు కొమ్మ
వేటుకు గురి కాకూడదు.
కరుణ జలం కోసం
ఎదురు చూచే ఎడారి బ్రతుకు పయి
సఫల మయ్యే సానుభూతి అవసరం
అయితే ఏ భూభాగం
మరపున బడి పోకూడదు
అద్దం పయి రాయి విసరి
ఏ ముఖ రూపం మార్చగలరు?
చరిత్ర పయి అగ్ని చిమ్మి
ఏ నిజ విషయం మాపగలరు?

పెదవుల పయి నుండి
పద పదంలో అర్థం
పూవులా తాకవచ్చు
నిప్పులా కాల్చ వచ్చు
చీకటిలో తిప్ప వచ్చు
కొత్త వెలుగు చూపవచ్చు

చరిత్రతో నడచే సమాజంలో
అవసరాల చక్రార పంక్తిలో
మనిషి నుండి మనిషి దాకా
అర్థ మవని ప్రపంచమెంతో ఇప్పటికే
అందుకే ! కవిత్వ మవసరం! ఎప్పటికీ!

## 18. సామాజిక అవసరం

అగ్ని గుండంలో నిప్పుల పయి
నడక! విశేషమైన ఉత్సవ సందర్భంలోనే

బ్రతుకులో అగ్ని గుండం
నివురు క్రమ్మి ఎప్పటికీ

కవితలో అవసరానికి శబ్దంలా
ఉద్యమానికి అవసరం నిప్పుకణం!

తూణీరంలో బాణాలెన్నో
ప్రయోగంలో ఉండే దొకటే!

ఒక బాణం తరువాత మరొకటి
ఒక పదం తరువాత మరొకటి

ఉద్యమంలో విజృంభించే ప్రశ్న
అహంకారంతో ఆయుధంలా
అగ్ని రూపం ధరిస్తుంది!

మనిషిని మరో మనిషి బాధించి
చలిలో వెచ్చదనం పొందేను

మనిషిని మరో మనిషి ప్రేమించి
శిలపై రసధునిలా బ్రతికేను

మనిషిలో మరో మనిషి శిల్పమై
ఎలోరాను ఎదుట నిలిపేను
బ్రతుకులో మరో బ్రతుకు చిత్రమై
అజంతాను ముందు నిలిపేను

దేనిని తలపించినా
దేనిని మరపించినా
జ్ఞాపకాల పంజరంలో మనిషి పావురం!

మారని జీవిత లక్ష్యం ఒకటే
ఎప్పటికీ! మిగిలే ఉంటుంది
సమాజ సౌభాగ్యం! అందనిదై
రావలసిన హక్కులకై స్వేచ్ఛా పథంలో
ఉద్యమ చరణం ఒక సామాజిక అవసరం

## 19. చివురు కోసం ఎదురు చూస్తూ

ఆకులేని చెట్టు క్రింద మనిషి
ఎండిన కొమ్మలు లెక్కపెడుతూ

దారిన పోయే మనుషులు! చూస్తూ పోయేరు
ఎవరో ఒకరు పలకరించేరు!
ఆ చెట్టుతో సరిపోయే స్థితిలో
అతడింకా బ్రతకడానికి కారణం?

చావడానికి కెన్ని ఉపాయాలున్నా
కారణం మాత్రం వదలుకోదలచుకోలేదు!

ఆ చెట్టు పై చివురు చూడాలనీ
అది చూచాకే! దూరం కావాలనీ

కాలి బాటలో దిగిన ముల్లు
తోడు కోసం చూస్తున్నట్లుంది!

తన పేరుతో పిలుపు! ఇప్పటికీ
"గిగీ" లతో "గాగా" లతో వినిపిస్తూనే ఉంది

స్వేచ్ఛాయుగంలో మార్పులెన్నో!
ఏ మార్పు అతని దాకా రాలేదు!

ఆకు లేని చెట్టు క్రింద మనిషి
చివురు కోసం ఎదురు చూస్తూ!

## 20. మనిషి మనిషితో సమాజంలో

ఎడారి మింగేయ కుండా
ఉండాలని కోరిక
సరించే నదిలో

రాళ్ళ మధ్య నుండి అయినా
ముఖ మెత్తాలని కోరిక!
లోపల అణగిన విత్తులో

మనిషిలో కోరిక లెన్నో!
ఒకటొకటీ విప్పిన మూట నుండి
బయటపడి చుక్కల్లో చేరేను
అనుమానంతో! భయంతో ! మనిషీ
కారు ఇంజన్ క్రింద డాలి!
కారు టయర్ నానుకొని పిల్లి!
వెచ్చగా నిద్రలో నిర్భయంగా
ఏ అపాయ భయం లేకుండా

సంకెల వదలిన చేతులు
ఇనుప గుదియ లవుతున్నాయి

మృత్యు ముద్ర వేసేందుకు
విషమ లిప్త సిద్ధంగా ఉంది

వ్యక్తి శక్తిని వీడేందుకు
సమాజం సిద్ధంగా ఉండదు
మనిషి సమస్య తీరేది మనిషి తోనే
మనిషి బ్రతుకు సాగేది సమాజంలోనే!

## 21. రోజు బ్రతుకులో భాగమై

మనీషతో తీర్చబడే మనుషుల లొకరొకరూ
దారి తప్పి అడవి దారి పట్టినట్లుంది

కాలం వణకుతూంది
పెనుగాలికి ఆకులా

ఆకు రాలేది శిశిరంలో అయినా
ఇపుడు ఎపుడు బడితే అపుడే రాలుతుంది.

అలసిన శరీరాన్ని మరచేందుకు
తీసుకున్న మత్తులో శాశ్వతంగా
స్వార్థానికి బలియైన సామాన్యుల
కళ్ళు మూతలు పడుతున్నాయి

చదివేసిన పత్రికలో వార్తలా
“శాంతి” వచనం మాయమై పోతూంది
కళ్ళ ముందు దారిద్ర్యం అజ్ఞానం
ఎడారిలో చీకటిలా ఇరు వైపుల!
బ్రతుకులో దారులు మూతబడేను
మనిషిని ఎంతకయినా తెగింపజేసేను!

మౌన శిలల వలె పాలకులు
స్వీయ చింతనలో నాయకులు
రంగుల మరకలతో మానవత
గుర్తు పట్ట రాకుండా ఉంది

అన్ని రంగులూ తెలుపును కప్పేస్తున్నాయి
అన్ని హంగులూ నిజాన్ని దాచేస్తున్నాయి

ప్రశ్నల సంఖ్య పెరిగి పెరిగి చిక్కుగా
ఉక్కిరి బిక్కిరి చేసేను ఉచ్చులా
తప్పని వయిపోతూ ఉద్యమాలు
రోజు బ్రతుకులో భాగమవుతున్నాయి.

# 22. బాధ్యత అందరిదీ

పండుగ ఉత్సాహం ముందు
చలి వెనుకంజ వేస్తుంది

ముంగిలిలో ఉదయాశయ తేజంతో
మెరుస్తుంది అలంకార సౌభాగ్యం

నిరాటంక స్వేచ్ఛలో మనో రూపం
ఉత్సవ కళ పొందుతూంది ఆనందంతో

దూరం నుండి పండుగ పాట
స్రవంతిలా మనసును దూరం తరలిస్తుంది

గదిలో టెలివిజన్ స్క్రీన్‌పై
పండుగ ప్రత్యేక చిత్రం
నగరంలో ఇంటి ముందు
దృశ్యం లేని లోటు తీరుస్తుంది.
వాకిలిలో రంగుల రంగవల్లి రచన
వివిధ భావ సహజీవన సుందరమై

ఇంటికి దయ చేసే వ్యక్తి
ముగ్గులపై అడుగులు పడకుండా
అంగలు వేస్తూ లోనికి కదలేను
పరివర్తన కిరణ రాగ హృదయంతో

కొత్త దనంతో జన దృశ్యం
కొత్త దనం కోరే మదితో

ఎదలో పూసిన తోట నుండి
పెదవులపై మాటల పూలు!

ఈ సమయం బంధం తెంచే
సాహస తంత్రం లేదెవరిలో!

ఈ రోజున మానవ చిత్రం
గీసే బాధ్యత అందరిదీ

## 23. వైస్ వెర్సా

దశ దశలో ప్రకృతి రూప పరిణామం
ప్రకృతి నుండి వికృతితో సృజన ప్రపంచం
పరివర్తన ప్రేరణయై
లక్ష్యానికి సాధనమై
జీవ శక్తి సమాజంలో
పురోగమన ప్రయాణంలో

ఏ బ్రతుకూ గడవదు వలయంలో
వలయాలను ఛేదిస్తూ పోవడమే పని!
ఆకలితో కోరికతో జీవిత వాస్తవం
సమాజ విశాల రూపానికి
అనుకోని ముఖాల్ని ఇస్తుంది.
వికృతమయిన మాస్కులతో

సాలీడు దారంలా చిత్ర చిత్రంగా
సాగే జీవిత పటంలో
తిరిగే మనిషి!
బయటపడే వీలు లేదు!

మనిషిలో, కోట! శిథిలాకృతిలో
చరిత్రలో మనిషి! పై కెత్తిన ముఖంతో
గోడల పయి నుండి చూస్తూ సమస్తం,

నేడు వెనక నున్న నిన్న
అభయంగా! చల్లని ఆశ్రయంగా

నిద్ర నుండి మేల్కొన్న ఆయుధం
ఒకరిని ముందుకు నడిపిస్తూంది
ఒకరిని వెనక్కు తరలిస్తూంది

రణ ప్రమేయంతోనైనా
రణ ప్రవేశంతోనైనా
ఆయుధ భాష తెలుస్తుంది! బాగా
వికృత జగం కనిపిస్తుంది! బాగా

చుర చుర చూచే చూపు
కాల్చే ఇనుప తీగెలా సాగుతుంది.

భగభగ సాగే చూపు
క్రమ్మే దవానంలా తిరుగుతుంది

ముందుకు దూకే చూపు
చుర కత్తిలా దిగుతూంది
తొలి కిరణ పంక్తులతో
అక్షరాల శ్రేణులపయి
మంటల్ని మీటుతూ!
దయ చేస్తూంది! వార్తా పత్రిక!

గంగను బంధించే భీష్ముని బాణాల్లా
గురి చెదరని విజయుని బాణాల్లా

ప్రకృతి నుండి వికృతికి
వికృతినుండి ప్రకృతికి

ప్రకృతి నుండి వికృతికీ
వికృతినుండి ప్రకృతికీ
బ్రతుకు సాగవలసిందే
మనిషి బ్రతక వలసిందే!

జీవిత సూత్రానికి లిప్తల పూలతో
కాలం మెడలో దండలా! వర్తమానం!
ఈ రోజు ఉగాది!
ఎవరూ తప్పించుకోలేని ప్రకృతి రూపం!

ప్రకృతి నుండి వికృతికీ
వికృతినుండి ప్రకృతికీ
వైస్ వెర్సా!

## 24. రోజు వస్తుంది / పోతుంది

రోజు వస్తుంది శుచి స్మితంగా
గత స్మృతులు దాగిన నీడలతో

చీకటి హెచ్చరికలూ
చుక్కల సూచనలా
వదలీ కాలం ప్రవహిస్తుంది
తేలే కఠోర వాస్తవాలతో

సూర్యుని కిరీటంతో
చంద్రుని హృదయంతో
కాలాన్ని జయించాలని మనిషీ!

ప్రతి పండగ రోజు స్వచ్ఛంగా
మనసు తెరచి నిజం చాటాలనీ
వికృతి నుండి ప్రకృతికి చేరాలనీ

ధర్మ పీఠం కాలు విరిగి
కూర్చున్న తీర్పరి ఊగేను అటూ ఇటూ

నిజానికి డూప్లికేట్ ఉండదు
ఇజానికి అడ్డదారులుండవు.

భూమి పై వాహనం
నింగిలో విమానం
రూపాంతరాల ప్రయాణ దృశ్యం!

వివిధ దశల గతులతో నిరంతరం
వైరుధ్య సమాజం! వైవిధ్యంతో
ప్రకృతి నుండి వికృతికి యానం.

గడియారం ముళ్ళు వెనక్కి తిరగవు
పగలు సూర్యుడు వెనక్కి నడవడు,
రోజు గడచి పోతుంది తాప ముద్రతో
వర్తమాన స్మృతులు వదలి నీడలలో

## 25. స్వేచ్ఛగా స్వచ్ఛంగా

గాలి వీస్తూంది
ప్రాణాన్ని నిలుపుతూ
ఆకుల్నీ అలల్నీ కదలిస్తూ
ఎండనూ మంచునూ మోసుకొనీ

గాలి కదలు తూంది
మతికి పదును పెడుతూ ఆలోచనలో
అనుభూతికి సూక్ష్మత నిస్తూ అనుభవంలో
అలసటలో వింజామరమై వీస్తూ

గాలి వీస్తూంది
ఉత్సాహానికి అశ్వాకృతి నిస్తూ
ఉద్వేగానికి మిసైల్ గతి నిస్తూ
మనిషికి తన గమ్యం తెలుపుతూ

గాలి కదలుతుంది
శాంతి శబ్ద పునశ్చరణ ధ్వనిలో
సరించే రణ నాదాన్ని సహిస్తుంది.
నిశ్శబ్ద కాన్వాస్ పయి శబ్ద చిత్ర సమూహంతో
ప్రకృతికి ఆర్కెస్ట్రా దృశ్యాన్నిస్తూంది

రాజ్య హింస, రణ హింస!
వ్యక్తి హింస, సమాజ హింస

వాదాల వివాదాల ఉద్యమాల హింస!
మనిషిని బొమ్మలా! చూపిస్తూంది

రోజంతా మనుషుల
మాటల గీతలతో
చేతల బొమ్మలతో

గాలి లేంది, ధ్వని చిత్రం లేదు
ప్రాణం లేదు, జీవితం లేదు.

రోజు నిష్క్రమిస్తుంది బరువుగా
ధూళితో కనిపించని దర్పణం

రోజు ప్రవేశిస్తుంది వెలుగుతో
శుభ్రమై తళతళలాడే దర్పణం.

మేల్కొల్పే గాలితో స్వేచ్ఛగా
రోజు వస్తుంది! స్వచ్ఛంగా

❀❀❀

స్వేచ్ఛా కవిత్వం

రెండవ భాగం - 20

# ఉద్యమ చరణం

మాదిరాజు రంగారావు

2010

రసధుని సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 500 028

*Presented*

***to my daughter***

***Mrs. HARITHA*** *M.A., Lit.*

***Detroit, M.I. U.S.A.***

***with***

***affection***

# ముందు మాట

స్వేచ్ఛా కవిత్వం సామ్యవాద భావనతో ప్రజాస్వామ్య దార్శనికత కలిగింది. పరంపరగా వస్తున్న ఈ కవిత్వంలో ఈ కావ్యం "ఉద్యమ చరణం"లో వస్తువు సామాజికం.

ఎప్పటి నుండో చరిత్రలో కనిపించే "ఉద్యమం" ప్రజాస్వామ్యంలో మరింత వైశాల్యాన్ని వైవిధ్యాన్ని పొందింది. దీని అవసరం ప్రయోజనం గురించి వేరే చెప్పనక్కర లేదు. దీని అవకాశం పరిమితం. కాలమూ ప్రయోజనమూ పరిమితుల్లో చాల ఉద్యమాలు కనిపిస్తాయి. సమాజంలో నెలకొన్న తత్కాల సమస్యలూ పరిస్థితులూ ఉద్యమాలకు దారి తీస్తాయి. దీనికి మార్పు కోరే సంకల్పం ముఖ్యం. దీని స్వరూపం ఆవశ్యకతను బట్టి ఉద్యమ పరిధులేర్పడుతాయి. దీన్ని నడిపే వ్యక్తుల నైతికత నిబద్ధత కార్యాచరణ విధానాల్ని బట్టి ఉద్యమ దిశ దాని ప్రభావమూ సిద్ధిస్తాయి.

ఈ కృతిలో మానవీయం – మానవ హక్కులనే రెండు రెక్కలపై ఉద్యమ రూపం విమాన యానాన్ని తలపిస్తుంది. ఇది వస్తువులోని విషయ సంవిధానానికి సంబంధించింది. ఉద్యమ చరణం అన్న పేరులో 'చరణ'మన్నమాట పాదం, పంక్తి అర్థాలున్నప్పటికీ ప్రవర్తనం, ఆచరణం, మార్గం, కిరణం అన్న అర్థాలలో భావ ప్రసారాన్ని పొందింది. ఇది వస్తు నిర్వహణంలో విషయ సంవిధానానికి సంబంధించిన సూచన మాత్రమే. ఈ మాత్రం వివరణం ప్రవేశ ద్వారాన్ని చూపడమే.

ఇందులో వర్తమాన స్థితి గతులు వివిధ సందర్భాల్లో జరిగినవీ, జరిగేవీ సామాజికంగా మానసికంగా వివిధ సమీకరణాల (equations) వల్ల అనివార్యాలుగా మానవ సహజాలుగా నిర్వహణ రూపాన్ని పొందాయి. ఇవి సన్నివేశ నిర్మాణాల్ని పొందాయి.

ఇక సృజన భాగంలోని కవిత్వం భావ రూపాలతో ప్రతీకలతో ఆవిష్కృత మయింది. ఈనాడు కన్పిస్తున్న స్థితిగతుల్లో అనేక విధాలయిన ఉద్యమాల సామాజిక రాజకీయ విభేదాల వాదాల ప్రభావాలిందులో చిత్రితమయినాయి. "ఉద్యమమొక ఫలభాగం, ఉద్యమమొక విధి చరణం" ఉద్యమ ప్రపంచం ఒక దేశం, ప్రాంతం, జాతి, సమాజం, సమూహాలకు చెందిన బహుప్రయోజనాల్లో భాగాన్ని అభిలషిస్తుంది. ఇది కర్తవ్యంతో, బాధ్యతతో కూడిన ప్రవర్తనకు సంబంధించిందీ. ఆచరణ శీలాన్ని కోరేదీ.

కావ్యం చివర,
"బాధ్యతలో ప్రజాస్వామ్యం
ఉద్యమాన్ని నిలిపే ఊపిరి
ఏ ప్రార్థననూ కోరదు
ఒక స్వాగత వచనం తప్ప!"

ఉద్యమ స్ఫూర్తికీ దాని నిర్వహణ విధానానికీ అవసరమయిన ప్రజాస్వామ్య దృక్పథం సూచితమయింది.

వీటి వివరణం కన్నా సహృదయుల స్పందనకూ సమాలోచనా దృష్టికీ ప్రాధాన్యమిస్తూ స్వాగతం పలుకుతున్నాను.

**శాంతినగర్**
**హైదరాబాద్ - 28** **మాదిరాజు రంగారావు**

# సూచిక


| | | పుట |
|---|---|---|
| 1. | చేతనలో భవిష్యత్తు | 1 |
| 2. | హై జాక్ | 2 |
| 3. | ఉద్యమ నేపథ్యం | 3 |
| 4. | తప్పటడుగులో | 4 |
| 5. | ప్రజాస్వామ్య చిహ్నం | 6 |
| 6. | తెలుపు ఎరుపు మధ్య | 7 |
| 7. | మెడకో ఉరిత్రాడయి | 8 |
| 8. | అతిథిలా ప్రశ్న | 9 |
| 9. | పొందలేనిది | 11 |
| 10. | నిశ్చయం | 12 |
| 11. | ప్రమాదమో! నిరోధమో! | 13 |
| 12. | బోనులో పులిలా | 15 |
| 13. | చినుకుకయి అడవి | 16 |
| 14. | మంచులో తేజం | 19 |
| 15. | కనీస ధర్మం | 20 |
| 16. | అవసరం | 22 |
| 17. | ఔను మనిషిదీ | 23 |
| 18. | ఔను మనిషిదే | 24 |
| 19. | సమాజంలో జీవితంలో | 26 |
| 20. | పత్రికలో కార్టూన్ | 29 |
| 21. | ప్రశ్నలో జవాబు | 30 |
| 22. | హక్కుల అవకాశం | 31 |
| 23. | స్వేచ్ఛలో సందిగ్ధం | 33 |
| 24. | కిరణాలయి దిగితేనే | 34 |
| 25. | స్వాగత వచనం | 35 |

# 1. చేతనలో భవిష్యత్తు

ఆశయాల సాధనలో
ఉద్యమ పథ చరణంలో
నిరసన ఘర్షణ కరాలు
హింసకు తలుపులు తీస్తాయి.

దుర్గమ ధరిత్రి పయి
నడకలా
దుస్తర జలాల పయి
నావలా

నింగిలో
విమాన యానంలా
అనుమానం వీడీ
అవరోధం దాటీ

మిత్రతలో శత్రుతతో
శత్రుతలో మిత్రతతో
కోరికలో ఆలోచన
లక్ష్యంలో విజయం కయి
ఉద్యమ చరణం.

భయం లేని దొకటే
ఆత్మ రశ్మి, విశ్వాసం.
శిశువు మొదటి నవ్వులో
స్వచ్ఛతతో
ప్రగతిని వెలిగిస్తుంది.

ఓటమి నెరుగని దొకటే
మనో బలం ఉత్సాహం

శిశువు మొదటి నడకలో
చేతనతో
భవిష్యత్తు నందుకుంటుంది.

## ౨. హైజాక్

మనిషి హృదయ స్పందనతో
ఒకటయి ఉద్యమ లయ
బాధిత జన పక్షం పోరాడాలనో
ప్రాంతీయం ప్రత్యేకత నిలపాలనో
ఆలోచన లెన్నో! ఉద్యమాలన్ని!

ఒక సమయం చకితంగా
కళ్ళలో
పరిచయ మెరగని పులి చూపుతో

మాటలో
అలవాటు లేని హరి గర్జనతో
సమస్య ఎదురవుతుంది.

హత్యో! ఆత్మ హత్యో!
అనుమానంలో నినాదాలు
పోస్ట్‌మార్టమ్ కై వివాదాలు

చివరి చూపు కయి వినతి
శాంతి యాత్ర కయి డిమాండ్

ఒకరు దహనంతో
పతాక ఎగరాలనీ
ఒకరు సమాధితో

జ్ఞాపిక నిలపాలనీ
ఒకరు పరిశోధన
కుపకృతి కావాలనీ
కొందరు తమ ఉనికి కయి
ఉద్యమ రథ చక్రమయి
నిరంతరం తిరుగుతూ
వార్తలలో నిలవాలనీ

అసలు నిజం! ఆశయం
కళ్ళ ముందు బంతిలా
ఎగిరి పైకి
అలజడిలో
'హైజాక్' అవుతూంది.

## 3. ఉద్యమ నేపథ్యం

ఒడ్డున నిలిచిన నావకు
జలాల పయి కదలాలని

సముద్ర చలనంలో ఒకటయి
తరగల కలగా మారాలని

జన సమూహ దృశ్యంలో
నవ సమాజ చేతనతో
ఉద్యమ గతి నేపథ్యంలో
జలధి హోరు వినిపిస్తుంది.

ఎంతటి కల్లోలం లోనూ
తేలే ఎగిరే జలచరమో

తరలే పడవో మనిషో
కనిపిస్తే! బహు సంతోషం!

ఎంతటి ఆగ్రహంలోనూ
శవ దృశ్యం కనిపించాలని
ఉండ దెవరికీ

కనిపిస్తే చెప్పరాని వేదన
అది వినగల ధైర్యం
ఒక్క మహా జలధికే ఉంది.

ఆందోళనలో ఆంతర్యం
హృదయానికి తెలుస్తుంది

ఆవేశంలో ఔచిత్యం
హేతువుకు వినిపిస్తుంది

మనిషిలో శక్తి యుక్తి నీతిని
పరీక్షకు నిలుపుతుంది కాలం
తనకేమీ పట్టనట్లుగా
మౌనంగా జరిగి పోతుంది.

## 4. తప్పటడుగులో

బిందువుతో మొదలయి ఉద్యమం
జనమయ బింబంగా మారుతుంది

మరణ భయం బాధ లేదు
విజయ పథం ఊహ తప్ప

ఎంతటి బల సంపద సంస్కృతిలోనూ
స్వర్ణమయం కాదు మనిషి రూపం

మాటలో విభేదాలు
చిచ్చు బుడ్లు పేల్చేను
చేష్టలో విదాహాలు
నిప్పు పూలు రాల్చేను

ఒక మాట బయటికొస్తే
మరో మాట కవకాశం
భాషణానికి దారిగా

ఒక పూవు బయట పడితే
మరో పూవు కవకాశం
పూల మాలకు వీలుగా

ధూళి క్రమ్మిన భౌతికంతో
మలిన మంటిన మానసంతో
గుర్తు పట్టని విధంగా
అసలు రూపం మారుతుంది

జాతి మతం ప్రాంత వర్గ
వైరుధ్యం భూమికలో
స్వార్థ బుద్ధి
సంకెల వేస్తూంది
హ్రస్వ దృష్టి
హద్దులు గీస్తూంది

అనుమానం గోడలు పెంచీ
సందేహం దారులు మూసీ
తప్పటడుగులో దిశ
శిల వలె ఎదురవుతూంది

# 5. ప్రజాస్వామ్య చిహ్నం

సమాజం తలుపులు తెరచి ఉన్నా
చతురతకూ సంపదకూ ప్రవేశం

సమస్యల వనంలో కదలని చెట్టు!
వచ్చే పక్షుల కాశ్రయ మవుతూంది

నిన్న తగిలిన దెబ్బకు పక్షి కూలినా
నేడు వచ్చే పక్షుల రాక మానదు.

ఊరు ముందు
చుక్క నీరు లేని చెరువు
బిక్షువు చేతిలో
చాచిన శూన్య పాత్రలా

ఊరు వీడి
పట్టణ వీధులలో తిరిగి
రాత్రివేళ
స్టేషన్‌లో బెంచి క్రింద
గమ్యం తెలియని బ్రతుకులో
దొరికిన చోటే ఆలయం

నైరంకుశ వాతావరణంలో
జీవన సందర్భం బోగీలో
ఆకలి అజ్ఞానం లగేజితో
పయనంలో సీటు నుండి లాగేసే
తోసేసే విపద లేక పోలేదు.

తలుపు వద్ద గడపడమో
రైలు వదలి పోవడమో
ఇది సమాజ జీవితంలో
సాగడ మొక దౌర్భాగ్యం.

సహనంతో
ఈ ప్రహసనంలో బ్రతకడమా?

కోపంతో
ఒక ఉద్యమంలో చేరడమా?

వ్యక్తి పౌర హక్కులతో బ్రతకడం
మానవీయ ప్రజాస్వామ్య చిహ్నం.

## 6. తెలుపు ఎరుపు మధ్య

చెట్టును చేరేవి పక్షులతో పాటు
చీమ నుండి చెద పురుగుల వరకూ

విపరీతం కాదేదీ
వైవిధ్యం! సృజన భవం

ఉత్సవంలో రణంలో
శంఖ నాదం! ధ్వనిస్తుంది.
బహుళార్థక ప్రయోజనంతో

పూల నుండి మధు బిందు చయంలో
బంభరమూ, కుట్టే ముల్లుతో

విరుద్ధ గుణ శక్తుల సహయోగం
చలన శీల ప్రాణి సహజ చిహ్నం

కళ్ళు మూస్తే దృశ్యం తొలగదు
నోరు మూస్తే సమస్య తీరదు.

సీలు వేసిన మనసు పయి
మూతను తొలగిస్తే
బయట పడే భూతాన్ని
ఎవరు భరించగలరు?

బయటపడని నిజాలతో ఇతిహాసం
ఎప్పటికీ మూత బడే ఉంటుంది

నైతిక హిత దృష్టితో
ప్రజాస్వామ్య చేతనతో
తీరని సమస్యలో
ఉద్యమ తీవ్రతలో
పొంగే అలలు గట్టు దాటితే
ప్రమాద మందరికీ తెలిసిందే

చర్యకు ఇరువైపుల
తెలుపు ఎరుపు రంగులు
వీటిని మ్రింగాలని
నలుపు రంగు మధ్యలో

## 7. మెడకో ఉరిత్రాడై

నిన్న మారణ దృశ్యంతో పట్టణం
నేడు తానేమీ ఎరగని వాలకం

ఉద్యమ చలనంలో హింస రచన
మానవతకు నిప్పంటి నట్లు

మనిషికి మనిషి అంచనా వదలి
కాలం స్మృతులు వదలి పోతుంది.

దేహం వీడే మనిషి బ్రతుకులో
మిగిలే గుర్తు ఒకటే! చేసిన పని.

శిలలో శిల్పం మెచ్చే కళ్ళకు
తనలో జీవన శిల్పం తెలియదు.

అదుపు తప్పిన విషమ ఘడియలో
కళ్ళముందు అస్థి పంజరం
సమాధినో శ్మశానమో తలపించే
క్షణాలతో మనసు నలంకరిస్తూంది.

స్వేచ్ఛలో స్వతంత్ర వాదంతో
విషాదాగ్ని చేష్ట లొకటొకటీ

అమాయక సమూహ శ్రేణుల పయి
ఆశని పాతంలా జారవచ్చు
బాణ ఘాతంలా తాకవచ్చు
నిప్పుల కుంపటిలా మండవచ్చు

చిక్కులలో వ్యవహార హారం
మెడకో ఉరి త్రాడయి పోవచ్చు

## 8. అతిథిలా ప్రశ్న

అతిథిలా దయ చేస్తుంది ప్రశ్న
తృప్తి పరచే జవాబు అవసరం

సమస్య తీరని జవాబుతో
దారి దొరకని క్లిష్ట స్థితిలో
అవసరానికి ప్రమాదంలో
ఆయుధ ముఖం బయటపడుతుంది.

శిశు వదనం చూపలేదు
హిత వచనం పలక లేదు

ఆయుధ మెప్పటికీ జయం కయి
సమాజ మెప్పటికీ శాంతి కయి

మానవుడే విధానొ రణంలో
కల్పనలో వీడని శాంతితో

వర్తమాన పుస్తకం పుటలో
అక్షరాల తలల పయి నుండీ
ఎగిరే హంసలకు బదులు
కదలే ఆయుధ పంక్తులు

అశాంతితో మార్పు కోరే
రక్త హస్త ముద్ర నుండి
సూర్యుడు ప్రభవించడు
కిరణం ప్రసరించదు.

దరిద్రం లేని బ్రతుకుల కయి
ఆయుధం లేని రాజ్యం కయి
భాషణం గవేషణం నిరీక్షణం

ఎప్పటిదో యత్నం
ఎందరిదో స్వప్నం
యుగ యుగాలు గడచీ
ఉద్యమాలు నడచీ.

## 9. పొందలేనిది

పొందలేని దేదో దొరికీ
గదిలో గోడకు నిలిపిన
పంగల మృగ శృంగం
చారల పులి చర్మం.

చూచే కళా హృదయం వెనక
అనన్య మయిన అరణ్యా నేపథ్యం

హరిణ దేహ సుందరత
పులి సాహస క్రమణం
మనిషి మనో వనిలో
ప్రతి జీవిత కథలో

ప్రాణితో ప్రకృతితో అనుబంధం
క్షణంలో మనిషిని మరపిస్తుంది

శివుపు చేతి వేళ్ళు తాకితే
చుక్క లంది నంత సంతోషం.

మనిషి మనిషితో మానవ సంబంధం
సమాజ శక్తిలో భాగం చేస్తుంది

ప్రకృతికి తుపాను భాష తెలుసు
అవనికి వర్షం భాష తెలుసు

సాహసి కాయుధ భాష తెలుసు
త్యాగికి ఉద్యమ భాష తెలుసు

నది నుండి నీరు పాత్రలో
అది నిండ గలిగి నంత వరకే

అరణ్య భూమికలో
మానవ జీవిత వాస్తవం

లౌకిక పర్వంలో
కొత్త సమాకలనంతో
ప్రతి ఉద్యమ చలనం
ఒక చారిత్రక ఘట్టం

## 10. నిశ్చయం

ఇది సంభవ మన్న నిశ్చయం
ఉద్యమ బీజానికి బలం

చేతిలో పాత్రలో గరళం
ఒక ఊపిరి కదలికతో
అమృత లహరి అయ్యేందుకు
త్యాగ మెంత అవసరం

సరి పడని ప్రకృతి వేరు పరుస్తుంది
జ్వలించే అగ్ని దూరంలో ఉంచుతుంది
సరించే భయం దగ్గరికే రానీయదు.

ఎగిరే సీతాకోక చిలక చిక్కి
స్వప్నం పొందిన సంతోషంలో
ఉద్యమ లక్ష్యం అందేనా?

బంగరు నాణాలు తీసి జేబునుండి
చుక్కలు దొరికిన ఆనందంలో
ఉద్యమ భాగం పొందేనా?

స్వర్ణ మనో రూపం
విపణి వీధి చేరి పోయి
ఉద్యమ లాభం కలిగేనా?

కాలం గడచే కొద్దీ
భీషణ భాషణ హేషలతో
రోషానల కటు చర్యలతో
అమూల్య మయిన అనుభవం
పనికి రాని బరువయి
జారి పోయేనా? ప్రస్థానంలో

విషమ పరీక్షా సమయంలో
కేవల జన హిత హృదయంతో
ఉద్యమ రూపం ఫలిస్తుంది
అపుడయినా ఇపుడయినా ఎపుడయినా.

## 11. ప్రమోదమో నిరోధమో

ఉద్యమ గ్రంథం పుటలో
వాక్యానికి అర్థం తెలిసే లోపల
అక్షరాలు రాత్రి చుక్కలవుతాయి.

తన అనుభంలో తెలిసిందీ
అన్వయంలో కుదరక ముందే
ఆలోచన
అడవి దారి పడుతూంది

ఆచరణంలో స్థితి మారుతూంది
గ్రంథంలో పుట వెనక్కి తిరుగుతుంది

కాలి కందని బంతిలా
పరుగిడే క్షణాల్ని
"ఫౌల్ గోల్" చేసే యత్నం

ఈలోగా
ఉద్యమ గ్రంథం పుటలో
అక్షరాలు పగటి చుక్కలవుతాయి

అనుభవమూ ఆదర్శం
మధ్యలో విభజన
అగ్ని రేఖ అయితే
ప్రమాదమో! నిరోధమో!

మనుషుల సంబంధాలలో అసమానత
సమస్య జటిలత కొక భూమిక అవుతూంది.

అంతా ఒకటే నన్నది కల్పనలో నిజమై
మనుషుల గుర్తింపుతో బ్రతుకుల కస్తిత్వం.

అంతరాలు విభేదాలు సమాజ చలనంలో
హేతు సహిత చర్యలతో పరిష్కార మవసరం.

ఆదర్శ గ్రంథం పుట పుటలో
పద పద వాక్యం వాక్యం
భావనలో ఆచరణంలో
వైరుధ్యం! వైరం! ఘర్షణ!

ఘర్షణలో క్షణాలు! నలిగీ
రాత్రి చుక్కల వుతాయి
కథలో వ్యథ రవ్వలు వెడలీ
పగటి చుక్కల వుతాయి!

## 12. బోనులో పులి

చండ మయిన తాపంలో చెట్టు
భూమిలో వేళ్ళతో భద్రంగా

అడవిలో పనుల పయి శ్రామికులు
ఎండకో వానకో చెట్టు క్రింద

ఏ ఋతువును లెక్క చేయని
సాహసి! ఆ చెట్టు కొమ్మపై

మనిషి కదలిక పయి చూపుతో
నలు వైపుల నిఘా బొమ్మలా

కొమ్మలలో కలిసి ఆయుధం
గుర్తించే వీలు లేని దయి!

మనిషి పయి మనిషికి అనుమానం
మనిషి పయి మనిషికి సందేహం

కళ్ళ నుండి చీకటి చినుకులు
చేతులలో ఆయుధ చలనం

విద్వేషంతో
మనసును ఛిన్నం చేసే

విధ్వంసంతో
బ్రతుకును భగ్నం చేసే
ఆలోచనలో ఆయుధం
ఏ ప్రశ్నకు జవాబు కాదు.

బోనులో పులిలా ప్రశ్న!
పులిని వదలే ప్రసక్తి లేదు.

## 13. చినుకు కయి అడవి

అడవి ఎదురు చూస్తుంది
చినుకు క్షణం కయి

గాలి జరుగుతూంది
గంధ స్పర్శ కయి

నిశ్శబ్దం
పొంగి పొరలు తూంది
పాయలుగా మృదు శబ్దంతో

ఉగ్ర వాద చర్యలతో సమాజ రూపం
ముక్కలయిన అద్దంలో ముఖ బింబంలా

అడవి మూల నుండి
మంట లెగసి పడుతూ
పొగల మధ్య బ్రతుకులు
గ్రహణంలో శశి బింబాల్లా

గుంపులుగా ఎగసి ఒక్క ఊపులో
పొగల నుండి బయట పడే పక్షులు

ఈ అనల ముఖంలో
దిన కరుని వెలుగు ఎక్కడుంది?

ఈ పొగల నడకలో
నవ జలద గమన మెక్కడుంది?

అడవి తగల బడదు
అంత తొందరగా, పూర్తిగా

చెట్టు బూది అవదు
అంత సులభంగా, నీడతో

దప్పిక తీరేందుకు నీరు లేదు
మంటల నార్పేందుకు ఎక్కడిదీ?

కాలి బాటలా అనల పంక్తి
మెరపు తీగె ఆలోచనలా
అడవి నడుము చుడుతూంది.

బూది పొరలు వదలుతూంది
మనిషి ముఖంపై కళ్ళలో

ఒకరి వెనక ఒకరు సాయుధులు
అనల శిఖల నార్పేందుకా?
అడవిని కాపాడేందుకా?

రణ బంధం కట్టిన చర్యను
ఎప్పుడు వీడేదీ తెలియదు

రూపు కందని అడవిలో
ఊహ కందని దారిలో

ఆపద నెదుర్కొనే
శిక్షణ ఒకటే చాలదు.

మస్తిష్క నిలయంలో
వెలుగు దివ్వె! అవసరం

ఒక మనిషికి
చాటుగా మరో మనిషి
ఒక దృష్టికి సూటిగా మరో దృష్టి
రేఖా గణితంలో సమస్యలా.

పొదల చాటు నుండో
శిలల మాటు నుండో,
మలుపులలో దారికి
ఇరు వైపుల నుండీ
మారణ సందేశం వినిపిస్తుంది.

వర్తమాన శాల నుండి రోబోట్‌లు
వేటకు సిద్ధమయిన హంగులతో

మానవీయ సందేశం మరచీ
ప్రతీకార వహ్నులతో రగిలీ

అడవి బాటలో కదలే వాహనం
ప్రేలిన భయ శబ్దం! హఠాత్తుగా
మెరపు లేని పిడుగులా.

ధూమ గణం! ధూళి పంక్తి
మారణ చణ గర్జలతో

ఆయుధ ధ్వని! ఆర్త రవం
పవన గతిని తడబడ జేస్తూ

వికలమయి చెదరి పడిన
శరీరాల శకలాలతో
గుర్తు పట్టరాని మనుషులు
దుమ్ము పొరలలో అణగి

తెరచిన డైరి పుటలో
నీలి రంగు అక్షరాల పయి
అద్దిన నెత్తురుతో
మనిషి బొమ్మ నిలువునా
అతికిన ముక్కలతో
బ్రతుకు విలువ కొక లేబుల్ వేసీ

అడవి ఎదురు చూస్తూంది
నేలపయి నెత్తురు
మరకలు కడిగేసే
వర్షా సమయం కోసం

గాలి కదలుతూంది
మండే ప్రాణం నిలిపే
శీతల రస స్పర్శకయి.

## 14. మంచులో తేజం

పల్చని మంచును చీలుస్తూ
ఉదయం జాగింగ్ చేస్తూ
యువ హృదిలో మినీ సూర్యుడు
బంధూకం లా బయట పడాలని

ఎదురుగ వచ్చే మనిషిలో
హత్యకు సిద్ధంగా చీకటి!

వైరంలో మృత్యువు హస్తం
కత్తెరలా క్రాస్ చేయాలని

మనిషిని మనిషి పలకరించేకన్నా
హత మార్చేందుకు
ఎదురవు తూన్నట్లుంది

అపుడే రెక్కలు విప్పిన రోజు
రెక్కలు ముడుచుకొనీ కదలేను

కళ్ళ ముందు చీకటి క్రమ్మి
రాత్రి వేళ అవసర దీపం
ఉదయ సమయ మవసర మవుతూంది.

సమాజ ప్రవాహాన్ని
స్తంభానికి కట్టేసే యోచనతో
మును ముందుగ అలల్ని
అర చేతులతో ఆపే యత్నం

జీవితాన్ని శాసించే
ఉగ్ర చరణ బీభత్సం

## 15. కనీస ధర్మం

సమాజ రంగ స్థలం పయి
జీవితంలో మనిషి పాత్రలు

ఒకటి సజల నయనాల్లో
అరుణ కమల రూపంతో

ఒకటి వాడి చూపులలో
వెలుగు కత్తి చలనంతో

పునర్నవ సుందరంగా మరో పాత్ర
హృదిలో జీవన రసమయమై

పరిమళ పవనానికి తొందర
ఆయుధాల శబ్దం దాటాలనీ

లౌకిక శక్తుల సంఘర్షణలో
సౌభాగ్యం చెదరిన మానవత

లోతు తెలియని
నీటి సుడి అలజడిలో
మాయమయ్యేనా?

దారి తెలియని
గాలి సుడి వేదనలో
నలిగి పోయేనా?

సన్నని పరిదీన రవంతో
అనుమానం పెను భూతమయి
ఎపుడో విడిపోయిన కొడుకు కయి
అడుగులు వేస్తూంది, తల్లి
పురా శక్తి నడచి నట్లు,
భూమి తనువు వణకుతూంది.

సంక్షుబ్ధ సన్నివేశంలో
ఆయుధ భాషణ ఘోషణలో
దుర్బల ప్రజ సమస్య తీర్చే
ఉదార హిత చర్య లవసరం

ఇది పాలన కనీస ధర్మం
సంస్పందన మానవ నైజం.

## 16. అవసరం

ఒకరొకరి జీవితాలలో
భోగ భాగ్య వీచికలు
పూవులా తాకుతూ ప్రియంగా

ఇంకొకరి అనుభవాలలో
కష్ట నష్ట సూచికలు
ముళ్ళలా గుచ్చుతూ బాధగా

పగటి వెలుగు భాగ్యం
అందరిదీ అనీ
స్వేచ్ఛా సమ న్యాయం
అందరికీ, అనీ
తెలియని బ్రతుకులు కుటిలో
సాయం సంధ్యా స్థితిలో
సామ్యవాద ప్రజా స్వామ్యంలోనూ
చిత్రంగా ఎన్ని ఏండ్లు గడచినా.

పగటి వెలుగు విలువ తెలియాలనీ
విశ్వ హృదయ చరితుల సంవేదన
వైరుధ్యాలను మాపే సంరంభంతో

మనిషి నుండి మనిషికి పెరిగే దూరం
మాపుతుంది వ్యవస్థలో ఆచరణం

మనుషుల గురించి మాటల కన్నా
దైవం గురించి మాటలు సులభం
కానీ,
దైవం గురించి మాటల కన్నా
మనుషుల గురించి మాట లవసరం.

భయానికో భేదం తెలియకనో
చీకటిలో స్నేహితు లవుతారు
తెలిసి పోయి భేదం ఉద్యమంలో
వెలుగులో శత్రువు లవుతారు.

ఈహల తృప్తిలో మనీషతో
అశాంతి నుండి ఆనందానికి

కిరణాలను కప్పే మంచులా
మనిషిలో విషాదం కాసేపే

గాలి తోటను పలకరిస్తూ
కంటకాల మధ్య నుండి
కదలుతుంది పరిమళ హృదయంతో.

## 17. బొను మనిషిదీ

బొక్కెన మునగని బావిలోకి
చూస్తే అడుగున జల శూన్యం

తమలో తీరని అవసరాల పట్టికతో
బహు దూరం, పనికయి
ఆశల మబ్బుల పయి

చెట్లు కొండలతో ఒకటయి
ఆకలితో నిండిన బ్రతుకులు

హింసకు వెనకాడని స్వార్థంతో
మృగమో! జంతువో! ఏ బాధకమో!
అనిపించే మానవ రూపం!

అడవిలో దిగుతుంది
ఆక్రమణ అహంతో

లోలోపలి నిప్పులను
ఆవేశం!
బయటికి విసర వచ్చు

లోలోపలి జలాలను
ఔదార్యం
బయటికి చిమ్మ వచ్చు

నీరూ నిప్పూ
ఇరు వైపుల సిద్ధంగా
మంచీ కీడు

నిజ జీవిత సూచికలో
ఎన్నుకొనే స్వేచ్ఛ!
మనిషిదీ! ఔను మనిషిదీ!

## 18. ఔను మనిషిదే

స్వార్థం పొర లొకటొకటీ
ఎన్ని ఒలిచి విసరినా
ఇంకా మిగిలి మనసులో

రాశిగా
తీరం చేరే అలలతో
జలధిలా

ఏ పొర లెరగని బ్రతుకులు
శూన్యంగా
ఏ వస్తువు లేని గుడిసెలు
దైన్యంగా

ఈ దైన్యాన్ని తీసేసే దెవరు?
ఈ శూన్యాన్ని నింపేసే దెవరు?

మాటలా? ఆయుధమా?
శిల్పమా? స్వప్నాలా?

లేదు, మనిషి! మనిషే!
మనిషి క్రియా చరణం.

సేవాశయ పాలనలో
విశ్వ బంధు హృదయంతో
అవును, మనిషి! మనిషే!

మనిషితో మనిషి
మనిషిగా మనిషి!

వ్యక్తినుండి సమాజ మయి
బిందువుతో బింబమయి
మనిషి మనిషే!
ఔను! మనిషే!

ప్రవాసిగా వచ్చి మనిషి
విజేతగా నిలిచి పోవాలనీ

వెనక నున్న చీకటి కన్నా
ముంద రున్న వెలుగు ముఖ్యం

రాగంతో మొలక చూపి క్షణం
త్యాగంతో పూలు పంచుతుంది

ఏ మనసూ ఊరిక ఉండదు
వినిపిస్తూ పోతుంది స్వరం!
మోదంలో ఖేదంలో వాదంలో
ఉద్యమ మొక సద్యోవాద్యం!

మౌనం ఇష్టం ఉండదు
పలకడమే తన కర్తవ్యంగా,
జ్వాలాముఖి పగిలీ
కదలే లావా బిందువుతో
భూమి గుండె వణకీ
తరలే కంపన శబ్దంతో

## 19. సమాజంలో జీవితంతో

ఉద్యమ మొక లక్ష్యంతో
అది నెరవేరే దాకా సాగే
అభిమత దీక్షాయానం

ఒంటరిగా ఎక్కడో ఉన్న చుక్కలు
ప్రజలో ఒకటయి పోవాలనీ
తమ తళుకులు ప్రసరించాలనీ

అమాయకంగా పడి ఉన్న శిలలు
సజీవ శిల్ప భాగ్యం పొందాలనీ

చీకటి కుటిలో ముఖాలు
బయటి వెలుగు చూడాలనీ
స్వేచ్ఛా సమాజ చలనంలో
ఒక భాగమయి కదలాలనీ!

పద పదాన అవని తలం మనిషికి
పరిమళ పవనంతో ఎదురు కాదు.

మనుషుల అవసరాల కోర్కెలతో
బహువిధ రూపాల్లో సమాజాలు.

ఒక సమయం
దయకు దూరం కావచ్చు
ఒక స్థితిలో
కసికి దగ్గర కావచ్చు

ఎపుడో పడిన అగ్ని బీజం
మొలిచి విలయ శక్తి చూపుతుంది

మౌనంగా ఉన్న నిశ్శబ్దం పగిలి
మారణ క్షణ తాండవం చూపుతుంది.

అవరోధంగా ఎంచే ఒకరిని
తొలగించే పనిలో ఇంకొకరు!

రాజ్యం మరచిన ప్రాంతంలో
ఉద్యమ పంక్తులు! రుద్రంగా

ఇటు వైపో
అటు వైపో
ఆపదలో చిక్కుకునీ దారిలో
నెత్తురులో శరీరాలు! ముక్కలై

ఇవి ఏ జంతువులవీ కావు
ఇవి ఏ మృగాలవో! కావు
వివేక గుణంలోని మనిషివీ
దుర్లభ జన్మలోని మనిషివీ

మానవ సంస్కృతి పరిణామంలో
జయ స్తంభం పేల్చబడీ
స్తంభం పయి ఉన్న హంసలు!
బెదరీ గాయపడీ మాయమై!
మనిషిలో చలాకి తనంతో
వికార పార్శ్వం చూపించేను.

క్రూర పథంలో
జడమై ఉద్యమం,
మిగిలేను మోడులాగో,
మైలు రాయిలానో
సైన్‌బోర్డు లానో
కొండ గుర్తులానో
జ్ఞాపక సూచికగానో
గతాని కలంకారం గానో!

అనుభవంలో వర్తమానం
ఆశయంలో భవిష్యత్తు,
గతం జీర్ణమయిపోయి మనిషిలో
జీవ శక్తిలో ఒకటవుతుంది

గిరి శిఖరం నుండి
ఎత్తును కొలుస్తూ
క్రిందికి దిగిన ప్రవాహం
నేలను కొలుస్తూ పోతుంది.

జలనిధిలో కలుస్తుంది
స్మృతి చిత్రం మిగులుతుంది
సమాజంలో జీవితంతో
మనిషి అస్తిత! నిలుస్తుంది.

## 20. పత్రికలో కార్టూన్

సమాజ సమస్య లెన్నో
ఉద్యమ రూపాలన్నీ
కోర్కెల పరిమితిలో ఉద్యమం
ఫల రూపం! సమష్టి బలంతో

దీని కొక రంగు ఉంది
దీని కొక గంధముంది

ఆకట్టుకునే గళ నినాద ముంది
ఆకర్షించే భావ రూప ముంది

స్వర్గాన్ని మోసుకొనీ మొదట్లో
తూపాన్‌ను భరిస్తూ మధ్యలో
అన్నిటికీ సిద్ధంగా ఉన్న మనసు
సుడి గుండంలో చిక్కుకొనీ పోవచ్చు

ఆచరణంలో విలువలు తరిగీ
సమస్య జలనిధిలో ఉద్యమం
మునగ వచ్చు! తేలవచ్చు
తీర భూమి! మారవచ్చు

ఉద్యమ పరిచయ వేదిక పయి
స్నేహం, పూల గుత్తి కావచ్చు

ఉద్యమ విరోధ భూమికలో
వైరం, ఖడ్గ ధార కావచ్చు

సంకల్ప బీజం నుండి
ఆకార వృక్షం
కొమ్మపై గొడ్డలితో చేతులు!
తల లేని ఆకారం
ఉదయం పత్రికలో కార్టూన్!

ఈ పనికి తల ఎందుకనో
ఎవరో తీసి వేయ వచ్చు
ఎచటో దాచి ఉంచ వచ్చు.

## 21. ప్రశ్నలో జవాబు

ప్రజాస్వామ్య సమాజంలో
మానవ హక్కుల పరికల్పన
ప్రదర్శనలో వస్తువు కాదు
ప్రచార రథం బ్యానర్ కాదు

అనల శిఖల కదలిక పయి
జల సేచన జలద నిభం

తీరని బాధల ప్రజలకు
వేదనలో హిమ నిలయం

చీకటిలో దాగీ
చీకటి కప్పుకొనీ
చీకటి కలవాటయి
చీకటిలో ఒకటయి,

దీపం ఆర్పేయాలని చేతులు
రెక్కల వలె విసరి విసరి కసిగా

చీకటి తెలియని దెవరికి?
రాత్రిని ప్రేమించని దెవరు?
తాపంతో పగలు అలసి
శమనం కయి తప్పదు నిశి.

తన కవసర మయ్యే దాకా దీపం
ఆపై ఆరడమో! ఆర్పేయడమో!

ఈ సమయం దీపక రాగం
ఏ ముఖ దీపం వెలిగించ గలదు

ఈ స్థితిలో మలహర రాగం
ఏ మతి మలినం తొలగించ గలదు.

## 22. హక్కుల అవకాశం

మానవ హక్కుల అవకాశం
తీరం చేర్చే నావలా

మాటలేని మౌన గళం
శబ్ద తంత్రి మీటుతుంది

దారిలేని విషమ వేళ
వెలుగు తలుపు తెరుస్తుంది

బయటి తలుపు తెరచి
లోకం స్పందన గుర్తిస్తుంది

లోని తలుపు తెరచి
మానవ నైజం చూపిస్తుంది

గాలి సోకని పెట్టెలో
సమాధితో పని లేదు

స్వేచ్ఛ లేని బ్రతుకులో
వికాస శీల మెక్కడుంది?

ఎండకు వేలాడే వేదనలో
భయ ముద్రలతో
ఉద్యమ చరణం,
ప్రాణ హరణ కారణ మవ కూడదు.

తలపై నిప్పుల కుంపటిలా
ప్రమాదసూచి కాకూడదు

సమాజ ప్రగతి చిహ్నంతో
ఉద్యమ విధాన మవసరం

వైరానికి ప్రేరణయై అమితోత్సాహం
అస్థిరతకు అశాంతికీ కారణమయి
సామాన్యుల హృదయాలకు
అనల గుచ్ఛ మవకూడదు.

అవసరాల కోర్కెలతో
విశాల మయి జీవితం,
విశ్వమయం అవుతూంది
బహుముఖీన సమాజం.

ఇది పరిణామంలో భాగం
ఆపరాని వికాస రూపం.

ఉద్యమ మొక వాదమయం
ఉద్యమ మొక కారణజం
ఉద్యమ మొక ఫల భాగం
ఉద్యమ మొక విధి చరణం

## 23. స్వేచ్ఛలో సందిగ్ధం

కాలం ముఖాన గుర్తు వదలి
తెలుపో! ఎరుపో! నలుపో! పసుపో
శాంతి! రణం! ఓటమి! సమరసంతో
ఉద్యమం! కాలంతో వెళ్ళిపోతుంది

ఏ నదికీ! చిన్న దయినా పెద్ద దయినా
ఎడారిలో అదృశ్యం కావాలని ఉండదు

మలుపులతో ఉద్యమ ప్రవాహం
ప్రజల అలల కదలికతో
మృదంగ మయి వినిపించాలనీ

కణ కణంలో కోరిక
మంటలు పూచీ
ఉద్యమాన్ని మెరపించాలనీ

ధూళి లేని భూమి లేదు
బాధ లేని బ్రతుకు లేదు
సమస్య లేని సమాజం లేదు
హేతువు లేని ఉద్యమం లేదు

చుట్టూ గోడలు లేస్తాయనీ
వెనకన కంచెలు వస్తాయనీ

ముందుగ! క్షేత్రానికి తెలియదు
గాలికి ఆటంకం, స్వేచ్ఛలో సందిగ్ధం

## 24. కిరణాలయి దిగితేనే

అద్దంలో బొమ్మల్లా నడచే వాళ్ళను
ఉద్యమంలో పట్టుకోవడం కష్టం
చెరువులో నీడల్లా కదలే వాళ్ళను
ఉద్యమంలో అందుకోవడం కష్టం

చేతిలో రాయితో
ఊహలో అగ్నితో
ఎదురుగా ఉద్యమ కారులు
హనన దహన పాత్రలలో

పై కెత్తిన మారణ మనోముఖం
క్రిందికి దిగడం జరగడం లేదు

రాజకీయ క్రీడలో స్వేచ్ఛ
బంతిలా ఆడబడుతూంది.

మనిషి మీద నమ్మకం చెదరి
వర్తమానం గాయపడీ డీలుపడీ
అదృష్టాన్ని ప్రశ్నకు గురి చేస్తూంది
మానవీయ మదృశ్య మవుతూంది

సూర్యుని తేజస్సును క్రమ్మే
ధూళిలా! భయం!
మనిషిలో! నిజమయ్యేనా?

ఏది నిజం అన్నది
అనుభవంలో తేలే రహస్యం!

మండే సూర్యుని తేజం తోనే
పగలు వెలుగు సాధ్యం! కానీ
అది! పొరలెన్నో దాటి
కిరణాలై దిగితేనే! శ్రేయం.

## 25. స్వాగత వచనం

ఎవరి లిప్త వారికి ప్రియం
ఎవరి పాత్ర వారికి నిజం
ఎవరి విలువ వారిది విపణిలో
ఎవరి నీడ వారికి సన్మిత్రం

నీతి బోధల రికార్డు
పదే పదే వేయ బడుతూంది
చెవులకు అలంకారం గానూ
మనసుకు విరామ పదంగానూ

తెలియని దారుల్ని చూపుతుంది
మూసిన తలుపుల్ని తెరుస్తుంది
ఆ దారిన వెళ్ళే తీరిక ఉంటేగా!
ఆ నిలయం చేరే కోరిక ఉంటేగా!

అపాయమో! ఆపదో!
ప్రమాదమో! ఉన్మాదమో!
చెలరేగే మంటలు! ఆర్పేందుకు
అగ్ని మాపక
జలద బృంద మవసరం.

ఎద బావిలో నీరు ఇంకి
తన చేతిలో చేద మిగిలి
మానసిక దరిద్రంతో
మనిషికి! ఎడారి మిగిలేనా?

బాధ్యతలో ప్రజాస్వామ్యం
ఉద్యమాన్ని నిలిపే ఊపిరి,
ఏ ప్రార్థననూ కోరదు
ఒక స్వాగత వచనం తప్ప!

స్వేచ్ఛా కవిత్వం

రెండవ భాగం - 21

# అల్పంలో ప్రజాస్వామ్యం

మాదిరాజు రంగారావు

**2011**

రసధుని సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 500 028

*Presented*

*to Dr. CHARITHA MAADIRAJU*

*Research Scientist*

*Sandiego, California, USA*

*with*

*affection & blessings*

# పీఠిక

**మానవీయయుగం : ఆల్బంలో ప్రజాస్వామ్యం :**

ఈ కాలంలో ఉన్న వ్యవస్థల్లో సామ్యవాద ప్రజాస్వామ్యం ఉత్తమ మయిందిగా అనేక దేశాల్లో ముఖ్యంగా భారతదేశంలో అంగీకారయోగ్య మవుతూంది. ఆయా దేశాల పరిస్థితుల్ని బట్టి ప్రజాస్వామ్యం మార్పులకూ చేర్పులకూ అవకాశమూ పొందుతూంది. భారతరాజ్యాంగంలో "ప్రజాస్వామ్యం" పదానికి ముందు 'సామ్యవాద' మన్న పదమూ ఆ తరువాత సవరణలో చేర్చబడింది. ఈ దేశ పరిస్థితులకూ భాషా సాంస్కృతిక సామాజిక దృష్టితో దీన్ని అంగీకరించడం జరిగింది. అయితే పరంపరగా వస్తూన్న పూర్వ రాజరిక పద్ధతులూ అలవాట్లు విశ్వాసాలూ బలంగా వుండడం వల్ల కొన్ని సందర్భాల్లో ప్రజాస్వామ్య భావజాలానికి భిన్నంగా కన్పించడం జరుగుతూంది. సంపూర్ణమయిన మార్పుకు ఇంకా సమయం పడుతుంది. ఉన్నవి కొన్ని తొలగించడమూ కొత్తవి కొన్ని చేర్చడమూ జరుగుతుంది. మార్పులు జరుగుతూనే ఉంటాయి. ఇది సుదీర్ఘమయిన ప్రక్రియ.

మనిషిలో అనేకమైన బలహీనతలు కారణంగా స్వార్థం వల్ల ఇది పరిమితులు దాటి ప్రజాస్వామ్య దార్శనికంలోని నైతిక స్వరూపానికి క్షతి కలుగుతూంది. ఇది ఎన్నో అలజడులకూ అశాంతికీ కారణమవుతూంది. ప్రజాస్వామ్య చేతన (స్పిరిట్) ముఖ్యం. కనీసస్థాయిలో పనిచేసే నైతిక వ్యక్తిత్వంతోనే ప్రజాస్వామ్య విజయం సాధ్యం.

ఈ దృష్టితో ఈ కావ్యం 'ఆల్బంలో ప్రజాస్వామ్యం' నిర్దిష్ట మానవీయ భావసూత్రం పయి చారిత్రక సామాజిక రాజకీయ నేపథ్యంలో భావజగత్తు ఆవిష్కృతమయింది.

వర్తమానంలో అనేక స్థితులు సామాజికంగా ఏ విధంగా ప్రచలితమవుతూందీ తాత్త్విక స్పృహతో చిత్రితమయినాయి. ఒక్కమాటలో చెబితే సమాజం ప్రకృతి మనిషీ పరిస్థితులూ ఈ నాల్గింటికి సహయోగంతో కవితాకృతి వివేచన కందుతుంది. ఇది కేవలం మానవీయ భావనా కేంద్రంగా రూపొందడం ఇందులో విశేషం.

అనేకమయిన మార్పులతో ఇపుడు ఏ వాదమయినా ఏ దృష్టిఅయినా అన్నీ స్వతంత్రమయిన వ్యక్తిత్వాలతో వాటి వెలుగు రూపాలు మానవీయం ప్రధానంగానే ఉండడం వల్ల, సాహిత్యంలో ముఖ్యంగా స్వేచ్ఛా కవిత్వ విషయంలో వైవిధ్య విలసితమయిన లక్ష్యానికి అవకాశాన్ని బట్టి సాహిత్యచరిత్రలో ఈ కాలాన్ని "మానవీయయుగం"గా పరిగణించడం సమంజసం.

**– మాదిరాజు రంగారావు**

# సూచిక


| | | పుట |
|---|---|---|
| 1. | ప్రజాస్వామ్య చిహ్నం | 1 |
| 2. | కాలం కదలినట్లు | 2 |
| 3. | అడ్డును దాటాలని | 3 |
| 4. | మారని నిర్ణయం | 5 |
| 5. | గమ్యం నుండి గమ్యానికి | 7 |
| 6. | బిందువులా రాయిలా | 8 |
| 7. | నివారణీయం | 9 |
| 8. | నడచే చరణాలు | 10 |
| 9. | తప్పని లిప్తలపయి | 11 |
| 10. | తెలిసే అవకాశం | 13 |
| 11. | కాలం చక్రమై | 14 |
| 12. | తన స్థానం | 15 |
| 13. | ఎప్పటికీ సిద్ధంగా | 16 |
| 14. | ప్రశ్నకు జవాబుగా | 17 |
| 15. | చూడని చిత్రం | 18 |
| 16. | షోకేస్‌లో | 19 |
| 17. | నవం నవ జీవితం | 20 |
| 18. | చిటికెన వ్రేలందుకొనీ | 21 |
| 19. | స్వేచ్ఛాయానం | 24 |
| 20. | జ్ఞప్తికి తెస్తూ | 26 |
| 21. | ఎవరికి వారే | 27 |
| 22. | ఏండ్లుగా రాసులుగా | 28 |
| 23. | జీవితమంతా | 29 |
| 24. | సమాంతరం | 30 |
| 25. | ఆకూ - చెట్టూ | 31 |

| | | |
|---|---|---|
| 26. | కొత్త సమాజం కయి | 32 |
| 27. | స్మృతి చిహ్నాలు | 34 |
| 28. | సురక్షితం | 36 |
| 29. | అందినట్లుగా | 37 |
| 30. | సన్మాన సన్నివేశం | 38 |
| 31. | బులుపుగా | 39 |
| 32. | మనిషి మనిషిగా | 40 |
| 33. | ప్రశ్నాముఖంతో | 42 |
| 34. | స్వప్నిస్తూ | 43 |
| 35. | వాస్తవ భ్రమణంతో | 44 |
| 36. | గాలిలో! చేతికో! | 45 |
| 37. | పనిచేయని వేషం | 46 |
| 38. | పరిణత చిహ్నం | 47 |
| 39. | ప్రయత్న ఫలం | 48 |
| 40. | అందని మనిషి | 49 |
| 41. | దర్శనరూపం | 50 |
| 42. | బయట పడే దారికయి | 51 |
| 43. | ప్రమాదం అంచులో | 52 |
| 44. | అమూల్యం | 53 |
| 45. | కదలిక | 54 |
| 46. | యానంలో | 56 |
| 47. | పరిపూర్ణత కయి | 57 |
| 48. | ముఖంలో వెలుగుతో | 58 |
| 49. | మంటల్లో ప్రజాస్వామ్యం | 59 |
| 50. | వర్తమాన సన్నివేశం | 60 |
| 51. | స్వేచ్ఛా జగం | 61 |

# 1. ప్రజాస్వామ్య చిహ్నం

ప్రజాస్వామ్య చిహ్నం
ఎక్కడుంది?
సైన్‌బోర్డు పయినా
వ్యక్తి ముఖం లోనా?
రాతలలోనా? మాటలలోనా?
రాజ్యాంగంలోనా?
జన హృదయంలోనా?
సమాజ ప్రగతిలోనా?

అన్నిటిలో అందరిలో ప్రతిఫలిస్తూ
అపుడపుడూ, గ్రహణంలో చిక్కుకొనీ
లోహ పదం కింద నలిగీ
విశ్లదమవుతూంది.
వికార రూపం పొందుతూంది.

రంగులు చల్లితే చిత్రం చూపదు
మాటల మేడతో సమస్య తీరదు.

పూవుల్లా అలల్లా దీపాల్లా
సమూహాలు! దిశ దిశలో జన దృశ్యం!
బ్రతుకు విలువ పెరిగేదీ
సార్థకమయి నిలిచేదీ
ప్రచారంతో కాదు నినాదంతో కాదు
ప్రదర్శనతో కాదు ప్రవాదంతో కాదు

మనసులో మేఘాకృతి కదలితేనే
ప్రేమతో కరుణ జలం జారితేనే

ఊహకు ఆర్ద్రగుణం వచ్చేదీ
 చేతలు పచ్చదనం పొందేదీ
ప్రకృతికి అనుచరణంతో
 మనుషుల బ్రతుకులలో మార్పులు

ప్రజాస్వామ్య చేతన హృదయంతో
 నవ యుగ సమాజ సంస్కృతి చరణం

## 2. కాలం కదలినట్లు

తెరచిన ఆల్బంలో
 ఫోటో ఒకటొకటీ
మౌనంగా కదలే
 లిప్తలు వెలిగిస్తూ

నిశ్శబ్దం పెదవుల పయి
 భావనలో మొగ్గగా
స్పందనలో కదలుతుంది
 శబ్దం పూవుగ విరిసీ

హిమ శకలం కరగీ
 స్మృతు లల లయి కదలీ
మనిషి వెనక కదలుతుంది
 నేటి క్షణం రేపటి కయి
విరి ఊయెల గానో
 ఉరి కంబం గానో

కిందికి దిగి దేవత లెపుడో
 స్థిర పడిన అదృశ్యవాసులు

మనిషి మనోభూమికలను
పాలిస్తూ యుగాలుగా
సమాజ విచలన రీతులు
శాసిస్తూ తరాలుగా

నిశ పయి గెలిచిన
సూర్యుడు ప్రత్యక్షం
మెడలో ధగధగ లాడే
బంగరు పతకంతో.
సగం మునిగి
సగం తేలి
అలల మధ్య జీవితాలు
మొగ్గ రాని వికాసాలు
పైకి నడచి వస్తేనే
పూర్ణ బింబమయితేనే
ప్రజాస్వామ్య విజయానికి
కాలం కదలినట్టు లెక్క.

## 3. అడ్డును దాటాలని

పునర్భవం పునర్నవం చరిత్రలో
మార్పులతో సమాజ పునర్జవంతో
మెట్టు మెట్టు పయి పరీక్షలో
అడుగు ముందు అగ్ని కీల
దాట రాని ముళ్ళ కంచె
సామాన్యం నుండి విశిష్టం దాకా

ఆపద మ్రోగుతుంది సన సన్నగా
మనుగడ కొక సూచన అయి హృదిలో
బాధ్యతల్ని చూపుతుంది సమస్యలో
కర్తవ్యం వెలుగుతుంది మనస్సులో

పొద్దు పొడుపుతో ఎదురుగా
వెలుగులు, చీలిన దారులతో
విరిసిన విశాల పద్మం రేకుల్లా
ప్రతి దిశ కొక అస్తిత్వంతో!

విప్పారిన వెలుగు వెంట చూపులలో
అగాధమయిన అర్ణవ జన సమాజం!
వెలుగులో బయటపడీ
వేరు వేరుగా మనుషులు!

కల్పనలో రూపొందిన బిందువు
రేఖలతో వాస్తవ మయ్యేందుకు
చేతు లెన్ని కలిసి రావాలో?
ఊహ లెన్ని ఒకటి కావాలో?
అవకాశం! శ్రమ రూపం! సంస్కారం! మతి విభవం!
అవకాశం! ధన బల సమయం! కలిసీ

ఒడ్డుకు చేరిన అలలా ఊహకు
అడ్డును దాటాలని ఉత్సాహం
ఏకాంతం! గోడలు లేని కారాగారం
శ్రమ జీవన సమాజ మొక కర్మాగారం.

# 4. మారని నిర్ణయం

ఆదర్శం ఎప్పటికీ మిగిలే స్వప్నం
వాస్తవమూ కల్పన మనో బింబ పార్శ్వాలు
ఆల్బంలో ఫొటోల్లా స్మృతిలో నిలిచీ
అనుభవ సంపదలో సామాజిక దృశ్యాలు
అల్లికలో చిక్కు ముళ్ళు ఎప్పటివో
సమస్య ఎప్పటికీ అనల శేషమయి.

మొన్నటి టిబెట్! శ్రీలంక!
నిన్నటి ఆఫ్ఘన్! కశ్మీర్
నేటి తెలంగాణ! మరొకటీ.
నిరసన నినాద ఘర్షణ క్షణాలతో.

స్వేచ్ఛకు అవకాశమున్న ప్రజాస్వామ్యం
ప్రశ్నకు వేదికగా
చర్చకు నిలయంగా
ఆశకు జీవ శక్తి పెంచుతూంది.

ఆగని ఆందోళన ఆవేశం ఉద్రేకంలో
రాలిన ప్రాణ సుమం తరుశాఖను చేరేనా?
ఆరిన మానవ దీపం మళ్ళీ వెలిగేనా?
చుట్టూ ఊపిరి సలపని పొగలతో
సగం తెరచిన ఇనుప పెట్టెలా రాజ్యం!

కంటికి కనిపించని శృంఖల
మానసికంగా మనిషిని మార్చేను.
ఏ విసరే రాయి గానో,
ఏ ప్రేలే ఆయుధం గానో!

దారులు మూతబడిన సమయం
రహస్య ఎజెండా నిశ్శబ్దంగా
సాహస చర్యకు పురికొల్పుతూంది

గాయాలు పెరగాలని ఎవరూ కోరరు
గాయాలు మానాలని అందరి కోరిక

గాయానికి కరుణ హృదయ మద్ది
శాంతి వనం వికసించాలని ఒకరు
గాయానికి వేడి ఊహ లద్ది
అనల కీర్తి మెరపించాలని ఒకరు

సన్నివేశ సందర్భంలో
అభిప్రాయ వైరుధ్యంతో
ఇరువురూ మనుషులే
మనో దృష్టిలో భేదం!

హేతువుతో వివేక మొకటే
ప్రజాస్వామ్య పథంలో విశిష్టం

గడియారంలో
సూచిక వెనక్కి మరలదు
జన చరిత్రలో
నిర్ణయ వాక్యం మారదు.

# 5. గమ్యం నుండి గమ్యానికి

కాలం ఒక వాహన మయి
తన పయనంలో వశమయి
సంఘటనల అనుభవ ముద్రలు
సంస్కృతులకు తెరచిన కళ్ళయి.

కొత్త యుగం ప్రేరణతో
తరం తరం మనోజగం
మానవీయ విజయ సీమ
చూడాలని కోరికతో
మోదానికి మనసు పడుతూ
బాధల కలవాటు పడుతూ

జలాల మధ్య ద్వీపంలా ఉన్న
మనిషిలో మనీష! తేజో రూపం
మంచు పొరలు ధూళి తెరలు చీల్చుకొనీ
అందని దిశ అంచులు చేరాలనీ

పథమే వైపున దయినా
తీరం చేరక తప్పదు
ఏ తీరు మనిషి అయినా
నావకు బాధ్యత తప్పదు

మలుపు లెన్ని ఎదురయినా
అలల తలలు స్పృశిస్తూ
తీర భూమి పయి గురితో
చూపులు మాత్రం గమ్యం పయినే

ఊరు దాటి మరో ఊరు
మనిషితో మనిషి కలిసి
యుగాల సంస్కృతి గుర్తులతో
వర్తమాన జీవన రూపం
గమ్యం నుండి మరో గమ్యానికి
సమాజ సమూహ దృశ్యం.

## 6. బిందువులా రాయిలా

గతం అంచున వర్తమానం
భవిష్యత్తు చేయి అందుకొనీ
మానుష చేతనతో సమాజం
మారే సన్నివేశ సంధ్యలతో

జాతి మతం ప్రాంతం దేశం
పరిమిత వలయ సమూహాలు
భద్రత కయి భటులూ గోడలు
రక్షణ కయి ఆయుధ శ్రేణులు

మస్తిష్క తలం పయి తాపం
శిఖరాన మబ్బు కదలాలనీ
జల కణం జారాలనీ
పచ్చదనం పొందాలనీ

కన్నుల లోయలలో ఆశ
పగిలిన ఎద సందులలో
జల ధారలు నిండాలనీ
నాదం నినదించాలనీ

ఒంటరి ఎడారిలో కోరిక
హృదయం సృజన మయం కావాలనీ
తనపై ఎండ మావి తొలగాలనీ
ఎదపై ప్రేమ జలం కదలాలనీ

సమాజ వన శరణంలో చివురు
చెట్టయి గగనం చేరాలనీ
పూవు ఫలం నీడను పంచాలనీ
ప్రాణికి శరణంగా బ్రతకాలనీ

వర్తమాన క్షణాలు
జల బిందువులయి సరించవచ్చు
కణ కణంలో ఆర్తిని తీర్చవచ్చు
రాయిలా నిలిచిపోతే
మెట్టులా పనికిరావచ్చు.

## 7. నివారణీయం

ఆశయ విజయానికి
పగటి కలలు తొలగీ
వాస్తవ దృశ్యం కయి
చూపు లెదురు చూస్తాయి

ఒక సమయం ఔజ్వల్యం అవసరం
జన స్వేచ్ఛను కాపాడే వెలుగుతో.

ఎగసే కెరటాల్లా ఉత్సాహంతో
దూసే ఖడ్గాల్లా ఉద్రేకంతో
జలధిని తలపిస్తుంది ఉద్యమం
రాజకీయ సామాజిక సంరంభంలో.

సమస్య ఎదురయి తీవ్రంగా
నిప్పుల పయి నడవాలిసి రావచ్చు
రక్షణలో మంచు కవచ మవసర మవుతుంది.

హద్దు మీరి గట్టు దాటి ఆవేశంలో
తరగల పయి నడవాలిసి రావచ్చు
రాజ నీతి యాన పాత్ర అవసరమవుతుంది.

చుట్టూ వస్తువు లెన్నో
చిన్నవి పెద్దవి తోడుగా
మనిషి అవసరాలకు సిద్ధంగా
జీవిత రూపంలో భాగమయి!

మానవత మసి అవుతున్నా
ఏమీ పట్టనట్లు మౌనంగా
స్పందన ఎరగని శిల్పాల్లా
సంఘం పయి బాధ్యత మోపేరు!

## 8. నడచే చరణాలు

వర్తమాన సమాజం
జీవన నవ వాస్తవం
శరీర మొక సాధనం
రోజూ ఒక ప్రయోగం!

కదలు తూన్న చరిత్రలో
ప్రజాశక్తి సినేరియో
ప్రతి పలుకులో, నడతలో
మేల్కొన్న చేతనతో వ్యక్తిలో

సమస్య ఎంతటి దయినా
పావురానికి పంజరంలా
హింస్రకానికి బోనులా
మనిషికి బంధన కాకూడదు.

ఎప్పటిదో సమస్య మళ్ళీ మళ్ళీ
గళ్ళతో సరికొత్త పజిల్‌లా
ఖడ్గ మతికి పదును పెడుతూంది
అగ్ని మతికి పవన మవుతూంది.

ఆలోచనకు దూరంతో పనిలేదు
అనుభూతికి లోతులతో పనిలేదు.

సమస్య లేకపోతే
ఒకరు బ్రతకలేరు
విమర్శ లేకపోతే
ఒకరు నిలవలేరు
ఈనాడు ప్రజాస్వామ్యానికి
నడచే చరణాలివి రెండూ!

## 9. తప్పని లిప్తలపయి

ప్రజాస్వామ్య సంస్కృతిలో
జన హిత కర భావనతో
దార్శనిక పథంలో ఇరువైపుల
విరుద్ధ ముఖాలెదురెదురుగా

ఉద్యమ చరణంలో ఉగ్రమయిన
అనల కణం వెనక నుండి
శాంతి లహరి ఆగమనం! అవసరం.

కాలీ బొబ్బ లెక్కే కన్నా
    లహరుల పయి తేలే ఆశతో
నిప్పు కన్న ఆ సమయం
    నీరే నయ మనిపిస్తుంది.

నిప్పులా ఉత్తేజం
    ఉపశమనం కయి నీరు
అవసర వాస్తవాలు
    ఉద్యమ సంచరణంలో

దాహంలో పైకి చూస్తే
    కనిపించే శూన్యాకాశంలో
ఎక్కడి నుండో మేఘం
    సమయానికి రావచ్చుననీ

చాచిన దోసిలిలో
    బాష్ప కణం రాల వచ్చు
జల బిందువు జార వచ్చు
    శూన్య ముఖం తోచ వచ్చు.

అన్నిటికీ సిద్ధంగా
    చెదరని మానవ హృదయం
మతిలో ఘన సంకల్పంతో
    తప్పని లిప్తలపై నడుస్తూ

# 10. తెలిసే అవకాశం

కెరటాలతో సముద్రంలా
    పుటలు తిరిగే సమాజాన్ని
సూర్య చంద్ర నక్షత్రాల్లా
    ఎందరో చదివే యత్నం.

వెలుగులలో ఉత్సాహంతో
    వెన్నెలలో సంతోషంతో
చీకటిలో బల్బు ముఖంతో
    అంతరంగ చేతనతో జీవితం.

గిరి శిఖరం నుండి జారే జలపాతం
    కల్పనలో సర్పమవుతుంది.
కల్పనలో భయం లేదు
    భయ నిలయం వాస్తవం!

సున్నం పసుపూ కలిసి
    రంగు మారి ఎరుపయినట్లు
ఊహలూ అనుభవం కలిసి
    తెలియని జీవిత మవుతూంది.

ముందో వెనకో! చీకటిలో దీపంలా
    మనిషిని మనిషే! ధైర్యంగా నడిపించేను.
ఒంటరిలో సులభం, అంతర్ముఖం
    పదుగురిలో తప్పదు, బహిర్ముఖం.
సంఘంలో బ్రతికే మనిషికీ
    తానెవరో! తెలిసే అవకాశం!

# 11. కాలం చక్రమై

మనిషి మనో నిలయంలో
గుప్త భావ రహస్య పేటి
ఏ ప్రభావ మూలంగా
ఎపుడేది బయట పడేనో తెలియదు.

ఎవరి బరువు వారు
మోసేది కొంత వరకే
ఏదో ఒకటి ఎవరో ఒకరు
మోయక తప్పనివీ మిగతావీ.

కొమ్మతో దృఢ బంధంతో
గాలిలో ఊగుతూ పుష్పం
తెలియని సమాజ సత్యాన్ని
సమయ సమయం బోధిస్తుంది.

నేల పయి పరుగెత్తే నది
పట్టరాని జీవితాన్ని తలపిస్తుంది
తనలో ఆగని స్వేచ్ఛతో
తనతో మనసునూ సరింపజేస్తుంది.

భూమి ఎంత ప్రియమయినా
భూమి పయి మనిషి నడచే కాలం
అంతా కలిపి జీవితంలో
బ్రతికే కాలం కన్నా తక్కువ!
అయినా కాలాన్ని ఆవహించాలనీ

ఒక క్షణం తక్కువ కాకుండా
కాలం తన చేతిలో ఎప్పటికీ
చక్రమయి నిలవాలనీ!
ఆయుధం గానో!
అలంకారం గానో!

## 12. తన స్థానం

స్వేచ్ఛ అవసరం మనసుకు
యథేచ్ఛా విహరణం కయి కాదు

గాలికి గోడలతో పని లేదు
మనిషికి గోడల తోనే! నిలయం!

వెలుగుకు పాత్రలతో పని లేదు.
మనిషికి పాత్రల తోనే అస్తిత!

తమ ఉనికిని కాపాడే కోరికతో
ఒకరి స్వేచ్ఛ నొకరు హరించేరు.
లోపల! అనుమానం! భయ భావం
పొరలుగా తెరలుగా రహస్య ప్రపంచం.

చెట్టుకే రహస్యమూ లేదు.
అంతా బయలే! ఏ అడ్డూ లేదు.
తనను చేరే గాలిని శుభ్ర పరచి
తావి అద్ది వీడ్కో లిస్తుంది.

గాలి తలపిస్తుంది
కావలసిన ప్రాణ సూత్రాన్ని

నీరు తలపిస్తుంది
　　అవసరమయిన ఆర్ద్రతను
అగ్ని తలపిస్తుంది
　　వెచ్చని ఉత్సాహ శక్తిని.

వెలుగు అవసరం!
　　కంటికి లోకం కనిపించేందుకు
విశ్వంలో తన స్థానం తెలిసేందుకూ
　　సమాజ దృశ్యంలో మనిషిని గుర్తించేందుకూ.

## 13. ఎప్పటికీ సిద్ధంగా

ప్రకృతి నుండి పొందే
　　నీరు అగ్ని గాలి వెలుగులా
మనిషి నుండి కోరుతుంది సమాజం
　　కరుణ వీర త్యాగ ప్రేమ రూపం.

ఎపుడో ఏదో విపత్తు వస్తుందని
　　జోస్యంలో విశ్వాసం ఊపిరిగా
ఎక్కడో కొండ పయికి తరలేరు
　　బ్రతుకు బరువు మోసుకొనీ.

అలజడి అశాంతి వైరం విషాదం
　　రోజు వారి చర్యల్లో భాగంగా,
శాంతిని మింగేసే విపరీతాలు
　　తుపాను ముద్రలతో సమాజం!

పూవు పూయ లేదనీ
　　కొమ్మను నరికేసేరా?

నీటి చుక్క లేదనీ
    కుండను విసరేసేరా?

సమాధుల పయి నుండి
    శ్మశానం పయి నుండి
వచ్చే గాలి నెవరు నిషేధిస్తారు?
    ఆ వేళ నెవరు మూసేస్తారు.

జోల పాటతో శిశు దశలా
    జీవిత కాలం గడవదు!
ఆర్ద్ర స్వరంతో వచ్చే పవనానికి
    స్వాగత వచనంతో హృదయం
ఎప్పటికీ సిద్ధంగా ఉండ లేదు.
    ఏదీ వ్యర్థంగా భావించలేదు.

## 14. ప్రశ్నకు జవాబుగా

సహ సుందరతను బాధిస్తూ
    సుమ దళ పంక్తిని ఛేదిస్తూ
వచ్చే సుడి గాలిలా
    చతుర వక్ర రాజకీయం.

అణచ బడిన స్వేచ్ఛ
    తుపానుగా బయట పడవచ్చు
నొక్క బడిన గళం
    బయటికి పిడుగులు వదల వచ్చు.

భరింప రాని తాప ఘడియలో
    వసంత స్పర్శ కయి ఆరాటం!

కొందరిలో వసంత నిటలం పయి
గ్రీష్మ చిహ్నం నిలపాలనీ, బులుపు!

ఏది ఎట్లా అయితేనేం? ఉంటేనేం?
హ్లాదమో! సుందరమో! భయదమో!
ఎవరి కిష్ట మయిన పనిలో వారు
ఎవరి నడత వారికి బహుప్రియం.

ప్రజాస్వామ్య సమాజ వనంలో
పరిమళ మయ పుష్పాలకు బదులు
గాట్లూ! గాయాలూ! మచ్చలూ
దూకే ప్రశ్నలకు జవాబులుగా.

## 15. చూడని చిత్రం

పట్టరాని రవి తేజం
నింగి వైపు చూడనీదు
ప్రసన్నమయిన శశి బింబం
మనిషి చూపు లాగుతుంది.

పగలయితే ఒక సుఖం
సుఖంలో బ్రతుకు భయం
నిశి అయితే ఒక భయం
భయంలో విరామ సుఖం
ఎప్పటి కప్పుడు స్వేచ్ఛలో
మితులూ! పరిమితులూ! దారిలో
ఎక్కడి కక్కడ నిలిపేసే
హద్దులు! సరిహద్దులు! ఎదురుగా

అహంకార శిఖలు వెలిగే
    మనో వేది నుండి ఒకరు
వచ్చే విభాత సమయానికి
    మంటల దుస్తులు తొడగాలనీ
ప్రజాస్వామ్యం వెనక నుండి
    చాచిన రోబొట్ కరాలు
విజయ చక్రం తిప్పాలనీ
    పగలును రాత్రిగా మార్చాలనీ
రాత్రిని పగలుగా తీర్చాలనీ
    విద్యున్మయ వివిధ వర్ణ రూపాలతో
చూడని జీవిత చిత్రం చూపించాలనీ.
    పొందని రంగుల దీపం వెలిగించాలనీ.

## 16. షోకేస్‌లో

కాలానికి దూరమయిన మనసు
    ఒక సమయం కాలానికి ఒదిగీ
సృజన విలయ పాత్రల చర్యలతో
    నింపుతుంది సమాజ సన్నివేశం.

కాలానికి అతీత మయిన మనసు
    ఒక సమయం కాలాన్ని స్పృశిస్తుంది
కుసుమించిన సుందర చేతనతో
    స్వయం వికాస దృశ్యం నింపుతుంది.

మనిషిని నడిపించే కాలానికి
    రహస్య మంటూ లేనే లేదు.
కాల మెవరి అధీనంలో ఉండదు
    రవినీ శశినీ శాసించే వీలే లేదు.

విజ్ఞాన ప్రకాశంలోనో
తాత్త్విక ప్రబోధంలోనో
కొన్ని క్షణాలు మాత్రమే!
మనస్సు శిఖరం చేరతాయి.

యుగాలు గడచినా మనిషిలో
మానవీయ ప్రపంచం తెలియని
మతితో కాలాన్ని నిందించేరు,
మనసులో తమ తమ పాత్రలు మరచీ.

ప్రజాస్వామ్య మిప్పటికీ దేశంలో
పిల్లల చేతిలో ఆటబొమ్మలా
పెద్దల చేతికి అందని ద్రాక్షలా
షోకేస్‌లో కళా ప్రదర్శనంలా.

## 17. నవం నవ జీవితం

తెలియని జగత్తులోకి
వెళ్ళే సాహసమొక మనిషిలో
తెలియని మనో వనిలో
అన్వేషణ మొకరొకరిలో

రవి చంద్రుల యాన మానంలో
అందరి పయి ఒకటే కాల ప్రభావం
స్ఫటికం లాంటి మనసుపై
ప్రతిఫలించే వర్ణ చిత్రాలు వేరు
ముఖాన రంగు లెన్ని మారినా
చూచే చూపు వెలుగు! ఒకటే!

ఏ రంగూ రూపానికి కవచం కాదు
ఏదో ఒక ఆభూషణ మయితే కావచ్చు.
మనుషుల దేహాల రంగు వేరయినా
నీడల క్రీనీడల రంగు ఒకటే

పైన వెలుగు బింబం
ఎప్పటిదో ఎంతో పాతది!
లోని వెలుగు బింబం
తన పుట్టుకతో వచ్చిందీ.
బయటి వెలుగు నీడలతో
జీవిత దృశ్యం కొత్తది!

చల్లదనం! పచ్చదనం
కంటికి మనసుకు ప్రియమయినా
పూవు! ఫలం! నీడ! తావి తోనే
నవ జీవిత రూపం సార్థకం!

## 18. చిటికెన వ్రేలందుకొనీ

ఏదో ఒక పేరుతో ఆయుధం
గురి పెట్టిన నీలి చూపుతో
మనిషికీ మనిషికీ మధ్య
మానవతా బంధం తెగి
మృగం లానో జంతువులానో
కనిపించద మొక విచిత్రం.

ఏ ఆయుధ మయినా
మారణ చర్య ఒకటే

ఏ సమస్య అయినా
    ఘర్షణ ఫలితం ఒకటే.

పొగ చాటయి నంతలో
    మస కేసిన మాత్రలో
ఇందాకా సాధించిన సంస్కృతి
    మాడి మసి కావలసిందేనా?

దెబ్బకు పడిపోయేదీ
    మృగం కాదు జంతువు కాదు
మనిషి ఇనుప చర్యలో
    మృత్యు ముద్ర పడిన మనిషి!

ప్రకృతి సహజ ధ్వనులను తరుముతూ
    మధ్య మధ్య ఆయుధ ఘన శబ్దం
మనిషి కోసం మనిషి వేటలో
    శవం కోసం పైన గద్దలూ
మనిషి నుండి మారణ చర్యకు
    ఆకు వాడి పూవు మాడి పోతూంది.
నేల పయి సర్పం
    తెలియకుండా కాటేస్తుంది.

గాలిలో ఆయుధం
    తెలిసే బలి కోరుతూంది.

అనల చర్యకు విస్తు పోయి
    మండే గ్రీష్మం సహితం ఇప్పుడు
అడుగు వెనక్కి వేయాలసి వస్తుంది.

అడవిలో విపత్తు నెదుర్కొనే
    సాహస గుణ మెవరి కుంది?
ఎర్రని లోహ పత్ర పద్మ
    హృదయంతో మనిషికి తప్ప!

కోపాలూ శాపాలూ ఒక ఎత్తు
    గాయాలూ హననాలూ ఒక ఎత్తు.

ప్రతీకార శిఖలు మండుతూ
    యశో రూప శిఖలు వెలుగుతూ
దీని కొక సమయం లేదు
    సమాజ తంత్రంలో భాగమయి.

అడవిలో లోయలు గాయాల్లా
    నిలువునా కొండలు ధైర్యాన్నిస్తూ
సంఘం మరచిన పురా వాసులు
    ఎపుడేదీ కోరని బ్రతుకులు
తమ హక్కులు తెలియని మనుషులు
    మనిషి నిజం తెలిసీ నివ్వెరబోయేరు.

తమ సంపద లాగేందు కెవరయినా
    అడవిలో అడుగు పెడితే
మొగమాటం లేకుండా ఆటవికం
    తన అనల ముఖం చూపుతుంది.

చర్యకు ప్రతిచర్యకు దారిలో
    దారుణ భయ విలోల గతులతో
రగిలిన రహస్య ఉద్యమ చరణం
    మృత్యు చర్యకు దిగుతూంది.

ప్రక్కన ఆయుధ రక్షణ లేకుండా
పెద్దల భద్రత ఎక్కడిది?

ప్రజాస్వామ్య శరణంలో
కుటిల నీతి వ్యూహంలో
రక్షణ కవసరమయిన ఆయుధం
ప్రాణ హరణ కరణ మవుతూంది.
ఆయుధానికి ఆయుధాలు జోడిస్తూ
మనిషి నడకలో వేగం పెరుగుతూంది.

పుట్టిన ప్రాణిని
తన అరచేతుల్లో నిలుపుకొనీ
పోయిన ప్రాణిని
తన వీపుపయి వేసుకొని
వర్తమానం కదలుతూంది మెల్లగా

చిటికెన వ్రేలందుకునీ నడచే
సామ్యవాద ప్రజాస్వామ్యంలో –
బాలారిష్టాలెన్నో! గండా లెన్నో!

## 19. స్వేచ్ఛాయానం

మనుషులలో మనిషి
మనుషులతో మనిషి

ఇంత నుండి అంత దాక ఎదగాలనీ
సమాజ శిఖర పంక్తిలో చేరాలనీ

కళ్ళముందు వాస్తవం
ఎండ మావిగానో

పూల మాల గానో
    భయద భుజగి గానో

ఘర్షణ నెవరూ కోరరు
    అయినా దయ చేస్తుంది
అవకాశం దొరికితే చాలు
    స్ఫులింగాలు చిమ్ముతుంది.

జడం నుండి చలనం
    చలనంలో వేగం
వేగంతో పయనం
    పయనానికి లక్ష్యం
లక్ష్యంలో ఆదర్శం
    ఆదర్శంతో వ్యక్తిత్వం

ఇది మృగ తృష్ణలో ప్రవాహం కాదు
    స్వప్న హంసపై విహారం కాదు.
ఇది గారడి విద్యలో మొక్క కాదు
    ఇది మాస్కు ముఖంతో బొమ్మ కాదు.
చరిత్ర పుటలు తిరిగి రాయబడవు
    జీవన శకటం వెనక్కి మరలదు.

ఆగకుండా వీడకుండా
    అపాయ సీమల్ని దాటి
ముందుకు పోవడమే
    స్వేచ్ఛాయానంలో కర్తవ్యం.

# 20. జ్ఞప్తికి తెస్తూ

హక్కుల భంగం జరిగీ
నినాదం వెడలుతుంది
కావలసింది పొందాలనీ
రావలసింది చేరాలనీ

రాజకీయ ప్రతివ్యూహంలో
నిరసన మొక అవకాశం
జనహిత భావన లక్ష్యంలో
ఉద్యమ మొక ఉపకరణం
రాజకీయం లేని రాజ్యం లేదు
వైర పాత్ర లేని చరిత్ర లేదు.
గ్రీష్మంలా తాపంతో
వర్షంలా ఆర్ద్రతతో
శిశిరంలా కుంచితమయి
శరత్తులా ప్రసన్నమయి
మనోమయం జీవిత సందర్భం
కాలమయం ప్రకృతిని తలపిస్తుంది.
అన్నిటికీ ఆధారతలం అవని
అవని లేంది ఉనికి లేదు.

ధరిత్రి మెడలో హారంలో వజ్రాల్లా
స్మృతిలో మెరపుల సౌందర్యం మిగిల్చి
భంగపడిన హక్కుల చేతన జ్ఞప్తికి తెస్తూ
మెరసి జారిపోయే మనుషులు.

## 21. ఎవరికి వారే

ఆశల ఆశయాలతో జీవితం
విభేదాల గాథలతో సమాజం

ప్రతి ఉగాది ఒక్కొక పేరుతో
మోదమో ఖేదమో స్థూలంగా
భావన నాటుతుంది మనసులో
జీవిత చక్రంలో భవిష్యత్తు సూచనతో.

ఆలోచన కందనిదీ
అర్థానికి లొంగనిదీ
సంధ్యా నవ కిర్మీరంలా
జీవిత దృశ్యం! సందేహంలో.

మనిషిని తిప్పుతుంది తన చుట్టూ
కంటికి చూపుతుంది వర్ణ సామరస్యం
మౌనాకాశంలా ఉన్న మనసులో,
విశ్వబంధు సమాజం బింబిస్తుంది.

మబ్బు కమ్మిన సూర్యునిలా
బూది కప్పిన అనలంలా
మానుష దోషంతో ప్రజాస్వామ్యం!
ఎంతటి దార్శనిక ప్రకాశంలోనూ
ఓటమి అంచున నిలుపుతుంది
సమస్యకు కొత్త ముడిపడుతుంది.

ఎవరి గుర్తులతో వారు
అనుభవ స్థితి గతులతో
వేరు వేరు మనోమూర్తులు
ఎవరి విజయం వారిదే అన్నట్లుగా.

## 22. ఏండ్లుగా రాసులుగా

మనుషులలో ఉన్న ఆత్మ ఒకటే
అందరూ సమాన మన్న భావ శాల!
శాలలో రంగు రంగు బొమ్మల కొలువులో
అందరూ తమ తమ పరిమిత భంగిమల్లో

ఇంటి నుండి మతి విభవంతో
బయటికి వెళ్ళే విధం వేరు
బయటి నుండి అనుభవ గతితో
ఇంటికి చేరే తీరు వేరు

రబ్బరు బంతిలా జీవితం
ఎవరికి తోచిన విధంగా
ఆడేదీ కాదు, ఎగిరేదీ కాదు
ఆలాగని మట్టి ముద్ద అసలే కాదు.

ఇనుప గుండులా దూసి
గాయ పరచనూ వచ్చు
ఆర్ద్ర లహరిలా కదలి
హ్లాద పరచనూ వచ్చు.

ముఖంలో నవ్వూ ఏడుపు బొమ్మలతో
మనసును ఎత్త వచ్చు, దింప వచ్చు.
ముఖంపై చిన్ని వెలుగు బల్బులా
అదృష్టం! దారి చూపనూ వచ్చు.

మానవీయ సంస్కృతిలో విలువల కయి
మానవతా స్పందనలో జీవం కయి
ఎదురు చూస్తూ చూస్తూనే రోజులు!
ఏండ్లుగా! గడచేను! రాసులుగా మారేను.

## 23. జీవితమంతా

నింగిలా ఆలోచన విప్పారీ
అవనిలా స్వానుభవం పరచుకొనీ
మనిషి మనో రూప మొక ప్రపంచం
వాస్తవ జీవన సన్నివేశ ప్రతిఫలనం

మనుషుల గుర్తులతో మనసులో
విశాల విశ్వ బంధు సమాజం.

దాహంతో ఆకలితో మనిషి
భౌతిక మానస స్థాయిల్లో
ఎన్నిటినో దాటాలనీ పొందాలనీ
ఎన్నిటినో దాటేను పొందేను.

రహస్య ప్రపంచం నుండి
అతిథిగా ప్రవేశించి
జేతగా నిలవాలనీ
ప్రభువుగా మారాలనీ

సమాజంలో చెదరని భాగమయి
భూమిని ప్రేమించే మనిషి!
కాలాని కతీతమైన విజ్ఞానంతో
ప్రపంచాన్ని చుట్టి వచ్చే మనీషి

ప్రాణం నిలిపే పవనంతో
మనసును నడిపే ఆలోచనతో
కట్టు వడిన విలువల వెలుగుతో
పట్టు వదని లోపలి మృగంతో

హేతువు కందని అనుభవ రూపం
క్రిందినుండి ఎత్తుకూ
ఎత్తు నుండి క్రిందికీ.
జీవితమంతా! అనుకోకుండా
ఆరోహణ, అవరోహణలో.

## 24. సమాంతరం

భూమి పయి మొదటి అడుగు
అందరికీ ఎంత సంతోషమో
భూమి నుండి చివరి అడుగు
ఎందరికో అంత విషాదం!

భూమి పయి ప్రకృతి ఒక ఎత్తు
ప్రాణులలో మనిషి ఒక ఎత్తు
ఒంటరిగా జంటగా
బృందంగా సమాజంలో
భూమి కొక యశోరూప మిస్తూ
దేశాని కొక చరిత్ర నిస్తూ.

మనిషి మట్టి బొమ్మ కాదు
మట్టి లేంది బ్రతుకు లేదు.
బ్రతుకంతా మట్టి పయినే
పైకి చేర్చే నిచ్చెనకూ ఆధారం.

కమల బంధు మేధతో
ప్రవాహ లహరి నడతతో
విశ్వమయం సంకల్పంతో
మట్టీ మనసూ కలిసిన
మానవీయ రమణీయం మనిషి!

భౌతిక సంపదతో
　　మానస విభూతితో
స్వేచ్ఛ లేంది మనిషి లేదు
　　స్వేచ్ఛ ఎరగని మనసు లేదు
దారులు విచ్చిన దిశల మధ్య
　　దీవెన కయిపై కెత్తిన అరచేయిలా
ఆకాశం! ఆకాశం క్రింద భూమిపై!
　　ప్రకృతికి సమాంతరంగా సమాజం!

## 25. ఆకూ - చెట్టూ

ప్రకృతిలో ఒకటయి శిష్టమయి
　　జీవ కణ పరిణత రూపం
మనిషిలో తరగని ఆలోచన
　　మంచును మాపే కిరణంలా.

సమాజ చలనంలో భాగమయి
　　వీరంతో త్యాగంతో ప్రేమతో కరుణతో
మానవీయ పూర్ణతకు హేతువుగా
　　మనిషి మనిషిలో భిన్నమయిన వ్యక్తిత్వం
వికాసంలో విశాలమవుతూ
　　ప్రమోదంలో ప్రదీప్తమవుతూ.

ఎవరి శ్రుతి వారిది
　　ఎవరి స్వరం వారిది
అన్ని కలిసిన సమాజం
　　రమణీయ వాద్య మేళనం.

ఆకు రాలుతుంది
        కొత్త ఆకు వస్తుంది
తనతోనే చెట్టుకు
        నిండుదన మనీ
ఆకులో అహంకారం
        తన వలనే ఆకుకు
జీవిత మనీ
        చెట్టులో అహంకారం.

ఒకరిలో నిండుదనం
        ఒకరిలో నిలయ గుణం
పరస్పర సహయోగంతో
        సమాజ సుందర రూపం

మందే విలయ దృష్టి కన్నా
        వెలిగే సృజన శక్తితోనే
ప్రేయమూ శ్రేయమూ
        వ్యక్తికీ సమాజానికీ.

## 26. కొత్త సమాజం కయి

సమయ వేది పయి ఆలోచన
        హిమ ప్రతిమగా మారుతుంది.
మనోబింబ కిరణాలకు
        రసమయంగా మయి కదలుతుంది.

సమయ వేది పయి ఆలోచన
        అనల శిఖగా మారుతుంది

అవసర పవనానికి
నిప్పు రవ్వలు చిమ్ముతుంది.

సమయ వేది పయి ఆలోచన
వెలుగు దివ్వెగా మారుతుంది.
కొందరి కిది ఇష్టం కాకపోవచ్చు
నిజ రూపం చూపిస్తుందనీ
మచ్చలు బయట పడతాయనీ
చీకటితో రాజీ పడేరు.

వెలుగులో నడవాలిసి రావచ్చుననీ
చీకటిలో అయితే స్థిరమనీ

గట్టు నుండి గట్టుకు
వంతెనలా మానవత
ఇంద్ర ధనుసులా విరిసి
దూరం నుండి హ్లాదంగా!

ఇరువైపుల నిలిచీ
జన సమూహ దృశ్యాలూ!
బాధలతో బరువులతో
వేదనలో తలపులతో

శబ్దానికి హద్దు లేదు ఆర్తిలో
దు:ఖాన్ని మోసుకొనీ గాలిలో
ప్రతి హృదయం చేరుతుంది
క్షణం ఆగకుండా
అలసట లేకుండా
వంతెన పయి వేగంగా

కాల వేది పయి ఆలోచన
ప్రజాస్వామ్య రూపంగా
మనిషి గురించి మనుషులతో
మనుషుల కయి మానవీయమయి
వాస్తవ శక్తులతో
కొత్త సమాజం కయి.

## 27. స్మృతి చిహ్నాలు

బాల్యంలో ఆట బొమ్మ చేతిలో
తెలియని పసి దశ దాటీ
మలి దశలో స్మృతి బింబ మయి
దేవతగా మారుతుంది స్థిరపడీ.

సందర్భం మనిషిని బొమ్మను చేస్తుంది
మనిషి కొక బొమ్మ అవసర మవుతుంది.
బొమ్మల కలవాటు పడీ మనిషి
తన చుట్టూ బొమ్మలు కోరేను

ఒకరికి బొమ్మ అంటే మరీ ఇష్టం
ఒకరికి బొమ్మగా మారడం ఇష్టం.
ఆట బొమ్మ! దిష్టిబొమ్మ! నీడ బొమ్మ!
పండుగ బొమ్మ! బొమ్మ లెన్ని విధాలో!
మనిషికి బదులుగా బొమ్మలు
ఊరటగానో ప్రేరణగానో

జారి పోయిన బాల్యం
బొమ్మలో సంతోషం కలిగిస్తుంది.

పిల్లల వెలుగు ముఖంలో భద్రంగా
　　చెదరని విలువల్లా కనిపిస్తుంది.

మబ్బు మధ్య నుండి జారే
　　చల్లని సూర్య కిరణంలా
స్మృతి నదిలో తేలే బింబంలా
　　తరగని ఆస్తిలా ఆకర్షిస్తుంది.

జీవన వ్యవహారాల్లో వ్యాపారాల్లో
　　ఎదురు పడే మనుషుల ముఖాల్లో
తీరిక ఉండాలి కానీ
　　ఓపిక ఉండాలి కానీ
ఊహ లెన్ని విధాలో
　　బొమ్మ లన్ని రకాలు!
సమయ సమయం వెలుగు రాకతో
　　పలు సైజుల్లో నీడల బొమ్మలు!

అద్దంలో తన ముఖంలో
　　బొమ్మ! బయట పడుతుంది
తనకే కనిపిస్తుంది
　　ఎవరికీ కనిపించదు.

ఎవరి కిష్టమయినా లేకపోయినా
　　బొమ్మల ప్రవేశం తప్పదు! మనసులో.
తొలి దశలో బాల్యంలో స్మృతులతో
　　మలి దశలో అనుభవ చిహ్నాలతో.

## 28. సురక్షితం

బహిరంతర భావనతో
భౌతిక మానస జీవితం
స్వార్థంలో లోపలి చేతన
కనిపించదు వినిపించదు
నింగిలో చుక్కల్ని
లెక్క పెట్టే పనిలో రాత్రి
జలధిలో తరగల్ని
లెక్క పెట్టే పనిలో పగలు
లెక్క పూర్తి అయ్యే వరకూ
వీడని పనిలో మనిషీ!
చేసే పని ముగియందే
తప్పుకునే వీలు లేదు.

ఉన్నది చాలకనూ! చాలదనుకునీ
వ్యక్తిలో అసంతృప్తి! భ్రమణం
సామాన్యుడు! నాయకుడూ!
యోగీ! భోగీ! దరిద్రుడూ!

చాలని దాని కయి చేయి చాచి
కాళ్ళకు పని కల్పనలో! అందరూ
ఎవరికెంత కావాలో
ఏ పని అవసరమో!
చూపే ఆదర్శం! కల్పనలో!
వాస్తవ మయ్యేందుకు ఎదురు చూస్తూ.

## 29. అందినట్లుగా

చీకటిలో భేదం మాయమయి
సమస్తమూ ఒకటవుతుంది.
ఒంటరిగా రాత్రివేళ
భయ చిత్రం మనిషిలో
చుక్కలకు లేదు భయం
చంద్రునికి లేదు భయం
చీకటిలో వెలుగుతూ
తమ హృదయం చూపుతాయి.

ఒక పగలుకూ మరో పగలుకూ
మధ్య వంతెనలా రాత్రి
వంతెన పయి కదలి పోయేను
చంద్రునితో పాటు చుక్కలూ

మనిషిలో కోరిక లెన్నో
అంతా తన చుట్టూ తిరగాలనీ
కనబడని చీకటిలోనూ
సర్వం తన వశం కావాలనీ

అద్దాల గదిలో నుండి చూస్తే
అనుకున్న విధంగా పగలూ రాత్రీ
అంతా! తన చుట్టూ ఉన్నట్లే
సర్వం తన వశమయినట్లే
ఆకాశం తన కడ ఉన్నట్లుగా
కాలం తన చేతి కందినట్లుగా.

## 30. సన్మాన సన్నివేశం

విజయాశయ పథ పథంలో
    ప్రతి మెట్టు పయి మనిషిని
మెట్టు నుండి తోసేస్తూనో
    అడుగు కింద అణచేస్తూనో
పిడికిలిలో నలిపేస్తూనో
    బలంతో బంధిస్తూనో
    ఆజ్ఞతో నిలిపేస్తూనో
మనిషిలో! ఇనుప విగ్రహం.

రక్త చిత్ర మయం చేసి
    కాలాన్ని వధ్యశాలగా మార్చాలనీ
కణ కణం గడ్డ కట్టి
    శిలామయ ఫలకం కావాలనీ

మనిషిలో ఉత్సాహం
    రణంలో విజయం కయి
మనసులో సంవేదన
    ఓటమిలో! శాంతికయి

ఎదుట వెలుగు ఎంత బాగా ఉన్నా
    కంటి చూపు సరిగా ఉంటేనే
దృశ్యం బాగా కనిపిస్తుంది
    కోరే వస్తువు దొరకుతుంది.

గుడ్డిదనంలో రూపం కనిపించేనా?
    చెవిటిదనంలో మాటలు వినిపించేనా?
మూగదనంలో శబ్దం పలికేనా?
    పీఠానికి అర్హత సరిపోయేనా?

జవాబు లేని సమయంలో
క్షణాలు ఆగినట్లవుతాయి!
క్షణాలు స్వేచ్ఛగా కదలని సందర్భం
ఇనుప మూర్తికీ సన్మాన సన్నివేశం!

## 31. బులుపుగా

మనసు తలుపు తెరచుకోదు అతనిలో
భయమూ అనుమానం పోటీ పడతాయి
ఇష్టం లేని వ్యక్తిం లోనికి రావచ్చుననీ
ఇష్టం కాని దృశ్యమేదో కనబడవచ్చుననీ

పలకరింత ఒలుకుతూ చిలుకుతూ
అడుగులు పడతాయి మెల్లగా
కళ్ళలో చిన్ని బల్బు వెలుగుతో
పెదవిపై పలుకు పాట స్వరంతో
ఇంట్లో గోడకు బహుమతులు వరుసగా
స్మృతులను కదలిస్తూ కెరటాల్లా
ఫ్రేములో అమర్చి అల్మెరాలో చేర్చి
ఫోటోలు! డిటో డ్రెస్ పోజ్‌లో
టేబిల్ పయి ఫ్లవర్‌వేజ్‌లా
వేదికయి అలంకృత వేషం!
మూసిన మనసు తలుపు తెరిస్తే
తనలో చీకటి భూతంలా
బయటికి వచ్చేస్తుందనీ పరుగిడుతుందనీ
ఆలోచన! కిటికీలను మూస్తుంది.

అద్దంలో కనిపించే బొమ్మలా
మార్పు లేని చేర్పు లేని
చిన్న నాటి కథలో మేకప్‌తో
మురుస్తూ చరిస్తూ బులుపుగా!

సమయానికి తగిన వాద్య భాషణంతో
కలకూ నిజానికీ భేదం చెరగి పోతుంది.
సామాజిక భూమికతో సంబంధం లేని
ప్రచార కళలో నైపుణీ వ్యవహారం!
సమయానికి సింగారంగా
విజయానికి షార్ట్ కట్‌తో
మెట్టు నుండి మెట్టుకు ఆరోహణలో
ఊహకూ చేతకూ మధ్య
మంచు బొమ్మలా! వ్యక్తిత్వం
ఎండ ఎక్కువయితే కరగిపోవచ్చు
గాలి తీవ్రమయితే చెదరిపోవచ్చు
అందుకే ఎప్పటిగా చల్లగా పొఖ్తాగా

మనసు తలుపు మూత బడీ
భయమూ అనుమానం పోటీ బడీ
ఏదీ! యాదృచ్ఛికం కాదు
అన్నీ జీవన భోగంలో భజ్గిమలే!

## 32. మనిషి మనిషిగా

మనిషి మనిషిగా బ్రతకడం
అందరికీ అన్నీ అందడమే కాదు
మనిషి హక్కు! ప్రజాస్వామ్యంలో
చతుర ప్రహసనం కాకూడదు.

నిన్న చేయి పట్టుకొనీ
    నేడు అడుగు వేసేను
రేపు వైపు! మనిషి కయి
    మనిషి నుండి మనిషికీ

హృదయాలకు మధ్య దూరం
    కొలతల కందేది కాదు
ఏ తెరపయి చూచేది కాదు
    ఎవరి విజయమయినా, సమాజానిదే!

ఒక యశోరూప చిహ్నం
    ఉత్సాహ లహరి నింపుతుంది
ఒక స్మృతి విశేష భావం
    ప్రేరణ సూచిక అవుతుంది.
జీవితాన్ని చివరి దాక నిరంతరం
    నడిపించే వాస్తవమై సమాజం
మనిషి అస్తితలో అంతరంగం
    వెనక నుండి వెలుగు బింబంలా!
పైకి తెలియకపోవచ్చు
    అవసర మనిపించక పోవచ్చు.
మనిషి గురించి మనిషికి తెలియదు
    ఇరువురికీ తెలియనిదీ ఎంతో
ఇరువురిలో తెలిసింది కలిసీ
    సమాజ పూర్ణతకు విలువ పెంచేను.

# 33. ప్రశ్నాముఖంతో

ఏ వైపు నుండి అయినా
త్యాగం విలువ అమూల్యం
ఏ విధం సమస్య అయినా
బాధ్యతలో బరు వొకటే
త్యాగానికి ఉన్న శక్తి
ప్రతీకారానికి లేదు
స్నేహానికి ఉన్న జీవం
వైరాని కసలే లేదు
హేతు సహిత కారణ భావన
ప్రజా స్వామ్యానికి మూలం

మూలం చెద పడితే, చెదరితే
శాఖా నిలయానికి ప్రమాదం
నేత లెవరి కోసమో కానీ
నీడలు! మాత్రం జనాని కన్నట్లుంది.
ప్రతి పౌరునిలో బాధ్యత
తన హృదిలో నిశ్శబ్దంగా!
మానవతా స్పందన కయి
ఎవరి ప్రేరణతో పని లేదు.

రేపు ఎట్లా ఉంటుందో నన్న
సందేహంతో ప్రతి రోజూ!
ప్రశ్నాముఖంతో నిష్క్రమణం
ఆశాముఖంతో ఆగమనం

అభయ హస్త ముద్రతో
గుండెపై పూల గుత్తితో

ఊహాలో సృజన ముఖంతో
    రావాలని కోరిక! అందరిలో
ఇది సాధ్యం అయ్యేదీ
    జన మానస రూపంతోనే!
మనసు కరువు తీర్చేదీ
    సామాన్యుడు మోయలేని
బ్రతుకు బరువు తీసేదీ!
    నైతిక బల సంపదతోనే

ప్రజాస్వామ్య ఫాలం పయి
    చిలికిన నెత్తురు చిత్రం
ఏ విజయ గాథ తలపించదు
    ఇది వ్యవస్థ అస్తితకు కళంకం.

## 34. స్వప్నిస్తూ

పెను రాయి వద్ద ఆగినట్లయి
    జీవ నది! స్వప్నిస్తుంది గ్రీష్మంలో
ఇరువైపుల పైరు పంట గురించీ
    భూమి పయి మనిషి బాగు గురించీ

మట్టి కణం జడత వీడి
    చేతన వికసించాలనీ
తన చల్లని చూపుతో
    జల కణ మృదు స్పర్శతో
తప్త భూమి పయి పొర
    కుసుమ దళం అవాలనీ

మబ్బుకు కదలే స్వేచ్ఛ ఉంది
కానీ అది గాలి అధీనంలోనే
నీరుకు సాగే స్వేచ్ఛ ఉంది
కానీ అది ఎత్తుకు ఒదిగి మాత్రమే.
హద్దులు సరిహద్దులు నడకలో
మితులూ పరిమితులూ బ్రతుకులో

అవసరాల ఒత్తిడిలో
పెను మార్పుల వేగంలో
స్వర్ణ పంజరంలో మనిషి!
జీవ నదిని స్వప్నిస్తూ! శిశిరంలో.

## 35. వాస్తవ భ్రమణంతో

అందని దూరంలో ఆదర్శం!
అందే దూరంలో ఆటంకాలెన్నో!
కిరణాని కెవరి అనుమతితో పనిలేదు
మేఘాని కెవరి ఆజ్ఞతో పనిలేదు

రాజ్యంలో స్వేచ్ఛకు అడుగడుగున
అనుమతులూ ఆజ్ఞలూ నిషేధాలు!
జేబులో పిస్టల్ ఉందనో
బాగ్‌లో బాంబు ఉందనో!

చిల్లి పడిన జేబునుండి నాణాల్లా
ఆదర్శం! కాస్త కాస్త జారిపోతూంది
మనిషితో మనిషి అనుబంధం
విపణి వీధి గతంగానో

శత్రు భావమయం గానో
పద పదమూ అనుమానం ఆగ్రహం!

వెనక నుండి మానవీయ హస్తం
ముందుకు నెడుతుంది!
స్పందమాన హృదయంతో
ప్రజాస్వామ్య చేతనతో

స్వప్నం ఎపుడో మాయ మయింది, కానీ
వాస్తవ మింకా మంచు పొరలలోనే!

## 36. గాలిలో! చేతికో!

మేఘానికి సరిహద్దులు లేవు
పవనానికి పొలిమేరలు లేవు
కిరణానికి తుది సీమలు లేవు
హద్దులు సరిహద్దులు లేవు

సరసి అలల సహనంతో
నిశి వెన్నెల శుభ్రతతో
పవన వేగ గమనంతో
సమాజ గుణ బంధంతో!
మస్తిష్కంలో ఆలోచన
గగనంలో మేఘంలా
ఊహ మొదటి బిందువుతో
వ్యక్తి వికాస బింబం మొదలు
చిట్ట చివరి రేఖతో
సమాజ వ్యక్తిత్వానికి సెలవు!

సమస్య పరిష్కృతిలో తీర్పుకు
చిట్ట చివరి మాటలేదు.
అది గాలిలో బెలూన్ కావచ్చు!
చేతికో కాలికో సంకెల కావచ్చు!

## 37. పనిచేయని వేషం

ఆకాశం ఎన్నటికీ
కిందికి దిగదని తెలుసు
లేకపోతే ఎపుడో
కిందికి దించే యత్నం జరిగేదే
అందుకే మానసిక తృప్తికయి
గాలిలో విమాన యానం

మహానది ఎన్నటికీ
క్షణం ఆగదని తెలుసు!
లేకపోతే ఎపుడో
ప్రదక్షిణలు చేసే పని జరిగేదే
అందుకే మానసిక తృప్తికయి
నీటి పయి పడవ ప్రయాణం.

గాలిలో తిరిగినా
నీటిపై కదలినా
ఆకర్షణ! ఎప్పటికీ భూమి పయి
జన్మ నుండి బంధంతో మనిషిలో

మనిషి! జీవితంలో
బహు పాత్ర ధారి అనీ తెలుసు!
ఎప్పటికీ ఏదో పాత్రలో
అసలు రూప మేదో! తెలియదు!

అందుకే అంతరంగ ప్రవేశం!
బ్రతుకు నిమిత్తం బహుకృత వేషంలో
కనిపించని నిజరూపం కయి అపుడపుడూ.

## 38. పరిణత చిహ్నం

చిన్న దీపమయినా
చీకటిని వేరు చేస్తుంది
మనిషి తరచుగా మరచే
నిజరూపం చూపిస్తుంది
చిన్నదో పెద్దదో విజయం
ఏ స్థితిలో ఎంతటి దయినా
మనషి మనో రూపాన్ని మెరపులా
ఆకాశ మెత్తు చూపుతుంది.
కోరే వస్తువు లెన్నో చుట్టూ
అవసరాలవీ, వాటిని మీరినవీ
మనసును బరువులతో నింపేసి
తేలిక దారుల కయి వెదకేరు
జీవిత మొక ఆగని ప్రవాహం
ఒడ్డున ఉన్న వేళ మనసుకు
దాటే సంకల్పంలో మనిషికి
యాన విధాలెన్నో! సాధనలో
తనతో పోటీ అనుకొనీ
పక్షి రెక్కలు నరికే కన్నా
తనలో కోరిక గుర్తుకు వచ్చీ
తనలో హద్దులు తెలుసుకొనీ
అది వాహనమయి పోవడం
ప్రియమూ హితమూ పరిణత చిహ్నం.

## 39. ప్రయత్న ఫలం

భూమితో భౌతిక జీవన వాస్తవం
    నింగితో మానస ప్రపంచ కల్పనం
పొరలుగా అరలుగా కలిసిపోయి
    మనిషిలో అందీ అందని జీవితం
దగ్గరలో విరిసిన గులాబి వనం
    దూరం నుండి మండే దృశ్యం
సమయం సందర్భం స్థితిలో
    భావాంతర స్పందనతో మరొకటీ

కొండ రాళ్ళ నేలపయి
    ఎగుడు దిగుడు బ్రతుకులలో
జలదం కనిపిస్తే!
    ఎంత సంతోషం!
జల ధారలు పాయలుగా సరిస్తే
    అంతకన్న పట్టరాని ఆనందం!

భూమిని తవ్వితే
    బొగ్గయినా రత్నమయినా
రెండింటి కన్నా అమూల్యం
    ఇపుడవసర మయిన జలం!
శిలా మయమయి కాలం
    బ్రతుకులో నిలిచిపోతే
శిల్పం పయి ఆలోచన కన్నా
    క్షణం కదలి తరలి సరించే
మానవ యత్న ఫలం మహనీయం.

## 40. అందని మనిషి

మనిషి పూర్తి రూపం
చిత్రంలో తెలియదు
శిల్పంలో ఒదగదు
నాదంలో నిలవదు.
దేనితో సమానం కాదు
దేనితో పోలిక కుదరదు.
బయటికి తెలిసిన ప్రకాశంతో
మనసుకు తెలియని రహస్యంతో
మట్టి పయి మట్టితో బంధంతో
జీవిత మొక! సంప్రసార చేతనం!

ఏ జలధిలో కలవని ప్రవాహం
మట్టిలో కలిసే జీవన భాగ్యం

సుదీర్ఘమయి విశాలమయి కదలుతూ
తోటి మనిషి ఎదను స్పృశిస్తూ
నిరంతరం తలపులలో సమాజంతో
ప్రతి జీవిత మొక అనుభవ సంచిక!

మట్టిపయి నడచే
మట్టిపయి నివాసంతో
మట్టి నుండి బంగారం కోసమై
మట్టి అంటకుండా బ్రతకాలనీ

మట్టి నుండి పెరిగే చెట్టు
మన్ను పూయదు
మన్ను రాల్చదు
భాగ్యసారం రాలుతుంది.

పూలతో పండ్లతో
అందాన్ని పుష్పిస్తుంది
ఫలితాన్ని అందిస్తుంది.
జీవితాన్ని తలపిస్తుంది.

## 41. దర్శనరూపం

బయటి కిటికీ తెరిస్తే
కనిపించే భౌతిక దృశ్యం!
జీవిత గ్రంథంలో శబ్దమయం
తెరచిన జీవిత గ్రంథం పుటలో
చదివే ఊహకు కొత్త దారి చూపిస్తుంది.

నిలువెత్తు కొండలు
శబ్దంలో ఒదిగి పోతాయి తిన్నగా
ఎంతటి ప్రవాహమూ
అర్థంలో తిరుగుతుంది సుళ్ళుగా

బిందువులో మార్పుతో
తుషార రూపంలా
శబ్దంలో స్ఫూర్తితో
భావ బంధు ప్రపంచం

ముందుకు సాగే కెరటం
వెనక వచ్చే కెరటానికి దారి ఇచ్చినట్లు
ఊహ కదలుతుంది ముందుకు
మరో ఊహకు వెనక నుండి దారి ఇస్తూ

కవితకు నేపథ్యం విశ్వం
　　సమాజ ప్రేరణతో గమ్యం
కవిత కాదు విగ్రహ రూపం
　　స్ఫటికాకృతి అసలే కాదు
లోపలి వేదనతో తప్తమయి
　　శబ్దం బయటికి వస్తుంది
స్వర్ణ పత్ర సమాజ మవుతుంది
　　పరిమళ మధు వాస్తవంతో
ఆగ్రహంతో ఊగే అగ్నిని
　　దువ్వి శాంత హృదయ మిస్తుంది.

లోపలి కిటికీ తెరిస్తే
　　కనిపించే మానస దృశ్యం!
కొత్త తరం పురోగమనంతో
　　ప్రజాస్వామ్య దర్శన రూపం.

## 42. బయట పడే దారికయి

సమస్య ఏదయినా, ఉద్యమ మేదయినా
　　కాలం ఏదయినా, దేశం ఏదయినా
ప్రజాస్వామ్య ఫాలంపై నెత్తురు గాయం
　　ఇది ఆ సందర్భంలో అపజయ చిహ్నం.

ఆశయాల సాధనలో
　　నిరసన ఘర్షణ దశ
జ్వాల అయి కదలుతుంది
　　పాకుతుంది దహిస్తుంది.

సమస్య జటిల మయి విషమ మయి
అశాంతి అసహనం హింసతో
సందర్భం అదుపు తప్పి చేయి దాటి
మారణ చణ సన్నివేశమవుతుంది.

భయం నుండి రక్షణ వలయంలో
ఇరు వైపుల చర్యలు ప్రతి చర్యలు
జనావళికి అపాయ సూచికలు
నాయకులకు ఉత్సాహ వీచికలు.

వ్యక్తి నుండి ప్రశ్నకు జవాబు వదలి
కాలక్షేపంలో పాలనా యంత్రాంగం
సామాన్యుని పయి చట్టం తన పనిలో
అధికార బలానిదే పై చేయిగా.

ప్రజాస్వామ్య సుదీర్ఘ ప్రక్రియలో
నైతిక వ్యక్తిత్వం మలినమయి
దిశలు మూతబడీ, అయోమయం నుండీ
బయటపడే దారికయి అన్వేషణం.

## 43. ప్రమాదం అంచులో

ఒక బుజాన పుస్తకాల బాగ్‌తో
మరో వైపు ఆయుధ కల్పనతో
పిల్లల మతిలో ఊహా చిత్రం
కొత్త తరం పయి ప్రభావ రూపం.

విన్నదో పత్రికలో కనిపించిందో
ఉద్యమ దృశ్యంతో ఏ విషాద సన్నివేశమో!

ప్రశ్నకు జవాబుతో మరో ప్రశ్న
జలధి తరంగాలపై నడిపిస్తుంది.
ప్రశ్నలూ జవాబులూ నలువైపుల నుండీ
ఒకరిది మరొకరి సంకెలగా.
మారణ స్థానాలుగా మారే రాజకీయంలో
అనుమతులూ ఆజ్ఞలూ కఠినమయి
చట్టం ఉల్లంఘనం సహాయ నిరాకరణం
అనుమానం! నిరసన! విద్వేషం! విధ్వంసం.
రాయి విసరినా లాఠి తిప్పినా
చూపే కటు బల మూలం ఒకటే

అశ్వం ధాటికీ వాహన వేగానికీ ఎదురయ్యే
ఆగ్రహ శ్రేణుల్ని నిలిపేసే దెవ్వరు?
సమస్యకు దూరమయిన చర్యలతో
శీర్ణమయిన ప్రజాస్వామ్యం
చర్యకు ప్రతిచర్యల వరసలో
ప్రమాదం అంచున సామాన్యుల జీవితాలు!
భద్రమయిన రక్షణలో నేతల! కాలక్షేపం.

## 44. అమూల్యం

సమస్యల పరిష్కృతికి ఆలోచన లెన్నో
వాదాలను మన్నించే రాజకీయ వ్యవస్థలో
అపాయాల మధ్య నుండి కాపాడే
ఉదార ప్రక్రియలో ప్రజాస్వామ్య మవసరం

జనం మధ్య నిర్భయంగా
తిరిగే నాయకు డెక్కడ?

నైతిక పథంలో ప్రజలను
నడిపించే నాథు డెక్కడ?
ఏ చర్యల వ్యూహం లేకుండా
ఏ పక్షం ముందుకు నడవదు.
ఏ రహస్య తంత్రం లేకుండా
ఏ ఉద్యమ చరణం సాగదు.
బిగిసిన సమస్య ముడి వీడదు
మూసిన శవ పేటిక తెరవబడదు.
సరాసరి దహనానికో సమాధికో
సభ్య సమాజం గళ మెత్తే సందర్భం!
ఉద్యమ సన్నాహంలో వాస్తవాన్ని కప్పేస్తే
హంగులు ఆర్భాటాల్లో విలోల జనం!
అమూల్యమయిన లక్ష్యం విపణీకృతమయి
నైతిక మధు కోశం చెల్లాచెదరవుతూంది.

చిత్రమేమిటంటే భాయి!
ఈ రోజు నిర్జీవ మనుకొన్నది
రేపు మొదటి సూర్య కిరణంతో
సుప్త తేజం మేల్కొనీ విజృంభిస్తుంది.

## 45. కదలిక

మట్టి మనిషి గురించి
మాటలు నెమరేసే బదులు
మట్టి పయి మొక్కలతో స్నేహం
మొక్కల మధ్య మనుషులతో సహవాసం
సహవాసంతో పూచే సమయ పుష్పం
సంఘానికి పరిమళ గుణ మద్దుతుంది.

అడవి మారితేనే ఊరు
ఊరు పెరిగితేనే నగరం.
అడవి పయి ఊరు పయి ఎప్పటికీ
తరగని చెరగని మానస బంధం.
తన దేశం వదలి మరో దేశం
ఏదో సాధించాలనీ పొందాలనీ
ఒక మట్టిని వదలి మరో మట్టి పైకి
విస్తరణ చరణంతో విశ్వ తలంపైకి
వ్యక్తి పురోగమనం ఆరోహణలో
ఊరు నుండి ఊరుకు, ఊహ నుండి ఊహకు

నెత్తురు గీతలు దాటుతూ
మంటల కంచెలు దూకుతూ
ఆపదలో రక్షణ కయి!
శిక్షణతో సన్నాహం!
ఎంతటి ఘన వర్షానికీ
రాతి ముఖం చివురించదు.
ఎంతటి సుందర ప్రతిమ అయినా
చూచే దృష్టి తోనే! దానికి స్థానం.
వసుధ కెంత సృజన కీర్తి ఉన్నా
జలద కరుణ హృదయం తోనే సఫలం.
సమాజ మెంత చరిత్ర కలదయినా
రాజ నీతి నవత తోనే కదలిక!

# 46. యానంలో

ప్రజాస్వామ్య చలనంలో ఈనాడు
యశశ్చంద్రికా వదనం పయి
బిందువుగా మొదలయిన కళంకం
విస్తరించి వికృత దృశ్యమవుతూంది.

నిశి వెన్నెల ప్లోద నదికీ
తీరా లెదురెదురుగా
ఏదో ఒక వైపు నుండి
ఒక నెత్తురు చుక్కతో
ఎరుపు లోకి మారుతుంది నీరు!
ఉదగ్ర చేతనలో భాగమవుతూంది.

ఒక తీరం సుముఖమయితే
మరొక తీరం విముఖం కారాదు.
ఒక రుతువును అభిమానిస్తే
మరొక రుతువు శత్రువు కారాదు.
సమయ సమయం అనుభవంలో
పలు రుతువుల సంకలనం!
ముందుగా తీసిన చలన చిత్రం కాదు
ఎప్పటి కప్పుడు మార్పులతో జీవితం!

ఎవరి కోరిక పయినో
ఎవరి ప్రబోధం పయినో
నది దిశ మారదు!
అల వెనక్కి నడవదు!

# 47.పరిపూర్ణత కయి

పారే నీటి కెవరి సూచన అక్కర లేదు
కదలే గాలి కెవరి ఆజ్ఞతో పని లేదు.
ప్రాంతం నుండి ప్రాంతానికి స్వేచ్ఛగా
తీరం నుండి తీరానికి పడవలా
జన్మ భూమి నుండి దూర దూరమయి
అవసరాలు వ్యాపకాలు తప్పని బతుకులో
మనిషి మనిషి కొక మౌన లిపి
ప్రతి బ్రతు కొక శ్రమ జీవన యంత్రం
ప్రతి మనసూ వేరెవరూ
చదవలేని అనుభవ గ్రంథం!

హృదయ కిరణ ప్రసారంతోనే
మనిషి అస్తిత బయట పడేదీ
సకలంగానో వికలంగానో
శకలంగానో పూర్ణంగానో
బిందువుగా మొదలయి జీవితం
ఎదిగి ఎదిగి బింబ మయి కదలీ
పరిపూర్ణత కోస మయి యానంలో
నిశి సీమను పగలును దాటాలనీ!

## 48. ముఖంలో వెలుగుతో

తలుపు తడితే
లోనుండి ఎవరో ఒకరు
వచ్చి తలుపు తీస్తారు.

ఆ ముఖంలో నిశ్శబ్దంగా
కుసుమ దళం కదలుతూనో
శిలా ఫలకం నిలిచో
అనల శిఖ సాగుతూనో
సుముఖమో! విముఖమో!
ఉల్లాసమో! ఉద్వేజమో!
ఏ మయినా కనిపించవచ్చు.

తలుపు బయట నున్న వ్యక్తికి
లోనుండి వెలిగే బల్బు ముఖంతో
లోనికి స్వాగతం లభించవచ్చు
బయటనే నిష్క్రమణం జరగవచ్చు.

ఏమయినా కానీ
మరో తలుపు తట్టకనూ సాగదు.
ఏదయినా కానీ
మరో ముఖం చూడకనూ తప్పదు.

ఎక్కడో తలుపు తెరవబడీ
ముఖంలో వెలుగు తొణకే,
మనిషి దర్శనం కోసం!

# 49. మంటల్లో ప్రజాస్వామ్యం

మొదటి కిరణంతో రోజూ
తన పేరు
పత్రికలో వెలగాలనీ,

తన మాట
గాలి అలల పయి సాగాలనీ
ప్రదర్శనలో ఉత్సాహంగా
పోటీలో ఆశారూపాలు.

ప్రచార సాధనాలతో
ప్రజాస్వామ్య వాహనం.

ఇరువైపుల యుక్తీ శక్తీ
చాచిన చేతుల్లో బ్యానర్!

వెలుగు కార్పెట్ పరచిన దారిలో
ఏ టిఫిన్ బాక్స్ నుండో
ఏ పూల బుట్ట నుండో
పేలిన శబ్దం! అనూహ్యంగా.

ఏ ఉద్యమ చరిత్ర లోనో
రగిలిన ఉద్రేకంతోనో
వెలుగును మసిచేస్తూ
మనిషిని మరపిస్తూ

మౌన ఖడ్గంలా
అగ్నిబాణంలా

నీటి కయి పరుగెత్తిస్తూ
కదలుతూంది ఈ సమయం.

బాష్ప బిందువు జారుస్తూ
ఫైర్ ఇంజన్ వెనకనే రావలసిన
శాంతి కయి జనం! నిరీక్షణం!
భగ్న తరువు చివురించే ఆశతో!

## 50. వర్తమాన సన్నివేశం

సంస్కృతిలో భద్రంగా ఉన్న గతం
కొంత మెరపులా బయట పడుతుంది.
నీలి మబ్బులా కదలుతుంది
వానలా జారుతుంది.

ఉదయం అస్తమయం భేదాలతో
ఆకృతి కెదురుగా ఆకృతి!
సమాజ శక్తిని తలపిస్తూ
మానవ నైజం బయటపెడుతూ.

శిథిలమయిన ఆశల సీమ నుండి నిష్క్రమణం
సరికొత్త కోర్కెల సీమలోకి ప్రవేశం
ఊపిరిలో అల్లిన జీవితం
పందిరిలా మరొకరికి నీడగా
సామాజిక సందేశంతో ఆలోచన!
వర్షమయి విశ్వమయ మవుతుంది.

నీటి పయి తేలే హంసలా
హృదిలో మెరసే తేజంతో

వచ్చే ఉషస్సు పయి విశ్వాసం
మదిలో కర్తవ్యం పెంచుతూంది.

చీకటిలో దాగిన గాయాలను
కిరణం కొత్తగ చూపిస్తుంది
ముందు చూపుతో చరిత్ర
మరో రోజు కయి ఎదురుచూస్తుంది
వర్తమాన సన్నివేశ మయం
ఆల్బంలో ప్రజాస్వామ్య దృశ్యం.

## 51. స్వేచ్ఛా జగం

నీలి మొయిలు లోని కరుణ జల కణం
మెరపు తీగె లోని చకిత సాహసం
పొందిన హృదయం నాలో
స్వేచ్ఛా కవితా రూపం.

తుపానులో ఆకులా ఎగిరి పోని
ఈదురులో పూవులా రాలి పోని
సమాజ హృదయం నాలో
స్వేచ్ఛా కవితా హృదయం.

పూల తోట లోని కొత్త యౌవనం
ఉషసు రాక లోని కొత్త జీవనం
వికాస హృదయం నాలో
స్వేచ్ఛా కవితా రూపం.

చండ రవికి నీలి మబ్బు గొడుగులా
మహా నదికి యశసు శుచిత చరితలా

నిలిచిన హృదయం నాలో
      స్వేచ్ఛా కవితా రూపం.

మనిషి ప్రకృతి లోని విజయ శక్తితో
      నవ సమాజ నిర్మితిలో భాగమయి
కదలే హృదయం నాలో
      స్వేచ్ఛా కవితా రూపం

జన గళ రావానికి సహ స్వరమయి
      దీన లోక ముఖంలో వికసనమయి
వెలిగే హృదయం నాలో
      స్వేచ్ఛా కవితా రూపం.

తమ విశేష అస్తిత కొక రక్షణగా
      నిర్భయ సమ భావనతో కదలే
ప్రజతో ఒకటయి నాలో
      స్వేచ్ఛా కవితా రూపం.

బహు విశాల మానవీయ యుగంలో
      ప్రజాస్వామ్య దృశ్య మయం ఆల్బం.
చూపే కిరణం నాలో
      స్వేచ్ఛా కవితా రూపం.

స్వేచ్ఛా కవిత్వం
రెండవ భాగం - 22

# అద్దంలో ప్రజాస్వామ్యం

## (ఆయతనం)

**మాదిరాజు రంగారావు**

**2012**
రసధుని సాహితీ పరిషత్తు
శాంతినగర్, హైదరాబాద్ - 500 028

*Presented*

*to Mrs. HARITHA M.A. (Lit)*

*Detroit, M.I., USA*

*with*

*affection & blessings*

# ముందు మాట

ఈ కృతి 'అద్దంలో ప్రజాస్వామ్యం' (మరోపేరు 'ఆయతనం') ప్రధానంగా వర్తమాన సామాజిక రాజకీయ స్థితి చిత్రణం, ప్రకృతి నేపథ్యంగా ఉంది. నేడు సమాజంలో కనిపించే విషమ ధోరణులూ వికృత చర్యలూ అంతరించి రావలసిన మార్పులు సూచితం. ప్రగతి లక్ష్యంతో పాటు నైతిక మనో రూపం అవసరమూ భావితమయింది. దీనికి సంబంధించిన భావ స్థానాలతో వస్తువు సూత్ర రూపంలో ఉంది. దీని ఆధారంగా భౌతిక మానసిక స్థాయిల్లో చింతనతో పాటుగా సంకల్పంలో సదాశయాన్నీ కోరుతూంది. ఈ దిశలో సార్వకాలిక మయిన తాత్త్విక ప్రకాశమూ సార్వజనీన మయిన మానవీయ భావన దృష్టికి వస్తాయి. వ్యక్తి పరమయిన ఆలోచనతో పాటు సమాజ గతమయిన అనుభవాలూ కలిసిన దృశ్య పరంపరతో సన్నివేశ నిర్మితులు గోచరిస్తాయి.

రచనలో 'ఏలాంటి సంక్లిష్టతకూ తావు లేని విధంగా అభివ్యక్తిలో సూటిదనం పాటింపబడింది. కవిత్వ కళలో సంక్షిప్తత వ్యంజకత స్ఫూర్తికి వస్తాయి. భావ రూపాలూ ప్రతీకలూ కళాత్మక మయిన విలువల పయి దృష్టితో నిర్వణరూపాన్ని పొందాయి.

ప్రస్తుత సమాజంలో అనేక దుస్థితులకు కారణం, ప్రజా వ్యవస్థలో ప్రధానాంగా లయిన శాసన పాలన న్యాయ ప్రజా స్పందనం సరిగా పనిచేయక పోవడమే. వ్యక్తుల్లో నైతికత లోపించడమూ, అంతరంగ ప్రకాశంతో ఆయతనం మార్గదర్శకం కాకపోవడమూ. అద్దంలో ప్రజాస్వామ్యం ముక్కలు చెక్కలుగా బింబించడంలో, ఆదర్శాలు ఆశయాలు వాస్తవ జీవితంలో లోపించడం స్పష్టం. ప్రస్తుత సమాజంలో వ్యతిరేక ధోరణుల విధ్వంస పాత్రనూ గుర్తుకు తెస్తుంది.

అద్దం వర్తమానానికి చిహ్నం. దాని ప్రతిఫలన ప్రకాశ శక్తి అంతరంగానికి ప్రతీక. దీనికి దగ్గరగా ఉన్న ఆయతనం, (అంతరంగ, ప్రకాశ ప్రభావ ప్రసారం చేత) ప్రేరణ శక్తికీ, వివేక స్ఫూర్తికీ నిలయంగా ప్రతీకాత్మను పొందింది. ఆయతనానికి పై స్థాయిలో అంతరంగం, క్రింది స్థాయిలో జీవన వ్యవహారాలతో కూడిన లౌకిక ప్రపంచం కనిపిస్తాయి. ఇదీ కావ్య నిర్మాణం లోని అమరిక. సార్వకాలికమయిన తాత్విక స్పర్శ విషయానికి నిండుదనాన్ని కలిగిస్తూంది.

వర్తమాన సమాజంలో ఎదురయ్యే అనేకమయిన స్థితిగతులూ జీవితాంశాల సారభూతమయిన చిత్రణంతో కవిత్వ కళను విస్మరించని తాత్త్విక స్పర్శతో తలపుకు వస్తాయి. ఈ విధంగా ఈ కృతి ఆధునిక చేతనతో ప్రజాస్వామ్య దార్శనికతను కలిగిందీ. స్వేచ్ఛా కవిత్వంలో పేర్కోదగిన ప్రత్యేకతను కలిగిందీ.

– మాదిరాజు రంగారావు

# సూచిక


| | | పుట |
|---|---|---|
| 1. | ప్రవేశ నిలయం | 1 |
| 2. | ఆయతనం వెలుగులో | 2 |
| 3. | సహభావనలో | 3 |
| 4. | చక్రం పయి తిప్పే నిరంకుశం | 4 |
| 5. | మరో దారి లేనట్లుగా | 5 |
| 6. | ఎదురుపడే నల్ల పిల్లిలా | 6 |
| 7. | మౌన బంధంలో | 7 |
| 8. | పత్రికలో పతాక శీర్షిక | 8 |
| 9. | ఆశాపీఠం | 9 |
| 10. | అసలు మిగిలీ | 10 |
| 11. | సమాజ వాహనం పయి | 11 |
| 12. | ఆకర్షణ శాలలో | 12 |
| 13. | మొదటి చివరి క్షణాలు | 13 |
| 14. | విరామ స్వరం | 14 |
| 15. | అడ్డదారిలో | 15 |
| 16. | జలదం! మానసికం | 16 |
| 17. | హెచ్చరిక! సూచన! | 17 |
| 18. | అణువణువూ స్పందనతో | 18 |
| 19. | మానవీయ స్వరమొకటే | 19 |
| 20. | సందేహం మూటతో ఉపదేశం పెట్టితో | 20 |
| 21. | స్వాగతరూపం పొందాలని | 21 |
| 22. | సమాజ స్పృహతో | 22 |
| 23. | అగ్నిపథం చూపుతుంది | 23 |
| 24. | కాలానికి నీలి దుస్తులు తొడిగీ | 24 |
| 25. | జలసమాధి అవుతుంది | 25 |

26. ముళ్ళూ! పూలూ! 26
27. జ్ఞాపకంలో అపూర్వం 27
28. పీలికలయిన మానుష రూపం 28
29. మరచిన బాధ్యత 29
30. చెల్లుతూ పోతే చాలు 30
31. రాత్రి వస్తేనే! గడిస్తేనే! 31
32. తనదీ తన ఇష్టం 32
33. సృజనశక్తి తోనే 33
34. అస్తిత్వం నిలుపుతుంది 34
35. జీవిత చలనంలో కీలకం 35
36. క్షణం నుండి క్షణం మార్పులో 36
37. ఇరువైపుల నుండీ ఒకటయి 37
38. ఆయతన కాంతిలో 38
39. వదలని అనుబంధంతో 39
40. వర్తమాన కావ్యం 40
41. హేతువు మెరపులో 41
42. బరువు మనసుతో 42
43. ఏకాంతం ఎక్కడుంది మనసులో 43
44. కాలం చేతుల్లో 44
45. సమ చేతనలో 45
46. ఏడాది మొదటి రోజు 46
47. ఉగాది రోజు 47
48. ఈరోజు నవారంభం 48
49. ఉద్యమంలోకి పీఠికగా 49
50. ముక్కలుగా అద్దంలో ప్రజాస్వామ్యం 50
51. పత్రికలో కార్టూన్ 51
52. ఎచిలెస్ హీల్ 52

# 1. ప్రవేశ నిలయం

సింహ ద్వారం తలుపులు తెరవబడీ
నవ సమాజ చేతన ప్రేరణతో ఆయతనం
అంతరంగ ప్రవేశాని కందే దూరంలో
ప్రతి వ్యక్తికీ ప్రవేశనీయ పుష్పక నిలయం.

నిర్బంధం లేదు ఇచట ఒంటరి స్థితి లేదు
విశాలమయిన అవకాశ వికాస నిలయం,
ఎంతటి శిల్ప కళా సౌధాలయినా
దీని ముందు చిన్న పిల్లలే.

పగలు వెన్నెల ఆలోచనతో
మనసు కదలాలనీ నిర్మలంగా
రాత్రి అభయ కాంతి ముద్రలో
ఊహలు వెలగాలనీ నిర్భయంగా

బాల్యంలో ముద్ర పడిన జ్ఞాపకాలతో
చూచిన దృశ్యాలూ విన్న మాటలూ
మనసులో దాగీ సమయం కయి వేచీ
తీరానికి చేరే అలల్లా ఒకటొకటీ,
రాత్రి చంద్ర కళల్లానో చుక్కల్లానో
పగలు మబ్బు నీడల్లోనో ఆలోచనలో.

మానవ హక్కుల వేదిక అనుబంధంతో
ఉదార కరాలతో ప్రజాస్వామ్య రూపం,
మానవీయ చింనలో సమాజ కేంద్రం
ఆశయాల సాధనలో లౌకిక మాయతనం.

## 2. ఆయతనం వెలుగులో

ఆయతనం అంచున విశ్వ సమాజం
మానవ సమూహాల జీవన చరణాలతో
ఆయతనంతో రహస్య మానస లోకం
లౌకిక గమనానికి తీరూ తెన్నుల నిస్తూ.

జీవన చలనంలో చర్యలు ప్రతి చర్యలలో
ప్రాక్ జీవిత చిహ్నాలొకటొకటీ అపుడపుడూ
హుంకారంలో ఉద్వేగం పొంగుతుంది
హాహారవంలో కారుణ్యం ఒలుకుతుంది
ఓహోరవంతో పరవశత నింపుతుంది
ఆహాపదంతో అందల మెక్కిస్తుంది.

దేశ మేదయినా మానస ప్రపంచ మొకటే
చూడని పుటల్ని తెరచి చూపుతుంది
గతం పునర్నిర్మితిలో ఉత్సాహం చూపుతుంది
పెట్టెలో పాత నాణెం చేతిలో ఆడినట్లు!

మానుష బంధాలతో కొత్త పరిచయం
వర్తమాన పద గతిలో వేగం తెస్తుంది
ఉల్లాసం చిమ్ముతుంది కొత్త ముఖంలో
ఉత్తేజం నింపుతుంది కొత్త బలంతో

జీవ శాలి అయిన మనసు శూన్యంగా మారదు
రాలేవి రాలుతూ, కొత్త వాటితో పచ్చగా
మారే గుణాల పాత్రలతో జీవిత దృశ్యం
ఆయతనం వెలుగులో సమాజ సన్నివేశం!

# 3. సహభావనలో

నలు వైపుల నుండీ రైళ్ళకు జంక్షన్‌లా
ఆలోచనా రూపాలకు కేంద్రం ఆయతనం
ఆయతనం వదలి లేదు జీవితం
అంతరంగ స్పర్శ లేని వ్యక్తిత్వం లేదు

చీకటి ముడి విప్పే వెలుగు కరాలకు
అందని ఎత్తులో అంతరంగ బింబం
విశాలావకాశ సమాజ క్షేత్రాల్లో
కాలాశ్వం పయి మనీష! పరీక్షలో

ప్రతి హృదిలో ఆంతర భాషణం
ఏదో ఒక విశేష క్షణంలో
ఆ సమయానికి సూచనగానో
ఆ తదుపరి ఉపదేశంగానో
ఎవరికి వినిపించినా వినిపించక పోయినా
కవికి మాత్రం తప్పక వినిపిస్తుంది.

ఆంతర భాషణలో ఆర్ద్ర తరంగం
రణ పిపాసి అశోకుని శాంతిని ప్రియుని చేసింది
కల్పనలో ఊహను వాస్తవానికి దింపుతూ
దారి తప్పిన మనసును ఆయతనముఖం పట్టిస్తుంది

విశ్వంభర భౌతిక మాధార తలం
ఆయతనం మానస చైతన్య యుతం
రెండింటి సహ భావనలో పూర్ణత
ప్రజాస్వామ్య సమాజాని కవసర రూపం!

# 4. చక్రం పయి తిప్పే నిరంకుశం

తన చుట్టూ చక్రం పయి తిప్పుతుంది నిరంకుశం
మనిషిని నిలిపేస్తూ ఉన్న చోటునే
చేరాలిసిన గమ్యం చేరకుండా
చూడాలిసిన దృశ్యం! చూడకుండా.

భ్రమణంలో రాజకీయ పీఠం పయి
అధికారంలో నాయకులు సాలభంజికల్లా
ఒక దోష కళంకం మృగ మయి
బయట పడుతుంది బాధాకర మయి
నిప్పుల మెట్ల పయి నడిపించ వచ్చు
కత్తుల బోను లోకి నెట్ట వచ్చు

గాయం పయి కప్పిన శాలువాలా
వాస్తవం కనిపించని ప్రచారాకర్షణం
పైకి ఉల్లాసంగా అమాయకంగా
అసలు సమస్యను ఎక్కడో దాచేస్తుంది!

రోజు కొక తేది కాలెండెర్‌లో
ఆరోహణం లో దాటే మెట్టులా
అడుగు జాడ పడని రోజు
మునిషి పై నీడ విసరి పోతుంది

పూలతో మేల్కొన్న చెట్టు
కావలసిన నవతను సూచిస్తుంది
అలలతో ప్రవహించే నది
ఆర్ద్రత గల నడతను తలపిస్తుంది.

## 5. మరో దారి లేనట్లుగా

సూర్యునికి స్వాగతం తో పని లేదు
చంద్రునికి ఆహ్వానం తో పని లేదు
ఇరువురూ వేళకు తమ తమ విధుల్లో
జీవిత రహస్యానికి వెలుగుల భాష్యాల్లా

అనుమానాల పొరలు ఒలుస్తూ
సందేహాల తెరలు దించుతూ
సమస్య మోసుకొనీ నడచే మనిషలో
దృష్టి కందని జీవిత రహస్యా లెన్నో

నీటిలో అలల మధ్య ఈదాలిసి వస్తుంది
తడిసి ముద్ద అయినా లోపలి తేజం ఆరదు!
స్పందించే హృదయంతో తీరం చేర్చే
జీవన శక్తికి వెచ్చని వాహన మవుతుంది.

దారిలో అక్కడక్కడా ఆటంకంగా
దాట రాని ఇనుప కంచెల చుట్టలు
సమస్యల ముళ్ళ మధ్య గులాబీలు
చూడాలనీ! లోపలి కిరణానికి కోరిక!

నిన్న ఒక దేశం, నేడు లిబియా క్షిపణి దాడులతో
జీవితాల్ని దారం తెగిన పతంగుల్ని చేస్తూ
శరీరాల్ని మునిగే కాగితపు పడవల్ని చేస్తూ
సమస్యల పరిష్కారంలో సంహరణ రణ సన్నివేశం
మరో దారి లేనట్లుగా రాజనీతి జడతలో!
మసి బారిన బీభత్స ప్రజాస్వామ్య వాలకం!

# 6. ఎదురుపడే నల్ల పిల్లిలా

ఓటమి జ్వలనంతో నిష్క్రమించే సూర్యుడు
గెలుపు వెలుగు ముఖంతో తిరిగి వస్తాడు

మిగిలిన నిన్నటి మాటలతో చర్యలతో
నేడు! ముందుకు సాగుతుంది స్మృతులతో
కొన్ని ఉండి పోతాయి! శిథిలాల శకలాలుగా
చరిత్రలో పురా వస్తు రూపాలుగా!

నిజం నిలకడ పయి తెలుస్తుందనీ
ఆ నిలకడ ఎక్కడ? ఎపుడో? కానీ
నిజం అంతరంగంలో మెరసే వజ్రం!

ధర్మం చివరకు తప్పక గెలుస్తుందనీ
ఆ చివర ఎక్కడ? ఎపుడో? కానీ
ధర్మం అంతరంగంలో కదలే ప్రవాహం!

ఆలయ ద్వారం కనిపించి నంత సులభంగా
మనిషికి తన హృదయ ద్వారం కనిపించదు
ప్రార్థనలో బాధ్యత దేవత పైకి మారుతుంది
మరో బరువుకు మనసు సిద్ధ మవుతుంది.

ఒక వైపు పదును బ్లేడు! మరో వైపు పూల రెమ్మ
అవసరాని కెన్ను కునే బాధ్యత మనిషిదీ!

నల్ల పిల్లిలా చీకటి! మెరసే చుక్కల కళ్ళతో
దారి చూపేది కాదు, ధైర్యం నిలిపేదీ కాదు

అంతరంగ దర్శనానికి! అంతర్నయన మవసరం
ఎదురు పడే నల్ల పిల్లిలా మారిన ప్రజాస్వామ్యంలో.

# 7. మౌన బంధంలో

తెర వెనక్కి వెళ్ళిన సూర్యుడు
తిరిగి తెర ముందుకు వస్తూనే
పాత్రల చర్యలతో దృశ్యం మారుతుంది
సరి కొత్త సన్నివేశంతో సమాజం!

దాహం గురించీ ఆకలి గురించీ తెలియ నట్లు
ఎవరూ ఎవరికీ బోధించ నవసరం లేదు
ఇవి తీరేందుకు కఠోర శ్రమ యంత్రాలయి కొందరు
ప్రచార రథాల పయి ఉపదేశాలతో కొందరు

ఏదో దాహంతో ఆకలితో మానసికంగా
వైరం రాజుకొనే నిప్పులా! విడదీస్తుంది
స్నేహం అందుకొనే నీరులా! కలిపేస్తుంది
ఇదొక నిర్ణీత విధం లేని లౌకిక వ్యవహారం

వికాస హృదయంతో పూల వన మయి
రోజు వస్తుంది! ఎన్ని విలువల తోనో
ఆగ్రహ విస్ఫోటంలో మృత్యు పాత్రతో
వెళ్ళి పోతుంది! అనుకోని గాయాలతో!

ధైర్యాలతో అలల పయి ఈదే శరీరం
అపాయ లిప్తలో జల సమాధి అవుతుంది.

అణువుల్ని నెత్తురు చుక్కలతో మెరపిస్తూ
క్షణాల్ని మండే కణాలుగా తలపిస్తూ
ఎవరి చర్యలలో వారు మతి ప్రభలతో
కర్ఫ్యూలో నగరం! మౌన బంధంలో ప్రజాస్వామ్యం.

# 8. పత్రికలో పతాక శీర్షిక

దినమణి బింబంతో మస్తిష్కంలో
గగన మెత్తు ఎదగాలని మనిషి లో
చేయి వేళ్ళ కొనల పయి కోరిక లెగురుతూ
చిటికెల పయి చేతల పందిరి చూపాలనీ

ఏ నీలి రహస్యంలోనో అణగి మణగి ఉన్నది
ఏ స్కాం లోనో తేలుతుంది! అసలు ముఖం

మెజిషియన్ ప్రదర్శనలో బెలూన్ లా ఎగిరి
రిబ్బన్ లా సాగి పామయి తాడయి ముక్క లయి
మాయ మయ్యే ఇంద్ర జాల దృశ్యం కాదు!
జీవిత మొక సజీవ వాస్తవ సమస్యల రూపం.

మిథ్యలో ఆకర్షణ నిజంలో ఉండదు
మనిషి ఎప్పటికీ నిజానికి దూరం గానే
భ్రమకు వశ మయినట్లు మనసు
యథార్థ బిందువు పై నిలవదు; రేఖ పయి సాగదు

ప్రతి దశలో దిశ మారే రాజకీయ గతిలో
పాలక ప్రతిపక్ష సమూహాల ఎత్తులు!
చీకట్లను తరిమేసే వెలుగుల వెనకనే
వెలుగుల్ని చుట్టు ముట్టే చీకటి మూకలూ

కొత్త బ్లేడు అంచులో పదునుతో
ముందుకు సాగే దృష్టి రేఖ పయి
వార్తా పత్రికలో పతాక శీర్షిక
ప్రజాస్వామ్య స్వేచ్ఛలో అనల స్పర్శలో.

# 9. ఆశాపీఠం

ఆశా పీఠం పయి చూపుతో
        అది పొందే దాకా ఆరాటం! ఆవేశం
కూర్చున్నా నిలుచున్నా పడుకున్నా
        దగ్గర కొస్తే తెలుస్తుంది వాస్తవం
తన కెంత ఎడంలో ఉందీ
        అది ఎవరి వశమయి పోయేదీ

తానను కున్నవి ముళ్ళుగా తేలి
        తానను కోనివి పూలుగా విరిసి
పీఠం చుట్టూ తిరిగే ఈహలు
        ఆశలు పాతవి! అనుభవాలు కొత్తవి.

దొరకని పీఠం పయి మోజులో
        మనసు అగ్ని శిఖర మవుతుంది
ప్రాప్తి కయి ఎంత కయిన సిద్ధ మయి
        చేతిలో ఆయుధం! మృగ మయ మవుతుంది

కాలం కదలడానికీ బ్రతుకు తరలడానికీ నడుమ
        అంతరం! అఖాతమయి యత్నం! అర్థ రహిత మవుతుంది
జీవిత మొక రొబోట్‌కు ప్రతిరూప మయి
        మనిషిలో మానవతను గగన కుసుమం చేస్తుంది.

కాలం గడవడానికీ బ్రతుకు నడవడానికీ నడుమ
        అంతరం! అంతరించి, యత్నం! అర్థ సహిత మవుతుంది

అణువణువూ వికసించే స్వేచ్ఛతో అందరినీ
        పీఠానికి సంసిద్ధం చేస్తుంది! ప్రజాస్వామ్యం.

## 10. అసలు మిగిలీ

అధికార పీఠం పయి ఆలోచనతో
అది పొందే దాకా ఆవేదన! ఆందోళన!
తన భావం పర భేదం కలిసిన బ్రతుకులో
మెరసే చుక్కల అంకెల్లో కోర్కెలు

చిన్న చీమ మోసే బరువు నుండి
మస్కిష్కం పై తరగని గగనం వరకూ
ఎన్నిటి పయినో కోరిక! అన్నిటితో ఏదో బంధం!
మనసు లో సంకల్పం! విశ్వమయ మయి!

గతం నుండి సులభంగా వేరయ్యే మనసుకు
గతం లోకి అవలీలగ వెళ్ళే గుణమూ ఉంది.

ఒక్కొక విత్తులో ఒక్కొక జాతి గుణం
అన్నిటికీ నిలయం! అరణ్యానీ సమాజం

ఒకరి జీవితం మరొకరికి
లిపి తెలియని పుస్తకం
లిపి తెలిసీ! విషయం మాత్రం
తన చుట్టూ కదలే సమాజం!

పంచాంగంలో అదృష్ట బిందువు
గనిలో దాగిన వజ్రంలా
త్రవ్వే ఓపిక కోద్దీ బయట పడుతూ
రహస్య మెంతో ఇంకా లోపల దాగీ!

తీర్చ లేని రుణం పయి వడ్డీలా
కవిత! ఎంత చెప్పినా! అసలు మిగిలి ఇంకా!

## 11. సమాజ వాహనం పయి

పగలు వెలుగు వలలో
రాత్రి వెన్నెల వలలో
మధ్య మధ్య చీకటి బోనులో
ఏదో ఒక బంధనలో జీవితం

ప్రకృతిలో భాగమయిన ఊరు
యాంత్రిక బంధనలో నగర మవుతూంది
తన వద్దకు చేరే ప్రతి వ్యక్తినీ
తనలో భాగంగా ఇముడ్చు కుంటుంది.

వచ్చే ఏ అతిథినీ తిరస్కరించదు
వినిపించే ఏ భాషనూ బహిష్కరించదు
ఏ మార్గంలో ఊహనూ నిరాకరించదు
అందరికీ జీవన గతి చూపడమే లక్ష్యం!

నగరం మృగ తృష్ణ కాదు
క్రూర మృగం అసలు కాదు

క్షణాలను శాసిస్తూ మార్పులతో
నడచే చరిత్రకు సాక్షి నగరం
మెడలో వ్రేలాడే ఆభరణాలతో పాటు
పేరు పేరునా ధరించే కపాల మాలలూ!

ఇచట వ్యర్థ పదం వినిపించదు
కలలు లేని ముఖం కనిపించదు
తీరని సమస్యల బరువుతో కదలే
సమాజ వాహనం పయి ప్రజాస్వామ్య కేతనం!

## 12. ఆకర్షణ శాలలో

స్వర్ణ ప్రతిమ లా నగరం భద్రం కర ముద్రలో
బ్రతుకు పయి ఆశను నిలిపే సంపద మయ మయి
రాజకీయ చేతనకూ ప్రశ్నించే హక్కుకూ ప్రేరణం
మానవీయ యుక్తికీ యాంత్రిక శక్తికీ చిహ్నాం.

ఆగని చలనంలో చాలన సంరంభంలో
మనిషి అస్తితకు శిఖర మకుటం
జడతను విదలించీ కాలాన్ని పరుగెత్తిస్తుంది
జీవిక కాధారంగా అభయ హస్త మిస్తుంది

బహుళ జాతి ప్రజల మధ్య శ్రమ రూపంలో
ఏదో ఒక శ్రేణిలో ఒదిగే లా
సమయానికి వలసిన వేషం ఇస్తుంది
బ్రతుకు తెరువు చిరునామా మారుతుంది.

శబ్ద లహరుల జలధిలో ద్వీపంలా
నిశ్శబ్దాని కవకాశం దొరకనీదు నగరం
హృదయ తంత్రు లొకటే అయినా
వినిపించే శ్రుతిలో స్వర భేదా లెన్నో!

జీవితం ప్రవాహమయం అలలతో తరలుతుంది
కలలు మాత్రం! శిలలుగా తీరాన నిలుస్తాయి

వనిలో పచ్చిక బయలు పయి తిరిగే హరిణం
క్షుధలో మాటు నుండి బయటపడే సింహం
రెండూ నగరం బోనులో ఆకర్షణ శాలలో
మనిషి ప్రజ్ఞకు గుర్తుగా విజ్ఞాన వినోద కరంగా.

## 13. మొదటి చివరి క్షణాలు

ఆయుధ మయ్యే కన్నా మనసుకు
వాద్య విశేష మవడం ఇష్టం.

హింసను శబ్దిస్తుంది ఆయుధం
విషాద స్వర చక్రం తిరుగుతుంది
బ్రతుకులో బలవంతపు మలుపును తెస్తుంది
స్మృతి పటాన్ని గాయంతో చిత్రిస్తుంది.

అనుభవాల జ్ఞాపకాలు! ఒకటొకటీ
ఒక విధంగా వరం! మరో విధంగా శాపం!
గాయం ఎరగని మనసు లేదు
కావాలని గాయ పరచడం అమానుషం!

ఆత్మ హత్యకు సాహసంతో పనిలేదు
ఉద్రేకం నింపుతుంది ఆపద గుండంలో
నిరాశ నిస్పృహ రెక్కల పయి ఎగిరే
మనసులో వివేక మదృశ్యమయి పోతుంది.

అంతరంగాన్ని పదిల పరచి అల్మెరాలో
వాస్తవ జగత్తు లోకి దిగే మనిషి ముందు
అవరోధం! వ్యతిరేకం! ఘర్షణ! ప్రతి దశలో
ఆయతన కాంతి లేని ప్రభావం స్పష్టంగా

వెనుక నుండి దారం కదలికలో బొమ్మలా
సమస్యల ఒత్తిడిలో యంత్రమయిన రోజు!
పాటకు పల్లవిలా మొదలవుతుంది మొదటి క్షణం!
సంధి వచనంతో నిష్క్రమిస్తుంది చివరి క్షణం!

## 14. విరామ స్వరం

సమాజంలో మనిషి అవసరాలకూ
శ్రమ ఫలం! పొందడానికీ మధ్య
ఎదురయ్యే సమస్యలెన్నో! ఒకటొకటీ
శక్తి యుక్తి నీతులకు పరీక్షగా.

జల ధారలు వరదలు పెను తుపానుతో
నీటికి కరువును తెచ్చే ఎండల ప్రతాపంలో
కష్టాల కంటకాల మధ్య ఎదుగుతూ
సమస్యల సర్ప భయం మధ్య బ్రతుకుతూ
గాలిలో పూవులా కదలే మనసు
నింగిలో పక్షిలా స్వేచ్ఛను కోరేను.

సందేహం, అడుగుల్ని బంధిస్తుంది
లేని గోడల్ని నిర్మిస్తుంది
ఉపదేశం, అడుగుల్ని నడిపిస్తుంది
ఉన్న గోడల్ని తొలగిస్తుంది.

సమస్య లేని జీవితం లేదు
ఆయుధం ఎరగని రాజ్యం లేదు
యుద్ధం చేయని దేశం లేదు
రణ చరిత్ర లేని సమాజం లేదు.

శ్రమ జీవన యంత్ర మయిన మనిషి
రుతువు నుండి రుతువుకు దశదశలో
సమస్యకూ సమస్యకూ మధ్య వంతెన పయి
విరామ స్వరం వినిపించేను స్వేచ్ఛగా.

## 15. అడ్డదారిలో

దేశ శరీరం! ప్రజ! సమాజ గతిలో
వర్తమాన భాగ్యం కయి! యత్నంలో నిరీక్షణం

ఊరు బాట! ప్రకృతి సీను అంచునుండి
నగర పథం! యంత్ర మయ సమాజం లోకి

మనిషికి మనుషులతో పరిచయం పెరిగీ
స్వేచ్ఛకు సందర్భం విశాలతర మవుతూంది
సంభాషణ మొదలయి మధ్య నున్న
సరిహద్దులు చెరగి పోతాయి

మాట మనిషికి సాధన మయి
మాట మనసుకు ప్రేరణ మయి
ఉన్నవీ లేనివీ సందేహాలతో హద్దులు
ఏవేవో భయాలతో అడ్డంకులు గోడలు
హద్దులు! గోడలు! తప్పని బ్రతుకులో
వైరం ఘర్షణ సాధారణ మయిపోతాయి.

బోను నుండి బయట పడే సింహం
అడవి స్వేఛ్ఛ పొందాలని కోరుతుంది
పంజరం నుండి వెడలీ పావురం
గగన స్వేఛ్ఛ పొందాలని కోరుతుంది.

మనిషి మాత్రం హద్దులలో గోడల మధ్య
గడపక తప్పని స్థితిలో మనసును బంధించీ,
ఆయతనం వెలుపల! అడ్డదారిలో అనుక్షణం!
ఇంద్రజాల సమాజం కయి! ప్రజాస్వామ్యంలో.

# 16. జలదం! మానసికం

మనిషి వెనక గతం! గభీర మహా సముద్రం
మనిషి ముందు వర్తమాన తీర వనం
చుట్టూ సహస్ర ముఖాలతో విరాట్ సమాజం
మనో దాహం తీర్చే జలదం కయి నిరీక్షణం
దాహంతో ఉన్న మనిషి ప్రాణం నిలిచేందుకు
నీరును పొందేందుకు వీలు కాని సముద్రం.

ప్రకృతి పయి ప్రాణి పయి కరుణతో అపుడపుడూ
జలదాన్ని వదలుతుంది! స్వాదు జలం నింపీ
పైన గాలి చేతుల్లో శిశువులా జలదం
కదలుతూ వితరణలో వర్షీయస మవుతుంది
నేల పయి విత్తనం జీవ కణంతో
పైకి సాగే ఉత్సాహం నింపుతుంది.

చెలరేగే అనల దృశ్యం చూచి నంత శ్రద్ధగా
తాపం తీర్చే జలదం పయి చూపు నిలవదు
విశ్వ హితం కయి దయచేసే జలదం
కాలం వేసే ప్రశ్నకు సమాధాన కేతనం.

బ్రతుకులో సంతాపం సంవేదనతో
గడపక తప్పని జటిల సమస్యలో
తమలో మనో జలద రూపం మరచి
ఆర్తిలో జలధి వైపు పరుగెత్తేరు

యంత్రంలో భాగమయి పోయే మానసికం
జలద స్వేచ్ఛ పొందాలనుకోవడం అవసరం.

## 17. హెచ్చరిక! సూచన!

వచ్చే జలదాని కెవరి అనుమతితో పనిలేదు
కోట గోడ లెరగని స్వేచ్ఛా స్థాయిలో కదలుతుంది
సమ గుణ జలాలతో పచ్చని బ్రతుకుల కయి
అవని పయి విషమ తలాలను కలిపేస్తుంది

ఎండకు విడి పోయిన రేణువు రేణువునూ
కలుపుతుంది పెంచుతుంది సృజన బంధం

ఉదార ధారా కరాలతో హత్తుకొనీ
కదల్లేని కొండల్ని ఆర్ద్రతతో నిమురుతుంది
తన కయి చూచే దీన శుష్క తరువును
రసమయ స్పర్శతో సార్థకం చేస్తుంది

రుతువు మొదటి చినుకుతో పులకరించి
మనసు ఇంద్ర ధనుసును బింబిస్తుంది
ఊహ మెరపు తోటగా మారుతుంది
నవ జీవన ధనంతో అవని పరవశిస్తుంది

జలద మంటే ఎవరికి బహు ప్రియం కాదు!
కొందరికి ప్రకృతి ఇచ్చే బహుమానం!
స్మృతులకు పరిమళాలను హత్తుతూ
ప్రాణ బంధువులా దయ చేస్తుంది

తానే ఒక వాహనమయి మనోరూపానికి
మరో జగంలోకి ప్రవేశ పెడుతుంది
పిడుగులతో జీవితాన్ని హెచ్చరిస్తుంది
మెరపులతో భవిష్యత్తును సూచిస్తుంది.

## 18. అణువణువూ స్పందనతో

కాలానికీ స్థలానికీ అతీతమయి
అంతరంగ దీప్తి స్పర్శతో ఆయతనం
అనుభవమూ ఆలోచన ఇరు రెక్కల పయి
నైతిక లక్ష్యానికి హంసలా మనోరూపం!

నీడ నిచ్చే చెట్టు పూలతో పండ్లతో
వన దేవతగా కనిపిస్తుంది
దాహం తీర్చే నది ఆర్ద్ర కీర్తితో
జల దేవతగా కనిపిస్తుంది.

బ్రతుకంతా తన ఒడి వీడని అవని
మాతృ దేవతయై నిలుస్తుంది
మనిషి మాత్రం ఎప్పటికీ మనిషిగానే
అంత కన్న తక్కువగా ఊహలో చర్యలో

మనోగుహ నుండి ఉగ్ర నిశిత తీవ్ర రూపాలు
బయలు దేరి తిరుగుతాయి స్వేచ్ఛగా
చేయి విసరి దీపం ఆర్పేసేవీ
పిడికిలితో అసువులు తీసేసేవీ

ధూళి రేపి బురద చల్లి ముఖాల పయి
ప్రహసన వీథులయిన శాసన సభలలో
నినదించే కర్కశ గళ రవ గతులకు
క్షణాలు వాలి పోతున్నాయి భయ భయంగా

అస్థికల పయి వెలుగు లేని పిరమిడ్‌లా పెరిగే కన్నా
అణువణువూ స్పందనతో వెలిగే ఆయతనం అవసరం.

## 19. మానవీయ స్వరమొకటే

బీజ బీజం నుడి తరు వనంలా
బ్రతికే బహు జాతులతో మానవ సమాజం

ఒక ఏడు అనావృష్టితో
ఎండిన క్షేత్రంలా వేదనకు గురి అయి
ఒక ఏడు మహావృష్టితో
మునిగిన క్షేత్రంలా నిరాశకు వశమయి
కలల్ని వమ్ము చేస్తూ
కల్పనల్ని మాయం చేస్తూ
బ్రతుకును విశీర్ణ పరుస్తూ
దరిద్రానికి పీట వేస్తూ
పరిహాస మాడుతుంది ప్రకృతి
కర్షక జన జీవిత ప్రపంచంతో

ప్రకృతి దూకుడు అరికట్టేందుకు
మానవ శక్తి యుక్తు లెన్నో ఉపయోగంలో

కల నిజం కాదని అందరికీ తెలుసు
అయినా కలను ఆపే శక్తి ఎవరికుంది?

పేద గుడిసె అయినా భాగ్య సౌధ మయినా
నిలయం నిర్మాణంలో ఆశయ మూలం ఒకటే
విశ్వంభర తల మెంత విశాల మయినా
నడకలో దారి మాత్రం పరిమితిలోనే

చేతులెన్ని కెరటాల్లా పై కెగసి ఊగినా
గళ గళం నుండి వినిపించే మానవీయ స్వర మొకటే

## 20. సందేహం మూటతో

మనిషి మనిషిలో భిన్న మనో రీతులతో
తెలుపు నలుపు అడుగుల గుర్తులతో
దృశ్యం నుండి దృశ్యానికి సన్నివేశ రమ్యంగా
వైరుధ్య ప్రకారాలు జీవితావసరాలలో!

చల్లిన నూకల కయి వాలిన పక్షులు
ఆకలితో వలలో చిక్కిన ప్రాణులు
బయట పడాలనుకునే సామూహిక శక్తి
ఉద్యమ రూప మెత్తుతుంది! సమాజ లక్ష్యంలో

మానవ సంస్కృతీ విశాల ప్రదర్శనలో
ఏ శిల్ప కళా నిలయ మెంత గొప్ప దయినా
జీవిత నిర్మాణ కళకు మాదిరి మాత్రం కాదు
వ్యక్తి నుండి వ్యక్తికి భేదించే ఆయతనంతో

దూకే సమస్యల అలలతో ఎగసి పడుతూ
ముక్కలయి పో నున్నట్లుగా అనిపించే జీవితం
ముక్కలయి అదృశ్యం కాదు సరి కదా
తన అస్తితలో భాగమయి సమాజ శక్తిని పెంచుతుంది

సందేహాల మూటతో బయలుదేరి మనిషి
ఉపదేశాల పెట్టెతో ఇంటికి చేరేను
అనల రాగం వినిపిస్తూ అమృత రాగం వినాలనీ
సమస్య నుండి సమస్యకు పయనంలో!

భూమి పయి క్రోధ దహన శమనానికి
మస్తిష్కం పై నుండి కృపాసార హృదయ మవసరం.

# 21. స్వాగతరూపం పొందాలనీ

మనిషి విశ్వ చరిత తెలిసేందుకు
ఎన్ని దేశాలు చూడాలో! ప్రదేశాలు తిరగాలో!
కొండ గుహలు! అడవులు పల్లెలు పట్టణాలు
అక్క డొకటీ ఇక్క డొకటీ ఎక్క డెక్కడో ముక్కలుగా

నిజ రూపం తెలిసేందుకు ఎన్ని ప్రయత్నాలో?
హేతువు కందని సశేషాలెన్నో?
సశేషాల అన్వేషణం! తర తరాలుగా సాగుతుంది
వినోదానికీ కాదు! కాలక్షేపానికీ కాదు.

శిశు దశలో అమాయకంతో విషయం మారదు
నటన చూపి నిష్క్రమిస్తే సమస్య తీరదు

మ్రోడు నుండి చివురులా బ్రతుకులు
ఎడారిలో జల లహరిలా ఆశలు
ఊహతో క్రియా రూప మొకటయి
మానుష గుణ పూర్ణత అవసరం.

మంచులా గడ్డ కట్టిన ఆలోచన
హేతువుతో కరగి ముందుకు సాగాలనీ
గళంలో ఆగిపోయిన శబ్ద సారం
అర్థవంతమయి బయటికి రావాలనీ

దూర దూరం పడి ఉన్న ముక్కలు
ఒకటయి ఎదురుగ ఆకృతి నిలవాలనీ
దూర దూరాన వికసించిన పూలు కలిసి
గుత్తిగా ఆయతనం స్వాగతరూపం పొందాలనీ

# 22. సమాజ స్పృహతో

జీవిత భ్రమణంలో స్థలమూ కాలంతో
దిశ దిశలో దశలు దశలుగా వికాస సమాజం

చీకటి నుండి వెలుగులోకి రావడం
ఎపుడు బడితే అపుడు సాధ్యం కాదు
అపత్తు నుండి సత్తుకు చేరడం
ఎప్పటికీ ఎంతో దూరం మిగిలే ఉంటుంది
మృత్యువు నుండి అమృతానికి గమనం
ఎప్పటికీ సాధ్యం కాని సంకల్పం!

ఏది మంచి? ఏది చెడు? సందేహంలో
విషయం చేయి దాటి విశ్లేషణ కుపకరిస్తుంది.

సమాజ జలధిలో ద్వీపంలా జీవితం
ఇరు తీరాలలో స్వర్గమూ నరకమూ భావనలో
ఆకర్షణలో ఒకటీ, అపకర్షణలో మరొకటీ
కల్పనలో కాలక్షేపానికి బహు విచిత్ర దృశ్యాలతో

ఆయతన ప్రాంగణంలో బహు విధ ధ్వనుల్లో
మనిషి స్వరం గుర్తించడం కష్టం కాదు
ఒకటి విన వలసిందీ, మరొకటి వినక తప్పనిదీ
ఊహకూ చేష్టకూ మధ్య వంతెనలా శబ్దం

నిజ వ్యక్తిత్వంతో నడిచే మనిషులు
తత్కాలంలో తమ గుర్తులు వదలి పోతారు
వాటిని గుర్తించే బాధ్యత సమాజ స్పృహతో
వెనక నుండి వచ్చే వరసలో తరాలదీ!

## 23. అగ్నిపథం చూపుతుంది

శాంతి స్థాన మనుకుంది విలయ నిలయ మవుతూంది
కాంతి ధామ మనుకుంది, అగ్గి పెట్టెల మేడ అవుతూంది.
ఉషస్సు వేళకు ముఖం చాటేస్తూంది
మబ్బుల చాటునో! నిన్నటి పొగల మాటునో

సూర్య రశ్మి తొడుక్కునీ నగర సౌధ శిఖరాలు
తళతళలాడుతూ మెరిసి మురిసి పోతున్నాయి
బూది పొరలు పరచి నట్లున్న నేల
పచ్చదనం కయి తహ తహ లాడుతూంది.

కష్టాల్లో నిద్ర కుపక్రమించలేక
నష్టాల్లో కలలో విహరించలేక
చలన శక్తి నిలిచి పోయి మనిషి! వీధిలో
అడుగు నేల కంటుకొనీ శిల్పంలా!

ప్రాణం పోసే గాలి తప్పుకోలేదు
బరువును మోసే భూమి కాదనలేదు
మనుషుల మధ్యన కల్లోల వాతావరణంలో
ఊపిరి బిగిసి! మనిషి క్రుంగి పోయేను.

మంచు పొరలు చీల్చుకొని పోయే
జల ధారను ఈదుతూ పోయే
శక్తిలో 'ఆల్ ఇన్ వన్' మనిషి కిపుడు
గాలిలో వేడిని! భరించలేకుండా ఉంది.

ఉద్రేక స్ఫులింగం మెరసీ హఠాత్తుగా
కాలానికి అగ్ని పథం చూపిస్తూంది.

## 24. కాలానికి నీలి దుస్తులు తొడిగీ

ఉద్యమం పని విధ్వంసం కాదు
జడంలో నవ తేజం తేవడం

రంగుల దారాలతో అల్లిన వలల్లా
కొత్త కొత్త తీరులలో వ్యూహ రచనలో
రాత్రి సూర్యునిలా పగలు చంద్రునిలా
ఓటమి చూడని జీవిత విజయం లేదు

సమస్యను జటిలం చేసే స్వార్థ నీతిలో
దరిద్రాన్ని గెలవలేని విషమ ఘడియలో
బాధా ముద్రలతో మనోబలం తరిగీ
మరణ వరణ మొకటే శరణం కాదు.

జీవన నది కిరు తీరాలలో
అటు ప్రభుత్వమూ ఇటు సమూహాల నుండి
మంటల కాజ్యం అందకపోతే చాలన్నట్లుంది

ప్రజాస్వామ్య ప్రక్రియలో చతురుల ఆటంకాలెన్నో
కపట నటనలో వికట గతులలో
ప్రేక్షక పాత్రలో సానుభూతి ప్రకటనలు

అనల కీల కౌగిలిలో ఆవేశంలో
బూది బొమ్మగా మారి శరీరం
విషాద తీరం చేర్చే ప్రాణాంతక చర్య
ఎవరూ కోరనిదీ మెచ్చనిదీ ఆత్మహత్య!

మనిషిలో బ్రతికే ఇచ్ఛను రాయిగ మార్చి
కాలానికి నీలి దుస్తులు తొడిగి త్రిప్పుతూంది.

## 25. జలసమాధి అవుతుంది

పెను మంటల చిక్కు ముడులు విప్పేందుకు
నాయకుల ప్రయత్నాలు! విరామ సమయాలలో
చేతిలో బకెట్ నీళ్ళతో కొందరు
అవి ఎక్కడ పోయాలో తెలియక
మంటల చుట్టూ ప్రదక్షిణ చేస్తూ కొందరు
చలి మనసుకు కోష్ణ స్పర్శ కోరే కొందరు.

నెత్తురు చుక్క చూచి భయపడే కళ్ళు
బిగిసిన శరీరం చూచి నివ్వెరలో
కాలం గడుస్తూంది విషమ హృదయ లయతో
చుట్టలు చుట్టలుగా ఆక్రందన స్వరాలతో

రాజనీతి నిపుణతతో మెరుగు పడే సమస్య
ఆగ్రహ చర్యలతో ఉదగ్ర స్థాయి చేరుతూంది
మానవీయ స్పందనతో గెలవాలిసిన కాలం
కుటిల నీతిలో కండ బలంతో ముక్కలయి గతిస్తూంది.

ప్రేమ కరుణ ఉదార స్థానాలలో
భయం గొలిపే భీభత్స దృశ్యాలు!

ప్రజాస్వామ్య చేతనలో తెలిసిన విలువలు మరచీ
బాష్ప వాయు గోళాలూ పలెట్లూ
రబ్బరు బులెట్‌లూ ఒకదానిపైన మరొకటీ
చేసే పనికి మరింత పదును పెడుతున్నాయి

తీరం చేరేందుకు దాటే దేహం
సుడిగుండంలో జలసమాధి అవుతూంది.

## 26. ముళ్ళూ! పూలూ!

ఆయతనం వెలుపల లౌకిక ప్రపంచం
ఆయుధాన్ని కోరుతుంది ఆశా విస్తరణంలో
ఆయుధాన్ని నమ్ముతుంది విజయాశా శిఖరంకై
మనసే ఒక ఆయుధ మయి నిర్దయగా
హృదయాలను చీలుస్తూ పోవడం! అమానుషం
ప్రజాస్వామ్య సరస్సులో శవాలు తేలడం! విచిత్రం

అపాయకర దుస్థితిలో దీన హీన ప్రవాసాలు
ప్రమోదకర స్వరాలతో భోగ భాగ్య నివాసాలు
ఆర్జనలో రోహణలో విపణి వీధి సరణులు
భౌతికమూ మానసికమూ దాహం ఆకలితో భ్రమణం!

మనిషికి ప్రకృతితో పరిచయ మవసరం లేదు
మనిషికి మనిషితో పరిచయ సూత్రం అవసరం
స్నేహంతో మనసు మొగ్గ తొడుగుతుంది
ప్రేమతో వికసన పరిమళ మయ మవుతుంది

ఒంటరిలో శూన్యాన్ని భరించ లేరెవరూ
ఏదో ఒక రూపంలో సమాజ దర్శన మవసరం

ఒకరి భుజాల పయి కూర్చొని పోయే శరీరికి
మట్టి పై నడవడ మంటే! ఇష్టం ఉండదు.

అహంకారానికి అధికారం తోడయి
కళ్ళలో నీరు తెచ్చే చేతలకు ముళ్ళు మొలుస్తాయి
అహంకారానికి సేవామతి తోడయి
కళ్ళలో నీరు తుడిచే చేతులకు పూలు పూస్తాయి.

## 27. జ్ఞాపకంలో అపూర్వం

జ్ఞాపకాల కవధి లేదు సమయ నియతి లేనేలేదు
ఎప్పటివో ఇప్పటికీ మనో దర్పణంలో అపుడపుడూ

మనసులో చేరిన గాయా లొకటొకటీ
వరసగా అమర్చబడీ అల్మైరాలోలా!
ప్రదర్శన రూపం పొందుతాయి మాటలలో
లౌకికావసరాలలో విపణి వీధి చేరతాయి

గులాబి పూవుల్లా కనిపించే గాయాల్లో
మనిషి హృదయం కూడా ఒకటిగా చేర వచ్చు
వ్యాపారం లేంది లోక వృత్తం లేదు
విపణి వీధి లేని సమాజం లేదు

జ్ఞాపక శాలలో తిరుగుతూ ఎందరో
మాటలతో చేష్టలతో అపూర్వ సన్నివేశం
అణగి ఉన్న ప్రేమ! తీగె లాగ సాగుతుంది
ఎగిరి వచ్చే శాంతి! గుండె పై వాలుతుంది.

ఈ విశేష సంస్మృతి సమయంలో
కోపం ఊహకు రాదు, ద్వేషం తలపుకు రాదు
చిరు నవ్వుల మెరపులలో తేలుతూ
పూర్వపు పరిచితులూ స్నేహితులూ బంధువులూ

లౌకికాల కతీత మయిన ఆయతనంలో
బరువు నుండి తేలిక పడిన మనో రూపం
అంతరంగ ప్రకాశంలో జీవితాన్ని చూపిస్తుంది
మానవీయ ప్రపంచంలో సుందరతను తలపిస్తుంది.

## 28. పీలికలయిన మానుష రూపం

స్వేచ్ఛా చలన మెవరు ఆపగలరు?
ఒకే ఒక ఇనుప హస్తం తప్ప!
హృది సంస్పందన నెవరు నిలుప గలరు?
ఒకే ఒక మృత్యు ఘాతం తప్ప!

గగనంలో ఇంద్ర ధనుసులా సమాజం
ఒక సమయం మనసుకు అమరుతుంది దార్శనికంలో
ఊహకు విమాన యానం కల్పిస్తుంది
వంతెనలా మరో వైపుకు ఉపకరిస్తుంది

నింగిలో నీలి మబ్బుల్లా మనుషులు
ఎప్పటికీ మనసును ఆకర్షిస్తూ ప్రతి పనిలో
కురిసే వెన్నో కురవని వెన్నో మబ్బులు!
మనిషి కనే కలలకు పచ్చ దనాన్ని ఇస్తాయవే

దారిలో ఒక చిన్న ఎరుపు గుర్తు
సాగే పయనానికి బ్రేక్ వేస్తుంది.

ఒక బాష్ప కణంలో అగ్ని లవం చాలు!
విలయ దృశ్యం చూపడానికి
రగిలి పెరిగి ప్రతీకార శిఖ లొకటొకటీ
రణ పర్వానికి దారులుగా మారతాయి.

ఉద్రేకంలో వికృత చర్యకు మొదట బలి అయ్యేది
మనిషిని మురిపించే జీవన సంస్కృతి శిల్పం!
ఆయతనం వెలుపల చెదరిన ప్రస్వామ్య చిత్రం
పీలికలయి వ్రేలాడుతుంది మానుష సుందర రూపం.

# 29. మరచిన బాధ్యత

మ్రోడు మాను పయి నిలిచీ
        దాహంతో నలు వైపుల చూచే
పక్షిని తలపించే మనిషిని చూచి
        అందని జలాశయంలా ఆకాశం,
సిగ్గుతో తల వంచుకుంటుంది
        మబ్బు ముక్క ముఖం చాటేస్తుంది

మ్రోడు నుండి భూమి పైకి
        భూమి నుండి నింగి లోకి
చూపులు నిలిపీ ఎగురుగుతుంది పక్షి
        నిరీక్షా పటం పయి ఆశా చిత్రం తో

ఎక్కడో బావిలో నీరు లోతులో
        అది మనిషికి లభించే దెట్లా
నీటి కయి బావి లోకి దిగే వీలు లేదు
        నీరు పైకి తెచ్చే ఉపకరణ మవసరం!

నది అందరికీ అందుబాటులో ఉండదు
        సముద్ర జలాల్ని తాగే వీలూ లేదు

ఎక్కడి కక్కడ! నీలి రహస్య నిలయాల్లో
        ధన నిధుల్లా! భూమి పొరల క్రింద జలం!

తప్త హృదయంతో స్వాగతమిస్తూ
        ఎక్కడి కక్కడ ఎండిన జలాశయాలు!
శూన్య హస్తాలతో సానుభూతి ప్రకటిస్తూ.
        బాధ్యత మరచిన ప్రజాస్వామ్య యంత్రాంగం

## 30. చెల్లుతూ పోతే చాలు

చెల్లని నాణెం ఎక్కడి నుండో
        వచ్చి పడుతుంది అవలీలగా
ఎవరు కాదన్నా గుర్తించక పోయినా
        ఎవరినో ఒకరిని వరిస్తుంది
ఏదో ఒక విధంగా తప్పనిసరి అయి
        అప్పటి అవసరాన్ని తీరుస్తుంది

ఒకరి నుండి మరొకరికి చేరుతూ
        చెల్లని నాణెం చెల్లుతూ పోతుంది
ఒక సమయం నిరీక్షణలో
        తోడుగా మరొకటీ చేరుతుంది

చెల్లే దాని కన్నా చెల్లని దానికే
        ఒక్కొక సందర్భంలోఎక్కువ విలువ
జేబు నుండి సంచయన కేంద్రం చేరవచ్చు
        పర్సునుండి ప్రదర్శన శాలకు జారవచ్చు.

ఎప్పటి నుండో ఈ కథ
        ఇప్పటికీ ఎప్పటికీ
చెల్లే వాటితో కలిసిపోయి
        చెల్లనిదీ చెల్లుతూ పోతుంది.

గుర్తు పట్ట రాకుండా కళ్లు కప్పి
        అమాయకంగా రాజ పథంలోనూ
కారణ మేదయితేనేం! సమాజంలో
        చెల్లుతూ పోతే చాలు! ప్రజాస్వామ్యంలో.

## 31. రాత్రి వస్తేనే! గడిస్తేనే!

పర్వతం ముందు మనిషి
తనలో చేతన గర్వంతో
ప్రవాహం ముందు మనిషి
తనలో స్వేచ్ఛా దర్పంతో

మనిషి ఎదురుగా మరో మనిషి
తానొక ఉన్నత శిఖరంలా
తలపై విశాలాకాశంలా
విప్పారిన బాధ్యత మరచీ

అహంకార బీజం విప్పారి
చివురు వేసిన పూవు! పూవే!
ఏ రంగు అయినా, ఎన్ని రంగులున్నా
పరిమళ గుణ మున్నా, లేకపోయినా

కాలం గడచే కొద్దీ ఆదర్శం
చింతనలో ఘనీభవించి మార్పులతో
శిల్పంగా మలచి స్థిరపరచే వారూ
చలనంలో ప్రసార రూపం నిలిపే వారూ

ఎంతటి అహంకారం లోనూ మనిషిలో
తప్పని అవసరాలకు సిద్ధంగా మరో రూపం
పగలు పొంగే ప్రశ్నలకు బలంగా స్పందిస్తుంది
రాత్రి రాగానే మరచి, మొదటికి వస్తుంది

రాత్రి వస్తేనే రేపు అనేది సాధ్యం
రాత్రి గడిస్తేనే మరో సూర్యుని చూచేదీ.

# 32. తనదీ తన ఇష్టం

కెరటాల పయి తేలే పడవ
సముద్రం తనదే అన్నట్లు కదలుతుంది
గాలిలో ఎగిరే విహగం
గగనం తనదే అన్నట్లు ఎగురుతుంది

ప్రజలో కదలే మనిషికి
సమాజం తనదే! అన్నట్లు ఉంటుంది
ఎక్కడి నుండో చేరిన పక్షికి
పంజరం తనదే! అన్నట్లు ఉంటుంది

కొన్ని అడుగుల స్థలం దొరికితే చాలు!
అన్న కోరికలో సీమలతో మొదలయి
భూమిని శాసించే పీఠం కయి పోటీ!
పాలించే తంత్రం పయి మోజు మనిషిలో

ఇంటి నుండి బయటికి బ్రతుకు తెరువులో
తీరం నుండి నావ జలధి లోకి చేరినట్లు
బయటి నుండి ఇంటికి ఆత్మీయంగా
జలధి నుండి నావ తీరానికి చేరినట్లు

సీమ దాటి మరో సీమ లోకి నిరంతరం
ఆగని యంత్రంలా గమనాగమనం
అభినందనలో మెడలో పూల దండ పడవచ్చు
అభిశంసనలో మెడలో కాల మాల పడవచ్చు

శాసన సభలో వివిధ పక్షాల వికృత చర్యలకు
తెర వెనక్కి పోతూంది పాత్ర లేని ప్రజాస్వామ్యం

# 33. సృజనశక్తి తోనే

మంచుతో అవతార మెత్తిన ధవళ శిఖరం
కరుగుతుంది త్యాగంలో అర్థవంతమయి
ఎవరి మెప్పు పొందేందుకూ సరించదు ప్రవాహమై!

దాహం కయి చాచిన దోసిలి నింపుతూ
ఆకలి తీరేందుకు నేలను తడుపుతూ
వంపులలో వేగం అందుకొనీ
మలుపులలో పయనం దిశ మారీ
ప్రవహించి నంత మేర తీర భూమి చరిత్రలో
బ్రతుకులో వికాస శాంతి చిహ్న మవుతూంది

అభిషేకం శరీరాన్ని శుభ్రం చేస్తే
ఉపదేశం హృదయాన్ని స్వచ్ఛం చేస్తుంది

మంచులా పేరు కొన్న తర తరాల చరిత్ర
సంస్కృతిలో ప్రవహిస్తూ వర్తమాన సరణంలో
మనిషిలో దేవత! సూక్ష్మ సూక్ష్మ గతులలో
ఊహను ఆర్ద్రం చేస్తూ, మనసుకు పచ్చదనాన్ని ఇస్తూ

రాలిన కన్నీటి బిందువు ముందు
సముద్రం కాస్త వెనక్కి తగ్గుతుంది
ఊప్పదనాన్ని సహించకలేక కాదు
బిందువులో అనల స్పర్శ భరించలేక!

మనిషిలో ప్రవాహం జడీభూత మయిన వేళ
హిమ శిలనొక శిల్పంగానో రస తీర్థం గానో
మార్చేసే సాహసమొకటి! కవుల సృజన శక్తిలోనే

# 34. అస్తిత్వం నిలుపుతుంది

మనిషిలో హిమ సుందర శిల్పం
జీవిత మున్నంత వరకూ గుప్తంగా
ఇదొక శాంత రూప మనుకోవచ్చు

ఉల్లాసం ఉత్సాహం ఉద్రేకం ఉద్వేగంలో
సన సన్నగ మంచు కరగి రసమయ మయి
స్రవంతియై లోన తిరుగుతూ నిరంతరం
కళ్ళలో బిందువుగా చినుకు బయట పడవచ్చు

మనసులో శూన్య పదం! ఆకాశమయం
జీవిత మున్నంత వరకూ స్పష్టంగా
ఇది మౌన ముఖంలో బింబించవచ్చు.

ఆరాటం ఆవేశం ఆవేగం ఆనందంలో
నిశ్శబ్దం ముక్కలయి శబ్ద సమూహమయి
మాటలుగా బయటికి రావచ్చు
పాటలుగా బయట తిరగవచ్చు

తనువులో కోష్ణ వల్లి! బంగరు తీగెలా
జీవిత మున్నంత వరకూ మెరుస్తూ అందంగా
ఇదొక శక్తి ప్రకాశ రేఖ అనుకోవచ్చు.

శుభ్రంగా స్వచ్ఛంగా సుందరంగా
ఆయతనం అందుకొనీ అల్లుకొనీ.
జీవిత వనిలో భాగమయి
అంతరంగ ప్రకాశం కయి ఎదురు చూచే
మనిషిలో అస్తిత్వానికి ద్వారం నిలుపుతుంది

# 35. జీవిత చలనంలో కీలకం

భూగోళం ఒక వైపున పగలు
దాని వెనక మరో వైపు రాత్రి!

స్థలంతో మారే కాలమానంలో దృశ్యం వేరుగా
జనన మరణ దశలు లేని రవి తేజం! ఒకటే

ఎక్కడ చూచినా నేనెరిగిన మానవులే
మనసులలో వెలిగే దీపం ఒకటే
ఎండకూ వానకూ చలికీ మార్పులేని
ప్రకాశంతో మానవీయ సంస్కృతి ఒకటే

గోడల మధ్య పరిమిత మయి అవకాశం
బయట విశాలంగా ఆహ్వానం పలుకుతుంది ఆకాశం
ఇరు స్థాయిల్లో మనిషి జీవితం
భౌతిక మయి మానస మయి! కోర్కెలపై
పయనంలో విశాలతర మవుతూ పోతూ
నివాస స్థానంలో సీమిత మవుతూ

ప్రాణి నుండి ప్రకృతి నుండి వినబడే శబ్దం
మానవ స్వర చక్రం అంచులు చూపిస్తుంది
వ్యక్తి వాదమయినా సమాజ వాద మయినా
జీవిత చలనంలో మనోగుణం కీలకం.

చుట్టూ ఆకాశం సూర్యుడు భూమి అగ్ని ఉన్నా
మనిషికి సాక్షి! మనిషి మరో రూపమే
ఇంటర్నెట్ కలుపుతుంది దేశాన్నీ దేశాన్నీ
ఆలోచన కలుపుతుంది మనసునూ మనసునూ

## 36. క్షణం నుండి మార్పులో

వర్తమాన క్షణం మనిషి స్వంత మయి
ప్రేమ కరుణ కోప తాప స్పర్శతో
వాస్తవ కళ యై కదలుతుంది జీవితంలో
వేగవంతమయిన పాత్రను వహిస్తూ!

నిన్న పూలు ఉన్న తీగె
నేడు శూన్య ముఖం వేయొచ్చు
నేడు సరించే ప్రవాహం
రేపు మందగించనూ వచ్చు

గెలుపులో ఓటమిలో మనిషితో మనిషి
చేతులు కలిసీ అడుగులు వేస్తూ
నిరసనలో ప్రదర్శనలో గొంతులు కలుపుతూ
వర్తమాన క్షణాలతో సరికొత్త సమాజం.

ప్రమాణం చేసి పీఠ మెక్కిన మనసులో
ప్రతిధ్వనిస్తుంది! తానేది చేసినా ప్రజల కోస మనీ
చెవులు విప్పి కళ్ళు తెరచి పనిచేసే పత్రికలు
మనసును భద్రంగా అప్ప జెప్పి ఎవరికో!

అంతరంగ స్పృహ లేని ఆలోచనలతో
వేయి తలలు ఉన్నా పని చేయని మస్తిష్క శాల
వేయి కళ్ళు ఉన్నా దృష్టి పడని ముఖ వలయం.

విపణిలో వస్తువులా మారి పోయి మనిషి
ఎప్పు డెవరు ఏ వైపో! దేనికో? తెలియదు!
ఆదర్శం చెదరీ గమ్యం తప్పే ప్రజాస్వామ్యంలో.

## 37. ఇరువైపుల నుండీ ఒకటయి

ప్రతి కవి మనసులో మరో కవి
అద్దంలో బింబంలా ఆత్మ రవి
దూరమూ దగ్గర భేదం లేకుండా
తనలో సాధారణ జగతిని దాటీ.

ఆయతనానికి ద్వారంలా భావన
తలుపులు తెరచి ఉన్నా! సందేహం!
లోపల ఏముందో? అన్న భయంతో
లోపలి కడుగు వేయ నీయదు

జవాబు లేని ప్రశ్నతో ద్వారం వద్దనే
దొరికిన సమయం కాస్తా చెల్లి పోవచ్చు

ఒక పదంతో మరో పదం
పదం దాటి మరో పదం
గెలుపెవరి దన్న ప్రశ్న లేదు
గమనానికి రెండూ అవసరం.

ఒక చేయితో మరో చేయి
కలుస్తాయి స్వాగతానికీ సత్కారానికీ
గెలుపెవరి దన్న ప్రశ్న లేదు
సత్క్రియలో చేతులు రెండూ కలుస్తాయి!

ఆమె అతడు కలిసి బ్రతుకులో
శూన్యం నుండి పూర్ణ బింబ మయి
గెలుపెవరి దన్న ప్రశ్న రాదు
జీవిత సత్యాని కిరు వైపులయి.

## 38. ఆయతన కాంతిలో

రాబోయే చెట్టు బరువు గురించి
మొలిచే బీజం యోచించదు, బెంగ పడదు.

సమాధిలో అస్థి పంజరం
దహనంలో మిగిలిన అస్థికలూ
పరిశోధనకో సానుభూతికో పని కొస్తాయి
జీవిత రహస్య కోశాలను విప్ప లేవు

ఎంతటి విజ్ఞాన పాత్ర విభవంలోనూ
స్పందించే జీవిత రూపంతోనే సమాజం.

చూచే దృష్టి కోణంతో దిశ మారుతుంది
వెళ్ళే యాత్రా రూపాన్ని బట్టి వాహనమూ.
శిశు దశ నుండి మొదలయిన అనుబంధం
చిట్ట చివరి దాకా సాగుతుంది సమాజంతో

ఏకాంత మనేది మనో గుహలోనే సాధ్యం
స్మృతి చిత్రం మిగులుతుంది సమాజ మూలంతో
ఎంతటి గభీర సముద్ర మయినా
పైన కదలే అలల తోనే ఆకర్షణ!
చిట్ట చివర వ్రేలాడే పండ్లతో కొమ్మ వలె
ఎంతటి బరువునూ వహిస్తుంది మనోరూపం

విమాన యాన మయినా కాలి బాట అయినా
తెరచిన ఆయతన కాంతిలోనే పయనం
చూపుకీ సూర్యునికీ మధ్య కదలే
మంచు తెర! మబ్బు ముక్క! తాత్కాలికం!

## 39. వదలని అనుబంధంతో

రోజుకూ రోజుకూ మధ్య! నీలి తెర
అక్కడక్కడా మెరసే చుక్కల వెలుగులతో
ఆవల ఏముందో తెలియదు! ఎవరికీ!

మనిషికీ మనిషికీ మధ్య! నీలి తెర
పరిచయ స్నేహాల దీప కాంతులతో
ఆ వెనక ఏముందో! తెలియదు! మనసుకూ!

బ్రతుక్కీ బ్రతుక్కీ మధ్య! నీలి తెర
వెలిగే సమాజ చేతన కాంతితో
ఆ వెనక ఏముందో తెలియదు! మనిషికీ!

మనసుకూ ప్రపంచానికీ మధ్య వెలుగు తెర
నిలువునా అద్దంలా! బింబించే దృశ్యాలతో
మొదటి నుండీ చివరి దాకా వీడనిదీ
వ్యక్తికీ సమాజానికీ మధ్య ప్రవాహం
బ్రతికినంత కాలం సరిస్తూ నిరంతరం
ఒడ్డు నుండి ఒడ్డుకు దాటాలిసి వస్తూ

తెలిసిన దానికన్నా తెలియనిదే ఎక్కువగా
రోజు రోజుకీ, మనిషి మనిషికీ
బ్రతుకు బ్రతుక్కీ, వ్యక్తీ సమాజానికీ
ప్రపంచమూ మనసుకూ అనుబంధంతో అస్తిత్వం

కళ్ళముందు తమ అదుపుకు భౌతిక శక్తుల యత్నం
వెనుక నుండి మనస్తత్వ శక్తుల ప్రమేయం
అన్నిటికీ అతీతమయి! అంతరంగ దీప్తితో, ఆయతనం!

# 40. వర్తమాన కావ్యం

ఆగని ధునీ చరణాలతో వర్తమాన కావ్యం
ఎక్కడి కక్కడ కొత్త భావ లహరులతో

ప్రాణి ఆగదు, యంత్రమూ పనిలో ఆగదు
ఎవరి గమనం వారిది, ఎవరి లక్ష్యం వారిది

ప్రతీదీ ఏదో ఒక ప్రశ్నకు జవాబుగా
ఏ సమయం వ్యర్థం కాదు, చలనంలో
ప్రశ్న లెన్నో జవాబులన్ని అయితే
గురి తప్పి దూసుకుపోయే వెన్నో!
పొడుగ్గా అందంగా మెరసే ప్రశ్నా ఖడ్గంలో
నెత్తురు దాహాన్ని మాత్రం! తీర్చ లేరెవరూ!

సెగలు వెడలే భూమి పయి, పొగలు చిమ్మే గిరుల పయి
ఎవరికీ ఎన్నటికీ ఆవాస సమాధానం దొరకదు
ఎప్పుడు బడితే అప్పుడు హేతువు కతీతంగా
జలదం గగనాన్ని అలంకరించదు, వర్షించదు.

దారిలో ఎదురు పడే అనల సన్నివేశాన్నీ
అక్కడక్కడ తొలగని అఖాత సందేహాల్నీ
భద్రంగా దాటించే 'ఫ్లై ఓవర్' లా ప్రజాస్వామ్యం!
మానవ శక్తిని సృజన సరణి మలుస్తుంది.

వీచే తుపాను నణచి
గాలితో పాట పాడిస్తుంది
దూకే వరదను ఆపి
నీటితో నృత్యం చేయిస్తుంది.

# 41. హేతువు మెరపులో

స్మృతు లెప్పటికీ పలు రంగుల్లో పూవుల్లా
స్నేహం వైరం ప్రేమ కరుణ మూలాలతో ఎప్పటికీ!

భూమిపై ప్రతి శబ్ద తరంగాన్నీ తనలో నింపుకొనీ
ఆకాశం చూస్తూనే ఉంటుంది! రెప్ప లార్పకుండా ప్రతీదీ
అపుడపుడూ పిడుగులతో హఠాత్తుగా
అప్పటికి, మౌన బంధం వీడుతుంది

మట్టిలో అణగి ఉన్న విత్తు అవకాశంతో
అన్నీ సమకూడితేనే మొక్కై తరువై ఎదిగీ
జీవిత భాగ్యంతో ఆకాశం వైపు చూస్తుంది.

పరిమళాలు చిమ్మే మల్లె తీగె
మూలం! ఆ మట్టిలోనే ఒదిగీ!

బ్రతుకు అరగి పోతూ అనుక్షణం
అందరినీ అలరించే గంధం రావచ్చు
రాపిడిలో నిప్పు కణా లెగిరి పడవచ్చు.

మనిషికి హాని మనిషి నుండి మాత్రమే
మనిషి ప్రమేయం లేని ప్రకృతి సంభవాలెన్నో
భూకంపం! పెను తుఫాను! వరదలు! పిడుగులు!
వీటిని మించిన భయ రూపం సునామి
ఏ తప్పూ చేయని ప్రజలను శిక్షిస్తూ
అన్నిటినీ ధ్వంసం చేస్తూ విలయ పదంతో!

ఆయతనంలో అస్తిత తళుక్కున మెరుస్తుంది
బరువు మనసు తేలిక పడి నిర్మాణం సాగిస్తుంది.

# 42. బరువు మనసుతో

ఉదయం కాక ముందే ముందుగా వినిపిస్తుంది
పక్షుల కలకలారావం, ఆ వెనుక మనుషుల సందడి

చిన్న మెత్తు భయ ధ్వనికి పైకి
ఎగిరి పోయే అల్ప ప్రాణులు
గగన మెత్తు కొలిచే ఆశలతో
కదలి పోయే మనిషికి మనిషితో పోటీ!

పాత విత్తు నుండి కొత్త మొక్క
పాత కొమ్మ నుండి కొత్త పూవు
పూవు రాలి పోవచ్చు, పండు వీడి పోవచ్చు
పరిణామ సూత్ర మెప్పటికీ దశల దశలుగా

మనిషి మనసులో వెలుగు
పూవులా విరిసీ పక్షిలా ఎగసీ
బ్రతుకు తెరువు భూమిక వెనక నుండి
మరో లోకంలో తిప్పుతుంది.

స్థలం నుండి స్థలానికి దృష్టి మరలుతుంది
వెలుగులో తేలుతూ అంతటా కదలుతుంది

ఆకాశం బరువు తన బుజాలపై మోస్తూ
వీధి స్తంభంలా! చేయి చాచి భిక్షువు
బుజాల పయి బరువుతో వంగి క్రుంగి
చెట్టు క్రింద పనిలో శ్రమ జీవి.

చేతిలో బరువు సంచి వదలి తేలిగ్గా మనిషి
శరీరం కుర్చీలో వాలుతుంది బరువు మనసుతో.

## 43. ఏకాంతం ఎక్కడుంది మనసులో

ఏకాంతం ఎక్కడుంది? మనసులో
శ్రమ జీవన శాలా నిలయాలతో
చుట్టూ యుగాల చరిత్రతో సమాజం!
తుమ్మెదల ఝుంకారంతో తేనె తెట్టెలా

ఏకాంతం ఎక్కడుంది? మనసులో
జీవన యానంలో సమయ వాహనం పయి
చుట్టు చుట్టి చేరే బంధు గణ నికేతనం!
తిరిగి వచ్చి వాలే పక్షులతో చెట్టులా

ఏకాంతం ఎక్కడుంది? మనసులో
క్యూలో నడచే మనుషుల సందడితో
ఆకలి తీరే వస్తువు కయి జన సందోహం
వరసగా కదలి పోయే అలల జలధిలా

గుడి ముందు! నేల కంటిన అడుగులతో
గాలిలో దిశ దిశను స్పృశించే చేతులతో
దీన సమూహం! మనిషి మనిషిగా
బ్రతకాలనే ఉపదేశంతో సమస్య తీరదు.

మనిషితో మనిషి! చింతనలో ప్రపంచం
నిరంతర చలనశీల సమాజంలో
ఏకాంతం ఎక్కడుంది? మనిషి నుండి
వెడలే వెలుగో నీడో చీకటి బొమ్మలతో

సమాజ మూలంతో అస్తిత్వం
మనో వికాస చలనంతో వ్యక్తిత్వం.

# 44. కాలం చేతుల్లో

పగలూ రాత్రీ భేదం లేకుండా మనిషిలో
ఆయతన ప్రకాశం మరచిన స్థితు లెన్నో

ఇంద్ర ధనుసులో రంగుల కొలువు చూపి
శిశువు చేతిలో బొమ్మలు లాగాలనీ
బయట నున్న పంట పొలాలు చూపి
పేద వాని ఆకలి ఆర్పాలనీ

సుఖమూ దుఃఖమూ పాటకు చెరొక వైపున
ఇష్టమూ కష్టమూ మాటకు చెరొక వైపున
వెలుగుతూ! బ్రతుకును నడిపిస్తాయి
ఆ సమయం మాత్రం మనసు శిశు సమం!

వెలుగులో వచ్చే మనిషి పైనే చూపు పడుతుంది
వెనకనో ముందో కదలే నీడపయి పడదు
బాణంలా సూటిగ జీవిత నది సరించదు
మలుపులు తిరిగిన వేణువు పాటను స్వనించదు

ప్రతి నది చీలుతుంది పాయలుగా వేగంలో
నదులన్నీ కలసి ఒకటిగా ప్రవహించవు

ఎంత గొప్ప శిఖర మయినా మనిషి
ఒక స్థితిలో శిశు దశ పొందేను
కాలం తన చేతుల్లో శిశువులా హత్తుకుంటుంది
కొమ్మకు ఊగే పూల గుత్తిలా అలరిస్తుంది

మనిషికీ మనిషీకీ భేదం చూపకుండా
ఆయతనం తలుపులు తెరచే ఉంటాయి.

## 45. సమ చేతనలో

పవనం రోజు కొక యాత్ర చేయిస్తుంది
దిశ నుండి దిశకు ప్రతి మనిషినీ
హృదయాన్ని నిమురుతూ మృదుల స్పర్శతో
ఉచ్ఛ్వాస నిశ్వాసాల ఊయల పయి ఊగిస్తూ

మట్టి పయి మొక్కల తలల్ని నిమిరుతూ
ఊహకు సజీవ మయిన ఆకృతి నిస్తూ
ఎంత దూర మయినా ఎంత ఎత్తులో నయినా
రోజు కొక యాత్రను ముగింప జేస్తుంది

కెరటానికి హద్దు ఉంది తీరంలో
పవనానికి హద్దు లేదు క్షితిజంలో
ప్రకృతి నుండి సమాజంలోకి సందేశంతో
సమాజం నుండి ప్రకృతిలోకి సంవేదనతో

సుమ పరాగ పరిమళాలు వహించీ
మనిషికి తన వ్యక్తిత్వం తలపుకు తెస్తుంది

తన చుట్టూ ఉక్కిరి బిక్కిరి చేసే సమస్యలకు
స్వేచ్ఛా సమ గతిలో పరిష్కార వేదిక అవుతుంది

ప్రశ్నల పంజరంలో చిక్కి నపుడు
ఊచల మధ్య నుండి ఊరట నందిస్తుంది

ఎక్కడో రాయిలా నిలిచి పోకుండా
ఎప్పుడో మబ్బులా తేలిపోకుండా
మనిషిని ఎప్పటికీ సమ చేతనలో ఉంచుతుంది
అంత పెద్ద గగనం! విస్తు పోయి చూస్తుంది.

# 46. ఏడాది మొదటి రోజు

ఏడాది మొదటి రోజు
ఆకాశం పయి స్వారి చేస్తున్నట్లు ఉంటుంది

ఆ నిజం మరునాటికి కాని తెలియదు
అవని పయికి వచ్చేసిన అనుభవ జగంతో.

ఏ మలినం తొలగిందీ
ఏ నవ్యత పోందిందీ
ఏ గతాన్ని మరపించీ
ఏ పథాన్ని చూపిందీ

జీవన దశ ఏదయినా
స్థాన బలం ఏదయినా
మానవ సందేశం ఒకటే
సమాజ బంధువుగా మారడం

ఈ రోజు ఎంతటి దయినా
మనిషి ముందు తల వంచుతుంది
శిఖరం పయి నిలుపుతుంది జీవితాన్ని

నేడు తల ఎత్తిన మనిషి
రేపు తల నేలకు దించేనా?
ఉన్నది కాస్తా తరగి పోయేనా?
నేరుగా మరొకటి కొత్తది చేరేనా?

మార్పు కోరే సమాజ హృదయంలో
ఆశా విభవం పయి ఆలోచన సహజం
స్వయం చలన హేతు ప్రజాస్వామ్యంలో.

# 47. ఉగాది రోజు

గాలి అదే! చల్లగా, వెలుగు అదే సుఖంగా
ఈ ఉగాది ఉదయం! అణువణువూ కొత్త చివురుతో

ప్రకృతిలో కొత్తదనం మనిషిలో రావలసి ఉంది
అభినవ గుణ రూపంతో సుమించవలసి ఉంది
నిరంతరం ప్రవహించే కాలం తీరాన
ఈ రోజు ఉదయం ఒక పూల వనిలా
తిరిగే జీవన రణ ఘట్టన చక్రం
విరామ సుందరతను పొందుతూంది

ఏడాది కొక మారు వస్తుంది అతిథిలా
మబ్బులో మెరపులా ఆత్మ ప్రకాశంతో

నాలుగు గోడలు దాటి పోయి ఈ రోజు
విశ్వమయ మవుతుంది హృదయ భాషతో

ఆయతనం బయట సమాజ వలయంలో
కళ్ళలో పేరుకొన్న కలలు తుడిచి శుభ్రంగా
బ్రతుకులో నిజాన్ని వెలిగిస్తూ సరి కొత్తగా
మౌనంలో లిపి ఒకటే! ముఖాలలో అర్థం వేరు.

అద్దాల పేటికలో కదలే చేపలా మనస్సు
నిన్న బంధనలో నేడు స్వేచ్ఛా జలాలలో
రేపు మరో పేటికలో మనిషికి అలవాటే
బంధన మెప్పటిదే చిరునామా మారుతుంది

వేయి వెలుగు రెక్కలపై వచ్చి వాలిన ఈ రోజు
వేయి నీడల రెక్కలపై తిరిగి వెళ్లి పోతుంది!

# 48. ఈరోజు నవారంభం

దేశం ఏదయినా సమాజం ఏదయినా
ప్రతి ఏడూ మొదటి రోజు! అందరి ఊహలు ఒకటే

నిన్నటి మంటలకు గుడ్ బై చెప్పి
చల్లని వెలుగులకు స్వాగతం పలికి
కోరే దొకటే ఈ రోజు నవారంభం
నిరంతరం సాగాలనీ ఇలాగే హ్లాదంగా

దారులు మూసేసే మంచు తెరలు తొలగి
మనుషులు కనిపించే కిరణం దిగి క్రిందికి
చీకటి ముఖాలను సులభంగా గుర్తించే
ఉషస్సు దర్శనం పొందాలని ప్రతి హృదయం!

కణ కణలాడే అంగార కణాలకు బదులు
గుప్పున వీచే మల్లెల వెలుగులు చూడాలనీ
నిన్నటి మంటల పయి పందిరిలా క్రమ్మిన ధూమం
తొలగి నేడు విజయ జలద రూపం చూడాలనీ

నిరాశకు వ్రేలాడే ఎడారి బ్రతుకును మరచి
ఆశాస్వాదు జలాలకు చేరువగా రావాలనీ
అన్నిటికీ సమాధానపడీ కుటిలో
అడుగున దిగబడి పోయిన నిధులయి
చిరకాలం ఉండలేరు శష్తంగా!
బయటికి తెచ్చే సేవా హృదయ మవసరం.

ఆ వచ్చే రోజు! తీరాన నావలా భద్రంగా
ప్రజాస్వామ్య గమ్యానికి సిద్ధం కావాలి

# 49. ఉద్యమంలోకి పీఠికగా

మేల్కొన్న మానవ చేతనకు సాకారం
ఆదర్శ రూపానికి చిహ్నం విగ్రహం
ప్రజాస్వామ్య పతాక ఛాయలో
విగ్రహాల విధ్వంసం చిర సంస్కృతి హననం.

తీరని కోరిక ఏదో వికార మయ మయి
కోపానికీ ద్వేషానికీ స్థాన మయి
ఎంతటి పని నయినా చేయిస్తుంది
ఆటవిక యుగం లోకి జార్చేస్తుంది.

మానుష మూలాలను చెదర గొట్టి
మానవతా శిఖరాలను కూల ద్రోసి
చరిత్ర ముఖాన్ని గాయంతో అలంకరిస్తుంది
సంస్కృతీ రూపానికి అనల దృశ్య మిస్తూంది.

చల్లని గాలిలో మనసు తేటపడీ
ట్యాంక్ బండ్‌పై సాయం సమయం
అదుపు లేని అలజడితో అలమటిస్తూ
మనిషి! ఇపుడు పూర్వ పూర్వ గుహ నుండి
బయటికి అడుగులు వేసి నట్లుంది
అడవిలో దారి తప్పి నగరం చేరి నట్లుంది

ఏ వాదంలోనో ఏ వివాదంలోనో
బ్రతుకులో విలువలు మటుమాయమయి
చిటికెల పయి తెలిసీ తెలియని బీభత్స రచన
తెలుగు జాతి దుష్కీర్తికి హారతి పడుతూంది.

## 50. ముక్కలుగా అద్దంలో ప్రజాస్వామ్యం

పుట్టుకతో శాంతికి నిలయ మయిన మనసు
ఎదిగే కొద్దీ ఉదార చరితను పొందే బదులు
విదారణ గుణ విషాద మయ మవుతూంది
మనస్సు పూచే అనల పుష్పం! వాడేనా? రాలేనా?

మూత తొలగి బుట్ట నుండి
త్రాచుల్లా కనిపించీ, కనిపించని చర్యలతో
బాధ్యత తప్పిన ప్రజాస్వామ్య శరీరంలో
పాయలు పాయలుగా ప్రాకుతూంది విష బిందువు.

ముక్కలయి చెదరి పడే ప్రతిమలు
నేల పయి సంస్కృతీ వికల సన్నివేశం!
ఏ మనిషికి మర్యాదాకర మవుతూంది
ఏ మనసుకు విజయ పథం చూపుతూంది

క్షమకూ అర్హత కోల్పోయిన ఉగ్ర నీతిలో
ఉన్మత్త చర్య! సహనానికి పరీక్ష పెడుతూంది
ఉపేక్షకూ నిష్క్రియకూ హద్దులు చూపిస్తూంది

ఎంతటి విఘటన విధ్వంసం లోనూ
ఏమీ జరగనట్లు అమాయ వాలకంతో
మరో రోజు నిలుస్తుంది! శిలా ఫలకంలా
బాధ్యత మరచిన పాలనా జడతలో

ధూళి రేణువులు క్రమ్మి
సహన భావ తంత్రులు తెగీ
ముక్కలు చెక్కలుగా! అద్దంలో ప్రజాస్వామ్యం!

## 51. పత్రికలో కార్టూన్

భూగర్భం నుండి మొక్క పైకి వస్తుంది
దాహం తీర్చే జల ధార వెడల వచ్చు
కానీ అనల కణాల పుట్ట లెగురు తాయనీ
తెలియదు! ఒక విషమ క్షణంలో తెలిసి వస్తుంది.

చెట్టు కొమ్మకు పూలూ పండ్లూ వస్తాయి
నీడ నిస్తుంది! మరో ప్రయోజనమూ ఉండొచ్చు
వరసగా అనల కేతనా లెగురుతాయనీ
తెలియదు! ఒక విషమ క్షణంలో తెలిసి వస్తుంది

చేతిలో పూల గుత్తికి బదులుగా
బెల్టు లోనో బ్యాగులోనో బాంబుతో
నగరం భస్మ దృశ్యం పొందుతుందనీ
తెలియదు ఒక విషమ క్షణంలో తెలిసి వస్తుంది

నిప్పు కాల్వలు ప్రవహింప జేసి
మృత్యువు పంటలు పండించాలనీ
విస్ఫోట మూర్తుల రహస్య యానం
తెలియదు! ఒక విషమ క్షణం తెలిసి వస్తుంది

ప్రేమనూ కరుణనూ శాంతినీ కోరే మనసు
ఆచరణంలో ద్వేషం హింసతో అడుగులు వేస్తూ
కొండ గుహల నుండి నగరం చేరుతుందనీ
తెలియదు! ఒక విషమ క్షణంలో తెలిసి వస్తుంది.

ఆ విషమ క్షణం రానే వచ్చింది! మృత్యు ముద్రతో
బిన్ లాడెన్ వన్ ఇన్ ఆల్‌గా! పత్రికలో కార్టూన్.

# 52. ఎచిలెస్ హీల్

ఏదో ఒక నెపంతో సమాజ శరీరం
ద్వేషం పగ దౌర్జన్యం అశాంతి హింసతో
చిన్నదో పెద్దదో గాయంతో ప్రతి రోజూ
ఏ పేరుతో అయితేనేం? మారిన జీవన పద్ధతిలో

గాయాలు మానుతూ పాతబడుతూ
జ్ఞాపక శాలలో చరిత్రను పేరుస్తాయి

వర్తమానం గతాన్ని సులభంగా మరపిస్తుంది
భవిష్యత్తుకు దారి చూపే పనిలో ఉంటుంది

అనుక్షణం జీవితం ఏ పెట్టుబడి లోనో
ధర పలికే వ్యాపార సరణిని కోరదు
వాన కారులో వరద లెత్తిన ప్రవాహంలా
మద గజ పద ఘట్టనలో క్షణాలు
గాయ పరచి వెళతాయి! ఏమీ తెలియనట్లు
మిగిలిన కాలం సాధారణ జీవితాని కంకితం!

ఇష్టంతో పని లేకుండా ఏకాంత మలంకరిస్తుంది
ప్రాణ భయంతో హృదయ పాత్ర నిండుతుంది

ఒత్తిడిలో మానసికంగా చెదరిన జీవితం
రహస్య చక్రంలోకి వెళుతుంది! అదృశ్య లక్ష్యంతో

ఉదగ్రమైన ఆచరణం కొన్ని లిప్తలకే పరిమితం
ఆయతన ప్రకాశం లేని దేహానికి 'ఎచిలెస్ హీల్' అవుతుంది
చివరకు జారే కన్నీటి చుక్క తళుక్కున
జీవితాన్ని మెరపిస్తుంది, వర్తమానం అద్దంలో.

స్వేచ్ఛా కవిత్వం - **53**

రెండవ భాగం - 23

# ప్రవాహంలో ప్రజాస్వామ్యం


## మాదిరాజు రంగారావు



**2012**

రసధుని సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 500 028

***Presented***

***to my son***

***Dr. M. SANTHOSH KUMAR***

***with***

***affection & blessings***

# పీఠిక

ఈ కృతి "ప్రవాహంలో ప్రజాస్వామ్యం" వర్తమాన సమాజంలో ఎదురయ్యే వాస్తవాల స్థితి చిత్రణం. వివిధ భావ రూపాలలో ఆవిష్కృత మయింది. వస్తువులో ఐక్యతాసూత్రంతో వ్రాసినవీ. కావ్యత్రయంలో మొదటిది ఆల్బంలో ప్రజాస్వామ్యం (2010); రెండోది అద్దంలో ప్రజాస్వామ్యం (2011); మూడోది ప్రవాహంలో ప్రజాస్వామ్యం (2012).

మొదటిది "ఆల్బంలో..." ఫొటో టెక్నిక్‌తో మార్చడానికి వీల్లేని స్థిరాకృతి పొందిన దృశ్య పరంపరాభావం కలిగింది. రెండోది "అద్దంలో..." ప్రతిబింబాలతో తత్కాలిక మయిన దృశ్య పరంపరా భావం కలిగింది. అద్దం ఎదురుగా ఉన్నంత వరకే, అద్దం తొలిగితే ప్రతిబింబం ఉండదు. మూడోది "ప్రవాహంలో..." నిరంతర గమన శీలాన్ని తలపిస్తుంది. అవిచ్ఛిన్న మయిన పరంపరానుభవ భావం కలిగింది. మూడు కోణాల్లో వస్తువు సామాజికం, ప్రజాస్వామ్యంలో ఉన్న వాస్తవ స్థితి చిత్రణం కలిగిందీ.

వర్తమాన జీవితంలో ఎదురయ్యే సమస్యలూ దుస్థితులూ బాధతో వేదనతో కూడిన అనేక ఘటనలూ విపరీత కృత్యాలూ దృష్టికి వస్తాయి.

"ప్రవాహంలో ప్రజాస్వామ్యం" నేటి "సంక్షుబ్ధస్థితి అంచులలో" సమాజం మానవతా గంధం కయి ఎదురుచూస్తుంది. నేటి ప్రజాస్వామ్య వ్యవస్థలో అనుభవంలోకి వచ్చే (1) విషమ స్థితులూ (2) అనేక కారణాల వల్ల కోల్పోతూన్న నైతికమైన విలువలూ; (3) అమానవీయమైన ధోరణులూ; (4) అరాజకానికీ అశాంతికీ దారితీసే ప్రవర్తనలూ – వివిధ భావరూపాల్లో కొన్ని సందర్భాల్లో ప్రతీకాత్మకంగానూ ప్రతీయమానంగానూ వివేచన కందుతాయి. ఈ కావ్యత్రయం, ప్రజాస్వామ్య దార్శనికతను కలిగిందీ. వస్తువైవిధ్యంతో స్వేచ్ఛా కవిత్వాన్ని సంపన్నం చేసేదిగానూ ఉంది. భౌతికమైన మానసికమైన దశల సమన్వయంతో రచనలో విషయ పరిధిని విశాలతరం చేస్తూంది. గంభీరతను సిద్ధింపజేస్తూంది.

వర్తమాన యుగంలో కవి ఈనాటి ఆర్థిక సామాజిక రాజకీయ

సాంస్కృతిక నేపథ్యం పట్ల అవగాహనతో, ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ సమాలోచనంతో, తన సృజన కర్తవ్యాన్ని నిర్వహించవలసి ఉంది. తన ఆదర్శాలూ, అభిప్రాయాలూ, లక్ష్యాలు ముఖ్యంగా దార్శనికత వేరుగా ఉండడంలో విప్రతిపత్తి లేదు.

దీనితోనే రచయితలో స్వేచ్ఛా వ్యక్తిత్వం కేంద్రంగా, స్వతంత్రమయిన అస్తిత్వం సిద్ధిస్తుంది. సమాజంలో వైరుధ్యాల్ని పరిష్కరించే అభిలాష ముఖ్యం. దీన్ని అనుసరించి ప్రయత్నం జరగడం అవసరం. పరిష్కారం లేని సమస్య లేదు. సంతృప్తి నిచ్చేదిగా స్వచ్ఛమయిన ప్రజాస్వామ్య దృక్పథంతో వర్తించడం అవసరం. మనిషి అంటే చైతన్యమూ - ఆలోచనాత్మకత - క్రియాత్మకత - కార్యసాధనాశీలతతో కూడిన శక్తి రూపం. దీని ఆవిష్కార ప్రయత్నమే స్వేచ్ఛా కవిత్వం.

"తీరాన స్మృతులతో ప్రవాహమయిన జీవితం
ప్రజాస్వామ్య చేతనతో సృజన లోక హృదయం"

ప్రవాహంలో ప్రజాస్వామ్యం, ప్రకృతి నేపథ్యంతో సామాజిక దృశ్యచిత్రం కలిగిందీ, నేటి స్థితి గతుల్ని వ్యంజింపజేస్తూందీ. ఇది సాహిత్య సహృదయుల ఆమోదాన్ని పొందగలదనే విశ్వాసంతో

"అక్షర రూపంలో కవిలో ఆయుధం
ఎవరి ఇష్టంతో పని లేని యథార్థం"

కవి మనో లోక ప్రకటనం కవిత్వం. చేతన-అవచేతన-అచేతన స్థితుల్లో దృశ్యాలతో బహుముఖీన (multifacet) మయింది. ప్రకృతి నేపథ్యంతో జీవితానుభవంతో సామాజిక దర్శనంతో సృజన రూపం పొందుతూంది. ఇది చేతనలో పైకి కనిపించేదీ, అవచేతనలో అణగిఉందీ, అచేతనలో దాగి ఉందీ - కలిసిన ప్రకాశబింబం. స్వేచ్ఛా కవిత్వంలో ప్రజాస్వామ్య లక్ష్యంతో మనిషికీ మనిషికీ మధ్య వంతెన లాంటిది, కలిపే సూత్రం లాంటిది. సరికొత్త ప్రపంచాన్ని దర్శింపజేస్తుంది.

**- మాదిరాజు రంగారావు**

# సూచిక


| | | పుట |
|---|---|---|
| 1. | నేటి ప్రజాస్వామ్యంలో | 1 |
| 2. | గ్రీష్మాన్ని తలపిస్తూంది | 2 |
| 3. | సమాధాన మేఘం | 3 |
| 4. | వైరానికీ స్నేహానికీ | 4 |
| 5. | నిర్దోషు లెవరు? | 5 |
| 6. | కొత్త రూపాన్ని ఇస్తూ | 6 |
| 7. | సమస్య నుండి | 7 |
| 8. | ఒకే సారి చివరిది | 8 |
| 9. | చంద్ర బింబం తిన్నగా సూటిగా | 9 |
| 10. | ఎవరి ఇష్టంతో పని లేదు | 10 |
| 11. | కిరణ స్పృహతో | 11 |
| 12. | ప్రోగ్రెస్ రిపోర్ట్ | 12 |
| 13. | ఆయుధం చాటున | 13 |
| 14. | ఒక సందర్భంలో | 14 |
| 15. | ప్రకాశ రూపం | 15 |
| 16. | హైడ్‌ను ఎదుర్కొనే | 16 |
| 17. | ప్రదర్శనను మరపించే | 17 |
| 18. | తెరచిన మనో దృశ్యం | 18 |
| 19. | ఆశను నిలిపే రోబోట్ | 19 |
| 20. | భౌమంలో ఉన్నతిలో | 20 |
| 21. | శిశిర పర్వం | 21 |
| 22. | ప్రమాదం అంచులలో | 22 |
| 23. | సమాజ కథలో విలువలు | 23 |
| 24. | క్రీడలో రెఫరీ | 24 |
| 25. | ఎత్తుల కతీతంగా | 25 |
| 26. | సెల్‌ఫోన్ – మినీ మేఘం | 26 |
| 27. | తీరాన స్మృతులతో | 27 |
| 28. | శ్రమ సోపానాల పయి | 28 |
| 29. | కాలం వెనక్కి మరలదు | 29 |
| 30. | సంక్షుబ్ధ స్థితి అంచులో | 30 |
| 31. | ఎవరి దారి వారిదే | 31 |
| 32. | కాంతి రూపం | 32 |
| 33. | అక్షర రణం | 33 |

## 1. నేటి ప్రజాస్వామ్యంలో

ఎవరి కోసమూ ఆగని స్థితుల అలల పయి
    సమాజ ప్రవాహ గతిలో నావయై
మధ్య మధ్య మునుగుతూ తేలుతూ
    సమస్యల సుడులు దాటుతూ, దరులు చేరుతూ ప్రజాస్వామ్యం!

తీరం నుండి తీరానికి యాన పాత్రలో
    దిశ మారే గాలుల కలవాటు పడే ప్రజతో.

ప్రవాహానికి లేదు గ్రీష్మ భయం
    అలల గతికి లేదు శిశిర భయం
మలిన మనో బింబంతో చేరే
    జన గణ పంక్తుల భయం తప్ప

హద్దు లేని ప్రపంచం మనిషి స్వేచ్ఛలో
    పయనంలో ముందుగా తెలియని మజిలీలతో
ఆ సమయంలో మనసుకు తోచే దొకటే
    ధైర్యంగా మను ముందుకు సాగి పోవడం

ఏదో ఒక వైపు నుండి సమస్యకు పరిష్కారం
    తీరం దాటే యత్నంలో కెరటం లానో
గూడు నుండి బయట పడే పక్షి లానో
    బూది ఎగిరి గాలికి మెరసే అగ్ని కణం లానో

సందేహం తీరే పగలు వెలుగులో
    పై నున్న సూర్యుణ్ణి చూడలేవు కళ్ళు
సందేహం పెంచే రాత్రి వెలుగులో
    పై నున్న చంద్రుణ్ణి వదలలేవు కళ్ళు

జన హిత భావనతో ఉన్న నేటి ప్రజాస్వామ్యంలో
    వ్యక్తిలో నైతిక మనో మూల శక్తి అవసరం

## 2. గ్రీష్మాన్నితలపిస్తూంది

ఇది గ్రీష్మ రుతువు కాదు, అయినా
వాతావరణంలో వేడి ఆడుతూంది
ప్రజా శక్తి ప్రవాహ మయి వీధులలో నుండీ
మైదానంలోకి బింబంగా మారుతూంది.

వీధులలో ప్రజాస్వామ్యం ఉక్కిరి బిక్కిరిగా ఉంది
మైదానంలో కాస్త ఊరట స్థితి పొందుతూంది
ఆవేశంలో అందనిదీ దొరకనిదీ
శాంతంలో చేతికి అందే దవుతూంది
సజీవ మయిన సశక్త మయిన సంఘటిత రూపం!
జారి పడి పగలడానికి గాజు బొమ్మ కాదు
జారి ముక్క లవడానికి మట్టి బొమ్మ కాదు

ఒక్కొక్క రాజకీయ పక్షం! తమ చేతుల లోకి
తీసుకొనీ బింబాన్ని! ఒక ఆట ఆడించాలనీ
వాలీబాల్ ఫుట్‌బాల్ హాకీ క్రికెట్ మరొకటీ
పార్టీ లెన్నో సమయ సమయం నేర్చిన ఆటలన్నీ
ఏ ఆటకూ లొంగని రాజకీయపు టెత్తు లేదు

తేజోవంతమయిన క్రియాచరణ ఫలాల
రుచి కయి నాలుక నృత్యం చేస్తుంది
మండే జన హృదయం! సమాజ శిఖరం పయి
ఒక మినీ సూర్య బింబంలా వెలుగుతూంది

అణువణువూ చేతనతో జన సమూహం
ప్రవాహ మయి బింబ మయి గ్రీష్మ రుతువు ఛాయలో
రుతువుల కతీత మయిన ప్రజాస్వామ్య తేజం
కోర్కెల సాధనలో గ్రీష్మానికి చెక్ పెడుతూంది.

## 3. సమాధాన మేఘం

గ్రీష్మం వేసే ప్రశ్నకు సమాధాన మేఘం
రాలే చినుకులతో ఆర్ద్రత ఒక పరిష్కారం
మేఘం పయనించని గగన తలం లేదు
సమాధాన రూపం లేని సమస్య లేదు.

సమాజం కదలుతుంది గుణ క్రియా చరణంతో
సంస్కృతిలో తన గుర్తులు వదలుతూ పోతుంది
మనిషిలో జీవన రుచి నిలుపుతుంది
మనిషి యాత్రలో ఆనవాళ్ళు మిగులుతాయి

క్షుధ తీరే భుక్తి కోస మయి శ్రేణులలో
వ్యథ తీరే భాగ్య రాశి కయి స్థాయిలో
స్థలమూ దేశం మారే ప్రజ! ఎప్పటికీ
మూల మనో రీతు లొకటే! ఎచటయినా

సమాజ సీమల చుట్టూ వన పంక్తులు
పరాగాలలో పరిమళాలలో ఎలర్జిన్‌లతో
అడవిలో పులి సహజం! కనిపిస్తే భయం
చేతిలో భద్రత కయి! ఆయుధ మొక ధైర్యం

శిశిర భావ క్షణాలలో చివురు కయి సంవేదన
పవనం మోసుక వచ్చే గంధం కయి నిరీక్షణం
ఆకు ఎండి రాలినా పూవు వాడి జారినా
శక్తి మూల మయిన తరువు చలించదు
కష్టంలో నష్టంలో ఆపదలో మదిలో
కదలే ఆశా రథ మెప్పటికీ ఆగదు
దేశ వాస బంధంతో ఆత్మీయం
విశ్వ బంధు భావనతో ప్రజాస్వామ్యం

## 4. వైరానికీ స్నేహానికీ

మట్టి నుండి సృజన! మనసు నుండి కల్పన
శ్రమ కలనం నుండి నిర్మాణ వికాసంలో సంస్కృతి
కృషి ఫలం కయి చూపులు ప్రసరిస్తూ
శ్రమ విలువల కయి విపణిలో తిరుగుతూ
తొలకరిలో భూమి పయి చూపులతో
క్షామంలో అన్నదాత తప్పక గుర్తొస్తాడు.

భిక్షా పాత్రలా నిశా విశాల గగనం
మెతుకుల్లానో నాణాల్లానో చుక్కలు
కళ్ళ ముందు పైన మెరుస్తూ తలపిస్తూ అందనివీ
చూస్తూ చూస్తూ గడిపితే ఆకలి తీరేనా?

సామాజిక రాజకీయ సంక్షోభ జగత్తులో
మనిషిలో ఆలోచన ఎత్తిన కరవాల మయి
పూల రేకుల్ని తరగడం దీని పని కాదు
కానీ ఇది జరిగితే! కూడని దారుణం
అలల పంక్తుల్ని నరకడం దీని పని కాదు
కానీ ఇది జరిగితే! చెల్లని అమాయకం

మనిషి జీవితాశయాన భద్రత వలయంలో
సహన సంస్కృతీ శ్రేణులు ఛేదింపబడీ
మస్తిష్క శాల నుండి విడుదలయిన అనయం
హింసలు హత్యలు అరాజకం అశాంతి!
క్షుద్ర నీతి నిలయ మయి మనిషి మనో రూపం!
మెరపులతో పిడుగులతో తుపానులు వదలుతూంది
స్వార్థంలో మత్సరత వైరానికి కారణం
సానుభూతితో సహనం స్నేహానికి ఆశ్రయం

## 5. నిర్దోషు లెవరు?

ఏ దోషాని కెవరు శిక్ష విధిస్తారు? ఎవరికి?
ఒకరి కెదురుగా ఒకరు! నిర్భయ భావంతో
ఒకరి తరువాత ఒకరు వస్తూ! అంతా ఒకటే!
ఆ చివరకు మిగిలే నిర్దోషు లెవరో, తెలియదు.

ఒకరి చేయి నిప్పు అంటిస్తూ పోతుంది
ఒకరి చేయి చాకు విసరుతూ పోతుంది
ఒకరి కాలి వ్రేళ్ళు బూది చిమ్ముతూ
ఒకరి కాలి వేళ్ళ దుమ్ము లేపుతూ.
ఒకరొకరి చర్యల సంకలనం వర్తమాన దృశ్యం
ప్రవాహంలో ప్రజాస్వామ్యం ఒడ్డుకు ఈదుతూంది.
నిశ్శబ్ద సేతువు పయి ప్రవాహాన్ని దాటుతూ
ఎవరి పనులలో వారు శ్రమ బంధనలో

శాంతి సౌధ ఫాలం పయి సుస్వాగత పదం
పచ్చని తోరణ మయి ప్రబోధ చరణం
గేటు ముందు తారాడే సామాన్యుని చూపులు
వీథుల్లో వైరుధ్యాల కలహ ప్రియ శబ్దం

మెడ పయి పొంచిన కత్తిపయి దృష్టికి బదులు
కిరీటాల్ని సరి చేసుకునే తొందరలో నేతలు!
మదిలో రాజనీతి సుందరతను మరచి
చేతిలో పదవుల గర్వంతో మురిసేరు

అభిమన్యుని ప్రవేశం! పద్మ వ్యూహం లోకి
తన ప్రాణం కోసమయి అడుగు వెనక్కి వేసేందుకు కాదు.

## 6. కొత్త రూపాన్ని ఇస్తూ

గోపుర శిఖరం పయి ధగ ధగ లాడే
    స్వర్ణ కుంభంలా! ఆదర్శం! దూరం నుండి ఆకర్షిస్తూ

పాయలుగా చీలే జీవిత మహా ప్రవాహం
    అభయ హస్త ముద్రతో కదలాలనే
ఉగ్ర సరణ చరణాల పయి దూకుతూ
    పిడికిలి బిగిస్తుందనీ! ఎవరికీ తెలియదు

మానసికంగా విజృంభించి దాహం ఆకలి
    నేల నుండి అడుగులు పై కెగర జూస్తాయి
రెప రెపలాడే బ్రతుకు కాగితం పయి
    కల్పనకు చోటు లేని వాస్తవ పద చిత్రాలు!

గగన సౌధ నివాసానికి ఆలోచనలో
    నీలి మబ్బు! గృహ జల యంత్రం కావాలనీ
పగలూ రాత్రి భేదం లేకుండా కోర్కెలు
    బొమ్మల్లా! ఆడుతూ మనసును ఆడిస్తాయి
"నిప్పుకు చెదలంటద"నీ సుభాషితం
    మనిషి చర్య చూస్తే నిజం కాద నిపిస్తుంది.

పరచిన అంపశయ్య పయి భీష్ముడు
    ఎదురు చూచేది మృత్యువు కయి కాదు
రణ వేదనతో తన ఆత్మ శాంతి కయి
    లౌకికాని కతీతమయిన మనో రూపంతో

తప్పని నేల పయి నడుస్తూ నడుస్తూ
    మట్టి అంటిన అడుగుల్ని కడుగుతూ కడుగుతూ
చివరకు చేరేది ఆ మట్టిలో నయినా
    సృజన భూమికి! సరికొత్త రూపం ఇస్తూంది.

## 7. సమస్య నుండి

గుడిసెకూ మేడకూ మధ్య రేఖ
సజీవ విద్యుత్తంత్రిలా అడ్డంగా
రణానికీ శాంతికీ మధ్య రేఖ
దాటాలిసిన ప్రవాహంలా ఎదురుగా

మిత్రతకూ శత్రుతకూ మధ్య రేఖ
కట్టెకూ కాల్చే నిప్పుకూ మధ్య ఉన్నంత
చీమకు చెట్టు చివర, ఒక ఎవరెస్ట్
మనిషి అవసరానికి అందని అడుగు ఒక ఎవరెస్ట్
వ్యక్తి యశోరూపానికి సమాధి ఒక ఎవరెస్ట్
కావ్యంలో కవికి! సహృదయ హృదయం ఒక ఎవరెస్ట్
బాధలు లేకుండా ఘర్షణ పడకుండా
ఒక రోబోట్‌లా జీవన గమనం సాగదు

మనసు పయి ఏ దేవత రిమోట్ పని చేయదు
మనిషి పయి మనిషిదే! కంట్రోల్ నూరు శాతం!
ఎవరి అడవి ప్రపంచం! వారి స్వంతం
ఎవరి వేటలో వారు నిమగ్నులు! నిష్ణాతులు

నాగరక శోభ మరచి ఎంత కాలమయిందో
జీవితంలో భద్రంగా బీరువాలో పుస్తకంలా
జలధి నుండి ఉల్లోల తరంగ ధ్వనిలా
జన సమూహ శ్రేణుల కల్లోల శబ్దం
సమస్య నుండి సమస్యకు గమనం నిరంతరం
మునక లేస్తూ ప్రవాహంలో ప్లవిస్తూ ప్రజాస్వామ్యం.

## 8. ఒకేసారి చివరిది

ఆకాశం క్రమ్మిన మౌన వదనం వీడి
      సముద్రం నిండిన హృదయ పాత్రతో
ఏకాంతం నుండి మనిషి సమాజం లోకి
      బుజాల పయి నిలిచిన ప్రపంచ భారంతో

భౌతిక శక్తుల గమనంతో జీవిత రూపం
      కదలే గ్రాఫ్‌లా ప్రతి దశలో ప్రతిఫలిస్తుంది
విషమ మయిన కాలి బాట వదలి
      సుగమ మయిన రాజ పథం పయి కోరిక! సహజం

వానలో మంచులో ఎండలో దారిన కనిపించే
      పచ్చని దృశ్యం! నిరీహనూ నిస్పృహనూ మరిపిస్తుంది
జీవితానికొక రూపం గమ్యం ఇచ్చే శ్రమగతిలో
      తెలుపు పసుపు వెలుగు! ఆశను తళతళలాడిస్తాయి

స్వచ్ఛ మయిన నవ్వు ముఖం ఎవరిలో సాధ్యం
      శిశువులో పండు వృద్ధులో మాత్రమే
మధ్యలో వచ్చే వివిధ వయో దశలలో
      ఏదో ఒక వేషం! ముఖాని కమరుతుంది!

తనకు చలనం లేదనుకునే రాత్రి
      మరునాడు తొలి కిరణంతో నిష్క్రమిస్తుంది
మరుగున పడి పోయిం దనుకునే చీకటి
      ఆ రోజు చివరి కిరణం వెనకనే వస్తుంది.

చుట్టూ తోడుగా ప్రకృతితో సమాజం
      సరి కొత్త దృశ్యంలోకి ప్రవేశిస్తుంది
పుట్టుకతో పైకి లేచిన తెర! జీవితంలో
      క్రిందికి జారేది! ఒకే ఒకసారి చివరలో.

## 9. చంద్రబింబం తిన్నగా సూటిగా

బాల్యంలో అనుభవ దృశ్యం దూరమవుతూ పోతుంది
ఏ కోరికపైనో, ఏ పిలుపుపైనో ఊరు వీడి బంధం వదలీ
ప్లాస్టిక్ పూవుల్లా మనస్సులో వాడిపోని స్మృతులు
మాటల్లో అనుభవాల బంధం మొదలుతుంది
ఎప్పటివో అనుభవ ముద్ర లొకలొకటీ
కాల సమాధి పయి స్మృతి కేతనాలుగ కదలుతూ!

పాడుతూ పోయే వారిని చూచి
మనసులో ఏడుస్తూ కదలేవారూ
ఏడుస్తూ పోయే వారిని చూచి
ముఖాన చిరునవ్వుతో వెళ్ళేవారూ

అవసరాల పయిన జీవితం అనుభవంలో
దేని కది విడిపోయి ముక్కలుగా మిగిలీ
ఆపై ఎక్క డెక్కడివో కలిసీ రూపొందీ
చరిత్రలో భాగమయి విలువలు తలపిస్తాయి

కవి అన్వేషణలో పాత్ర! నిజ స్వరంతో
ప్రతి మానవ హృదయంతో మాట్లాడుతుంది
అక్షరాలు మౌనంగా దర్శనమిస్తాయి
పద పదాన అర్థం ఊహను నడిపిస్తుంది
బాధలో నావలా శాంతి తీరం చేరుస్తుంది
వేదనలో పూల గుత్తిలా గుండెకు హత్తుతుంది

అమ్మ రమ్మని పిలవగానే చంద్రబింబం
దిగుతుంది శిశువు ముఖం లోకి తిన్నగా
అమ్మ చూపు మరల గానే మరో వైపు
ఎగిరి పోతుంది! నింగి లోకి సూటిగా.

## 10. ఎవరి ఇష్టంతో పని లేదు

మాట గాలిలో దూర దూరం పయనిస్తుంది
కాగితం పై అక్షరంలో చిత్రంగా స్థిరపడుతుంది
ఏ లిపిలో ఏ భాషలో ఉన్నా, ఏ చిత్రం ఏ రంగులో ఉన్నా
కాగితం ఏ మాత్రం పట్టించుకోదు.

పద పదానికీ రంగూ రుచి పరిమళాన్ని
ఘన రాగంతో అద్దుతుంది కవి హృదయం
శబ్ద మయం అర్థ యుతం భావ గతం కవిత
దీన్ని కెన్ని కాళ్ళో చేతులో ముఖ పంక్తులో!

ప్రతి హృదినీ చేరుతుంది మాటతో ఒకే సారి
అనుభవ ద్రవంలో ముంచి తీసి నిలుపుతుంది
మౌన ముఖ సమూహాల్ని పలికిస్తుంది
స్తబ్ధమయిన పద పంక్తుల్ని నడిపిస్తుంది

ఏ కవి గళ స్వనం! ఏ స్థాయిలో ఉన్నా
మరొకరి గళ స్వనానికి ప్రతి స్వనం కాదు
కవిత్వ మంటే విహార యాత్ర కాదు
జన లౌకిక వ్యవహారాల సందర్శిని కాదు
ఇష్టమో కష్టమో యానంలో పొందే దృశ్యా లెన్నో
ప్రవాహంలో ప్లవిస్తుంది కవి మనః ప్రపంచం

మాట ఆయుధ మయి మనసును గాయ పరచవచ్చు
మనసు ఆయుధ మయి బ్రతుకును శాసించవచ్చు
బ్రతుకు ఆయుధ మయి సమాజాన్ని బాధించవచ్చు
సమూహం ఆయుధమయి చరిత్రను నడిపించవచ్చు.
అక్షర రూపంలో కవిలో ఆయుధం
ఎవ్వరి ఇష్టంతో పని లేని యథార్థం

## 11. కిరణ స్పృహతో

కిటికీ రెక్కలూ ప్రధాన ద్వారం తలుపులూ మూసినా
అవకాశం చేసుకొనీ కిరణం దూకుతుంది
క్షణాల్ని పరుగెత్తిస్తుంది, మిల మిలలాడిస్తూ
ఇపుడు దీపంతో పని లేదు, అంతా సన్మిత్రమయం.

కిరణానికి ఇరువైపుల దృశ్యా లొకటొకటీ
కావలసినవి కనిపిస్తూ, మనసుకు పని కల్పిస్తూ
కిరణానికి ఎవ్వరి పిలుపుతో పని లేనే లేదు
అణువణువూ ప్రేమమయంగా వెలుగుతుంది
చల్లని చూపుతో అమాయక శిశువులా
వెచ్చని చూపుతో పరిణత వృద్ధులా

వెలుగు సోకని మనసులో వ్యక్తి పాత్ర
చీకటి ఖడ్గంతో సిద్ధమవుతుంది
ఒకరి తరువాత మరొకరితో వంతులుగా
ఎప్పటికీ ఎవరితోనో కలహంతో రణిస్తుంది.

చేతిలో నిలిచిన కరవాలాన్ని
నెత్తురు చుక్క లలంకరిస్తాయి
కాలం మెడలో క్షణాల దండను
బాష్ప బిందువు లలంకరిస్తాయి.
కిరణ స్ఫూర్తితో బ్రతికి నంత కాలం
ఈ చీకటి ఉండదు, మలినం లేదు, మృష లేదు

వెలుగు మనసుతో వెలిగి నంత కాలం
రాత్రి అనే ప్రశ్న లేదు, అంతా పగలే
ఒక్క నక్షత్రం కూడా కనిపించని నిశి వస్తుంది!
ఒకేసారి! చిట్ట చివరిగా ఏ కాంతి సూచన లేకుండా.

## 12. ప్రోగ్రెస్ రిపోర్ట్

దేశ దేశాలలో మహా ప్రజ సంకల్పంతో
　　మారక తప్పని సమాజ చరిత్రలో
సమ వర్తన స్పందన గుణ ప్రగతి సమాజం
　　ప్రజాస్వామ్య పథంలో నడుస్తూంది నవ యుగం
ఈ సందర్భంలో మాత్రం! వర్తమాన దృశ్యం
　　సందేహం కలిగించే లిప్తల చక్రాల పయి.

రవినీ చంద్రుణ్ణీ జలదాన్నీ హితకర రూపాన్నీ దేన్నీ
　　దాచుకోని విశాల గగనం, ప్రజాస్వామ్యం!

కొమ్మలు నాల్కలు చాచి
　　దిశలు చూచే తరు వితతిలా
శుష్క జీవితాలకు, రస బిందువు దొరకేనా?
　　ప్రాణ బంధు వయిన జలదం తన బాధ్యత మరచేనా?

సాంస్కృతిక బంధువులా అపుడపుడూ దయచేసి
　　సానుభూతి సుమాలు నాల్గు విసరి పోయేనా?
రాజకీయ మిత్రంలా ఎదురయి ఒకసారి!
　　ఎన్నికల వాగ్దానాల్లా శబ్దిస్తూ పోయేనా?

బ్రతికే తీరుల కయి వెతికే, తిరిగే
　　కొత్త తరం ముఖ పంక్తుల పయి
చిరు జల్లులు చిలుకుతూ పోయేనా?

నిరీక్షా పథంలో మందగించిన ప్రజాస్వామ్యం
　　మునిగేదీ తేలేదీ తెలియని ఆందోళనలో
శుష్క మయిన నేలపై మాత్రం ఇంకా
　　ఎక్కడ బడితే అక్కడ! తొలగని ముళ్ళ పొదలు!
ఆరోహణలో ఇదీ! ఈనాటి ప్రోగ్రెస్ రిపోర్ట్!

## 13. ఆయుధం చాటున

మస్తిష్కంలో ఒకటో రెండో! అగ్ని పర్వత శిఖరాలు
బూది పొరలు లేస్తూనో; లావా ఎగసి పడుతూనో

హృదయ ధరాతలం పయి హిమానీ మస్తకాలు
తళ తళ కరిగే జలాలతో చల్లదనం కలిగిస్తూ
నిటారుగా నిలిచిన కోర్కెల తరు భుజాలు తట్టీ
గాలి ఊపుతుంది, మనసు విప్పి మాట్లాడుతుంది
ప్రతి సమయం మనిషికి ఆయుధ రక్షణతో పనిలేదు
విరామంలో ఆయుధం మౌనాకృతి వహిస్తుంది
పెదవి విప్పితే మృత్యు సందేశం సూచిస్తుంది
మనిషిలో మౌనం శాంతిని వినిపిస్తుంది నిశ్శబ్దంగా
నేతకు తన మాట చెల్లాలనీ! ముందో వెనకో
ఆయుధం నడవాలనీ రక్షణకో భద్రతకో!

నీలి మబ్బు రాకతో చినుకుల పయి ఆశలతో
అనల ముఖం చాటేస్తుంది, వాతావరణంలో
పచ్చని భవిష్యత్తు నిజ మయ్యే సూచనతో
ఆర్ద్ర భావం చివురిస్తుంది స్నేహ సుమం కయి.
కొత్త పాత తరాల భేదం లేకుండా
సహ జీవన సమబంధం సమాజాన్ని చుట్టేస్తుంది

అగ్గి పెట్టెలో వేయి రూపాయల నోటులా
హ్యాండ్ బాగ్‌లో బంగారు నాణెంలా
మనిషి మనోరూపం! హార్దికంతో ఆర్థికానికి
జడం నుండి చేతన క్రియ! వికాస ఫలం కయి.

గాలి వాహనం పయి సాగి పోయే మేఘంలా
ప్రవాహంలో ప్రజాస్వామ్యం! వ్యక్తి మనసులో.

## 14. ఒక సందర్భంలో

రైలు దూసుకొని పోతూంది సిగ్నెల్స్ దాటుతూ
మధ్య మధ్య స్టేషన్‌లలో జంక్షన్‌లలో విరామాలతో
ప్రయాణ ప్రవాహం ఒడ్డున కదల లేని చెట్లు
వెనక్కి కదలే భ్రమలో స్మృతి చిత్రా లవుతున్నాయి

ఫ్లాట్ ఫార్మ్‌పై బయలుదేరిన రైలుకు బారెడు దూరంలో
స్టేషన్ చేరడం కాస్త ఆలస్య మయి నిలిచిపోయే వారూ
ప్రయాణానికి టికెట్ దొరక్క ఆ సమయంలో
స్టేషన్ నుండి తిరుగు ముఖం పట్టేవారూ

ఎక్క డెక్కడో తమ తమ స్టేషన్‌లలో దిగిపోతూ
సూత్రం నుండి జారిన ముత్యాల్లా మనుషులు,
ఎవరి దారిన వారు; చీలిపోతూ దిశలలో
ఇంటికి చేరే తొందరలో మనోరూపం!

కిటికీ నుండి చూస్తే ఎంత దూరమయినా
మనిషికి ప్రకృతితో వీడని బంధంతో దృశ్యాలు
జీవితంలో మనిషి మనిషికి దగ్గ రవడం కన్నా
ప్రకృతికీ దేవతకూ దగ్గ రవడం సులభంలా ఉంది.
రహస్యాన్ని ఛేదించే క్రియలో కవి పయనం
శబ్ద వాహనం పయి; మనోమయ జగత్తులో

మెతుకును మార్చే ఆకలి తీర్చే
హృదయం విప్పే, ఊహను పెంచే
పనిలో, ప్రతి మనిషీ, ఒక కళ తొణుకుతూ
వర్ణ సామరస్యంతో చిత్రశాల పొందేను.
అన్ని రంగులూ కలిసిన ఇంద్ర ధనూరూపం
ప్రజాస్వామ్య సమాజంలో ఒక మానవ సందర్భం.

## 15. ప్రకాశ రూపం

మస్తకాభిషేకంతో పాటుగా మనిషికి
వెలుగుల ఆవాహనం అవసరం మనసుకు
అణువణువులో విలీన మయి వెలుగులు
జీర్ణమంగే సుభాషిత మవుతుంది జీవితం

శ్రమ బిందువులో ఒక మినీ సముద్రం నుండి
తాపంతో తరలుతుంది పరివర్తన మేఘం!
ఒక మహా నది! ఒక మహా కృతి! ఒక కళాసౌధం
కొత్త ప్రపంచాన్ని దింపుతాయి వెలుగులతో
తనలో మరో మనిషి ప్రకాశిస్తున్నట్లు ఉంటుంది
మాటలో క్రియలో ఆలోచనలో దార్శనికంలో.

జీవన గమనంలో ఆయోజన దిశలలో
అభిరుచి కొంక స్థాయిని చేకూర్చేదిగా
మరో మనిషి! నిర్దేశం ఉత్తేజం ఉపదేశంతో
లోపలి వెలుగుల కొంక విలువల లక్ష్యంతో

ఏ ప్రశ్న కయినా దొరకే సమాధానం
ఏ ఒక పొరకో అరకో చెందిందే
ఎన్నో సమాధానాల కలయికతో సుందరమయి
పరిపూర్ణత కోసం వెలుగుల ఆకృతిపై ఉత్సాహం

విజయంలో ఆనంద విశాల సౌభాగ్యం
కవిగా నేతగా మరో విశిష్ట మూర్తిగా
చరిత్రలో పీఠాన్ని సమాయత్తం చేస్తుంది
ఇది ఎవరి సొత్తూ కాదు అందరిదీ, విశ్వానిదీ!
క్రమణంలో ఆనందంగా హృదయానికి ఉత్తేజంగా
సర్వ హృదయ ప్రజాస్వామ్యం, మానవీయ ప్రకాశరూపం.

## 16. హైడ్‌ను ఎదుర్కొనే

జెకిల్‌ను తోసేసీ మెలమెల్లగా హైడ్ ముందుకు జరిగీ
తనదే మనో రాజ్య మన్నట్లుగా ఉంది

ముందు నుండి జంతువూ వెనక నుండి మృగమూ
అప్పటి స్థితిని బట్టి చేతిలో ఒక ఆయుధం
తన నీడే తన పయి నిఘాతో
నీడ చాటున ప్రేలే రిమోట్ బొమ్మ ఉండ వచ్చు.

రాజకీయ పథకంలో వక్ర రేఖ నుండి
సర్పఫణం ఎపుడు బయట పడేదీ తెలియదు
హైడ్ ఆధిపత్యంలో జీవితాలు మౌనంగా
జెకిల్‌ను మరచీ, కాలం గడుపుతాయి
హైడ్‌ను మరపించే ట్రిక్కులతో నేతలు
మనిషిలో మనీషను మరచిపోయి నట్లుంది

సెల్‌ఫోన్ చార్జ్ చేస్తూంటే 'షాక్' వార్త -
ప్రియురాలి వేలు పట్టుకుంటే అనుమానపు 'కరెంట్'
అపుడపుడూ సశబ్దంగా గుండెపై పిడుగుపాటు
పోయిన శాంతిని అరచేతిలో చూపించే యంత్ర మతులు.

గోడకు తగిలి వెనక్కు రాని బంతి
ఏ ఆటకూ అసలు పనికి రాదు
బాట్‌తో చేతులతో కాళ్ళతో ఆడే దేదయినా
ఆడే ఆటలో స్ఫూర్తికి 'రెఫరీ' అవసరం

ఎన్ని శ్రేణులయినా ఆరోహింపజేసే మనస్సు
విపర్యాస క్రమంలో అట్టడుగుకు దించేస్తుంది
ఇది నిజం కాదు 'భ్రమ' అనుకునే వారూ ఉన్నారు
భ్రమను తలపించే 'హైడ్'ను తోసేసే, జెకిల్ అవసరం.

## 17. ప్రదర్శనను మరపించే

ప్రదర్శనంలో టేబిల్ పయి జార్‌లో నుండి
రిమోట్ తో ఎగిరే రంగుల పావురాళ్ళు
ఎదపై వాలేది ఒకటీ, తలపై నిలిచేది ఒకటీ
బుజాన ఒదిగేది ఒకటీ! మణి కట్టుపై ఉండేదీ ఒకటీ!

వేదిక పయి బుట్టలో నుండి ప్లాస్టిక్ పేపర్ పూల దండలు
పెండ్లికీ ప్రియురాలికీ దైవానికీ నేతకూ వేరు వేరుగా.

బాక్స్‌లో నుండి కొమ్మలతో లేచిన చెట్టూ
'ఇంకా ఏం కావాలి? జీవితంలో' అన్నట్లు ఉన్నాయి
బ్యాగ్‌లో నుండి బయట పడే రక రకాల పూలు
ఒకటొకటీ చేతిలో కరెన్సి నోటులా మారుతూంది.
ప్రకటనలతో వాగ్దానాలతో నిండిన రాజకీయాల్లా
క్షణాల్లో కావలసినవీ మెజిషియన్ ప్రదర్శనంలో

మధ్యలో తెర వెనక నుండి అసల రాగం
"ఈ వెచ్చదనం ఎవరికోసం?" అంటే
"చలికి వణకకుండా? ముందుగా" అని సమాధానం
ఒక విపరీత స్థితిలో స్పందనమూ అంతే చిత్రంగా!

జవాబు బాణంలా దూసుకుపోతుంది
ప్రశ్న తగిందా? కాదా? అని కాదు
అది బాణమే అయితే ఎదురుగా ఉన్న
మనిషి తలను ఎపుడో ఎగరేసుక పోయేదీ!

తల ఉన్న మనిషి కోసం అన్వేషణ
సెల్ ఫోన్‌లో ఎస్.ఎమ్.ఎస్.లలో
టెలివిజన్‌లో పత్రికల్లో ప్రకటనలు
ప్రదర్శనను మరపిస్తూంది ప్రజాస్వామ్యంలో రాజకీయం.

## 18. తెరచిన మనో దృశ్యం

మనో నిలయం ద్వారం తలుపులు తెరవబడీ
మూయబడదు తాళం వేయబడదు ఎప్పటికీ

మెలకువలో లోకం దృష్టి పోదా నిలయం వైపు
నిదుర నుండి లేచాక అనుభవ ముద్రలు మిగిలీ
మహాద్వారం బయట సాధారణ జన జీవితాలు
ఇది గుర్తుకు వచ్చేదీ విశేష సంస్థితి లోనే.
జీవన వ్యూహంలో అడుగు వేసి కదలితే
తిరిగి వెనక్కు మరలి వెళ్ళే అవకాశం లేదు
మనో నిలయం చేరే సాహస మెవరి కుంది?
అంతరంగ స్పందనం విన గలిగిన హృదికి తప్ప!

పక్షు లెగిరి పోతే చెట్టు తొలగి పోదు
వ్యక్తి బయట పడితే ఇల్లు మాయ మవదు
మనిషిని చూచి చెట్టు, పూలతో పండ్లతో
తన త్యాగానికి గర్వంగా తల కదలిస్తుంది.

పదానికీ పదానికీ మధ్య ఎడం
ఊహలో రహస్యం అణగీ మణగీ
వాక్యానికీ వాక్యానికీ మధ్య ఎడం
తాను తీయగల మోయగల అర్థాలతో
శూన్యం నుండి శూన్యానికి పయనం
కుడి వైపున చేరే అంకెల విలువలతో

కాగితం పయి అక్షరాలు! కొత్త ప్రపంచంతో
భూమిపై కొత్త సృష్టికి జన్మ నిచ్చే చినుకుల్లా
తెరచిన మనోద్వారం గురించి చింతన మెక్కడుంది?
బొమ్మను పట్టుకొనీ తిరిగే పసి మనసులో!

## 19. ఆశను నిలిపే రోబోట్

అద్దంలో ఎగిరే ఆట బంతి బింబాన్ని
    అందుకొని ఉత్సాహంతో ఆడుకునే శిశువులా
మనిషి మనసులో ఒక రోబోట్.
అరటి ఆకుకూ వెండి పళ్ళానికీ భేదం తెలియని
శిశు దశలో, పాత్ర ముఖ్యం కాదు, విషయం తప్ప
వైరుధ్యాల వ్యత్యాసాల విభేదాల గతులూ తెలియవు

దోసిలిలో చేతి వేళ్ళ సందులలో నుండి
    నీటి చుక్కల్లా జారే క్షణాల్ని ఒకేసారి
తన వశం చేసుకో చూస్తుంది 'రోబోట్'

స్కూలులో టీచర్ చెప్పే పాఠం పయి కన్నా
    బ్లాక్ బోర్డ్ చాక్ పీస్ డస్టర్ పై చూపుతో
వర్తించే మనః ప్రపంచానికి ప్రతినిధి రోబోట్

జలపాతం పయి విద్యుత్కేంద్ర నిలయం మస్తిష్కంతో
    నఖ శిఖ పర్యంతం విద్యుత్ ప్రసారాన్ని నిలుపుకొనీ
గగన సరసిని తలపించే మౌనముఖంతో
    మనసుకు పట్టని కోర్కెలు తీరుస్తుంది
వినోదంతోపాటు ఆత్మ బలం పెరిగీ
    చిక్కు ముళ్లకన్నా కుసుమ లతను తలపిస్తుంది
వీధి లోకి వెళ్ళకుండా ఏ బ్రతుకూ గడవదు
    ఇంటి పట్టు లేకుండా ఏ బ్రతుకూ నడవదు

వేరు నుండి కొమ్మకూ కొమ్మ నుండి పూవుకూ
ప్రసరించే జీవ శక్తి చలనంతో
అంతా దృష్టమే, అతీత మేదీ లేదు
ఫ్లవర్ పాట్‌లో మొక్కలా ఆశను నిలుపుతుంది 'రోబోట్'.

## 20. భౌమంలో ఉన్నతిలో

జ్ఞాపకం దయ చేస్తుంది బంధువులా మిత్రంలా
పూర్వ పూర్వ బంధాల దృశ్యాల్ని పునర్నిర్మిస్తుంది
శిథిలాల పయి అడుగులు వేస్తూ అన్వేషణలో
తానొక నడచే శిల్పం కావడం ఎవరి కిష్టముంటుంది?

చీకటిలో దీపం అవసరానికి వెలుగుతుంది
ఎవరి బ్రతుకులోనో! ఏ చీకటి వేళలోనో!
దీప మయి వెలగడం ఎవరి కయినా ఇష్టమే!
వెలుగూ చీకటి చెరొక వైపు నుండి
ఒకరి నొకరు మ్రింగాలనీ మనిషిలో
ఆరోహణ కవకాశం లేని గాలి వాటులో
గగనానికి నిచ్చెన వేసే ఉబలాటం! కొందరిలో

గాలికి ఊగుతూ చెట్టు విసురుతుంది! స్వర పంక్తులు
అలలతో కదలుతూ నది చూపుతుంది! నృత్య భంగిమ
గగన గళంలో జలదం అలంకారమే కాదు
భూమికి సృజన సంపద నిచ్చే ఉదార హృదయం.

ప్రకృతి ఎంత మహనీయం ఆకర్షక మయినా
జలధి లోకి దిగి పోలేం, అడవిలో కలిసి పోలేం
ఇపుడు సమాజంలో మనిషికి దగ్గరవడం కన్నా
ప్రకృతికీ జంతువుకూ దగ్గరవడం శ్రేయంలా ఉంది

ఎప్పటికీ తరగని ఆగని సముద్రంలో అలలతో
తుపానులా ఆలోచన విలయ క్రీడ చూపుతూంది

లౌకిక జీవన గతిలో మాటకు విలువ తరిగి
వేదనలో ఖేదంతో పాటకు వెలుగు తగ్గి

భౌమంలో ఉన్నతి కోల్పోయే అవకాశం ఉంది
ఉన్నతిలో భౌమం కనిపించక పోవడమూ ఉంది.

## 21. శిశిర పర్వం

భూమి పయి మనుషుల తలల్ని పొడుస్తూ
నింగిలో విమానం రెక్కల్ని ఢీకొంటూ
ఎగిరే ఇనుప రెక్కల విహాయసాల్లా
నేలపై దిశ మరచిన రాజకీయ పార్టీలు

ఒక అల్ప రాజకీయంలో తేలిన శవం
మరో వక్ర రాజకీయానికి విషయ మవుతూంది
విషయంతో పాత్రల తీరు వేరవుతూంది
ఎగసే ధూళికి కనురెప్పలు వాలుతున్నాయి

మనిషి గుండె తలుపులు కొట్టు కొనీ
ఆపరాని దుస్థితి తీవ్రతర మవుతూంది
ఊయల పయి ఊగే మనస్సు అంతలో
బంధం తెగి ప్రమాదాన్ని హెచ్చరిస్తూంది.

తన కిష్ట మయిన రంగులలో మంచి తనం
తన కిష్ట మవని రంగులలో చెడ్డతనం
ఊహలలో చర్యలలో రంగుల కలయికతో
మనిషి ఎదురుగా మనిషి! రాజకీయ వైరంలో

బయటికి వెళ్ళితే! మెయిన్ రోడ్ వదలి
సందులలో నుండి ఇంటికి చేరాలిసి వస్తూంది
నిరసనలో ప్రదర్శనలో ఘర్షణలో క్షణాలు చిక్కుకొనీ.

ఎర్ర బడిన మనిషి కళ్ళు మనిషి పయి
ఎరుపు రంగు చిత్రాల్ని అద్దుతూంది
జీవన రణంలో శాంతి! కల్పనలో మిగులుతూంది
పాయలుగా చీలుతూ నలిగే సమాజంలో
జీర్ణమయి ప్రజాస్వామ్యం! శిశిర పర్వంలా ఉంది.

## 22. ప్రమాదం అంచులలో

విశ్వమయం ఆలోచన జన హిత కరమయి
మేధ నుండి సంఘానికి స్నిగ్ధంగా ఆర్ద్రంగా
నేలకు దిగే కిరణాల్లా వాన చినుకుల్లా
అణువణువును అలరిస్తూ మనిషి మనిషిని స్పృశిస్తూ.

అన్వేషణలో శ్రమ చలనంలో ఉత్ప్రేరకమయి
హృది నుండి హృదికి ప్రసార భూమికతో
అన్వేషణలో మానవ వికాస పరిణామం
శ్రమ చలనంలో సమాజ జీవన సర్వస్వం

రవి శశి జలదాలకు చిరునామాతో పనిలేదు
మంచికీ మమతకూ ప్రచార రథ మక్కర లేదు

బ్రతుకులో విశేష ఘటనతో దృశ్యం
సన్నివేశ విషయానికి కొత్త మలుపు నిస్తుంది
త్రాగ రాని నీరు జలధిలో సంతప్తమయి
ఎగసి పైకి కదలే నవ జలదంలా
వర్తమాన స్థితుల నుండి భవిష్యత్తుపై ఆశలో
సుగమ జీవితం కయి స్వాదుత అవసరం

మంచి మనిషిగా పాత్రలో నటించడానికి
తనలో మంచితనంతో పని లేదు
నటనలో తాడు పాముగా మారుతుంది
పాత్రలో ఆకర్షణ నిజ వ్యక్తిని మరిపిస్తుంది.

భయావహ రూపంతో పిడుగు లాగా
ఉన్మత్త చర్యలతో తుపాను లాగా
ఈనాటి రాజకీయ దుర్నయంలో సమాజం
ప్రమాదం అంచులలో ప్రవాహంలో ప్రజాస్వామ్యం.

## 23. సమాజ కథలో విలువలు

సౌధానికి నిలయ శ్రేణి పరంపర సాగాలనీ
      సంపదలో సంఖ్యకు మరొక సంఖ్య చేరాలనీ
పూరి ఇల్లు పెంకుటిల్లు మేడ బహు విధ నివాసాలు
      ఆర్థిక స్థాయిల్లో తొలగని తీవ్ర భేద ప్రకారాలు
విశ్రాంతికి నిలయం ఉంటుంది కానీ
      చలన శీల హృదయానికి లేదు విశ్రాంతి
విరామానికి సమయం ఉంటుంది కానీ
      గమన శీల జీవితానికి లేదు విరామం.

కోరిక అంచున సమస్యలు! బ్రతుకును బంధిస్తాయి
గెలుపూ ఓటమి ఇరు పొరలలో మానసిక భూమికలో
ఏదో ఒక కోణంలో ఒకరితో ఒకరిలో
      విజయం అడుగున ఒక ఓటమి దాగీ
ఏదో ఒక కోణంలో ఒకరితో ఒకరిలో
      ఓటమి అడుగున ఒక విజయం దాగీ

లౌకిక పాత్రలో ఆత్మ గౌరవ శిఖరం
      గాలికి చెదరి ఎగిరి మాయ మయ్యే
భస్మ రాశి అవకూడదు, ఎన్నటికీ.
కాస్త వేడికి కరగి జారిపోయే
      హిమానీ రూపమెత్తకూడదు, ఎప్పటికీ
ఆత్మ హత్య గమ్యానికి శరణ్యం కానేకాదు.

చేతి నుండి నేల పయి జారిపడి ముక్కలయిన
      మట్టి బొమ్మ కాకూడదు! వర్తమాన సమయం
విసరిన కరెన్సీ నోట్లలా క్షణాలతో ఈ సమయం
      సమాజ కథలో విలువలు చెదరిన ప్రజాస్వామ్యం.

## 24. క్రీడలో రెఫరీ

తెలుపు ఎరుపు నలుపు రంగులు
ఉదయం అస్తమయం నిశా సమయ ప్రతీకలు
ప్రకృతి నేపథ్యంలో త్రిదశలతో జీవితం
జవాబు కయి ఎదురు చూడని నదిలా

తేదీలు మారతాయి వత్సరాల అంకెలు మారతాయి
నిన్న మొన్నటి గాయాలు స్మృతి షెల్ఫ్‌లో భద్రంగా.
కొత్త దుస్తులతో రోజు అడుగులు వేస్తుంది
గాయం తగలని, బాధ తెలియని నీడలు మాత్రం, అవే!

వెన్నెల రాత్రి ఒకరిని మనో వేదనకు గురిచేస్తే
ఎండల పగలు ఒకరిని శ్రమ బాధకు గురి చేస్తుంది
భావనలో ఒక రంగూ, సక్రియలో ఒక రంగూ
పగలు రాత్రి పార్శ్వాలతో జీవన చక్ర భ్రమణం!

అద్దంలో బయటి రూపం కనిపిస్తుంది, ఉన్న విధంగా
మనస్సులో మాత్రం వస్తూ పోయే, రూపాలెన్నెన్నో.
గాలికి కదలే నీడలతో సూర్యుడు ఆడుకోవడం చూస్తే
ఇంటి పెద్ద పిల్లలతో సరదాగా ఆడుతూన్నట్లు ఉంటుంది

కదలే క్షణాల వర్తమానం వెనక
నిలవని జ్ఞాపకాలు! పోగొట్టుకునే వెన్నో!
తరలే క్షణాల వర్తమానం పయిన
రావలసిందేదో! ఇంకా రాలేదనీ బాధ

స్పందమాన కవి హృదయం! అనుకోకుండా
ఆమోదంలో కీర్తిస్తుంది! ఆగ్రహంలో శపిస్తుంది
ఇరు వైపుల తీరాల మధ్య మైదానంలో కవి
ప్రజాస్వామ్య సమాజంలో క్రీడలో రెఫరీ.

## 25. ఎత్తుల కతీతంగా

మనిషిని మనిషిగా బ్రతక నీయని స్థితిలో
మనస్విగా ఎదిగే అవకాశం ఎక్కడుంది?
అన్ని వయో భేదాల్లోనూ ఏదో ఒక విపరీత స్థితి
సుగతిని తప్పిస్తూంది, అగతిని రప్పిస్తూంది.

కెరటం ఒడ్డున ఆగీ, చెదరి జారి పోతుంది
అడుగులు మునుముందుకు కదలి సాగిపోతాయి
రోదసిలో క్షిపణిలా మస్తిష్కంలో ఆలోచనతో
అలసటనో వేడుకకో, ఆగే మజిలీ, గమ్యం కాదు

అలసతకు సమాధి చూపే ఉత్తేజంతో
ఆటంకం దాటుతూ పోవడం పురోగమనం
అపుడపుడూ వెనక్కు తిరిగి చూడడమూ అవసరం
విచ్ఛిన్నం కాకుండా పూర్వజ పరంపరలో భాగంగా.

కోరే లక్ష్యం, బాణపు గుర్తులతో పరిపోదు
దారినీ సాధనాన్నీ ఎన్నుకొనే అవకాశం అవసరం
ఆవేశం నడిపిస్తుంది! ప్రతి అడుగును ముందుకు
వివేకం వెలిగిస్తుంది! ప్రతి లిప్తను భవిష్యత్తుకు

ముడిచిన అరచేయి పిడికిలిగా మారీ
కంటి నీరు తుడిచేందుకు చాచిన చేయి!
వేలుతో కంట్లో పొడవడ మొక కుటిల రాజకీయం
ప్రశ్నలో హేతువు సూదిలా గుచ్చుకోవడం విచిత్రం.

సంకల్ప గగనంలో జలదం కనిపిస్తేనే
సమాధాన సరస్సులో కమలం వికసిస్తేనే
ఎత్తుల కతీత మయిన మనిషిలో మనస్విత!
ప్రజాస్వామ్య ప్రక్రియలో అవసరం! నైతిక రూపం!

## 26. సెల్‌ఫోన్ - మినీమేఘం

క్రిందికి దిగిన మినీ మేఘంలా చేతిలో సెల్‌ఫోన్
ఎప్పటి కపుడు బహు విధాల వార్తా విశేషాలతో
స్విచ్ ఆన్‌తో తొలకరి జల్లు ఛన ఛన శబ్దం
మనసును పరుగెత్తిస్తుంది అశ్వ వేగ గతిలో

కల్పనకు తావు లేని వాస్తవ కోణాల నుండి
దూర దూరాన మనిషి స్వరం బహు దగ్గరగా వినిపిస్తుంది
క్షణాన్ని కరగిస్తుంది అర చేతిలో మంచు ముక్కలా
గాలిని కదలిస్తుంది! గుప్త స్వర సరణంతో

ఎదురు పడే చెట్లనూ కొండల్నీ పట్టించుకోకుండా
చెదర జేసే మాటల్ని ధ్వనుల్ని లెక్క చేయకుండా
తల్లి ఒడి లోనో తండ్రి ఎద పైనో వాలేందుకు
వేగంగా పరుగిడుతూ వచ్చే శిశువులా చేరుతుంది మాట.

అవసరంలేని కొందరికి బహు చిరాకు
అవసరం ఉన్న ఎందరికో బహు ప్రియం
చిరాకు పడే చేతుల్లోనూ ఒదుగుతుంది వినయంగా
అంతా ఇష్టపడే విధంగా గర్వంతో నిష్క్రమిస్తుంది.

తర తమ భేదం లేకుండా వివిధ స్థాయిల్లో
ఎవరెవరి నుండో విశ్వ బంధు సూత్రం పయి
ఇక్కడికి అందిస్తుంది ఎక్కడికో చేరుస్తుంది
మనుషుల మధ్య నున్న దూరాన్ని చెరపేస్తుంది.

నివాసంలో ప్రయాణంలో మినీ శ్రవణ యంత్రం
ఆ సమయానికి అవసరంగా మాట్లాడే కర్ణాభరణం,
బీద బిక్కు నుండి రోహణలో శ్రేణుల్ని
చుట్టి వచ్చే సన్మిత్రం! వార్తా హర మినీ మేఘం!

## 27. తీరాన స్మృతులతో

అద్దాల ఆల్మైరాలో అమర్చిన పుస్తకాల్లా
పుట్టిన రోజు నుండి ఏడాది కొకటి చేరుతుంది
గడచిన వత్సరాలు మదిలో వరసలో అపుడపుడూ చెదరీ,
ఎపుడో కాని పుస్తకం పుట తెరవబడదు.

పుట్టిన మొదటి ఏడుతో తొలి పుస్తకం
బ్రతికి నంత కాలం ఒకటొకటీ వరసగా
బయటికి కనిపిస్తూ షెల్ఫులు నిండుతూ,
భద్రంగా ఎవరి గాథలు వారికి ప్రియంగా

దుఃఖంలో పారే నీలి రంగు ఆకాశం
వేదనలో కదలే ఎరుపు రంగు సాయం సంధ్య
సూర్యుని మ్రింగాలని పరుగెత్తుకొచ్చే మబ్బులూ
మబ్బుల్ని దూర దూరం తరిమే గాలులూ
గాలుల్ని ఆపాలని చూచే చెట్లూ కొండలూ
జీవితంలో వాస్తవ దృశ్యాల్ని తలపిస్తాయి.

చీకటి ఎక్కడికి పోతుంది? ఎక్కడికీ పోదు
కాస్త కాస్త దూర దూరం జరుగుతూ పోతుంది
ఇదొక శాపమూ కాదు, పాప చిహ్నమూ కాదు
మళ్ళీ దయచేస్తుందనీ నిరాశ అవసరం లేదు

అన్నిటికీ వెనక నుండి అంతరంగ ప్రకాశం
ప్రసరించి సరి కొత్త దృష్టిని ప్రేరేపిస్తుంది
ఎపుడెపుడో పుస్తకంలో పుటలు తెరవబడీ
ప్రవాహ గమనంలో మలుపును తేవచ్చు.

తీరాన స్మృతులతో ప్రవాహమయిన జీవితం
ప్రజాస్వామ్య చేతనతో సృజన లోక హృదయం.

## 28. శ్రమ సోపానాల పయి

ఒక సమయంలో కాలాన్ని శాసించగల మనిషి
కొన్ని క్షణాలలో కాలం అంచు నుండి జారేను
పొద్దున ఆకు పయి మంచు బిందువుకు బదులు
అనల కణం! పొద్దు వాలుతూ బూదియై రాలుతుంది

చీకటి భయ పెడుతుంది, అనుమానానికి హేతువవుతుంది
ఉన్నట్లుండి తొలగుతుంది, ఎవరికీ అపకారం చేయదు
విరామాని కవకాశం ఇస్తుంది, నిద్రకు తలుపులు తెరుస్తుంది
నిద్రించే కొండ, మేల్కొన్న నది, మధ్యలో స్వప్నం!
మబ్బు నావలో పయనిస్తున్నట్లు ఉంటుంది
మెరపు తీగ పయి అడుగులు పడుతున్నట్లు ఉంటుంది.

రాజకీయం అంచుల్లో నేతలు తిరుగుతూ పరుగెత్తుతూ
ఎపుడు ఊబిలో దిగబడి పోయేదీ తెలియదు
అశాంతి తీగె పయి నడుస్తూ నడుస్తూ
ఎపుడు బాలెన్స్ తప్పి పడి పోయేదీ తెలియదు

ఒక పుట్ట నుండి మరో పుట్టకు పాములా
ఒక చెట్టు నుండి మరో చెట్టుకు పక్షిలా
ఒక నీడ నుండి మరో నీడకు నేతలూ
ఏ నిలయం వీడి ఏ నిలయం చేరేదీ తెలియదు

సందర్భం లేదు అనౌచిత్య మనిపించదు స్వార్థంలో
గెలుపో ఓటమో! ప్రతి ఎత్తూ ఒక పాచికగా
ఆశ్వాసం చివర పద్యంలా సన్మానం ఉంటే అందం
ప్రతి పద్యానికి సహృదయ హృదయ స్పందనం 'ఒకే!'
గోల్డ్ మెడల్ పొందే క్షణాల అనుభవ రుచి
శ్రమ సోపానా లెన్నిటినో దాటితేనే సాధ్యం!

## 29. కాలం వెనక్కి మరలదు

ప్రతి వ్యక్తీ పనిలో నడచే వెలుగు దారి ఒకటే
ఆలోచన! వ్యక్తి పరం, ఎవరి తీరు వారిది
సమూహం నుండి సమాజానికి, ధార నుండి ప్రవాహంలా
ప్రవాహంలో ప్రజాస్వామ్యం! వర్తమానాన్ని మోసుకొనీ

దేహానికీ మనస్సుకూ ఆపై పైన అంతరంగం
వీటి మధ్య దూరం! తెలియని నిజాలలో ఒకటి!
శిథిల మయిన సౌధం స్థానంలో ఆలాంటిది రావచ్చు
ఒక మనీషి స్థానంలో ఆలాంటి వ్యక్తి అసంభవం.

నడచే దారిన, కాలం వెనక్కి వెళ్ళే వీలు లేదు
పోయే దారి చీల వచ్చు, మారవచ్చు కానీ, కాలం ముందుకే
వెనక నున్న గతం గేటు తలుపులు మూయబడీ
వ్యక్తి అంతరంగ స్ఫురణలో ప్రకాశంతో
దీన్ని తెరవడ మొక సంస్కృతికే సాధ్యం

పేరు లేని వస్తువు లేదు, మనిషీ లేదు
కొన్ని పేర్లు చక్కగా అమరుతాయి
కొన్ని పేర్లు వెక్కిరిస్తున్నట్లు ఉంటాయి
కొన్ని గగన పుష్పాలను తలపిస్తాయి

గుండ్రంగా వేగంగా తిరిగే సమాజ పీఠం పయి
పాలకుడో శాసకుడో! దింపడం సులభం కాదు
తిరిగే చక్రం వేగం తగ్గే దాకా వేచి చూడవలసిందే!

అద్దంలో ముఖం, ప్రవాహంలో మచ్చలేని చంద్రునిలా
తన కళ్ళకు ఎంతో అందంగానే కనిపిస్తుంది
అద్దం పక్కకు తొలగీ! అదే ముఖం
మచ్చలతో చంద్రునిలా సమాజ క్షితిజంలో!

## 30. సంక్షుబ్ధ స్థితి అంచులో

మదిలో ఆ క్షణం తోచిన పదంతో మొదలయి
 పరిచయంతో వ్యక్తిలా మరో పదం! వరసగా

ఆదర్శానికీ వాస్తవానికీ మధ్య అనుభవంలో
 గోడల్ని కూల్చవచ్చు, మంచు తొలగి పోతుంది
ఇక నీడల సంగతి? ఎప్పటికీ ఉండేవీ!
ఆటంకం సందేహం అనిశ్చయం నుండి విమోచనం కయి
 ప్రబోధాలు! సూక్తులు! సిద్ధాంతం! దార్శనికం! నిరంతరంగా

కోరిన వ్యక్తిని నీడ క్రమ్మి మరవడం విపరీతం
 మనిషిలో నమ్మకం కయి మనిషి నుండి అభిజ్ఞానం
అది జారిపోవడం మరచిపోవడం! సమాజంగా ఉన్నదే
 దీన్ని తిరిగి పొందడం! అస్తిత కవసరం.

అందీ అందని ప్రేమను తిరిగి ప్రసాదిస్తుంది
 చిత్తానికి దూరమయిన శాంతిని చేకూరుస్తుంది
విడిపోయే చివరల్ని ఒకటిగ కలుపుతుంది
 జీవితాన్ని విజయ కేతనంతో నడిపిస్తుంది.

రాలే పూవులో వేదన, ఫలించే కాయలో హ్లాదం
 రెండింటికీ చెట్టు ఒకటే! కొమ్మ ఒకటే

కిరణం గోల్డ్ నిబ్ పెన్! ఆకాశ ద్రవం రంగులతో
 వర్తమానం పుటల్ని అనుకోనివి నింపుతుంది
ఎవరు చూచినా చూడక పోయినా! నీడకు దూరంగా!

ఆలోచనలో నిర్మాణ శక్తుల ప్రేరణతో
 స్వయం విహిత స్వేచ్ఛా సంచరణంతో
జీవిత రచనలో మానవతా గంధం కోరే
 ప్రవాహంలో ప్రజాస్వామ్యం, ఇపుడొక సంక్షుబ్ధ స్థితిలో.

## 31. ఎవరి దారి వారిదే

జననంతో అస్తిత్వం పొందడం మొదటి గెలుపు
మరణంపై యశోనిధిని పొందడం చివరి గెలుపు
ఈ మధ్యలో జీవితాన ఓటము లెన్నయినా
అవి ఏవీ హేతువు కతీతాలు కావు, వివేచనలో

ఓటమి భరించలేని మనస్సు మనిషిని
గెలుపు కయి అడ్డ దారులు పట్టిస్తుంది
చీకటి ఒక విశేష రహస్య రూపం
వెన్నెల శాలువాతో సన్మానం పొందుతుంది.

చీకటి చుట్టేస్తుంది ఇనుప తీగెల చేతులతో
వెలుతురు చుట్టేస్తుంది స్వర్ణ సూత్రం చేతులతో
నిశి వెన్నెల స్వప్నాన్ని ఆహ్వానిస్తుంది
పగలు వెలుగు స్వప్నాన్ని మరపిస్తుంది.

మోదంలో చల్లని బాష్ప కణం విశ్వాసం పెంచుతుంది
ఖేదంలో వెచ్చని బాష్ప కణం విశ్వాసం సడలిస్తుంది
వెలుగు ఒక సుందర ప్రకాశ రూపం
దీనితో నిండుగా బ్రతకడ మొక కళ

చెట్ల పయి నది పయి క్షితిజంలో మనిషి పయి ప్రకాశం
దేని స్థాయి ఏదో అప్పటి స్థితిలో ప్రకటిస్తుంది
విలువల్ని తెలిసి వాటికి వెల కట్టడం
వలువలు కట్టి నంత సులభం కాదు.

నావను నడిపేది నావికుడూ, నేత ఒకటే
నావలో పయనం చేసేది, ఎవరెవరో, ఎందరో
తీరం చేరాక, గమ్యంలో ఎవరి దారి వారిదే! స్వేచ్ఛగా
ప్రవాహంలో ప్రజాస్వామ్యం తీరం చేర్చే సాధనం!

## 32. కాంతిరూపం

కాలమూ సమాజమూ మధ్య ఒక కవి బింబం
ఇరువైపుల మెలుగులు ప్రసరించే కవి కర్మ కావ్యం!
జలధి లోతులోకి ఆకాశం తొంగి చూస్తుంది
బ్రతుకు రహస్యాల్ని కవి మనస్సు అన్వేషిస్తుంది.

తన కయి బాష్ప జలం రాల్చే కళ్ళ కయి ఎదురు చూచే బదులు
పీడితుల కయి బాష్ప జలం కళ్ళ నుండి రాలడం మానుషం.

ఒక్క మెరుపు వెలుగులో కోరిన వన్నీ కనిపించాలనీ
ఎంత సుందర స్వప్న మయినా ఎప్పటికీ నిలవదు.

మనిషి హృదయమూ మేధ కలిసిన ఉపజ్ఞతో
సర్వ హిత సౌభాగ్యం! విశ్వానికి ఉపకృతిగా

కొండరాళ్ళ పగుళ్ళ నుండి సందుచేసుకొనీ మొక్క వస్తుంది
ఎడారి కుంపటి గుండె నుండి వీలు చేసుకొనీ పూవు వస్తుంది
మనిషిలో మొక్క రావడానికి వెనకాడుతుంది
రాక రాక దయచేసీ ముఖంలో పూచే పూవును
త్రుంచేందుకు మనిషి చేతుల సమీపిస్తాయి మెల్లగా.

ఒక్కొక్క కన్నీటి చుక్క నక్షత్రాలతో కరుణమయమయి
ఒక్కొక్క ప్రజా విజయం! కిరణమయమయి ఉత్సాహ సమాజం
ఒకొక్క శ్రమ బిందువు విద్యున్మయమయి! వాతావరణం!
చుట్టుముట్టిన ప్రశ్నల మధ్య నుండి దారి చేసుకొనీ
పొంచి ఉన్న భయాల అంచుల నుండి చోటు చేసుకోనీ
ప్రజాస్వామ్య చేతనకు మానవత కాంతి రూపమిస్తుంది.

## 33. అక్షర రణం

రాతి కొండ లేవీ కరగవు కదలవు మారవు
మంచు కొండ మాత్రం! జల ధార స్రవించవచ్చు.

ఇపుడున్న సమాజంలో వర్తమాన వాతావరణంలో
శుభ్రమయిన స్నేహ పరిమళ నిలయం
కలుషితమయి వైర ధూమ చిత్రశాల అవుతూంది
సీమల్నీ కొండల్నీ నదుల్నీ దేశాల్ని దాటి విస్తరిస్తూంది.

మధ్య మధ్య రుధిర ప్రవాహాలు! అగ్ని శిఖలు! దాటాలనీ
నిర్మించిన వంతెనలు! దార్శనికాలు! ఎవరయినా కూల్చవచ్చు.

తొందరగా దాటే కోరికతో ప్రజ సంకుచిత స్థలాలలో
నిరీక్షలో గడుపుతూ అశాంతిలో వేగుతూ

సమూహానికీ సంఘానికి పార్టీకీ చిహ్నమైన పతాక బదులు
వ్యక్తి చేతిలో మరో పతాక! లోన ఒక ఎజెండా
ముక్కలవుతూన్న ప్రజాస్వామ్య చరిత్రలో
ఎవరి చేతిలో ఏ పతాక నిలిచేదీ తెలీకుండా ఉంది.

ఏది ఎంత దయినా దేని కది స్వయంభవం కాదు
కొండ పయి జారే ధారలు కలిసి ప్రవాహంలా
జలధి నుండి ఎగసీ, ఆవిరి పోగులు కలిసీ నీల మేఘంలా
సామాజిక చలన జీవ శక్తి నుండి కవి కవితా రూపం.

కావ్యానికి తాత్త్వికత, నిలిపే వెన్నెముక లాంటిది
మనస్తత్వ మూలం పయి వ్యక్తిత ప్రకటిత మవుతుంది
దార్శనికం కవిత్వాన్ని వెలుగు ద్రవంలో ముంచి తీస్తుంది.
సరళ రేఖలో మొదలయి జీవితం వక్ర రేఖలు చుట్టి వస్తుంది.
క్షరం కాని రణం, అక్షర రణమయ రూపం కావ్యం
నవం కోసం హితం కోసం మార్పు కోసం సమాజంలో.

# మాదిరాజు రంగారావు కృతులు - 1953-2025

## A) స్వేచ్ఛా కవిత్వం

### ❖ I.స్వేచ్ఛా కవిత్వం - మొదటి సంపుటం రచనా కాలం 1953 - 2002

**i. స్వేచ్ఛా నవం :** 1. మానవీయం 2. పడగెత్తిన ఉదయం 3. ముక్తధాత్రి 4. ఇది వియత్నాం 5. యుగ సంకేతం **ii. 6. ఆవాహనం iii. 7. ముక్తకాలు. iv. సమయ దర్పణం :** 8. నాలో ప్రవహిస్తోంది నది 9. నాకు జ్ఞాపకముంది **v. 10. కిర్మీరం** 11.మనోభూమికలు **vi. వర్తమానం స్క్రీన్ పై :** 12. వెలుగులో ఈ నేలపై 13. మేల్కొన్న ఈ సమయం 14. శబ్దమయి ప్రాణమై 15. అగ్నిమయం జీవితం 16. కాలాన్ని నిలిపి క్షణం 17. ఈ తరం స్వరచిత్రం 18. అశాంతి ఆర్కెస్ట్రా 19. వర్తమానం స్క్రీన్‌పై **vii. 20. అగ్ని నుండి ఆనందానికి viii. ఈ శాతాబ్ది రెక్కలపై** 21. జైలు కార్నర్ నుండి 22. ప్రయాణం నుండి ప్రయాణం 23. డైరి దర్పణంలో 24. ఈ శతాబ్ది రెక్కలపై 25. శాంతి స్వప్నం **ix. అగ్నిపితం** 26. క్రాస్ ఫైర్ 27. సీజ్ ఫైర్ 28. నేడు రేపు మధ్య **x. 29. కిరణ పథం** 30. స్వేచ్ఛకు సిగ్నల్

### ❖II. స్వేచ్ఛా కవిత్వం - రెండో సంపుటం రచనా కాలం 2003 - 2012

31. అభిషేకం 32. ఆగమనం 33. ఎప్పటికీ కొత్తే 34. సృజన దర్శనం 35. మరో వైపు 36. హృదయ మేఘం 37. సమకాలీనం 38. అభినవ యానం 39. ఆత్మ బంధం 40. సృజన మేఘం 41. ఉగ్ర చరణం 42. సవారంభం 43. గిఫ్ట్ ప్యాకెట్ 44. నవ దర్శనం 45. పునర్దర్శనం 46. నడిచే వెలుగు చుట్టూ 47. అపూర్వ 48. అజ్ఞాతం నుండి 49. రోజు వస్తుంది 50. ఉద్యమ చరణం 51. ఆల్బంలో ప్రజాస్వామ్యం 52. అద్దంలో ప్రజాస్వామ్యం 53. ప్రవాహంలో ప్రజాస్వామ్యం

### ❖III.స్వేచ్ఛా కవిత్వం - మూడో సంపుటం రచనా కాలం 2013-2015

54. ఖడ్గం కన్నీరు కార్చదు 55. చార్ ధామ్ 56. ఆల్ ఇన్ వన్ 57. ఉద్యమ పథం 58. అడవిలో ఆయుధం 59. చెదరిన ప్రజాస్వామ్యం 60. గాయ పడిన ప్రజాస్వామ్యం 61.ఈనాటి నిజం 62. ఇంకా బహు దూరంలో ప్రజాస్వామ్యం 63. సంస్కృతి & హృదయం నుండి 64. తెలంగాణ స్వరం, ఆత్మబంధం

### ❖IV. స్వేచ్ఛా కవిత్వం - నాలుగో సంపుటం రచనా కాలం 2015 నుండి 2018

65. వర్తమాన స్వనం 66. లైన్ క్లియర్, 67. వర్తమాన వాస్తవం 68. వర్తమాన లహరి 69. వర్తమాన యానం 70. వర్తమాన సంకేతం 71. ఇదే దారి 72. నవ మానవం 73. ప్రపంచీయం 74. హృది కిటికి నుండి 75. కార్నర్ కవితలు

### ❖V. స్వేచ్ఛా కవిత్వం - ఐదో సంపుటం రచనా కాలం 2017 నుండి 2019

**ఇది జీవితం :** 76. ప్రశ్నలతో ఇప్పటికీ 77. బ్రతుకులో కవితయై 78. గమ్యంపై గురితో 79. అస్మితలు, అస్తితలు 80. వాస్తవ చక్రంపై 81. ఎవరి దారి వారిది 82. అశాంతి పరిచయం 83. కవిత నా ఆత్మ 84. కాలం కప్పులో 85. నిప్పు రెక్కలపై 86. సమాప్తి కాదు 87. కాలానికి కృతజ్ఞతలు 88. సమయ పథం 89. ఇది అందరిదీ 90. సమాంతరం 91. ప్రాణం కన్న మిన్న 92.

వర్తమానం ఆనవాలు 93. నీడ నుండి వెలుగులోకి 94. అక్షర ముకురం 95. జీవితం స్వతంత్రం 96. కాలంతో నేను 97. కర్తవ్యంలో కవిత

**❖VI. స్వేచ్ఛా కవిత్వం – ఆరో సంపుటం రచనా కాలం 2019 నుండి 2020**

98. ఏది కవిత 99. వర్తమానం ముందుకే 100. మార్పుకు సిగ్నల్ 101 కవిత ప్రభుతతో 102 హృదయ దర్పణం 103. నేను నేనే 104. స్వేచ్ఛలో స్వతంత్రం 105. భవితకు సంకేతం 106. అక్షరంలో స్వేచ్ఛ – సమాజ యానం 107. స్వేచ్ఛలో బంధనం 108. కాక్‌టెయిల్

**❖VII. స్వేచ్ఛా కవిత్వం – ఏడో సంపుటం రచనా కాలం 2020 నుండి 2022**

109. రేపటికి రిజర్వులో 110. అక్షతం 111. లాక్‌డౌన్ 112. వర్తమానం మెట్లమీంచి 113 అజేయం 114 ఈ వారం కవిత 115. గుడ్ బై 116. అక్షర హృదయం 117. గాయ పడిన శాంతి 118. వార్తలో కవిత 119. నిప్పులపై మేఘం 120. తెలియని వాస్తవం

**❖VIII. స్వేచ్ఛా కవిత్వం – ఎనిమిదో సంపుటం రచనా కాలం 2022 నుండి 2023**

121. మార్నింగ్ వాక్ 122. విప్లవ ప్లవనం, స్వేచ్ఛలో మనోజ్ఞం 123. అదృష్టం 124. మేల్కొన్న కవిత 125. ఆగని పయనం 126. కవిత్వమొక థెరపి, తెలంగాణ స్వరం

**❖IX. స్వేచ్ఛా కవిత్వం – తొమ్మిదో సంపుటం రచనా కాలం 2023**

127. హృది నుండి హృదికి 128. రౌండ్ టేబుల్ 129. మానస తంత్రులపై 130. సరికొత్తగ 131. ఆశానవం 132. మౌనం మాట్లాడుతుంది 133.శిల నుండి రసాకృతి 134. అశాంతి చక్రంపై 135. మేనిఫెస్టో

**❖ X. స్వేచ్ఛా కవిత్వం – పదో సంపుటం రచనా కాలం 2024**

136. కవిత సర్వ స్వతంత్రం 137. ఇది మలి తెలంగాణ 138. నిజయానం – (బొన్సాయ్ అనంతం) 139. స్వేచ్ఛామేఘం, మెరపులు తలపులు 140 స్వేచ్ఛా పవనం

**❖ XI. స్వేచ్ఛా కవిత్వం – పదకొండో సంపుటం రచనా కాలం 2025**

141. జీవన దర్శనం 142. అద్దంలో అనల చిత్రం 143. ముక్తకాలు 144. ఆశాబన్ధం

**B) పరిశోధన – సమాలోచనం**

1. కవిత్రయం సృజనకళ (సిద్ధాంత గ్రంథం) 2. నవల స్వరూపం 3. పరిశోధనా స్వరూపం 4. అధికార భాష 5. అనువాద కళ 6. దాశరథి కవితా సమాలోచనం 7. ఆలోకనం 8. సమదర్శనం 9. సృజన రూపం–మానవీయ భావన 10. సృజన చేతన–భావ రూపాలు 11. Facets of to Free-verse 12. శ్రీశ్రీ మహా ప్రస్థానం–సమాలోచనం 13. రామాయణ కల్పవృక్షం–సృజన చేతన 14. స్వేచ్ఛా కవిత్వం ప్రజాస్వామ్య దర్శనం 15. స్వేచ్ఛా కవిత్వం – మానవీయ దర్శనం 16. స్వేచ్ఛా కవిత్వం–సహృదయ స్పందనం 17. గురజాడ ఆధునిక చేతన (2013) 18. కవితా సమాలోచనం–2017 19. కవితల సమాలోచనం 2019 20. సాహిత్య విమర్శ వ్యాసాలు

# సంక్షిప్త పరిచయం



మాదిరాజు రంగారావు గారి జననం జూన్ 8, 1935న పండితాపురం గ్రామం, ఖమ్మం, తెలంగాణ రాష్ట్రం. మాదిరాజు రంగారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేసి నిజాం కాలేజీ ఉస్మానియా యూనివర్సిటీ (O.U), హైదరాబాద్, తెలంగాణలో చేరారు. మాదిరాజు రంగారావు తెలుగు మరియు సంస్కృత సాహిత్యంలో M.A. సంస్కృతం 1960 (O.U), M.A. తెలుగు 1962 (O.U), Ph.D. తెలుగు 1966 (O.U) మరియు యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యు.జి.సి, UGC) యొక్క పరిశోధనా పండితులు.

డాక్టర్ మాదిరాజు రంగారావు ఆంధ్ర మహాభారతం మరియు ఆంధ్ర మహాభాగవతం యొక్క విమర్శనాత్మక సంచికా సంపాదక మండలిలో సభ్యులుగా ఉన్నారు. 1964లో హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో డాక్టర్ రావుకు మొదటి విద్యా సంబంధ నియామకం లభించింది. ఆ తరువాత తెలంగాణలోని వరంగల్‌లో ఉన్న కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా మరియు డీన్‌గా సుదీర్ఘ కాలం పనిచేశారు. ఆచార్య రావు యు.జి.సిచే మంజూరు చేయబడిన రెండు ప్రధాన పరిశోధన ప్రాజెక్ట్ గ్రాంట్‌లకు మరియు భారత ప్రభుత్వ మానవ వనరుల శాఖ, న్యూఢిల్లీచే స్పాన్సర్ చేయబడిన ఒక పరిశోధన ప్రాజెక్ట్ గ్రాంటుకు ప్రధాన పరిశోధకులుగా ఉన్నారు. ఆచార్య రావు 'రసధుని సాహితీ పరిషత్తు' అనే సాహిత్య సంస్థకు వ్యవస్థాపకులు మరియు అధ్యక్షులుగా ఉన్నారు. ప్రముఖ కవి, రచయిత మరియు సాహిత్య విమర్శకులైన ఆచార్య మాదిరాజు రంగారావు, సాంప్రదాయ సాహిత్యం, ఆధునిక కవిత్వం మరియు విమర్శతో సహా తెలుగు సాహిత్యం యొక్క వివిధ ప్రక్రియలకు విస్తృతంగా సేవలనందించారు. మాదిరాజు రంగారావు గారు తమ స్వేచ్ఛా కవిత్వం మరియు సాహిత్య విమర్శ రచనల ద్వారా సమకాలీన ఆధునిక తెలుగు సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. ప్రముఖ పత్రికలైన భారతి, స్వతంత్ర, స్రవంతి, జయంతి, ఆకాశిక, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి మరియు ఆంధ్రభూమి వంటివి, మాదిరాజు రంగారావు గారి సృజనాత్మక రచనలను క్రమం తప్పకుండా ప్రచురించాయి.

ఆచార్య మాదిరాజు రంగారావు కవిత్వానికి మూల స్తంభం మానవతా ఆదర్శాలు మరియు శాంతికి ప్రతీకగా నిలిచే ప్రజాస్వామ్య దృక్పథం. ఇదే వారి స్వేచ్ఛా కవిత్వానికి ఆయువు పట్టు. మాదిరాజు రంగారావు గారు స్వేచ్ఛా కవిత్వ ప్రక్రియలో సాగించిన ప్రస్థానం వారి విశిష్ట వ్యక్తిత్వం, సామాజిక స్పృహ, మానవతా భావాలు, ప్రజాస్వామ్య సామ్యవాద సామరస్య దృక్పథం మరియు శాంతి సందేశం ద్వారా సుసంపన్నమైంది. మాదిరాజు రంగారావు గారి 'పరిశోధన మరియు సాహిత్య విమర్శ' రచనలు సాంప్రదాయ సాహిత్యం, సాహిత్య ఇతివృత్తాలు, భావజాలాలు, మానవ అంశాలు మరియు సార్వత్రిక దృక్పథం యొక్క సృజనాత్మక మరియు కళాత్మక విశ్లేషణపై దృష్టి పెడతాయి. తన సుదీర్ఘమైన మరియు అత్యంత ఫలవంతమైన సాహిత్య జీవితంలో, ఆచార్య మాదిరాజు రంగారావు యొక్క సృజనాత్మక రచనలు జూన్ 21, 2025న వారు కాలధర్మం చెందిన నాటికి 'స్వేచ్ఛా కవిత్వం' పై 150కి పైగా, సాహిత్య విమర్శపై 20కి పైగా, మొత్తం సుమారు 170 పుస్తకాలుగా వెలువడ్డాయి.

## BRIEF SKETCH



Madiraju Ranga Rao was born on June 8, 1935, in Pandithaapuram village, Khammam, Telangana. Madiraju Ranga Rao completed High School Education from Govt. High School, Khammam and joined Nizam's College Osmania University (O.U), Hyderabad, Telangana. Madiraju Ranga Rao was a student of Telugu and Sanskrit literature, obtained M.A. Sanskrit 1960 (O.U), M.A. Telugu 1962 (O.U), Ph.D. Telugu 1966 (O.U) degrees and was a research scholar of the University Grants Commission (UGC).

Dr. Madiraju Ranga Rao was a member of the Editorial Board for the critical editions of Andhra MahaBharatham and Andhra MahaBhagavatham. Dr. Rao's first academic appointment in 1964 was with the Department of Telugu, O.U, Hyderabad, then a long tenure at Kakatiya University, Warangal, Telangana as Professor, Chair Board of Studies, and Dean for Faculty of Arts followed. Prof. Rao was the Principal Investigator on two major research project grants awarded by UGCand one research project grant sponsored by the Department of Human Resources, Govt of India, New Delhi. Prof. Rao was the Founder and President of 'Rasadhuni Sahithi Parishath' literary organization.

Prof. Madiraju Ranga Rao, an acclaimed poet, writer and a literary critic, contributed extensively to various literary genres of Telugu literature including classical literature, modern poetry, and criticism. Prof. Rao established his niche in contemporary modern Telugu literature through his literary works in 'Free Verse'(Swecchaa Kavithvamu) and Literary Criticism. Popular journals published his creative writings on a regular basis and this list includes Bharathi, Swathanthra, Sravanthi, Jayanthi, Akashik, AndhraPathrika, AndhraPrabha, AndhraJyothi, AndhraBhoomi and several others.

Central to Prof. Madiraju Ranga Rao's poetic purpose was humanistic ideals and a democratic ideology that symbolized peace. This was the very essence of his 'free verse' poetry. Prof. Madiraju Ranga Rao's journey in the genre of 'free verse' poetry is enriched by his unique personal spirit, social consciousness, humanitarian feelings, a democratic ideology, and a message of harmony. A substantial number of Prof. Rao's contemporary modern 'free verse'poetic works are based on his creative mindset pertinent to historical development, existing situations, social realism, element of reason and reform, humanistic sentiment with a sign of peace and harmony. Prof. Rao's 'literary criticism' works focus on creative and artistic analysis of classical literature, literary ideologies, human elements, and universal outlook. During his long and highly productive literary career, Prof. Madiraju Ranga Rao's creative writings culminated in more than150 books on 'free verse' poetry and over 20 books on 'literary criticism' – a total of about 170 books – published until his departure on June 21, 2025.

9 789356 358355